49630

# చొక్కనాథ చరిత్ర - సమగ్రపరిశీలన

డా॥ వడ్లూరి ఆంజనేయరాజు

మాతృవత్సల ప్రచురణలు
భాగ్యనగర్, ఆం॥ ప్ర॥

# చొక్కనాథ చరిత్ర - సమగ్ర పరిశీలన

1989లో ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి

పిహెచ్.డి. పట్టం పొందిన సిద్ధాంత గ్రంథం

**డా. వడ్లూరి ఆంజనేయరాజు**

**(వి. ఆంజనేయులు)**

**మాతృవత్సల ప్రచురణలు**

**భాగ్యనగర్, ఆం.ప్ర.**

# CHOKKANATHA CHARITRA – SAMAGRA PARISHEELANA

A Doctoral Thesis by Dr. V. ANJANEYULU M.A. Ph.D.
Dept. of Telugu, Osmania University, Hyd - 7.

PLACED ON THE SHELF

ప్రథమ ముద్రణ : 1992-93

ప్రతులు : వేయి

మూల్యం : 120/-

మాతృవత్సల ప్రచురణల సంఖ్య -4

ప్రతులకు ప్రిన్ ఫాన్ ప్రింటర్స్
2-2-25/P4 దుర్గాబాయిదేశ్‌ముఖ్ కాలనీ
బాగ్ అంబర్‌పేట్, హైద్రాబాదు - 500 013.
Phone: 614507

SRI VENKATESWARA
CENTRAL LIBRARY
RESEARCH CENTRE
Acc. No. 49630
Date.
TIRUPATI.

ముద్రణ : ప్రిన్ ఫాన్ ప్రింటర్స్
2-2-25/P4, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ
బాగ్ అంబర్‌పేట్, హైద్రాబాదు - 500 013.

తిరుమల తిరుపతి దేవస్థానము వారు ఈ గ్రంథ ప్రచురణకు
రూ. 10,000లు (పది వేల రూపాయలు) ఆర్థిక సహాయం అందించినారు.

## అంకితము

మా నాన్న

శ్రీ వడ్లూరి వేంకటరాజు గారికి

భక్తితో

ఓం శ్రీ సాయిరామ

**ఆచార్య బిరుదురాజు రామరాజు**
పూర్వ ఆంధ్రశాఖాధ్యక్షులు,
ఉస్మానియా విశ్వ విద్యాలయం,
హైదరాబాదు.

# ఆశీః

'చొక్కనాథ చరిత్ర-సమగ్ర పరిశీలన') సిద్ధాంత వ్యాసం మొదటి నాలుగధ్యాయాలు చదివినాను. డాక్టర్ ఆంజనేయులు మనసుంచి పరిశ్రమించినట్లు గుర్తించినాను. నాకు సంతృప్తి సంతోషములు కలిగినవి. ఈ యువక పరిశోధకుడు ఇతోధిక వాఙ్మయ సేవ చేస్తాడని ఆశ. పరమేశ్వరుడు అయనకు దీర్ఘాయురారోగ్యాలు మంచి అవకాశాలు ప్రసాదించుగాక.

ఆంగిరస సంక్రాంతి
14-1-1993

**బి. రామరాజు**

ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్
తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వ విద్యాలయం

# శివానుభూతి

"శివస్య ఇదం శైవం" శివునికి సంబంధించిన మతం శైవము. ఎవడు సృష్టి స్థితి లయకారకుడో, ఎవడు మంగళకరుడో, అతడే శివుడు. ఇది అనాదిగా వ్యాపించిన మతము. తక్కిన మతములన్నియు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఇందుండి జన్మించినవే. శివ సంకల్పమస్తు అనుచు వేదము చెప్పుచున్నది.

భారతదేశములో దశవిధ శైవములు కలవు. ఆంధ్ర ప్రాంతములోని చాళుక్యాదులు అసంఖ్యాక రాజవంశములలో శివుడే ఇలవేల్పు. వారు స్వయముగా శివుని స్తుతించిరి. ఈశ్వరార్పితముగా శైవ గ్రంథములు రచింపజేసిరి. పచ్చకప్పురపు తిరువేంగళకవి చొక్కనాథ చరిత్ర అనే గ్రంథము రచించెను. ఈతడు క్రీ॥శ॥ 1540 ప్రాంతము వాడు. ఈతడు "నిటలాక్ష పదభక్తి నియతి పెంపొందు" వంశంలో జన్మించినానని చెప్పుకొన్నాడు. ఇతడు రచించిన ద్విపద కావ్యం పేరు చొక్కనాథ చరిత్రము. చొక్కనాథుడు అనగా సుందరేశ్వరుడు. మధుర మీనాక్షీ సుందరేశ్వరులను తమిళులు అంగయకణ్ణెమ్మ, చొక్కనాథ శివుడు అని పిలిచెదరు. శివునికి సంబంధించిన అరువది నాలుగు లీలలు కలవు. వీనినే చతుష్షష్టి లీలలు అందురు. ఇవి మిక్కిలి ప్రసిద్ధిములు. ఇందుకొన్ని పౌరాణిక కథలు, కొన్ని చారిత్రక సంఘటనలు, మరికొన్ని కల్పితములు చోటు చేసుకున్నవి. ఇందు జైన మత విమర్శ ప్రధానముగా కలదు. వైష్ణవులలో పన్నిద్దరు ఆళ్వారులు ఉన్నట్లే శైవములో అరువది ముగ్గురు నాయనార్లు కలరు. వీరందరును దాదాపుగా ద్రవిడ దేశమునకు సంబంధించినవారే. ఈ చొక్కనాథ చరిత్రలో పతంజలి ఋషి, జ్ఞాన సంబంధార్, కాడ్వెట్టి చోళ ప్రభువు, పాండ్య రాజన్యుడు మొదలైన చారిత్రక వ్యక్తుల ప్రశంస కూడా కలదు. ఇది తొమ్మిది ఆశ్వాసముల కావ్యము. స్కాంద పురాణములోని మధురాఖండము లోని హాలాస్య క్షేత్ర మాహాత్మ్యమునకు ఇది తెలుగుసేత.

శ్రీ వడ్లూరి ఆంజనేయరాజు ఈ గ్రంథముపై అపారమైన పరిశోధన చేసినాడు. ఈతని పరిశోధనకు మార్గదర్శకత్వము వహించు అదృష్టము నాకు లభించినది. ఆతని అపార పాండిత్యము అసామాన్య పరిశోధనాశ్రమకు ఈ సిద్ధాంత వ్యాసము అద్దము పట్టుచున్నది. తెలుగులో మార్గ, దేశి కవితారీతులు రెండును రెండు

సమానాంతర రేఖలుగా సాగినవి. నన్నయాది కవి పండితులు అక్షరగణములను ఆశ్రయింపగా, దేశి కవులు ద్విపద మార్గమును ఎన్నుకొనిరి.

ఇహము ఒక పదము. పరము మరొక పదము. ద్విపదములకును ఆధారభూతమైనది ద్విపది అని వారి సంకల్పము కాబోలు. పాల్కురికి సోమనాధుడు, పచ్చకప్పురపు తిరువేంగళ నాధుడు వంటి శైవ కవులే కాదు అన్నమాచార్యుని వంటి వైష్ణవులు కూడా ప్రజాదరణకై దేశి పదములనే ఆశ్రయించిరి. కవిసార్వభౌముడు కూడా పల్నాటి వీర చరిత్రకు వచ్చుసరికి దేశీయమైన ఇతివృత్తమునకు, దేశీయమైన ఛందస్సునే స్వీకరించుట తెలిసిన విషయమే. తిరువేంగళనాధుని గ్రంధము కేవలము ఆధ్యాత్మిక దృష్టి కలది మాత్రమే కాదు ఏతత్కాలీన సాంఘిక, సాంస్కృతిక, సామాజిక పరిస్థితులను అధ్యయనము చేయుటకు ఎంతగానో తోడ్పడును.

ఆంజనేయరాజు హనుమంతుని వలెనే వినమ్రభక్తి స్వభావము కలవాడు కార్యసాధకుడైన హనుమంతుడు విరాడ్రూపమును ప్రదర్శించినట్లే, ఆంజనేయరాజు విశ్వతోముఖమైన పరిశోధనావైభవము ఇందు ప్రత్యక్షరములోను ప్రత్యక్షముగా గోచరించును. ఇంతకు మించి శిష్యుని ప్రశంసించుట ఔచిత్యము కాదని విరమించుచున్నాను. ఈ గ్రంధము సర్వజన సమాదరణ పాత్రము కాగలదని నా విశ్వాసము. శుభంభూయాత్.

**ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్**
ఎం.ఎ. పిహెచ్ డి
2-2-647/132 బి,
సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ
హైదరాబాదు - 500 013

హైదరాబాదు
20-1-93

ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యులు
అధ్యక్షులు, తెలుగుశాఖ,
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్లు.

# ఆశంస

శ్రీ వడ్లూరి ఆంజనేయరాజు సమర్పించిన సిద్ధాంత వ్యాసం ఇది. పచ్చకప్పురపు తిరువేంగళనాథుని చొక్కనాథ చరిత్ర దీనికి వస్తువు. తెలుగు సాహిత్య చరిత్రలో ఈ కవిది ఎంత అరుదైన అందమైన ఇంటి పేరు?

ఈ సిద్ధాంత వ్యాసం వాస్తువు-తెలుగు సిద్ధాంత వ్యాసాల నిర్మాణ వైఖరిని అనుసరించిందే. ఇది సంస్కృతంలో హాలాస్య మాహాత్మ్యానికి తెలుగుసేత. రచయిత మూలంతో పోల్చి కథా నిర్వహణలో కవి చేసిన మార్పులనుఔచిత్యమును గూర్చి విపులంగా చర్చించారు.

దేశి రచనా సంప్రదాయంలో తెలుగు సాహిత్యం ఒక ప్రత్యేకతను నిలబెట్టుకొన్నది. ద్విపద కావ్యాలు దీనిలోని ప్రధాన మార్గం. పాల్కురికి సోమన్న వేసిన త్రోవ ఇది. సంస్కృత సమాస భూయిష్ఠ రచనను పరిహరించి జాను తెలుగు అభివ్యక్తికి ప్రాధాన్యమిచ్చిన రచనా సంప్రదాయంలోనిది ఈ రచన. శైవ వైష్ణవ కవులు దీన్ని చక్కగా వాడుకొన్నారు.

మన దేశంలో సంస్కృతికి సంబంధించిన మూల్యాలను అందరికీ అందించే ఒక పద్ధతి ఉండేది. దానిలో సమాజంలోని భిన్న భిన్న స్థాయులలోని పాఠకుల ఆస్వాదశక్తిని బట్టి, విద్యా స్థాయిని బట్టి వారి వారికి అనువైన రూపాలలో ఆ విలువలను అందించేందుకు అనేక ప్రక్రియలను అభివ్యక్తి మార్గాలను నాటి సాహిత్యకారులు, సంస్కృతీ నిర్దేశకులు స్వీకరించారు. అందువల్ల ఒక్కోసారి ఇన్ని ప్రక్రియలు పరస్పర విరుద్ధాలుగా ఉన్నట్లు కనిపించినా, అవన్నీ ఏకాకారంగా ఉన్న ఒక పద్మంలోని భిన్న భిన్న దళాలే. ఈ దృష్ట్యా మన సాహిత్యాన్ని కళా సామగ్రినీ అర్థం చేసుకోవలసిన అవసరం ఉన్నది.

పాల్కురికి సోమన్న ఆవేశంతో ప్రారంభించినా, తరువాత నెమ్మదిగా తేరుకొని ద్విపద కావ్య సంప్రదాయం తన మూల్య వ్యూహాన్ని సమాజంలోకి సంపూర్ణంగా విస్తరించుకొన్నది. ఈ లక్షణానికి ఉదాహరణం రంగనాథ రామాయణమే.

చొక్కనాథ చరిత్ర వర్ణించిన అరువది నాల్గు శివలీలలను సరిగ్గా పరిశీలిస్తే మన సంస్కృతిలోని ఆంతర్యం వెల్లడి ఔతుంది- ఈశ్వరార్చనాధికారం, మోక్షాధికారం అందరిదీ అని - ఈశ్వరుడు భక్తికే వశుడు కాని మరి దేనికీ కాదని - కులాల అంతరాలు మనం కల్పించుకున్నవే కాని వాటికి ఈశ్వరుని ముందు అసలు విలువ

ఏమీ లేదవి.

చొక్కనాథుడు సుందరేశ్వరుడు. అక్కడి ప్రధాన దైవతం మీనాక్షీదేవి. మీనాక్షీదేవి మహా విష్ణువునకు బిడ్డ వంటిది. మీనాక్షీ సుందరేశ్వరుల కళ్యాణంలో కన్యాదానం చేస్తున్న వారిద్దరి తోడి నారాయణమూర్తి ప్రపంచ శిల్పాల్లోనే అత్యంత సుందరమైనది. ఈ మూర్తిలో శాక్త, శైవ, వైష్ణవ సంప్రదాయాల అద్భుతమైన సమన్వయం సాధించబడింది. అందువల్లనే మధుర దేవాలయం భారతీయ సంస్కృతికి ఆశ్చర్యావహమైన సుందర సంకేతం.

చొక్కనాధ చరిత్రలో అనేక సందర్భాలలో శృతి పురాణాలలోని వాక్యాలు యధాతధంగా ఉద్ధరించడమే కాకుండా స్తోత్ర సన్నివేశాలలో ఉపనిషత్తులలోని తాత్త్విక స్ఫురణ స్పష్టంగా గోచరిస్తున్నది. వర్ణన సందర్భంలో ప్రకృతి కథా సన్నివేశాల కనుగుణంగా స్పందించటం మనం గుర్తించవచ్చు. నలభై ఏడవ లీలలోని కొలను వర్ణన బాణాది సంస్కృత కవుల రచనారీతిని స్మరింపచేస్తున్నది. కొన్ని చోట్ల "చొక్కనాథా! యన్న శుభములుసెందు, చొక్కనాథా! యన్న క్షుద్రమ్ములుడుగు' ఇత్యాది ద్విపదలు మౌఖిక సంప్రదాయంలోని సజీవ సాహిత్య సంగీత సంబంధాన్ని ఆవేశాన్ని వ్యక్తం చేస్తున్నది. తిరువేంగళనాధుని అనేక శాస్త్ర పాండిత్యము కూడా దేశీ సాహిత్య సంప్రదాయంలో ఒదిగిపోయి సామాన్య ప్రజలకు విజ్ఞానపు చెఱువులో నుండి తీసిన కాలువల సమూహం వలె సన్నిహితము చేస్తున్నది

పచ్చ కప్పురపు తిరువేంగళనాధుని రచన సరళంగానూ, భావ గాంభీర్యంతోను ఉద్దేశించిన లక్ష్యాన్ని చేరుకున్నది. ఈ రచనలోని విశేషాలను ఆ మూలాగ్రం పరిశీలించి పాఠభేదాల దగ్గర్నుంచి భావ సంయోజనం దాకా కవి సాధించిన ఫలితాలను సరిగ్గా అంచనా వేసి మనకు అందజేశారు మిత్రులు శ్రీ వడ్లూరి ఆంజనేయరాజు.

శ్రీ ఆంజనేయరాజు స్వయంగా సాధకులు.సాహిత్య సాధకులు. సాహిత్య రంగంలో ఈ గ్రంథం ఆయన తన మార్గాన్ని తీర్చుకోవడానికి వేసిన ముఖ్య ప్రయత్నం మునుముందు సాహిత్యాన్ని సర్వతోముఖమైన జీవన చక్రంలోని కేంద్ర బిందువుగా ఉపాసించి ఆ చక్ర మధ్యంలో వాగ్దేవిని సాక్షాత్కరించుకోగలరని నేను ఆశిస్తున్నాను. శ్రీ మీనాక్షీ సుందరేశ్వరుల అనుగ్రహం ఆయనకు జీవితమంతా శీతలచ్ఛత్ర ఛాయయై కాపాడగలదని భావిస్తున్నాను.

వరంగల్లు **కోవెల సుప్రసన్నాచార్య**

30-3-93

# కృతజ్ఞతాంజలి

1982లో పిహెచ్.డి. పట్టము కొరకు నాకీ పరిశోధనాంశమును సూచించి, ఆశీస్సులందించిన గురువర్యులు ఆచార్య డా. బిరుదురాజు రామరాజుగారికి

ఈ సిద్ధాంత గ్రంథమును ఆమూలాగ్రము పరిశీలించి, తగు సలహాల నొసంగి, 'శివానుభూతి' నందించిన పర్యవేక్షకులు -గురువులు-ఆచార్య డా. ముదిగొండ శివప్రసాద్‌రావు గారికి-

ఈ గ్రంథమును సాంతం చదివి, ప్రేమతో 'ఆశంస' వ్రాసియిచ్చిన గురుతుల్యులు-ఆచార్య డా. కోవెల సుప్రసన్నాచార్య గారికి -

'చొక్కనాథ చరిత్ర'ను దానికి మూలమైన 'హాలాస్యమాహాత్మ్యము'ను తమ స్వంత ప్రతులను యథేచ్ఛగా వాడుకొనుమని ఇచ్చిన ఆచార్యులు డా. డి. చిన్ని కృష్ణయ్య ప్రెసిడెన్సీ కళాశాల మదరాసుగారికి-

అప్పుడప్పుడు నాకవసరమైన గ్రంథముల నందించి సహకరించిన ఆత్మీయులు డా. కసిరెడ్డి వెంకటరెడ్డి గారికి -

1982లో పిహెచ్.డి. పట్టము కొరకు నేను పెట్టుకొన్న వినతి పత్రమును స్వీకరించి, ప్రవేశము కల్పించి, 1988లో సమర్పించిన ఈ సిద్ధాంత గ్రంథమును 1989లో పిహెచ్.డి. పట్టమునకర్హమైనదిగా ప్రకటించి, ముద్రించుకొనుటకు అనుమతినిచ్చిన ఉస్మానియా విశ్వవిద్యాలయాధికారులకు, అప్పటి ఇంటర్వ్యూ కమిటీ సభ్యులకు, ఆనాటి ఆంధ్రశాఖాధ్యక్షులకు, ఆచార్యులకు, అధ్యాపకులకు, ఈ గ్రంథమును పిహెచ్.డి. పట్టమునకర్హమైన గ్రంథముగా నిర్ణయించిన అజ్ఞాత న్యాయ నిర్ణేతలకు -

చొక్కనాథ చరిత్ర ముద్రిత గ్రంథమునకు ఆధారమైన సి.పి. బ్రౌన్‌గారు వ్రాయించిన, కాగితపు ప్రతి (డి. నెం. 1051)తో సరిచూచుకొనుటకు అవకాశము కల్పించిన మదరాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారము వారికి, చొక్కనాథ చరిత్ర తాళపత్ర ప్రతిని (డి.నెం. 1053) వెదకించి యిచ్చిన తిరుపతి తాళపత్ర గ్రంథాలయ నిర్వాహకులకు, సంబంధిత శాసన పాఠములను తమ కార్యాలయమున చదువుకొనుటకు అనుమతించిన తిరుపతి పురావస్తు పరిశోధనశాఖ

కార్యాలయాధికారులకు మరియు మదరాసు పురావస్తు పరిశోధన శాఖ కార్యాలయ గ్రంధాలయాధికారులకు -

ఈ గ్రంధ ముద్రణార్థం పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించిన తిరుమల తిరుపతి దేవస్థానం వారికి -

ముఖ పత్రాన్ని వ్రాసి యిచ్చిన మదన్ రేవంత్ ఆర్ట్స్ వారికి-

ఈ గ్రంధాన్ని అందంగా ముద్రించి యిచ్చిన ఓం సాయి గ్రాఫిక్స్ మరియు ప్రిన్‌ఫాన్ ప్రింటర్స్ వారికి-

పేరు పేరున ఇందు పేర్కొనకున్నను ఇంకను ఈ కార్యరంగమున నాకు ఆర్థికంగాను, హార్దికంగాను సహకరించిన సహృదయులకు, స్నేహితులకు, ఆత్మీయులకు అందఱకు నా కృతజ్ఞతాంజలులు.

మీ

**పద్మూరి ఆంజనేయరాజు**

**ఈ గ్రంథ ముద్రణకు ఆర్థికంగా సహకరించిన సహృదయులు, మిత్రులు**

| | | |
|---|---|---|
| 1. | మాన్యులు శ్రీ మాడపు బొంతప్ప గారు<br>వ్యాపారస్తులు<br>వీరశైవ మహాసభ గౌరవాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్<br>వీరశైవ సమాజం అధ్యక్షులు, సికిందరాబాదు | రు 2,500/- |
| 2. | శ్రీ డా. బేతిబాపురెడ్డి గారు | రు. 2,000/- |
| 3 | శ్రీ బీరవేలు శశిధర్ రెడ్డిగారు | రు. 2,000/- |
| 4. | శ్రీ గజ్జెల యోగానంద్‌గారు | రు 2,000/- |
| 5. | శ్రీ బొమ్మినేని ఆగారెడ్డిగారు | రు. 1,000/- |
| 6. | శ్రీ బొమ్మినేని నార్ాయణ రెడ్డిగారు | రు. 1,000/- |
| 7. | శ్రీ యమ్. రాజమహేందర్ రెడ్డిగారు | రు. 1,000/- |

# విషయసూచిక


| | పుట |
|---|---|
| ప్రథమాధ్యాయము-పాఠ పరిశీలన | 1-11 |
| ద్వితీయాధ్యాయము-పాఠాంతరములు, సాధుపాఠములు | 12-25 |
| తృతీయాధ్యాయము-కవికాలాదులు-రచనలు | 26-37 |
| చతుర్థాధ్యాయము-అనువాద విధానము | 38-129 |
| పంచమాధ్యాయము-కావ్యశిల్పము | 130-209 |
| షష్ఠాధ్యాయము-లాక్షణికత | 210-279 |
| సప్తమాధ్యాయము-శైవ సంప్రదాయము | 280-300 |
| అష్టమాధ్యాయము-సమకాలీన సాంఘిక పరిస్థితులు | 301-313 |
| అనుబంధములు | |
| ఉపయుక్త గ్రంథములు, పత్రికలు, నిఘంటువులు | |

# చొక్కనాథ చరిత్ర - సమగ్రపరిశీలన

## ప్రథమాధ్యాయము - పాఠ పరిశీలన

చొక్కనాథ చరిత్ర పై సమగ్ర పరిశీలనకు పూనుకొని ఈ గ్రంథమును(ముద్రితప్రతి) మొట్టమొదటిసారిగా చదివినపుడు కొన్ని సందేహములు కలిగినవి. కొన్ని చోట్ల కొన్ని పాదములు లుప్తములుగను, కొన్ని పాదములు ప్రక్షిప్తములుగను, ద్విపదలకు సరిపోక కొన్ని పాదములు, కథాకథన శిల్పమున కాటంకము కల్గించునట్లు కొన్ని చరణములు అగుపించినవి. ఈ సందేహములు నివారించుకొనుటకు ముద్రిత గ్రంథమునకు ఆధారమైన గ్రంథముతో సరిచూచుకొనవలెనని తలచి ఆ పనికి పూనుకొంటిని.

చొక్కనాథ చరిత్ర పీఠికలో "చెన్నపురి ప్రభుత్వ ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమున ఈ "చొక్కనాథ చరిత్ర" కు మూడు ప్రతులు గలవు అవి డి.నెం.1051, 1052, 1053 రు లలో వర్ణితములు మొదటిది కాగితపు ప్రతి కడమవి తాళపత్ర ప్రతులు తాళపత్రప్రతులు మిగుల జీర్ణావస్థలో నున్నవి ఇవి మాతృకలుగమొదటి కాగితపు ప్రతి బ్రౌను దొరగారిచే వ్రాయించబడినది అది యాధారముగ ముద్రణప్రతి సమకూర్పబడినది" అని వ్రాసియుండుటను బట్టి పైన చూపబడిన కాగితపు ప్రతితోను, తాళపత్ర గ్రంథములతోను సరిచూచుకొని నా సందేహములను నివృత్తి చేసికొనవలెనని మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమునకు బోయి అచ్చటి అధికారులను సంప్రదించగా వారు కాగితపు ప్రతి మాత్రమే మా వద్దనున్నది. తాళపత్రప్రతులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అభ్యర్ధనపై తిరుపతిలోనున్న తాళపత్ర గ్రంథాలయమునకు పంపించినామని చెప్పిరి. అంత నేనచ్చట గల కాగితపు ప్రతితో ముద్రిత గ్రంథమును సరిచూచుకొంటిని అందు అనగా ముద్రిత గ్రంథమునందు కాగితపు ప్రతిలోనున్న చరణములు కొన్ని లుప్తములైనట్లు, కొన్ని చరణములు భేదముతో నున్నట్లు తెలియవచ్చినది. వానినన్నింటిని నోటు చేసికొని అనంతరము తిరుపతిలో నున్న తాళపత్ర గ్రంథాలయమునకుబోయి అచ్చటి గ్రంథాలయాధికారికి నా ప్రయత్నమును తెలియపరచి D1052, D1053 నెం.లు గల తాళపత్రప్రతులను ఇప్పించమని అడిగితిని. వారు నా ప్రార్థనను మన్నించి ఆ గ్రంథములకై వెదకించగా ఆరెంటిలో 1053 ప్రతి మాత్రము దొరికినది. మరొకటి లభించలేదు. వారమురోజులు వెదకించి అచ్చటి క్యూరేటర్‌గారు ఇంతకుముందొకమారు ఈ గ్రంథాలయమున అగ్ని ప్రమాదము సంభవించి కొన్ని గ్రంథములు కాలిపోయినవి. బహుశః ఈ ప్రతి కూడ అందు దగ్ధమైపోయియుండవచ్చునని తమ సందేహమును

విచారమును వెలిబుచ్చి ఇక లాభములేదని చెప్పినారు. అంతటితో నా ప్రయత్నము సంపూర్ణముగ ఫలించనందులకు విచారించి దొరికిన ఆ 1053 ప్రతితో ముద్రితమును సరిచూచుకొనగా అందు తాళపత్ర ప్రతిలో లేని చరణములు కొన్ని కనిపించినవి. వానినన్నిటిని నోటు చేసికొని వీనిని, ఇంతకు ముందు కాగితపు ప్రతితో సరిచూచుకొని వ్రాసికొనిన నోట్సును, ముద్రితమును చెంత నుంచుకొని సరిపోల్చుకొనగా ఈ మూడింటికి కొన్ని పోలికలు భేదములు కనిపించినవి. వానినన్నింటిని క్రోడీకరించి ఈ క్రింది విధముగా విభజించి వ్రాసికొంటిని

1. కాగితపు ప్రతిలోనుండి ముద్రిత గ్రంథములో లేని చరణములు.
2. తాళపత్ర గ్రంథములో నుండి ముద్రిత గ్రంథమునలేని చరణములు
3. ముద్రిత గ్రంథములోనుండి 1053 తాళపత్రప్రతిలో లేని చరణములు.
4. తాళపత్రప్రతికి ముద్రిత గ్రంథమునకు భేదముగల చరణములు
5. కాగితపుప్రతికి ముద్రిత గ్రంథమునకు భేదమున్న చరణములు.
6. కాగితపుప్రతికి తాళపత్రప్రతికి ముద్రిత గ్రంథమునకు భేదము గల చరణములు

## I. కాగితపు ప్రతిలో నుండి ముద్రిత గ్రంథములో లేని చరణములు

(1) ముద్రిత గ్రంథములోని కథానుక్రమణికలో (పుట 6,7 లలో) మునులు కాశీ విశ్వనాధుని స్తుతించు సందర్భమున 'శివశివ విశ్వేశ! శ్రీ గిరిజేశ! అను పాదమునుండి మొదలుకొని' శివశివ గణనాధ శ్రీ విశ్వనాథ' అను పాదము వరకు ముద్రిత గ్రంథమున పదుమూడు చరణములున్నవి. కాని కాగితపు ప్రతి D1051లో మాత్రము 'శివశివ విశ్వేశ!శ్రీ గిరిజేశ' అను చరణము తదుపరి 'శివశివ హరి గర్వశిక్షకశర్వ' - అనునొక పాదము కలదు. దీనితో కలిపి పదునాలుగు పాదములు - ఏడు ద్విపదలకు సరిపోవుచున్నవి.

'శివ శివ మద గర్వ శిక్షకశర్వ' అను తప్పులతో కూడిన మరియొక పాఠము కూడ కాగితపు ప్రతిలో చూపబడినది. కాని ఇది యుక్తమైనది కాదు.

(2) ముద్రిత గ్రంథములోని కథానుక్రమణికలో (పుట7) 'ఓ దివ్యసంకాశ! ఓ వ్యోమకేశ' అను 'ద' ప్రాసముతో గూడిన చరణమునకు ముందు కాగితపు ప్రతిలో 'ఓ దేవ సర్వజ్ఞ ఓ త్రిలోకజ్ఞ' అను చరణము కలదు.

(3) ముద్రిత గ్రంథమున చతుష్షష్టిలీలల పట్టికలో (పుట 13) 'ఇక్షుదండము చేతికిచ్చినలీల' అను చరణము తదుపరి కాగితపు ప్రతిలోనున్న ఈ క్రింది రెండు చరణములు లేవు. కాగితపు ప్రతిలోని చరణములు ఇవి:

'భద్ర వారణమును బొద్దులంపినను
యద్రులు గాజేసి యమరిన లీల'-

(4) ముద్రిత గ్రంథములోని మొదటి లీలలో (పుట 24) 'మును విచ్చినవి గాక ముకుళమ్ముగాకో' అను చరణము తరువాత 'న' ప్రాసముతో మరొకపాదము లేదు.

కాగితపు ప్రతిలో 'ఏనుతింపనప్పుడు ఏకనితమ్మైన' అను పాదము కలదు.

(5) ముద్రిత గ్రంధములోని రెండవలీలలో (పుట నెం. 30లో) 'సురమణి కంకణస్ఫురణ శోభిల్ల' అను చరణము తరువాత 'ర' ప్రాసముతో మరొక చరణములేదు. కాని కాగితపు ప్రతిలో దీని తదుపరి 'సురభూజసురనాగ సురధేనువులును' అను పాదమున్నది.

(6) ముద్రిత గ్రంధములోని ద్వితీయాశ్వాసములోని నాలుగవ లీలలో (పుట 40) 'మొసగంగ భుజియించి యెంగిలి వార్చి' అను చరణము తదుపరి 'స' ప్రాసములో మరొక పాదము లేదు. కాగితపు ప్రతిలో 'వెసగంధకర్పూర వీడ్యంబులిచ్చి' అను చరణము కలదు.

(7) ముద్రిత గ్రంధములోని ద్వితీయాశ్వాసములోని నాలుగవ లీలలో (పుట44) 'కాపుందు రెప్పుడు కాలుని దిశను' అను చరణమునకు ముందు కాగితపు ప్రతిలోనున్న 'నా పురి సంరక్షులై నాల్గు దిశల' అను చరణము లేదు.

(8) ముద్రిత గ్రంధము నందలి ద్వితీయాశ్వాసములోని ఐదవ లీలలో (పుట 47) "నగరికే తెంచి యా నరనాయకుండు
మగుపతో గూడి నెమ్మది నుండెనపుడు" అను ద్విపద తదుపరి ఈ క్రింది అయిదు పంక్తులు కాగితపు ప్రతిలో"A" ప్రతిలో యీ అయిదు చరణములు లేవు" అను సూచనతో వ్రాసియున్నవి. ఆ చరణములివి

"యిదియు పంచమ లీల యిటమీది చరిత
అంత నామధుర మహాపట్టణమున
సంతోషమున పాండ్యజన పాలకుండు
సౌందర్యనాధుని సత్కృప గల్గి
నెంతయు ధర యెల్ల నేలుచునుండ" అనునవి. వీని తదుపరి "కడువేడ్కతో గొంత కాలమ్మునకును" అను చరణము ముద్రిత గ్రంధములో వలెనే సాగినది.

కధమధ్యన లీల పూర్తిగాక మునుపే పంచమలీల యని 'A'ప్రతిలో ముగించుటచేత ఇందలి అనౌచిత్యమును గమనించి గ్రంధ పరిష్కర్త వీనిని వదలి యుండవచ్చును.

ముద్రిత ప్రతిలోని ఐదవ లీల కాగితపు ప్రతిలో అయిదు, ఆఱు లీలలుగా విభజింపబడియున్నవి.

(9) ముద్రిత గ్రంధము నందలి ద్వితీయాశ్వాసములోని ఆఱవ లీలలో(పుట57),

'వేదపురీశ్వరు వెలయంగ మ్రొక్కి
యాదట త్యాగప్ప నాత్మభావించి'

అను ద్విపదకు ముందు కాగితపు ప్రతిలో

'నా వృద్ధగిరి వాసు నర్చించి మించి
నావల పున్నాంబలాధ్యక్షుగొల్చి' అను ద్విపద కలదు. ఇది ముద్రితమున లేదు

(10) ముద్రిత గ్రంథము నందలి ద్వితీయాశ్వాసములోని ఆఱవ లీలలో (పుట 57) "మధ్యార్జుననినాది మధ్యాంతరహితు" అను చరణము తదుపరి 'ధ్య' ప్రాసముతో మరొక చరణము లేదు. కాగితపు ప్రతిలో "సధ్యాత్ముఁ బరమాత్ము నాత్మభావించి" అను చరణము కలదు.

(11) ముద్రిత గ్రంథము నందలి ద్వితీయాశ్వాసములోని ఆఱవలీలలో (పుట 63) 'పాలించె సౌందర్య పాండీడనంగ" అను చరణము తదుపరి 'ల' ప్రాసముతో మరొక పాదములేదు. కాగితపు ప్రతిలో "భూలోకమెల్ల పెంపునసొంపు మిగుల" అను చరణమున్నది.

(12) ముద్రిత గ్రంథమునందు ద్వితీయాశ్వాసములోని ఏడవలీలలో (పుట 64) "కడువేడ్క నంగయ కణ్ణెమ్మ చూడ" అను పాదము తరువాత 'డ' ప్రాసముతో మరొక పాదములేదు కాగితపు ప్రతిలో "తడయకఁ దానాడె తాండవంబపుడు" అను పాదమున్నది.

(13) ముద్రిత గ్రంథము నందలి తృతీయాశ్వాసములోని తొమ్మిదవ లీలలో (పుట 70) "యీ విధమ్మున నుండు టెఱుగమేమనుచు" అను చరణమునకు ముందుగాని తరువాత గాని "వ" ప్రాసము గల పాదము మరొకటి లేదు. కాగితపు ప్రతిలో దీనికి ముందు "యీ విధమ్మున నుండుటేమి నీ కనుచు" అను పాదమున్నది

(14) ముద్రిత గ్రంథము నందలి తృతీయాశ్వాసములోని పదునొకండవ లీలలో (పుట 77) "కడిమిమై పోల సంగడము సాధించి" అను చరణము తరువాత కాగితపు ప్రతిలోనున్న తడయక తడుపుగా దండాలు దేచి అను చరణము లేదు

(15) ముద్రిత గ్రంథము నందలి తృతీయాశ్వాసములోని పదునాలుగవ లీలలో(పుట 90) "అప్పుడు దేవేంద్రుడతి రౌద్రమెసగ" అను చరణము తరువాత "తప్పక నా పాండ్య ధరణీశుఁ జూచి" అను కాగితపు ప్రతిలోనున్న పాదము లేదు.

(16) ముద్రిత గ్రంథమునందలి తృతీయాశ్వాసములోని పదునైదవ లీలలో (పుట 100) "వక్రంబులన్ని నిర్వక్రంబుగాగ" అను పాదము తరువాత కాగితపు ప్రతిలో గల "నీ క్రియ రాజ్యమ్మునెల్ల శోభిల్ల" అను పాదము లేదు.

(17) ముద్రిత గ్రంథమునందు చతుర్థాశ్వాసములోని ఇరువది రెండవ లీలలో (పుట 123) అత్తన్వి దేడ్కొని యతిమోదమునను" అను చరణమునకు ముందు "అత్తమామల చేత నంపించుకతడు" అను చరణము కాగితపు ప్రతిలో కలదు. ముద్రితమునలేదు.

(18) ముద్రిత గ్రంథమునందు చతుర్థాశ్వాసములోని ఇరువది మూడవ లీల (పుట 126) లో 'ఎక్కి యాడుచు వచ్చి యిందు శేఖరుడు' అను చరణము తరువాత కాగితపు ప్రతిలోనున్న 'అక్కడఁ బ్రత్యక్షమై నిల్చె శివుడు' అను చరణము లేదు.

(19) ముద్రిత గ్రంథములోని పంచమాశ్వాసములోని ఇరువది యైదవ లీల (పుట 137) లో 'బాలుని నొకని దర్పకమూర్తి గాంచె' అను చరణము నకు ముందు కాగితపు ప్రతిలో నున్న "బాలంగ గర్భలక్షణములు దాల్చె" అను పాదము లేదు.

(20) ముద్రిత గ్రంథము నందలి పంచమాశ్వాసములోని ఇరువది తొమ్మిదవలీల (పుట 152)లో "అదెవచ్చుచున్నారె! యటుచూడుడనిన" అను చరణమునకు ముందుగాని వెనుకగాని 'ద' ప్రాసముతో మరొక పాదము లేదు. కాని కాగితపు ప్రతిలో ఈ చరణము ఈషద్భేదముతో నుండి దీని క్రింద మఱియొక చరణము అదే ప్రాసముతోనున్నది. ఆ చరణములివి;

" అదెవచ్చుచున్నారు యటు చూడుడనుచు
వదలక తన మంత్రి వరులతో ననిన"

(21) ముద్రిత గ్రంథమున షష్ఠాశ్వాసమున ముప్పది యారవ లీలలో (పుట 187) "హాయని పెడబొబ్బలార్పులుసెల గ" అను చరణమునకు ముందు కాగితపు ప్రతి యందలి "పోయిన నాచోళ భూపాలుడంత" అను చరణము లేదు.

(22) ముద్రిత గ్రంథమునందు షష్ఠాశ్వాసములోని ముప్పది యేడవ లీల (పుట 189)లో "తన కులాంగనయును దాను భుజించి" అను చరణము తదుపరి కాగితపు ప్రతిలో గల "ఘనతర సౌభాగ్య గరిమ చెన్నొంది" యను చరణము లేదు.

(23) ముద్రిత గ్రంథమునందు సప్తమాశ్వాసములోని నలువది మూడవ లీలలో (పుట 223) "నాలీల బాణుని నాడ నాయిర్వు" రను పాదమునకు ముందు కాగితపు ప్రతిలోనున్న "తూలఁ జేనాడి నా తోయజ గంధి" అను చరణము లేదు.

(24) ముద్రిత గ్రంథమునందు సప్తమాశ్వాసములోని నలువది మూడవ లీల (పుట 226) లో 'హెచ్చుకొంచము పెద్ద లేర్పఱించెదరు' అను చరణమునకు ముందు కాగితపు ప్రతిలో నున్న "యిచ్చోట బాడుడు యీక్షణంబునను" అను చరణము లేదు.

(25) ముద్రిత గ్రంథము నందు సప్తమాశ్వాసములోని నలువది నాలుగవ లీలలో (పుట 231) 'వైచినఁగనుగొని వడిఁ గోపమెసగ' అను పాదము తరువాత కాగితపు ప్రతిలో గల "శ్రీ చొక్కనాథుడాసేనాని జూచి' అను పాదము లేదు.

(26) ముద్రిత గ్రంథమునందు అష్టమాశ్వాసములోని నలువది తొమ్మిదవ లీలలో (పుట 255) "పాలించి జనులెల్ల ప్రస్తుతిసేయ" అను చరణము తదుపరి కాగితపు ప్రతిలోనున్న "కైలాసమునకేగె కడువేడ్కనంత" అను చరణము లేదు.

(27) ముద్రిత గ్రంథమునందు అష్టమాశ్వాసములోని ఏబది యైదవ లీల (పుట 276) లో 'కాలకూటాహార!కలుపాపహర! ' అను చరణము తరువాత కాగితపు ప్రతిలోగల 'కాలదంష్ట్రా కార!కందర్పహర!' అను చరణము లేదు.

(28) ముద్రిత గ్రంథమునందు అష్టమాశ్వాసములోని ఏబది యైదవ లీలలో (పుట 277) 'గ్రచ్చరవెదుక నక్కడ వైఖదరిని' అను చరణము తదుపరి కాగితపు ప్రతిలో నున్న ఈ క్రింది చరణములు లేవు.

"ఏచ్చేసి యుండంగ వేగంబెగాంచి
పరతెంచి వచ్చి యా పాండ్యభూపతికి
ధరణీశ వినవె సౌందర్యనాయకుడు
నాయుత్తరంబున నావైఖదరిని".

(29) ముద్రిత గ్రంథమునందు నవమాశ్వాసములోని ఏబదియేడవ లీలలో (పుట 296) "ఎన్నేని విధములనెన్నేని గతుల"- అను చరణము తరువాత కాగితపు ప్రతిలోనున్న "నెన్నేని మార్గంబు లెన్నిక గాక" అను చరణము లేదు.

(30) ముద్రిత గ్రంథమునందు నవమాశ్వాసములోని ఏబదియెనిమిదవ లీలలో (పుట 303) "చాలు మాధన మెల్ల సరగనిచ్చెదవొ" అను చరణము తరువాత "జాలిమాలుచుఁ గుంది చాలనొచ్చెదవొ' అను కాగితపు ప్రతిలోని పాదము లేదు.

(31) ముద్రిత గ్రంథమునందు నవమాశ్వాసములోని యఱువదియవ లీలలో (పుట 318) 'మంగయకర్ష సన్మంగళాకర్ష' అను చరణము తదుపరి కాగితపు ప్రతిలోనున్న "శృంగార సద్గుణశీలనుత్కర్ష" అను చరణము లేదు.

(32) ముద్రిత గ్రంథము నందు నవమాశ్వాసములోని యఱువది యవలీలలో (పుట 226) విభూతి మహత్త్వమును దెలుపు సందర్భమున "సురుచిరాంచిత దేహశుద్ధి విభూతి" అను చరణమునకు ముందు కాగితపు ప్రతిలోనున్న "చిరతర సంకల్ప సిద్ధి విభూతి" అను చరణము లేదు.

(33) ముద్రిత గ్రంథమునందలి నవమాశ్వాసములోని యఱువది యవ లీలాంతమున పుట నెం.329 లో "నిదియునరువది లీల యిట మీది చరిత

ముదముతో జెప్పెదమునులార వినుడీ" అను ద్విపద అనంతరము-

"యనుచు సమ్మునులతో నాయగస్త్యుండు

మనమునఁ దలపోసి మఱియు నిట్లనియె" అను ద్విపద కాగితపు ప్రతిలో "పాఠం" అను సూచనతో వ్రాసి యున్నది. ఇది D 1053 తాళపత్ర ప్రతిలోనిది. ముద్రితమున ఈ ద్విపద తొలగింపబడినది. బహుశః తరువాత లీల "మఱియును" అని ప్రారంభించుట చేత కావచ్చును.

## II D 1053 తాళపత్ర గ్రంథమున నుండి ముద్రితమునలేని చరణములు

(1) ముద్రిత గ్రంథము నందలి తృతీయాశ్వాసములోని పదునాఱవ లీలలో (పుట103) "అభినుతుల్సేయంగ హర్షమ్ము నంది" అను చరణము తదుపరి "భ" ప్రాసతో మరియొక చరణము లేదు. కాని తాళపత్ర ప్రతిలో ఈ పాదము తరువాత "అభినవమ్ముగ వారి కానతియిచ్చె' అను చరణము కలదు. ఇది కాగితపు ప్రతిలో కూడలేదు.

(2) పంచమాశ్వాసములోని ఇరువది తొమ్మిదవ లీలలో (పుట 151) "యాదరమ్మునమ్రొక్కి యభినుతుల్ సేసి" యను చరణమునకు ముందు తాళపత్రప్రతిలో నున్న "యాదేవు గుడికేగి యా స్వామికపుడు" అను చరణము ముద్రితమున లేదు.

(3) సప్తమాశ్వాసములోని నలుపది యాఱవ లీలలో (పుట 245) 'ఆచటకమ్ము చయ్యన మ్రొక్కినిలచి" యను చరణము తదుపరి తాళపత్ర ప్రతిలోనున్న "ఓ చొక్కనాథ సద్యోన్నతపదవి" అను చరణము కాగితపు ప్రతిలోను ముద్రిత గ్రంథములోను లేదు.

(4) సప్తమాశ్వాసములోని నలువది యేడవ లీలలోని సరోవరవర్ణన లో (పుట 248) "జననుతమ్మగు" నిత్యాదిగాగల ద్విపద తరువాత తాళపత్ర ప్రతిలోనున్న "కడునుత్తమాశ్వలక్షణములబోలె, వడిమించు ఘనతరావర్తముల్ గలిగి" అను ద్విపద కాగితపు ప్రతిలోను ముద్రిత గ్రంధమునందును లేదు.

## III ముద్రిత గ్రంథములో నుండి D 1053 తాళపత్ర ప్రతిలో లేనిచరణములు

(1) "సౌందర్యనాథుండు సర్వేశ్వరుండు" (పుట 12)
(2) "వినుడివిజాధీశ విన్నవించెదను" (పుట 24)
(3) "మునినాథనాతప్పు మొగి గాచితేని" (పుట 32)
(4) "సురవైభవమ్ముల సొంపుతో నుండ" (పుట 35)
(5) "శ్రీ మహాదేవుండు శిష్ట రక్షకుడు
నా తటాతక శౌర్యమాత్మ భావించి"[2] (పుట 52)
(6) "నాకుంభ సంభవుఁడాత్మను ప్పొంగి
యామహామునులకు నప్పుడిట్లనియె" (పుటలు 135,136)
(7) "మధురాపురమ్మున మణిదేవపాండి
ధర్మమ్ము తప్పక ధర యేలుచుండ" (పుట 137)
(8) "వేగంబె మధురకు విచ్చేసి మణియు" (పుట 202)
(9) "రప్పించి యా పాండ్యరాజు వేడుటయు"[3] (పుట 263)

## IV తాళపత్ర ప్రతికి ముద్రిత గ్రంథమునకు భేదముగల చరణములు

(1) ముద్రిత గ్రంధములోని చతుర్థాశ్వాసములో ఇరువది నాలుగవలీలలో (పుట 133) "అప్పుడా స్వామి తానశరీరియగుచు
నాదేవపాండికి నానతియిచ్చె" - అను ప్రాసభంగము గల ద్విపదకు మారుగా దీని స్థానమున D.1053 తాళపత్రప్రతిలో
"అప్పుడా స్వామి తానశరీరియగుచు
నప్పాండ్యభూపతి కానతియిచ్చె" - అను సాధు పాఠము కలదు.
ముద్రిత గ్రంధము నందలి ప్రాసభంగము ద్విపద D .1051 కాగితపు ప్రతిలోనిది.

(2) ముద్రిత గ్రంధము నందలి పంచమాశ్వాసములోని ఇరువది యేడవ లీలలో (పుట 146) నున్న ఈ క్రింది చరణములకు మరియు తాళపత్ర గ్రంధములోని చరణములకు కొంత భేదమున్నది.

ముద్రిత పాదములు; "ఓదేవ! యిదియొక్క యుత్పాతముగను
భూదివమ్ములను గప్పుచు నిందులకును
గాలాగ్ని చందానఁ గడఁగు చున్నదియు"

తాళపత్రప్రతిలోని పాదములు :
"ఓ దేవ! యిదియొక్క యుత్పాతముగను
భూలోకమెల్ల గప్పుచు నిందులకును
గాలాగ్ని చందాన కడగుచున్నదియు" - ఈ చరణములలో

ఓ దేవ! యను మొదటి చరణమునకు ముందుగాని వెనుకగాని "ద" ప్రాసతో మఱియొక పాదములేదు. కావున నిది ఏకపద గావలసివచ్చును. ముద్రిత పాఠము ప్రకారమైనచో "ల" ప్రాసముతో గల చరణము ఏకపద గావలసివచ్చును.

(3) ముద్రిత గ్రంథమునందలి పంచమాశ్వాసములోని ముప్పది రెండవ లీలలో (పుట 168) "యా దేవుననుమతి యవనికేతెంచి
యాపాండ్య రాజ్యమ్ము నందు నామట్టి" - అను
ప్రాసభంగము గల ద్విపద తాళపత్ర గ్రంథమున
"యాదేవుననుమతి నవనికేతెంచి
యాదేవ రాజ్యంబు నందు నా మట్టి" - అని కలదు.

(4) ముద్రిత గ్రంథము నందలి షష్ఠాశ్వాసమున ముప్పదితొమ్మిదవ లీలలో (పుట 202) "చేయుచున్నది యంచుఁజేరలెన్నని
వెలయంగఁబంపెఁ దా వెలయు సద్భక్తి
కప్పలాసరసిలోఁ గడు మ్రోయుచున్న
దగపార్వతీశ్వరు ధ్యానమంత్రంబె" అను
ద్విపదలు రెండును ప్రాసదోషముతో నున్నవి. ఇవియే తాళపత్ర గ్రంథమున ఈ క్రింది విధముగా నున్నవి.

"చేయుచున్నది యంచు జేరలెన్నని
వేయంగఁబంపెఁదా వెలయుసద్భక్తి
కప్పలా సరసిలోఁ గడు మ్రోయుచున్న
నప్పార్వతీశ్వరు ధ్యాన మంత్రంబె".

(5) ముద్రిత గ్రంథమునందలి సప్తమాశ్వాసమున నలువది మూడవ లీలలో (పుటలు 228, 229) ఈ క్రింది నాలుగు చరణములు తాళపత్ర ప్రతిలో ఆరు చరణములుగానున్నవి.

ముద్రిత పాదములు;

"మఱియు నాసాధ్విని మన్నించి యపుడు
యుగ్రునిఁజూచిన యుత్తమాంగనవు
నీ భాగ్యమున గాదె నీపాట వినగ
నీశుండు వేంచేసె నీ పాలఁ గలిగి" -

తాళపత్రప్రతిలోని చరణములు;

"మఱియు నా సాధ్విని మన్నించి యపుడు
తిరమైన కరుణార్ద్ర దృష్టినిఁ .జూచి
యో భామ నీవెప్పు డుత్తమాంగనవు
నీభాగ్యమునగాదె నిన్ను మన్నించె
నీ పాట వీశుండు నీపాట వినగ
నీ పాలి కేతెంచె నీ పాల గలిగి".

తాళపత్రప్రతిలోని పై యాఱు చరణములు ముద్రితమున నాలుగు చరణములకు కుదింపబడినవి కాని ప్రాసము తప్పినది.

(6) ముద్రిత గ్రంధమునందలి సప్తమాశ్వాసములోని నలుపదిమూడవ లీలలో /పుట 229) ఈ క్రింది చరణములు తాళపత్ర గ్రంధములోని చరణములకు కుదింపుగా దోచుచున్నవి.

ముద్రిత పాదములు; " అంత నా యింతి యత్యంతమైనట్టి
సంతోషముప్పొంగ సౌందర్యనాధు
సన్నిధికిని బోయి సద్భక్తిమ్రొక్కి
కరములు మోగిచి" - ఇత్యాది.

తాళపత్ర గ్రంధములోని చరణములు;
"అంత నాయింతి యత్యంతమైనట్టి
సంతోషముప్పొంగ సరభసమ్మునను
నందంద వేడ్కనా హాలాస్యనాధు
ముందటికిని బోయి మ్రొక్కి సద్భక్తి
కరములు మోగిచి" - ఇత్యాది.

ముద్రిత ద్విపదలలో "సన్నిధికనిబోయి" అను చరణము ఏకపదగాపలసివచ్చును. అర్థము రెండింటను సమానమేగాన తాళపత్రప్రతి పాఠమే సరియైనదిగా నున్నది.

(7) ముద్రిత గ్రంధమునందలి అష్టమాశ్వాసములోని ఏబదియైదవ లీలలో (పుట 278) ఈ క్రింది చరణములకు తాళపత్ర గ్రంధములోని చరణములకు భేదమున్నది.

ముద్రిత పాదములు; "కానమేమీ మధ్య కాంతారు దలిగి
రానిందు నతనికై రాఁ బ్రాప్తికలిగె
నీ వెందు రానేల? నీ చోటి కరుగు
మనియమ్మహాదేవుఁడాన తిచ్చినను
వినియు నా పాండ్య భూవిభుడాత్మఁగలఁగి" -

తాళపత్రప్రతిలోని చరణములు;
"కానమేమీమధ్య కాంతారుదలిగి
రానిందు నతనికై రాఁ బ్రాప్తిగలిగె
నని యమ్మహాదేవుడాన తిచ్చినను
వినియు నా పాండ్యభూ విభుడాత్మఁగలఁగి" - దీనిలో ముద్రిత పాఠములోనున్న "నీ వెందు రానేల? నీ చోటి కరుగు" అను చరణములేదు. ముద్రితమున 'వ' ప్రాసముతో మరొక పాదము లేకపోవుటవలనను, కథాకథనమున దీని అవసరము కూడ లేకపోవుటవలనను తాళపత్రప్రతి పాఠమే సరియైనది.

(8) ముద్రిత గ్రంధము నందలి నవమాశ్వాసములోని అరువది యొకటవ

లీలలో (పుట 332) "................................ కోట

చరుడను నొక మంత్రి సమ్మంధ వరుని
గనుగొని పల్కెను ఘనతతోఁగొఱ్ఱు
లెనిమిదివేలి" త్యాది గా కలవు.

పై ద్విపదలో ప్రాసభంగము జరిగినది. తాళపత్రప్రతిలో ఈ ద్విపద యిట్లున్నది.

" ..........................కోట

చరుడను నొక మంత్రి జ్ఞానసమ్మంధ
వరుని గన్గొని బల్కె వరుసతో కొఱ్ఱు
లెనిమిదివేలి" త్యాదిగా గలవు.

(9) "యోమేనజాత్మేశ! యోదుఃఖనాశ!
యో కామ భస్మాంగ! యో కృపాపాంగ!
యో కాల సంహార! యో కృపాకార!
యో మధురానాథ! యో చొక్కనాథ" - ఈ చరణములు ముద్రితగ్రంథము నందలి నవమాశ్వాసములోని అఱువది నాలుగవ లీలలోనివి (పుట 355) ఇందలి నాలుగవ చరణము తాళపత్రప్రతిలో రెండవ చరణముగా నున్నది.

(10) ముద్రితగ్రంథము నందలి నవమాశ్వాసములోని అఱువది నాలుగవ లీలలో (పుట 363) "చొక్కనాథాయన్నశుభములుసెందు
చొక్కనాథాయన్న క్షుద్రమ్ములుడుగు"
అను చరణములు తాళపత్రమున క్రింది మీదుగా నున్నవి.

(11) ముద్రితగ్రంథము నందలి నవమాశ్వాసములోని అఱువది నాలుగవ లీలలో (పుట 363) "పాయని ధనధాన్య భాగ్యముల్ వస్తు
వాహనమ్ములు గల్గి వసుధ బాలింతు
రాయురారోగ్యమ్ము లైశ్వర్య సిద్ధి" - యను పాదములు మూడింటికి బదులు తాళపత్రమున
"పాయని ధనధాన్య వస్తు వాహనము
లాయురారోగ్యంబులైశ్వర్య సిద్ధి" - యను ద్విపద మాత్రమే కలదు. ముద్రితము నందలి 'వసుధ పాలింతు' రను వాక్య భావము తరువాతి ద్విపదయగు...
"ఇలలోన మఱియు ననేక కాలమ్ము
వెలయంగ నుందురు విమలాత్ములగుచు" - అను ద్విపద యందు కలదు.

## V. కాగితపు ప్రతికి ముద్రిత గ్రంథమునకు భేదమున్న చరణములు

(1) ముద్రిత గ్రంథములోని అవతారికలో (పుట 9) అగస్త్యునకు విశేషణ పరముగా "ఈ క్షితి రక్షించె నిన సన్నిభుండు" అను చరణము నందు 'ఇన సన్నిభుడను' విశేషణపదము సూర్యసముడను నర్థమున కలదు. కాగితపు ప్రతిలో "ఈక్షితి రక్షించె

నీశసన్నిభుడు' అను పాదమున 'ఈశసన్నిభుడ'ని ఈశునితో సమానమైన వాడను నర్థమున నున్నది.

(2) ముద్రిత గ్రంథములోని ద్వితీయాశ్వాసము నందలి అయిదవ లీలలో (పుట-48) " మగటిమి తోడ దిజ్మండలంబెల్లఁ

దగు కిరీటమ్ముమస్తకమునఁ బూని' యను ద్విపద కాగితపు ప్రతిలో

"దగు కిరీటమ్ము మస్తకమునఁబూని

మగటిమి తోడ దిజ్మండలమెల్ల" - అని కలదు.

(3) ముద్రిత గ్రంథము నందలి నవమాశ్వాసములోని అఱువది రెండవ లీలలో (పుట 341) "పొలుసు కంపడరినఁ బలుగులు జాఱి " - యనుచరణము యతి దోషముతో (పొ -ప) కలదు. కాని కాగితపు ప్రతిలో "పొలుసు కంపడరిన మూలుగుల్ జాఱి" అని యున్నది.

## VI. కాగితపు ప్రతికి తాళపత్త్రప్రతికి ముద్రిత గ్రంథమునకు భేదము గల చరణములు

(1) ముద్రిత గ్రంథమునందలి అష్టమాశ్వాసములోని ఏబదియొకటవ లీలలో (పుట 263) "గరిమ నాపురమున గల కవీశ్వరుల

రప్పించి యాపాండ్య రాజువేడుటయు

నెరవుగాఁదమతమ నేర్పులు మెఱయ"

అను మూడు పాదములలోని మధ్యపాదము కాగితపు ప్రతిలో కుండలీకరణములలో నున్నది. తాళపత్రమున ఈ చరణము లేదు. అందు

"గరిమ నాపురమునఁ గల కవీశ్వరులు

నెరవుగాఁ దమతమ నేర్పులు మెఱయ" - అను రెండు పాదములు మాత్రమే కలవు.

(2) ముద్రితగ్రంథమునందు అష్టమాశ్వాసములోని ఏబదియాఱవ లీలలో (పుట284)" రసగంధములు పచ్చికసవు గాలించి" యను యతి భంగముతో కూడిన చరణము కలదు. ఇది కాగితపు ప్రతిలో "రసగంధములు పచ్చి కసవు గావించి" యని కలదు. ఇంద్రును యతి దోషమే కలదు. కాని తాళపత్ర గ్రంథమున "రస గ్రంథ పంచక ప్రాప్తి గావించి" యని కలదు. కాని అర్థదృష్టికిది సరిపడుటలేదు. ఈ చరణమున యతికి బదులు ప్రాసయతి ఉపయుక్తమై యుండవచ్చును.

### అధోజ్ఞాపికలు

1. చొక్కనాథచరిత్ర - పచ్చకప్పురపు తిరువేంగళరాజప్రణీతము.
   సంపాదకీయము : టి. చంద్రశేఖరన్ యం.ఎ.లిట్. క్యూరేటర్ ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయము. మదరాసు.
   ముద్రణ; ప్రభుత్వ ముద్రణాలయము. మదరాసు 1954.
2. D 1051 కాగితపు ప్రతిలో "A" ప్రతిలో లేవని సూచనగా వ్రాసియున్నవి.
3. ఈ చరణము కాగితపు ప్రతిలో బ్రాకెట్లలోనున్నది.
   నోట్: పై వ్యాసమున ముద్రిత గ్రంథము అనగా "చొక్కనాథ చరిత్ర" అని గ్రహించవలె.

# ద్వితీయాధ్యాయము - పాఠాంతరములు, సాధుపాఠములు

(1) చొక్కనాథ చరిత్ర అవతారికలో "శ్రీ కరంబై యొప్పు చెయ్యేటి దరిని"[1] అను పాదము తరువాత 'క' ప్రాసతో మరియొక పాదములేదు. ముద్రిత గ్రంథమునకు ఆధారమైన D 1051 కాగితపు ప్రతిలో కూడ లేదు. కాని అందే దీనికి రెండు పాఠాంతరములు చూపబడినవి. ఒకటి; 'శ్రీకరంబై యొప్పు చెయ్యేటిదరిన', అనియు రెండు; శ్రీ కరంబై యొప్పు చెయ్యేటి దనరి' అనియు. బహుశః ఇవి రెండును D 1052 D1053 తాళపత్రప్రతులలోనివి కావచ్చును.

తిరుపతిలోని తాళపత్రగ్రంథాలయములో నాకు లభించిన D 1053 తాళపత్ర ప్రతిలో 'శ్రీ' మాత్రమే మిగిలినది. తక్కినది తాళపత్రము విఱిగిపోయినది. ఆ తరువాతిచరణము లేదు.

పై రెండు పాఠాంతరములలో మొదటిదైన శ్రీ కరంబై యొప్పు చెయ్యేటిదరిన' అను పాదము చివరిపదమును ఇంచుక మార్చి అనగా 'దరిన' అను పదమును 'దరిని' అని సవరించి 'శ్రీకరంబై యొప్పుచెయ్యేటిదరిని' అని ముద్రించబడినది.

రెండవ పాఠాంతరమును గ్రహించినచో 'శ్రీకరంబై యొప్పు చెయ్యేటిదనరి' అని యుండును. ఇందలి 'దనరి' యను పదము 'తనరి' యను పదమే. దీనికి ముందు చెయ్యేటి అను పదము తరువాత అరసున్న తొలగిపోయియుండును. 'తనరి' యనగా 'ఒప్పి' యని అర్థము. తరువాతి పాదములో ఊరుపేరుకు సంబంధించిన విషయమేదైన యున్నదేమోనని సరిపెట్టుకున్నను. చెయ్యేటి అను పదమునకు తనరి యను విశేషణము కంటె 'దరిని' యనగా ఒడ్డున యను అర్థము వచ్చుటయే సమంజసముగానున్నది. కావున ముద్రిత పాఠమే సరియైనది.

(2) "శ్రీకరంబై యొప్పు చెయ్యేటి దరిని" - అను పాదము తదుపరి ముద్రిత గ్రంథములో "వెనొరవొ పొందవారి యందేరుగంటమ్మ"[2] అను అస్తవ్యస్తమైన తప్పుల తడక పాద మొకటి కలదు. దీని ముందు చరణము "క" ప్రాసతో నుండగా దీని తరువాతి పాదము, "ర" ప్రాసతో నున్నది. అది "పరమకళ్యాణిశాంభవి ఏకవీర" అను పాదము. దీని తరువాత ప్రాసము మారినది అనగా ద్విపద మారినది. కావున ఈ పాదము కూడ "ర"

---

1 ముద్రిత గ్రంథము. పుట నెం.3.

2 చొక్కనాథ చరిత్ర పుట 3.

ప్రాసముతో నుండుటయే లెస్స. అపుడు 'వెనెరవెపొంద' అను పదములకు బదులుగా 'వెరవెపొంద' అను పదములో, లేదా 'నెరవెపొంద' అను పదములో మిగులును.

కాగితపు ప్రతిలో దీనికి రెండు పాఠములు చూపబడినవి. బహుశః అవి D 1052 D1053 తాళపత్రప్రతులలోనివి కావచ్చును. D 1053 తాళపత్రప్రతిలో "వెనెరవెపొంద వారి యందోరుగంటమ్మ" అను చరణమునకు "రియందోడు" అని మాత్రమే మిగిలినది. మిగతాది లుప్తమై పోయినది. కాగితపు ప్రతిలోని పాఠములు ఇట్లున్నవి.

ఒకటి; "వెరవెంద వారి యంద్దోరుగంటెమ్మ"

రెండు; "వెరవంద వారి యంద్దోరు గటంమ్మ" - ఇందలి లేఖక దోషములు సవరించుకున్నను పై రెంటిలోనూ యతిదోషము (వె - ఒ) కలదు.

ముద్రిత గ్రంథములోని 'వెనెరవెపొంద వారి యందేరు గంటమ్మ" అను చరణములో కాగితపు ప్రతిలో వలెనే "నె" అను నక్షరమును తొలగించుకొని మిగిలిన 'వెరవెపొంద' అను పదములలోని 'పొ' అనునక్షరమును ముద్రణ దోషముగా పరిగణించి తొలగించుకొనినచో "వెరవెంద" అని మిగులును. అప్పుడు "వెరవెంద వారియందోరు గంటమ్మ" అని యున్నను ఇది కూడా యతి దోషమునే కలిగియున్నది. కావున శబ్ద దృష్టి కన్న అర్ధ దృష్టి ముఖ్యమని ఎంచి ఈ చరణములోని మొదటి పదమైన 'వెరపు' ను 'ఒఱగు' యొక్క రూపాంతరమైన "ఒఱపు" గా సవరించుకొనినచో, ఒఱగు శబ్దమునకు సూర్యరాయాంధ్ర నిఘంటువులో 'పంగు' 'వ్రాలు' అను నర్థములున్నవి కావున యతి స్థానమందలి 'పొందు' అను పదమునకు 'ఒఱపు' (ఒఱగు) శబ్దము అధీనమను నర్థమున సరిపోవును. యతి దోషముండదు. కాని ర-ఱ ప్రాసముండవలసి వచ్చును.

అట్లుగాక 'ఒఱపు' అను శబ్దమును గ్రహించినచో దీనికి తాపము, బాధ అను నర్థములు గలవు. కాన జీవితములో బాధలకు గురియైన వారి పొందు అను నర్థము వచ్చునట్లు "ఒఱపొందువారి పొందోరుగంటమ్మ" యని సవరించుకొనవచ్చును. ఇందును యతి దోషముండదు కాని ర - ఱ ప్రాసముండును.

'చొక్కనాథచరిత్ర' లో ర - ఱ ప్రాసముగల ద్విపదలున్నవి. గాన పైని చూపిన రెండు పాఠములలో "ఒఱవొందు వారి యందోరుగంటమ్మ" అని యో లేక "ఒఱపొందు వారి పొందోరుగంటమ్మ" అనియో గ్రహించవచ్చును. ఈ రెంటిలో రెండవది మేలైరమని నా అభిప్రాయము.

(3) ముద్రిత గ్రంథమునందలి అవతారికలో[1] "వరుస పాద్యమినమావ్యాస నందఱును" - అని కలదు. ఇందలి 'నమావ్యాస' అను ముద్రిత దోషముగల శబ్దమును "నమావాస్య' యని సవరించుకొనినచో "వరుసపాద్యమి నమావాస్యనందఱును" అని యగును. కాగితపు ప్రతిలో దీనికి రెండు పాఠములు చూపబడినవి. అవి తాళపత్ర ప్రతులలోనివై యుండును.

---

1. చొక్కనాథ చరిత్ర పుట 6.

ఒకటి; "వరుస నాపాఢమవాస్యంబునందు".

రెండు; "వరుస నాపాడ్యమావాస్యనందరును".

వీనిలో రెండవది అర్థవంతముగా లేదు. ఇక మొదటి దానిలోని 'అపాఢమవాస్య' కు గల ప్రాధాన్యమేమిటో తెలియరాదు. పఞ్చాఙ్గములు దీనిని చుక్కల అమావాస్య అనియు, దీపస్తంభ గౌరీవ్రతము జరుపుకొను దివసమనియు పేర్కొన్నవి. జ్యోతిశ్శాస్త్ర ప్రకారముగా విశేషార్థము లభించనంత వరకు ముద్రిత గ్రంథములోని "వరుస పాడ్యమి నమావాస్య నందరును' - పాడ్యమి మొదలు అమావాస్య వరకు (A—z) అనునట్లుగా సామాన్యార్థము గ్రహించుట యుక్తము.

(4) ముద్రిత గ్రంథములోని చతుష్షష్టిలీలల పట్టికలో

"పగగొనిచోడనిఁ బడిగెలో వ్రాసి

పొగడంది తనపురంబున కేగులీల[1] " అను ద్విపద కలదు. దీనికి కాగితపు ప్రతిలో రెండు పాఠాంతరములున్నవి.

ఒకటి; "పగగొనిచోడాని పడిగెలో వ్రాశి

పొగడొందు తన పురంబున కేగులీల"

రెండు; పగగొని చోడాని పరిఘలో వ్రాశి

పొగడొందు తన పురంబునకేగులీల" - ఈ రెండింటి లోను కథా దృష్టితోఁజూచినచో 'పడిగలో వ్రాయుట' గాని, 'పరిఘలో వ్రాయుట' గాని కుదురదు. ఇక్కడ 'వ్రాశి' అను పదమును 'త్రోసి' అని సవరించుకొనినచో పరిఘలో ద్రోసి అనగా అగడ్తలో ద్రోసి అను నర్థము వచ్చును. కథలో కూడ పరిఘలో ద్రోసినట్లు ఈ క్రింది పంక్తులు తెలుపుచున్నవి.

"అందుముంచుటఁ జేసి యాయగడ్తకును

గొందాళి యను పేరు కొమరొప్పఁబరగ్[2]" కావున 'పడిగె'యను పదముకన్న 'పరిఘ', 'వ్రాశి' యను పదముకన్న'త్రోసి' యర్థవంతములు-

ఇఁక కాగితపు ప్రతిలోని "పొగడొందు తన పురంబునకేగులీల" అను చరణము కంటె "పొగడంది తన పురంబున కేగులీల" అను ముద్రిత పాఠమే సరిగా నున్నది. పొగడంది యనగా స్తుతిని గ్రహించి యని యర్థము- చొక్కనాథుడు -పాండ్యుడు స్తుతించిన తరువాతనే అంతర్ధానమైనట్లు కథలో నున్నది గాన యదియే యుక్తముగా నున్నది.

(5) ముద్రిత గ్రంథములోని చతుష్షష్టి లీలల పట్టికలో గల నలువది నాలుగవ లీలకు సంబంధించిన విషయమున

---

1. చొక్క నాథ చరిత్ర పుట 14
2. చొక్క నాథ చరిత్ర 36వ లీల పుట 187

"కామించి యంగయ కణ్ణెమ్మ నచట
ప్రేమతోఁ గలవేసి పెండ్లాడు లీల"[1] అని గలదు. ఇందలి రెండప చరణమునకు కాగితపు ప్రతిలో రెండు పాఠాంతరములున్నవి.

ఒకటి; ప్రేమతో వెలివేశి పెండ్లాడు లీల"

రెండు; ప్రేమతో పలవేశి పెండ్లాడులీల - ఇందు మొదటి దానిలో నున్న "వెలివేయుట" అను క్రియ సలువది నాలుగవ లీలలోని కథకు సంబంధించినది కాదు. అట్లే ముద్రిత గ్రంథములోని "కలవేయుట" గూడ కథకు సంబంధించినది కాదు. ఇఁక రెండప పాఠాంతరమందలి "పలవేయుట" కథకు సంబంధించినది - ఈ కథలో చొక్కనాథుడు శాపవశమున దాశరాజు కూతురుగా జన్మించిన అంగయకణ్ణెమ్మను గాంచి మోహించి వివాహమాడనెంచి యామె తండ్రినడుగగా యాబోయ రూపమున నున్న చొక్కనాథుని 'జడధిలోనున్న నొక మత్స్యమును బట్టినచో నా కుమార్తె నిత్తునని షరతు విధింపగా' నతడు శాపవశమున మత్స్య రూపమును ధరించి సుజ్ఞాన పుస్తకములను మస్తకమున దాల్చి యున్న నందీశ్వరుని వాగుర్వైచి పట్టి అంగయకణ్ణెమ్మను పెండ్లియాడెను. కాన ఇందు పలవేసి యను పదమే యుక్తముగా నున్నదిగావున రెండవ పాఠాంతరమైన "ప్రేమతో పలవేసి పెండ్లాడులీల" అను పాదమే సరియైనది- ఇచ్చట పలవేయుట అంగయకణ్ణెమ్మకు గాదు - మత్స్యమునకు.

(6) ముద్రిత గ్రంథములో చతుష్షష్టి లీలల పట్టికలో గల ఏబదియైదప లీలకు సంబంధించిన ద్విపద ఈ క్రింది విధముగా నున్నది.

"అరయ నెడక్కొడడను భట్టునకును
నరుదొందఁ దోడుగా నరిగిన లీల"[2] - ఇందు భట్టు పేరు 'ఎడక్కొడడు' అని వాడబడినది. కాగితపు ప్రతిలో దీనికి రెండు పాఠాంతరములున్నవి. అవి యివి-

ఒకటి; "అరయనెడక్కిరుడను భట్టునకును
నసువందఁ దోడుగా నరిగిన లీల" - అను ప్రాస దోషముతో నున్న పాదము. ఇందు వాడిన పేరు "ఎడక్కిరుడు"-

రెండు; "అరయనెడక్కాడడను భట్టునకును
నరుదుగాఁ దోడు దా నరిగిన లీల" - ఇందు 'ఎడక్కాడడు' అని యున్నది.

ముద్రిత గ్రంథములోని "ఎడక్కొడడు" అను శబ్దముగాని, కాగితపు ప్రతిలోని "ఎడక్కిరుడు, ఎడక్కాడడు" అను శబ్దములు గాని కథలో సరిపోవుటలేదు. ఏబదియైదవ లీలలోని యీ క్రింది పంక్తులు "అడుక్కాడడు" అని ఋజువు చేయుచున్నవి. అవి యివి-

1. "అనుచునడుక్కాండ డందండ మ్రొక్కి" (చొ.నా.చ. పుట 277)
2. "యాయడుక్కాండడు నాకమితాప్పుఁ
డాయెడ........................" (పుట 278)

1, 2. చొక్కనాథ చరిత్ర. పుట 15

3. "నాయదుక్కాండ డాదైన సత్కవులు" (పుట 279)

కావున పై చరణములను బట్టి "అడుక్కాడడ"ను విశేష్య పదమే సరియైనది. ఎడక్కాడడిత్యాదులు గావు- ముద్రిత గ్రంథములోని "అరయనెడక్కోడడను భట్టునకును" అను పాదము "అరయ నడుక్కాండడను భట్టునకును" అని యుండవలె. రెండవ చరణము ముద్రితము నందు వలె "అరుదొందడుగా నరిగినలీల" అని యున్నను, పాఠాంతరపుగుదె "అరుదుగాఁ దేడు డా నరిగిన లీల" అని యున్నను ప్రమాదము లేదు.

(7) ముద్రిత గ్రంథము నందలి చతుష్షష్టిలీలల పట్టికలో గల ఏబది తొమ్మిదవ లీలకు సంబంధించిన ద్విపద ఈక్రింది విధముగానున్నది.

"పిట్టకై మన్ను దాఁ బెట్టుగా మోసి

కట్ట కై పిట్టుదాఁ గైకొన్న లీల"[1] ఇందలి మొదటి చరణమున కూలికాడై వచ్చిన చొక్కనాథుడు 'పిట్టకై' మన్ను మోసినట్లు కలదు. ఇది కథా దృష్టికి తప్పుగా నున్నది. ఇది పిట్ట కథ గాదు, పిట్టమ్ముకొని జీవించు 'పిట్టవ్వ' యను నొక పేద పెద్దమ్మ కథ. అందువలన దీనిని సరిచేయవలసియున్నది- ఏబది తొమ్మిదవ లీలలోని కథలో చొక్కనాథుడు కూలివాడై వచ్చి (చొ.నా.చ. పుట 306) "పిట్టవ్వ యను నొక్క పేద పెద్దమ్మ" వంతునకు వచ్చిన కట్టకై 'పిట్టు' ను కూలిగా గొని మన్ను మోసినట్లు గలదు. గాన యా ద్విపదనిట్లు సవరించుకొనవచ్చును.

'పిట్టవ్వకై మన్ను బెట్టుగా మోసి

కట్టకై పిట్టుదాఁ గై కొన్న లీల" - ఇది యిట్లుండగా కాగితపు ప్రతిలో యీ ద్విపద ఈ క్రింది విధముగా నున్నది.

"పిట్టుకై మన్ను దా బెట్టుగా మోసి

కట్టకై పెట్టు దాగై కొన్న లీల" - ఇందలి రెండవ చరణములోని 'పెట్టు' శబ్దమునకు 'దెబ్బ' అని యర్థము. ఈ కథలో కూలి కాడై వచ్చిన చొక్కనాథుడు కట్ట సరిగా గట్టుటలేదని రాజుచే కొట్టబడినాడు కావున మొదటి దానికన్న నిదియే సాధు పాఠము.

(8) ముద్రిత గ్రంథము నందలి ప్రథమాశ్వాసములోని మొదటి లీలలో (పుట 19)

"కావికోకలు నీలి కాసెలు వలలు

చేవ విండ్లునుఁ దుప్పు చెడనియంబులును" -అను ద్విపదకు మరియు

"గలిగి కొందఱు వేట కాంక్రతివేడ్క

బలిసి తన్గొలువగాఁ బావనంబైన" - అను ద్విపదకు నడుమ

"నందమై వేట సన్నాహంబుగాగ"[2] అను చరణము కలదు. కాగితపు ప్రతిలో కూడ నిట్లే కలదు. బహుశః ఈ చరణము తదుపరి "ంద" ప్రాసముతో గల మరియొక చరణము లుప్తమై పోయి యుండవచ్చును.

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 16

2. చొక్కనాథ చరిత్ర. పుట 19.

(9) ముద్రిత గ్రంథము నందలి ద్వితీయాశ్వాసములోని నాలుగవ లీలలో (పుట 40)

"తివిరి నే నాడని తీర్థముల్ లేవు

నరసి కానని శివాలయములు లేవు"[1] - ఈ ద్విపద యందు ప్రాసభంగమైనది. కాగితపు ప్రతిలో ఈ ద్విపద ఈ క్రింది విధముగానున్నది.

"తిరిగి నేనాడని తీర్థముల్ లేవు

నరసి కానని శివాలయములు లేవు" - ఇది సరియైనది

(10) ముద్రిత గ్రంథము నందలి ద్వితీయాశ్వాసములోని నాలుగవ లీలలో (పుట 41) గల ఈ క్రింది ద్విపదలలో " గావించి చనియెను గడువేడ్కతోడ" అనునొక చరణము అదనముగా పడినట్లు తోచుచున్నది. ఈ చరణము కాగితపు ప్రతిలో కూడ నిట్లేయున్నది. బహుశః వ్రాయ సకాండ్రుఁ జొప్పించిన ఈ పాదము ముద్రితమున నట్లే గైకొని యుండవచ్చును. ఆ ద్విపదలివి;

"......................ఇంద్రుడు వేట

గా వచ్చిమిము వేడ్కఁ గాంచి యర్చించి

దేవాలయంబును దివ్య మంటపము

గావించి చనియెను కడువేడ్కతోడ

బంగారు గోపుర ప్రాకారములును

సంగీత సాహిత్య సౌఖ్యమ్ముగాను

గావించి చనియెను గ్రావారిమున్ను

నీవు మా పూజలు నెమ్మితో జేసి"[2] - పై పాదములలో మొదటి రెండు చరణములొక ద్విపదగను, తదుపరి రెండు చరణములు రెండవ ద్విపదగను, ఆ తదుపరి రెండు చరణములు మూడవ ద్విపదగను గ్రహించినచో "వ" ప్రాసతో గల ఏడవ చరణము మిగులు చున్నది పైగా మధ్య ద్విపదలలో ప్రాస భంగము జరుగుచున్నది. కావున ఏడవ, ఆరవ చరణములొక ద్విపదగను, అయిదవ, నాలుగవ చరణములు మరొక ద్విపదగను గణించి "గావించి చనియెను కడువేడ్కతోడ" అను మూడవ పాదమును వదలి వేసి, రెండవ, ఒకటవ చరణములనొక ద్విపదగను గ్రహించినచో ఛందమునకు భంగము వాటిల్లదు. ఈ చరణములనట్లే యుంచినచో ఛందో భంగము తప్పదు సరికదా ఆఖ్యాన శిల్పమునకు కూడ భంగము వాటిల్లును. కథాకథన గతి కుంటువడును. మఱియు "గావించిచనియెను" అను క్రియ చివరి ద్విపదలో మొదటి పాదమున "గావించి చనియెను గ్రావారి మున్ను" అని కలదు గాన నిదే యర్థము నిచ్చు చరణము రెండు మారులుండవలసిన యవసరము లేదు. వ్రాయ సకాండ్రు జొప్పించిన పై మూడవ చరణమును విడుచుటయే యుక్తమని నా యభిప్రాయము.

1 చొక్కనాధ చరిత్ర. పుట 40.

2 చొక్కనాధ చరిత్ర. పుట 41

(11) ముద్రిత గ్రంథము నందలి తృతీయాశ్వాసములోని తొమ్మిదవలీలలో (పుట 70)

"అయ్యేడు జల నిధులయ్యేడు వాక
లయ్యగ్ని మూలను నందొక్క సరసి
గా నుండ బంచె నా కాలకంధరుడు
చాన తటాక యా స్వామికి భక్తి
ధరఁ జక్క సాగిలి దండ ప్రణామ"[1] అను నీ చరణములు కాగితపు ప్రతిలో కొలది

మార్పులతో రెండు పాఠాంతరములలో నున్నవి. మొదటి పాఠాంతరము: బహుశః D1052 తాళపత్ర ప్రతిలోనిది కావచ్చును. అది యిది.

"అయ్యేడు జలనిధులయ్యేడు వాక
లాయగ్ని మూలను నందొక్కసరసి
గా నుండ బంచె నా కాలకంధరుడు
అతి వ తటాతక నతి భక్తితోడ
ధర చక్క జాగిలి దండ ప్రణామ"-

ముద్రితములో వలెనే ఈ ప్రతిలో కూడ "ర" ప్రాసతో మరొక చరణము లేదు. పైగా మధ్య ద్విపదలో (న-త. లకు) ప్రాసదోషము కలదు. కావున ఈ పాఠము విడువదగినది. రెండవ పాఠాంతరము; ఇది D1053 తాళపత్రప్రతిలోనిది.

"అయ్యేడు జల నిధు లయ్యేడు వాక
లయ్యగ్ని మూలను నందొక్క సరసి
నుండంగ బంపె నా యురగ కంకణుడు
యుండిన యంత నా యువిద తటాత
కరుదుగా నా స్వామి కతి భక్తితోడ
ధర చక్క జాగిలి దండ ప్రణామ"-

ముద్రిత గ్రంథములోను, మొదటి పాఠాంతరములోను అయిదు చరణములే యున్నవి గాన ఇవి మూడు ద్విపదలకు సరిపోవు. కాని రెండవ పాఠాంతరములో ఆరు చరణములున్నవి గాన ఇవి మూడు ద్విపదలకు సరిపోవును. అంతేకాక పై పాదములు చొక్కనాథ చరిత్రమునకు మూలమైన హాలాస్యమాహాత్మ్యము నందలి త్రయోదశోధ్యాయమైన 'సప్త సాగరా విర్భావము' అను లీలలో "యస్సప్త సింధూన్ స్వపురస్తటాకే దేవ్యాస్స మాహూయము దంచకార"[2] అను వాక్యమునకు సరియైన అను వాదముగానున్నవి. ముద్రితములోను D1052 తాళపత్ర ప్రతిలోను ఏడు వాకల నొక సరసిగా గావించినట్లు కలదు. ఇది మూలమునకు భిన్నము D1053 తాళ పత్రప్రతిలో గల చరణములలో సరసిలో నుండఁ బంచినట్లుగా కలదు. ఇది మూలమునకు సరియైన అనువాదము.

---

1 చొక్కనాథ చరిత్ర. పుట 70

2. హాలాస్యమాహాత్మ్యము. పుట 68. శ్లో. 58.

అందువలన ఛందః పరముగ జూచినను, అనువాద దృష్టితో జూచినను ఈ 1053 తాళపత్త్రప్రతి పాఠమే సరియైనది.

ముద్రిత గ్రంథమునందు ఈ లీలాంతముననున్న

"నా సప్త జల నిధులా కొలనిలోన

రాశిగా వారాసులై యుండెనంత"[1] అను ద్విపద కూడ పై యభిప్రాయమును బలపఱచుచున్నది. మఱియు మూలమునందలి పదుమూడవ అధ్యాయములోని ఈ క్రింది శ్లోకము పై అభిప్రాయము సరియని తెలుపుచున్నది. ఆ శ్లోకమిది:

"అస్తిదేవపురోభాగే సరోజలధిపత్పురా।

తజ్జలేనాబ్ధిసలిలం సంగతం హేమరాజన్యా[2] ॥51॥

(12) ముద్రిత గ్రంథము నందలి తృతీయాశ్వాసములోని పదియవ లీలలో నున్న ఈ క్రింది చరణములు కథా కథన దృష్టితో, ఛందస్సు దృష్టితో 1053 తాళ పత్త్రప్రతి పాఠముతో భేదించుచున్నవి.

ముద్రిత పాఠము:

"అప్పుడా విధమెల్ల హరునకుఁ దెలియఁ

జెప్పిన తన పత్ని చిత్తమ్మునకును

సంతోషకరముగా సౌందరేశ్వరుడు

నింతిమీతల్లికి నీప్సితంబుగనుఁ

దడయక మలయకేతన పాండ్య విభుని

రప్పింతు నిచటికి రాజుతోఁగూడి

నొప్పుగా స్నానంబు నొనరఁ జేయింపు

మనుకొని సురలోకమున నున్న పాండ్య

జననాథుఁ బిలిపించె జనలోకమునకు"[3] - పై పాదములలో ఛందో దృష్టితో జూచినపుడు "తడయక మలయ కేతన పాండ్య విభుని" అను చరణము తరువాత "డ" ప్రాసతో మఱియొక చరణము లేదు. D1051 కాగితపు ప్రతిలో ఈ చరణములకు రెండు పాఠములు ఈ క్రింది విధముగా నీయబడినవి. వానిలో నొకటి:

"అప్పుడావిధమెల్ల నాథుకెఱిగింప

జెప్పిన తనపత్ని చిత్రంబునకును

సంతోషకరముగా సౌందరేశ్వరుడు

యింతి మీతల్లికి యీ ప్సితంబుగను

తడయక మలయకేతన పాండ్య విభుని

1. చొక్కనాథ చరిత్ర. పుట 71

2. హాలాస్యమాహాత్మ్యము. పుట 67.

3. చొక్కనాథ చరిత్ర. పుట 72.

రప్పింతునిచటికి రాజుతో గూడి
వెప్పుగా స్నానంబు వనర జేయింతు
మునుకొని సురలోకమున నున్న పాండ్య
జననాథు బిలుపించె జనలోకమునకు" - బహుశః ఇవి 1052 తాళపత్రప్రతిలోనివి కావచ్చును, వీనిలో లేఖక దోషములు సవరించుకున్నను, ఛందోదోషము తప్పుట లేదు. "తడయక మలయ కేతన పాండ్య విభుని" అను చరణము తరువాత "డ" ప్రాసతో మఱియొక చరణము లేదు.

ఇఁక రెండవది; "అప్పుడావిధమెల్ల హరునకుఁ దెలియ
జెప్పిన తన పత్ని చిత్రంబునకును
సంతోషకరముగా సర్వేశ్వరుండు
యింతి మీ తల్లికి నీప్సితంబుగను
కడువేడ్క రప్పింతు కాంతుని గూడి
సరవితో నుత్తమ స్నానంబు యిపుడు
నరుదుగా జేయింపు మతివ నీవనుచు
మునుకొని సురలోకమున నున్నయట్టి
జననాథు బిలుపించె జనలోకమునకు" - ఇవి 1053 తాళపత్రప్రతిలోనివి. వీనిలో "కడువేడ్క రప్పింతు కాంతుని గూడి" అను చరణము తదుపరి "డ" ప్రాసతో మరియొక చరణము ఈ కాగితపు ప్రతిలో లేదు కాని నేనీ తాళపత్ర గ్రంధమును పరిశీలించినపుడు "తడయక మలయకేతన పాండ్యవిభుని" అను చరణము కూడ యిందు వ్రాసియున్నది. ముద్రిత గ్రంధమును సిద్ధముచేయునపుడు ఈ పాదమును మాత్రమే గ్రహించి "కడువేడ్క రప్పింతు కాంతునిగూడి" యను పాదమును పొరపాటున వదలినట్లు తోచుచున్నది. కావున ఈ చరణమును గ్రహించుటయే యుక్తమని నా తలంపు. దీనిని గ్రహించి ఛందోభంగమును పరిహరించి కథాకధన దృష్టితో ముద్రిత పాఠము కొంత 1053 తాళపత్ర ప్రతి పాఠము కొంత స్వీకరించి ఈ క్రింది విధముగా సాధు పాఠమును నిర్ణయించుకొనుట యుచితమని నా అభిప్రాయము. నాకు తోచిన సాధు పాఠమిది:

"అప్పుడా విధమెల్ల హరునకుఁ దెలియఁ
జెప్పిన తన పత్ని చిత్తమ్మునకును
సంతోషకరముగా సౌందరేశ్వరుడు
నింతి మీ తల్లికి నీప్సితంబుగను
దడయక మలయ కేతన పాండ్య విభుని
కడువేడ్క రప్పింతు కాంతుని గూడి
సరవితో నుత్తమ స్నానంబు యిపుడు
నరుదుగా జేయింపు మతివ నీవనుచు

మునుకొని సురలోకమున నున్న పాండ్య
జననాథుఁ బిలిపించె జనలోకమునకు" -

ఉత్తమ స్నాన ప్రసక్తి ముద్రిత పాఠమునందు పొందుపఱచలేదు. అందు రాజుతో గూడి "ఒప్పుగా స్నానంబు నొనరజేయింపు" అని మాత్రమే కలదు. కాని కథలో తటాతక తల్లి కూతురుతోతన స్నాన వాంఛను వెలిబుచ్చిన సందర్భమున 'పతిగూడి స్నానంబు భక్తితో నాడుటది యుత్తమంబగు"[1] నని యున్నది కావున పై పాఠమున "ఉత్తమ స్నాన ప్రసక్తి గల 1053 తాళపత్రప్రతిలోని చరణములను గ్రహించిన యుచితముగా నుండునని గ్రహించితిని

(13) ముద్రిత గ్రంథము నందలి తృతీయాశ్వాసములోని పదుమూడవ లీలలో ఈ క్రింది ద్విపదలు ప్రాసభంగముతోనున్నవి. ఇవి కాగితపు ప్రతిలోకూడ ఇట్లేయున్నవి. అవి యివి;

"జననాథ క్షత్రియ శబ్దంబు వినవె
తగనెదిర్చిన శత్రు దండించుటయును" - మఱియు
"శరణార్థి రాజన్య సమితిఁ బ్రోచుటయుఁ
దగ జెప్పవినవె పెద్దలు శాస్త్రములను"[2] - వీనిలోమొదటి దానిలో న - గ లకు ప్రాస కూర్చబడియున్నది దీనిలోని రెండవ పాదమున గల "తగ" యను శబ్దమునకు మారుగా 'తన' యను శబ్దము నుపయోగించిన ప్రాసము తప్పదు అంతేకాక 'తగనెదిర్చిన శత్రు' వనుట కంటె 'తన నెదిర్చిన శత్రువనుట యుచితముగా నుండును. అట్లే రెండవ ద్విపదలో ర - గ లకు ప్రాస గూర్చబడినది. ఇందలి రెండవ చరణములో "తగఁ జెప్పవినవె" అనుటకు బదులు "ధరజెప్పవినవె' అని సవరించుకొనినచోప్రాసముచెడదు.

(14) ముద్రిత గ్రంథము నందలి తృతీయాశ్వాసములోని పదునాలుగవ లీలలోనున్న ఈ క్రింది చరణములు 1053 తాళపత్రప్రతిలోని చరణములతో భేదించుచున్నవి. ముద్రిత గ్రంథములోని యీ చరణములు 1051 కాగితపు ప్రతిలోనివి అచరణములివి:

"మఱియు నా పాండ్య భూ మండలేశ్వరుడు
సంతోష చిత్తుడై జగతిఁబాలింప
బలభేది యప్పుడా పార్థి వేంద్రునకు
బరగ నీవిటనుగ్ర పాండీంద్రుఁడనగ
నారాజ శేఖరు నంశంబు నీవు
నోరాజ శేఖర యుగ్ర పాండీశ"[3]

49630

పై మూడు ద్విపదలలో మొదటి దానిలో ప్రాసము తప్పినది. రెండవ దానిలో

1 చొక్కనాథ చరిత్ర పుట 72
2 చొక్కనాథ చరిత్ర పుట 84
3 చొక్కనాథ చరిత్ర పుట 92

ల-ర ప్రాసమున్నది. తాళపత్రప్రతిలో అర్థభేదము లేకయే పైన చూపిన ఆరు పాదములలోని విషయము ఈ క్రింది నాలుగు చరణములలో నున్నది.

"మరియు నా యింద్రుండు మనుజేంద్రునకును
పరగనివెదేవ పాండీంద్రుండనఘు
ండౌ రాజశేఖరు నంశంబు నీవు
నేరాజ శేఖర యుగ్ర పాండీశ" - ఇందలి లేఖక దోషములు సవరించి కొలది మార్పులతో వ్రాసిన అవి యిట్లుండును.

"మఱియు నా యింద్రుండు మనుజేంద్రునకును
పరగ నీవిట నుగ్ర పాండీంద్రుడనగ
నా రాజ శేఖరు నంశంబు నీవు
నే రాజ శేఖర యుగ్ర పాండీశ"-ఇందలి మొదటి ద్విపదలోని ఱ-ర ప్రాసము కవి కనిష్టముగాదు కావున ఆత్మీయతకు భంగము వాటిల్లదు. అందువలన ముద్రిత ప్రతిలోని ఆరు చరణముల కన్న పై నాలుగు చరణములు యుక్తముగా నుండును. పాదములు తక్కువగా నుండుట వలన కథా గతి కే మాత్రములోటు లేదు. అట్లుగాక ముద్రితములోని "మఱియు నాపాండ్య భూమండలేశ్వరుడు, సంతోషచిత్తుడై జగతి పాలింప" అను రెండు చరణములను తొలగించి మిగిలిన పాఠమునైనను గ్రహించవచ్చును. ఈ రెండు చరణములను తొలగించుట వలన కథా గతికి ఆటంకము కలుగదు. ప్రాసదోషము గల పైపాదములను తొలగించిన పాఠము ఇట్లుండును.

"బలభేది యప్పుడా పార్థివేంద్రునకు
బరగ నీవిట నుగ్ర పాండీంద్రుడనగ
నా రాజశేఖరు నంశంబు నీవు
నేరాజ శేఖర! యుగ్ర పాండీశ" -

పై రెండు పాఠములలో దేనినైనను గ్రహించవచ్చును.

(15) ముద్రిత గ్రంథమునందలి తృతీయాశ్వాసములోని పదునైదవలీలలో

"ఇం పొప్ప నుగ్రపాండీని స్వప్నమున
జననాథ! నీ వింత చింతింపనేల
వరుసతోడుతఁ బరివారంబునకును"[1] అను చరణములలో రెండవ పాదమున యతి దోషము, మూడింటిలోను ప్రాసభంగము కలిగినది. దీనికి D1051 కాగితపు ప్రతిలో ఈ క్రింది విధముగా పాఠాంతరమున్నది.

"ఇరవొప్పనుగ్రపాండీని స్వప్నమున
జననాథ నీవింత చింతింపనేల
వరుసతోడుత పరివారంబునకును"-

1. చొక్కనాధ చరిత్ర. పుట 94

ఇందలి మధ్యపాదమునకు ప్రక్కన యీ పాదము "A" ప్రతిలో లేదు అను సూచనయున్నది "A" ప్రతి యనగా D.No.1053 తాళపత్రప్రతి. యతిదోషముతో (జ - చిం) నున్న ఈ చరణమును వ్రాయ సకాండ్రు జొప్పించి యుందురు. ముద్రితమున సైతము దీనినిట్లే గైకొని యుందురు. ఈ పాదముండుట వలన "ఇరవెప్పనుగ్రపొందీని స్వప్నమున, పరుసతోడుత పరివారంబునకును" అను ద్విపద ఏర్పడుట కాటంకము కలుగుచున్నది. కధా గతిలో ఈ చరణము యొక్క అవశ్యకత ఏమియును లేదు గాన దీనిని తొలగించుటయే యుక్తము. ఇఁక ముద్రిత ప్రతి పాఠములోని మొదటి చరణమున గల 'ఇంపొప్ప' అను శబ్దము 'ర' కార స్థానమున పూర్ణ బిందువు పొరపాటున ముద్రింపబడినది. ఇది ముద్రిత దోషమేగాని వేరు గాదు.

(16) ముద్రిత గ్రంధమందలి చతుర్థాశ్వాసములోని ఇరువది యొకటవలీలలో ఈ క్రింది చరణములు ప్రాసభంగముతో నున్నవి.

"ఘనుడైన చోళ భూకాంతు దత్తఱిని
పగతుడై మధురపై పరివారములతో
తన తోడఁ గినిసి యుద్ధము సేయుచుండ"[1]

1053 తాళపత్రప్రతిలో పై వానిలో నున్న మధ్య పాదము లేదు. ప్రాసభంగమును పరిహరించుటకై తాళపత్రప్రతి పాఠమును గ్రహించుట యుక్తము.

(17) ముద్రిత గ్రంధము నందలి చతుర్థాశ్వాసములోని ఇరువది యొకటవ లీలలో నున్న ఈ క్రింది చరణములు 1051 కాగితపు ప్రతి నుండి గ్రహింపబడినవి. ఇవి 1053 తాళపత్రప్రతితో భేదించుచున్నవి.

ముద్రితములోని చరణములు;

"నారాజు కడకేగి యాతండు వనుప
వారల కీలిచ్చి వలసినంతైన
మధురపై మీ మంత్ర మహిమలతోను
జని పాండ్య భూపాలు సాధింపుడనుచుఁ
బనిచిన నాజైన భట్టారకులును
దారుణమ్ముగ భద్ర దంతావళమ్ము"[2]

1053 తాళపత్రప్రతిలో

"నారాజు కడకేగి యాతండు వనుప
దారుణమ్ముగ భద్ర దంతావళమ్ము" - అని మాత్రమే కలవు ముద్రిత గ్రంధములోను, కాగితపు ప్రతిలోను ఈ రెండు చరణములకు మధ్యనున్న ఈ క్రింది నాలుగు చరణములు తాళపత్రప్రతిలో లేవు.

1. చొక్కనాధ చరిత్ర. పుట 119
2. చొక్కనాధ చరిత్ర పుట 119, 120 లు

"వారల కీలిచ్చి వలసినంతైన
మధురపై మీ మంత్ర మహిమలతోను
జని పాండ్య భూపాలు సాధింపుడనుచు
బనిచిన నాజైన సంహారకులును" - ఇందలి మొదటి పాదము "నారాజు కడకేగి యాతండుపనుప" అను చరణము తరువాత "ర" ప్రాసముతో నున్నది గాన ఛందో దృష్టికి సరిపడును కాని "పనుప' అను క్రియపూర్తియైన పిదప "వారల కీలిచ్చి వలసినంతైన" అను విశేషణ పాదముండుట పొసగదు. విశేషణముల తదుపరి క్రియా పదముండుట వాక్యమున నియమము కాని క్రియాపదముతో వాక్యము పూర్తియైన పిదప విశేషణము లుండుట కాదు. కావున ఈ పాదము పరిహార్యము. దీని తర్వాతి చరణములలో ప్రాసభంగము కలుగుచున్నది. రెండు ద్విపదలకు సరిపోవుటలేదు. ఛందో విషయమిట్లుండగా "మధురపై మీ మంత్ర మహిమలతోను, జని పాండ్య భూపాలు సాధింపుడనుచు" పనుచుట పునరుక్తి యగుచున్నది. పాండ్యునిచే పరాజితుడైన చోళుడు మంత్రతంత్రాది మహిమలచేతనే గాని ఎదిరించి గెలుచుట సాధ్యము గాదని ఎంచి పత్రములను వ్రాసి జైనులను గజ సహితముగా పిలిపించుకొని పనిచి నాడు. గాన తిరిగిమరల నొకమారు బనుచుట యను క్రియ యుండుట పునరుక్తి దోషమగును. కావున 1053 తాళపత్రప్రతి పాఠమే సరియైనది.

(18) ముద్రిత గ్రంథమున చతుర్థాశ్వాసములోని ఇరువది నాలుగవ లీల ప్రారంభమున "మఱియును నొకనాడు మధురలోపలను బాండీడు రాజ్యము పాలించుచుండ"[1] అను పాదములు ప్రాసభంగముతోనున్నవి. ఇవి 1051 కాగితపు ప్రతిలోను ఇట్లేయున్నవి. కాని 1053 తాళపత్రప్రతిలో ఈ రెండు చరణములకు మారుగా మూడు చరణములు కలవు. అవి యివి:

"మఱియును నొకనాడు మధురలోపలను
పరమపుణ్యుడు దేవ పాండ్య భూవిభుడు
చెలువొప్పరాజ్యమ్ము సేయుచునుండ" - వీనిలో మొదటి రెండు చరణములు ఒక ద్విపదకు సరిపోవును. కాని "ల" ప్రాసముతో గల మూడవ పాదము మిగులును. ముద్రిత గ్రంథమందలి "మఱియును నొకనాడు" అను ద్విపద తరువాత నున్న "నలరంగ నొక్క బ్రాహ్మణకులోత్తముడు, తలిరుబోణితొనొక్క తావుకు బోవ"[2] అను ద్విపదతో గలిపిన మూడు పాదములు అగును.

ప్రాసదోషము గల ముద్రిత ద్విపద కంటె తాళ పత్రప్రతిలోని మూడు పాదములను గ్రహించుట కొంతవరకు సమంజసము-

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 130
2. చొక్కనాథ చరిత్ర. పుట 130

(19) ముద్రిత గ్రంథమునందు చతుర్థాశ్వాసాంతమున

"నాకుంభ సంభవుఁ డాత్మనుప్పొంగి

యామహామునులకు 'నప్పుడిట్లనియె"[1] అను ప్రాసభంగముతో గల ద్విపద 1053 తాళపత్రప్రతిలో లేదు. కాగితపు ప్రతిలోనున్నది. ఇదే యర్థమునిచ్చు

"ఘట జన్ముఁడా మౌనిగణముల కపుడు

నటమీఁది చరిత మిట్లానతియిచ్చె"[2] అను ద్విపద పంచమాశ్వాస ప్రారంభమున గల ద్విపదలలోనున్నది. గాన పైన గల ప్రాస భంగ ద్విపద యుండవలసిన యవసరములేదు.

(20) ముద్రిత గ్రంథమునందలి పంచమాశ్వాసములోని ఇఱువది యారవలీల (పుట 142) లో "యా మహాదేవు దివ్యాల యంబునకు వేగంబ యే తెంచి వృద్ధయ్యగారు" అను ద్విపద ప్రాస దోషముతో నున్నది. కాని ఇందలి రెండవ చరణము 1053 తాళ పత్ర ప్రతిలో "ప్రేమతో నేతెంచి వృద్ధయ్యగారు" అని "మ" ప్రాసముతోనే కలదు. గాన ఇదియే సరియైనది.

1 చొక్కనాథ చరిత్ర పుటలు 135, 136

2 చొక్కనాథ చరిత్ర పుట 137

# తృతీయాధ్యాయము - కవికాలాదులు, రచనలు

ఆంధ్రదేశములోనే కాక అన్యప్రాంతములలో కూడా ఆంధ్ర సాహిత్యము అభివృద్ధి చెందినది. అది ముఖ్యముగా ద్రావిడ దేశములో పదునాఱవ శతాబ్దములో పాదుకొలుపబడి పదునేడవ శతాబ్దములో మూడుపూవులారుకాయలుగ విలసిల్లినది. అచ్యుతదేవరాయలు విజయనగర సామ్రాజ్యమును పరిపాలించు రోజులలో వారికి కుడిభుజముగా నిలచి వారి ఏలుబడిలోనున్న ద్రావిడ భూములైన తిరుపత్తూరు, రామనాడు సీమలను గోళ్ల బసవ భూపాలుని కుమారులైన పెదరామప్ప చినరామప్పలు ఏలుకొనుచుండేవారు. వీరికి తెలుగు వారన్నా తెలుగు సాహిత్యమన్నా మక్కువ ఎక్కువ. వారు తెలుగు కవుల నాదరించి వారిచే కావ్యములు చెప్పించెడివారు. అట్టి వారిలోనెకడు ప్రకృత చొక్కనాధచరిత్ర గ్రంధకర్త యగు పచ్చకప్పురపు తిరువేంగళకవి.

"ఇది సర్వఘనసత్కవీంద్రపాదాబ్జ
విదితపూజామోద విమలుండుపచ్చ
కప్పుర సౌరభ్య కలిత మానాంక
తిప్పరాజసుపుత్ర తిరువేంగళేంద్ర
విరచితమ్ముగ లోకవిఖ్యాతమైన
సరస లక్షణకావ్య సత్కవీంద్రాభి
నందిత శ్రీ చొక్కనాధ చరిత్ర
మందును నిది నవమాశ్వాసమయ్యె" [1]

**కవి నివాసము** [2]

తిరువేంగళ కవి తన నివాసమును గూర్చి కావ్యమునందెచ్చటను ఇదమిత్థముగా పేర్కొనలేదు. కాని చొక్కనాధ చరిత్రమందలి అవతారికయందు -

"ఏకృతి రచియింప నిష్టార్థ సిద్ధి
యా కృతి రచియింప నతిభక్తి బూని

---

1. చొక్కనాధ చరిత్ర పుట 365.
2. రచయిత ఏ ఊరివాడు, ఏ కాలము వాడు అను పరిశోధనలనిక చాలింపక తప్పదు. శ్రీ పోతుకుచ్చి సుబ్రహ్మణ్యశాస్త్రి సాహిత్య పరిశోధన-సిద్ధాంత ప్రమాణాలు అను వ్యాసము పుట 15 తెలుగులో పరిశోధన రజతోత్సవ సంచిక.

శ్రీ కరంబైయొప్పు చెయ్యేటిదరిని
వెనొరవె పొందవారియందోరుగంటమ్మ
పరమ కళ్యాణి శాంభవి యేకవీర
యాది పరంజ్యోతి యఖిలైకమాత

నాదరంబుగ భక్తి నాత్మ భావించి"[1] - కావ్యరచన కుపక్రమించినాడు. పై ద్విపదలు ఆధారంగా కవి నివాసమును గూర్చి పలువురు పలువిధములుగా ఊహించినారు.

ఆరుద్రగారు " ఈ కవుల వంశానికి అనంతపురానికి ఏడుమైళ్ల దూరంలో ఉన్న చెయ్యేరు స్వగ్రామం. అవూళ్లో ఉన్న ఒరుగంటమ్మ అనే శాంభవీ దేవికి తిరువేంగళ రాజు భక్తుడు." అని ఊహించినారు[2].

వీరి ఊహ సరికాదనుచు రత్నాకరం శంకర నారాయణరాజు గారు "పచ్చకప్పురపు తిరువేంగళ కవి" అను వ్యాసములో "ఆరుద్ర గారు అనంతపురమునకు ఏడుమైళ్ల దూరముననున్న చెయ్యేరు కవి స్వగ్రామమని వ్రాసినారు. అనంతపురము వద్దనున్నది చియ్యేడు కాని చెయ్యేరుకాదు. చెయ్యేటిదరిని అనుటచే చెయ్యేరు గట్టుననున్న ఊరని స్పష్టముగ దెలియ వచ్చుచున్నది". అని వ్రాయుచు బాహుదానదికి తెలుగు రూపము చెయ్యేరు. బాహుదానది చిత్తూరు జిల్లాలోని హార్సీ కొండలలో పుట్టి కడప జిల్లాలో పెన్నానదిలో కలియుచున్నది. అని వివరించినారు.

ఆరుద్రగారి అభిప్రాయమును కాదనుటకు ముందు శ్రీ రాజుగారు "కవి యెచ్చటివాడో నిశ్చయించి చెప్పుటకు తగిన ఆధారములు లేవు. కావ్యావతారికలోని పంక్తులు కొన్ని ఇందులుప్తములైనవి. కవిని గూర్చిన వివరములు కొన్నియైన వీనిలో నుండునేమో. "శ్రీకరంబై యొప్పు చెయ్యేటి దరిని, వె నొరవెపొంద వారి యందోరుగంటమ్మ, పరమ కళ్యాణి శాంభవి యేకవీర, ఆదిపరంజ్యోతి యఖిలైక మాత, నాదరంబుగ భక్తి నాత్మభావించి"- తిరువేంగళ కవి కృతి రచనకు పూనుకొన్నాడు. "వెనొరవె పొంద అనగానేమో? ఇది వ్రాయసకాండ్రు చొప్పించిన అర్థరహితమైన మాట. ఒరుగంటమ్మ వెలసిన యూరిపేరు ఇందు చెప్పబడియుండవచ్చును". అని వ్రాసినారు.

తమ వాదమును కొనసాగించుచు రాజుగారు కవి నివాసమును గూర్చి ఈ క్రింది విధముగ ఊహించి నిశ్చయించినారు.

" కథలో గమనింపదగిన ముఖ్యాంశము దీనికి సంబంధించినది మరియొకటి యున్నది. తటాతక శీతాచలమునుండి సేతువు వరకు గల పుణ్య క్షేత్రముల నన్నిటిని దర్శించుచువచ్చును. కవి అమెచే గంగానది తరువాత పెన్నానదిలో తీర్థమాడించినాడు. ఆంధ్ర దేశమున అతి ముఖ్యములును పవిత్రములునగు కృష్ణా గోదావరీ నదులను గూడ

1. చొక్కనాథ చరిత్ర. పుట 3.
2. సమగ్రాంధ్రసాహిత్యం. తొమ్మిదో సంపుటం అరవీటియుగం పచ్చకప్పురపు తిరువేంగళకవి వ్యాసం. పుట 23.

ఇతడు తలంపలేదు. దీనిని బట్టి పెన్నానదితో నీతనికి గల సన్నిహిత సంబంధము వ్యక్తమగుచున్నది. చెయ్యేరు అనుపేరు కడప మండలమున మాత్రమే వ్యవహారమున నుండుట వలనను, పెన్నానది పట్ల నీకవికి గల అభిమానమును బట్టియు ఈ కవి కడప మండలము వాడని నిశ్చయింపవచ్చును." [1] అని కావ్యస్థ ఆధారమునిచ్చుచు నిశ్చయించినారు గావున ఈ కవి కడప మండలము వాడని చెప్పవచ్చును.

## కవికాలము – గ్రంథరచనా కాలము

తిరువేంగళ కవి కాలమును గూర్చి ఊహించుటకు లేదా అంచనా వేయుటకు గల ఆధారములు రెండు. ఒకటి కావ్యస్థ ఆధారములు. రెండు శాసనాధారములు.

## కావ్యస్థ ఆధారములు

తిరువేంగళ కవి తన జీవితకాలమును గూర్చిగాని చొక్కనాథ చరిత్ర రచనాకాలమును గూర్చిగాని ఈ గ్రంథమందు ప్రత్యేకముగా నెచ్చటను చెప్పలేదు. కాని ఈ కావ్యము చినరామప్ప కోరిక మేరకు ఆతని అన్నయగు పెదరామప్పకు అంకితముగా వ్రాసినదిగాన ఈ సోదరుల జీవిత కాలమే కవి జీవిత కాలమని మరియు వారి పాలనా కాలమే ఈ గ్రంథ రచనాకాలమని ఊహింపవచ్చును. పై ఊహను ధ్రువ పఱచుటకు చొక్కనాథ చరిత్ర మందుగల ఈ క్రింది ద్విపదలు ఆధారములు .

చినరామవిభుడు కృతికర్తయైన తిరువేంగళ కవి నుద్దేశించి —

"......అవార్యసన్నుత కవీంద్రుడవు
ప్రావీణ్యమతివి శోభన కావ్యలీల
గావున నీవొక్క కావ్యంబు మాకు
ద్విపద భావంబున దెలివొందిమిగుల
నుపమగా సత్కవులుల్లంబు లలర
మధుర వాక్యమ్ముల మదిగొనియాడ
మధురాపు రేశు నిర్మల పుణ్యచరిత
చేష్టి లీలా విలాసంబు లాంధ్ర
భాషను పెదరామ పార్థివుపేర
సుచరిత్ర వైభవ సుత్రాముపేర
రచియించి విఖ్యాతి రాజేయుముర్వి
నని యానతిచ్చిన యా మహారాజు
ననుపమ మధుర వాక్యములకు మెచ్చి" [2] –

అనఘ! మీ యనుమతినట్ల కావింతునని కావ్య రచనకియ్యకొని

---

1. విజ్ఞాన సర్వస్వము. రెండవ సంపుటము. పుట 269.
2. చొక్కనాథ చరిత్ర. పుట 4..

"చెలగుచు నుపనూరి సింహంబుపేర
పురుషోత్తమధ్యాన పూర్ణాత్ము పేర
తగు గోళ్ల బసవేంద్రు తనయుని పేర
సుగుణాఢ్య పరసతీ సోదరు పేర
ఘనత స్వామి ద్రోహగండని పేర
చిన రామవిభునికి జ్యేష్ఠుని పేర
దీపించు నచ్యుత దేవ రాయప్ర
తాప దక్షిణ బాహు దండాంకు పేర
జతురత నీ కావ్య సారంబునకును
బతియైన పెదరామ పార్థివు పేర"[1] - వెలయ గల్పించినాడు.

పై ద్విపదలలో ఈ కృతి పతియైన పెదరామ పార్థివుని "అచ్యుత దేవరాయ ప్రతాప దక్షిణ బాహుదండాంకుడని" పేర్కొన్నాడు. దీనిని బట్టి పెదరామప్ప చిన రామప్ప సోదరులు అచ్యుత దేవ రాయల కాలమువారని స్పష్టమగుచున్నది. అంతేగాక పెదరామ పార్థివుడు "ఉపనూరి సింహము"ని కూడా తెలియుచున్నది.

కావ్యాంతమునగల ఈ క్రింది ద్విపదలలో పెదరామప్పను నన్ననందలి పురాధ్యక్షుడని, వ్యాసతీర్థుని ప్రియశిష్యుడని, అచ్యుత దేవరాయ ప్రతాపు కార్యదురంధరుడని, ఉపనూరిసింహ భుజాంకుడని, వాకిటి చిన్న భూపర సహితుడని పేర్కొన్నాడు. ఆ ద్విపదలివి -

"అరుణాచలేంద్ర పూజా మోద విభవ
ధర మించునన్ననందలి? పురాధ్యక్ష
ప్రియబంధువన చైత్ర పిప్పాల గోత్ర
దయ సత్యదాక్షిణ్య ధర్మ స్వరూప
తగమించు వ్యాసతీర్థ ప్రియ శిష్య
సుగుణాఢ్యపరసతీ సోదర చరిత
యాయతోన్నత శౌర్యుడచ్యుత దేవ
రాయ ప్రతాపు కార్యధురంధరుండ
నంచిత కొదమ నాయంకరగండ
మించి వర్తించు స్వామి ద్రోహ గండ
చేకొన్న నుపనూరి సింహ భుజాంక
వాకిటి చిన్న భూపర సహితుండు."[2]

అంతేగాక ఈ సోదరుల గురించి మరికొన్ని విశేషములు గూడా ఇందు వ్రాసియున్నవి.

---

1. చొక్కనాధ చరిత్ర. పుట 5.
2. చొక్కనాధ చరిత్ర. పుట 364

" వినయ శౌర్యౌదార్య విస్ఫూర్తిమించి
చిన రామ విభువర జ్యేష్ఠ సౌభాగ్య
బసప భూవర తపఃఫల సత్కుమార
వసుధ గల్గిన కమ్మవంశ వర్ధనుడ
బాగొప్పఁ దిప్పమాంబాదేవి గర్భ
సాగర సంభవ సంపూర్ణ చంద్ర
చిరకీర్తియుతుడైన చిన్న రామప్ప
పురుష రత్నంబన బొగడంగమించు
లలిత కీర్త్యభిరామ! లావణ్య సోమ
విలసిల్లు పెదరామ విభవ సుత్రామ
నరనాథ శ్రీ చొక్కనాథ సత్కృపను
ధరనేలు మా చంద్ర తారార్కముగను"[1]

పై ద్విపదలలో చిన రామప్ప పెదరామప్ప సోదరులు కమ్మవంశజులని, గోళ్ల బసవ భూవరునికి తిప్ప మాంబాదేవి గర్భమున జన్మించినారని, కావ్య రచనా కాలమున వీరు రాజ్యము నేలుచున్నారను విషయములుఁదెలియ వచ్చు చున్నవి.

ఈ సందర్భమున చాగంటి శేషయ్యగారు తమ ఆంధ్ర కవి తరంగిని యందు వ్రాసిన అభిప్రాయములను దడవుట అప్రస్తుతము గాదనుకొందును. "ఈ గోళ్లవారు పరాక్రమ వంతులును పరిపాలనా దక్షులునై అచ్యుతరాయల కాలమున విశేష ప్రసిద్ధి గాంచినట్లు స్పష్టమగుచున్నది. వీరి ప్రథమ నివాసమేదియో తెలియరాలేదు. పై పాదములలో నుదాహృతములైన యుపనూరు, నన్ననందలి గ్రామము లెచ్చటివో తెలియ రాలేదు. బళ్ళారి మండలమందలి " నందహాళి"యే యీ నన్ననందలి యేమో అనుకొనుచున్నాడను. కృతిపతి వ్యాసతీర్థుల వారి ప్రియ శిష్యుడని పై ద్విపదలలో నున్నది. వ్యాసతీర్థులు మధ్వమతాధిపతి. శ్రీకృష్ణదేవరాయ లీ వ్యాసతీర్థునకు దానమొసంగి గౌరవించినట్లొకానొక శాసనమందున్నది.

గోళ్ల రామప్పయ్య కాలము 1500-1560 అని నిర్ణయింపవచ్చును. కవియు నాకాలము వాడే యనుట స్పష్టము. పై ద్విపదలలో "వాకిట చిన్న భూవరసహితుండ" యను వాక్యమునకర్థమేమో తెలియరాలేదు. కృష్ణరాయల కాలములో వాకటివారు దుర్గపాలకులుగా నుండి ప్రభువుచే మన్ననలందినట్లు గన్పట్టుచున్నది. ఈ చిన్న భూవరుడట్టివాడై గోళ్లవారికి స్నేహితుడేమో!

గోళ్ల పెదరామభూపాలుడు " ఉపనూరి సింహ"మైనట్లు కవివర్ణించి యున్నాడు. ఉపనూరెచ్చటిదో తెలియలేదు.

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 365.

వెలుగోటివారి వంశావళిలో మాదయలింగభూపతి ఉపనూరి సింహమునకు సహాయ్యమొనర్చి నట్లీ క్రింది పద్యపాదమునందున్నది.

"ఉర్విలో బొగడొందునుపనూరి సింహంబు

జెనకినరిపుకోటిఁ జెండినాడు" (51పుట) ఈ ఉపనూరి సింహము గోళ్ల రామప్పయ్య కాడు. మాదయ లింగభూపతి పదునైదవ శతాబ్దిపూర్వార్థము వాడు. గోళ్ల రామప్పయ్య పదునాఱవ శతాబ్ది పూర్వార్థము వాడు. ఉపనూరు రాయల సీమ యందుండి యుండును".[1] అని ఊహాత్మకమైన వివరణను కావ్యములోని ద్విపదల ఆధారముగా అందించినారు.

రాయలసీమలో నందలూరు అను గ్రామమొకటియున్నది. బహుశః అది నన్ననందలి అయి యుండునేమో! నిర్ణయింపవలసి యున్నది.

కవి జీవించిన కాలమును అంచనా వేయుచు శేషయ్యగారు ఈ క్రింది విధముగా ఊహాత్మకమైన గణనము చేసినారు.

"కవికి తాతయైన తిమ్మరాజు ప్రౌఢదేవరాయనిచే బిరుదము నందిన వాడగుట చేతను, నారాయలు క్రీ.శ. 1422 మొదలు 1445 వరకు రాజ్యము చేసిన వాడగుట చేతను, తిమ్మ రాజు మనుమడైన తిరువేంగళరాజు 1500 సం.ర ప్రాంతమున నున్న వాడని చెప్పవలసివచ్చును. కాని దీనికొక ఆటంకము కన్పట్టుచున్నది. కృతిపతి అచ్యుతదేవరాయల దండాధిపతి. అచ్యుత దేవరాయలు క్రీ.శ. 1530 మొదలు రాజ్యమునకు వచ్చినవాడు దీనిని బట్టి చూడగా తాతకును మనుమనికిని మధ్య నూరు సంవత్సరముల అంతరాయము వచ్చుచున్నది. ఈ భేదమును సమన్వయించుటకై 1440 ప్రాంతమున తిమ్మరాజు ప్రౌఢ రాయలచే బిరుదము నందియుండు ననియు, నప్పటికాతనికిరువది సంవ్సరముల వయసుండుననియు, 1460 ప్రాంతమున నతనికి తిప్పరాజు జన్మించియుండుననియు తిప్పరాజునకు నలువదియవయేట ననగా 1500 సం.ర ప్రాంతమున నీ కృతి రచియించి యుండుననియుఁ దలంపవలసియున్నది. ఈ ఊహలో నస్వాభావికమేమియును లేదు. గోళ్ల పెదరామప్ప శాసనము కూడ నీ కాలము ధ్రువపరచుచున్నది. ప్రౌఢ రాయల కుమారుడగు మల్లికార్జున రాయలకు గూడ ప్రౌఢ దేవరాయలని వాడుచున్నారు. అతడు క్రీ.శ. 1465 వరకు విజయనగర సింహాసన మందున్నాడు. తిమ్మరాజునకు బిరుదమునొసంగినది యాదేవరాయలైన గావచ్చును. అట్లయినచో పైని చూపిన వ్యత్యాసమున కవకాశ ముండదు".[2] అని వ్రాసియున్నారు.

నిడుదవోలు వేంకటరావుగారు కవి కాలమును గూర్చి తిరువేంగళకవి తాతలు మెప్పించిన "ప్రౌఢ దేవరాయలు క్రీ.శ. 1422-1446కు విజయనగర సామ్రాజ్యమును పాలించిన యిమ్మడి దేవరాయలు కాదగును. మనుమడు క్రీ.శ. 1538 ప్రాంతమున

---

1. ఆంధ్రకవి తరంగిణి. తొమ్మిదవ సంపుటము. పుట 94.
2. ఆంధ్రకవి తరంగిణి తొమ్మిదవ సంపుటము. పుట 92, 93లు.

...ండుటచే తాత క్రీ.శ. 1450, 60 ప్రాంతమున నుండుట విరుద్ధము కాదు".[1] అని వ్రాసినారు.

వీరు 1538 నాటి పెదరామప్ప శాసనమును కూడా ఉట్టంకించినారు. "కవిస్తుతిలో - 'బిరుదు వేములవాడ భీమునన్నయను అరయ తిక్కన నెఱ్ఱనార్యు శ్రీనాథునిల గల్గుకవులను నెల్ల సద్భక్తి'- వినుతించినాడు. ఈతడల్ల సాని పెద్దనకు సమకాలీనుడగుట చేనాతని నుతింపలేదు. ఈతరువాతి కవులు పెద్దనను పెద్దగా స్తుతించిరి కాని, కృష్ణరాయ యుగమున నంతగా స్తుతింపలేదు".[2] అని వేంకటరావుగారు తిరువేంగళ కవిని పెద్దనకు సమకాలీనుడుగా పేర్కొని యున్నారు.

## శాసనాధారములు

తిరువేంగళకవి కాలమును గూర్చి తెలిసికొనుటకు కృతిభర్తయైన పెదరామప్ప, ఆయన సోదరుడు చినరామప్ప అచ్యుతదేవ రాయల కాలమున వేయించిన శాసనములు ఆధారములుగానున్నవి. కృతిపతులకాలమే కవికాలమని వారిపాలనాకాలమే కావ్యరచనా కాలమని ఇంతకుముందే మనవి చేసియుంటిని గాన కృతిపతుల కాలము నాటి శాసన విషయములనిట సంక్షిప్తముగా చూపుచున్నాను. వీనిని బట్టి కవి కాలమును కావ్యరచనాకాలమును తెలియవచ్చును.

అచ్యుత దేవరాయలు క్రీ.శ.1530 నుండి క్రీ.శ. 1542 వరకు విజయనగర సామ్రాజ్యమును పరిపాలించినట్లు చరిత్ర కారుల నిర్ణయము.

"కృష్ణదేవరాయల యనంతర మాతని సవతి తమ్ముడు అచ్యుత రాయలు రాజయ్యెను. (1530-1542) ఈతని కాలమున దేశము మొత్తము మీద శాంతిననుభవించెనని తెలుపవచ్చును. రాయల పరిపాలనా కాలమున నాతని స్యాలకుడు సలకము తిమ్మయ మంత్రిగనుండి రాజ్యకార్యముల నిర్వహింపగ రాయలు సుఖముగా కాలము పుచ్చుచుండెడివాడు. ఈ రాజు కృష్ణ దేవరాయలచే సంపాదింపబడిన విశాల సామ్రాజ్యమును పాలించి వైభవముగ జీవించిన అదృష్టశాలి".[3]

పచ్చకప్పురపు తిరువేంగళకవి చొక్కనాథ చరిత్రయందు కృతి భర్తయగు గోళ్ల పెదరామప్పను " అచ్యుత దేవరాయల ప్రతాప దక్షిణ బాహుదండాంకు"డనుటచే కవియు నీ కాలమున (1530-1542) జీవించియున్నాడనుటలోనెట్టి విప్రతి పత్తియును లేదు గాని దీనివలన గ్రంథ రచనాకాలము తెలియరాదు.

కవితాతలైన తిమ్మరాజు, అయ్యల రాజు సోదరులు తమ పాండిత్యముచే మెప్పించిన ప్రౌఢ రాయలు క్రీ.శ. 1423 నుండి 1446 వరకు విజయనగర సామ్రాజ్యమును పరిపాలించిన రెండవ దేవరాయలు. ఈయనకు ప్రౌఢ దేవరాయలని

---

1. కవికాల నిర్ణయము-శాసనాధారములు. భారతి జూలై 1949. పుట 24.
2. కవికాల నిర్ణయము - శాసనాధారములు-భారతి జూలై 1949.
3. ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి; విజయనగర యుగము. పుట 332, 333లు.

నామాంతరము కలదు. ఈయననే ప్రౌఢ రాయలని కూడా అందురు. విజయ బుక్కరాయల పుత్రుడైన ఈతడు సంగమ వంశరాజులందరిలో శ్రేష్ఠుడని తెలుపవలసి యున్నది. ప్రౌఢ దేవరాయలను నామాంతరమేగాక గజబెంటదేవరాయలను బిరుదనామము కూడా ఈయనకున్నది. ఇమ్మడి దేవరాయలని కూడా ఇతనినే చరిత్ర కారులు పేర్కొన్నారు[1]. శ్రీనాధుని దీనారటంకాల తీర్థమాడించిన దీయనే. శ్రీనాధుడు దక్షిణాధీశ్వరుడని పేర్కొన్నది కూడా ఈయననే.

అచ్యుత దేవరాయల పాలనాకాలపు చివరి సంవత్సరము 1542. ప్రౌఢ దేవరాయల పాలనా కాలపు చివరి సంవత్సరము 1446. వీరివురి మధ్య అంతరము 96 సం.లు. అట్లే తిరువేంగళకవి తాతయైన తిమ్మరాజుకు మనుమడైన ఆయనకు మధ్య అంతరం 96 సం.లు. తాతామనుమల మధ్య ఇంత పెద్ద అంతరముండిన నుండవచ్చును కాని దీనివలన కూడా గ్రంధ రచనాకాలము నిదమిత్థముగా చెప్పలేము. కావున గ్రంధ రచనాకాలమును తెలియ వలెనన్న గోళ్ల పెదరామప్ప, చినరామప్ప - వేయించిన శాసనములు పరిశీలించుట అవసరము. ఆ శాసనములివి.

**మొదటి శాసనము :-** అచ్యుత దేవరాయలు విజయనగర సామ్రాజ్యమునకు రాజుగానున్న కాలమున పెదరామప్ప దండాధిపతిగా తమిళనాడులోని రామనాడు, తిరుపత్తూరు సీమలను పాలించుచున్న రోజులలో రామనాడు జిల్లాలోని తిరుపత్తూరు తాలూకా యందలి తిరుత్తళీశ్వర దేవాలయ పశ్చిమ ప్రాకారపు ఊాతిపై చెక్కించిన శాసనము. ఇది తమిళ భాషలో చెక్కబడినది. దీని కాలము శక సం. 1460 (క్రీ.శ. 1538) విలంబి దక్షిణాయన బహుళ ద్వాదశి. (మాసములేదు) ఇందలి విషయము; శాంత మంగలమను గ్రామమును అచ్యుత రాయల పుణ్యమునకై తిరుత్తళియాండ నాయనార్ దేవాలయమునకు త్యాగప్పెరుమాళ్ దేవుని పేరు మీద దానమొసగినట్లుగా కలదు.[2]

**రెండవ శాసనము 'అ' :-** ఇది అచ్యుత దేవరాయలు రాజుగా నున్న కాలమున చినరామప్ప వేయించిన శాసనము.

స్థలము : రామనాడు జిల్లా తిరుపత్తూరు తాలూకా పిరాన్మలైలోని మంగైనాధీశ్వర దేవాలయము.

కాలము : శక సం. 1461 (క్రీ.శ. 1539) వికారినామ సం. దక్షిణాయన గ్రీష్మ ఋతు బహుళ ఏకాదశి శుక్రవారం. ఇది కూడా రాతి శాసనమే. తమిళ భాషలో చెక్క బడింది. ఈ శాసనము శిథిలమై పోయినందువలన విషయము స్పష్టముగా లేదు. కాని అచ్యుత రాయల పుణ్యమునకై చిన రామప్ప వేయించినట్లుగా మాత్రము తెలియుచున్నది.[3]

---

1. ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి. పుట 323.
2. అనుబంధము I, శాసనం నెం. 1
3. అనుబంధము I, శాసనం నెం. 2అ.

**రెండవ శాసనము 'ఆ' :-** ఇదే దేవాలయములో నున్న మరొక తమిళ శాసనము. శక సం. 1461 విలంబి నాటిది. చిన రామప్ప అచ్యుత దేవరాయల పుణ్యమునకు గాను నల్లమంగైప్పాగర్ దేవునకు కేరళ సింగ వెలనాడులోని తిరువాయూర్ అలియాన్ కులశేఖర పట్టణము అను గ్రామమును దానమొనర్చినట్లుగా కలదు.[1]

**మూడవ శాసనము :-** ఇది అచ్యుత దేవరాయల పాలనా కాలమున గోళ్ల పెదరామప్ప మరియు చిన రామప్ప సోదరులిరువురు కలిసి వేయించిన శాసనము.

కాలము; శక సం. 1462 (క్రీ.శ.1540) శార్వరి.

స్థలము; తిరుమల తిరుపతి దేవాలయములోని మూడవ ప్రాకారపు ఉత్తరపు గోడ -ఱాతి శాసనము - తమిళములో చెక్కబడినది.

విషయము; గోళ్ల పెదరామప్ప, చినరామప్ప సోదరులు తిరుపతి వేంకటేశ్వరుల తిరువీధి ఉత్సవముల నిమిత్తము 15,000 పణములు శ్రీ భండారమునకు అర్పించుట.[2]

ఈ శాసన కాలమున చిన రామప్ప రామనాడు జిల్లానుండి చంద్రగిరి రాజ్యమునకు నాయకుడుగా మార్చబడెనని నివేదిక యందు సూచింపబడినది.

**నాలుగవ శాసనము :-** ఇది విజయ నగర సామ్రాజ్యమును సదాశివ రాయలు పరిపాలించుచున్న రోజులలో చినరామప్ప తిన్నెవెల్లి జిల్లాలోని అంబాసముద్రము తాలూకాలో గల కైలాస నాథ దేవాలయములోని తూర్పు ప్రాకారముపై తమిళ భాషలో చెక్కించిన ఱాతి శాసనము.

కాలము : శక సం. 1472 (క్రీ.శ. 1550) సాధారణ నామ సం.రము.

విషయము; సదాశివరాయల పుణ్యమునకై ఒక గ్రామమును కైలాస నాథ దేవాలయమునకు దానమొనరించుట.[3]

ఈ శాసనమును బట్టి గోళ్ల చినరామప్ప అచ్యుత రాయల కాలముననేగాక సదాశివరాయల కాలమున గూడ దండాధిపతిగానున్నట్లును, చిన రామప్ప అచ్యుత రాయల కాలమున రామనాడు తిరుపత్తూరులనుండి చంద్రగిరికి మార్చబడినట్లుగా, సదాశివ రాయల కాలమున తిన్నెవెల్లి అంబా సముద్ర ప్రాంతమునకు మార్చబడినట్లు విదితమగుచున్నది. కావున పచ్చ కప్పురపు తిరువేంగళ కవి తన కావ్యమును గోళ్ల పెదరామప్ప, చిన రామప్పలు రామనాడు తిరుపత్తూరు సీమల నేలుచున్నప్పుడో అనగా క్రీ.శ. 1538, 1539 లలోనో లేక చిన రామప్ప చంద్ర గిరికి మార్చబడిన అనంతరమో అనగా క్రీ.శ. 1542 లోపున వ్రాసియుండవచ్చును.

చొక్కనాథ చరిత్ర రచనా కాలమును గూర్చి ఆరుద్రగారు ఇట్లు వ్రాసినారు. "పెదరామప్ప శాసనాలు సదాశివరాయల కాలంలో కూడా కనబడుతున్నా అతన్ని

1. అనుబంధము I, శాసనం నెం. 2ఆ.
2. అనుబంధము I, శాసనము నెం. 3.
3. అనుబంధము I, శాసనము నెం. 4.

తిరువేంగళరాజు 'అచ్యుత దేవరాయల ప్రతాప దక్షిణ బాహుదండాంకు'డని చెప్పడం చేత ఈ కావ్యం 1542 కుపూర్వం ప్రభవించి వుంటుంది. చినరామప్ప శాసనాలు క్రీ.శ. 1540 లో కొన్ని కనబడతాయి అందుచేత ఈ మధ్య కాలంలో వెంగళ రాజు దీనిని వ్రాశాడని భావించవచ్చు".[1]

ఈ కాలమును అనగా క్రీ.శ. 1540 ని ఇంకా రెండు సంవత్సరములు వెనుకకు జరిపి క్రీ.శ. 1538లోను, 1540లోను గోళ్ల పెదరామనాయకుడు వేయించిన దాన శాసనములు లభించినవని ఈ కవి ఈ కాలములోనే చొక్కనాథ చరిత్రను రచించినాడని శంకరనారాయణ రాజుగారు వ్రాసియున్నారు.[2]

ఆంధ్ర ద్విపద సాహిత్య చరిత్ర కర్తయైన టి. సుశీల గారు కూడా ఈగ్రంధ రచనా కాలమును 1538 - 1540 గానే పేర్కొని కవియు నాకాలమువాడే యనుట తెల్లము అని వ్రాసియున్నారు.[3]

**కవి కులము :** తిరువేంగళకవి కులమును గూర్చి ఆయన పూర్వికుల గూర్చి చొక్కనాథ చరిత్ర యందలి ఈ క్రింది ద్విపదలలో స్పష్టముగా వ్రాసియున్నది. వీరి వంశము--

"నిటలాక్షపదభక్తి నియతిఁ బెంపొందు
భటవంశమున మెచ్చు పచ్చ కప్పురము"[4] - అని

భటవంశమనగా భట్టు రాజుకులము. వీరి ఇంటిపేరు పచ్చకప్పురము. వీరికీపేరెట్లు వచ్చినదో వారి వంశావళి ఏమిటో కూడా తిరువేంగళకవి తన కావ్యమునందే ఈ క్రింది ద్విపదలలో చినరామ విభునిచే చెప్పించినాడు.

"అనఘుండు మీ తాతయగు తిమ్మరాజు
తన తమ్ముఁడయ్యలు తాను నిమ్మహినిఁ
బ్రౌఢులై విద్యలఁబరగ యెప్పించి
ప్రౌఢ రాయల చేత పచ్చ కప్పురపు

రాజునాబడె"[5] దీనిని బట్టి వీరి వంశమునకు అంతకు ముందేమి పేరుండెనో కాని తిరువేంగళ కవి తాతలైన తిమ్మరాజు, అయ్యలరాజు సోదరులు ప్రౌఢులై విద్యలచే ప్రౌఢ రాయలను మెప్పించి పచ్చకప్పురము బహుమతిగా గొని, నాటి నుండి పచ్చకప్పురపు రాజులని పిలువబడినారని తెలియుచున్నది.

---

1. సమగ్రాంధ్ర సాహిత్యం, తొమ్మిదో సంపుటము. పుట 23.
2. విజ్ఞాన సర్వస్వము, రెండవ సంపుటము. పుట 269.
3. ఆంధ్ర ద్విపద సాహిత్య చరిత్ర. పుట 150.
4. చొక్కనాథ చరిత్ర. పుట 4
5. చొక్కనాథ చరిత్ర. పుట 4.

"......... తిమ్మరాజుకు తిప్ప
రాజుదయించె విరాజితమ్ముగను
రాజుల మెప్పించె రసికుడాతని త
నూజుడవు ..............[1]". తిరువేంగళ కవి తాతయైన తిమ్మరాజుకు తిప్పరాజు జన్మించినాడు. ఈ తిప్పరాజు కుమారుడే తిరువేంగళ కవి. దీనినిబట్టి ఈ కవి తండ్రి తాతలు రాజుల మెప్పించే రసిక కవులని స్పష్టమగుచున్నది.

చొక్కనాథ చరిత్రమునకు పీఠిక వ్రాసిన తి. చంద్రశేఖరన్‌గారు "వీరు భట్టురాజులని పారంపర్యముగ వైదుష్య సంపన్నుల వలె దోచుచున్నారని, సామాన్యముగా ఈ కులస్థులే అట్టి వారని" ప్రశంసించినారు.[2]

కాని వారేమైన కావ్యములు వ్రాసినారో లేదో తెలియదు. ఈ కావ్యమునందు గూడా చెప్పలేదు.

నిడుదవోలు వెంకటరావుగారు కవి కాల నిర్ణయము - శాసనాధారములు అను వ్యాసములో " అచ్యుత దేవరాయల కాలమున ప్రసిద్ధులైన ద్విపద కావ్య కవులలో తిరువేంగళ కవియొకడు. ఈయన భట్టు కులజుడు. మనకు తెలిసినంతవరకు భట్రాజులలో నితడు మొదటి కవియని చెప్పవచ్చును"[3] అని వ్రాసినారు.

**మతము :** తిరువేంగళ కవి తానవలంబించిన మతమును గూర్చి గాని, తన గురువును గూర్చిగాని కావ్యమునందెచ్చటను చెప్పలేదు. ఈయన పేరునుబట్టియు, ఈయన తండ్రి తాతల పేర్లను బట్టియు, వీరు వైష్ణవులనుటకు ఆస్కారమున్నది. అట్లే చొక్కనాథ చరిత్ర అవతారికలో "నిటలాక్షపద భక్తి నియతి పెంపొందు భటవంశమ"ని చెప్పికొనుటలో వీరి పూర్వులు శివభక్తి నియతులని కూడా తెలియుచున్నది.

తిరువేంగళకవి చొక్కనాథ చరిత్ర అవతారికలో ప్రప్రథమముగా గణపతిని యిష్టార్థ సిద్ధిగా గొలిచి శివుని హృదయ పుష్కరమున నిలుపుకొన్నాడు. ఆ వెనువెంటనే విష్ణువు యొక్క దశావతారములను కీర్తించినాడు. దీనిని బట్టి ఈ కవికి శివకేశవ భేదము లేదని చెప్పవచ్చును. దశావతార స్తుతి అనంతరము ఈ కవి వాణిని, కుమార స్వామిని, నుతించి కృతి రచనకు బూనుకొనుచు పరమ కళ్యాణియైన శాంభవి ఏకవీరా దేవిని తన యాత్మలో భావించినట్లుగా ఈ క్రింది ద్విపదలబట్టి తెలియుచున్నది.

" ఏకృతి రచియింపనిష్టార్థ సిద్ధి
యాకృతి రచియింప నతి భక్తిఁ బూని
శ్రీ కరంబైయొప్పు చెయ్యేటిదరిని

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 4.
2. చొక్కనాథ చరిత్ర పీఠిక పుట 3.
3. భారతి జూలై 1949, పుట 24.

వెనెరవెపొంద వారి యందేరుగంటమ్మ
పరమ కళ్యాణి శాంభవి యేకవీర
ఆది పరంజ్యోతి యఖిలైక మాత
నాదరంబుగ భక్తి నాత్మ భావించి"[1]- అని వ్రాసికొన్నాడు.

ఏకవీరా దేవి నాత్మభావించిన మాత్రమున శాక్తేయుడనిగాని, గణపతిని ప్రార్థించినంతనే గాణాపత్యుడని గాని, శివుని దలంచినంతనే శైవుడని గాని, విష్ణువును కీర్తించినంతనే వైష్ణవుడని గాని నిర్ణయించుటకు వీలులేదు.

కృతిపతియైన గోళ్ల పెదరామప్ప మధమతాచార్యుడైన వ్యాసతీర్థుని ప్రియశిష్యుడైనను శివద్వేషము వహింపక చొక్కనాథుని లీలలను చెప్పించినట్లుగా కవియు వైష్ణవుడే యయినను శివ కేశవ భేదము వహింపక మధురాపురేశు నిర్మల పుణ్యచరితను గొనియాడినాడని భావించవచ్చును.

## ఇతర గ్రంథములు – లేదా – రచనలు

పచ్చ కప్పురపు తిరువేంగళకవి చొక్కనాథ చరిత్రమను ద్విపద కావ్యమును దక్క దీని కన్నముందు వేరే కావ్యమేదియును రచించినట్లు ఈ కావ్యమునందెచ్చటను చెప్పలేదు. ఈ కావ్యము తరువాత వేరే రచనలేవైనా జేసినారో లేదో ఇప్పటి వరకు తెలియ రాలేదు. చేసినను చేయక పోయినను కవిగా ఆయన కీర్తిని నిలుపుటకు ఈ కావ్యమొక్కటియే చాలియున్నదని సహృదయ పాఠకుల, విమర్శకుల అభిప్రాయము.

1. చొక్కనాథ చరిత్ర. అవతారిక. పుట నెం. 3.

# చతుర్థాధ్యాయము - అనువాద విధానము

చొక్కనాథ చరిత్రము నందలి కథ మధురమీనాక్షీ సుందరేశ్వరులకు సంబంధించినది. తెలుగు వారు మీనాక్షీ సుందరేశ్వరులని పిలుచు దేవతలనే తమిళులు అంగయకణ్ణమ్మ చొక్కనాథ శివులని పిలుతురు. ఈ చొక్కనాథుడు మధురాపుర జనుల పాలిటి దైవము. వారికి పిలచిన పలికే దేవుడు. సర్వకాల సర్వావస్థల యందును మధురాపురిని రక్షించుచుండు ప్రభువు. రాజు మొదలు కొని సామాన్య పౌరుని వరకు గల సమస్త జనుల ఆపదలను కడతేర్చు ఆపద్బాంధవుడు. జనులనేగాక జంతువులను సైతము కరుణించి కాపాడిన భూతదయాపరుడు. కృత, త్రేత, ద్వాపర, కలియను నాల్గు యుగములందును బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులను నాల్గు వర్ణముల వారిని రక్షించిన ఆదేవుని అరువది నాల్గు లీలలే యుగమునకు పదునాఱు చొప్పున ఈ కావ్యమునందలి ప్రధానేతి వృత్తము. అందుకే ఈ కావ్యమునకు చౌషష్ఠి లీలా విలాసమనియు పేరు. మధురలో జరిగినది గనుక మధురాఖండము, మధురాపురాణమునని కూడా దీనికి పేర్లు. హాలాస్య క్షేత్రమున జరిగిన క్షేత్రమాహాత్మ్యమగుటచే నిది సంస్కృతమున హాలాస్యమాహాత్మ్యమని పేరు వడసినది. అట్టి చొక్కనాథ చరిత్రలోని చతుష్షష్టి లీలలను సంగ్రహముగ తెలియపఱచి అనంతరము దాని అనువాద విధానమును పరిశీలింతును.

## చతుష్షష్టి లీలలు

**మొదటి లీల;** ఇంద్రుని వృత్రహత్యా దోషమును బాపుట.

**రెండవ లీల;** ఐరావతమునకు అడవి ఏనుగువై సంచరింపుమని దుర్వాసుడిచ్చిన శాపమును బాపుట.

**మూడవ లీల;** పార్వతీదేవి కోరికపై హరిణ డింభకములకు వ్యాఘ్రిచే చనుగుడిపించుట.

**నాలుగవలీల;** మలయధ్వజపాండ్యునిచే కదంబారణ్యమున పురమును నిర్మింపజేయుట

**ఐదవ లీల;** మలయధ్వజ పాండ్యునకు సంతానమునను గ్రహించుట. ఎక్కుడు చన్నుతో తటాతక జననం.

**ఆఱవ లీల;** జైత్ర యాత్రకై ఏతెంచిన తటాతకను కైలాస పర్వత ప్రాంతారణ్యమున ఎదుర్కొని యుద్ధము చేసి ఎక్కుడు చన్నుడపి వివాహమాడి మలయ ధ్వజపాండ్యునకు ఇల్లటపుటల్లుడై సుందర పాండ్యుడను పేర ప్రజలను పాలించుట.

**ఏడవ లీల;** తటాతక కళ్యాణ సమయమున పతంజలి మొదలైన ఋషుల కోరికను దీర్చుటకై తాండవమాడుట.

**ఎనిమిదవ లీల;** తటాతక కళ్యాణ సమయమున భోజనానంతరం ఆహార పదార్థములు చాలా మిగిలిపోయినవని తటాతక విన్నవించగా కుండోదరుని భుజింప నియమించి వాని దాహమును దీర్చుటకు వేగావతినదిని రప్పించుట.

**తొమ్మిదవ లీల;** తటాతక తన తల్లి సముద్ర స్నాన మాచరింపవలయునని కోరుచున్నదని విన్నవించగా సప్త సాగరములను రప్పించి సరసిలో నుంచుట.

**పదియవలీల;** సాగరస్నానమునకై మలయధ్వజపాండ్యుని స్వర్గలోకమునుండి భూలోకమునకు రప్పించి తటాతక తల్లితో గూర్చి స్నాన మాచరింపజేయుట.

**పదునొకండవ లీల;** తటాతకయందు ఉగ్రపాండ్యుడను తనయుని బడయుట.

**పండ్రెండవ లీల;** ఉగ్రపాండ్యునకు వివాహము, రాజ్యపట్టాభిషేకము ఒనరించి, వలయాద్యాయుధ ప్రదానము గావించి సుందర పాండ్యుడు చొక్కనాథునిలో లీనమగుట. తటాతక అంగయకణ్ణెమ్మలో ఐక్యమొందుట.

**పదుమూడవ లీల;** మధురపైకి పొంగివచ్చిన సప్తసముద్రములపై ఉగ్రునిచే వలయాయుధమును ప్రయోగింపజేసి అణచుట.

**పదునాలుగవ లీల;** ఉగ్రునిచే చక్రాయుధమును ప్రయోగింపజేసి పాండ్య రాజ్యమునకు అనావృష్టిదోషము వాటిల్లజేసిన ఇంద్రుని మౌలిభేదనము గావించుట.

**పదునైదవ లీల;** ఉగ్రునిచే చండాయుధమున మేరువు గొట్టించి, కనకరాసుల దెప్పించి కరవును బాపి పాండ్య ప్రజల రక్షించుట.

**పదునారవ లీల;** కలియుగాంతమున గల విప్రవరులు వేదాధ్యయన, అధ్యాపనాది విధి దూరులై వర్తింప, కణ్వాదిమహర్షులు వేదపాలనముగావించుమని తనను ప్రార్థింప, చొక్కనాథుడు సంయమీశ్వరులకు చతుర్వేదములను వేదాంగములను నేర్చుట.

**పదునేడవ లీల;** ఉగ్రపాండ్యునకు పుత్ర సంతానమొసగుట. ఉగ్రపాండ్యుడు వ్యాఘ్రముచే అకాలమరణమునొంద ఆతని తనలో గలుపుకొనుట. దేవ పాండ్యుని పట్టాభిషేక సమయమున ఆతని రత్నకిరీటము నెవరో దొంగిలింపగా చొక్కనాథుడు రత్నాల సెట్టియై వచ్చి కిరీటమున కర్హములగు రత్నములనిచ్చి యదృశ్యుడగుట.

**పదునెనిమిదవ లీల;** ఇంద్రునిచే హాలాస్య క్షేత్ర మహత్త్వమును విని వరుణుడు ఆ హాలాస్యేశ్వరుడైన చొక్కనాథుని లీలా వినోదమును చూచెదగాకని మధురను ముంచివేయుడని వార్ధులేడింటిని బంపగా నవి మధురను ముంచుటకు వచ్చుచుండ చొక్కనాథుడు పుష్కలావర్త మేఘములను రప్పించి సప్త జలధులలోని జలము నాపోశనము బట్టించి ప్రజల రక్షించుట- చొక్కనాథుని మహత్త్వమును మరియొకమారు చూతమని వరుణుడు మధురపై తాళ ప్రమాణముగ వర్షముగురియింప తిరిగి చొక్కనాథుడానాల్గుమేఘముల నాకసమున మరువుగా నుండ నియమించి ప్రజల రక్షించుట.

**పందొమ్మిదవ లీల;** చొక్కనాథుడు సిద్ధ విద్యల జూపుట.

**ఇరువదియవ లీల;** చొక్కనాథుడు శిలసింధురముచే ఇక్షుదండమును భక్షింపజేయుట.

**ఇరువదియొకటవ లీల;** జైనులంపిన మంత్రగజమును విలుకాడై వచ్చి నిర్జించుట.

**ఇరువది రెండవ లీల;** వృద్ధయౌవన బాల్య వేషములతో బ్రాహ్మణ యువతి నలరించి వృష వాహనుడై మధురకేతెంచుట.

**ఇరువదిమూడవ లీల;** దేవపాండ్యుని భక్తికి మెచ్చి శివుడు వ్యత్యస్త నృత్తముసల్పుట. అది ఆనంద తాండవమై ఖ్యాతి గాంచుట.

**ఇరువదినాలుగవ లీల;** చొక్కనాథుడు విప్రవని తావధ నిరూపనము గావించుట.

**ఇరువదియైదవ లీల;** మాతృద్రోహి పితృహంతయైన ఒక బ్రాహ్మణ యువకుడు లోకనిందకు వెఱచి తనను శరణువేడగా చొక్కనాథుడాతని పాపమునకు ప్రాయశ్చిత్తమును దెలిపి సాయుజ్యమిచ్చుట.

**ఇరువది యాఱవ లీల;** గురుద్రోహియైన ఒక శిష్యుడు గురుపత్నిని మానభంగము జేయబోగా, చొక్కనాథుడామె భర్త వేషమున బోయి వాని చేయినఱికి, గొంతు నాలుక గోసి తన భక్తురాలైన ఆమె పాతివ్రత్యమును గాపాడుట.

**ఇరువది యేడవ లీల;** చొక్కనాథ శివుడు తన తలపైనున్న చంద్రుని యందలి అమృతమును దీసి చల్లి జైనులంపిన విష సర్పమును కళేబరముగా జేసి మధురాపురిని రక్షించుట.

**ఇరువది ఎనిమిదవ లీల;** జైనులంపిన ధేనువును చొక్కనాథుడు నంది కేశ్వరునిచే నిర్జింపజేయుట.

**ఇరువది తొమ్మిదవ లీల;** చొక్కనాథుడు తన భక్తుడైన సుందర సామంతుడను సేనాధిపతిని రక్షించుటకు రాహుత్తుడై సైన్యములదెచ్చుట.

**ముప్పదియవ లీల;** పాండ్యరాజునకు అక్షయ జోలెనొసగుట.

**ముప్పది యొకటవ లీల;** చొక్కనాథుడు గాజుల సెట్టియై వచ్చి దారుకా వన స్త్రీలను శాపవిముక్తుల గావించుట.

**ముప్పది రెండవ లీల;** చొక్కనాథుడు గురురూపమున వచ్చి షాణ్మాతృలకు శాప విముక్తి గావించి అష్టమహాసిద్ధులనుపదేశించుట.

**ముప్పది మూడవ లీల;** చొక్కనాథుడు పాండ్య రాజుకు శతృవైన 'కాద్వెట్టి' యను చోళ రాజుకు దర్శనమొసగుట.

**ముప్పది నాలుగవలీల;** చొక్కనాథుడు చలివేంద్రబెట్టి పాండ్యసేనల రక్షించుట.

**ముప్పది యైదవ లీల;** ఉత్సవ విగ్రహము చేయింపనెంచి సువర్ణము లేక చింతించుచున్న 'పొన్నాయి'యను వారవనితను కరుణింప దలచి చొక్కనాథుడు సిద్ధుడై వచ్చి ఇంటిలోనున్న ఇనుప ముట్లెల్ల దెప్పించి బంగారముగా మార్చి యిచ్చుట.

**ముప్పది యాఱవ లీల;** చొక్కనాథుడు తన భక్తుడైన పాండ్యరాజుకు చోళ రాజుతో జరిగిన యుద్ధమున అశ్విక యోధుడై వచ్చి చోళరాజును అతని సేనలతో గూడ 'కొందాళి'యను అగడ్తలో ముంచి హతమార్చుట.

**ముప్పదియేడవ లీల;** నిరతాన్నదాన ప్రతీపాలకుడగు హాలదేవుడను భక్తునకు కరవులో 'అక్షయతండులమూత' ప్రదానము గావించి యాతని వ్రతమును కొనసాగింపజేయుట.

**ముప్పది యెనిమిదవ లీల;** చొక్కనాథుడు ధనపాలసెట్టియై వచ్చి వైశ్య వనితను రక్షించుట.

**ముప్పది తొమ్మిదవ లీల;** వరగుణ పాండ్యుని బ్రహ్మహత్యా దోషమును బాపుట.

**నలువదియవ లీల;** పాండ్య దేశపు అస్థాన గాయకుడు తన భక్తుడునైన బాణుని ఓడించుటకు వచ్చిన చోళ దేశపు సంగీత విద్వాంసుని ఎదిరి ముందు చొక్కనాథుడు కట్టెలమ్ముకొను వాని వేషమున వచ్చి తన గానముచే వానిని జడిపించి పలాయితుని గావించి బాణుని ప్రతిష్ఠ నిలుపుట.

**నలువదియొకటవ లీల;** చొక్కనాథుడు తన భక్తుడైన బాణ భద్రునకు ధనమిమ్మని చారమరాజుకు నిరూపమును వ్రాసియిచ్చుట.

**నలువది రెండవ లీల;** బాణ భద్రుని భక్తిని పరీక్షింపదలచి చొక్కనాథుడు కుంభవృష్టి గురిపించినను బాణుడు నిశ్చలుడై పాడుట చూచి, జంగమ వేషమున వచ్చి అతనికి సువర్ణ పీఠమునొసగుట.

**నలువది మూడవ లీల;** చొక్కనాథుడు విద్వాంసుడై వచ్చి ఈపవళ్లాలుతో జరిగిన సంగీత పోటీలో బాణ భద్రుని భార్యను గెలిపించుట.

**నలువది నాలుగవ లీల;** చొక్కనాథుడు తానెఱిగించు అధ్యాత్మ కథలను అవధానమతితో గ్రహించని అంగయ కణ్ణెమ్మను దాశవాని కూతురుగా జన్మించుమని శపించుట. తన తల్లిని శపించినందులకు కోపించి విఘ్నేశ్వరుడు శివుని చెంతనున్న ఆగమ పుస్తకములను తొండముతో నెత్తి జలధి మధ్యమున బాఱవైచుట. చొక్కనాథుడిది చూచి నవ్వు చుండ, కుమారస్వామి వచ్చి క్రోధముతో శివుని నిందించి, అతని చేతిలోనున్న ఆగమ గ్రంధమును దీసి అవలబాఱవైవగా 'నీవీయూరి కోమటి కడుపున పుట్టుమని' శపించుట. కుమారస్వామిని లోనికి రానిచ్చినందుకు ద్వారపాలుడైన నందికేశ్వరుని జడధిమధ్యమున మత్స్యరూపివై యుండి ఆగమ గ్రంధములు జీర్ణమై పోకుండ గాపాడుమని శపించుట. తాను జాలఱి వాడై పుట్టి దాశవాని కూతురుగా జన్మించిన అంగయ కణ్ణెమ్మను వరించుటకై జలధిలో చేపయైయున్న బసవన్నను, వివాహమాడి అంగయ కణ్ణెమ్మను శాప విముక్తుల గావించుట.

**నలువదియైదవ లీల;** శాప వశమున సూకరములుగా జన్మించిన పన్నిద్దరు వెలమకుమారులకు చొక్కనాథుడు వరాహమై వచ్చి చన్నిచ్చి శాప విముక్తుల గావించి పాండ్యపతి వద్ద దళాధిపతులుగా నుండునట్లు అనుగ్రహించుట.

**నలువది యాఱవ లీల;** కాకులచే బాధింపబడుచున్న భరద్వాజ పక్షికి మృత్యుంజయ మంత్రముపదేశించి దాని కులమునుద్ధరించుట.

**నలువది యేడవ లీల;** చొక్కనాథుడు తనను సేవించిన బకమునకు సాలోక్యమిచ్చుట.

**నలువది యెనిమిదవ లీల;** చొక్కనాథుడు బ్రహ్మ కల్పాంతరమున మధురాపురికి 'ఎల్ల' జూపుట.

**నలువది తొమ్మిదవ లీల;** చొక్కనాథుడు తన భక్తుడైన అనంతగుణ పాండ్యునికి చోళ రాజుతో జరిగిన యుద్ధమున విలుకాడై వచ్చి జయము నిచ్చుట.

**ఏబదియవ లీల;** చొక్కనాథుడు నత్కీరాది నలువదెనమండ్రు ద్రావిడ కవుల ప్రార్థనను మన్నించి విద్యాధికులైన వారికెందరికైనను చోటీయగల సంఘ ఫలకము నొసగుట, మరియు కవులు తమలో తాము కలహించుకొనగా చొక్కనాథుడు విద్వాంసుడై వచ్చి కావ్య లక్షణము తేర్పఱించి వారి సందేహములు దీర్చి నలువది తొమ్మిదో వానిగా సంఘఫలకము నధివసించుట.

**ఏబది యొకటవ లీల;** చొక్కనాథుడు తన పద్యమున తప్పుబట్టిన నత్కీరునిపై అనల దృష్టి బఱపి పొత్తామర సరసిలో బడునట్లు చేయుట.

**ఏబది రెండవ లీల;** పొత్తామర కొలనిలో బడిన నత్కీరుననుగ్రహింపుమని తక్కిన కవులు ప్రార్థింప, చొక్కనాథుడాతని కరుణించి సరసి నుండి వెలికి రప్పించి ఎప్పటి వలె సంఘమంటపమున నుండుమని చెప్పి పంపుట.

**ఏబది మూడవ లీల;** చొక్కనాథుడు నత్కీరునకు అగస్త్యునిచే ద్రావిడ కావ్య లక్షణముల నుపదేశింపజేయుట.

**ఏబది నాలుగవ లీల;** చొక్కనాథుడు 'శాప వశమున మధురలో కోమటింట మూగవాడుగా జన్మించిన కుమార స్వామిచే, సంఘమంటప కవుల కావ్య తారతమ్యనిర్ణయము చేయించి, శాపవిమోచనము కలిగించుట.

**ఏబదియైదవ లీల;** చొక్కనాథుడు తన భక్తుడైన అడుక్కాండడను కవిని నిరాదరించిన కారణమున హాలాస్య క్షేత్రమును వీడి, ఉత్తర హాలాస్యమున వెలయుట.

**ఏబదియాఱవ లీల;** చొక్కనాథుడు గురు రూపమున వచ్చి తిరువాద యూరునకు జ్ఞానోపదేశము గావించి మాణిక్య వాచకుడని నామకరణమొనర్చి శివయోగము నభ్యసింప జేయుట.

**ఏబది యేడవ లీల;** చొక్కనాథుడు తన భక్తుడైన మాణిక్య వాచకుని రక్షించుటకు నక్కలను గుఱ్ఱములుగా జేసి పాండ్య రాజు కొప్పగించుట.

**ఏబది యెనిమిదవ లీల;** చొక్కనాథుడు మాయాశ్వములను నక్కలుగా మార్చుట.

**ఏబది తొమ్మిదవ లీల;** చొక్కనాథుడు మాణిక్య వాచకుని బంధ విముక్తుని గావించి కైవల్య మిచ్చుట. పిట్టవ్వయను భక్తురాలికి బొందితో కైలాస పదవి గల్పించుట.

**అఱువదియవ లీల;** చొక్కనాథుడు తన భక్తుడైన జ్ఞాన సంబంధుని పైకి జైనులంపిన బడబాగ్నిని తన శీతల దృష్టిచే చల్లార్చి అతని రక్షించుట. మరియొక మారు జ్ఞాన సంబంధుని భవనము మీదకు జైనులు దరికొల్పిన వహ్నిని చొక్కనాథుడు చల్లగా జేయుట. చొక్కనాథుడు జ్ఞాన సంబంధుని దృష్టి మాత్రముననె కుబ్జ పాండ్యుని జ్వరమునుపశమించునట్లు జేసి ఆలయమునుండి దెప్పించిన విభూతిని పాండ్య రాజు శరీరమునకు బూయుటతో జ్వరము పూర్తిగా మానునట్లు జేయుట.

**అఱువదియొకటవ లీల;** చొక్కనాథుడు జ్ఞాన సంబంధునకు జైనుల నోడించుటలో సహాకరించుట. 1. జైనులు తమ తమ మంత్రములను కాగితములపై వ్రాసి అగ్నిలో బడవేయగా వానిని కాలునట్లుజేయుట. జ్ఞాన సంబంధుడు వేసిన శివ మంత్రము గల

చీటిని కాలకుండ జూచుట. 2. జైనులు తమ తమ మంత్రములను కాగితములపై వ్రాసి వైఘానదిలో బారవేయ వాటిని ముంచి వేయుట. జ్ఞాన సంబంధుని పత్రము వైఘానదిలో మునుగకుండ ఎదురెక్కి కొంత దూరము బోగా దానిని గ్రహించి ఒక శివాలయమున వృద్ధ బ్రాహ్మణ రూపమున నుండి ఆ లేఖను వారికొప్పగించుట. (3) జ్ఞానసంబంధునిచే జైనుల నోడించి శైవులుగా జేయుట. శివమతమునంగీకరించని వారిని కొఱ్ఱు లెక్కించుట.

**అఱువది రెండవ లీల;** చొక్కనాథుడు ' తన పూజకై గంధములభింపక ' కరసాన'తో గంధము దీయుచు మూర్ఛిల్లిన మూర్తి సెట్టియను భక్తుని పాండ్య రాజ్యమున కధిపతిగా జేసి, అంత్య కాలమున కైలాస పదవి గల్పించుట.

**అరువది మూడవ లీల;** చొక్కనాథుడు పసుల కాపరియై వచ్చి కార్యారి నార్యారులను కవుల కవిత్వము లందర్ధ భాగమునుగొని మధురాపురమునకు మార్గము జూపుట.

**అరువది నాలుగవ లీల ;** పాము కాటుచే మరణించిన తన మేనబావను బ్రతికించుమని మొఱ పెట్టుకొన్న వైశ్య వనిత ప్రార్థనను మన్నించి చొక్కనాథుడు జ్ఞాన సంబంధుని రావించి యాతనిచే వైశ్యుని బ్రతికింప జేయుట. శంభు, కూప, శమీవృక్షములను సాక్షులుగా రప్పించి సవతి ఎదుట, వైశ్య వనిత పాతివ్రత్యమును ఋజువు పఱచుట.

ఈ విధముగా అఱువది నాలుగు లీలలచే నలరారు చొక్కనాథ చరిత్ర అనువాద ప్రణాళిక నరయవలెనన్న ముందు దాని మూలమును గూర్చి తెలియవలె.

చొక్కనాథ చరిత్రమునకు మూలమేది? యనుప్రశ్నమునకు సమాధానము ఈ కావ్యమునందే మనకు లభించును. చొక్కనాథ చరిత్రము నందలి కథానుక్రమణికలో వామదేవ వశిష్ఠాది మహర్షులు కుంభ సంభవుడైన అగస్త్యుని గాంచి

"మధురాపురేశ్వరు మహిఁజొక్కనాథు
విధములింపుగ మాకు వివరింపు మనుచు"[1] యని ప్రార్థింప -
"సంతనామునులఁ జయ్యన గారవించి
వినుతింపఁ దొడగెను వింధ్యశైలారి
మును నారద వ్యాస మునులు గ్రంథమున
నాది నుత్తర పురాణాఖ్యంబు నందు
భేదించి చెప్పిరిఁ బ్రీతి నేర్పఱచి
యాపుణ్య కథమీకు నేర్పడ నిపుడు
రూపింతు సంక్షేప రూపమ్ముగాను"[2] - అని చొక్కనాథుని అరువది నాలుగు లీలలను వివరించి అనంతరము మునులనందర గనుగొని
" మునులార! యీ విధంబునఁ జొక్కనాథు
డనువంద నామధురాపురంబునను

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 11.
2. చొక్కనాథ చరిత్ర. పుట 11.

లలిఁజతుష్షష్ఠి లీలా వినోదముల
విలసిల్లె నాపురి విఖ్యాతిగాను
నందమై నారద వ్యాసులు విప్ర
స్కాందపురాణార్థ సారమేర్పఱచి
భావించి చెప్పిరి ప్రాగల్భ్యబుద్ధి
గావించి రెంతయు గ్రంధ రూపమున
నటుగాన మీరలు నా పుణ్య చరిత
దిటవుగా నన్నుఁ బ్రార్థించి వేడినను
నామహాకావ్యమ్ము నాత్మలోఁ దలచి
వేమాఱు సద్భక్తి వినుతించి మించి
నలువొప్పగాఁ జొక్కనాథ చరిత్ర
మలరంగ మీరలు నందఱు వినగ
మెఱసి యా మహిమలు మించి వేర్వేఱ
బరగ సంక్షేప రూపమ్ముగ జేసి
నానేర్చు విధమున నాదు జిహ్వకును
బూనిన మార్గమ్ముఁ బొసగఁ జెప్పితిని"[1] అనినాడు.

పై ద్విపదలను బట్టి పూర్వము నారదుడు మరియు వ్యాసుడు స్కాంద పురాణమునందు మధురాధినాథుడైన శ్రీ చొక్కనాథుని యొక్క అరువది నాలుగు లీలలను వర్ణించి యున్నారని వానినే అగస్త్యుడు సంక్షేపముగా చెప్పినాడని తెలియుచున్నది. దీనిని బట్టి ప్రకృత చొక్కనాథ చరిత్రయను తెలుగు ద్విపద కావ్యమునకు మూలము సంస్కృతమున గల స్కాంద పురాణమునందలి హాలాస్య మాహాత్మ్యమను నామాంతరముగల మధురాఖండమని తెలియుచున్నది. మధురాఖండమునకే మధురాపురాణమని మఱియొక పేరు. దీనిని అగస్త్యుడు వర్ణించి చెప్పినాడు గనుక నిది అగస్త్య సంహిత లోనిదని చెప్ప వచ్చును. మూలమును జూచిన ఈ విషయము ధ్రువపడును. మూలము నందిట్లున్నది.

"సంస్కృత హాలాస్యమాహాత్మ్యమున ప్రథమాధ్యాయమున కైలాస పర్వతముపై విశ్వకర్మచే నిర్మితమైన చంద్ర కాంతశిలామయ కుట్టిమమున భస్మరుద్రాక్ష మాలాలంకృతుడై, శివ ధ్యాన పరాయణుడై వ్యాఘ్రచర్మముపై నుపవిష్టుడైన వ్యాస శిష్యుడు, మహాప్రాజ్ఞుడు, పౌరాణిక శిరోమణియైన సూతమహర్షిని గనుగొని శివభక్తి ప్రచోదితులైన ఋషులు కొందఱు సమస్త శివధర్మజ్ఞుడవైన ఓ సూతమునీ! భుక్తి ముక్తి ప్రదములైన మేరుమందర కైలాస శ్రీపర్వతము లాదిగా గల శివక్షేత్రములన్నింటిలో నెల్లప్పుడును, విశిష్టమై, చిరంతనమైన ఒకానొక క్షేత్రమును గూర్చి మాకానతీయ వలసినదని ప్రార్థింపగా సూత మహర్షి తనను వేడిన యా మునులను గాంచి, శంభు క్షేత్రములను ధ్యానించి, శివభక్తి

1. చొక్కనాథ చరిత్ర. పుట 360, 361లు.

పరాయణులైన ఓ ఋషులారా! వినుడని ఇట్లు వక్కాణించినాడు. సర్వ సౌభాగ్యముల నొనగూర్చునదియు, చతుర్వర్గ ఫలప్రదమైనదియు, బ్రహ్మ విష్ణు మహేంద్రులచే సేవింప బడునదియునగు విశిష్టతరమైన శివక్షేత్ర మొకానొకటి కలదని, దానిని పూర్వము కుంభ సంభవుడు వశిష్ఠాదిమహర్షులకు తెలిపినాడని, అదే సర్వపాప వినిర్ముక్తసమర్థమగు హాలాస్య క్షేత్రమని నుడివినాడు[1].

హాలాస్యమాహాత్మ్యము వేదాంత మందతి గూఢమైనదని, ప్రవిస్తరమైన పురాణముగా చెప్పబడినదని, ఇది స్కాంద మధ్యమున నున్నదని, స్కాంద పురాణము సనత్కుమార, సూత, శాంకర, వైష్ణవ, బ్రాహ్మ, సౌసూర సంహితలను నారు సంహితలుగా విభజింపబడియున్నదని, అందలి మూడవ సంహితయైన శంకర సంహితనే అగస్త్యుడు వశిష్ఠాది మహర్షులకు బోధించినందున అగస్త్య సంహితగా పిలువనైనదని సూతుడు మునులకు చెప్పినట్లుగా నున్నది[2]- కావున స్కాంద పురాణము నందలి అగస్త్య సంహిత (శంకర సంహిత) లోని హాలాస్యమాహాత్మ్యమే చొక్కనాథ చరిత్రకు మూలము.

చొక్కనాథ చరిత్రమునకు పీఠిక వ్రాసిన తి॥ చంద్రశేఖరన్ గారు "హాలాస్య మాహాత్మ్యము, మధురాఖండము నని నామాంతరములుగల సంస్కృత పురాణ గ్రంథమునకు దొరికినంతలో నిదియే మొదటి తెనుగుసేత యని యూహింప నగుచున్నది".[3] అని వ్రాసినారు.

నిడుదవోలు వెంకటరావుగారు "చొక్కనాథ చరిత్ర తొమ్మిది యాశ్వాసముల ద్విపద కావ్యము. ఇది స్కాందమున మధురా ఖండమున హాలాస్య క్షేత్రమున వెలసిన సుందరేశ్వరుని (చొక్కనాథుని) లీలలు 64 ను తెలుపు హాలాస్య క్షేత్రమాహాత్మ్యమునకు తెలుగుకృతి[4]" - అని వ్రాసినారు.

సాహిత్య చరిత్ర కారులును ఈ కావ్యమునకు మూలము హాలాస్య మాహాత్మ్యమనియే పేర్కొనియున్నారు.

**అనువాద విధానము** :- చొక్కనాథ చరిత్రము హాలాస్య మాహాత్మ్యమునకు యదాతథానువాదమా లేక యదేచ్ఛాను వాదమా? అను ప్రశ్నకు ఉత్తర్వు ఇంతకుముందు మూలమును గూర్చి వ్రాయుచు చూపిన ద్విపదలలోనే యున్నది. కవి అగస్త్యునిచే చెప్పించిన ఆద్విపదలలో

"యీపుణ్య కథ మీకు నేర్పడనిపుడు
రూపింతు సంక్షేప రూపమ్ము గాను"[5] అనుట వలన మూలము నందలి కథలను సంక్షేపముగా తెలియ పరతునని,

---

1. హాలాస్యమాహాత్మ్యము. ప్రథమాధ్యాయము. 25-46 శ్లోకములు. పుట 3.
2. హాలాస్యమాహాత్మ్యము. ప్రథమాధ్యాయము. 47-54 శ్లోకములు.
3. చొక్కనాథ చరిత్ర పీఠిక పుట 5. (మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయమువారు "క్యూరేటర్" పేరున పీఠికలు వ్రాయించుట సంప్రదాయము).
4. భారతి జూలై 1949. పుట 25. (కవికాల నిర్ణయము - శాసనాధారములు అను వ్యాసం).
5. చొక్కనాథ చరిత్ర. ప్రథమాశ్వాసం. పుట 11.

"నలువొప్పగా చొక్కనాథ చరిత్ర
మల రంగ మీరలు నందఱు వినగ
మెఱసియా మహిమలు మించి వేత్వేర
బరగ సంక్షేప రూపమ్ముగ జేసి
నానేర్చు విధమున నాదుజిహ్వకును
బూనిన మార్గమ్ము బొసగ జెప్పితిని[1]" అనుట వలన మూలమునకిది యదాతథాను వాదము కాదని, తాను నేర్చిన విధమున, తన జిహ్వ కిష్టమైన మార్గమున పొసగునట్లు సంక్షేప రూపమున చెప్పినదని అనగా నిది యదేచ్ఛానువాదమని తెలియుచున్నది.

"అసలాంధ్రీకరణము ద్వివిధము. కవులయిన వారు చేసిన యాంధ్రీకరణమొక విధము. ఆంధ్రీకరణము చేసి కవులనబడువారు చేసిన యాంధ్రీకరణము మఱొకవిధము. కవులయిన వారు చేసిన యాంధ్రీకరణము మూల విధేయతతో పాటు స్వతంత్ర కవితా ముద్ర కలిగి యుండుట విశేషము. ఆంధ్రీకరణము చేసి కవులనబడువారు చేసిన యాంధ్రీకరణము కేవలము మూలమునకు దాసానుదాసము. ఇందు మొదటిది ప్రతిభామూలకము. రెండవది అభ్యాసవశము."[2]

పై విభజన ప్రకారము చూచినచో తిరువేంగళ కవి మొదటి కోవకు చెందిన వాడని చెప్పవచ్చును.

చొక్కనాథ చరిత్రమును దానికి మూలమైన హాలాస్యమాహాత్మ్యమును, వాని రచనా విధానములను స్థూలముగా పరిశీలించినచో పై విషయము ధ్రువపడును.

## స్థూల పరిశీలన

(1) చొక్కనాథ చరిత్రమునకు మూలమైన సంస్కృత హాలాస్యమాహాత్మ్యమను గ్రంథాంతమున గల గద్య ద్వారా స్కాంద పురాణము నందలి అగస్త్య సంహితలోని హాలాస్య మాహాత్మ్యము, వశిష్ఠాది మునులకు కాశీముక్తి మంటపమందు అగస్త్యమునిచే శ్రీ హాలాస్యేశ్వరుని అరువది నాలుగు లీలలను డెబ్బది యొక్క అధ్యాయములలో చెప్పినట్లున్నది.

"ఇతి శ్రీస్కాందే పురాణే – అగస్త్య సంహితాయాం। హాలాస్య మాహాత్మ్యే – వశిష్ఠాదిమునీశ్వరాణాం కాశ్యాం ముక్తి మంటపే అగస్త్యేన ప్రోక్త శ్రీహాలాస్యేశ్వర చతుష్షష్టి లీలానుకథనం నామ ఏకసప్తతితమోధ్యాయః"[3].

మూలమున డెబ్బది యొక్క అధ్యాయములలో చెప్పబడిన అరువది నాలుగు లీలలను తిరువేంగళకవి చొక్కనాథ చరిత్రమునందు తొమ్మిది యాశ్వాసములలో చెప్పినాడు.

---

1. చొక్కనాథ చరిత్ర. నవమాశ్వాసం. పుట 361.
2. డా॥ కొర్లపాటి శ్రీరామమూర్తి – 'శ్రీనాథుడు' పుట. 443.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 288.

"సరస లక్షణకావ్య సత్కవీంద్రాభి
నందిత శ్రీ చొక్కనాథ చరిత్ర
మందున నిది నవమాశ్వాసమయ్యె"[1]

(2) హాలాస్యమాహాత్మ్యము నందు ప్రతి యధ్యాయమునకు ఒకపేరు గలదు. ఉదాహరణకు "ఇతి శ్రీ స్కాంద పురాణే - అగస్త్య సంహితాయాం -హాలాస్య మాహాత్మ్యే - ప్రశ్న విధిర్నామ - ప్రథమోధ్యాయః"[2] అనుట వలన ప్రథమాధ్యాయమునకు 'ప్రశ్నవిధి' యను పేరున్నట్లు తెలియుచున్నది.

హాలాస్యమాహాత్మ్యము పురాణము గావున నిందు అధ్యాయ విభజన గలదు. చొక్కనాథ చరిత్రము కావ్యముగాన నిందు అధ్యాయ విభజనకు మారుగ ఆశ్వాస విభజన కలదు.

(3) హాలాస్య మాహాత్మ్యము నందు వరుసగా ఒకటి, రెండు, మూడు అధ్యాయములలో వర్ణింపబడిన కథా ప్రారంభ ప్రశ్నవిధి, క్షేత్ర మహిమానువర్ణనము, లింగమహిమాను వర్ణనములు లీలలు కావు. అట్లే పందొమ్మిది, ఇరువది అధ్యాయములలో నున్న సోమవార వ్రతవిధి, సోమవార వ్రతోద్యాపనములు లీలలు కావు. డెబ్బది యొకటవ అధ్యాయమగు చతుష్షష్టి లీలాను కథనం ముగింపు గాన ఇది కూడా లీలగాదు. - అనగా మొత్తము ఆరు అధ్యాయములు లీలలు గావు. ఈ ఆరింటిని మొత్తము డెబ్బది యొక్క అధ్యాయముల నుండి తీసివేసిన అరుపదియైదు అధ్యాయములు వచ్చును. ఈ అరువదియైదు అధ్యాయములకు అరువది నాలుగు లీలలు కలవు. అదెట్లనగా మూడవ, నాలుగవ (ఈ రెండు) అధ్యాయములలో ఒకే లీల వర్ణింపబడినది గాన అరువదియైదు అధ్యాయములకు అరువది నాలుగు లీలలున్నవి.

హాలాస్యమాహాత్మ్యమందలి మొదటి మూడధ్యాయ ములలోని విషయము చొక్కనాథ చరిత్రమున అవతారిక, కథానుక్రమణిక, చౌషష్టి లీలల పట్టికగా సరిపుచ్చుకొన వచ్చును. మూలమున చౌషష్టిలీలల పట్టిక తృతీయాధ్యాయమునమున్నది. కథానుక్రమము హాలాస్యమాహాత్మ్య పురాణమునందు సూత పౌరాణికుడు మునులకు చెప్పినట్లు కలదు. చొక్కనాథ చరిత్రమున నట్లులేదు. మూలమునందలి సోమవార వ్రతవిధి, వ్రతోద్యాపనములు తెనుగున లేవు. దీనికి కారణము కవి కావ్యదృష్టి కావచ్చును. సంస్కృత మూలమునందలి డెబ్బది యొకటవ అధ్యాయములోని వృత్తాంతము తెలుగు కావ్యాంతమునగల విషయము, దేనికదే స్వతంత్రము. ఈ అంశమును సూక్ష్మ పరిశీలనమున వివరముగా వ్రాయుదును.

(4) హాలాస్య మాహాత్మ్యము నందున్న 7,8 లీలలు (11,12, అధ్యాయములు) చొక్కనాథ చరిత్రమున 8వ లీలగను, 18,19 లీలలు (24,25 అధ్యాయములు) 18వ

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 365.
2 హాలాస్యమాహాత్మ్యము. పుట 10.

లీలగను, 45,46, లీలలు (51,52 అధ్యాయములు) 45వ లీలగను. అనువదించియున్నవి. కవి ఈ ఆరు లీలలను మూడు లీలలుగా కుదించి, మూడు లీలలు క్రొత్తగా చేర్చి ఈ అంతరమును పూరించినాడు. చొక్కనాథ చరిత్ర మందలి 3వ లీల మరియు 62, 63వ లీలలు మూలమున లేనివి. అనగా క్రొత్తవి. బహుశః ఇవి కవి స్వకపోల కల్పితములో లేక ఏదైనా గ్రంథము నుండియో స్వీకరించియుండవచ్చును. మూలమునందలి ఆరులీలలను మూడు లీలలుగా కుదించి క్రొత్తగా మూడు లీలలను వ్రాయుట వలన అరువది నాలుగు లీలలు సరిగా సరిపోయినవి.

(5) హాలాస్య మాహాత్మ్యమునందలి 57 వ లీలను చొక్కనాథ చరిత్రమున 44 వ లీలగా కవి అనువదించినాడు.[1]

(6) హాలాస్యమాహాత్మ్యమునందు డెబ్బది యొక్క అధ్యాయములలో మొత్తము ఆరువేల ఎనమిది శ్లోకములున్నవి. ప్రార్థనా శ్లోకములు తొమ్మిది మంగళ శ్లోకములు ఎనమిది కలుపు కొన్నచో ఈ పురాణమునందు మొత్తము 6025 శ్లోకములు గలవు. చొక్కనాథ చరిత్రమున తిరువేంగళ కవి ఈ 6025 శ్లోకములను అవతారిక నుండి మొదలుకొని కావ్యాంతము వరకు. తొమ్మిది ఆశ్వాసములలో మొత్తము అయిదు వేల తొమ్మిది వందల ఏబది. (5950) ద్విపదలలో అనువదించినాడు. మూలమునందలి శ్లోక సంఖ్య కన్న అనువాదమునందలి ద్విపద సంఖ్య తక్కువ.[2]

(7) హాలాస్యమాహాత్మ్యమున లీలను ప్రారంభించునపుడు ఆ లీలలోని విషయమును ఒక శ్లోకములో నామ మాత్రముగా చెప్పి ఆ లీలను మీకు వివరింతునని అగస్త్యుడు మునులకు వివరించినట్లు కలదు. చొక్కనాథ చరిత్రమున ఒక లీల పూర్తియైన పిదన దాని తరువాతి లీలను ఒకసారి మనమున దలచుకొని ప్రారంభించినట్లు కలదు.

ఉదాః- హాలాస్యమాహాత్మ్యమున తృతీయ లీల ప్రారంభమున
"యయాకదంబకాంతారం పురీణాం ప్రవరంభ వేత్
తాం లీలాం సుందరేశస్య శృణ్వంతు ముని పుంగవాః."[3]

చొక్కనాథ చరిత్రమునందు-
"ఇదియు రెండవ లీల యిటమీది చరిత
ముదముతో జెప్పెద మునులార వినుడు
అనుచు సన్మునులతో నాయగస్త్యుండు
మనమునఁదల పోసి మఱియునిట్లనియె".[4]

---

1. లీలల పట్టిక. అనుబంధము IIలో వివరముగా చూడవచ్చును.
2. వివరములకు అనుబంధము III నందలి పట్టికలు చూడవచ్చును.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 37.
4. చొక్కనాథ చరిత్ర. ప్రథమాశ్వాసము. పుట 34.

(8) హాలాస్యమాహాత్మ్యమునందు లీలల చివరవాని సంఖ్యలను జెప్పుచు ఫలశ్రుతి చెప్పియున్నది. ఉదాహరణకు.

"ఇయంతు ప్రథమాలీలా మహేంద్రానుగ్రహాత్మికా
మహాసంపత్తి జననీ మహాపుణ్య ప్రదాయినీ"
మహావ్యాధి ప్రశమనీ మహాపాతకనాశనీ
శ్రోతవ్యాపఠిత వ్యాచ భక్తి మద్భిర్జనైస్సదా"[1]

చొక్కనాథ చరిత్రము నందు ప్రతిలీల చివరదాని సంఖ్య యున్నది. ఫలశ్రుతి కొన్ని లీలలకున్నది. కొన్నింటికి లేదు.

"ఇదియు ప్రథమ లీల యిది విన్న వ్రాయ
జదివిన నట్టి యా సద్భక్తులకును
దొలగు బ్రహ్మహత్యాది దోషముల్ మిగుల
బలియులై సౌభాగ్య పదవి నొందుదురు."[2]

ఫలశ్రుతి లేని లీలలో ఉదా.కు మూడవ లీల చివర

"ఇదియు మూడవ లీల యిట మీది చరిత
ముదముతో జెప్పెద మునులార ! వినుడి[3]" అని తరువాతి లీల ప్రారంభమైనది. షష్ఠాశ్వాసమునకు దక్క మిగిలిన ఆశ్వాసములన్నింటికిని ఆశ్వాసాంతమున గల లీలకు తప్పనిసరిగా ఫలశ్రుతి చెప్పియున్నది. ఉదాహరణకు తృతీయాశ్వాసాంతమునగల పదునాఱవ లీలకు-

"చిర యశోధనులార! శ్రీ చొక్కనాథు
చరితల నిది షోడశంబగులీల
విశ్వమందీ లీల విన్న సత్పుణ్యు
లైశ్వర ప్రాప్తులై యామ్నాయ విద్య
లందు నాధిక్యులై యాగ మోక్తిగను
బొంది వేడ్కలను సద్బుధులెల్ల బొగడ
శ్రీ చొక్కనాథుని సేవల మరగి
యా చంద్ర తారార్కమై యుందురెపుడు".[4]

(9) హాలాస్యమాహాత్మ్యమున ఏఏ లీలలు ఏఏ పాండ్యరాజుల కాలమున జరిగినవో వారి పేర్లు వ్రాసియున్నవి[5]. చొక్కనాథ చరిత్రమున నంతగా లేవుగాని కొన్ని లీలలకు వాని ప్రారంభమునమధురను పాండ్యరాజు పాలించు కాలమున నీకథ జరిగినదను

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 34. పంచమోధ్యాయము. 120, 121 శో.లు.
2. చొక్కనాథ చరిత్ర. ప్రథమాశ్వాసము. మొదటి లీల పుట 29.
3. చొక్కనాథ చరిత్ర. ద్వితీయాశ్వాసము. పుట 36.
4. చొక్కనాథ చరిత్ర. తృతీయాశ్వాసము. పుట 104.
5. వివరములకు అనుబంధము IV పాండ్యరాజుల వంశావళి.

నర్థము వచ్చు ద్విపద వ్రాసియున్నది. అట్లే తృతీయాశ్వాసము నుండి పంచమాశ్వాసము వరకు ఆశ్వాస ప్రారంభమున మాత్రము పాండ్యరాజుల పేర్లు వ్రాసియున్నవి. ఆ తరువాతి ఆ శ్వాసములకు లేవు.

ఉదా.కు పదునొకండవ లీల ప్రారంభమున

"పరగ నా సౌందర్య పాండ్య భూవిభుడు

చిరకీర్తి రాజ్యమ్ము సేయుచునుండ"[1].

పంచమాశ్వాస ప్రారంభమున--

"మధురాపురమ్మున మఱి దేవపాండి

ధర్మమ్ము దప్పక ధరయేలుచుండ[2]".

హాలాస్యమాహాత్మ్యము పురాణము గావున పురాణలక్షణమైన వంశము, వంశాను చరితములను లక్షణముల్[3] పాండ్య రాజుల ఎడ పాటించి యా రాజుల పేర్లు వ్రాసి యున్నవి. చొక్కనాథ చరిత్రము కావ్యముగావున ఈ నియమము నంతగా పాటించలేదు.

పై స్థూల పరిశీలనను బట్టి చొక్కనాథ చరిత్రయనునీ కావ్య రచనా ప్రణాళిక హాలాస్యమాహాత్మ్య పురాణ రచనా ప్రణాళికకకు యధాతధముగా కాక మార్పులతో స్వతంత్రముగా నుండుట వలనను, పురాణ దృష్టికి బదులుగా కావ్య దృష్టితో ననువదించి యున్నందునను, ఈ కావ్యము మూలమునకు యధాతధానువాదము కాదని యధేచ్ఛాను వాదమని తెలియుచున్నది.

## అనువాద విధానము - సూక్ష్మ పరిశీలనము

### ప్రథమాశ్వాసము - అవతారిక

(1) హాలాస్యమాహాత్మ్యమున 179 శ్లో.లలో వర్ణించియున్న ప్రశ్న విధియను ప్రథమాధ్యాయమును తిరువేంగళకవి చొక్కనాథ చరిత్రమున కథానుక్రమణికలో 115 ద్విపదలు + ఒక చరణములో వర్ణించినాడు.

(2) హాలాస్యమాహాత్మ్య పురాణమున రెండవ అధ్యాయమున 145 శ్లో.లలో నున్న క్షేత్ర తీర్థ మహిమాను వర్ణనమును చొక్కనాథ చరిత్రమున తెనిగించలేదు. కవి దీనిని పూర్తిగా వదలి వేసినాడు.

(3) మూలమునందు తృతీయాధ్యాయమున 66 శ్లో.లలో నున్న లింగమహిమాను వర్ణనము చొక్కనాథ చరిత్రలో లేదు.

(4) హాలాస్యమాహాత్మ్య మందు తృతీయాధ్యాయమున ఏబది యైదు (55) శ్లో.లలో నున్న సంగ్రహ చౌషష్టిలీలలు చొక్కనాథ చరిత్రమున డెబ్బది నాలుగు (74) ద్విపదలలో వ్రాసినాడు.[4]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 73. 2. చొక్కనాథ చరిత్ర. పుట 137.
3. "సర్గశ్చప్రతిసర్గశ్చ వంశో మన్వంతరానిచ
వంశానుచరితం చేతి పురాణమ్ పఞ్చ లక్షణమ్"
4. చొక్కనాథ చరిత్ర. పుట 12 నుండి 17 వరకు.

## ప్రథమాశ్వాసము - మొదటి లీల

(1) తిరువేంగళ కవి, హాలాస్యమాహాత్మ్యమందలి 'వృత్రాసురవధ' యను నాలుగవ అధ్యాయము, 'మహేంద్రానుగ్రహ'మను అయిదవ అధ్యాయము లందలి ప్రథమ లీలను చొక్కనాథ చరిత్రమున ప్రథమాశ్వాసమున మొదటి లీలగా ననువదించినాడు.

(2) నాలుగవ అధ్యాయమునందు ఒక వంద ఆరు శ్లోకములలో నున్న కథను చొక్కనాథ చరిత్రమున కేవలము పదునేడుద్విపదలకు కుదించినాడు. ఐదవ అధ్యాయమునందు ఒక వంద ఇరువది యొక్క శ్లో.లలో నున్న మహేంద్రాను గ్రహ విషయమును ఈ కావ్యమున ఒక వందడెబ్బ యైదు ద్విపదలలో విపులముగ రమణీయముగా వర్ణించినాడు.

(3) మూలమున తిలోత్తమ నాట్యము తిలకించుచున్న ఇంద్రుడు దేవగురువు రాకను గమనించి కూడా అతని సమ్మానింపకుండుట - ఆ దోషము వలన ఇంద్రునకు బలముక్ దరిగి పోయి దానవులచే నేడింపబడుట - ఇంద్రుడు బ్రహ్మ శరణుజొచ్చుట ఆయన గురుద్రోహము పాపమని చెప్పి త్వష్టపుత్రుడైన విశ్వరూపునిగురువుగా నిచ్చుట - విశ్వరూపుడు యజ్ఞ భాగమును రాక్షసులకుపంచుట. ఇంద్రుడు కోపించి యాతని జంపుట - బ్రహ్మహత్యా దోషము అంటుకొని బాధించుట - మునులు ఈ పాపమును జల, భూ, స్త్రీ వృక్షములకు పంచుట - విశ్వరూపుని తండ్రి త్వష్ట పగదీర్చుకొనుటకై తిలాజ్యములతో హవిస్సును ప్రేల్చి యాగుల వృత్రాసురు డుద్భవించుట - వృత్రాసురుడు ఇంద్రుని ఓడించుట ఇంద్రుడు బ్రహ్మాది దేవతలతో కలసి విష్ణువును దర్శించ ఆయన యానతి ప్రకారము దధీచి వెన్నెముకను వజ్రాయుధముగా జేసికొని వృత్రాసురుని జంపుట - వృత్రహత్యాదోషము దాటిల్లుట - రుద్ర లోకమున బృహస్పతిని గలసి సేవించుట శివసేవనము బ్రహ్మహత్యా దోషము దొలగిపోవునని తెలుపుట - కైలాసాది శివక్షేత్ర సందర్శనార్థము ఇంద్రుడు గురుననుజ్ఞ వడసి వెడలుట - కలదు.

చొక్కనాథ చరిత్రమున వృత్రాసుర జన్మ వృత్తాంతము. ఆదిగా గల పై కథ యంతయును లేదు. ఇందుకేవలము వృత్రాసురుడు ఇంద్రునితో తలపడి మడయుట మాత్రమే కలదు. దధీచి వెన్నెముకను వజ్రాయుధముగా జేసికొనిన విషయము కూడా ఇందు లేదు. ఇట 'ఘన వజ్రహతిచేత్త[1]' అని మాత్రమే యున్నది. త్వష్ట పుత్రుడైన విశ్వరూపుని జంపుట వలన కలిగిన బ్రహ్మహత్యాదోష విభజనము ఇందు వృత్రహత్యా దోష విభజనముగా మార్చినాడు. ఇవి కథలో జరిగిన ప్రధానమైన మార్పులు.

(4) మూలమునందలి మహేంద్రానుగ్రహ విషయమును చొక్కనాథ చరిత్రమున వనవర్ణన, వేటవర్ణన - ఇత్యాది వర్ణనలతో విపులముగను, రమణీయముగాను రచించినాడు.

49630

1. చొక్కనాథ చరిత్ర. పుట 17.

## ప్రథమా శ్వాసము – రెండవ లీల

(1) హాలాస్యమాహాత్మ్యమున ఈ రెండవ లీల ఐరావతశాపవిమోచనము అను ఆరవ అధ్యాయమున నున్నది. దీనిని చొక్కనాథ చరిత్రమున ప్రథమాశ్వాసమున రెండవ లీలగా ననువదించినాడు.

(2) మూలమున డెబ్బది ఏడు శ్లోకములలో నున్న ఈ లీలను చొక్కనాథ చరిత్రమున ఎనుబది మూడు ద్విపదలలో కవి వర్ణించినాడు.

(3) మూలమునందు కథాప్రారంభమున ఇంద్రుడు జంభాసుర సంహారానంతరము దేవలోకమునకు రాగా దేవతలు మునులు ఆయన నభినందించుచు కానుకలిచ్చుటకు వచ్చిరి. దుర్వాసుడు కూడా శివప్రసాదమైన పుష్పమునొక దానిని కానుకగా తీసికొని వచ్చెను గాన ఈ కథ దేవలోకమున అమరావతీ నగరమునందు జరిగినదని తెలియుచున్నది.

చొక్కనాథ చరిత్రమున సురనాథుడు కదంబకాంతారమునకు వేటకై వచ్చి హేమపద్మాకరమున తీర్థమాడి హాలాస్యేశ్వరుని దర్శించుకొని ఒక వేదిక నిర్మించుకొని దానిపై గూర్చుండి కొలువు తీరియుండగా దుర్వాసుడు వచ్చినట్లు కలదు. కాని కథలో మధ్య భాగమున ఐరావతము అవనికి దిగినట్లు, శాపవిమోచనానంతరము దేవలోకమున కేగినట్లున్నది. కాన కవి స్థల విషయమున స్వతంత్రించి ఇట్లు మార్చియుండవచ్చును.

(4) మూలమున దుర్వాసుడు దేవలోకమునకు బోవుటకు ముందు కాశియందు కామేశ్వర లింగమును నొకలింగమును ప్రతిష్ఠాపించి పూజించి శివుని సంతోషపఱచగా ఆ దేవుని శిరమునుండి ఒక 'మహోత్పలము' రాలిపడినట్లు[1] దానినే దెచ్చి ఇంద్రునకిచ్చినట్లు కలదు.

చొక్కనాథ చరిత్రమున లింగ ప్రతిష్ఠాపన వృత్తాంతము లేదు – దుర్వాసుడు మహోత్పలమును దెచ్చినట్లుగాక దండనే తెచ్చినట్లు కవి మార్పు చేసినాడు. ఈ మార్పు యుక్తముగా నున్నది. ఎందుకనగా తరువాతి కథలో ఐరావతము దానిని క్రింద పడవేసి త్రొక్కినట్లు, దానినే దుర్వాసుడు మరల గ్రహించినట్లు ఉన్నది. ఒకే ఒక పుష్పమైనచో గజము త్రొక్కిడికి దానిరేకులు కూడా మిగులవు కదా! అందువలన దానిని తిరువేంగళ కవి హారముగా మార్చినాడు.

(5) మూలమున ఇంద్రుడు దుర్వాసుడిచ్చిన మహోత్పలమును విజయగర్వమున ఒక చేతితో గ్రహించి ఐరావతముపై వేసినట్లున్నది. చొక్కనాథ చరిత్రలో దుర్వాసుని సన్మానించిన అనంతరము ఐరావతము శిరమున ధరించినట్లు కలదు. దీనిని బట్టి మూలమున ఇంద్రుడు గర్విగను తెనుగున వినయ శీలిగను కనుపించుచున్నాడు. తిరువేంగళ కవి దుర్వాసుడు శపించిన సందర్భమున మాత్రము ఇంద్రుని అహంకారి యనియే వర్ణించినాడు.

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 35. 11 నుండి 13 శ్లోకములు.

(6) హాలాస్యమాహాత్మ్యమున ఇంద్రుడు దుర్వాసుడిచ్చిన మహోత్పలమును ఐరావతము శిరముపై నుంచగా, అది దాని తల విదిలించగా, ఆ పూవు క్రింద బడినట్లు తదుపరి దానిని త్రొక్కివేసినట్లు వ్రాసియున్నది.

చొక్కనాథ చరిత్రలో కవి ఈ విషయమున చిన్న మార్పు చేసినాడు. ఐరావతము స్వభావ వశమున తల విదిలించినట్లుగాక పూలకు పరిమళము నాపాదించి, ఆ పరిమళము గ్రోలుటకు తుమ్మెద వచ్చి మ్రోయగా అధ్వనికి ఏనుగు తలవిదిలించినట్లు మార్చినాడు. ఈ మార్పు సరసముగానుండుట యే కాక ఐరావతము సాధువని సమర్థింపబడినది.

(7) సంస్కృత మూలమున దుర్వాసుడు ఇంద్రుని భవిష్యమున నీ తల తెగిపడునని శపించినట్లు మాత్రమే కలదు. తెనుగు అనువాదమున అట్లుగాక పాండ్యరాజు చక్రానిచే నీ తల వెయ్యి వ్రక్కలగునని శపించినట్లున్నది.

మూలమునను, తెనుగునను ఇంద్రునకు ఐరావతమునకు శాప విమోచనము ఒకే రీతిగా చెప్పియున్నది.

(8) మూల గ్రంథమునందును, అనువాద గ్రంథమునందును కేవలము ఐరావత శాప విమోచన వృత్తాంతమే ఈ లీల యందున్నది. కాని ఇంద్రుని శాప విమోచన వృత్తాంతము ఇందులేదు. దానికి కారణము ఈ లీలకు ఐరావత శాపవిమోచనమని పేరిడుటయే.

## ద్వితీయాశ్వాసము – మూడవలీల

చొక్కనాథ చరిత్రమునందలి మూడవ లీల మూలమున లేదు.

## ద్వితీయాశ్వాసము – నాలుగవలీల

(1) హాలాస్యమాహాత్మ్యమున 'వైశ్య కదంబ విపినపురీనిర్మాణం' అను ఏడవ అధ్యాయమున వర్ణింపబడిన మూడవ లీల చొక్కనాథ చరిత్రమున ద్వితీయాశ్వాసమున నాలుగవ లీలగా ననువదితము.

(2) సంస్కృతమున ఎనుబది మూడు శ్లోకములలో నున్న కథ తెనుగున ఒక వంద నలుబది నాలుగు ద్విపదలలో నున్నది.

(3) మూలమున లీలను ప్రారంభించునపుడు ఏడు శ్లో.లలో[1] చెప్పిన పూర్వ కథాపరిచయమును అనువాదమును కవి వదలి వేసినాడు.

(4) సంస్కృతమున కదంబకాంతారమును పురముగా జేసిన వాడు కులశేఖర పాండ్యుడు. తెలుగున కులశేఖర పాండ్యుని కుమారుడైన మలయ ధ్వజపాండ్యుడు.

(5) హాలా స్యమాహాత్మ్యమున లీలాంతమున 8 శ్లో.లలో (75 నుండి 83 వరకు)[2] కులశేఖర పాండ్యునకు మలయ ధ్వజపాండ్యుడు జన్మించిన వృత్తాంతమున్నది. చొక్కనాథ చరిత్రమున కవి దీనిని వదలి వేసినాడు.

1. హాలాస్య మాహాత్మ్యము. పుట 37, 38లు.
2 హాలాస్యమాహాత్మ్యము. పుట 41.

(6) సూర్యోదయ, సూర్యాస్తమయ, కదంబకాంతారనగర నిర్మాణ, స్వప్న వృత్తాంతాది వర్ణనలు మూలముకన్న తెలుగున విపులముగా పెరిగినవి.

(7) కులశేఖరునకు కలలో కన్పించినది సిద్ధ రూపములో నున్న శివుడు - మలయధ్వజునకు కన్పించినది చొక్కనాథుడే.

(8) వైశ్యుడు భయంకరమైన కదంబకాంతారమున హాలాస్యనాథాలయమును దర్శించి కుల శేఖర పాండ్యునకు అచ్చటి వింతలను మాత్రమే వివరించినాడు. కాని చొక్కనాథ చరిత్రమున మలయధ్వజునకు అచటి వింతలను వివరించుటతో పాటు రాజధానికది అనువైన ప్రదేశమని నగరమును నిర్మించి రాజధానిగా జేసికొమ్మని విన్నవించుకొనినాడు.

(9) సిద్ధరూపుడైన శివుడు కులశేఖర పాండ్యునకు కదంబకాంతారమును నగరముగా జేయుమని యాజ్ఞాపించినాడు. మలయధ్వజపాండ్యునకు చొక్కనాథుడు నగరమును నిర్మించి రాజధానిగా జేసికొని పుత్ర పౌత్రాభివృద్ధిగా నేలుకొమ్మని యానతిచ్చినాడు. ఇవి ఈ లీల యందుగల ప్రధానమైన మార్పులు.

## ద్వితీయాశ్వాసము - ఐదవలీల

(1) హాలాస్యమాహాత్మ్యమున ఎనిమిదవ అధ్యాయమునగల తటాతక జననమును నాలుగవ లీలను తిరువేంగళకవి చొక్కనాథ చరిత్రమున ద్వితీయాశ్వాసమున ఐదవ లీలగా రచించినాడు.

(2) మూలమున ఈ లీల 121 శ్లో. లలో కథితము. అనువాదమున కేవలము 100 ద్విపదలలో రచితము.

(3) 121 శ్లో. లలో కథ కేవలము 57 శ్లో. లలోనేయున్నది. తక్కిన 64 శ్లో. లలో కాంచనమాలా పూర్వజన్మ వృత్తాంతము కలదు. తెనుగున ఈ భాగమును కవి వదలివేసినాడు.

(4) ఈ లీల సంస్కృతమునకు ప్రధానాఖ్యానుసరణము మాత్రమే తక్కినది కవి వర్ణనాచాతుర్యము.

(5) హాలాస్యమాహాత్మ్యమున మునులు తటాతక జన్మవృత్తాంతము విని "పూర్వము దాక్షాయణీదేవి తండ్రిచే నవమానితురాలై హైమవతిగా జన్మించినట్లు మీనాక్షీదేవి తటాతకగా జననమొందుటకు గల కారణమేమి? యని అగస్త్యుని ప్రశ్నింపగా అతడు వారికి కాంచనమాలా పూర్వ జన్మవృత్తాంతము దెలుపును. ఈ విషయము చొక్కనాథ చరిత్రమున "మూలమునందలి కథలను తాను సంక్షేపముగ రచింతునను" తన నియమమునకు ఆటంకము కలుగునను తలంపుతో కవి వదలి వేసినాడు.

(6) మూలమున మలయధ్వజుడు సంతానార్థియై సతీసమేతముగా సుందరేశ్వరుని సేవించి తొంబది తొమ్మిది అశ్వమేధయాగములు, అనంతరము పుత్రకామేష్టిని సలుపును. తెనుగున నిది లేదు.

(7) తటాతక మూడు చన్నులు గలిగియుండుట, మగనిజూడగనే ఎక్కుడు చన్ను తొలగిపోవుట మూలమునందును, తెలుగు గ్రంథమునందును సమానము.

(8) తటాతక జన్మవృత్తాంతము తెనుగున మూలమునకు భిన్నముగానున్నది. మూలమున తటాతక మీనాక్షి యనుగ్రహముతో కాంచనమాలా మలయధ్వజ దంపతులకు మూడు సంవత్సరముల బాలికగా లభించినది. తెనుగున కాంచన మాలా గర్భమున మలయధ్వజుని వలన హాలాస్యేశ్వరుని అనుగ్రహమున జన్మించినది.

(9) హాలాస్య మాహాత్మ్యమున కథ పురాణ సరళిలో సాగినది. చొక్కనాథ చరిత్రమున ఆఖ్యానము కావ్య సరణిలో నడచినది.

## ద్వితీయాశ్వాసము – ఆరవలీల

(1) హాలాస్యమాహాత్మ్యమున తొమ్మిదవ అధ్యాయమున గల తటాతక కళ్యాణమను ఐదవలీల చొక్కనాథ చరిత్రమున ద్వితాయాశ్వాసమున ఆరవలీలగా అనువదించియున్నది..

(2) మూలమున ఈ లీల 124 శ్లో. లలో వర్ణితము. తెనుగున 206 ద్విపదలలో వర్ణితము.

(3) మూలమునకు అనువాదమునకు 'తటాతక ఎక్కుడుచన్నుఁ దొలగుట' యను ప్రధాన విషయమున మార్పులేదు. కాని కథనమున కొన్ని చిన్న చిన్న మార్పులున్నవి. అవి. **ఒకటి:–** తటాతక తల్లి కాంచనమాల యుక్తవయస్కురాలైన తన కూతురునకు భర్త ఎన్నడు లభించునేయని, ఎక్కుడు చన్ను ఎప్పుడు తొలగునేయని విచారించిన ఒక శ్లోకము మూలమునందు కథా ప్రారంభమున గలదు[1]. తెనుగున ఇది కథాగతి కొదగదని భావించి తొలగించినాడు.

**రెండు:–** మూలమున తటాతక దిగ్విజయ యాత్ర జేయుచు ఇంద్రాది అష్ట దిక్పాలకులను జయించినట్లున్నది. తెనుగున అష్ట దిక్పాలురను గాక చప్పన్న దేశ రాజన్యులను జయించినట్లున్నది.

**మూడు:–** మూలమునకు భిన్నముగా ఆంధ్ర గ్రంథమున దిగ్విజయ యాత్ర అనంతరము తటాతక కైలాసగిరినుండి తిరిగివచ్చుచు పుణ్యక్షేత్రములను తీర్థములను దర్శించినదను వర్ణన మూడు పుటలలో నున్నది.[2]

**నాలుగు:–** తటాతక కళ్యాణాదివర్ణనలు మూలమునను సరించి కాక తెనుగున దేశీయతను సంతరించుకొని యున్నవి.

## ద్వితీయాశ్వాసము – ఏడవ లీల

(1) హాలాస్యమాహాత్మ్యమునందలి పదియవ అధ్యాయములోని 'నృత్తదర్శనం' అను ఆరవలీల చొక్కనాథ చరిత్రమున ద్వితీయాశ్వాసమున ఏడవలీలగా రూపొందినది.

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 47. శ్లో. నెం. 7.
2. చొక్కనాథ చరిత్ర. పుట 55, 56, 57 లు.

(2) మూలమున ఈ లీల 101 శ్లో. లలో ప్రవిస్తరముగా వర్ణించి యున్నది. తెనుగున ఈ లీల సంక్షిప్తముగా నలువది (40) ద్విపదలలో రూపుదిద్దుకున్నది..

(3) సంస్కృతముననను, తెనుగుననను ప్రధానేతివృత్తము పతంజలి మునికి పరమశివుడు నాట్యముఁ జూపుటయే, కాని తెనుగున ఇది కొంచము మార్పుతో నున్నది. మూలమున తటాతక సుందరేశ్వరుల వివాహానంతరం హాలాస్యేశ్వరుడు ఆహూతులను భోజనమునకు సిద్ధము కమ్మనగా పతంజలి యనుముని 'నాట్యము చూడనిదే భోజనము చేయను. ఇది నాకు నియమము. కింకర్తవ్యమ్' అని యనుటతో శివుడు నృత్యము సలిపినట్లున్నది. అనువాదమున పతంజలి ముని పొన్నాంబలమును దర్శించనిదే భోజనముచేయనని అనినాడు. అనుటచే శివుడాతనికి పొన్నాంబలమును జూపి దాని ఎదుట పెండెములను గల్పించి నృత్యము సలిపినట్లు మార్చియున్నది.

"వేధేచ్యుతేంద్రాది విబుధులు మునులు
బోధింపనా మునిపుంగవు నెదుట[1]" నృత్యమును ప్రదర్శించినాడు.

(4) మూలమున నాట్యము సలుపుటకు ముందు శివుడు, మునికి ద్వాదశ శివస్థానము లందు హాలాస్యక్షేత్రము పావనమని తెలుపుచు 16వ శ్లో నుండి 40వ శ్లో వరకు ఇరువది నాలుగు శ్లోలలో వర్ణితము[2] తెనుగున కవి దీనిని వదలినాడు.

(5) నాట్యవర్ణనము మూలమున 41 వ శ్లో. నుండి 53వ శ్లో. వరకు పండ్రెండు శ్లో.లలోవర్ణించి యున్నది.[3] తెనుగున ననుపదించక వదలినాడు.

(6) నాట్యదర్శనానంతరము మూలమున శివుని పతంజలి ముని పదిశ్లో.లలో (54 నుండి 64 వరకు) స్తుతించినాడు.[4] తెనుగున నిది ఒకటి రెండు ద్విపదలలో ముగిసినది.

(7) నాట్యానంతరము పతంజలి హాలాస్యనాధుల సంభాషణ మూలమున సుదీర్ఘముగ నున్నది. తెనుగున దీనికి మారుగా వివాహమునకు వచ్చినవారు ఎక్కడివారక్కడికి బోయినట్లు కలదు. భోజనాదికములు మూలమున తరువాతి లీల మొదట నున్నవి.

(8) ఫలశ్రుతి మూలమున గలదు. తెనుగున లేదు.

## ద్వితీయా శ్వాసము - ఎనిమిదవ లీల

(1) తిరువేంగళ కవి హాలాస్యమాహాత్మ్యమున 11, 12 అధ్యాయములలో 7, 8 లీలలలో వర్ణింపబడిన కుండోదర భుక్తి, అన్నగర్తాపగానయనములను చొక్కనాధ చరిత్రమున ద్వితీయా శ్వాసమున ఎనిమిదవ లీలగా రచించినాడు.

(2) సంస్కృత గ్రంథమున 'కుండోదర భుక్తి' యను ఏడవ లీల 60 శ్లో.లలో,

---

1. చొక్కనాధ చరిత్రము. పుట 64.
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 53, 54, 55లు.
3 హాలాస్యమాహాత్మ్యము. పుట 55.
4. హాలాస్యమాహాత్మ్యము. పుట 55, 56లు.

'అన్నగర్తాపగానయనం' అను ఎనిమిదవ లీల 77. శ్లో.లలోను ఉన్నది. తెనుగు గ్రంథమున ఈ రెండు కలసి ఒకే లీలగా కేవలము 63 ద్విపదలలో రచించి యున్నది.

(3) మూలమున దాదాపు పది శ్లో.లలో పతంజల్యాది మునులు భోజనానంతరము తాంబూలాదులను గైకొని వెడలిన విషయమున్నది. దీనిని కవి చొక్కనాథ చరిత్రమున 7 వ లీల చివరలోనే ముగించినాడు.

(4) మూలమునందు కుండోదర భుక్తి 50 శ్లోకములలో వర్ణించి 7 వ లీల పూర్తిగావించి యున్నది.[1] తెనుగు అనువాదమున కేవలము 22 ద్విపదలలోనే ముగిసినది. ఇంతటితో లీలను పూర్తిచేయుట కవికి నచ్చలేదు. భోజనానంతరము ఆ భోజనము సరిపోలేదని కుండోదరుడు శివుని వేడగా అన్నకూపములను గల్పించుట, తరువాత దాహము దీర్చుటకై వైఘానదిని రప్పించుట (మూలమున గంగానదిని రప్పించుట) కలదు. ఈ విషయము నంతయు నొకే లీలలో పూర్తిచేసి యాశ్వాసమును ముగింపవలెనని కవి తలంపు. అందుకే కవి కుండోదరుని భుక్తితో నాగక అన్నగర్తాపగానయనం అను రెండింటిని కలిపి ఒకే లీలలో చెప్పినాడు. మూలమున అన్న గర్తాపగానయనం (గంగానదిని రప్పించుట) 77 శ్లో.లలో వర్ణితము.[2] ఆంధ్రమున 34 ద్విపదలలో ననువదితము.

(5) మూలగ్రంథమున కుండోదరుడు శివుని అష్టకమున స్తుతించెను.[3] అనువాద గ్రంథముననిది తొలగింపబడినది.

(6) మూలమున గంగానదిని రప్పించుట 26వ శ్లో. నుండి 49వ శ్లో. వరకు ఇరువది మూడు శ్లో.లలో వర్ణితము.[4] తెనుగున వైఘానది పదునాఱు ద్విపదలలో వర్ణితము.[5]

## తృతీయా శ్వాసము – తొమ్మిదవ లీల

(1) హాలాస్య మాహాత్మ్యమున పదుమూడవ అధ్యాయమున వర్ణింపబడిన సప్తసాగరావిర్భావమను తొమ్మిదవలీల చొక్కనాథ చరిత్రమున తృతీయా శ్వాసమున గల తొమ్మిదవ లీల.

(2) సంస్కృతమున ఈ లీల 58 శ్లో.లలో నున్నది. తెనుగున ఇది ముచ్చటగా ముప్పది ద్విపదలలో ముగిసినది.

(3) ఈ లీల యందలి కథ మూలమునకు నామమాత్రానుసరణము.

(4) చొక్కనాథ చరిత్రమున తటాతక తన విభునితో

"కఱకంఠ! మా తల్లి ఘనవార్ధియందు

ననువందగా స్నానమాడంగవలయు"[6] నని విన్నవించినది. మూలమున ఈ

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 58, 59, 60, 61లు.
2. హాలాస్యమాహాత్మ్యము. పుటలు 61 నుండి 65 వరకు.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 63, 64లు. 56వ శ్లో. నుండి 63వ శ్లో. వరకు.
4. హాలాస్యమాహాత్మ్యము. పుట 62, 63లు. 5. చొక్కనాథ చరిత్రము. పుట 68.
6. చొక్కనాథ చరిత్రము. పుట 70.

విన్నపమునకు ముందు తపోవృత్తిలోనున్న కాంచనమాల వద్దకు గౌతముడను ముని వచ్చును. సుందరేశ్వరుని దర్శించుటకు వచ్చు మునులు కాంచనమాల వద్దకు వచ్చి పురాణమును వినిపించి వెడలుట సంప్రదాయము. గౌతముడు కూడా అట్లే రాగా ఆతని కాంచనమాల "సద్యః శ్రేయస్కరాన్ ధర్మాన్ కథయాద్యమునీశ్వర[1]" అని యడిగినది. అందుకు గౌతముడు "తీర్థయాత్రాతి మహతీ సర్వధర్మోత్తమోత్తమా[2]" అనియు "సర్వేశు పుణ్యతీర్థేషు సాగర స్నానముత్తమమ్[3]" అనియు తెలిపి శివలోకమునకు బోయిన నీ భర్తతో గలసి తీర్థమాడుమని చెప్పును. ఈ వృత్తాంతమంతయు హాలాస్య పురాణమున దాదాపు ముప్పది శ్లోకములలో నున్నది. తిరువేంగళ కవి దీనిని వదలిపెట్టినాడు. దీనికి ముందు పది పండ్రెండు శ్లోకములలో సౌందర్య పాండ్యుని రాజ్యపాలనాది వర్ణన గలదు. దానిని కూడ చొక్కనాథ చరిత్రమున తెనిగించలేదు. ముని వెడలిన తరువాత కాంచనమాల తన కుమార్తెయగు తటాతకకు తనకోరికను దెలుపును. ఈ విషయమును కూడా కవి అనవసరమని భావించినాడు. చొక్కనాథుని లీలను దెలుపుట మాత్రమే ప్రధానమని భావించినట్లు కథను పరిశీలించిన దెలియుచున్నది.

(5) తరువాతి కథలో మూలమున తటాతక విన్నపమును శివుడు వెంటనే విని యామెనవలోకించును. "ఈశ్వరః తద్వచః శృత్వానిరీక్షాస్యా ముఖంతతః[4]" చొక్కనాథ చరిత్రమున శివుడు

"వినియును విననట్టి విధముననుండ
వనజాక్షి యతని భావముగానలేక
ఖిన్నురాలగుచు జెక్కిట జెయ్యిజేర్చి[5]"కొని అలిగి యుండ ఆమె యలుక దీర్చుచు తదుపరి జలనిధులేడింటిని రప్పించును.

మూలమున "మీ తల్లి ఒక వార్ధిలో స్నానమాడదలచినది గదా నేను సప్తవార్ధులను రప్పింతునని" యనుచు వార్ధులను రప్పించును.

మూలముకన్న అనువాదమున సరసతయున్నది. ఇందు కవి మానవ హృదయము నావిష్కరించినాడు.

(6) సప్త సముద్రములను రప్పించి సరసిలో నుంచుట మూలమునందును అనువాదము నందును ఒకే రీతిగా నున్నది.

(7) చొక్కనాథ చరిత్రమున వార్ధులను రప్పించిన అనంతరము తటాతక శివుని స్తుతించినది. మూలమున నిది లేదు.

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 66. 19వ శ్లోకము.
2 హాలాస్యమాహాత్మ్యము. పుట 66. 32వ శ్లోకము.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 67, 38వ శ్లోకము.
4. హాలాస్యమాహాత్మ్యము. పుట 67 శ్లో. 44
5. చొక్కనాథ చరిత్రము. పుట 70

## తృతీయా శ్వాసము – పదియవ లీల

(1) హాలాస్య మాహాత్మ్యమున పదునాలుగవ అధ్యాయమున 'మలయధ్వజ దర్శనం' అను పేరగల పదియవ లీల చొక్కనాథ చరిత్రమున తృతీయాశ్వాసమున పదియవ లీలగా ననువదించియున్నది.

(2) సంస్కృతమున 51 శ్లో.లలోనున్న ఈ లీల తెనుగున 32 ద్విపదలలో నున్నది.

(3) కథ మూలముననుసరించి యుండుటయేగాక మూలమునకు మెఱుగులు దిద్దినట్లున్నది.

ఒకటి : మూలమున శివుడు సప్తసాగరములను సరసిలో నుండజేసిన తదుపరి తటాతకతల్లిని స్నానమాడుమని చెప్పగా నామె సముద్ర స్నాన నియమమును దెలిసికొనుటకై పౌరాణికులను పిలిపించినది. తొమ్మిదవ లీలలోనే గౌతముడు శివలోకగతుడైన నీ భర్తతో గలసి తీర్థమాడుమని చెప్పినాడు కావున మరల పౌరాణికుల బిలువ వలసిన యవసరము లేదని ఎంచి కవి గౌతముడు చెప్పిన ఆ వాక్యమును తొమ్మిదవ లీలలో ననువదించక ఈ లీలలో కాంచనమాల చేత సద్బుధులు చెప్పుదురని మార్చి చెప్పించినాడు.

మూలమున పౌరాణికులు "ఏతంతు రసహాయానే సాగరేస్నాతు మర్హతి। సహాత్మజేన భర్త్రావాస్నాతుమర్హతి నాన్యథా। సర్వభావేతు గోవత్సంస్నాయాదాదాయ సాగరే[1]" అని చెప్పినారు. దీనిని చొక్కనాథ చరిత్రమున తిరువేంగళకవి "పతి గూడి స్నానమాడుట ఉత్తమము, సుతునితో నాడుట మధ్యమము, ఆవుదూడను గూడియాడుట అధమ[2]"మని స్థాయులను కూడా నిర్ణయించినాడు.

రెండు; మూలమున మలయధ్వజభూపతి శివలోకము నుండి భూలోకమునకు సుందరేశ్వరుని తలపుతో వచ్చి కేవలము ప్రణామము మాత్రమే చేసినట్లు కలదు. తెనుగున నింతటితో నాగక సుందరేశ్వరుని స్తుతించి వినతుడై యాతని అనతి కొరకు నిలచినట్లున్నది. దీని వలన మూలమునకంటె తెనుగున భక్తిభావము ఇనుమడించినది.

మూడు; మూలగ్రంథమున మలయధ్వజుడు, కాంచనమాల స్నానమాచరించిన యనంతరము శివుడు వారికి సారూప్యమిచ్చినాడు. తెనుగు గ్రంథమున సుందరేశ్వరుడు తటాతకతో "నీవును మీ తల్లిదండ్రియు" స్నానమాడి రమ్మని పంపగా ముగ్గురును స్నానమాడి తిరిగి వచ్చిన యనంతరము కాంచన మాలా మలయధ్వజ దంపతులకు కాయముతోనే సాలోక్య పదవి నొందించినాడు. అందువలన పై మూడు మార్పులు మూలమునకు మెఱుగులు దిద్దినట్లున్నవి.

(4) తటాతక తన తల్లితండ్రులను కరుణించినందులకు సౌందర్యుని స్తుతించినది ఇది మూలముననుఁ అనువాదముననుఁ గలదు.

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 69. 19.20 వ శ్లో.లు.
2. చొక్కనాథ చరిత్రము. పుట 72.

## తృతీయా శ్వాసము – పదునొకండవ లీల

(1) హాలాస్య మాహాత్మ్యమున పదునైదవ అధ్యాయమున పదునొకండవ లీలయగు 'ఉగ్రజననం' చొక్కనాధ చరిత్రమున తృతీయా శ్వాసమున పదునొకండవ లీల.

(2) మూలమున ఈ లీల 55 శ్లో.లలో నున్నది. తెనుగున ఈ లీల 73 ద్విపదలలో వర్ణితము.

(3) ఇది మూలమునకు నామమాత్రానుసరణము. తటాతక గర్భవతియగుట, మగ శిశువును గనుట, వానికి ఉగ్రుడని నామకరణమొనర్చుట, జాతకర్మాదుల నుండి మొదలుకొని పట్టాభిషిక్తుడగు వరకు గల కథయంతయు మూలమును నామమాత్రముగా ననుసరించి స్వతంత్ర వర్ణనలతో పెంచి వ్రాసినాడు.

(4) తటాతక గర్భవతియైనదని మాత్రమే మూలమున నుండగా కవి తెనుగున గర్భచిహ్నాలను దేచుట నుండి మొదలుకొని కుమారుని జననము వరకు పండ్రెండు ద్విపదలలో అలంకారికముగా రమణీయముగా వర్ణించినాడు[1] ఇందు పుంసవన సీమంతాదులు గూడనున్నవి. మూలమున లేవు.

(5) చొక్కనాధ చరిత్రమున పుత్రుడు జన్మించిన యనంతరము జాతసూతకములు దీర్చి, నామకరణ మొనర్చి, చౌలోపనయనము చేసిన తదుపరి సాముద్రిక లక్షణాన్వితు లేతెంచి నఖశిఖాద్యంతము పరికించి కొన్ని సాముద్రిక లక్షణములు తెలుపుదురు. వీనిని కవి దాదాపు ఇరువది యైదు ద్విపదలలో చెప్పినాడు.[2] మూలమున 42వ శ్లో. నుండి 50వ శ్లో. వరకు 8 శ్లో.లలో ఈ సాముద్రిక లక్షణములున్నవి.[3] కాని ఇవి యధాతధానువాదము కాదు.

(6) మూలమునకు భిన్నముగా తెనుగున ఒక చిన్న మార్పు కలదు. ఉగ్రునకు పట్టాభిషేక మొనర్చుటకు ముందు తిరువేంగళకవి "బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులకు వరుసగా శర్మ, వర్మ, గుప్త, దాసులని యుండవలయునని గోచర్ల వర్మ యనుపేరుతో పట్టాభిషేక మొనరించి సింహాసనాసీనుని జేయించినాడు.[4] ఉగ్రునంశమున నుదయించిన కారణమున ఉగ్రపాండ్యుడను పేరు మంత్రులు నిశ్చయించినారని ముందు వ్రాసినందుననో, లేక ఉగ్రుడు గుణవాచకమును దెలుపు పేరనో కవి మరొక పేరును నిర్ణయించినాడు.

## తృతీయా శ్వాసము – పండ్రెండవ లీల

(1) హాలాస్యమాహాత్మ్యమున పదునారవ అధ్యాయమున పండ్రెండవ లీలలో చెప్పిన వలయాద్యాయుధ ప్రదాన విషయము చొక్కనాధ చరిత్రమున తృతీయా శ్వాసమున పండ్రెండవ లీలలో చెప్పియున్నది.

---

1. చొక్కనాధ చరిత్రము. పుట 74.
2. చొక్కనాధ చరిత్రము. పుట 75, 76.
3. హాలాస్య మాహాత్మ్యము. పుట 72, 73లు
4. చొక్కనాధ చరిత్ర. పుట 78.

(2) సంస్కృతమున ఈ లీల 79 శ్లో.లలో వర్ణితము. తెనుగున కూడా 79 ద్విపదలలోనే దీనిని చెప్పుట గమనార్హము.

(3) సంస్కృత గ్రంథములోని లీలరచన తెనుగు గ్రంథములోని లీల రచన దేనికదే స్వతంత్రము.

(4) తెనుగు అనువాదము మూలమునకు నామమాత్రముగా నున్నది.

(5) ఈ లీలయందు చెప్పబడిన ఉగ్రపాండ్యుని వివాహము మూలమునను తెనుగునను కలదు. చొక్కనాథ చరిత్రమున నిది దేశీయతా ముద్రను సంతరించుకొని రమణీయముగా వర్ణించియున్నది.[1]

(6) హాలాస్యమాహాత్మ్యమున ఉగ్ర పాండ్యునికి భార్యగాబోవు కాంతిమతి యను కన్య యొక్క సాముద్రిక లక్షణములు తెలుపబడినవి.[2] తెనుగున అనువదించలేదు.

(7) మూలమున ఉగ్రపాండ్యుని వివాహానంతరము కుమారునికి పట్టాభిషేక మొనర్చి సుందరేశ్వరుడు వలయాద్యాయుధ ప్రదాన మొనరించుట కలదు. చొక్కనాథ చరిత్రమున నిది ముందే లీల ప్రారంభముననే గలదు.[3]

(8) చొక్కనాథుడు చొక్కనాథ మూర్తిలో గలియుట అంగయకణ్ణెమ్మలో తటాతక లీనమగుట తెనుగనువాదమున నున్నది.[4] మూలమున ఇరువురును తమ తమ అర్ధశరీర భాగములలో విలీనమైనట్లున్నది.[5]

(9) వలయాద్యాయుధ ప్రదానము మూలమున 63వ శ్లో. నుండి 70వ శ్లో. వరకు 7 శ్లోకములలో నున్నది.[6] తెనుగున కూడ దీనిని 7 ద్విపదలలోనే అనువదించుట కవి అనువాద శిల్పనైపుణికి నిదర్శనము.

## తృతీయా శ్వాసము – పదుమూడవ లీల

(1) హాలాస్యమాహాత్మ్యమునందలి సముద్ర తాడనమను పేరుతో పదునేడవ అధ్యాయముననున్న ఈ పదుమూడవ లీలను చొక్కనాథ చరిత్రమున తృతీయాశ్వాసమున పదుమూడవ లీలగా కవి అనువదించినాడు.

(2) సంస్కృతమున ఈ లీల 54 శ్లో.లలో కథితము. తెనుగున ఈ లీల 49 ద్విపదలలో ననువదితము.

(3) చొక్కనాథ చరిత్రమున ఈ లీల యందలి కథ దాదాపు మూలము ననుసరించియే నడచినది.

---

1. చొక్కనాథ చరిత్రము. పుటలు 79-82 వరకు.
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 74, 75లు. 22వ శ్లో. నుండి 50వ శ్లో. వరకు.
3. చొక్కనాథ చరిత్రము. పుట 78.
4. చొక్కనాథ చరిత్రము. పుట 82.
5. హాలాస్యమాహాత్మ్యము. పుట 76.
6. హాలాస్యమాహాత్మ్యము. పుట 76.

(4) మూలమునందు లీల ప్రారంభమున పదునేనిమిది శ్లోకములలో ఉగ్రపాండ్యుని ప్రతాపవర్ణనాదికములున్నవి.[1] తెనుగు అనువాదమున కవి వీనిని వదలి పెట్టినాడు.

(5) మూలమునకు అనువాదమునకు కథాప్రారంభమున నొక భేదము గలదు. మూలమున ఉగ్రపాండ్యుని రాజ్యవైభవమును గని సహించలేక అసూయతో ఇంద్రుడు క్రుద్ధుడై ఉగ్రుని ఔన్నత్యమునకు సంపద్వృద్ధియే కారణమని ఎంచి మాయోపాయమున దానిని నాశనము చేయవలయునని సరితాంపతి నాహ్వానించి మధురాపురిని కబళింపుమని యాజ్ఞాపించినట్లున్నది[2] తిరువేంగళకవి దీనిని మార్చినాడు. ఈ కవి "ఉగ్రపాండ్యుడు రాజ్యము నేలుచున్న కాలమున అబ్ధులుప్పొంగి మధురను కబళింప వచ్చినవన్ని[3] మాత్రమే వ్రాసినాడు. దీనికి కారణము పంద్రెండవ లీలలో సుందరేశ్వరుడు ఉగ్రునకు వలయాద్యాయుధ ప్రదానము చేయునెడ వ్రాసిన ద్విపదలలో

"వనధులన్నియు మీఱి వచ్చిన యంత

ఘనశక్తి వలన నా ఘనశక్తి విడుము[4]" అని వ్రాయుట. మరియు ఈ లీలయందే తరువాత జరిగిన కథలో అబ్ధులుప్పొంగి వచ్చుటను జూచి భయభ్రాంతులై ప్రజలు చొక్కనాధుని జేరి మమ్ము రక్షింపుమని మొరబెట్టుకొనగా ఆ దేవుడు ఉగ్రపాండ్యుని స్వప్నమున వచ్చి

"భూనాధ! సాగరంబులు మేఱదప్పి

యే కార్ణవంబుగా నెల్లలోకములు

భీకరాకారమై పేర్చిలో గొనుచు

వెల్లిగానిటవచ్చె[5]" నని చెప్పుట. ఈ రెండు కారణముల వలన అబ్ధులుప్పొంగి వచ్చుటకు మూలమున ఇంద్రుని అసూయ కారణముకాగా తెనుగు అనువాదమున ప్రకృతి వైపరీత్యమే కారణము.

(6) అబ్ధులుప్పొంగిన వర్ణన మూలమునను తెనుగునను కలదు. మూలమున రెండున్నర శ్లో.లల్[6]నున్న దానిని తెనుగున ఎనమిదిన్నర ద్విపదలలో స్వతంత్రముగా వర్ణించినాడు[7].

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 77. శ్లో. 2-19 వరకు.
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 78. శ్లో. 20-23 వరకు.
3. చొక్కనాధ చరిత్ర. పుట 83.
4. చొక్కనాధ చరిత్ర. పుట 78.
5. చొక్కనాధ చరిత్ర. పుట 84.
6. హాలాస్యమాహాత్మ్యము. పుట 78. శ్లో. 40, 41, 42లు
7. చొక్కనాధ చరిత్ర. పుట 84, 85లు.

## తృతీయాశ్వాసము – పదునాలుగవ లీల

(1) హాలాస్యమాహాత్మ్యమున పదునెనిమిదవ అధ్యాయమున 'వృత్రారిమౌళిభేదనం' అను పేరుతో వర్ణించియున్న పదునాలుగవ లీల చొక్కనాథ చరిత్రమున తృతీయాశ్వాసమున పదునాలుగవ లీలగా ననూదితము.

(2) మూలమున 77 శ్లో.లలో వర్ణించియున్న ఈ లీలను తెనుగున 117 ద్విపదలలో కవి వర్ణించినాడు.

(3) ఇతివృత్తము రెండింటను ఒకే రీతిగా నున్నది. కాని కథాకథనమున మూలమునకు అనువాదమున ఒకటి, రెండు మెఱుగులు దిద్దియున్నవి. **ఒకటి :** మూలగ్రంథమున కథా ప్రారంభమున చేర, చోళ, పాండ్య భూములందనావృష్టి దోషము వాటిల్లగా, ఆయా దేశపు రాజులందరు కలిసి దాని కారణమును మలయపర్వత ప్రాంతమున నున్న అగస్త్యుని సమీపించి యడిగిరి. అప్పుడు ఆ ముని దివ్యదృష్టితో ( జూచి గ్రహవక్రము కారణమని చెప్పి పండ్రెండు సం.ల వరకు మీ దేశముల వర్షములు గురియవు. కాన మీరు హాలాస్యేశ్వరుని సేవించిన ఆయన అనుగ్రహించి వర్షములు గురియించునని చెప్పినాడు. తదుపరి వారు హాలాస్యేశుని జేరి సోమవారవ్రత మొనర్చి పరమేశ్వరుని సంతుష్టిజేయగా నంతనొక దివ్యవాణి "ఓ భూపాలులారా! వృష్టి కర్త ఇంద్రుడు గాన వర్షము కొరకు మీరు దేవలోకమునకు బోయి ఆయనను ప్రార్థించుడు. ఆకాశమార్గమున వెడలు శక్తిసామర్థ్యములు మీకు కలుగుగాక". యని వారికి వినిపించినది. పై విషయమంతయు మూలమున ముప్పది శ్లో.లలో నున్నది.[1]

తెనుగు గ్రంథమున ఆరాజులు ముప్వురు విప్రుల రప్పించి గ్రహశాంతిజేయుడనగా వారు జ్యోతిషశాస్త్ర వాసన దెలిసి ఈయనావృష్టి దోషమునకు కారణము గ్రహములు వక్రించుటగాదు. ఇంద్రుడొనరించు మహిమలు, ఈ దోషమును మాన్ప ఇంద్రుడే సమర్థుడు. కావున నతని పాలికి బోయిన వర్షములు గురియించునని చెప్పినారు. చొక్కనాథ చరిత్రమున ఈ వృత్తాంతము ఐదారుద్విపదలలో నున్నది.[2]

**రెండు:** మూలమున ఇంద్రుడు తన 'మౌళి భేదనానంతరం' దుర్వాసుని శాపమును దలచుకొన్నట్లుగా కాక ఉగ్రాఖ్యుడగు ఉగ్రతనయుడే ఇట్లు భేదించెనని మనమున నిశ్చయించుకొనినాడు[3]. తెనుగున ఇంద్రుడు దుర్వాసుని శాపమును కూడ మనమున దలచుకొని అమరావతికి మరలినాడు.[4]

శివప్రసాదమైన పూలమాలను తృణీకరించిన నేరమునకు దుర్వాసుడు ఇంద్రుని, ఐరావతమును శపించిన కథలో ఐరావతమునకు కదంబాటవిలో అడవి ఏనుగు వై

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 79, 80 లు.
2. చొక్కనాథ చరిత్ర. పుట 86.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 82, 63.64 శ్లోకములు.
4. చొక్కనాథ చరిత్రము. పుట 91.

సంచరించుచు హాలాస్యేశ్వరుని దర్శించి శాప విముక్తిని బొందుమని, ఇంద్రునకు పాండ్యరాజు చక్రాయుధమున నీ శిరము గాక కిరీటము భంగమగునని శాపవిమోచనము తెలిపినాడు. కావున చొక్కనాథ చరిత్రమున ఈ లీలయందు మౌళి భేదనానంతరం ఇంద్రుడు దుర్వాసుని శాపమున దలచుకొనుటయు హాలాస్యమహాత్మ్యమున తన మౌళి భేదనం చేయగలవాడు పాండ్యరాజు గాన ఆ రాజు ఈ ఉగ్రుడే యని నిశ్చయించుకొనుటయు సముచితములే.

**మూడు:-** మూలమున ఇంద్రునకు ఉగ్రునకు మాత్రమే యుద్ధము జరిగినది. కాని తెలుగున ఇరువురి సేనల మధ్య భీకర పోరాటము జరిగి, అనంతరం ఇరువురికి ద్వంద్వ యుద్ధము జరిగినది.

(4) సంస్కృతమున పంద్రెండు శ్లో.లలో[1] నున్న యుద్ధ వర్ణన తెనుగున పదునేడు ద్విపదలలో[2] కలదు.

## తృతీయాశ్వాసము - పదునైదవలీల

(1) హాలాస్యమాహాత్మ్యమున 19,20,21. అధ్యాయములలో వర్ణింపబడిన 'మేరోః కాంచన హరణం' అను పేరు గల పదునైదవలీల చొక్కనాథ చరిత్రమున తృతీయాశ్వాసమున పదునైదవ లీలగా ననువదింపబడినది.

(2) హాలాస్యమాహాత్మ్యమున పందొమ్మిదవ అధ్యాయ ప్రారంభమున అగస్త్యుడు 'చండాయుధముతో ఉగ్రభూపాలుడు మేరువును గొట్టి బహుళ ధనమును గొనివచ్చిన లీలను' మీకు చెప్పెదను వినుడని కథ ప్రారంభించి, ఉగ్రపాండ్యుడు యదావిధిగా 'సోమవార వ్రతము నాచరించి' అని చెప్పినంతనే మునులు 'సోమవారవ్రత విధానమును మాకు చెప్పవలసినదని ప్రార్థించగా దానిని చెప్పినట్లు కలదు.

(3) ఈ సోమవార వ్రత విధానము మూలమున 105 శ్లో.లలో నున్నది.[3] తెనుగు అనువాదమున కవి దీనిని పూర్తిగా వదలినాడు.

(4) మూలమున అగస్త్యుడు సోమవార వ్రత విధానమును తెలిపి, తదుపరి సోమవార వ్రతోద్యాపనమును గూర్చి ఇరువదియవ అధ్యాయమున 114 శ్లో.లలో చెప్పినాడు.[4] చొక్కనాథ చరిత్రమున తిరువేంగళకవి దీనిని కూడా వదలివేసినాడు.

(5) సోమవార వ్రతోద్యాపనానంతరము మూలమున ఇరువది యొకటవ అధ్యాయమున అసలు కథ ప్రారంభమైనది. అందుపలన కవి దీనిని మనమున నిడుకొని 19.20 అధ్యాయములలోనున్న సోమవార వ్రత విధాన వ్రతోద్యాపనములు అవాంతర విషయములు గాన ఇవి పురాణమున తప్ప కావ్యమున జెప్పుట రసభంగమునకు

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 81-82 లు. శ్లో. 50-62 వరకు.
2. చొక్కనాథ చరిత్రము. పుట 90, 91లు.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 83-88 వరకు.
4. హాలాస్యమాహాత్మ్యము. పుట 88-93 వరకు.

హేతువని భావించి ఈ రెండధ్యాయములను తెనిగించుట మానినాడు. మరియు 21వ అధ్యాయమున కథా ప్రారంభమునకు ముందు ఇరువదియైదు శ్లో.లలో ఉగ్రునకు వీరపాండ్యుడు జన్మించుట, శివభక్తి గలిగి పూజాదికముల నిర్వర్తించుట, తీర్థయాత్రలు సలుపుట మొదలైన విషయములు కలవు.[1] అనువాదమున కవి వీనిని కూడా వదలినాడు.

(6) సంస్కృత గ్రంథమున గల సోమవార వ్రత విధాన వ్రతోద్యాపనములకు మారు తెనుగు కావ్యమున మూలాతిరిక్తముగా సంక్షేపముగా రామాయణ కథను వ్రాసినాడు. దీనిని బట్టి ఈ కవికి రామాయణముపైన గల మక్కువ ఎంతటిదో విదితమగుచున్నది.

ఉగ్రుడు మేరువును గొట్టుటకై బయలుదేరి పోవుచు చతురంగ బల సమేతుడై దండయాత్రలు జేయుచు, రాజులను జయించి కప్పములగొనుచు, దారినగల తీర్థయాత్రల సేవించుచు రామేశ్వరమును జేరుకొనును. అచ్చట ఉగ్రుడు తన వెంటనున్న బుధ పురోహితులతో ఆ దివ్యమైన పట్టణమేమిటి? దాని గూర్చి తెలుపుడని యడుగగా వారు రామకథను వినిపించుచు, రాముడు రావణవధానంతరము అయోధ్యకు తిరిగి వచ్చుచు ఆ హత్యాదోషమును బాపికొనుటకై ఈ లింగమును ప్రతిష్ఠించి పూజించినాడని, అందువలననే దీనికి రామేశ్వరమని పేరు వచ్చినదని చెప్పినట్టి వృత్తాంతము దాదాపు 50 ద్విపదలలో నున్నది.[2]

(7) మూలమున ఈ లీలయందు కథ కేవలము 66 శ్లో.లలో నున్నది. తెనుగున దీనిని 132 ద్విపదలలో రచించినాడు.

(8) తిరువేంగళ కవి మూలాతిరిక్తముగా చొక్కనాథ చరిత్రమున 'ఉగ్రుడు రామేశ్వరాది క్షేత్రములను దర్శించుకొని మేరువును సమీపించగా సూర్యాస్తమయమై చంద్రోదయమైన వర్ణన 7 ద్విపదలలో అలంకారికముగా చేసినాడు.[3] మేరువును గొట్టి కనకమును గ్రహించి మధురకు జేరగా సూర్యోదయమైనది. ఇచ్చట 5 ద్విపదలలో సూర్యోదయమును వర్ణించినాడు.[4]

మొత్తముపై ఈ లీలను కవి స్వతంత్రించి మూలముకన్న రమణీయముగా రసవత్తరముగా వర్ణించినాడు.

## తృతీయా శ్వాసము – పదునాఱవ లీల

(1) హాలాస్య మాహాత్మ్యమున ఇరువది రెండవ అధ్యాయమున వేదార్థోపదేశమను పేరుతోనున్న పదునాఱవ లీల చొక్కనాథ చరిత్రమున తృతీయాశ్వాసమున పదునాఱవ లీలగా వ్రాసియున్నది.

---

1. హాలాస్యమాహాత్మ్యము పుట 93, 94 లు.
2. చొక్కనాథ చరిత్రము. పుట 96, 97 లు.
3. చొక్కనాథ-చరిత్రము. పుట 98.
4. చొక్కనాథ చరిత్రము. పుట 100.

(2) ఈ లీలయందు మూలమున వేదార్థ ఉపదేశము మాత్రమే కలదు. చొక్కనాథ చరిత్రమున వేదాంగములను కూడా అర్థయుక్తముగ ఉపదేశించినట్లు వ్రాసి యున్నది.

(3) సంస్కృతమున ఈ లీల 95 శ్లో.లలో నున్నది. తెనుగున 63 ద్విపదలలో నున్నది.

(4) చొక్కనాథ చరిత్రమున ఈ లీల మూలమునకు నామమాత్రానుసరణము. ఇందు ఇది పూర్తిగా స్వతంత్రముగా నడచినది.

(5) లీల ప్రారంభమున మూలమునకు ఆంధ్రానువాదమునకు ఒక భేదము కలదు.

మూలమున కణ్వాది మహర్షులు హరభక్తుడను మునిని వేదార్థములను గ్రహించుటకు ఉపాయమును దెలుపుడని ప్రార్థించగా, అతడు హాలాస్య క్షేత్రమున దక్షిణామూర్తి సన్నిధిన గూర్చొని తపమాచరించిన ఆ దేవుని కృపచే మీకు వేద విద్య సిద్ధించునని చెప్పినట్లు కలదు.[1]

చొక్కనాథ చరిత్రమున బ్రాహ్మణులు వేదాధ్యయనాధ్యాపనములను విడచి వర్తించగా కణ్వాదులగు మునులెల్లరలిగి కైలాస పర్వతమునకు బోయి అచట పరమేశ్వరుని వేదములను వెలయించుమని ప్రార్థించగా పశుపతి వారి భక్తికి మెచ్చుకొని అశరీరియై 'మధురాపురమున మీకు వేదములను విస్తరింతును' అచ్చటికేగుడని చెప్పినట్లు కలదు.[2]

కవి ఇట్లు మార్చుట 'శంభు క్షేత్రములలో కైలాసముకన్నను మధురా క్షేత్రమునకు గురుత్వమునాపాదించుటకు కావచ్చును.

## చతుర్థాశ్వాసము – పదునేడవ లీల

(1) హాలాస్యమాహాత్మ్యమున ఇరుపది మూడవ అధ్యాయమున వర్ణించియున్న నవరత్న విక్రయమను పదునేడవ లీల చొక్కనాథ చరిత్రమున చతుర్థాశ్వాసమున పదునేడవ లీలగా వర్ణించి యున్నది.

(2) సంస్కృత గ్రంథమున ఈ లీల 202 శ్లో.లలో విపులముగా వర్ణించి యున్నది. తెలుగు కావ్యమున 93 ద్విపదలలో నిది వ్రాసి యున్నది.

(3) మూలమున వలుని వృత్తాంతము, నవరత్నాదుల వర్ణనము 164 శ్లో.లలో అతి విస్తృతముగా పఠితలకు విసుగు పుట్టునట్లున్నది.[3] అనువాదమున తిరువేంగళకవి వలుని, బలుడని మార్చి బలుని వృత్తము నవరత్నాదుల వర్ణనము నామమాత్రముగా మూలమననుసరించుచు నాతి విస్తృతముగా కేవలము 35 ద్విపదలలో కథాగతి కాటంకము కలుగకుండ వర్ణించినాడు.[4]

---

1. హాలాస్యమాహాత్మ్యము పుట 97.
2. చొక్కనాథ చరిత్రము. పుట 102
3. హాలాస్యమాహాత్మ్యము. పుటలు 102-109 వరకు 21వ శ్లో. 185 శ్లో. వరకు.
4. చొక్కనాథ చరిత్రము. పుట 108, 109, 110 లు.

(4) మూలమున ఈ లీలయందు పట్టాభిషిక్తుడైన దేవపాండ్యుడు ఉగ్రపాండ్యుని కుమారుడైన వీరపాండ్యుని తనయుడని యున్నది. అనగా ఇందు దేవపాండ్యుడు ఉగ్రపాండ్యుని మనుమడు కాగా దేవపాండ్యుడు ఉగ్రపాండ్యుని కుమారుడని తెనుగున నున్నది. హాలాస్యమాహాత్మ్యము పురాణము గావున ఇందు పురాణ లక్షణములలో నొకటైన వంశమును తెలుపవలె గాన ఉగ్రపాండ్యుని తనయుడు వీరపాండ్యుడు అతని కుమారుడు దేవపాండ్యుడని వరుస దప్పకున్నది. చొక్కనాథ చరిత్రము కావ్యముగాన కావ్యమునందీ లక్షణము తప్పక పాటించవలెనను నియమము లేదుగాన కవి స్వతంత్రించి తాతయగు ఉగ్రపాండ్యుని తండ్రిగా మార్చినాడు.

(5) కథాప్రారంభమున మూలమునందు వీరపాండ్యుడు మృగయా వినోదార్థమై వెడలి విధివశాత్తు ఒకానొక క్రూరమృగము పాలబడి అకాల మరణము జెందగా అతని కుమారుడైన దేవపాండ్యుడు రాజగుట కలదు.[1] చొక్కనాథ చరిత్రమున దేవపాండ్యుడు వీరపాండ్యుని కుమారుడని కాక ఉగ్రపాండ్యుని కుమారుడని వ్రాయుచు, ఈ ఉగ్రపాండ్యుడు మృగయా వినోదమునకై వెడలి విధివశాత్తు క్రూరమృగము పాలబడి అకాల మరణము నొందినట్లు వ్రాసినాడు.[2]

మూలమున ఉగ్రపాండ్యుడు పదునైదవ లీలయందే తన కుమారుడైన వీరపాండ్యునకు పట్టభిషేక మొనరించి తాను శివైక్యమొందినట్లు వ్రాసియున్నది.[3] ఉగ్రుడు శివాంశ సంభూతుడు, ఇంద్రుని, ఉదధులను, మేరువును గొట్టిన మహాబలశాలి. అయినను అకాల మరణము ఎట్టివారికిని తప్పదనునర్థమును సమర్థించుటకు తిరువేంగళ కవి ఈ విషయమున ఖ్యాతిగాంచని వీరపాండ్యుని కన్న ప్రఖ్యాతి వహించిన ఉగ్రపాండ్యుని జెప్పుటయే యుక్తమని భావించి యుండును.

## చతుర్థాశ్వాసము – పదునెనిమిదవ లీల

(1) హాలాస్యమాహాత్మ్యమున 24, 25 అధ్యాయములలో వర్ణించియున్న మేఘైస్సాగరపానం, వర్షరక్షణం, అను 18, 19 లీలలు చొక్కనాథ చరిత్రమున చతుర్థాశ్వాసమున పదునెనిమిదవ లీలగా అనువదించియున్నది.

(2) మూలమున పదునెనిమిదవ లీల 55 శ్లో.లలోను, పందొమ్మిదవ లీల 70 శ్లో.లలోను మొత్తము 125 శ్లో.లలో వ్రాసియున్న రెండు లీలలను చొక్కనాథ చరిత్రమున 45 + 20 = 65 ద్విపదలలో పదునెనిమిదవ లీలగా తిరువేంగళ కవి అనువదించి యున్నాడు.

(3) మూలమున 18వ లీల ప్రారంభమున దాదాపు పది శ్లో.లలో దేవపాండ్యుడు హాలాస్యేశ్వరుని పూజించిన విషయమున్నది.[4] చొక్కనాథ చరిత్రమున కవి దీనిని

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 101.
2. చొక్కనాథ చరిత్ర. పుట 107.
3 హాలాస్యమాహాత్మ్యము. పుట 96.
4. హాలాస్యమాహాత్మ్యము. పుట 110, 111లు

వదలివేసినాడు. మరియు 19వ లీలలో మొదటి 30 శ్లో.లను తెనిగించి తరువాతి 40 శ్లో.లను వదలినాడు. మొత్తము 50 శ్లో.లను తెనిగించలేదు. 19వ లీలలో మొదటి ముప్పది శ్లోకములలో కథ, తరువాతి నలుబది శ్లోకములలో వరుణాదులు హాలాస్యనాథుని పూజించుట, స్తుతించుట, కలవు.[1] ఇవి కావ్యమున అనవసరమని కవి భావించి యుండునుగాన కథను మాత్రమే అనువదించినాడు.

(4) చొక్కనాథ చరిత్రమున వరుణుని యాజ్ఞచే అబ్ధులు పొంగివచ్చి మధురాపురి నాక్రమించగా హాలాస్యనాథుడు పుష్కరము, పుష్కలావర్తకము, అమృతము, జీవవర్ధనములను నాలుగు మేఘములను రప్పించి వానిచే ఆహార్దితోయములను అపోశనము బట్టించి మధురాపురిని రక్షించెను.[2] మూలమున శివుడు తన జటాజూటముననున్న నాల్గు మేఘములను ఆ నీటిని ద్రావుటకు బంపినట్లు కలదు[3] అట్లే చొక్కనాథ చరిత్రమున వరుణుడు తాళప్రమాణముగ వర్షము గురియించగా మరలనవే నాల్గు మేఘములను పైమరువుగా నుండ నియమించి మధురాధి నాథుడు మధురాపుర జనుల రక్షించెను.[4] మూలమున ఇంద్రుడు పుష్కలావర్తకాది మేఘములను ఆజ్ఞాపించి వర్షము గురియింప, శివుడు మరల తనకపర్దమున నున్న వలాహకముల చేతనే పైమరువు గావించినట్లున్నది.[5]

## చతుర్థాశ్వాసము – పందొమ్మిదవ లీల

(1) హాలాస్య మాహాత్మ్యమునందు ఇరువదియాఱవ అధ్యాయమున సిద్ధ చరిత్రమను పేరుతోనున్న ఇరువదియవ లీల చొక్కనాథ చరిత్రమున చతుర్థాశ్వాసమున పందొమ్మిదవ లీలగా ననువదించియున్నది.

(2) పురాణమున ఈ లీల 57 శ్లో.లలో వర్ణితము. కావ్యమున ముప్పది మూడు ద్విపదలలో వర్ణితము.

(3) సిద్ధుని వేషము మూలమున 5 శ్లో.లలో వర్ణించి యున్నది.[6] దీనిని తెనుగున కూడా 5 ద్విపదలలోనే కవి వర్ణించినాడు.[7] ఈ వర్ణన దేనికదే స్వతంత్రము.

(4) మూలమున సిద్ధుని వేషములోనున్న చొక్కనాథుని పురజనులు చూచి సమీపించి పూజించి ప్రార్థించినట్లు కేవలము ఒకే ఒక శ్లోకమున నున్నది. అదియిది.

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుటలు 114-116.
2. చొక్కనాథ చరిత్ర. పుట 113.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 114.
4. చొక్కనాథ చరిత్ర. పుట 114.
5. హాలాస్యమాహాత్మ్యము. పుట 114.
6. హాలాస్యమాహాత్మ్యము. పుట 117, శ్లో. 5-10.
7. చొక్కనాథ చరిత్ర. పుట 115.

"యేయే జనాస్సమాహూయ తంసిద్ధం పరిపూజ్యచ

ప్రార్ధయంతి చయద్వస్తు తేభ్యస్తే భ్యోదదాతితత్,"[1] దీనిని చొక్కనాథ చరిత్రమున ఆరు ద్విపదలలో వ్రాసినాడు.[2]

(5) సిద్ధుని లీలలు మూలమున ముప్పదియైదు శ్లోకములలో వర్ణించియుండగా,[3] చొక్కనాథ చరిత్రమున తిరువేంగళ కవి కేవలము ఐదు ద్విపదలలో సంక్షిప్తముగా రసభంగము వాటిల్లకుండా రచించినాడు.[4] ఈ వర్ణన మూలమునకు నామమాత్రానుసరణము.

(6) మూలమున సిద్ధుని లీలలను గూర్చి వినిన పాండ్యరాజు అతని వృత్తాంతము నరసిరమ్మని స్వజనమును బంపుటతో లీల పరిసమాప్తమైనది. చొక్కనాథ చరిత్రమున మూలములోని తరువాతి లీలయందలి 26 శ్లో.లలోనున్న విషయమును పందొమ్మిదవ లీలలోనే సంగ్రహముగా ననుపదించినాడు ఇందు పాండ్యరాజు స్వజనము వలన ఆతని గూర్చి విని పరామర్శించుటకు బదులు తానే స్వయముగా బోవుటతో ఈ లీల ముగిసినది.

(7) మూలమున స్వజనము వలన సిద్ధుని లీలలను వినిన పాండ్యవిభుడు అతని దోడ్కొని వచ్చుటకై మంత్రులను బంపగా వారు సిద్ధుని యాహ్వానింప వచ్చిరి. అపుడు సిద్ధుడు "మీ ప్రభువు మహారాజు మేము సిద్ధులము. మాతో వారికేమి పని" యని వారి ఆహ్వానమును మన్నింపక మిన్నకుండెను. అనంతరము మంత్రులు రాజుతో జెప్పగ క్రుద్ధుడై సిద్ధుని దండించుటకై బంగారు బెత్తమును దీసికొని అతడున్న కడకు వెడలును. ఈ వృత్తాంతమంతయు 18 శ్లో.లలో చెప్పబడినది.[5] చొక్కనాథ చరిత్రమున దీనిననువదించక వదలినాడు. ఇట్లు వదలుటచే కథాగతి చెడలేదు సరికదా కథ తొందరగా హృదయమునకు హత్తుకొనునట్లున్నది.

(8) సిద్ధుని దండించుటకై వెడలిన పాండ్య రాజు సుందరేశ్వరుని గుడిలో వాయవ్య భాగపు ఱాతి ఏనుగు వద్ద కూర్చుండియున్న సిద్ధుని గాంచి ఎవరు నీవు? ఏమిటి నీ విద్య అని గద్దించి అడిగినట్లు మూలమున నున్నది. దానికి సమాధానముగా సిద్ధుడు మేము సిద్ధులము అని తన వృత్తాంతము వివరించుచు మాతో మీకేమి పని పొండని తూష్ణీంభావము వహించును.

చొక్కనాథ చరిత్రమున పాండ్యరాజు సిద్ధుని దండించుటకు గాక పరామర్శించుటకు బోవును.

## చతుర్థాశ్వాసము - ఇరువదియవ లీల

(1) హాలాస్యమాహాత్మ్యమున ఇరువది యేడవ అధ్యాయమున

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 117. శ్లో. 11.
2. చొక్కనాథ చరిత్ర. పుట 116.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 117, 118లు. శ్లో. 10-45 వరకు.
4. చొక్కనాథ చరిత్ర. పుట 116.
5. హాలాస్యమాహాత్మ్యము. పుట 119, 120లు.

'శిలాగజేక్షుకాండప్రదాన' మను పేరున నున్న ఇరువదియొకటవ లీల చొక్కనాథ చరిత్రమున చతుర్థా శ్వాసమున ఇరువదియవ లీలగా ననువదింపబడినది.

(2) మూలమున ఈ లీల 75 శ్లో.లలో నున్నది. తెనుగున ఈ లీల కేవలము 26 ద్విపదలలో కలదు.

(3) తిరువేంగళ కవి మూలమునందలి ఈ లీలలోనున్న మొదటి ముప్పది శ్లోకముల (దాదాపుగా) విషయమును చొక్కనాథ చరిత్రమున ఇంతకు ముందున్న లీలలోనికి గ్రహించినాడు.

(4) మూలమున ఈ లీలలో మూడు నాలుగు శ్లోకములలో పాండ్యరాజు సిద్ధుని మహిమ నెఱుగదలచి తన చేతియందు హేమవేత్రమును ధరించి పచ్చినందున సమయమునకు దారినబోవు నొక కృషీవలుని ఇక్షుదండమును గ్రహించి దానిని ఱాతి ఏనుగుచే దినునట్లు జేయుమని యాజ్ఞాపించినట్లు కలదు.[1]

చొక్కనాథ చరిత్రమున దారినబోవు కృషీవలుని నుండి గ్రహించిన విషయమును తొలగించి పాండ్యరాజు తన చేతనున్న ఇక్షుదండమును ఈ శిల సింధురముచే భక్షింపజేయుమని విన్నవించుకొనును.[2]

(5) మూలమున పాండ్యరాజు సిద్ధవేశముననున్న యాతని శివుడని గ్రహించి అపరాధాష్టకముతో స్తుతించును.[3] తెనుగున ఈ 'శివస్తుతి' స్వతంత్రము.

(6) మూలమున పాండ్యరాజు (అభిషేకపాండ్యుడు) తనకు పుత్ర సంతానమును ప్రసాదించుమని హాలాస్యేశ్వరుని ప్రార్థించుట, విక్రమ పాండ్యుడను పుత్రుని బడయుట, అనంతరము కైలాసమునకేగుట పదిశ్లో. లలో కలదు.[4] తెనుగున కవి దీనిని అనువదించక వదలి పెట్టినాడు.

(7) చొక్కనాథ చరిత్రమున పందొమ్మిదవ, ఇరువదియవలీలలు రెండును మూలమునకు నామమాత్రానుసరణములై స్వతంత్రముగాను, రమణీయముగాను, అద్భుతరసాత్మకముగను రచింపబడినవి-

## చతుర్థాశ్వాసము – ఇరువది యొకటవ లీల

(1) హాలాస్యమాహాత్మ్యమున ఇరువది యెనిమిదవ అధ్యాయమున 'నగ్నహస్తిహనన' మను పేరుతో నున్న ఇరువది రెండవ లీల చొక్కనాథచరిత్రమున చతుర్థాశ్వాసమున ఇరువది యొకటవ లీలగా ననువదింపబడినది.

(2) మూలమున ఈ లీల 82 శ్లో.లలోవిపులముగా వర్ణితము. తెనుగున ఈ లీల దాదాపు 57 ద్విపదలలో క్లుప్తముగా వర్ణితము.

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 120. శ్లో. 27-30 వరకు.
2. చొక్కనాథ చరిత్ర. పుట 117.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 121-122లు. శ్లో. 56-64.
4. హాలాస్యమాహాత్మ్యము. పుట 122. శ్లో. 65-75.

(3) చొక్కనాథ చరిత్రమందలి ఈ లీలలోని కథ యంతయు మూలానుసరణమే. మూలమున విపులముగా వర్ణించి యున్న కథను తెనుగున సంక్షిప్తముగా కవి అనువదించినాడు. దీని వలన రసానుభూతికి గాని కథాకథన శిల్పమునకుగాని ఏ మాత్రము భంగము వాటిల్లలేదు.

## చతుర్థాశ్వాసము – ఇరువది రెండవ లీల

(1) హాలాస్యమాహాత్మ్యమున ఇరువది తొమ్మిదవ అధ్యాయమున 'ద్విజకన్యార్తిహరణం' అను పేరున నున్న ఇరువది మూడవ లీల చొక్కనాథ చరిత్రమున చతుర్థాశ్వాసమున ఇరువది రెండవ లీలగా ననువదించియున్నది. (2) మూలమున ఈ లీల 79 శ్లో.లలో నున్నది. తెనుగున ఇది 72 ద్విపదలలో నున్నది- (3) మూలమున శివబ్రాహ్మణునిపేరు విరూపాక్షుడు. తెనుగున హరశర్మ. (4) మూలమున కథాస్థలి మధురాపురి. తెనుగున సౌపర్ణికాపురమను అగ్రహారము. (5) మూలమున బ్రాహ్మణుని భార్యపేరు సువ్రత తెనుగున ఆమె పేరు లేదు. (6) మూలమున విరూపాక్షుడను శివబ్రాహ్మణునకు పుత్రిక జన్మించుట, గౌరి యని పేరిడుట, పది ద్విపదలలోనున్నది.[1] తెనుగున జననము ఒకే ఒక ద్విపదలోనున్నది.[2] బాలిక పేరు చెప్పలేదు. (7) మూలమున కథాప్రారంభమున గౌరి యను బ్రాహ్మణ బాలిక బాల్యము నుండియే శివభక్తురాలైన విషయము దాదాపు ముప్పది శ్లోకములలో వర్ణించియున్నది.[3] – అనువాదమున కవి వీనిని వదలి పెట్టినాడు. (8) చొక్కనాథ చరిత్రమున కథాంతమున శివుడు ప్రత్యక్షమై విలువగా సాక్షాత్కరించిన శివుని రూపమును పదిద్విపదలలోను, బ్రాహ్మణ యువతి శివుని స్తుతించుట ఐదు ద్విపదలలోను ఉన్నది.[4] ఇది మూలమునలేదు.

## చతుర్థాశ్వాసము – ఇరువది మూడవ లీల

(1) హాలాస్య మాహాత్మ్యమున ముప్పదియవ అధ్యాయమునమన్న 'వ్యత్యస్త నృత్తకరణం' అను ఇరువది నాలుగవ లీల చొక్కనాథచరిత్రమున చతుర్థాశ్వాసమున ఇరువది మూడవలీలగా అనువదితము.

(2) మూలమున ఈ లీల 64 శ్లో.లలో నున్నది. తెనుగున ఇది 57 ద్విపదలలో కలదు.

(3) మూలమున ఈ లీలయందు ఉపకథానాయకుడు రాజశేఖర పాండ్యుడు. తెనుగున దేవ పాండ్యుడు. మూలము ప్రకారము చూచినచో ఈ దేవపాండ్యుడు రాజశేఖర పాండ్యుని తండ్రి తండ్రి. (తాత).

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 126, 127 లు. 1-10 శ్లో.లు.
2. చొక్కనాథ చరిత్ర. పుట 122.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 127, 128లు. 10 నుండి 30 శ్లో.లు.
4. చొక్కనాథ చరిత్ర. పుట 125, 126లు.

(4) మూలమున కథలో రాజశేఖర పాండ్యుడు శివుని వ్యత్యస్తనృత్యము చేయుమని చేయనిచో తన శిరమును ఖడ్గముచే ఖండించుకొందునని వీరశైవభక్తిని ప్రదర్శించినట్లున్నది.[1] చొక్కనాథ చరిత్రమున దేవ పాండ్యుడు చొక్కనాథుని ప్రార్థించినంతనే ఆ దేవుడు పాదమును మార్చినట్లున్నది.[2]

(5) మూలమున హాలాస్యనాథుని నృత్యానంతరం 20 శ్లో.లలో స్తుత్యాదికము లున్నవి.[3] అనువాదమున కవి వీనిని వదలి వేసినాడు.

## చతుర్థాశ్వాసము – ఇరువది నాలుగవ లీల

(1) హాలాస్యమాహాత్మ్యమున ముప్పది యొకటవ అధ్యాయముననున్న 'విప్రవనితావధ నిరూపనం' అను ఇరువది యైదవ లీల చొక్కనాథ చరిత్రమున చతుర్థాశ్వాసమున ఇరువది నాలుగవలీలగా ననూదితము.

(2) హాలాస్యమాహాత్మ్యము నందిలీల 91 శ్లో.లలో కథితము. చొక్కనాథ చరిత్రమునందీ లీల 95 ద్విపదలలో వర్ణితము.

(3) మూలమున ఈ లీల కులశేఖర పాండ్యుని కాలమున జరిగినది. తెనుగున ఈ లీల పాండ్యరాజు కాలమున జరిగినట్లు మాత్రమే యున్నది. రాజు పేరు లేదు.

(4) చొక్కనాథ చరిత్రమున ఈ లీల యందలి కథ మూలాను సారముగా నుండుటయేగాక మూలకథకు ఒకటి రెండుమార్పులతో మెఱుగులు దిద్దుకొని రమణీయముగాను, రసవత్తరముగాను ఉన్నది. **ఒకటి:** మూలమున బ్రాహ్మణుడు తన భార్యతో గలిసి ప్రయాణించుచుండ మార్గమధ్యమున అతని భార్యకు దాహమైనది. చొక్కనాథ చరిత్రమున దాహమగుటకు" ఉష్ణాంశు దీధితి కోర్వంగలేక తృష్ణయు బహుళమైనదని కారణముకూడా వ్రాసియున్నది.[4] **రెండు:** మూలగ్రంథమున బ్రాహ్మణుని భార్య చెట్టు క్రింద పరుండి నిదురించుచుండగా అంతకు ముందొకానొక వ్యాధునిచే పక్షి కొఱకు వేయబడిన బాణము పర్ణమునకు దగిలి యుండి గాలితాకిడికి రాలి నిలువుగా నామెకు దగిలి మరణించినది.[5] చొక్కనాథ చరిత్రమున పర్ణమునకు దగిలియున్న బాణమును గానక బోయవాడు తిరిగి వెడలగా, తదుపరి కొన్ని దినములకా పత్రము యెండిపోయి గాలిచే ఆసాయకము జారి కర్మముజాలక ఆ బ్రాహ్మణి వక్షమున దగిలి కాలుని వశముగావించినది.[6] **మూడు:** మూలమున అసువులు బాసిన బ్రాహ్మణిని జూచిబ్రాహ్మణుడు ఆమె సౌందర్యమును, సద్గుణములను మాటిమాటికి తలచుకొనుచు

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 131. శ్లో. 25.
2. చొక్కనాథ చరిత్ర. పుట 129.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 132.
4. చొక్కనాథ చరిత్రము. పుట 130.
5. హాలాస్యమాహాత్మ్యము. పుట 133.
6. చొక్కనాథ చరిత్ర. పుట 130, 131లు.

దుఃఖించెను.[1] చొక్కనాధ చరిత్రమున వారి వెంటనున్న బాలుడేడ్చుచుండుట జూచుచు, ఆమె వక్షమున గ్రుచ్చుకొనిన బాణమును జూచుచు, అమ్మా!యని వచ్చిన కడుపు నిండ భోజనము బెట్ట గలవారు నీకింకెవ్వరని బాలునితో ననుచు వాని నక్కునజేర్చుకొని విలపించెను.[2] మూలముకన్న ఇందు మానవసహజముగ నుండి హృదయమునకు కరుణ రసానుభూతిని కలిగించుచున్నది. **నాలుగు :** మూలమున రాజుతో యమదూతలు కోమటి వాడలో నొకని యింట వివాహము జరుగుచుండగా పెండ్లికొడుకు ప్రాణములు దీసికొని పోనున్నట్లు చెప్పగా - తెనుగున భూసురుని యింట జరుగు పెండ్లిలో పెండ్లికుమారుని ప్రాణములు గొనిపోవచ్చితిమని చెప్పిరని మార్చియున్నది.

మార్పులు దప్ప తక్కిన కథయంతయు మూలమును బట్టి యే నడచినది.

## పంచమాశ్వాసము - ఇరువదియైదవలీల

(1) హాలాస్యమాహాత్మ్యమున ముప్పది రెండవ అధ్యాయమున నున్న 'బ్రహ్మఘ్నదోషహననం- అను ఇరువది యాఱవలీల చొక్కనాధ చరిత్రమున పంచమాశ్వాసమున ఇరువది యైదవలీలగా ననువదించియున్నది.

(2) హాలాస్యమాహాత్మ్యమునందు ఈ లీల కేవలము 33 శ్లో. లలో నున్నది. చొక్కనాధ చరిత్రము నందు ఈ లీల 65 ద్విపదలలో విపులముగను, రసవత్తరముగను నున్నది.

(3) ఈ లీల మూలమునకు నామమాత్రానుసరణము. కవి తన వర్ణనానైపుణ్యముతో మూలమును ద్విగుణీకరించి స్వతంత్రముగను, రమణీయముగను రచించినాడు.

(4) కథా ప్రారంభమున మూలమునందు వృద్ధ బ్రాహ్మణుని కుమారుడు, జవ్వనియైన తన తల్లితో సంగమించుచుండగాఁ జూచిన తండ్రిని తల పగులగొట్టి చంపి రాత్రికి రాత్రే కళేబరమును కాల్చి వేసినట్లున్నది.[3] చొక్కనాధ చరిత్రమున తల్లి కొడుకులిద్దరుఁ గలిసి విషాన్నమును బెట్టి చంపి "నా తండ్రి ఈ రాత్రి పాలు వంటకము గుడుచుచుండగా ఆ కూడు కుత్తుకలో జిక్కిచచ్చెనని" అతి వ్యాకులుడై అగ్ని సంస్కారము చేసినట్లున్నది.[4]

మూలమున రాత్రికి రాత్రే క్రూరముగా తండ్రిని జంపి కాల్చుట వలన మఱునాడు లోకులనుమానించుటకవకాశమున్నది. చొక్కనాధ చరిత్రమున కవి ఇట్టి అవకాశమునకు తావివ్వక క్రూరత్వమునకు మారు కుటిలత్వముతోఁ జంపినట్లు మార్చి పాత్రల దుష్ట స్వభావములను చక్కగా పోషించినాడు.

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 133.
2. చొక్కనాధ చరిత్ర. పుట 131.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 137.
4. చొక్కనాధ చరిత్రము. పుట 137.

(5) మూలమున వృద్ధ బ్రాహ్మణుని హత్యానంతరం యువ బ్రాహ్మణుడు తల్లిని, ఇంటనున్న ధనమును వెంటదీసికొని ఇల్లు విడచి, దేశాంతరగతుడగుచుండగా మార్గమధ్యమున లుబ్ధకుడొకడు వాని ధనమును లాగికొని అందగత్తెయైన వాని తల్లిని ఎత్తుకొని పోయెనని యున్నది.[1] చొక్కనాథ చరిత్రమున లుబ్ధకుని బదులు కొందరు దొంగలు వానిని బట్టికొని తలఁబగులగొట్టి ధనమును యువతిని ఎత్తుకొని పోయిరని మూలముకన్న యుక్తియుక్తముగా వ్రాసి యున్నది.[2]

(6) తండ్రిని జంపిన పాపమును బాపికొనుటకై బ్రాహ్మణుడు పూర్వ పుణ్యమున మధురానగరికి జేరరాగా మూలముకన్న భిన్నముగా చొక్కనాద చరిత్రమున "నందికేశ్వరుడు వానినిఁజూచి అగణితమైన పాపాత్ముడవు నీవు ఇక్కడికి రావద్దు మరియొక్కడికైన బొమ్మని కోపించిపలికినట్లును. చొక్కనాధుడు దయాళుడై" ఏ దిక్కులేక వీడు ఇక్కడికి వచ్చుచున్నాడు. బసవన్నారానిమ్ము" అని పలికినట్లును కవి కల్పించి వ్రాసినాడు.[3] ఈ కల్పన వలన బసవని విధి నిర్వహణ, చొక్కనాధుని దయాగుణము ప్రస్ఫుటమగుచున్నవి. కావున ఈ కల్పన మూలమునకు భిన్నమే యైనను ఔచితీమంతము. మూలమున నందీశ్వరుని పాత్రలేదు.

(7) చొక్కనాథ చరిత్రమున చొక్కనాథుడు దయాళుడై బసవనిచే బ్రాహ్మణ యువకుని రానిమ్మనె నప్పుడు పార్వతి శివునితో "మాతృద్రోహి. పితృఘాతకుడు నగు వీనినెట్లు రమ్మంటిరని యడుగగా ఈ విశ్వములో వీడనెంత? [illegible], మునులు. దేవతలు వావివరుసలు దప్పి భావ జన్ముని మాయబడలేదా! సరోజభవేంద్రాదులకైనను మదన సాయకము మరులు పుట్టించును గదా! యని ఈశ్వరుడు అగజను సమాధానపఱచును.[4] ఈ విషయము మూలముకన్న రమణీయముగానున్నది.

(8) మూలమున బ్రాహ్మణ యువకుడు బ్రహ్మహత్యాదోషమును బోగొట్టుకొనుటకై ప్రయత్నించుచు, తీర్థ క్షేత్రముల సందర్శించుచు భాగ్యవశమున మధురానగరిని సమీపించి సుందరేశుని యాజ్ఞచే ప్రాయశ్చిత్తము జేసికొన బూని యభిషేక తీర్థమున సుస్నాతుడై పరమశివుని భక్తితో గొలుచుచు విజితేంద్రియుడై తపోనిష్ఠతో మూడు మాసములు సేవింప సుందరేశ్వరుడు వానిని దయదలచ బూనుకొనును. అంతట ఉమాదేవి శివునితో విద్యావంతులను, ధార్మికులను, శీలవంతులను రక్షించెడి మీరు మూఢుడు, ధర్మహీనుడు, అసహ్యావర్తనుడు నగు వీనిని రక్షింపబూనుకొనుట నాకాశ్చర్యముగా నున్నది యని అనును. శివుడు దీనికి ప్రత్యుత్తరమిచ్చినట్లు లేదు.[5]

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 137, 138లు.
2. చొక్కనాథ చరిత్రము. పుట 138.
3. చొక్కనాథ చరిత్రము. పుట 138.
4. చొక్కనాథ చరిత్ర. పుటలు 138, 139.
5. హాలాస్యమాహాత్మ్యము. పుట 136.

ప్రాయశ్చిత్తము చొక్కనాథ చరిత్రమున మూలముకన్న సరిగా 8 ద్విపదలలో నున్నది.[1]

## పంచమాశ్వాసము – ఇరువదియాఱవలీల

(1) హాలాస్యమాహాత్మ్యమున ముప్పది మూడవ అధ్యాయమున 'అంక విజయమను' పేరున నున్న ఇరువది ఏడవలీలను చొక్కనాథ చరిత్రమున పంచమాశ్వాసమున ఇరువది యారవలీలగా ననువదింపబడినది.

(2) హాలాస్యమాహాత్మ్యమునందు ఈలీల 47 శ్లో.లలోకలదు. చొక్కనాథ చరిత్రమునందు ఈ లీల 49 ద్విపదలలో నున్నది.

(3) ఈ లీల పూర్తిగా మూలముననుసరించి అనువదింపబడినది. మూలమునకు. అనువాదమునకు కథలో మార్పులేదు. కేవలము చొక్కనాథుని స్తుతి యొక్కటే స్వతంత్రముగా వ్రాసియున్నది.

## పంచమాశ్వాసము – ఇరువదియేడవలీల

(1) హాలాస్యమాహాత్మ్యమున ముప్పదినాలుగవ అధ్యాయమున 'సర్పహననం' అను పేరుతోనున్న ఇరువది యెనిమిదవలీల చొక్కనాథ చరిత్రమున పంచమాశ్వాసమున ఇరువది యేడవలీలగా ననువదితము.

(2) మూలమునందు ఈ లీల 42 శ్లో. లలో నున్నది. అనువాదమున ఈ లీల 49 ద్విపదలలో నున్నది.

(3) మూలమున నగ్నసిద్ధులు (జైనులు) శైవులగు పాండ్యులపైకి పంపిన విషసర్పమును హాలాస్యేశ్వరుడు సిద్ధరూపమున వచ్చి తన శిరముపై నున్న చంద్రుని నుండి అమృత ధారలు దానిపై కురియించి సమయించును.[2] చొక్కనాథ చరిత్రమున సిద్ధరూపమున గాక స్వయముగా చొక్కనాథుడే వచ్చి తన జటాజూటముననున్న చంద్రుని యందలి అమృతమును దీసి చల్లి విషమునణచి సర్పమును నశింపజేయును.[3] ఈ ఒక్క మార్పుదప్ప తక్కినకథయంతయు మూలానుసరణమే.

(4) మూలమున ఈలీల అనంతగుణ పాండ్యుని కాలమున జరిగినది. తెనుగున ఈ లీల యుక్తపాండ్యుని కాలమున జరిగినట్లున్నది. కవి అనంతగుణపాండ్యునే యుక్తపాండ్యుడని పేరు మార్చి వ్రాసినాడు.

## పంచమాశ్వాసము – ఇరువది యెనిమిదవలీల

(1) హాలాస్యమాహాత్మ్యమునందు ముప్పదియైదవ అధ్యాయమున 'సౌరభేయీనిపాతనం' అను పేరున నున్న ఇరువది తొమ్మిదవ లీలను చొక్కనాథ చరిత్రమున పంచమాశ్వాసమున ఇరువది యెనిమిదవలీలగా కవి అనువదించినాడు.

---

1. చొక్కనాథ చరిత్రము. పుట 140.
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 142.
3. చొక్కనాథ చరిత్రము. పుట 146.

(2) సంస్కృతమున ఈ లీల 58 శ్లో. లలో నున్నది. ఇందు 34 శ్లోకములు సుందరేశ్వరుని లీలకు సంబంధించినవి తక్కినవి (24) ప్రసంగవశమున ఈ లీల జరిగిన కాలమున శ్రీరామచంద్రుడు హాలాస్యక్షేత్రమును దర్శించినట్లు తెలిపెడివి[1]- చొక్కనాథ చరిత్రమునందు రాముడు హాలాస్యక్షేత్రమును దర్శించిన విషయమును తొలగించి కేవలము సుందరేశ్వరుని లీలను 52 ద్విపదలలో కవి తెనిగించినాడు.

(3) పైన చూపినమార్పుఁదప్ప ఈ లీలయందలి కథ మూలముననుసరించి తెనుగున రచించియున్నది.-

## పంచమాశ్వాసము - ఇరువది తొమ్మిదవలీల

(1) హాలాస్యమాహాత్మ్యమునందు ముప్పది యాఱవ అధ్యాయమున నున్న 'సేనాదర్శన' మను ముప్పదియవలీలను చొక్కనాథ చరిత్రమున పంచమాశ్వాసమున ఇరుపది తొమ్మిదవ లీలగా కవి అనువదించినాడు.

(2) మూలమునందు ఈ లీల 88 శ్లో.లలో, తెనుగున ఈలీల 80 ద్విపదలలో వర్ణింపబడినది.

(3) ఈ లీల యందలి కథ మూలముననుసరించి నడచినది. వర్ణనలు మూలముననుసరించిగాక స్వతంత్రముగా నున్నవి.

## పంచమాశ్వాసము - ముప్పదియవలీల

(1) హాలాస్యమాహాత్మ్యము నందలి ముప్పది యేడవ అధ్యాయమున 'నీవీదానము' ను పేరున నున్న ముప్పది యొకటవ లీలను చొక్కనాథ చరిత్రమున పంచమాశ్వాసమున ముప్పది యవలీలగా ననువదించియున్నది.

(2) మూలమునందీలీల 42 శ్లో.లలో నున్నది. తెనుగున నిది 55ద్విపదలలో నున్నది.

(3) ఈలీల యందలి కథలో మూలమున కులశేఖర పాండ్యుడు హాలాస్యేశ్వరుని సన్నిధి కేగి నారాజ్యమునందు అనావృష్టి దోషము వాటిల్లినదని, నాధనమంతయు సుందరసామంతుడు సేనల కొరకని మోసగించి తీసికొని వెచ్చించినాడని, ధనధాన్యములు లేక నేను ఖిన్నుడనైనానని, నాకు ధనధాన్యముల నిమ్మని ప్రార్థించినాడు.[2] చొక్కనాథ చరిత్రలో పాండ్యరాజు చొక్కనాథుని జేరి "నా రాజ్యమునకు వానలు లేని కారణమేమి? కరువు బాధతో నాదేశప్రజలు అన్యభూములకు బోయినారు. దీనికి నేనేమి సేయవలెనని విన్నవించుకొనినాడు."-[3] అని మార్చి వ్రాసినాడు.

సుందరసామంతుడుసైన్యము దెత్తునని నావద్ద ధనము తీసికొని నన్ను మోసగించినాడని మూలములో చెప్పిన విషయము ఇందు జెప్పుట అసంగతము- ఈ లీల

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుటలు 143, 144. (34 శ్లోకములు) 145వ పుట (24 శ్లో.లు).
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 150.
3. చొక్కనాథ చరిత్ర. పుట 156

౦ఁజె. ముందు లీలలోనే హాలాస్యేశ్వరుడు సుందర సామంతుని రక్షించుటకై సైన్యముల కలుకొని వచ్చినాడని యున్నది. అందువలన రాజు అట్లు చెప్పుకొనుట యుక్తముగా లేదుగాన కవి దీనిని వదలి పెట్టినాడు.

(4) మూలమునందు సుందరేశుని ప్రార్థించి భూశయ్యపైబడుకొన్న పాండ్యరాజు కలలో సిద్ధ రూపములో శివుడు కన్పించినాడు.[1] చొక్కనాథచరిత్రలో పాండ్యరాజు చొక్కనాథుని ఎంచి, ప్రార్థించి తన నగరికి బోయి నిద్రింపగా ఆ రాత్రి స్వప్నమున వచ్చినాడని కలదు.[2] ందు సిద్ధరూపమున వచ్చినట్లు లేదు.

పై రెండు మార్పులు దప్ప మిగిలిన కథ యంతయు మూలానుసరణమే.

## పంచమాశ్వాసము – ముప్పది యొకటవలీల

(1) హాలాస్యమాహాత్మ్యమున ముప్పది యెనిమిదవ అధ్యాయముననున్న లయ విక్రయమను ముప్పది రెండవలీల చొక్కనాథ చరిత్రమున పంచమాశ్వాసమున ముప్పది యొకటవలీలగా ననువదించియున్నది.

(2) సంస్కృతమున ఈలీల 47 శ్లో.లలో సంక్షిప్తముగానున్నది. తెలుగున ఈలీల 131 ద్విపదలలో విపులముగాను, రమణీయముగాను, శృంగార రసాత్మకముగను వర్ణింపబడియున్నది.

(3) ఈ లీల యందలి కథ మూలమునకు నామమాత్రాను సరణము.

(4) మూలమున ఈ లీలయందు కథా ప్రారంభమున "సోమసుందరుడు పూర్వము భిక్షాటన జేయుచు దేవదారువనమును జేరగా అక్కడి మునిపత్నులు అతిమనోజ్ఞము, అతిమనోహరమునైన సుందరేశ్వరుని సౌందర్యమును చూచి మోహితులైరని రెండు శ్లోకములలో నున్నది.[3]

చొక్కనాథ చరిత్రమున మూలమునకు భిన్నముగా దీనిని "దారుకావనము నందు వసించు మునిపత్నులు తమకు ఈడుజోడైన పరమపాతివ్రత్యభవ్యచారిత్రులరయలేరనుచు నహంకరించగా శ్రీ చొక్కపతి ఋషిస్త్రీల పతివ్రతాచారములు పరికింతమని జంగమవేషమున భిక్షాటనకై వచ్చి భిక్షమువేడగా మునిపత్నులు చేయెత్తి భిక్షము బెట్టునపుడు వారి కరమూలరుచులు శృంగార హస్తములు తిలకించి కదకంటనవ్వగా అతని సౌందర్యమును ఒయ్యారమునుగని మోహితులైరని"[4]. తిరువేంగళకవి మార్చి వ్రాసినాడు.

(5) మూలమున భిక్షకై వచ్చిన సోమసుందరుని సౌందర్యమును వీక్షించి ముని పత్నులు అతని స్పర్శ సుఖము ననుభవింపవలెనను లోభమున ఒకరిని మించి యొకరు పోటీపడుచు, భిక్షములిడుచు అతని యందమును తనివి దీర చూచుచుండిరి,

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 151.
2. చొక్కనాథ చరిత్ర. పుట 156.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 152. శ్లో. 2,3లు.
4. చొక్కనాథ చరిత్రము. పుట 158, 159లు.

ఉపరి ముంచెదరి, కౌగిలించుకొన సమీపించుచు ఉరి' అని ఆరుశ్లోకములలో వర్ణించియున్నది.[1]

చొక్కనాథ చరిత్రమున ఈ విషయము 'జంగముని వేషముననున్న చొక్కపతి సౌందర్యమును జూచి మతి భ్రమించి భిక్షము బెట్టక ఏమఱియున్నవారు కొందఱు. ఆశ్చర్యమోహితలై భిక్షము దెచ్చియు పెట్టకున్న వారు కొందఱు, మాయలతపసి మరుల ముప్పులకు మేను మఱచినవారు కొందఱు. భిక్షము బెట్టి మరచి పోయి మరల భిక్షము దెచ్చువారు కొందఱు. ఈ విధముగా ముని పత్నులందఱు పరమశివుని మరులు వలచుకొని యుండుట ముని పత్నుల స్థితిని కన్నులకు గట్టినట్లుగా రమణీయముగా కవి ఆరు ద్విపదలలో వర్ణించినాడు.[2]

మూలమున ఆరుశ్లోకములలో నున్న విషయమును, మూలమునకు భిన్నముగా, తిరిగి ఆరు ద్విపదలలోనే తెనిగించుట ఈ కవి అనువాద శిల్పమునకు చక్కని నిదర్శనము. భిక్షుకుని సౌందర్యమును జూచుచు పోటీపడి భిక్ష ఇడినారనుటకంటె సమ్మోహనాకారమును జూచి భిక్షము బెట్టుట మరచినారనుట కమనీయ కల్పనము.

(౬) హాలాస్యమాహాత్మ్యమున మునిపత్నుల వైరాగ్యము అనురాగముగా మారుటను జూచిన మునులందరు విస్మయము నొంది, ఇది హాలాస్యేశ్వరుని లీలయని తెలిసికొని కృద్ధులై మధురానగరమున వైశ్యుల యిండ్లఁబుట్టి యాతని స్పర్శను బొందుడని శపింపగా వారు వైశ్య కన్యలై జనించిరని 5 శ్లో.లలో నున్నది.[3]

చొక్కనాథ చరిత్రమున మునిపత్నులు మోహితలైయుండ జూచి జంగమ వేషమున నున్న చొక్కనాథుడు మాయమైపోగా, తమకు మరులుఁ బుట్టించిన యా సమ్మోహనాకారుని గానక యాతని మీదిమోహమున విరహ సంతాపములఁజిక్కి, పతుల సేవలు మాని భ్రమించుచుండ వారి చేతులగాజులు ఊడిపడినవి. అప్పుడా అతివలజూచి మునులు 'మీరలా సర్వేశుమీది మోహమున జిక్కి మీ చేతుల గాజులూడిపడినవి, పతివ్రతా భావములు సడలి పోయినవి గాన మధురలోవైశ్యుల కడుపునఁ బుట్టుడని శపించిరి.

విరహముతో నున్నవారు చిక్కిపోవుట వలన చేతులగాజులూడి పడినవనుట కవిసమయము. మూలమున కిది భిన్నముగానున్నను శృంగారసపోషకముగ నున్నది.

శపించిన తరువాత ఋషిపత్నులు మమ్మునిట్లు శపించిన మాకు సద్గతి యేది కృపగల్గి మమ్ము రక్షింపరే! యని ప్రార్థింప, ఆ మునులు మీరు మధురాపురమున వైశ్యులయిండ్ల జన్మించియుండగా కొంతకాలమునకు మధురేశ్వరుడు గాజుల సెట్టియై వచ్చి మీ హస్తములు బట్టి గాజులు బెట్టగా మీకు మోక్షము గలుగునని శాపవిమోచనముఁ దెలిపిరి. అనంతరము వారు వైశ్యుల యిండ్ల జన్మించిరి. శాపముఁ శాపవిమోచనము మూలము కన్న తెలుగున విపులముగా (పదమూడు ద్విపదలలో) నున్నవి.[4]

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 152. 3-9 శ్లోకములు.
2. చొక్కనాథ చరిత్ర. పుట 159, 160 లు.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 152. శ్లో. 10-14 వరకు.
4. చొక్కనాథ చరిత్ర. పుట 160.

(7) మునికాంతలు శాపవశమున వైశ్యుల యిండ్ల కన్యలై యుదయించగా వారిని శాపవిముక్తలఁ గావించుటకు సుందరేశ్వరుడు వృద్ధ వైశ్యవేషము ధరించి గాజుల విక్రయార్థము వచ్చినాడని మూలమున నుండగా, దానికి మెఱుగు పెట్టినట్లు చొక్కనాథ చరిత్రమున ఆ వైశ్యకన్యల తల్లిదండ్రులు పెండ్లీడు వచ్చిన మా [illegible] కీర్తిమంతుని సెట్టి పద్ధము విచారించుచుండ చొక్కనాయకుడు గాజుల సెట్టియై ముసలి వేషమున వచ్చినాడని యున్నది.

(8) గాజులసెట్టి వేషవర్ణన మూలమున 5 శ్లో.లలో నుండగా అనువాదము 3 ద్విపదలలో నున్నది.[2] ఈ వర్ణన దేనికదే స్వతంత్రము.

(9) మూలముకన్న అధికముగా తెనుగున గాజులసెట్టియై వచ్చిన చొక్కనాథుడు గాజులోయమ్మ గాజులో యనుచు వీథివీథిన దిరుగుచు,విక్రయించుచు,వైశ్యవీథికేతెంచును. ఈ వర్ణన మూలమున 'వైశ్యవీథ్యామటన్ ప్రాహ వైశ్యవేషధరో హరః'[3] అని శ్లోకార్థపాదమున నుండగా తెనుగునందు 9 ద్విపదలలో నున్నది. ఇందు 5 ద్విపదలలో గాజుల పేర్లు గూడ కలవు.[4]

(10) సంస్కృతమున వైశ్యవీథిలో గాజులమ్ముచున్న వృద్ధవైశ్యుని సుస్వరమును విని వైశ్యకన్యలు అతని సమీపించి గాజుల దొడిగించు కున్న విషయము 8 శ్లో.లలో నున్నది.[5] చొక్కనాథ చరిత్రమున 25 ద్విపదలలో శృంగార రసాత్మకమైన వర్ణనతో దశేయుతా ముద్రను పొంద రమ్యముగా సాగినది.[6] సుందరేశ్వరుడు భిక్షుకుడై వచ్చి ముని కాంతల మోహింపజేసినట్లే గాజుల సెట్టి వేషమున వైశ్యకన్యల మోహింపజేయును. మూలముకన్న అధికముగా ఇందు చొక్కసెట్టి మాయలబడి తిరుగుచున్న కన్యల గాంచి వారి పెద్దలు వచ్చి నీవెవ్వరని చొక్కనాథుని వివరములడుగ, 'నాపేరు చొక్కసెట్టి' యని తెలియపఱచుచు మాయమైపోవును.

(11) చొక్కనాథుని కరస్పర్శవలన వైశ్యకన్యలు సద్యోగర్భములుదాల్చిన విషయము మూలమున, అనువాదమున సమానమే యైనను మూలముకన్న ఎక్కువగా చొక్కనాథ చరిత్రమున బాలలు గర్భవతులగుటజూచి వారి తల్లిదండ్రులు తమకు అపకీర్తివాటిల్లెనని తమవంశములను నిందలు పుట్టెనని యదలి అగ్నిప్రవేశముజేయ సిద్ధపడుచుండగా చొక్కనాథుడు ప్రత్యక్షమై ఆ కన్యల పూర్వజన్మవృత్తాంతమును వివరించి మాయనుగ్రహమున వారు గర్భముదాల్చిరిగాన వారికేకళంకములేదని తెలిపి అగ్నిలో జొఱుట మానుడని

---

1. హాలాస్యమాహాత్మ్యము పుట 152, 153లు.
2. చొక్కనాథ చరిత్ర. పుట 161.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 153. శ్లో. 22.
4. చొక్కనాథ చరిత్ర. పుట 161, 162లు.
5. హాలాస్యమాహాత్మ్యము. పుట 153.
6 చొక్కనాథ చరిత్రము. పుట 163, 164లు.

ఎప్పుడును మీ వంశములోనొక కన్యను మేము తప్పక పెండ్లి యాడుదుమని వారి ననుగ్రహించి అంతర్హితుడగును.[1] మూలమున గర్భవతులైన వైశ్యకన్యలు సంతానవతులై చిరకాలముండి దివంగతులైనారని మాత్రమే యున్నది.[2] చొక్కనాథ చరిత్రము నందలి పై వర్ణన యంతయు మూలమునకు భిన్నమైనను కథాగతికి భంగమువాటిల్లలేదు. అద్భుతరస ప్రధానమగు కావ్యమున ఈలీల శృంగార రసభరితమగు ఒక చిన్న కావ్యఖండికవలె సాగినది.

(12) కథ ముగింపులో చొక్కనాథ చరిత్రమున ఆవైశ్యకన్యలు మృతిఁ జెందిన తరువాత మరు జన్మమున దారుకావనమున మరల మునిపత్నులై యుండిరని వ్రాసి యున్నది.[3] ఈ విషయము మూలమునలేదు.

## పంచమాశ్వాసము - ముప్పది రెండవలీల

(1) హాలాస్యమాహాత్మ్యము నందు ముప్పది తొమ్మిదవ అధ్యాయమున అష్టసిద్ధ్యుపదేశమను పేరున నున్న ముప్పది మూడవలీల చొక్కనాథ చరిత్రమున పంచమాశ్వాసమున ముప్పది రెండవ లీలగా ననువదించియున్నది.

(2) మూలమున ఈలీల 38 శ్లో.లలో నుండగా తెనుగున ఈ లీల 68 ద్విపదలలోనున్నది.

(3) ఈలీల పూర్తిగా మూలముననుసరించి అనువదింపబడినది. మూలమునకు, అనువాదమునకు కథలో మార్పులేదు. కాని మూలముకన్న తెనుగున కథ వర్ణనాత్మకముగా నడచినది.

(4) మూలమును బెంచి వ్రాసిన వటవర్ణన ఇందు రమ్యముగానున్నది.[4]

## షష్ఠాశ్వాసము - ముప్పది మూడవలీల

(1) హాలాస్యమాహాత్మ్యమున నలువదియవ అధ్యాయమున గల 'కాంతారచ్ఛేది చోళార్ధ ద్వార' మను ముప్పది నాలుగవలీల చొక్కనాథ చరిత్రమున షష్ఠాశ్వాసమున ముప్పది మూడవలీలగా ననువదితము.

(2) సంస్కృతమున ఈ లీల 42 శ్లో.లలో కథితము. తెనుగున ఇది 66 ద్విపదలలో వర్ణితము.

(3) మూలమున ఈలీల కులభూషణ పాండ్యుని కాలమున జరిగినట్లు వ్రాసియున్నది. అనువాదమున పాండ్యరాజుపేరు వ్రాయలేదు.

(4) మూలమున కులభూషణుని పైకి దండెత్తి వచ్చిన చోళరాజుపేరు కాంతారచ్ఛేది రాజని యున్నది. తెనుగున 'కాడ్వెట్టి' యని యున్నది. ఇది దేశీయ నామమై యుండును.

---

1. చొక్కనాథ చరిత్రము. పుట 164, 165.
2. హాలాస్యమాహాత్మ్యము పుట 154.
3. చొక్కనాథ చరిత్ర. పుట 166.
4. చొక్కనాథ చరిత్ర. పుట 168.

(5) ఈ లీల యందలి కథ యంతయు మూలానుసారముగనే తెలుగున నున్నది- కేవలము ఆరు పంక్తుల సూర్యాస్తమయ వర్ణనదప్ప, మార్పులు, చేర్పులు ఏమియును లేవు.

## షష్ఠాశ్వాసము – ముప్పది నాలుగవలీల

(1) హాలాస్యమాహాత్మ్యమున నలువది యొకటవ అధ్యాయమున నున్న పానీయ ప్రదానమను ముప్పదియైదవలీల చొక్కనాథ చరిత్రమున షష్ఠాశ్వాసమున ముప్పది నాలుగవ లీలగా ననుపదించియున్నది.

(2) సంస్కృతమున ఈలీల 47 శ్లో. లలో కథితము. తెనుగున ఈలీల 92 ద్విపదలలో వర్ణితము.

(3) మూలమున ఈలీల కులభూషణుని పెద్దకుమారుడైన రాజేంద్ర భూపాలుని కాలమున జరిగినట్లు వ్రాసియున్నది. కులభూషణుని చిన్న కొడుకైన రాజసింహుడు చోళరాజైన కాంతారచ్ఛేదుడను వాని కూతురును వివాహమాడి మామతో గలసి తనయన్నయగు రాజేంద్ర పాండ్యుని పైకి దండెత్తివచ్చుట ఇందు కలదు. చొక్కనాథ చరిత్రలో వారి పేర్లు వ్రాసిలేవు.

(4) మూలమున కథా ప్రారంభమున రాజేంద్ర పాండ్యుడు శౌర్యాది సద్గుణోపేతుడై, సామంతగణసంవృతుడై, కామునోడించు రూపవంతుడై, నీతిమంతుడై రాజ్యము చేయుచుండగా, కాంతారచ్ఛేదుడను చోళరాజు తనకూతురును రాజేంద్ర పాండ్యుని కిచ్చి పెండ్లి జేయదలచి ఒకానొక అప్తునిచే వర్తమానము బంపును.[1]

చొక్కనాథ చరిత్రమున పాండ్య భూపాలుడు తనజాతి పాలతులను వివాహమాడక కామాంధుడై వారకాంతలను కామించి పెండ్లాడి కాలము గడపుచుండగా చోళరాజు పాండ్యునితో వివాహ సంబంధము కొరకు మా కుమార్తెను మీకు మనువుగా నిత్తు గైకొమ్మనుచు దెలియ జెప్పుడని దూతలను బంపినట్లు కలదు.[2]

మూలమున రాజేంద్రుడు నీతి వర్తనుడుగా, తెనుగున కామాంధుడుగా వర్తమానము మూలమున అప్తులు, తెనుగున దూతలు, తెచ్చుట, అను నీ మార్పులు దప్ప తక్కిన కథయంతయు మూలముననుసరించి తెనుగున నడచినది.

(5) మూలమున పాండ్య, చోళసైన్యములకు జరిగిన యుద్ధము ఒకే ఒక శ్లో. లో నుండగా[3] చొక్కనాథ చరిత్రమునందు 20 ద్విపదలలో నున్నది.[4]

(6) చలివేంద్ర బెట్టిన శివుడు మూలమున తపస్వి వేషమున నుండగా, తెనుగున జంగమవేషమున నున్నాడు. వేషవర్ణన వేనికవే స్వతంత్రములు.

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 158.
2. చొక్కనాథ చరిత్రము. పుట 175.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 159. శ్లో. 26.
4. చొక్కనాథ చరిత్రము. పుట 177, 178లు.

(7) చొక్కనాథ చరిత్రమున మూలమున లేని చొక్కనాథస్తుతి ఐదు ద్విపదలలోనున్నది.

## షష్ఠాశ్వాసము - ముప్పదియైదవలీల

(1) హాలాస్యమాహాత్మ్యమున నలువది రెండవ అధ్యాయమున గల 'రసవాద ప్రదర్శన' మను ముప్పది యాఱవలీలను చొక్కనాథ చరిత్రమున షష్ఠాశ్వాసమున ముప్పదియైదవ లీలగా ననువదించియున్నది.

(2) సంస్కృతమున ఈలీల 50 శ్లో. లలో నున్నది. తెనుగున ఇది 46 ద్విపదలలో నున్నది.

(3) ఈలీల యందలి కథా ప్రారంభమున, కథామధ్యమున, కథాంతమున మూలమునకు, తెనుగునకు భేదములు కన్పించుచున్నవి.

(4) మూలమున కథా ప్రారంభమున పుష్పవనమునకు సంబంధించిన విషయము 9 శ్లో. లలో నున్నది.[1] ఇది చొక్కనాథ చరిత్రమున వక్ష్యమాన కథాంశమున కంతగా నవసరము లేదుగాన తెనిగించలేదు. "పుష్పవనమన" గలదు. అని మాత్రమే వ్రాసినాడు.[2]

హాలాస్యమాహాత్మ్యమున కథయందు శివుడనుగ్రహించిన వనిత పేరు 'అన్న పూర్ణేశ్వరీ దేవి' యనియున్నది. ఈమె వారవనిత యని కథా ప్రారంభమున చెప్పక కథామధ్యమున లక్ష్యార్థ సూచనగా చెప్పబడినది.[3]

చొక్కనాథ చరిత్రమున వారవనిత పేరు 'చొన్నాయి' యని, ఈమె వారవనిత అని, కథా ప్రారంభమున వాచ్యముగా చెప్పియున్నది.[4]

(5) హాలాస్యమాహాత్మ్యమున కథామధ్యమున అన్నపూర్ణ యింటికి వచ్చిన సిద్ధరూపుడైన శివుడు ఆమెను కామ దృష్టితో జూచుచు "యుష్మాకమిచ్ఛామాంభోక్తుం"[5] అని ద్వంద్వార్థమున బలుకగా ఆమె ఆతని మనో భావము గ్రహించి లోని కాహ్వానించును.

చొక్కనాథ చరిత్రమున ఈ సందర్భమున తిరువేంగళకవి ఒక చక్కని కల్పన నాల్గు ద్విపదలలో వ్రాసినాడు. ఆ ద్విపదలివి.

"తరమైన సొమ్ములు తనువునఁ బూని
గురువింద పూస ముక్కున బెట్టి నీల
మనిన నా బాలిక యతి భక్తితోడఁ
దననేరుమూసి పాదము బట్టి కొనగ
మగువ ముక్కఱ ముత్యమాయె, నాతపసి

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 160. శ్లో. 2-10 వరకు.
2. చొక్కనాథ చరిత్ర. పుట 180.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 160. శ్లో.లు 24-26.
4. చొక్కనాథ చరిత్ర. పుట 180.
5. హాలాస్యమాహాత్మ్యము. పుట 161. 25వ శ్లోకం.

నగుచు విభూతిఁ జొన్నాయికిఁ బెట్టి
యరయ కన్నుల నీల మధరంబు కెంపు
వెరవొప్పఁ గురువింద విధమాయెననిన్న[1] - ఈ సిద్ధుడు తన యందాసతో నున్నాడని భావించి ఆమె అతనిని లోనికాహ్వానించును.

(6) హాలాస్యమాహాత్మ్యమున కథా మధ్యమున అన్నపూర్ణచే లోనికాహ్వానింప బడిన సిద్ధ రూపుడైన శివుడు ఆమెకు కొంత శివధర్మబోధ గావించినాడు.[2] చొక్కనాథ చరిత్రమున కవి దీనిని వదలినాడు.

(7) హాలాస్యమాహాత్మ్యమున సిద్ధరూపుడైన శివుడు అన్నపూర్ణకు శివధర్మమును బోధించి నీకు ఉత్సవ విగ్రహము నొకటి జేసి యిత్తు, నేను సిద్ధుడను, నీయింట నున్న రౌప్య, తామ్రాది లోహములను దెమ్మనును[3]. చొక్కనాథ చరిత్రమున సిద్ధుడు వారవనితతో "నేను నీ మీది యాసతో రాలేదు. నీ చింత దీర్చి పోవుటకు మధుర నుండి వచ్చితినని తెలిపి నీ యింట నున్న ఇనుప ముట్లెల్లను దెమ్మని చెప్పును.[4]

రౌప్య తామ్రాది లోహములను దెమ్మనుటకన్న, ఇనుప ముట్లు దెమ్మనుట తరువాత జరుగబోవు శివుని లీలకు మరింత గొప్పతనము నాపాదించినది.

"నీ చింత దీర్చి పోదు" నను మాటకు తిరువేంగళ కవి కథ ప్రారంభములోనే 'చొన్నాయి శివుని యొక్క బంగారు విగ్రహము లేక చింతతో మైనాన శివుని రూపమును జేసికొని ఆరాధించుచుండగా చొక్కనాథుడామెననుగ్రహించ దలచి సిద్ధుడై వచ్చినట్లు వ్రాసినాడు. ఈ మార్పు వలన మూలముకన్న తెనుగున కథాకథన శిల్పము చక్కగా పోషింపబడినది.

(8) హాలాస్య మాహాత్మ్యమున సిద్ధుడు రౌప్యతామ్రాది లోహమును తన భస్మహస్తమున్[5] స్పృశించి బంగారముగాజేయగా చొక్కనాథ చరిత్రమున సిద్ధుడు ఔషధమున్[6] బూసి ఇనుమును బంగారముగా మార్చినాడు. మూలమున ఈ లీలకు రసవాద ప్రదర్శనమను నామౌచిత్యము పాటింపబడలేదు. చొక్కనాథ చరిత్రమున కవి చక్కగా పాటించినాడని పై విషయమును బట్టి ధృవపడుచున్నది.

(9) హాలాస్యమాహాత్మ్యమున అన్నపూర్ణ సిద్ధుడొనరించి యిచ్చిన బంగారముతో చొక్కనాథుని ఉత్సవ విగ్రహమును చేయించుకొని దాని సౌందర్యమునకు మోహితురాలై అతని చెక్కిలినొక్కగా నాటినుండి ఆ పరమశివుడు సుందరేశ్వరుడని పేరు పొందినాడని

---

1. చొక్కనాథ చరిత్రము. పుట 181.
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 161, 162.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 162.
4. చొక్కనాథ చరిత్రము. పుట 181.
5. హాలాస్యమాహాత్మ్యము. పుట 162. 26వ శ్లోకం.
6. చొక్కనాథ చరిత్రము. పుట 181.

ఆ నెక్కు ఇప్పటికిని నిలచియున్నదని వ్రాసియున్నది. ఈ విషయము చొక్కనాథ చరిత్రమున గూడా ఇట్లేయున్నది.

(10) చొక్కనాథ చరిత్రమున కథాంతమున చొన్నాయియను వారవనితకు అంత్యకాలమున చొక్కనాథుడు దివ్యవిమానమును బంపి కాయముతో తన లోకమునకు చేర్చుకొనెనని యున్నది1. ఇది మూలమునలేదు.

## షష్ఠాశ్వాసము – ముప్పది యారవలీల

(1) హాలాస్యమాహాత్మ్యమున నలువది మూడవ అధ్యాయమున చోళసేనా ప్రభంజనమను పేరుననున్న ముప్పది యేడవలీల చొక్కనాథచరిత్రమున షష్ఠాశ్వాసమున ముప్పది యారవ లీలగా ననువదితము.

(2) సంస్కృతమున ఈ లీల 55 శ్లో.లలో నున్నది. తెనుగున ఈ లీల 85 ద్విపదలలో నున్నది.

(3) హాలాస్యమాహాత్మ్యమున ఈ లీల ప్రారంభమున పాండ్యవంశానుచరితము వ్రాసి అనంతరము ఈ లీల సుందరేశపాద శేఖరుని కాలమున జరిగినట్లు తెలిపియున్నది2 చొక్కనాథ చరిత్రమున పాండ్య రాజవంశానుచరితముగాని, పాండ్యరాజు పేరుగాని లేదు.

(4) మూలమున పాండ్యరాజు సైన్యముల వివరములిట్లున్నవి.

"పత్తీనాందశసాహస్రం సహస్రంవాజినామపి।
వారణానాంశతమపి రథానాందశకం తథా॥3

అనువాదమున పాండ్య సైన్య వివరములిట్లున్నవి.

"నూఱేనుగులు పది నూఱు తేజీలు
నూఱు నూర్లగు జనుల్ నూత్నసంబంధ
ములతోడగల రథంబులు గల్గ నాకు4"

రథసంఖ్య మూలమున దశకమని యుండగా పది రథములు రథబలముగా పెద్ద లెక్కకు రావని గాబోలు చొక్కనాథ చరిత్రమున "నూత్న సంబంధములతోడ గల రథంబులు" అని సంఖ్యను సూచించకుండా కవి అనువదించినాడు.

(5) మూలమున పరమశివుని కిరాతవేషము మూడు శ్లో.లలో వర్ణించియున్నది5. తెలుగున ఆరు ద్విపదలలో కవి స్వతంత్రముగా వర్ణించినాడు6

పైన సూచింపబడిన చిన్న మార్పులు దప్ప మొత్తముపై ఈ లీలయందలి కథ మూలానుసారముగను, వర్ణనలు స్వతంత్రముగాను ఉండి మూలముకన్న తెలుగున రమ్యముగా నున్నది.

---

1. చొక్కనాథ చరిత్రము. పుట 183.
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 163. శ్లో. 3-7 వరకు.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 163. శ్లో. 13
4. చొక్కనాథ చరిత్ర. పుట 184.
5. హాలాస్య మాహాత్మ్యము. పుట 164. శ్లో. 33-35 వరకు.
6. చొక్కనాథ చరిత్ర. పుట 186.

## షష్ఠాశ్వాసము – ముప్పది యేడవలీల

(1) హాలాస్య మాహాత్మ్యము నందలి నలువది నాలుగవ అధ్యాయమున నున్న 'అక్షయతండుల మూత ప్రదానము'ను ముప్పది యెనిమిదవ లీల చొక్కనాథ చరిత్రమున షష్ఠాశ్వాసమున ముప్పది యేడవ లీలగా ననువదించియున్నది.

(2) మూలమున ఈ లీల 43 శ్లో.లలో వ్రాసియుండగా తెనుగున ఇది 69 ద్విపదలలో వ్రాసి యున్నది.

(3) చొక్కనాథ చరిత్రమున ఈ లీల మూలార్థమును గ్రహించి స్వతంత్రముగా రచించినట్లున్నది గాని మూలముననుసరించి యనువదించినట్లు లేదు.

(4) ఈ లీలయందు శివుని అనుగ్రహమునకు పాత్రుడైన శూద్రుడు మూలమున భక్త సౌమ్యుడు, తెలుగున హాలదేవుడు.

(5) హాలాస్యమాహాత్మ్యమున భక్తసౌమ్యుడను శూద్ర జాతికి చెందిన శైవ భక్తుడొకడు ప్రతి నిత్యము శివభక్తులను అన్నదానముచే తృప్తి పఱచుచుండగా ఒకనాడు వాని భక్తిని పరీక్షింపదలచి పరమశివుడు వానికి దారిద్ర్యము సంభవింపజేయును.[1]

చొక్కనాథ చరిత్రమున హలాయుధుడను శూద్రజాతి శివభక్తుడొకడు ప్రతినిత్యము ఒడయలకు బహువిధాన్నములను దానము చేయుచుండుటను జూచి చొక్కనాథుడు "భువినెవ్వరు వీని జోడుగా జంగమార్చనసేయ జాలరు" అని అంగయకణ్ణెమ్మతోననగా ఆ దేవి "వాడు భాగ్యవంతుడు గాన ఎవ్వరు వచ్చినా లేదనక పెట్టుచున్నాడు పేదవాడైనచో బెట్టునా?" అని యనును. అప్పుడు శివుడు

"పెట్టెడివారలు పేదలైనాను
బెట్టుదురెంతయు ప్రియముతో నెపుడు
ధరలోభివానికి ధనము గల్గినను
మరణమొందును గాని మరికాసువిడదు"[2] అని చెప్పి శర్వాణికి హలాయుధుని దానగుణమును నిరూపింపదలచి వానికి పేదఱికము గలిగించును.

(6) హాలాస్యమాహాత్మ్యమున భక్త సౌమ్యుడు దారిద్ర్య బాధచే శివభక్తులకు నిత్యాన్నదానము చేయలేక కడు దుఃఖితుడై భార్యాసమేతముగ హాలాస్యనాథుని సన్నిధికేతెంచి ప్రార్థించగా ఆ దేవుడశరీరియై వారియింట నొక 'అక్షతాక్షత సంపూర్ణమైన మూతము' నొకదానిని కల్పింతునని అనతీయగా[3] చొక్కనాథ చరిత్రమున చొక్కనాథుని మందిరము నుండి తన సతియును తాను ధాన్యపుముడియకొని తెచ్చినారని యున్నది.

ధాన్యపు ముడి వర్ణన ఇందు దేశీయమైన పద్ధతిన వర్ణింపబడినది. ఆ పంక్తులివి.

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 165.
2. చొక్కనాథ చరిత్ర. పుట 189.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 166, 167 లు.

"వన్నెగా కమ్మని వాసన గల్గు
సన్న బియ్యమ్ముగా నడియించి కడిగి
వండిన యన్నమువ్వారి గా నెద్ద
యుండి భుజించిన నెదురుగా గలిగి
యొక రాయిఱప్పయు నొక నూకమెఱిక
యొక వడ్ల గింజ లేకుండగాజేసి
కలకాలమును దఱుగక యుండునట్లు
నల రంగ నక్షయంబై నిండి యుండు"[1]

## షష్ఠాశ్వాసము - ముప్పది యెనిమిదవలీల

(1) హాలాస్యమాహాత్మ్యమున నలువది యైదవ అధ్యాయమున 'వైశ్యశిశోర్మాతుల భావం' అను పేరుతో నున్న ముప్పది తొమ్మిదవలీల చొక్కనాథ చరిత్రమున షష్ఠాశ్వాసమున ముప్పది యెనిమిదవలీలగా ననువదించి యున్నది.

(2) మూలమున ఈ లీల 55 శ్లో.లలో నుండగా, తెనుగున ఇది 50 ద్విపదలలోననువదింపబడినది.

(3) మూలమున వైశ్యుని పేరు అర్థపతి. వాని భార్యపేరు సుశీల. తెనుగున అతని పేరు ధనపాల సెట్టి. భార్య పేరు లేదు. అర్థపతియను సంస్కృత నామమునకు తెనుగర్థము ధనపాలుడు.

(4) హాలాస్యపురాణమున ఈలీల యందలి కథా ప్రారంభమున అర్థపతి యను వైశ్యుడు సంతానములేక తన సోదరి కుమారుని అనగా మేనల్లుని దత్తత తీసికొని తన యావదాస్తిని వానికిచ్చి వృద్ధాప్యమున తన భార్యయైన సుశీలతో గలసి వనమున కేగెను.[2]

చొక్కనాథ చరిత్రమున ధనపాలసెట్టి తనయులు లేక తన తోడ బుట్టు తనయుని తనయునిగా నంగీకరింపక ప్రేమతో మేనయల్లుని బిడ్డగా బెంచి, ధన ధాన్యలోహ గోధన రాసులెల్ల నిచ్చి, యందఱకొప్పగించి వాని తల్లిని వానితో నింటనుంచి తాను తన భార్యతో గలసి సంతానార్థమై తీర్థాంతరము బోయినాడని కవి మూలమునకు భిన్నముగా వ్రాసినాడు.[3] దీనికి కారణము రాబోవు కథయందు వైశ్యుని దాయాదులు వైశ్యుడు వెడలిపోయిన అనంతరము అతని దత్తపుత్రుని వాని తల్లిని బాధించి ఆస్తిని స్వాధీనపఱచుకొనుట, ఆబాలుని ఆస్తిని వానికిప్పించుటకై చొక్కనాథుడు ధన పాలసెట్టి రూపమునవచ్చుట. వృద్ధాప్యమున వానప్రస్థమును పాటించి తపోవనములకు వెడలిపోయినవాడు తిరిగివచ్చుటకు వీలులేదని ఎంచి తిరువేంగళకవి చొక్కనాథ చరిత్రమున సంతానార్థమై తీర్థాంతరము బోయినాడని మార్చి వ్రాసినాడు.

1. చొక్కనాథ చరిత్రము. పుట 191.
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 167, 168 లు. శ్లో. 3-9 వరకు.
3. చొక్కనాథ చరిత్ర. పుట 193

(5) మూలము నందు వైశ్యుడు తపోవనములకు బోగానే అతని జ్ఞాతులు ఆస్తిని స్వాధీనపఱచుకొని అతని సోదరిని మేనల్లుని ఇల్లు వెడలగొట్టిరి. అప్పుడా వైశ్యవనిత హాలాస్యనాథుని జేరి స్తుతించగా ఆ దేవుడు అమె స్వప్నమున ఎ(ప్రవేశమును ధరించివచ్చి జ్ఞాతులను ధర్మాసనమునకుఁ బిలిపింపుము నీ వ్యవహారమును చక్కబఱతును పొమ్మని చెప్పి అదృశ్యుడయ్యెను.[1]

చొక్కనాథ చరిత్రమున ధనపాల సెట్టి తీర్థాంతర మేగిన పిమ్మట అతని దాయాదులు వచ్చి హంతలై వారి నలజడి బెట్టి మా సోదరుని సొమ్ము మా సొమ్ముగాక ఈ సొమ్ములకు మీరలెవ్వరని ఆస్తిని స్వాయత్తపఱచుకొని తల్లిబిడ్డలను ఇల్లువెడల గొట్టగా, కొడుకును చంకనబెట్టుకొని ఆ తల్లి దుఃఖించుచు చొక్కనాథుని జేరి తన విన్నపమును స్వామికి నివేదించుకొనగా, అమె మొరవిని 'వారిని నీవు ధర్మాసనమునకు రప్పింపుము. అందు నేను మీ తగవు దీర్చి నీ సొమ్ములను నీకిప్పింతును" అని చెప్పెను.[2] ఇందు మూలము నందు వలె స్వప్నమున వచ్చి చెప్పినట్లుగాక చొక్కపతి స్వయముగా చెప్పినట్లున్నది-.

(6) మూలమునవైశ్యుని సోదరి హాలాస్యనాథుని సన్నిధి జేరి హేమపద్మాకరమున తీర్థమాడి, కుమారుని స్నానమాడించి, ధౌతవస్త్రములను ధరించి, భస్మమునలదుకొని, పంచాక్షరీ మంత్రమును మాటిమాటికి నుచ్చరించుచు, లింగమునెదుట తన పుత్రుని డించి ప్రార్థించుట మొదలిడినది.[3] చొక్కనాథ చరిత్రమున ఆర్తురాలై చేరిన స్త్రీ తతంగమంతా ముగించుకొని సుందరేశునికి తన విన్నపమును వినిపించిన దనుటకంటె దుఃఖముతో తన గోడును చొక్కనాథుని మ్రోల నివేదించుకొనినదనుట యుక్తముగా నుండునని ఎంచి తిరువేంగళకవి మూలములోని పై విషయమును తొలగించినాడు.

(7) చొక్కనాథ చరిత్రమున వైశ్యుని సోదరి తన కన్యాయము జేసిన దాయాదులను ధర్మాసనమునకు బిలిపింపగా వారు రాకద్రెబ్బిరి. అట్టి సమయములో నాకిక దిక్కెవరని చొక్కనాథునిఁ దలచుచుండగా అ దేవుడు ధనపాలసెట్టి వేషమున తన యింటికి వచ్చి, సోదరికి జరిగిన అన్యాయమునకు చింతించి పిన్నపెద్దలను గూర్చి దాయాదుల అగడములను వారికి జెప్పి వారిచే తప్పనిపించి, తన యాస్థిని తన సోదరికి మేనల్లునికి ఒప్పగించి అంతర్హితుడగును.[4]

మూలమున దాయాదులు ధర్మాసనమునకు రాకదొబ్బుట అను వృత్తాంతము లేదు. హాలాస్యేశ్వరుడు అర్థపతి వేషమున నరాసరి ధర్మాసనమునకు వచ్చి తీర్పు చెప్పి ఆస్థిని అమెకిప్పించును.[5]

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 168.
2. చొక్కనాథ చరిత్రము. పుట 190.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 168. శ్లో. 13-15 వరకు.
4. చొక్కనాథ చరిత్రము. పుట 194, 195లు.
5. హాలాస్యమాహాత్మ్యము. పుట 169.

లోకమున సాధారణముగా అన్యాయముగా పరుల సొమ్ము కాఁజేసిన వారు పిలువగనే తమంత తాము ధర్మాసనములనకు రాకదొచ్చుట సహజము. కాన చొక్కనాథ చరిత్రమున కవిమూలమును మార్చి వ్రాయుచు ఈ విషయమున తన లోకజ్ఞతను ఋజువు పఱచుకొనినాడు.

(8) మూలమున ఈ కథయంతయు సుందరేశాంఘ్రిశేఖరుడను పాండ్యరాజు విని సుందరేశుని జేరి స్తుతించుట మొదలగు విషయములు ఈ లీలాంతమున 6 శ్లో.లలో నున్నవి.[1] చొక్కనాథ చరిత్రమున తిరువేంగళకవి ఇవి కథకు అంతగా సంబంధించినవి కావని వీనిని తెనిగింపక విడిచిపెట్టినాడు.

## షష్ఠాశ్వాసము – ముప్పది తొమ్మిదవలీల

(1) హాలాస్యమాహాత్మ్యమున నలువది యాఱవ అధ్యాయమున 'వరగుణ పాండ్య బ్రహ్మహత్యార్తిశమనం' అను పేరుతో నున్న నలువదియవ లీల చొక్కనాథ చరిత్రమున షష్ఠాశ్వాసమున ముప్పది తొమ్మిదవలీలగా ననువదితము.

(2) హాలాస్యమాహాత్మ్యమున ఈ లీల 87 శ్లో.లలో రచింపబడగా చొక్కనాథ చరిత్రమున ఈ లీల 150 ద్విపదలలో మూలమున లేని కల్పనలతో విపులముగా వర్ణించి యున్నది.

(3) హాలాస్యమాహాత్మ్యమున వరగుణపాండ్యుడు ఒకనాడు మృగయా వినోదమునకై వెడలి రాత్రమున తిరిగివచ్చుచుండగా మార్గమధ్యమున నిద్రించుచున్న ఒక విప్రునిపై నుండి తన యశ్వము లంఘింపగా దాని కాళ్ల క్రిందబడి ఆ విప్రుడు 'హా' యని అర్తనాదముజేసి మరణించెను. ఈ విషయమును రాజు గమనింపక స్వగృహమునకు తిరిగివచ్చెను. తెల్లవారగనే ఆ పురి బ్రాహ్మణులా వృత్తాంతమును తెలిసికొని రాజును జేరి (విప్ర వధా వృత్తాంతము) తెలియపఱచగా రాజు చాలా చింతించి ఆ ప్రేతమునకు దహన సంస్కారాదులను నిర్వర్తింపఁ జేయించి తనకు బ్రహ్మహత్యాదోషము వాయునుపాయము దెలుపుడని వారిని ప్రార్థించగా నందు ధర్మశాస్త్ర విచక్షణులైన కొందఱు భూసురవరులు రాజుతో "అఘమర్షణ మంత్రములతో తిలాజ్యహోమకార్యమును జరిపించి వృక్ష రాజమునకు ప్రదక్షిణముచేసి, దశదానాదులు నిర్వర్తించిన బ్రహ్మహత్యాదోషము దొలగునని చెప్పిరి– పాండ్యరాజు బ్రాహ్మణులు చెప్పినట్లు సర్వమును నిర్వర్తించెను. అయినను బ్రహ్మహత్యాదోషము దొలగక ఛాయా రూపమున తననంటి పెట్టుకొని యుండగా భీతుడై యుండెనని చెప్పు సందర్భమున" మునులు అగస్త్యుని ఓ మహామునీ ఇంతకు పూర్వము మీరు ఇంద్రునకు వృత్రహత్యాదోషము హాలాస్యక్షేత్ర దర్శన మాత్రముననే బాసినదని చెప్పితిరి, పాండ్యరాజు సదాహాలాస్యక్షేత్రముననే వసించును గదా ఆతనికెందుకు బ్రహ్మహత్యదొలగలేదు అని ప్రశ్నించుటయు వారికి

---

1 హాలాస్యమాహాత్మ్యము పుట 170 49-54 శ్లోకములు.

అగస్త్యుడు సమాధానమిచ్చుటయు" మూలమున నున్నది.[1] చొక్కనాథ చరిత్రమున కవి దీనిని అనువదించకవదలివేసి బ్రహ్మహత్యాదోషమంటి వరగుణపాండ్యుడు మనోవ్యథతో నున్నాడని తెలిసి శత్రురాజైన చోళ భూపాలుడు దండెత్తివచ్చిన విషయమును వ్రాసెను.[2]

మూలమున బ్రహ్మహత్యాదోషము బాపుకొనుటకై పాండ్యరాజు హాలాస్యేశ్వరుని సన్నిధి నిలచి ప్రార్థించగా దివ్యవాణి మధ్యార్జున మహేశ్వరుని దర్శించిన బ్రహ్మహత్యాదోషము దొలగునని తెలుపు సందర్భమున "మత్ప్రసాదేన యుద్ధేతు చోళంజిత్వాసమాగతమ్"[3] అను వాక్యమున్నది. ఈ వాక్యమునాధారముగా గొని ముందే చోళుడు దండెత్తివచ్చినాడని వ్రాసిన యుక్తముగా నుండునని ఎంచి తిరువేంగళకవి యిట్లు వ్రాసినాడు. అనంతరము వరగుణ పాండ్యుడు చొక్కనాథుని జేరి బ్రహ్మహత్యాదోషముచే బాధపడుచున్న నాపైకి చోళుడు దండెత్తి వచ్చినాడని ఈ యాపదలనుండి నన్ను రక్షింపుమని చొక్కనాథుని వేడుకొనగా హాలాస్యనాథుడు వినువీధి వాణియై "ఓ పాండ్యభూపాలా! మా యాజ్ఞచే చోళరాజు నెదిర్చి గెలిచి యా చోళదేశమున నున్న 'తిరువెడమరుదూరున బెంపొందు మధ్యార్జునేశుని' దర్శింపుము. నీకు బ్రహ్మహత్యాదోషము బాపుదునని యానతిచ్చెను."[4] – అని చొక్కనాథ చరిత్రమున నుండగా మూలమున దేవాలయము నుండి తిరిగివచ్చిన తరువాత చోళుడు తన పైకి ఎప్పుడు దండెత్తి వచ్చునోయని పాండ్యరాజు అదనుకొరకెదురు చూచుచుండెనని (చోళాగమన మన్వీక్ష్య) యున్నది.[5]

చొక్కనాథ చరిత్రమున ముందే దండయాత్రా వృత్తాంతమును వ్రాయుట వలన కథకు మరింత బలము చేకూరినది.

(4) పాండ్య చోళరాజుల యుద్ధవర్ణన మూలమున లేదు. చొక్కనాథ చరిత్రమున దాదాపు 15 ద్విపదలలో వర్ణించియున్నది.[6]

(5) చొక్కనాథుని కరుణచే వరగుణ పాండ్యుడు చోళరాజును జయించి అతనిని చోళభూములలోనికి(దఱుము నెపమున బోయి ఆ మండలముననున్న మధ్యార్జునేశ్వరు గుడిని జేరుచు విడువక తనవెంటనే వచ్చుచున్న బ్రహ్మహత్యను గాంచి ఆ పాండ్యరాజు తూర్పుగోపుర ద్వారమున గుడి జొరగా ఆమహాదేవుని యాజ్ఞచే 'బ్రహ్మహత్య' గుడిజొరరాక అద్వారము చెంతనే నిలచిపోయెను. గుడివెడలునపుడు పాండ్యరాజు దక్షిణ ద్వారము నుండి వచ్చెనని చొక్కనాథ చరిత్రమున మూలమునకు భిన్నముగా వ్రాసియున్నది.[7] మూలమున పాండ్యరాజు పశ్చిమద్వారమునుండి బయలు వెడలెనని యున్నది.[8]

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 171. శ్లో. 23, 24, 25లు.
2, 4. చొక్కనాథ చరిత్రము. పుట 197.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 172. శ్లో. 44.
5. హాలాస్యమాహాత్మ్యము. పుట 172. శ్లో. 46.
6. చొక్కనాథ చరిత్రము. పుట 198.
7. హాలాస్యమాహాత్మ్యము. పుట 172. శ్లో. 57.
8. చొక్కనాథ చరిత్రము. పుట 200.

(6) వరగుణపాండ్యుడు మధ్యార్జునేశ్వరు దర్శించుకొని బ్రహ్మహత్యాదోషమును బాపుకొని మధురాపురికి తిరిగి వచ్చెనని హాలాస్యమాహాత్మ్యమున నుండగా తిరువేంగళకవి చొక్కనాథ చరిత్రమున పాండ్యుడు మరికొన్నినాళ్లు మధ్యార్జునముననే యున్నట్లు వ్రాసి మూలమున లేని కొన్ని వింతలను ఇందు వ్రాసినాడు. అవి యివి.

(i) ఒకనాడు పాండ్యభూపాలుడు మధ్యార్జునేశ్వరు గుడిచుట్టు ప్రదక్షిణము చేయుచుండగా శ్వానవిష్ఠమందుండుటను గాంచి వికలుడై ఎవ్వడు నీ విష్ఠమెత్తిన వానికి నా అర్ధరాజ్యమిత్తునని యాలోచించి వెంటనే మనసుమార్చుకొని ఎల్లప్పుడు నన్నే ఏలుకొమ్మని స్వామి ఇచ్చిన నా రాజ్యమును నేను పరాయివానికిచ్చుట ఎందులకని భావించి తనపచ్చడముతో నెత్తియావల బారవేసెను.స్నానము చేసివచ్చి మరల ప్రదక్షిణములు చేయుచుండగా అచట వేములు పండుట జూచి శివలింగములు పండ్లుగా బండెనని సంతోషించి అచట నున్న వేముల కెల్ల ఎండగాలి సోకకుండ మండపాలు గట్టించెను.[1]

(ii) ఎండకాపునకు గుళ్లో తిలలెండబోసిన తినుచుండు నొక పరిచారకుని ఇతర పరిచారకులు బట్టుకొని రాజు కొప్పగించగా ఆ రాజు నువ్వులేలదింటివని వానినడుగగా వాడు జన్మజన్మములకు ఆ స్వామికి లెంకనైయుండగా తింటినని చెప్పెను. అప్పడా రాజు వాని చేతిలో నున్న నువ్వులపప్పును తాను తీసికొని నేను గూడా స్వామికి లెంక నౌదుననుచు నమలినాడు.[2]

(iii) పరమేశ్వరుని రథోత్సవము జరుగుచుండగా మునులు మొ॥నవారు ముందు నడచుచుండ, వారి పాదధూళి రథ చక్రధూళి తనశిరముపై నిడుకొనుచు రాజు వెనుక వచ్చుచుండెను. ఇంతలోచారులు దొంగదొంగ పట్టుకొమ్మనుచు ఒకని వెంట పఱుగిడుచుండ ఆ చోరుడు ప్రేతభూమిని జొచ్చి అందు హరహరా! యని భూతేశుని దలచుకొనుచు ప్రేత భూతిలో దొర్లుచుండెను. వానిని బట్టుకొని వచ్చి రాజు ముందఱబెట్టగా ఈతడు శుద్ధాత్ముడని వానిని వదలి పెట్టెను.[3]

(iv) సరస్సులో కప్పలు మ్రోయుచుండుటజూచి పరమేశ్వరుని ధ్యానమంత్రమని తలచి అందు రూకలను చల్లించెను.[4] ఈ రీతిగా పాండ్యుడు సతీసమేతముగ మధ్యార్జునేశ్వరుని కొన్నాళ్లు సేవించి మధురాపురికి తిరిగివచ్చెను.

## సప్తమాశ్వాసము - నలువదియవలీల

(1) హాలాస్యమాహాత్మ్యమునందలి నలువదియేడవ అధ్యాయముననున్న 'కాష్ఠ భార విక్రయమను' నలువది యొకటవలీల చొక్కనాథ చరిత్రమున సప్తమాశ్వాసమున నలువదియవ లీలగా ననువదించియున్నది.

---

1. చొక్కనాథ చరిత్రము. పుట 200, 201లు.
2. చొక్కనాథ చరిత్ర. పుట 201.
3. చొక్కనాథ చరిత్ర. పుట 201, 202.
4. చొక్కనాథ చరిత్ర. పుట 202.

(2) మూలమున ఈలీల కేవలము ( 38, ముప్పది ఎనమిది శ్లోకములలో సంక్షిప్తముగా వ్రాసియుండగా చొక్కనాథ చరిత్రమున ఈలీల(118) ఒక వంద పదునెనిమిది ద్విపదలలో అతి విస్తృతముగను, అతిరమ్యముగను వ్రాసియున్నది.

(3) ఈలీల వరగుణపాండ్యుడు రాజ్యమేలుచున్న కాలమున జరిగినదని మూలమున చెప్పబడినది. తెలుగున మధురనుపాండ్యుడు పాలించుకాలమున అనిమాత్రమే యున్నది.

(4) ఈలీల యందలి కథలో పాండ్యరాజు ఆస్థాన గాయకుడైన బాణభద్రుని ప్రతిష్ఠ నిలుపుటకు సుందరేశ్వరుడు కాష్టభార విక్రేత వేషమున ఏతెంచి చోళదేశపు గాయకుని విడిది ముందు కట్టెల మోపును దించి తన గాన విద్యను ప్రదర్శించిన సందర్భమున మూలమునందు-

"సార్ధం రాగ విశేషైశ్చ నారదాత్తుంబురోరపి।

అతిరమ్యమనౌపమ్యం రాగం గాంధారికంజగౌ ॥[1]" -అని యుండగా చొక్కనాథ చరిత్రమున తిరువేంగళకవి కట్టెలమ్ముకొనువానిగానమును ఎనమిది మగరాగములతో ఇరువదినాల్గు ముదితరాగములతో మంద్రమధ్యమ తారాస్థాయులలో సప్తస్వరముల మేళవింపులతో తారక బ్రహ్మము ముట్టి భూచర ఖచరులద్భుత మంది వినగ పాడెనని మూలమును బెంచి మనోరంజకముగా వర్ణించినాడు.[2] ఈ వర్ణన కవికిగల సంగీత పరిజ్ఞానమునకు నిదర్శనముగానున్నది-.

(5) కట్టెలమ్ముకొను వాని మధురగానమును విని చోళదేశపు గాయకుడు విడిది ఇంటిలో నుండి వెలుపలికి వచ్చి వానిని జూచి నీవెవరవని యడుగు సందర్భమున మూలమునందు[3].

శ్లో. "అపృచ్ఛత్కస్త్వమితి చ వచోభిర్వినయాన్వితైః।
సోऽబ్రవీదార్తవద్భూత్వానాథ కిం మాద్యపృచ్ఛసి॥"22

శ్లో. "దా సోహం గాయకేంద్రస్య భద్రాఖ్యస్యమహాప్రభోః
ఏతచ్ఛ్రుత్వాభిన్నమానాశ్చివేత్యుక్త్వాంతరగతః॥23॥ అని రెండు శ్లోకములలో

నున్న విషయము చొక్కనాథ చరిత్రమున-[4]

"......................................
అలర నీవెవ్వడవనుచు వాడడుగ
వెఱచిన వానట్లు వెసలేచి నిలచి
యరుగు గ్రక్కున డిగ్గియట నోరుమూసి

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 175. శ్లో. 20.
2. చొక్కనాథ చరిత్ర. పుట 208-210 వరకు.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 175.
4. చొక్కనాథ చరిత్రము. పుట 210.

యే బాణభద్రుని యింటిదాసుడను
నా బాణునకు శిష్యులధికులు గలరు.
పాడనేర్చిన వాని పాటకు దిద్దు
పాడనేరనివారిఁ బరగ నీరీతిఁ
గట్టెలు దెమ్మని కట్టడసేయు
గట్టిగా వానింటి కట్టెమోపరిని
అని కట్టెలెత్తుకయయ్యె పోయెదనె
యని చెప్పి చనియె.. ............." నని యున్నది.

మూలమునకన్న ఇందు బాణభద్రుని యొక్క గొప్పతనము ఎక్కువగా ధ్వనించినది. మూలమున నేను బాణభద్రుని దాసుడనని చెప్పిన మాత్రమున బాణభద్రుని గొప్పతనము చొక్కనాథ చరిత్రమున ధ్వనించినంతగా ధ్వనించలేదు. పాడనేరని వారి నీరీతి కట్టెలుదెమ్మని కట్టడసేయుననుటతో, పాడనేరని వాని పాటయే ఇంత మధురముగానున్న పాడనేర్చిన వాని యజమాని పాట ఇంకెంత గొప్పగా నుండునో యని ఆ రాత్రికి రాత్రే చోళదేశపు గాయకుడు వాని పరిజనముతోపాటు పారిపోవుటకు కారణమైనది ఈ కల్పన మూలాతిరిక్తమేయైనను మూలార్థమునకు మెఱుగు బెట్టినట్లున్నది.

(6) మూల గ్రంథమున పాండ్యరాజు చోళదేశగాయకుడు పలాయనమై పొయినాడను వార్త దూతల వలన విని తన సముఖమున నున్న బాణ భద్రుని కారణమరయకయే ఘనముగా సన్మానించి అతనిని హాలాస్యేశ్వరుని ఆలయగాయకుడుగా నియమించినట్లున్నది.[1] కాని చొక్కనాథ చరిత్రమున కవి బాణ భద్రునిచే ఈ పవల్లాలుడు (చోళ దేశగాయకుడు) తన పరిజనముతోపాటు పలాయితు డగుటకు చొక్కనాథుడు కట్టెలమ్ముకొను వాని వేషమున వచ్చి వాని యింటి ముందు ఘనముగా బాడి తనను కరుణించినాడని చెప్పించెను.[2] కవి ఈ మార్పుచేయుటవలన రాజు బాణభద్రునికి శివుని ఎడగల భక్తిని గ్రహించి ఆదేవుని సేవకై ఆలయగాయకుడుగా నియమించినాడని సకారణముగా కార్యమును దెలుప వీలగుచున్నది. లేనిచో రాజు పాత్రకు గాని బాణభద్రుని పాత్రకు గాని ఔన్నత్యము చేకూరదు. ఔచిత్యము కలుగదు.

ఈ విధముగా ముచ్చటైన మూడు మెఱుగులతో మూలకథకు మరింత సొబగును కలిగించి తిరువేంగళకవి చొక్కనాథ చరిత్రమున ఈలీలనురమ్యముగా రచించినాడు.

## సప్తమాశ్వాసము – నలువదియొకటవ లీల

(1) హాలాస్యమాహాత్మ్యమున నలువదియెనిమిదవ అధ్యాయమున 'చేరాయ పత్రికాలేఖనం' అను పేరున నున్న నలువది రెండవలీల చొక్కనాథ చరిత్రమున సప్తమాశ్వాసమున నలువది యొకటవ లీలగా ననువదించి యున్నది.

---

1 హాలాస్యమాహాత్మ్యము పుట 175.

2 చొక్కనాథ చరిత్ర. పుట 211

(2) సంస్కృతమున ఈ లీల 46 శ్లో.లలో నుండగా తెనుగున ఇది డెబ్బది తొమ్మిది ద్విపదలలో వ్రాసి యున్నది.

(3) ఈ లీల యందలి కథ సాంతము మూలానుసరణముగా యున్నది. చెప్పుకోదగిన మార్పు, చేర్పులు ఏమీ లేవు. మూలమున విషయము సంక్షిప్తముగా నుండగా ఇది ద్విపద గావున కొంత విస్తరముగా నగుపించుచున్నది.

## సప్తమాశ్వాసము – నలువది రెండవలీల

(1) హాలాస్యమాహాత్మ్యమున నలువది తొమ్మిదవ అధ్యాయమున 'భద్రస్యఫలకాదానం' అను పేరుననున్న నలువది మూడవలీల చొక్కనాథ చరిత్రమున సప్తమాశ్వాసమున నలువది రెండవ లీలగా ననువదితము.

(2) మూలమున ఈ లీల 39 శ్లో.లలో నుండగా తెనుగున ఈలీల 54 ద్విపదలలోనున్నది.

(3) చొక్కనాథ చరిత్రమున బాణభద్రునకు సుందరేశ్వరుడు 'జంగమవేషమున' వచ్చి స్వర్ణఫలకమును ఇచ్చినట్లున్నది.[1] మూలమున జంగమవేషమున గాక అశరీరియై బాణుని ముందు నిలిపినట్లున్నది.[2]

(4) చొక్కనాథ చరిత్రమున బాణభద్రుడు శివప్రసాదమైన స్వర్ణఫలకమును గ్రహించి తననను గ్రహించినందులకు చొక్కనాథుని స్తుతించినట్లున్నది.[3] మూలమున నిట్టి 'స్తుతి' లేదు.

(5) చొక్కనాథ చరిత్రమున బాణభద్రుడు స్వర్ణఫలకమునుగైకొని తన ఇంటికి వెడలుటతో కథ సమాప్తమైనది.[4] కాని హాలాస్యమాహాత్మ్యమున బాణభద్రుడు తెచ్చిన స్వర్ణఫలకమును గాంచి బంధువులు సంతోషించుటయు, వరగుణ పాండ్యుడు ఈ వృత్తాంతమును విని బాణుని బిలిపించి ఆ ఫలకమును పూజించి గ్రామమును ధనాదులను దానము చేయుటయు మొదలైన విషయములతో ఈలీల సమాప్తమైనది.[5]

(6) మూలమునందు ఈ కథ 23 శ్లో.లలోనే పూర్తియైనది. గాన చొక్కనాథ చరిత్రములో కవి వానినే తెనిగించి ఆ తదుపరి 39వ శ్లో. వరకు (అయిదవ అంశమున చూపినది) గల వృత్తాంతము అనవసరమని తలచి వదలి వేసినాడు.

(7) ఈలీల యందలి వర్ణనలు వేనికవే స్వతంత్రములు.

(8) మూలమున 23 శ్లో.లలో కథ సంక్షిప్తముగా నుండగా తెనుగున 50 ద్విపదలలో విపులముగా నున్నది.

---

1. చొక్కనాథ చరిత్రము. పుట 219.
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 179.
3. చొక్కనాథ చరిత్ర. పుట 220.
4. చొక్కనాథ చరిత్ర. పుట 220.
5. హాలాస్యమాహాత్మ్యము. పుట 179, 180లు. శ్లో. 24-39లు.

## సప్తమాశ్వాసము – నలువది మూడవలీల

(1) హాలాస్యమాహాత్మ్యమందలి ఏబదియవ అధ్యాయమున 'భద్ర వనితా విజయ ప్రదానం' అను పేరున నున్న నలువది నాలుగవలీల చొక్కనాథ చరిత్రమున సప్తమాశ్వాసమున నలువది మూడవలీలగా ననువదించియున్నది.

(2) మూలమునందీలీల 59 శ్లో. లలో నుండగా తెనుగునందీలీల 154 ద్విపదలలో మూలకథను విస్తరించి వ్రాసియున్నది.

(3) మూలమున ఈలీల వరగుణపాండ్యుని కుమారుడైన రాజరాజ పాండ్యుని కాలమున జరిగినదని చెప్పబడినది. తెలుగున పాండ్యరాజును పేర్కొనలేదు.

(4) ఈ లీల యందలి కథా ప్రారంభమున హాలాస్యపురాణమునకు, చొక్కనాథ చరిత్రమునకు ఒక ముఖ్య భేదము గలదు.

మూలమున గాన విద్యావిచక్షణురాలైన భద్రుని భార్య, రాజరాజు భార్యను చూచుటకు రాజభవనమునకు వచ్చినది. అదే సమయమున రాజరాజు భోగకాంతగూడా రాణిని జూచుటకు వచ్చినది. ఈమెయు గానవిద్యయందు నిపుణురాలే, వీరిరువురికి గానవిద్యలో నేను మిన్నయనగా నేను మిన్నయని కలహము జరిగినది. అంతట పాండ్యరాజు స్త్రీ వార్త నవలంబించి భద్రునిభార్య విజయమును భగ్నము చేయవలెనని చింతించి గాన విద్యయందు కుశలు రాలైన ఒక వనితను రహస్యాప్తులను బంపి పిలిపించినట్లు కలదు.[1]

చొక్కనాథ చరిత్రమున భద్రుని భార్య అతని మరణానంతరము భద్రునివలెనే శివాలయమునకు బోయి పాడుచునే కులధర్మమునను సరించి రాజసమ్ముఖమునకు గూడా బోయి పాడుచుండెను. ఈ విధముగా కొంత కాలము గడచిన పిదప ఒకనాడే కాంతమున రాజునెదుట బాడుచుండ అతడు మోహాతిశయమున మనోవికారము నొంది యామెను శయ్యాతలమునకు రమ్మని పిలువగా, ఆ బాణువనిత మనస్తాపమునొంది "రాజా! నీమాటలు నావీణులకు సూదులు జొన్పు విధమాయె, నేను నా భర్తను దక్క అన్యులను తోబుట్టుతో సమానముగా జూతును. సౌందర్య నాథుని మీద యాన మీమాటలు నాకు రుచింపవని" పలికెను. ఆ మాటలను వినిన పాండ్యరాజు లజ్జితుడై "ఈమెను బలాత్కరింత మన్నను స్వామిపై యానవెట్టినదిగదా"యని చింతించి ఆక్రోధమును మనసులో నుంచుకొని ఇంటికి బంపించెను. తదుపరి ఎట్లైనను ఈమెను భంగపఱుపవలెనని తలంచి ఆ ప్రొద్దె ఆమెను మించిన పాటకత్తెను దెమ్మని ఎవ్వరుగానకుండ ఊడిగపు వానిని పంపించి తెప్పించెనని కలదు.[2]

ఈ వృత్తాంతము మూలమునకు పూర్తిగా భిన్నముగా నున్నను ఇదియే యుక్తి సహముగా నున్నది.-

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 180.
2. చొక్కనాథ చరిత్ర. పుట 220, 221లు.

పాండ్యరాజు భార్యను జూచుటకు బాణు వనిత వచ్చుట, అదే సమయమునకు ఆ రాజు వారకాంతవచ్చుట, సందర్భము లేకయే ఇరువురు తమ గాన మాత్సర్యముతో పోట్లాడుకొనుట, పాండ్యరాజు వారకాంతమాట పాటించి భద్రుని భార్యను భంగపఱుప నిశ్చయించుకొనుట, తిరువేంగళకవికి అనౌచిత్యములుగా దోచి యుండవచ్చును. అందుకే దానిని మార్చి పై విధముగా రచించినాడు. పాండ్యరాజు పాత్రచిత్రణలో 'అతడు సచ్ఛీలుడు కాడు' అను విషయమును మూలము నావిష్కరించినట్లుగా తెనుగున రచించినాడు. వారవనితకు బాణు వనితకు జరిగిన కలహమును చొక్కనాథ చరిత్రమున కథమధ్యలో ఇరువురు గాయనుల మధ్య జరిగినట్లు మార్చి వ్రాసినాడు.[1] వీరిలో కలహమును ప్రారంభించినది క్రొత్తగా వచ్చిన గాయనియే గాన బాణ భద్రుని భార్య వ్యక్తిత్వము చక్కగా పోషింపబడినది. వారకాంతపాత్రను, రాజు భార్యపాత్రను తొలగించి కథా ప్రణాళికను మూలమునకు భిన్నముగా రూపొందించికొని మూలమునందలి అనౌచిత్యమును పరిహరించి, మూలగౌరవమును కాపాడినాడు. మరియు పాండ్యరాజు బాణుని భార్యను బలాత్కరింప నెంచియు, స్వామిపై నానవెట్టినదని మనసు మార్చుకొనుటలో ఎంతటి దుష్టులైనను పాండ్యరాజులకు సుందరేశ్వరుడనినచో భయభక్తులుమెండు" అను ముఖ్య విషయమును కవి తలపున నుంచుకొని రచించినట్లు దెలియుచున్నది.

(5) చొక్కనాథ చరిత్రమున ఈ లీల యందలి తరువాతి కథ యంతయు మూలము ననుసరించి వ్రాయబడినది. మూలమున సంక్షిప్తముగా నున్న విషయమును అనువాదమున కవి పెంచి వ్రాసినాడు. కథాత్మ చక్కగా పోషింపబడినది.

ఈ నలువది మూడవ లీలతో గలిపి బాణుని కుటుంబమును రక్షించుటకు చొక్కనాథుడు నెఱపిన లీలలు నాలుగైనవి. చొక్కనాథ చరిత్ర సప్తమాశ్వాసమున ఇది యొక ఖండ కావ్యము వలె ఇరువది యైదు పుటలలో మధురముగా సాగినది-

## సప్తమాశ్వాసము – నలువది నాలుగవలీల

(1) చొక్కనాథ చరిత్రము నందలి సప్తమాశ్వాసములోని నలువది నాలుగవ లీల హాలాస్యమాహాత్మ్యమున కైవర్తకన్యాపాణి గ్రహణమను అరువదిమూడవ అధ్యాయము, ఏబది ఏడవ లీలకు అనువాదము.

(2) మూలమునందీలీల 61 శ్లో.లలో కథితము. అనువాదము నందీలీల 142 ద్విపదలలో విపులముగా వర్ణితము.

(3) ఈ లీలయందలి కథాప్రారంభమున చొక్కనాథ చరిత్రమున తిరువేంగళకవి "చొక్కనాథుడు అంగయకణ్ణెమ్మకు జ్ఞానోపదేశముగా కొన్ని కథలు చెప్పుచుండగా ఆమె...

"జగతి సృష్టిస్థితి సంహారకర్త

యగుట గావున పరాకయ్యె నాయెడను" అని మూలమునకు భిన్నముగా వ్రాసినాడు.[2]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 223.
2. చొక్కనాథ చరిత్ర. పుట 230

మూలమున మీనాక్షీ దేవి పరాకగుటకు కారణము "పుత్రలాలన లీలయా.[1]" అని కలదు.

(4) సుందరేశ్వరుడు తాను చెప్పిన ఆగమశాస్త్రములను మీనాక్షీ దేవి శ్రద్ధగా వినని కారణమున ఆమెను శపించిన వృత్తాంతము మూలమున 5 శ్లోకములలో వ్రాసియుండగా[2] తిరువేంగళకవి చొక్కనాథ చరిత్రమున 15 ద్విపదలలో వర్ణించినాడు.[3]

(5) తన తల్లిని శపించినందులకు కోపించి వినాయకుడు శివుడానతిచ్చు ఆగమశాస్త్రములను తొండముతో నెత్తి సముద్రములోనికి విసరి వేసెనని ఒకే ఒక శ్లోకములో మూలమున నుండగా[4] చొక్కనాథ చరిత్రమున కవి ఈ వృత్తాంతమును ఎనమిది ద్విపదలలో వర్ణించి, విఘ్నేశ్వరుని చర్యకు కోపించక నవ్వెనని కల్పించినాడు.[5]

(6) విఘ్నేశ్వరుడు అగమములను జడధిలో బడవేయు సమయమున కుమారస్వామి వచ్చి తన తల్లిని శపించినాడను కోపముతో శివుని చేతిలోనున్న పుస్తకమును దీసి అవల బారవైవగా శివుడు క్రుద్ధుడై అతని శపించిన విషయము మూలమున నాలుగున్నర శ్లో.లలో నుండగా[6] చొక్కనాథ చరిత్రమున కవి ఎనమిది ద్విపదలలో వర్ణించినాడు.[7]

(7) శివుడు నందీశ్వరుని శపించిన విషయము మూలమున ఒక్క శ్లోకములో వ్రాసియుండగా[8] తెనుగున కవి 5 ద్విపదలలో రచించినాడు[9].

కుమారస్వామిని శపించుచున్న సందర్భమున నందీశ్వరుడు అచ్చటికి రాగా కోపముతోనున్న శివుడు తన లీలను పూర్తిచేయుట కొరకై అతనిని చేపవై జలధి మధ్యమున నుండుమని శపించెనని మూలమున నుండగా చొక్కనాథ చరిత్రమున తిరువేంగళ కవి "చొక్కనాథుడు వాకిట కావలియున్న నందీశ్వరుని తన ఎదుటకు బిలిచి తనను నిందించిన ఆ కుమారస్వామిని లోనికి ఎందుకు రానిచ్చినావని" నందీశ్వరుని శపించెనని మార్చి వ్రాసినాడు. ఇందుజూపిన కారణము మూలముకన్న బాగుగానున్నది.

(8) మీనాక్షిని దాశవరుని కూతురుగా జన్మించుమని, శిఖి వాహనుని మధురాపురమున కోమటి కడుపున బుట్టుమని, నందీశ్వరుని జలధి మధ్యమున మత్స్యమై యుండుమని శివుడు శపించుటయు మరియు తాను వలవాడై వచ్చి జలధి మధ్యమున చేప రూపముననున్న నందికేశ్వరుని వలవేసి పట్టియు, దాశవరుని కూతురుగానున్న మీనాక్షిని వివాహమాడుట వలనను వారికి శాపవిమోచనములు కలిగించిన

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 220. శ్లో. 3
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 220, 221లు. శ్లో. 2-6 వరకు.
3. చొక్కనాథ చరిత్రము. పుట 230, 231లు.
4. హాలాస్యమాహాత్మ్యము. పుట 221. శ్లో. 7
5. చొక్కనాథ చరిత్రము. పుట 231.
6. హాలాస్యమాహాత్మ్యము. పుట 221. శ్లో. 7-11 1/2 వరకు.
7. చొక్కనాథ చరిత్రము. పుట 231.
8. హాలాస్యమాహాత్మ్యము. పుట 221. శ్లో. 12
9. చొక్కనాథ చరిత్రము. పుట 232.

విషయము మూలముననను చొక్కనాథ చరిత్రముననను ఒకే రీతిగా నున్నవి. కుమారస్వామికి శాపవిమోచనము మూలములోను అనువాదములోను ఈ లీలలో తెలుపలేదు. హాలాస్యమాహాత్మ్యమున 55వ లీలలో (61వ అధ్యాయము) చొక్కనాథ చరిత్రమున 54వ లీలలో తెలుపబడినది.

మొత్తముపై ఈ లీలయందలి కథ మూలమున సంక్షేపముగా నుండగా చొక్కనాథ ~~చరిత్రమున~~ తిరువేంగళ కవి రమ్యమైన వర్ణనలతో, ఇంపైన కల్పనలతో పెంచి వ్రాసినాడు.

## సప్తమాశ్వాసము – నలువదియైదవ లీల

(1) హాలాస్య మాహాత్మ్యమునందు ఏబది యొకటవ, ఏబది రెండవ అధ్యాయములలో వర్ణింపబడిన 'సూకర శిశుస్తన్యప్రదానం' క్రోడపోత సచివత్వ ప్రకల్పనం' అను నలువదియైదు, నలువది యాఱవ లీలలు రెండు చొక్కనాథ చరిత్రమున సప్తమాశ్వాసమున నలువదియైదవ లీలగా ననువదించియున్నది.

(2) మూలమున 45వ లీల 85 శ్లో.లలోను, 46వ లీల 40 శ్లో.లలోను వెరశి నూటా ఇరువదియైదు (125) శ్లో.లలో వర్ణింపబడగా ఈ కథ చొక్కనాథ చరిత్రమున ఒకే లీలలో 87 ద్విపదలలో సంక్షిప్తముగా వ్రాసియున్నది.

(3) హాలాస్యమాహాత్మ్యమున శూద్రపుత్రులు పన్నెండుమంది ఒక ముని శాపవశమున కిటిగర్భమున జన్మించినది. వారిని గన్న ఆ తల్లిపందికి వేటకై వచ్చిన రాజ రాజ పాండ్యునకు జరిగిన యుద్ధము, పర్వతమువంటి యా వరాహము చచ్చిపడిన పిదప అది వరాహగిరిగా ప్రసిద్ధమైనదను వృత్తాంతము, ఋషుల కోరికపై అగస్త్యుడు వినిపించిన వరాహగిరి మాహాత్మ్యము. ఇవి యన్నియు 28వ శ్లో. నుండి 73వ శ్లో. వరకు అనగా మొత్తము 45 శ్లో.లలో వర్ణింపబడియున్నవి.[1] తిరువేంగళకవి చొక్కనాథ చరిత్రమున సుందరేశ్వరుని లీలకు అంతగా సంబంధించినవి కావని యీ అవాంతర విషయములన్నింటిని తెనిగించక వదలిపెట్టినాడు. రాజ రాజ పాండ్యుని పేర్కొనక ఎవరో ఒక రాజు వేటకై వచ్చి ఆ పందిని చంపివేయగా సుందరేశ్వరుడు వాటికి తల్లియై వచ్చి స్తన్యమునిచ్చి రక్షించెనని కథ ముగించినాడు.[2] మూలమున ఈ కథ మొదటి 28 శ్లో.లలోను[3] చివరి 14 శ్లో.లలోను[4] మొత్తము 42 శ్లో.లలో వర్ణించియున్నది. చివరి 14 శ్లో.లలో సుందరేశ్వరుడు పందియైవచ్చి స్తన్యమిచ్చి రక్షించు వృత్తాంతమున్నది. చొక్కనాథ చరిత్రమున ఈ వృత్తాంతము 38 ద్విపదలలో చెప్పినాడు.[5]

---

1 హాలాస్యమాహాత్మ్యము. పుట 184, 185, 186లు

2. చొక్కనాథ చరిత్ర. పుట 240.

3. హాలాస్యమాహాత్మ్యము. పుట 183,184 మరియు 186. శ్లో. 2-28 మరియు 71-84.

4 హాలాస్యమాహాత్మ్యము. పుట 183,184 మరియు 186 శ్లో. 2-28 మరియు 71-84.

5 చొక్కనాథ చరిత్ర పుట 240, 241, 242లు

### సప్తమాశ్వాసము – నలువదియాఱవ లీల

(1) హాలాస్యమాహాత్మ్యమునందు 53వ అధ్యాయమున చెప్పబడిన 'భారద్వాజపక్షిణోమృత్యుంజయోపదేశనం' అను పేరు గల 47వ లీల చొక్కనాథ చరిత్రమున సప్తమాశ్వాసమున 46వ లీలగా ననువదితము.

(2) సంస్కృతమున ఈ లీల 41 శ్లో.లలో నున్నది. తెనుగున ఇది 43 ద్విపదలలో నున్నది.

(3) ఈ లీలయందలి కథ పూర్తిగా మూలము ననుసరించి యనువదింపబడినది. మూలాతిక్రమణము లిందేమియు లేవు.

### సప్తమాశ్వాసము – నలువదియేడవ లీల

(1) హాలాస్యమాహాత్మ్యమున ఏబదినాలుగవ అధ్యాయమున 'కోయష్టేర్ముక్తి ప్రదానమ'ను నలువది యెనిమిదవ లీల చొక్కనాథ చరిత్రమున సప్తమాశ్వాసమున నలువదియేడవ లీలగా ననువదించి యున్నది.

(2) సంస్కృతమున ఈ లీల 53 శ్లో.లలో రచించియుండగా తెనుగున దీనిని తిరువేంగళకవి 83 ద్విపదలకు పెంచి వ్రాసినాడు.

(3) చొక్కనాథ చరిత్రమున మూలమును బెంచి వ్రాసిన భాగములు రెండు. ఒకటి :అనావృష్టివర్ణన, రెండు : కొలని వర్ణన.

(i) హాలాస్యమాహాత్మ్యమున 'అనావృష్ట్యాకదాచిత్సత్తటాకో నిర్జలోభవత్ । శరీరిః పరిఖిన్నస్సన్ భ్రామాహార కాంక్షయా[1]" అను శ్లోకమున నున్న అనావృష్టి యను మాటను చొక్కనాథ చరిత్రమున కవి పదమూడు ద్విపదలలో వర్ణించినాడు[2] అట్లే కొలని వర్ణనలో

(ii) హాలాస్యమాహాత్మ్యమున 'తత్రాస్తిపావనం తీర్థం[3]' అను చిన్న వాక్యమును చొక్కనాథ చరిత్రమున పదమూడు ద్విపదలలో రమణీయముగా వర్ణించినాడు[4].

పైన చూపిన రెండు వర్ణనలు దప్ప ఈ లీలయంతయు మూలానుసారముగ తెలుగున నున్నది.

### సప్తమాశ్వాసము – నలువది యెనిమిదవ లీల

(1) హాలాస్యమాహాత్మ్యమున ఏబదియైదవ అధ్యాయమున 'పురసీమా ప్రదర్శనం' అను నలువది తొమ్మిదవ లీల చొక్కనాథ చరిత్రమున సప్తమాశ్వాసమున నలువది యెనిమిదవ లీలగా ననువదితము.

(2) సంస్కృతమున ఈ లీల 65 శ్లో.లలో వర్ణితము. తెనుగున ఈ లీల 46 ద్విపదలలో రచితము.

---

1 హాలాస్యమాహాత్మ్యము. పుట 190. శ్లో. 4
2. చొక్కనాథ చరిత్రము. పుట 246, 247 లు.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 196. శ్లో. 6
4. చొక్కనాథ చరిత్రము. పుట 247, 248.

(3) హాలాస్య పురాణమున పురాణ లక్షణమునను సరించి ఈ లీలా ప్రారంభమున పాండ్యరాజుల వంశానుచరితము పంద్రెండు శ్లో.లలో వ్రాసియున్నది[1]. మరియు పదుమూడవ శ్లోకము నుండి ఇరువది మూడవ శ్లోకము వరకు పది శ్లోకములలో ప్రళయకాల వర్ణనము, ప్రతిసర్గ వర్ణనాదులు కలవు[2]. చొక్కనాథ చరిత్రమున తిరువేంగళ కవి వీనిని నామమాత్రముగా ఐదారు ద్విపదలలో తెనిగించినాడు[3].

(4) మూలమున శివుడు సిద్ధవేషమున పాండ్యరాజుననుగ్రహించగా తెనుగున చొక్కనాధుడు నిజరూపముననే అనుగ్రహించును.

(5) మూలమున సిద్ధవేషధరుడైన శివుడు మధురాపురి ఎల్లలు జూపవలసినదని వాసుకిని నియమింపగా[4] చొక్కనాథ చరిత్రమున ఉరగ కంకణుడు తనచేతనున్న భుజగేంద్రునూడ్చి మధురాపుర ఎల్లలు జూపుమని నిర్దేశించెను[5]. మూలమునకన్న ఇది సరసము. ఈ మార్పులు దప్ప తక్కిన కథయంతయు మూలముననుసరించి నడచినది.

## అష్టమాశ్వాసము – నలువది తొమ్మిదవ లీల

(1) హాలాస్యమాహాత్మ్యమున 'చోళసేనా ప్రభంజన'మను ఏబది యాఱవ అధ్యాయముననున్న ఏబదియవ లీలను తిరువేంగళ కవి చొక్కనాథ చరిత్రమున అష్టమాశ్వాసమున నలువది తొమ్మిదవ లీలగా అనువదించినాడు.

(2) సంస్కృతమున ఈ లీల 51 శ్లో.లలో నుండగా తెనుగున దీనిని 79 ద్విపదలలో రచించినాడు.

(3) హాలాస్య మాహాత్మ్యమున ఈ లీలయందు వంశశేఖర పాండ్యునకు విక్రమచోళునకు యుద్ధము జరిగెనని యున్నది. చొక్కనాథ చరిత్రమున వరగుణ పాండ్యుని కుమారుడైన అనంతగుణ పాండ్యునకు ఒక చోళరాజుతో యుద్ధము జరిగెనని యున్నది. ఇందు చోళరాజు పేరు లేదు.

(4) ఈ లీల మూలముననుసరించి తెనుగున వ్రాయబడినది. కథలో మార్పులు లేవు. వర్ణనలు స్వతంత్రములు.

## అష్టమాశ్వాసము – ఏబదియవ లీల

(1) హాలాస్యమాహాత్మ్యమున ఏబది ఏడవ అధ్యాయమున నున్న సంఘ ఫలకాప్రదానమను ఏబది యొకటవ లీలను తిరువేంగళకవి చొక్కనాథ చరిత్రమున అష్టమాశ్వాసమున ఏబదియవ లీలగా ననువదించినాడు.

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 193.
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 193, 194 లు.
3. చొక్కనాథ చరిత్రము. పుట 251, 252 లు.
4. హాలాస్యమాహాత్మ్యము. పుట 194. 35వ శ్లోకం.
5. చొక్కనాథ చరిత్రము. పుట 253.

(2) మూలమున ఈ లీల 122 శ్లో.లలో విపులముగా వర్ణింపబడి యున్నది. తెనుగున దీనిని కేవలము 50 ద్విపదలలో సంక్షిప్తముగా రచించినాడు.

(3) హాలాస్యమాహాత్మ్యమున ఈ లీలయందలి కథా ప్రారంభమున నత్కీరుడు, భరణుడు, కపిలుడు మొదలుగాగల నలువదెనమండ్రు కవుల పూర్వవృత్తాంతము ఇట్లు వ్రాసియున్నది.

ఒకానొక కారణమున బ్రహ్మ తన భార్యయైన సరస్వతిని

"చత్వారింశచ్చ జన్మాని క్రమాదష్టోత్తరాణిచ ।

మర్త్యలోకే మర్త్యరూపా జనిష్యసి న సంశయః[1]॥

అని శపించినట్లు సరస్వతీదేవి తన తప్పును మన్నించుమని ప్రాధేయపడగా అతడు త్వదంగ సంభవులైన నలువదెనమండ్రు ద్రావిడ కవులు హాలాస్య క్షేత్రమున జనింతురనియు, ఆ సమయమున నలువది తొమ్మిదవ వాడుగా సుందరేశ్వరుడు వచ్చి వారితో నుండగా కొన్నాళ్లకు ఆ దేవుని అనుగ్రహమున దేహాంతమున ఆ నలువదెనమండ్రు కవులు ముక్తులగుదురని ప్రతి శాపమునను గ్రహించినట్లు, ఆ విధముగా జన్మించినవారే మధురాపురినున్న నలువదెనమండ్రు ద్రావిడ కవులని వ్రాసి యున్నది. హాలాస్య మాహాత్మ్యమున 26 శ్లో.లలో[2] వ్రాసియున్న పై వృత్తాంతమును తిరువేంగళ కవి చొక్కనాథ చరిత్రమున అనువదించలేదు. దీనికి కారణము ఈ లీలయందలి ప్రధాన విషయము సుందరేశ్వరుడు సంఘ ఫలకమును ప్రదానము చేయుటయేగాని నత్కీరాది నలువదెనమండ్రు ద్రావిడ కవుల పూర్వ వృత్తాంతములు తెలుపుట కాదని కవి అభిప్రాయ పడియుండవచ్చును.

(4) మూలమున నలువదెనమండ్రు ద్రావిడ కవులు సర్వత్ర సంచరించుచు హాలాస్య క్షేత్రమునకు వచ్చి సుందరేశ్వరుని దర్శించుకొని దివ్య విమానమును సమీపింపగా వారికి దూరము నుండి ఒక కవి తమవైపు వచ్చుచున్నట్లు కనబడెను. అతడు తమను సమీపించి కొంత సల్లాపమును నెఱపి మీ కవి సంఘమున నన్ను జేర్చుకొనుడని వారిని ప్రార్థించెను. అనంతరము అందఱు గలిసి సుందరేశుని ఆలయమును ప్రవేశించగా ఆ క్రొత్తగా వచ్చిన కవి అదృశ్యుడయ్యెను. అట్లు వచ్చిన వాడే సుందరేశ్వరుడని కవులు నిర్ధారించుకొని ఇక మనము మధురాపురినే యుండవలయునని నిర్ణయించుకొని వంశశేఖర పాండ్యుని ఆస్థానమున జేరిరి. ఈ వృత్తాంతమంతయు 26వ శ్లో. నుండి 50వ శ్లో. వరకు అనగా 24. శ్లో.లలో నున్నది[3]. చొక్కనాథ చరిత్రమున తిరువేంగళ కవి దీనిని మార్చి వ్రాసినాడు. ఈ విషయమును ఇదే వ్యాసమున 10వ అంశమున వివరింతును.

(5) హాలాస్య మాహాత్మ్యమున నలువదెనమండ్రు ద్రావిడ కవులు సుందరేశ్వరుని సంఘ ఫలకమును యాచించుటకు కారణము ఇట్లు తెలుపబడినది. వంశ శేఖర

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 199. శ్లోక పాదములు 11,12.
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 198, 199లు.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 199, 200.

పాండ్యుని ఎదుట సంఘమంటపమున నలువదెనమండ్రు ద్రావిడ కవులు నవరసములొలుకు తమ తమ కవిత్వములను వినిపించు చుండగా కొందరు కుకవులు గూడా తమ కుకవిత్వము వినిపించుటకు వచ్చుచుండిరని వారి కవిత్వమును వినుటకు సుకవులైన ద్రావిడ కవులు ఇచ్చగించక 'సుందరేశ్వరుని జేరి సత్కవులకు స్థానమీయగల సంఘ ఫలకము నిమ్మని ప్రార్థించిరి[1]

ద్రావిడ కవులు సుందరేశ్వరుని సంఘ ఫలకము నడుగుటకు కారణము చొక్కనాథ చరిత్రమున చెప్పలేదు. ఇందు అనంతగుణ పాండ్యుడు మధురనేలుచున్న కాలమున అని కథను ప్రారంభించి నత్కీరాది నలువదెనమండ్రు మహాసత్కావ్యులు మహేశ్వరుడైన చొక్కనాథుని జేరి స్తుతించి "భాసిల్లఁగా జగత్ప్రఖ్యాతియైన అసన మొకటి మాకభవ యిమ్మని[2]" ప్రార్థించిరని వ్రాసినాడు.

(6) హాలాస్యమాహాత్మ్యమున నత్కీరాది ద్రావిడ కవులు సుందరేశ్వరుని సంఘఫలకము నర్థించుట[3], సుందరేశ్వరుడు వారి ప్రార్థనను విని వారికి ప్రత్యక్షమై సంఘ ఫలకమొసగుట[4], సంఘ ఫలక వర్ణనము[5] ఉన్నవి. చొక్కనాథ చరిత్రమున నత్కీరాది కవులు చొక్కనాథుని సంఘ ఫలకము నర్థించుట[6], చొక్కనాథుడు వారికి సంఘ ఫలకమిచ్చుట[7], కలదు కాని సంఘ ఫలక వర్ణన మిందులేదు.

(7) మూలమున సుందరేశ్వరుడు సంఘ ఫలకమొసంగిన యనంతరము మాతృకాక్షరములను పూజించి మొదట నత్కీరుడు కూర్చొనగా అది కొంత పెరిగెను. తరువాత కపిలుడు కూర్చుండగా మరికొంత పెరిగెను. తదుపరి భరణుడు కూర్చొనగా మొదటివలెనే పెరుగ నారంభించెను. ఈ విధముగా ఒకరి తర్వాత ఒకరు నలువదెనమండ్రు కవులు ఆసీనులగుటయు, ఆ ఫలకము వారికి తగినంత స్థలమొసంగుటయు ఏడు శ్లో.లలో వర్ణించియున్నది.[8] చొక్కనాథ చరిత్రలో దీనిని మార్చి వ్రాసినాడు.

(8) నత్కీరాది ద్రావిడ కవులకు సుందరేశ్వరుడు సంఘ ఫలకమును ప్రసాదించిన ఘట్టమున మూలమునకు తెనుగునకు కొంత భేదమున్నది. మూలమున సంఘ ఫలకము 'అకారాది క్షకారాంతము మాతృకాక్షర మండితము మరియు చతురశ్రాకారమున' గలది. తెనుగున ఇది 'నాల్మూలమూఱెడు విరివిగల చదరము' మాత్రమే. అకారము నుండి క్షకారము వరకు మాతృకాక్షరములున్నట్లు ఇట వ్రాసి లేదు. మూలమున ఈ

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 201, శ్లో. 51-55 వరకు.
2. చొక్కనాథ చరిత్రము. పుట 260.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 201. శ్లో. 55-62.
4. హాలాస్యమాహాత్మ్యము. పుట 201, శ్లో. 63-68.
5. హాలాస్యమాహాత్మ్యము. పుట 201. శ్లో. 69, 70 లు
6. చొక్కనాథ చరిత్రము. పుట 260.
7. చొక్కనాథ చరిత్రము. పుట 260.
8. హాలాస్యమాహాత్మ్యము.. పుట 201, 202 లు. శ్లో. 71-77 వరకు.

ఫలకము ఒకరి తరువాత ఒకరికి చోటిచ్చినది - తెనుగున సంఘ ఫలకము నీయగానే 'ఇంత చిన్న ఫలకము మాఅందఱకెట్లు సరిపోవునని కవులు చొక్కనాథుని అడుగగా, విద్యాధికులైన వారికెందఱకైనను ఇది చోటిచ్చును' అని పరమశివుడు తెలిపెనని కవి మూల విషయమును మార్చి వ్రాసినాడు. అంతేకాదు. 'వారాఫలకము నొక మంటపమందుంచగా అది భూమిపై నిలువక అంతరిక్షమున నిలిచెనని' మూలాతిరిక్తముగా ఒక కల్పన గూడా చేసినాడు.

(9) మూలమున సంఘ ఫలకము నధివసించిన కవులు కావ్య ప్రబంధములు రచించి తమ తమ కావ్యములు తక్కిన వారి కావ్యముల కంటె గొప్పవని తమలో తాము కలహించుకొన్న వృత్తాంతము ఏడు శ్లోకములలో నున్నది[1]. చొక్కనాథ చరిత్రమున వీరి వివాదము రెండు ద్విపదలలో క్లుప్తముగా నున్నది[2].

(10) సుందరేశ్వరుడు కవియై వచ్చి వీరి వివాదమును పరిష్కరించిన వృత్తాంతము మూలమున 35 శ్లో.లలో అతివిస్తృతముగా సంభాషణా పద్ధతిని నడచినది[3] చొక్కనాథ చరిత్రమున ఇది 20 ద్విపదలలో పూర్తియైనది[4]. ఈ విషయమున మూలమునకు అనువాదమునకు కొంత భేదమున్నది. చొక్కనాథుని జేరి తమ వివాదమును పరిష్కరించుమని ద్రావిడ కవులు ప్రార్థించగా, ఆ దేవుడు కవియై రాగా, అతనితో వారు "మా కావ్య సారమ్ము పంచ లక్షణ యుక్తముగ జెప్పితివేని నిన్ను నలువది తొమ్మిదవ వానిగా గూడికొందుమని యనగా, ఆ చొక్కనాథుడంగీకరించి కావ్యలక్షణము లేర్పరించి చెప్పెను. చొక్కనాథ చరిత్రమున ఈ లీలయందలి అనువాద ప్రణాళిక ప్రకారము చొక్కనాథుని నలువది తొమ్మిదవ వానిగా ఈ సందర్భమున జేర్చుకొనుటయే యుక్తముగా నున్నది. మూలమున 'సుందరేశ్వరుడు నలువది తొమ్మిదవ కవిగా జేరిన విషయము ఇంతకు ముందు 4వ అంశమున వివరించితిని. దానితో పోల్చి చూచిన ఈ మార్పు చొక్కనాథుని ప్రభావము నినుమడించి చెప్పినట్లు స్పష్టమగుచున్నది కావున తిరువేంగళ కవి ఈ విషయమును మూలమును యథాతథముగా అనువదింపక మార్చి వ్రాసినాడని చెప్పవచ్చును.

(11) నక్కీరునితో సుందరేశ్వరునకు జరిగిన వివాదము మూలమున, తెనుగున ఒకేరీతిగా నున్నది.

మొత్తముపై ఈ లీలను మూలముననువదించక వదలికొంత, మూలాతిరిక్తముగ కొంత, మూలమును మార్చి కొంత, యథాతథముగ కొంత అనువదించి తిరువేంగళకవి తన అనువాద శిల్పచాతుర్యమును చక్కగా నిరూపించుకొనినాడు.

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 202 శ్లో. 78-84 వరకు.
2. చొక్కనాథ చరిత్రము. పుట 260, 261లు
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 202, 203, 204.
4. చొక్కనాథ చరిత్రము పుట 260, 261లు.

## అష్టమాశ్వాసము – ఏబది యొకటవ లీల

(1) హాలాస్య మాహాత్మ్యమున ఏబది ఎనిమిదవ అధ్యాయమున నున్న "ద్విజస్యార్యా విలేఖనం" అను ఏబది రెండవ లీల చొక్కనాథ చరిత్రమున అష్టమాశ్వాసమున ఏబది యొకటవ లీలగా ననువదితము.

(2) సంస్కృతమున ఈ లీల 77 శ్లో.లలోనుండగా తెనుగున ఇది 51 ద్విపదలలో నున్నది.

(3) మూలమున ఈ లీల ప్రారంభమున పదు నాలుగు శ్లోకములలో పాండ్యరాజునకు చంపక పాండ్యుడను పేరు కలిగినదను విషయమున్నది[1]. ఇది కథకు సంబంధించినది కాదు గనుక చొక్కనాథ చరిత్రమున కవి దీనిననువదించక వదలివేసెను.

(4) బ్రాహ్మణ బ్రహ్మచారి పేరు మూలమున సుందరనాథుడు. చొక్కనాథ చరిత్రమున ఈతని పేరు ధర్మి.

(5) మూలమున సుందరేశ్వరుడు బ్రాహ్మణ బ్రహ్మచారికి వ్రాసి యిచ్చిన పత్రమునందలి

"జానాసిపుష్ప గంధాన్ భ్రమరత్వం బ్రూహితత్వతోమేద్య!

దేవ్యాః కేశకలాపే తుల్యోగంధేన కిం గంధః[2]" అను శ్లోకార్థమును తిరువేంగళకవి చొక్కనాథ చరిత్రమున ఈ క్రింది విధముగా ననువదించెను.

"అలవడ నాకవితార్థమెట్లన్న
నళులార! సకలమ్ములైన పుష్పముల
సౌరభమ్ములుమీరు సరవిగ్రోలుదురు
నారాజు దేవుల యానెఱికురుల
వాసన గనుడు మీరారెంటిలోన
వాసనాధిక మెందు వర్తించుననిన?
నాసాధ్వి కురులు దివ్యంబైన జన్మ
వాసన గాని పూవాసన గాదు
దలఁప నద్దేవి కుంతలములయందుఁ
గలుగు వాసన యధికంబనె నళుల్[3]"

(6) మూలమున బ్రాహ్మణ బ్రహ్మచారి సుందరేశ్వరుడిచ్చిన పత్రమును దెచ్చి అందలి శ్లోకమును జదివి వినిపించగా పాండ్యరాజు తన మనసుకు నచ్చిన పద్ధతిలో నీ శ్లోకమున్నదని మెచ్చి యాతనికి వేయిమాడల మూట అందించెను. అతడా మూటను గ్రహించబోగా నత్కీరుడడ్డుపడి మాత్సర్యముతో దూషించెనని ఈ క్రింది శ్లోకపాదమున నున్నది.

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 204.
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 205. శ్లో 30 3. చొక్కనాథ చరిత్ర. పుట 264.

"ఆర్యాయా దూషణంప్రాహి నత్కీరోమత్సరేతదా"[1] దీనికి భిన్నముగా చొక్కనాథ చరిత్రమున నత్కీరుడు

"నిలువు విప్రవరేణ్య! నీ శ్లోకమునకు
గలదెక తప్పు నీ కవి చెప్పినట్టి
వారి బిలువు"మని యనెన్ను[2].

(7) మూలమున కవి వేషధారియైన సుందరేశ్వరునకు నత్కీరునకు శ్లోకార్థముపై వివాదము జరుగగా శివుడు ఇంచుక కోపించి తన ఫాలనేత్రమును చూపించెను. అప్పుడు నత్కీరుడు 'వేయి కన్నులు జూపినను తప్పు తప్పే' నని నిర్భయముగ బలుకగా అతని తన వాదముచే శివుడు నిరుత్తరుని జేసెను. నత్కీరుడు శివుని కంటిమంటకు గుఱియై మూర్ఛబోయి దాహము దాహమని యఱచుచు తిరుగుచు, హేమపద్మాకరమున పడెనని యున్నది. ఈ వృత్తాంతమంతయు మూలమున ఇరువదియైదు శ్లోకములలో విపులముగా నున్నది.[3]

చొక్కనాథ చరిత్రమున ఈ విషయము కేవలము అయిదారు ద్విపదలలో నున్నది. అచరణములివి. చొక్కనాథుడు :

"అనుపమ విద్వాంసుడై సంఘమంట
పమునకు నేతెంచి ప్రాజ్ఞత మించి
భ్రమయక నాసంఘఫలక గూర్చున్న
వారిలో నా కవిత్వము తప్పులన్న
వారెవ్వరనుచు నాస్వామి దానంత
శృతులందు వినవె! యీ రుద్రాణి పేరు
కౌతుకక సౌగంధి కుంతలనాగ
నన విని నత్కీరుడాదేవి కురులు
మనుజాంగనల కురుల్ మఱిసాటి యగునె!
యని హరానల దృష్టి కటనోర్వలేక
చనుచుఁ బొత్తామరఁ సరసిలో బడియె"

మూలమునందు వలె నత్కీరుని శివుని కంటిమంటకు గురిజేసిన యనంతరము మరల కొంత గ్రంథము నడుపుట ఉచితముగాదని ఎంచి తిరువేంగళ కవి దానిని వదలివేసి

"మరుని జూచిన చూడ్కి మఱి తన భక్తి
పరులను జూడంగఁ బాడికాదనుచుఁ
దన నేత్ర శిఖివానిఁ దగులకయుండ

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 206. శ్లో 44
2. చొక్కనాథ చరిత్రము. పుట 264.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 206, 207 లు శ్లో. 46-71 వరకు.

మనమునఁ గరుణించి మఱియు నా కొలనఁ
గ్రుంకి యుండగ జేసె"నని చమత్కరించినాడు[1]

## అష్టమాశ్వాసము – ఏబది రెండవ లీల

(1) హాలాస్యమాహాత్మ్యమునందలి ఏ-౨ తొమ్మిదవ అధ్యాయములోని నత్కీరానుగ్రహమను ఏబది మూడవ లీలను చొక్కనాథ చరిత్రమున అష్టమాశ్వాసమున ఏబది రెండవ లీలగా కవి అనువదించినాడు.

(2) సంస్కృతమున ఈ లీల నలువదియారు శ్లోకములలో నుండగా తెనుగున ఇది అరువది రెండు ద్విపదలలో రచింపబడినది.

(3) మూలమున ఈ లీల ప్రారంభమున కపిల భరణాదులు హాలాస్యేశ్వరుని జేరి నత్కీరుని అనుగ్రహింపుమని ప్రార్థించిన వృత్తాంతము ఇరువది రెండు శ్లోకములలో నున్నది[2]. చొక్కనాథ చరిత్రమున దీనిని ఐదు ద్విపదలలో సంక్షిప్తముగా రచించి[3] కపిల భరణాదులు అట్లు ప్రార్థించుచుండగా వారికడ్డుపడి 'నీ కవిత్వము తప్పన్నది నిజమే'నని శివునితో వాగ్వివాదమునకు తలపడెను. వీరి వివాదమును తిరువేంగళకవి ఇరువది రెండు ద్విపదలలో విపులముగా వర్ణించినాడు. ఇది మూలమున ఈ లీలలో లేదు. దీనికి ముందు లీలలో నున్నది[4]. అందు ఇరువదియైదు శ్లోకములలో విపులముగానున్న వివాదమును అయిదారు ద్విపదలలో సంక్షిప్తముగా రచించి కవి అంతటితో తృప్తి చెందక మరల ఈ లీలలో విపులముగా వర్ణించినాడు. ఆ వర్ణన మిది.

"నక్కీర దేవుడెంతయు శంకలేక
నిక్కమ్మె తప్పంటి నేనె పో యనిన
గొనకొని దినము సంకులుగోసియమ్ము
కొనువాడవీ వునీకొలదెఱుంగకయు
నా కవిత్వము తప్పన న్నీకు దగునె
యీ కవీశ్వరులకు నెఱిగింపుమనిన
దీకొని నక్కీర దేవుడిట్లనియె
మా కులక్రమ మిది మఱి నీదు వృత్తి
గోత్రమ్ము నామము కులము శీలమ్ము
పాత్రమ్ము నెయ్యది! భావింప నాకు
నెఱుఁగ జెప్పుమటంచు నీశుతో మఱియుఁ
బరగ నీ చెప్పిన పద్యమర్థమ్ము

1. చొక్కనాథ చరిత్ర. పుట 265.
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 208. శ్లో. 2-23 వరకు.
3. చొక్కనాథ చరిత్రము. పుట 266.
4. ఇదే గ్రంథమున 51వ లీలలో 7వ అంశము.

కురుల వాసనగాని కొమరొప్ప ముడుచు
విరుల వాసనగాదు వెలదికి నంటి
దనర మస్తకమునఁ దైలమ్ముగూడ
కనుదినమ్మును స్నానమాడక మఱియుఁ
బరిమళామోద పుష్పమ్ములు నెపుడు
నెఱపుగా ముడువక యున్న నా చెమట
కంపువైచును గాక కమ్మని తావి
సొంపు నెఱులకు నేల జొప్పడు జెపుమ!
యనినను నా స్వామి యప్సరోంగనల
కును బుష్పవాసన గూడునె కురుల
ననిన నాతడు నట్లయౌగాక యనిన
మునుకొని కురువంపు మొలకల కట్టు
వాసన దలప బార్వతిదేవి కురుల
వాసన యది పెట్టు వాసన యనుచు
నతడట నజ్ఞానమదర నా హైమ
వతికురులను బెట్టు వాసన యనియెఁ
దరుణేందు ధరుడంతఁ దన జడవీడ్చి
వరుసనిందుకుబెట్టు వాసన యనిన
నదరి నక్కీరుడాహరున కిట్లనియె
జడగొని బెదరింప జనునె! యీ యర్ధ
మీమండలమ్మెల్ల నెఱుగున యనిన
నా మాట కాదేవుడధిక కోపమున
నళిక నేత్రము జూప హరుభక్తి వలన
గలగక తలచుట్టు కన్నులైనాను
తప్పు తప్పగుగాక దారుణాకృతుల
నొప్పేల యగునని" నక్కీరుడనగా కపిల భరణాదులు మధ్యలో కలుగజేసికొని శివునితో

"దేవ మీ ఫాలాగ్ని దృష్టికి వీడు
భావజన్ముడు గాడు, భావించి చూడ
సురనరలోకముల్ సొరిది బాధించు
పురదైత్యులునుగాడు, పురములుగాడు
తప్పులెన్నైన విద్వన్నుత! వాని
కెప్పుడు నపరాధమెందును లేదు

శంకర! యపరాధ శతకంబు మీకుఁ
గింకరుడైన నత్కీరుండు సెస్పె" కావున నీతనిని కరుణించుమని ప్రార్థించి వారి వివాదమును అంతటితో సమయింపజేసిరి[1]. ఈ వర్ణనలో మూలమున లేని యంశములు నాలుగున్నవి. ఒకటి : చొక్కనాథుడు దినము సంకులు గోసి యమ్ముకొనువాడవు. నీ కొలదెఱుంగక నా కవిత్వము తప్పన నీకు తగునా? యని ప్రశ్నించుట. ఇది చొక్కనాథుని దైవత్వమును కించపఱచినట్లున్నది. జాతి, వర్ణ వివక్ష లేక సకల జీవులను సంరక్షించు భగవంతుడు తన భక్తుడైన నత్కీరుని కులమును ప్రశ్నించుట అనౌచిత్యమని చెప్పక తప్పదు. ఇక నత్కీరుడు చొక్కనాథుని కులగోత్రములను ప్రశ్నించుట కూడా ఒక కవి, పండితుడు చేయదగిన పని కాదు. కావున ఈ కల్పన ఈ పాత్రల ఔచిత్యమును భంగపఱచునట్లున్నది. తిరువేంగళ కవి ఇట్లు కల్పించుటకు కారణము నాటి లౌకిక వ్యవస్థ కావచ్చును. రెండు : నత్కీరుడు పార్వతీదేవి కురుల వాసన గూడా పెట్టు వాసన యేనని శివునితో అనగా అతడు జడవిడ్చి చూపుట జడగొని బెదిరింప తగునె యని, నత్కీరుడనుట, మూడు : శివుడు ఫాలనేత్రమును జూపగా నత్కీరుడు తలచుట్టు కన్నులైనను తప్పు తప్పేయని యనుట. నాలుగు : చొక్కనాథ నత్కీరుల వివాదమును కపిల భరణాదులు సమయంపజేయుట. ఇది లోకములోని సాధారణ మానవులు పోట్లాడుకొనునప్పుడు మధ్యన విజ్ఞులెవరో కలుగజేసికొని వారిని శాంతింపజేసినట్లు ఉన్నది. కావున చొక్కనాథ చరిత్రము నందు చొక్కనాథునకు నత్కీరునకు జరిగిన వివాదమున లోకవృత్తము చోటు చేసుకున్నది. కాని మూలమున అట్లుగాక కోపియైన ఒక విద్వాంసునకు అహంకారియైన ఒక కవికి జరిగిన వివాదము వలె నున్నది. ఇందు విద్వాంసుడు కవి వేషధారియగు సుందరేశ్వరుడు. కవి నత్కీరుడు.

(4) శివుడు నత్కీరుని అనుగ్రహించిన తరువాత కవి సంఘము ఆ దేవుని స్తుతించిన స్తోత్రము మూలమున ఉన్నది[2], చొక్కనాథ చరిత్రమున లేదు. ఇందు నత్కీరుడు చొక్కనాథుని స్తుతించుట[3] కలదు.

## అష్టమాశ్వాసము – ఏబది మూడవ లీల

(1) హాలాస్య మాహాత్మ్యము నందలి అఱువదియవ అధ్యాయములోని నత్కీర సూత్రోపదేశమును ఏబది నాలుగవ లీల చొక్కనాథ చరిత్రమున అష్టమాశ్వాసమున ఏబది మూడవ లీలగా ననువదించి యున్నది.

(2) సంస్కృతమున ఈ లీల 79 శ్లో.లలో నున్నది. తెనుగున ఇది 45 ద్విపదలలో నున్నది.

(3) మూలమున ఈ లీలయందలి కథ వర్ణనలచే విపులముగానుండ తెనుగున

1. చొక్కనాథ చరిత్ర. పుట 266, 267లు.
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 209. శ్లో. 32-40 వరకు.
3. చొక్కనాథ చరిత్రము. పుట 268, 269లు.

దీనిని కథాగతికి ఆటంకము గలుగనీయక సంక్షిప్తముగను, మూలానుసారముగను తిరువేంగళ కవి రచించినాడు.

## అష్టమాశ్వాసము – ఏబది నాలుగవ లీల

(1) హాలాస్య మాహాత్మ్యమున అరువది యొకటవ అధ్యాయమున ప్రబంధ తారతమ్య నిర్ణయం అను పేరుననున్న ఏబదియైదవ లీల చొక్కనాథ చరిత్రమున అష్టమా శ్వాసమున ఏబది నాలుగవ లీలగా ననువదితము.

(2) మూలమున ఈ లీల 31 శ్లో.లలో వ్రాసియుండగా, తెనుగున ఈ లీల 50 ద్విపదలలో రచింపబడినది.

(3) ఈ లీల యందలి కథలో మూలమున ద్రావిడ కవులు తమ తమ ప్రబంధములు గొప్పవని ఒకరికొకరు కలహించుకొని సుందరేశ్వరుని జేరగా, కవి వేషధారియైన ఆ దేవుడు వారితో ఈ మధురాపురమున నొక వైశ్య దంపతులకు స్కందుడు శాపవశమున మూగయై జన్మించియున్నాడు. అతడు మీ మీ ప్రబంధముల తారతమ్యములను దెల్పును[1] అని యనెడు సందర్భమున అగస్త్యుని మునులు స్కందుని శాప వృత్తాంతము నడుగుట గాని, అతడు చెప్పుట గాని ఇందు లేదు. ఏబది ఏడవ లీలలో అనగా అరువది మూడవ అధ్యాయమున శాప వృత్తాంతము వ్రాసి యున్నది.

(4) తిరువేంగళ కవి చొక్కనాథ చరిత్రమున సప్తమాశ్వాసమున నున్న నలుపది నాలుగవ లీలలో చొక్కనాథుడు అంగయకణ్ణెమ్మను, కుమార స్వామిని, నందీశ్వరుని శపించిన వృత్తాంతము మరియు అంగయకణ్ణెమ్మ, భృంగీశ్వరులకు శాపవిమోచనమును అందే తెలిపి ఈ లీలయందు సేనాని శాప విముక్తిని గూర్చి తెలిపినాడు.

హాలాస్య మాహాత్మ్యమున సుందరేశ్వరుడు మీనాక్ష్యాదులను శపించిన వృత్తాంతము అరువది మూడవ అధ్యాయమున వ్రాసి యున్నది. మరియు మీనాక్షీ, నందీశ్వరులకు శాపవిమోచనము కూడా అందేయున్నది. కుమారస్వామికి శాపవిమోచనము అట చెప్పలేదు. ఈ లీలలో చెప్పియున్నది. 61 అధ్యాయమున శాపవిమోచనమును చెప్పి 63వ అధ్యాయమున శాప వృత్తాంతమును చెప్పుట తలక్రిందులుగా నున్నదని, ముందు శాపమును, పిదుపరి విమోచనమును తెలుపుట యుక్తమని భావించి చొక్కనాథ చరిత్రములో తిరువేంగళ కవి ఇట్లు రచించియుండవచ్చును.

(5) ఈ లీల మూలముననుసరించి తెనిగించబడినది.

## అష్టమా శ్వాసము – ఏబదియైదవ లీల

(1) హాలాస్యమాహాత్మ్యమున, అరువది రెండవ అధ్యాయమున నున్న ఉత్తర హాలాస్య ప్రాదుర్భావమను ఏబది యాఱవ లీలను చొక్కనాథ చరిత్రమున అష్టమా శ్వాసమున ఏబది యైదవ లీలగా కవి అనువదించినాడు.

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 214.

(2) సంస్కృతమున ఈ లీల 109 శ్లో.లలో విపులముగా నున్నది. తెనుగున ఈ లీల డెబ్బది రెండు ద్విపదలలో సంక్షేపించి వ్రాసినాడు.

(3) హాలాస్య పురాణమున ఈ లీల యందలి కథాప్రారంభమున పాండ్య రాజుల వంశాను చరితము ఐదు శ్లోకములలో నున్నది[1]. చొక్కనాథ చరిత్రలో కవి దీనిననువదించలేదు.

(4) పాండ్యరాజు మధ్యకాంతారుడను కవిని అవజ్ఞ చేసినందుకు అలిగి సుందరేశ్వరుడు మధురలోని తన ఆలయము నుండి వెడలి వేగవతీ తీరమున ఉత్తర హాలాస్యమున నుండగా, ఆ పాండ్య భూపతి అచటికేతెంచి తన తప్పిదమును మన్నించుమని స్తుతించుట మూలమున పదుమూడు శ్లో.లలో నున్నది[2]. చొక్కనాథ చరిత్రమున కవి వీని ననువదించలేదు.

(5) హాలాస్య లింగ మాహాత్మ్యమును గూర్చి మూలమున సుందరేశ్వరుడు పాండ్య రాజుకు చెప్పినట్లు వ్రాయబడినది[3]. చొక్కనాథ చరిత్రమున కవి దీనిని కూడా వదలి వేసినాడు.

(6) సుందరేశ్వరునకు పాండ్య రాజునకు జరిగిన సంభాషణము మూలముకన్న అనువాదమున సరసముగా నున్నది.

(7) చొక్కనాథ చరిత్రమున ఉత్తర హాలాస్య ప్రాదుర్భావ కథను కవి ప్రసన్నముగా నడిపించినాడు. ఈ లీల మూలమునకు యథా తథానువాదము కాక యదేచ్ఛానువాదమై యొప్పుచున్నది.

## అష్టమా శ్వాసము – ఏబది యాఱవ లీల

(1) హాలాస్యమాహాత్మ్యమున అఱువది నాలుగవ అధ్యాయమున నున్న వాతపురీశ్వర జ్ఞానదీక్షాకరణమను ఏబది ఎనిమిదవ లీలను తిరువేంగళ కవి చొక్కనాథ చరిత్రమున అష్టమా శ్వాసమున ఏబది యాఱవ లీలగా తెనిగించినాడు.

(2) మూలమున ఈ లీల 126 శ్లో.లలో నున్నది. తెనుగున ఇది 174 ద్విపదలలో నున్నది.

(3) చొక్కనాథ చరిత్రమున ఈ లీల యందలి కథా ప్రారంభమున వాతపురేశ్వరుని పుట్టుకను గూర్చి

"కైలాసవాసుని గణనాథుడొకడు
హాలాస్యపురమున నగ్రజన్మమున
మధ్యగోత్రమ్మున మహినెన్నబుట్టి" నాడని మూలమునకు భిన్నముగా వ్రాసియున్నది[4]. మూలమున

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 215. శ్లో. 2-6 వరకు.
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 217, 218. శ్లో. 46-61 వరకు.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 218, 219. శ్లో. 65-86 వరకు.
4. చొక్కనాథ చరిత్రము. పుట 280.

"అభూచ్ఛ్రీమద్వాతపురే కశ్చిద్భూదేవసత్తమః।
తస్యపుత్రోవిశ్రుతశ్చ శ్రీమద్వాత పురేశ్వరః[1] అని యున్నది.

(4) వాత పురేశ్వరుడు సకల విద్యా ప్రవీణుడని మూలమున నాలుగు శ్లోకములలో వర్ణించి యుండగా[2] చొక్కనాథ చరిత్రమున కవి

"అధ్యయనాది విద్యాకళాప్ర
వీణుడై సౌందర్య విభవసంపదల
ప్రతిలేకయుండు"నని క్లుప్తముగా వ్రాసినాడు[3]

(5) వాతపురేశ్వరుడు షోడశాబ్దప్రాయముననే సర్వజ్ఞత్వము పొందినాడని, రాజు ఆతనిని మంత్రిగా నియోగించినాడని

"సషోడశాబ్ద రూపశ్రీస్సర్వజ్ఞత్వమవాప్యచ।
రాజ్ఞాసంప్రార్థితస్సోథమంత్రిత్వేననియోజితః[4]॥" అని మూలమున నున్న విషయమును పెంచి చొక్కనాథ చరిత్రమున పాండ్యభూవిభుడు.

"అతని నెల్లరుఁ జెప్ప నంతయు నెఱిగి
ఫణిహారులను బంపి పరగ రప్పించి
ప్రణుతింపఁ దెన్నవబ్రహ్మ యనంగఁ
దన నామ మతనికిఁ దనరఁ గావించి
పలయు నాభరణముల్ పరుసతో నిచ్చి
వలసిన మన్ననల్ పలనుగాజేసి
దండ నాయకుడవై తనర నా వెంట
నుండుమంచును ముద్దుటుంగరమిచ్చి
పాయవాకిట మఱి పారుపత్యమ్ము
సేయంగఁ గట్టడ చేసె నా విభుడు" అని వ్రాసినాడు[5]

(6) వాతపురేశ్వరుడు మంత్రిగానున్న సమయమున పాండ్యరాజు వద్దకు తురగాధిపులు వచ్చి

శ్లో॥ ప్రాప్యభూపంప్రణమ్యాథ ప్రాహుస్తే తురగస్థితిం।
రాజన్నృయంతే తురగాః కేచిద్వ్యాధిప్రపీడితాః ॥17॥

శ్లో॥ కేచిజ్జ్వరార్తి సంయుక్తా వర్తంతేన్యేపిదుస్థితాః।
నూతనాస్తురగా రాజన్ క్రేతవ్యాఝడితిత్వయా ॥18॥ అని చెప్పిరి[6]. చొక్కనాథ చరిత్రమున తెన్నవ బ్రహ్మ మంత్రిగా నుండగా పాండ్యరాజు వద్దకు అశ్వరక్షకులు వచ్చి చేతులు మోడ్చి

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 223. శ్లో. 2
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 223, 224లు. శ్లో. 3, 4, 5, 6లు.
3, 5. చొక్కనాథ చరిత్రము. పుట 280.
4. హాలాస్యమాహాత్మ్యము. పుట 224. శ్లో. 7 (6) హాలాస్యమాహాత్మ్యము. పుట224.

"ఓ రాజ! యశ్వమ్ములుగ్రష్టమ్ములెంతొ
యతి సారములచేత నధికమైనట్టి
మితిలేని వ్యాధులు మెయికొని కొన్ని
దీర్ఘనిద్రల బారి తెగనున్నవింక" నని విన్నవించిరి[1].

(7) చొక్కనాథ చరిత్రమున పాండ్యరాజు తెన్నవ బ్రహ్మను ద్వీపాంతరములకేగి అశ్వముల దెమ్మని చెప్పి "అధికమైనట్టి ధనరాసులెంతేని నిచ్చిబంపె" నని యున్నది[2]. మూలమున పాండ్యరాజు వాతపురేశ్వరునితో "యథేష్టం ధనమాదాయ మదీయాత్కోష మందిరాత్" (22 శ్లో.) అని చెప్పి, "త్వంహి విశ్వాసపాత్రమ్మే కార్య కర్తాత్వమేవహి" (24 శ్లో.) అని ప్రగాఢ విశ్వాసమున బంపగా, అతడు కోశ గృహాంతరమునకు బోయి కోశాధ్యక్షుని గలసి లెక్క వ్రాయించి అశేష ధనమును గ్రహించెననియు, ఆ ధనమును జూడగనే మంత్రి "శివ ధర్మార్థ సంగ్రహే ఇదానీం సమయశ్చైతి" (27 శ్లో.) అని చింతించి, మనమున హర్షించి ఆ ధనమునంతయు తన యింట బెట్టించెనని యున్నది[3]. దీనిని బట్టి మంత్రి పాత్ర చిత్రణలో మూలమునకు తెనుగునకు కొంత భేదమున్నదని తెలియుచున్నది. మూలమున

"అనుభూయసుఖాన్యేవ వర్తతే వరవేశ్మని
శ్రీమద్వాత పురేశోపి ప్రభుస్సన్నపి సర్వదా"[4] (శ్లో. 12)

అను శ్లోకమును బట్టి వాతపురేశ్వరుడు రాజు తర్వాత రాజంతవాడుగా నుండగా తెనుగున రాజాజ్ఞానువర్తిగా చిత్రీకరింపబడినాడు.

(8) గుఱ్ఱములు కొని తెచ్చుటకు ధనమును స్వీకరించి తెన్నవ బ్రహ్మ సోమసుందరుని సంగడికి బోయి సన్నుతిజేసి కార్యసిద్ధి గావింపుమని వేడుకొనెను[5]. చొక్కనాథ చరిత్రమునందలి ఈ వాక్యమునకు మూలము

"పాహిమామపి రాజానం కార్యసిద్ధింకురుష్వమే"[6] (శ్లో. 33లో)

అనునది. మూలమున వాతపురేశ్వరుడు సుందరేశ్వరుని జేరి సేవించుట, అనుజ్ఞవడయుట, ఇత్యాది విషయములున్నవి[7]. తిరువేంగళ కవి దీనినంతయు తెనిగించక పైని చూపిన ఒక్క వాక్యములో పూర్తి చేసినాడు.

(9) చొక్కనాథ చరిత్రమున తెన్నవ బ్రహ్మ తిరుపెరుందూరను దివ్యమైన నగరుకు బోయి యందు ప్రవేశించునంత మాత్రమున సుజ్ఞానము బొంది ఒక చోట

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 281.
2, 5. చొక్కనాథ చరిత్ర. పుట 282.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 224, 225లు.
4. హాలాస్యమాహాత్మ్యము. పుట 224.
6. హాలాస్యమాహాత్మ్యము. పుట 225.
7. హాలాస్యమాహాత్మ్యము. పుట 225. శ్లో. 29-40 వరకు.

గూర్చుండి తన వెంట వచ్చిన పరివారముతో 'ఈ నెల గుఱ్ఱములు రావు, అవలి నెల గొంచు వత్తు'నని రాజుగారితో చెప్పుడని వారిని పంపించి, తాను జ్ఞానప్రాప్తికై ప్రయత్నించుచు తన్ను తానెఱిగి మనేలయ స్థానమున పరమాత్మను వెదకుచుండెను. ఆ సందర్భమున నొకనాడు తిరువాదయూర దేవుని గుడికి బోవుచుండగా తొమ్మిది నూట తొంబది తొమ్మిది మంది శిష్యులను గూడికొని చొక్కనాయకుడు గురువై నిమ్మ్రమాకుల నీడ నుండెను. అతని జేరి సాష్టాంగ నమస్కారములు జేయగా తెన్నవ బ్రహ్మను చేరదీసి, యాతనికి శివయోగాభ్యాస విధానమును దెలిపి, జ్ఞానోపదేశము గావించి 'మాణిక్య వాచకు'డని పేరుబెట్టి శిష్య సంతతులతో నదృశ్యుడై చనినాడని రమణీయముగా దాదాపు నలువది ద్విపదలలో వర్ణించి యున్నది[1]. ఈ కథలో మూలమునకు చొక్కనాథ చరిత్రమునకు కొన్ని మార్పులున్నవి.

(అ) మూలమున 'వాత పురేశ్వరుడు సుందరేశ్వరుని ఆలయము నుండి వెడలి ప్రాఙ్ముఖముగా పయనించి ప్రాక్సముద్ర తటమును జేరి విశ్రాంతి తీసికొనుచు, పోవుచు శ్రీమహాతీర్థమును జేరగా, అతని మనము ద్రవించినదని, ఇంతటి చిత్త ద్రవీకరణమును గలిగించిన క్షేత్రమును మరి ఎచ్చట జూడలేదని, తానందే యుండుటకు నిశ్చయించుకొనెనని వ్రాసియున్నది[2].

చొక్కనాథ చరిత్రమున తిరువేంగళ కవి ఈ విషయమును మార్చి

"తిరుపెరుందూరను దివ్యమైనట్టి
పురమునకా మంత్రి పుంగవుండరిగి
యందు ప్రవేశించునంత మాత్రమున
బొందె సుజ్ఞానంబు పొందె నాతనికి[3]" అని వ్రాసినాడు.

(ఆ) మూలమున వాతపురేశ్వరుడు గురుమూర్తియైన హరుని, అనేక శిష్యుల మధ్యన, కుంద మూలమున చూచెనని ఈ క్రింది శ్లోకమున నున్నది.

"దదర్శ కుందమూలేతు గురుమూర్తి ధరంహరం ।
అనేక శిష్యమధ్యస్థమనంతానందదాయకం[4] ॥54॥

చొక్కనాథ చరిత్రమున తిరువేంగళ కవి గురుమూర్తియైన చొక్కనాథుడు 999 మంది శిష్యులతో నిమ్మ్రమాకుల నీడ నెమ్మితో నుండెనని ఇంచుక మార్చి వ్రాసినాడు.[5]

(ఇ) శివదీక్షా వృత్తాంతము చొక్కనాథ చరిత్రమున మూలమునకు భిన్నముగాను స్వతంత్రముగాను రచింపబడినది. మూలమున రెండు శ్లో.లలో నున్న[6] దీక్ష తెనుగున

1 చొక్కనాథ చరిత్రము. పుటలు 282 నుండి 285 వరకు.
2 హాలాస్యమాహాత్మ్యము. పుట 225. శ్లో. 41-46 వరకు.
3. చొక్కనాథ చరిత్ర పుట 282.
4. హాలాస్యమాహాత్మ్యము. పుట 226.
5 చొక్కనాథ చరిత్ర. పుట 283.
6 హాలాస్యమాహాత్మ్యము. పుట 226. శ్లో. 59, 60 లు.

విపులముగా వర్ణించియున్నది[1].

(10) వాతపురేశ్వరుడు గుఱ్ఱములను గానక శ్రీమహాతీర్థమున శివధర్మార్థము ధనమును వెచ్చించుచున్నాడని తెలిసి పాండ్యరాజు 'వెంటనే గుఱ్ఱములను దీసికొని రావలసినదని' అతనికి పత్రిక బంపుట, దానిని జూచుకొని తాను రాచకార్యముపై వచ్చిన విషయము జ్ఞప్తికి వచ్చి సుందరేశుని సన్నిధికి బోయి ప్రార్థించుట, ఆ దేవుడు వాతపురేశ్వరుని అపద నుండి రక్షింతునని యనుట ఈ వృత్తాంతమంతయు మూలముననుసరించి తెనుగున వ్రాయబడినది.

## నవమాశ్వాసము – ఏబదియేడవ లీల

(1) హాలాస్యమాహాత్మ్యమున అరువదియైదవ అధ్యాయమున వర్ణింపబడిన మాయాశ్వ విక్రయమను ఏబది తొమ్మిదవ లీల చొక్కనాథ చరిత్రమున నవమాశ్వాసమున ఏబది ఏడవ లీలగా ననువదించి యున్నది.

(2) మూలమున 174 శ్లో.లలో ప్రవిస్తరముగ వర్ణించియున్న ఈ లీలను చొక్కనాధ చరిత్రమున తిరువేంగళ కవి 152 ద్విపదలలో ననువదించినాడు.

(3) చొక్కనాధ చరిత్రమునందలి ఈ లీల మూలమునకు యధాతధానువాదము కాదు. కవి మూలము నందలి కథాంశములను గ్రహించి స్వీయవర్ణనలచే పెంచి వ్రాసినాడు. మూలములోను, తెనుగులోను 'తన భక్తుడైన వాతపురేశుని రక్షించుటకు చొక్కనాధ శివుడు నక్కలను గుఱ్ఱములు గాజేసి తీసికొని వచ్చి పాండ్యరాజు కొప్పగించిన వృత్తాంతమే కలదు. ఈ కథ పాల్కురికి సోమనాధుని బసవ పురాణమున కూడా కలదు. అందు తృతీయాశ్వాసమున 'నక్కలు గుఱ్ఱములైన కథ' అను పేరుతోనున్నది[2]. ఆ కథ యిది.

బసవ పురాణమున బసవ దండనాయకుడు మరికొందరు మంత్రులతో గూడి రాజు పనుపున తంత్రంబునకు జీవితము పెట్టునెడ ఒక మిండ జంగముడు వచ్చి "మీ యర్థంబు వలయునింతయును నిచ్చినగాని యొండే నొల్ల" ననుచు ధట్టించి యడుగగా పెట్టెలో నున్న మాడలన్నియు నున్నవి యున్నట్లుగనే ఆ జంగమున కిచ్చెను. తక్కిన మంత్రులు తంత్ర సమేతులై ధరణీశుపాలికి బోయి జరిగినదంతయు విన్నవించగా ఆ రాజు బసవని రప్పించి 'బండారమంతయు పాడుచేసితివి, పరధన మపహరింప దగునె? యని చిన్నగా మందలించి 'మా యర్థమొప్పించి నీయంతనుండు' మని యనగా బసవడు 'రాజా! మీ ధనము నేనాసింపను. ఒడయలధనము ఒడయల కిచ్చినాను. మీ ధనము మీరు లెక్కజూచుకొనుడని పెట్టెలు ముందట బెట్టి తాళముల తీయగా మాడలుప్పొంగుచు లెక్కకు మిక్కిలిగా గన్పించినవి. ఈ సందర్భమున

1. చొక్కనాథ చరిత్ర. పుట 283, 284, 285లు.
2. బసవ పురాణము. పుట 125, 126లు.

"మధుర పాండ్యుడు దన మంత్రిచే నిట్టి
లధిక మర్థంబిచ్చి హయముల విలువఁ
బనుచుడు నతడు సద్భక్తి పెక్కువను
జనిచని జంగమార్చన సేయజేయ
నర్థమంతయు బోవ హయముల విలువ
నర్థంబు లేకున్న నవమానముడిగి
పొలము నక్కలనెల్ల, బిలిచి తెప్పించి
నలి పాండ్య భూనాథునకుఁ బొడసూపఁ
జొక్కనైనారుల మిక్కిలి కరుణ
నక్కజంబంద నా నక్కలన్నియును
నిలఁగంకణముల తేజులు నయ్యెగాదె"

మలహరు భక్తుల మహిమ దలంపనిది సొద్యమే యనుచు భక్తులందరు నాశ్చర్యచకితులైరని వ్రాసియున్నది.

బసవ పురాణమున నున్న ఈ కథ ఆనుషంగిక కథయేగాని ప్రధాన కథ గాదు. ఇది కేవలము ఒక దృష్టాంతముగా వ్రాసి యున్నది. తిరువేంగళ కవి దీనిని చదివియుండును గాని దీని నెరవడిగా గ్రహించినాడని చెప్పుటకు ఆధారములు లేవు. చొక్కనాథ చరిత్రమునందలి కథకు హాలాస్య మాహాత్మ్య కథయే ఆధారము. పైగా బసవ పురాణ కథకు, చొక్కనాథ చరిత్రలోని కథకు ఒక ముఖ్యమైన భేదము కన్పించుచున్నది. బసవ పురాణమున నక్కలు గుఱ్ఱములుగా జేయుట భక్తుని మహిమగా చెప్పబడినది. చొక్కనాథ చరిత్రమున చొక్కనాథుడే స్వయముగా నక్కలను గుఱ్ఱములుగా జేసి తెచ్చి పాండ్యరాజు కొప్పగించినాడు కావున ఇది చొక్కనాథుని లీలయని తెలియుచున్నది.

(4) మూలమున 66 శ్లో.లలో అశ్వలక్షణములు వ్రాసియుండగా[1] చొక్కనాథ చరిత్రమున కేవలము పదునైదు ద్విపదలలో వ్రాసియున్నది.[2] ఇవి మూలమునకు యథాతథానువాదములు కావు.

(5) మూలమున మొత్తము 174 శ్లో.లలో వ్రాయబడిన ఈ లీలలో అశ్వ లక్షణములు వర్ణించియున్న 66 శ్లో.లను తీసివేయగా మిగిలిన 108 శ్లో.లలోని కథను తిరువేంగళ కవి చొక్కనాథ చరిత్రమున మొత్తము 152 ద్విపదల నుండి అశ్వలక్షణములు గల 15 ద్విపదలను తీసివేసిన 137 ద్విపదలలో రచించినాడు.

(6) వాతపురేశునకు చొక్కనాథ చరిత్రమున పాండ్యరాజు మంత్రిగా నియమించి పెట్టిన పేరు తెన్నవ బ్రహ్మ. చొక్కనాథుడు దీక్షయిచ్చి పెట్టిన పేరు మాణిక్య వాచకుడు. తిరువాదయూరుడని కూడా నామాంతరము.

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుటలు 233-237 వరకు. శ్లో. 76-142 వరకు.
2. చొక్కనాథ చరిత్రము. పుట 297.

## నవమాశ్వాసము – ఏబది యెనిమిదవ లీల

(1) హాలాస్యమాహాత్మ్యమున అరువది యారవ అధ్యాయమున నున్న వేగవతీ జలాకర్షణం అను అరువదియవ లీల చొక్కనాథ చరిత్రమున నవమాశ్వాసమున ఏబది ఎనిమిదవ లీలగా ననువదితము.

(2) ఈ లీల మూలమున 71 శ్లో.లలో నున్నది. తెనుగున నిది 78 ద్విపదలలో నున్నది.

(3) మూలమున ఈ లీలలో సుందరేశ్వరుడు పాండ్యరాజున కొప్పగించిన మాయాశ్వములు పూర్వరూపమును ధరించి (నక్కలై) పారిపోగా తన మంత్రుల సలహా మేరకు పాండ్యరాజు వాతపురేశ్వరుని బట్టి తెప్పించి నీ యింద్రజాలముల మాయెద ప్రదర్శింతువా యని కోపించి అతని విన్నపములను లెక్కగొనక, అతనిని శిక్షించుటకు భటుల నాజ్ఞాపించగా ఆ మాణిక్య వాచకుడు సుందరేశ్వరునకు మొరబెట్టుకొనెను. ఈ కథయంతయు మూలమున 50 శ్లో.లలో ముగిసినది. చొక్కనాథ చరిత్రమున 58వ లీలలో పైని చూపిన కథను తెనిగించి మూలముననున్న అవాంతర కథను తరువాతి లీలలోనికి (59వ లీల) గ్రహించి అనువదించినాడు. మూలమున ఈ లీల పేరు వేగవతీ జలాకర్షణం' అని యున్నది గాన వాతపురేశ్వరుని మనవి విని మధురను ముంచివేయునట్లుగా, వేగవతినుప్పొంగి రమ్మని శివుడాదేశించుట, వేగవతి పొంగి వచ్చుట, మధురను ముంచివైచుట, ఇందు వర్ణింపబడినవి. చొక్కనాథ చరిత్రమున తిరువాదయూరదేవుడు చొక్కనాథుని మొరబెట్టుకొనిన తరువాత 'తదుపరి కథ ఏమిటని మునులు అగస్త్యుని ప్రశ్నించిరని' వ్రాయుచు ఏబది ఎనిమిదవ లీలను తిరువేంగళ కవి ముగించినాడు.

(4) మూలమున 71 శ్లో.లలో నున్న కథ నుండి ఏబది శ్లోకములలోనున్న కథను మాత్రము చొక్కనాథ చరిత్రమున ఈ 58వ లీలలో 78 ద్విపదలలో వర్ణించి తక్కిన 21 శ్లో.లలోనున్న కథను తరువాతి లీలలోనికి గ్రహించినాడు.

(5) చొక్కనాథ చరిత్రలోని ఈ లీలయందలి కథకు మూలమునకు ఈ క్రింది భేదములున్నవి.

(అ) గడ్డిమేయని నక్కలకు మాంసాహార మిడుట – ఇది మూలమున లేదు. తెనుగున నున్నది[1].

(ఆ) "శివుడే అశ్వాధ్యక్షుడై రాగా నీవు నేను శివభక్తిచే మోహితులమైనామని వాతపురేశ్వరుడు పాండ్యరాజుతో ననుట" ఇది మూలమున నున్నది[2], తెనుగున లేదు.

## నవమాశ్వాసము – ఏబది తొమ్మిదవ లీల

(1) చొక్కనాథ చరిత్రము నందలి నవమాశ్వాసములోని ఏబది తొమ్మిదవ లీల హాలాస్య మాహాత్మ్యమున అరువది ఏడవ అధ్యాయమున 'పిష్టమృద్భరణం బౌద్ధ

1. చొక్కనాథ చరిత్రము. పుట 300.
2 హాలాస్యమాహాత్మ్యము. పుట 240. శ్లో. 38, 39లు.

నిరసనం' అను పేరుతోనున్న అరువది యొకటవ లీలకు అనువాదము.

(2) మూలమున ఈ లీల 257 శ్లోక సంఖ్య గలది. అనువాదమున ఈ లీల 216 ద్విపదలలో నున్నది.

(3) ఈ లీలయందలి కథాప్రారంభమున చొక్కనాథ చరిత్రము నందు మూలమునందలి 'వేగవతీ జలాకర్షణమను అరువది యారవ అధ్యాయము - అరువదియవ లీలాంతమునగల 21 శ్లో.లలోని (51-71) వృత్తాంతము[1] స్వీకరింపబడియున్నది. మూలమున వేగవతీ జలాకర్షణము 51 శ్లో. నుండి 60 వ శ్లో. వరకు వర్ణించి, అనంతరము 61 నుండి 71 వరకు వాతపురేశ్వరుడు సుందరేశ్వరుని సేవించుట గలదు. చొక్కనాథ చరిత్రమున కవి వేగవతీ జలాకర్షణ విషయమును ఈ 59వ లీలలోనికి గ్రహించి వాతపురేశ్వరుని స్తుత్యాదులను లీలాంతమున వ్రాసినాడు.

వేగవతీ జలాకర్షణ విషయమున మూలమునకు చొక్కనాథ చరిత్రమునకు కించిద్భేదము కలదు. (అ) మూలమున వేగవతి నాకర్షించి మధురను ముంచివైచి నన్ను రక్షింపుమని పాండ్యరాజ భటులు తనను బాధించుచున్న సమయమున వాత పురేశ్వరుడు సుందరేశ్వరుని ప్రార్థించెను[2]. చొక్కనాథ చరిత్రమున తిరువాద యూర దేవుడు తనను రక్షింపుమని మాత్రమే చొక్కనాథుని వేడుకొనెను గాని వేగవతి నాకర్షించి మధురను ముంచివేయుమని కాదు[3].

(ఆ) మూలమున శివుడు వాతపురేశ్వరుని ప్రార్ధన మేరకు వేగవతిని స్వయముగా ఆకర్షించెను.[4]

చొక్కనాథ చరిత్రలో శివుడు ఈ పనికి ప్రాచేతసుని నియోగించెను[5].

(4) హాలాస్యమాహాత్మ్యమున ఈ లీలయందుగల మొత్తము 257 శ్లో.లలో 1-125 శ్లో.లు పిష్టమృద్భరణమును[6] (పిట్టువ్వకథ) 126 వ శ్లో. నుండి 164 వ శ్లో. వరకు వాతపురేశ్వరుని తీర్థయాత్రలు[7] 165 నుండి 257 వ శ్లోకము (లీలాంతము) వరకు 'బౌద్ధనిరసనము[8]' వర్ణింపబడినవి.

చొక్కనాథ చరిత్రమున ఈ లీలయందున్న మొత్తము 216 ద్విపదలలో 165 ద్విపదలు పిట్టువ్వ కథను[9], తక్కినవి (51) తిరువాదయూరుని తీర్థయాత్రలను[10] వర్ణించి

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 241, 242లు.
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 241. శ్లో. 51.
3, 5. చొక్కనాథ చరిత్ర. పుట 305.
4. హాలాస్యమాహాత్మ్యము పుట 241. శ్లో. 50-52 వరకు.
6. హాలాస్యమాహాత్మ్యము. పుటలు 242-248 వరకు.
7. హాలాస్యమాహాత్మ్యము. పుటలు 248-250 వరకు.
8. హాలాస్యమాహాత్మ్యము. పుటలు 250-254 వరకు.
9. చొక్కనాథ చరిత్రము. పుటలు 306-315 వరకు.
10. చొక్కనాథ చరిత్రము. పుటలు 315-318 వరకు.

యున్నవి. మూలమునన్నున్న బౌద్ధ నిరసనము ఇందు లేదు. తిరువాద యూరుడు బౌద్ధులను (బౌద్ధ మతమును) నిరసించుట చొక్కనాథ శివుని లీలగాదని ఎంచియో, లేక 'కుబ్జపాండ్య జ్వరశమనం' అను తరువాతి లీలయందు జ్ఞానసంబంధుడు బౌద్ధులనేడించిన వృత్తాంతముండుట వలననో తిరువేంగళ కవి దీనిననువదించక వదలినాడు.

(5) చొక్కనాథ చరిత్రమున ఈ లీలలోనున్న పిట్టవ్వకథ, తిరువాద యూరుని తీర్థయాత్రలు మూలమునకు యదాతథానువాదములు కావు. మూల విషయమును సంగ్రహించి యదేచ్ఛగా రచించినవి.

(6) పిట్టవ్వ కథ పాల్కురికి సోమన బసవ పురాణమున గూడా నున్నది. అందు వాల్మీకేశుడు శివభక్తుల మహిమ నెడయనంబికి జెప్పు సందర్భమున పిట్టవ్వ కథను గూడా చెప్పినాడు. బసవ పురాణము నందలి చతుర్థా శ్వాసమున ఇది మిక్కిలి సంక్షేపముగా చెప్పబడినది. ఆ ద్విపదలివి.

'వెండియు 'నమ్మడిగొండయన్నురిని,
దండియై కరికాలమండలేశ్వరుడు
కావేరి గట్టింప గడగి యిల్లాది
వోప నీకై యేను వోయెద నంచు
బిట్టవ్వ భక్తికి బ్రియపడి కాదె
వెట్టికి జనుటెల్ల' వినుమట్లుగాక[1]

ఇందు ' ' ఈ గుర్తులో చూపినదే పిట్టవ్వ కథ. దీని ప్రభావము చొక్కనాథ చరిత్రము నందలి పిట్టవ్వ కథపై లేదని స్పష్టమగుచున్నది.

## నవమాశ్వాసము – అఱువదియవ లీల

(1) హాలాస్య మాహాత్మ్యమున అరువది యెనిమిదవ అధ్యాయమున నున్న 'కుబ్జపాండ్య జ్వరశమనం' అను అరువది రెండవ లీల చొక్కనాథ చరిత్రమున నవమాశ్వాసమున అరువదియవ లీలగా ననువదితము.

(2) మూలమున ఈ లీల 199 శ్లో.లలో వర్ణించియున్నది. చొక్కనాథ చరిత్రమున ఈ లీల 190 ద్విపదలలో ననువదించి యున్నది.

(3) హాలాస్య మాహాత్మ్యమునకు చొక్కనాథ చరిత్రమునకు కథాప్రారంభమున కించిద్భేదము కలదు. దీని వలన కథా ప్రణాళికలో కొంత మార్పు కలిగినది.

మూలమున కథా ప్రారంభమున తొమ్మిది శ్లోకములలో పాండ్యరాజుల వంశాను చరితము వర్ణింపబడినది[2] చొక్కనాథ చరిత్రమున కవి దీనిని వదలివేసి దీని స్థానమున కుబ్జ పాండ్యుడు వేదబాహ్యుడై ప్రవర్తిల్లుటను వర్ణించినాడు[3].

---

1. బసవ పురాణము. పుట 309.
2. హాలాస్యమాహాత్మ్యము. పుటలు 254, 255. 1-9 శ్లోకములు.
3. చొక్కనాథ చరిత్రము. పుట 318.

(4) మూలమున శత్రుశాసన పాండ్యుని కుమారుడు కుబ్జపాండ్యుడని వ్రాసియుండగా[1] తెనుగున అనంతగుణాఖ్య పాండ్యుని వంశమున కుబ్జపాండ్య భూభుజాడుద్భవించినాడని వ్రాసియున్నది[2].

(5) కుబ్జపాండ్యుని భార్య (చోళభూపతి కూతురు) 'వనితేశ్వరి' యని మూలమున నుండగా[3] చొక్కనాథ చరిత్రమున ఈమె పేరు 'మంగయకర్షయమ్మ' అని యున్నది[4].

(6) కుబ్జపాండ్యుని మంత్రి అనగా చోళరాజు తన కూతురుతో పంపిన మంత్రి 'కులబంధనుడ'ని మూలములో నుండగా[5] చొక్కనాథ చరిత్రలో 'కులశేఖరుడ'ని యున్నది[6].

(7) కుబ్జపాండ్యుడు వేదబాహ్యుడై బౌద్ధ ధర్మమునను సరించి యుండగా రాజానుమతోధర్మమని ప్రజలును శైవధర్మమును విడచి బౌద్ధ ధర్మమును పాటించుచుండిరి. అందుకు కుబ్జపాండ్యుని భార్య మఱియు నామె యరణపు మంత్రి చింతింపసాగిరి. ఇట్టి సమయమున చిదంబరము నుండి శివానందుడను మహాముని హాలాస్య ప్రభువును దర్శించుకొనుటకు హాలాస్య క్షేత్రమునకు రాగా కుబ్జ పాండ్యుని దేవేరియు మంత్రియు శివాలయమున అతని గాంచి చోళదేశపు వింతలేమిటని ప్రశ్నించిరి. దానికి సమాధానముగా ఆముని "శ్రీమద్రృహ్మపురి యందు శివపాదాబ్జహృదయుడను బ్రాహ్మణునకు శివాజ్ఞ వలన కుమారస్వామి పుత్రుడుగా జన్మించెను. ఆ కుమారునకు పార్వతీదేవి తన స్తన్యము నిచ్చెను. ఆ దేవి చనుబాలు ద్రావిన మాత్రమున ఆ బాలుడు మూడు సంవత్సరముల ప్రాయములోనే కవులలో నగ్రగణ్యుడై, జ్ఞాన విజ్ఞాన సాగరుడై, జ్ఞానసంబంధుడని పేరువడసి, శంభు స్థానములను మనమునవే వీక్షించి నతించి, నుతించి తండ్రియంకము నధివసించెను. అట్టి జ్ఞానసంబంధుడు శివునను గ్రహము వలన చతురంత మహాయానమున దేశము నలుమూలల సంచరించి వేదబాహ్యులైన క్షపణులను దురాత్ములను శిక్షించి శైవ సిద్ధాంతమును స్థాపించెన"ని చెప్పెను.

పైన దెలిపిన జ్ఞానసంబంధుని జన్మ వృత్తాంతమును మూలమున శివానందుడను మహాముని చెప్పినట్లుండగా[7] తిరువేంగళకవి చొక్కనాథ చరిత్రమున అగస్త్య మహామునియే మునులకు చెప్పినట్లు మార్చి వ్రాసినాడు[8].

(8) జ్ఞానసంబంధుని వృత్తాంతములో మూలమునకు తెనుగునకు కొన్ని మార్పులున్నవి.

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 255. శ్లో. 10
2. చొక్కనాథ చరిత్రము. పుట 318.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 255. శ్లో. 11
4. చొక్కనాథ చరిత్ర. పుట 318.
5. హాలాస్యమాహాత్మ్యము పుట 255. శ్లో. 15
6. చొక్కనాథ చరిత్రము. పుట 318.
7. హాలాస్యమాహాత్మ్యము. పుట 255. శ్లో. 25
8. చొక్కనాథ చరిత్రము. పుట 319.

(అ) జ్ఞానసంబంధుని జన్మస్థలము 'బ్రహ్మపురి' యని మూలమున నుండగా[1] చొక్కనాథ చరిత్రమున 'శియ్యాలూరు' అని యున్నది[2].

(ఆ) మూలమున జ్ఞాన సంబంధుడు శరజన్ముని యవతారమని యుండగా[3], చొక్కనాథ చరిత్రమున ప్రమధ నాయకుడాది కారణంబుగా జనించెనని యున్నది[4].

(ఇ) జ్ఞానసంబంధుడు బాలుడుగానున్నప్పుడు పార్వతీదేవి స్తన్యమిచ్చెనని మాత్రమే మూలమున నున్నది[5] గాని ఏ సందర్భమున నిచ్చినదో లేదు. చొక్కనాథ చరిత్రమున ఆ చిన్నవాడు తల్లితో ఏటికి బోవుచున్న సమయమున ఆ జగదంబ అశరీరియై వచ్చి కడుపార పాలిచ్చెనని యున్నది[6].

(9) హాలాస్యమాహాత్మ్యమున శివానందముని తెలిపిన జ్ఞాన సంబంధుని వృత్తాంతమును విని పాండ్యరాణియు, మంత్రియు సంతోషించి జ్ఞానసంబంధునకు

"భక్తానాం రక్షణార్థాయ శిక్షితుం క్షపణానపి ।
సుందరేశం ప్రణంతుంచ సమాయాతుభవానిహ"॥ యని పత్రిక వ్రాయించి పంపించిరని యున్నది[7].

చొక్కనాథ చరిత్రమున మంగయ కర్షయమ్మ తిరువళక్కా దనువురములోనున్న సుజ్ఞాన సంబంధునకు వర్తమానము పంపుమని కులశేఖరునితో ఇట్లు చెప్పినది. ఆ ద్విపదలివి :

"అనఘాత్మయా మంగయక్కర్షయమ్మ
తన మంత్రివరునకెంతయు నానతిచ్చెఁ
"బాండ్యభూమి సమంతభద్రాగమంబె
నిండి శైవమ్ము తూష్ణీకృతంబయ్యె
జ్ఞానసబంధునిక్కడకు రావించి
యానగ్నకులమెల్లనడపంగవలయు"
నతనిని బిలిపింపుమతివేగననిన
నతివేడ్కకులశేఖరామాత్యవరుడు"

ఆ వర్తమానములన్నింటిని దెలుపుచు వెంటనే మధురకు రావలసినదని వివరముగా కమ్మ వ్రాసి తిరువళక్కాడికి పంపించెన్ను[8].

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 255, 256. శ్లో. 27.
2. చొక్కనాథ చరిత్ర. పుట 319.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 256. శ్లో. 28.
4. చొక్కనాథ చరిత్ర. పుట 319.
5. హాలాస్యమాహాత్మ్యము. పుట 256. శ్లో. 29.
6. చొక్కనాథ చరిత్ర. పుట 319.
7. హాలాస్యమాహాత్మ్యము. పుట 256. శ్లో. 38.
8. చొక్కనాథ చరిత్ర. పుట 320.

(10) పాండ్యరాజ్యము నుండి వచ్చిన వర్తమానమును చూచికొని జ్ఞానసంబంధుడు పాండ్య దేశమునకు బయలుదేరి మధురాపురమునకు చేరిన వృత్తాంతము మూలమున దాదాపు ఇరువది శ్లో.లలో వర్ణించి యున్నది[1]. చొక్కనాథ చరిత్రములో తిరువేంగళ కవి దీనిని ఏడు చరణములలో క్లుప్తముగా వ్రాసినాడు. ఆ చరణములివి :

"ఆ లేఖఁ జదువుక నప్పుడు జైన
కోలాహలుడు శైవకుశలుండు శివుని
నమ్మిన భక్తుడెంతయు వేడ్క జ్ఞాన
సమ్మంధుదధికాష్ట సాహస్రశిష్య
గణమును దిరునావు కర్షరుదాను
ద్రిణయను నాత్మలో దీపింపజేసి
మధురాపురమునకు మహిమతో వచ్చి"[2]

మూలమున జ్ఞానసంబంధుడు ప్రయాణమైన సమయమున అతని బంధువులు మూడేండ్ల బాలుడవు వేలమంది జైనులనెట్లు జయింతువని అడ్డుపడుట, అతడు వారికి ముహూర్త బలముచే జయింతునని చెప్పుట, ఈ శుభ ముహూర్తముననే నన్ను బయలుదేరనిమ్మని నచ్చచెప్పుట, ఇత్యాది విషయములున్నవి. కవి వీనిననువదించక వదలివేసినాడు.

(11) జ్ఞానసంబంధుడు ఛతురంత యానమున మధురాపురికి వచ్చుచుండగా పురజనులు దిక్కులు పిక్కటిల్లునట్లు మ్రోగించిన వాద్య ఘోషములు విని క్షపణులు ఆ శబ్దమేమిటో అరసి రమ్మని దూతను బంపగా అతడు 'జ్ఞానసంబంధుడు మిమ్ము జయించుటకు వచ్చుచున్నాడని' వారికి తెలియపఱచెనని హాలాస్య మాహాత్మ్యమున అరు శ్లోకములలో వర్ణింపబడియున్నది[3]. ఈ వర్ణన చొక్కనాథ చరిత్రమున లేదు. దీనికి కారణము ప్రజలు కూడా రాజుకు భయపడి బౌద్ధ ధర్మమును పాటించుట.

(12) జ్ఞానసంబంధుడు దూరము నుండి హాలాస్యేశ్వరుని గోపుర విమానమును చూచి నమస్కరించి, వేగవతిని స్నానమాచరించి, పితృతర్పణాదికములను నిర్వర్తించి, విఘ్నేశ్వరునకు, షడాననునకు, మీనాక్షీ దేవికి నమస్కరించి, సుందరేశాలయము జేరి దేవేంద్రుడు సమర్పించిన దివ్య విమానమును తిలకించి, అంతర్ధామమును ప్రవేశించి లింగమూర్తియగు అంబాసహిత పరమేశ్వరుని దర్శించి, ధ్యానించి విధివిధానముగా నర్చించెనని హాలాస్య మాహాత్మ్యమున పదునొకండు శ్లోకములలో వర్ణించియున్నది[4]. తిరువేంగళకవి చొక్కనాథ చరిత్రమున ఈ వర్ణనయంతయు తొలగించినాడు. కాని ఇందు

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుటలు 256, 257. శ్లో. 41-59 వరకు.
2. చొక్కనాథ చరిత్ర. పుట 320.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 257. శ్లో. 60-66 వరకు.
4. హాలాస్యమాహాత్మ్యము. పుట 257, 258లు. శ్లో. 67-77 వరకు.

మూలమునకు భిన్నముగా జ్ఞానసంబంధుడు శైవదూషకులనిక్షేతమ్ముఁ జేసి మమ్మేలుకొనుమని చొక్కనాథుని ప్రార్థించినాడు. ఈ ప్రార్థన పంద్రెండు ద్విపదలలో నున్నది[1].

(13) హాలాస్యేశ్వరుని అర్చనాదికములను నిర్వర్తించిన యనంతరము జ్ఞానసంబంధుడు మఠమున నుండగా కులబంధనమంత్రియు, పాండ్య రాణియు నేతెంచి వారికి వలసిన ఏర్పాట్లన్నియు చూచుకొనిరని, మూలమున నుండగా[2] చొక్కనాథ చరిత్రమున కులశేఖర మంత్రి వచ్చి అచటి మతపరిస్థితులను వివరించి జ్ఞానసంబంధునకు వలసిన ఏర్పాట్లన్నియు చూచుకొనగా పాండ్యరాణి చొక్కనాథాలయమునకు వచ్చినట్లు వచ్చి జ్ఞానసంబంధుని దర్శించుకొని సర్వము దెలిపి తన యింటికి మరలిపోయినదని తిరువేంగళ కవి మార్చివ్రాసినాడు[3].

కుబ్జపాండ్యుడు శివద్వేషియైనందున అతనికి భయపడి పురజనులు శివమతమును పాటించక బౌద్ధ ధర్మమునను సరించుచుండ వారు తూర్య వాద్యములతో జ్ఞానసంబంధు నెదుర్కొనిరనుటయు, రాజుకు భయపడి రాణి, మంత్రి రహస్యముగా శివమతమును పాటించుచుండ వారుభయులు జ్ఞానసంబంధునకు వలసిన ఏర్పాట్లను చూచికొనిరనుటయు మూలమున అసంబద్ధములుగా నున్నవని ఎంచి తిరువేంగళకవి వీనిని వదలివేసి మార్చివ్రాసినాడు.

(14) హాలాస్య మాహాత్మ్యమున నగర సమీపమున ఒక పర్వతమున వసించు బౌద్ధులందఱును గూడికొని జ్ఞానసంబంధుని గాల్చిరమ్మని వహ్నిని బంపిరని యుండగా[4], చొక్కనాథ చరిత్రమున తిరువేంగళ కవి బౌద్ధులు జ్ఞాన సంబంధుని రాకను విని పాండ్యరాజు వద్దకు బోయి అతని విషయమును తెలియజేసి మా మంత్రాగ్ని వలన అతని దహింతుమని రాజాజ్ఞ వడసి బడబాగ్నిని పుట్టించి పంపిరని మార్చి వ్రాసినాడు[5].

(15) జైనులు తనను దహించి వేయుటకు జేసిన ప్రయత్నములకు ప్రతిగా జ్ఞానసంబంధుడు కుబ్జ పాండ్యునకు తాపజ్వరము దగులునట్లు గావించెను. అంత కుబ్జపాండ్యుడు జ్వరోపశమనార్థము జైనుల రావింపగా వారు చేయు మంత్ర తంత్రాదుల వలన తాపముపశమింపక అధికము కాజొచ్చినది. ఆ సమయమున రాణి, మంత్రి జ్ఞానసంబంధుని వృత్తాంతమును తెలియపఱచి అతని రప్పించిన మీ జ్వర తీవ్రతను తొలగించునని ప్రార్థించగా వారి మనవి విని పాండ్యరాజు జ్వరతీవ్రతచే ఔను కాదని ఏమియు సమాధానము చెప్పలేదని చొక్కనాథ చరిత్రమున మూలమునకు భిన్నముగా నున్నది[6]. మూలమున కుబ్జపాండ్యుడు వారి మనవి విని రోషముతో నేను బౌద్ధ

---

1. చొక్కనాథ చరిత్రము. పుటలు 320, 321.
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 258. శ్లో. 80-85 వరకు.
3. చొక్కనాథ చరిత్రము. పుట 321, 322.
4. హాలాస్యమాహాత్మ్యము. పుట 258. శ్లో. 86, 87లు.
5. చొక్కనాథ చరిత్రము. పుట 322.
6. చొక్కనాథ చరిత్ర. పుట 324.

ధర్మావలంబినిగాన భస్మము ధరింపనని తృణీకరించుట, భస్మమునట్లు తిరస్కరించగూడదని రాజుకు నచ్చజెప్పి, ఒప్పించుట మొదలైన తర్కవితర్కములందున్నవి[1]. జ్వరతీవ్రతతో బాధపడుచున్న రాజుతో తర్కించుట అనుచితమని తలచి తిరువేంగళ కవి ఈ విషయమును పై విధముగా మార్చినాడు.

(16) పాండ్యరాణి, కులబంధన మంత్రి ఇరువురు కలసి పాండ్యరాజు జ్వరోపశమనార్థము మనుషులను బంపి తదుపరి వారు పోయి జ్ఞానసంబంధుని దోడ్కొనివచ్చిరని మూలమున నుండగా[2] చొక్కనాథ చరిత్రమున స్వయముగా మంత్రి శేఖరుడే యాతని బిలిచికొని వచ్చెనని యున్నది[3].

(17) జ్ఞానసంబంధుడు విభూతి మహిమను గొనియాడుట చొక్కనాథ చరిత్రమున పదునేడు ద్విపదలలో నున్నది[4] మూలమున "భస్మస్తుతిమయంగేయమగాయజ్జ్వరశాంతయే[5]" అని మాత్రమే కలదు.

ఈ విధముగా తిరువేంగళకవి చొక్కనాథ చరిత్రము నందలి ఈ లీలను మూలమునందలి కొన్ని విషయముల ననుసరించి, కొన్నిటిని త్యజించి, కొన్నిటిని మార్చి, కొన్నిటిని కుదించి, కొన్నిటిని పెంచి యదేచ్ఛముగా ననువదించినాడు. చొక్కనాథ చరిత్రములోని ఈ లీలను మూలమునందలి ఈ లీలతో బోల్చి నిశితముగా పరిశీలించిన ఈ కవి అనువాద శిల్పము ప్రస్ఫుటమగు చున్నది. ఈయన అనువాద సరణి తెలుపుటకు ఈ ఒక్క లీలయే తార్కాణమా అనునట్లు తెనుగున దీనిని రచించినాడు.

## నవమాశ్వాసము – అఱువది యొకటవ లీల

(1) చొక్కనాథ చరిత్రములోని నవమాశ్వాసమున గల అరువది యొకటవ లీల హాలాస్య మాహాత్మ్యమున అరువది తొమ్మిదవ అధ్యాయమున 'శ్రీ జ్ఞాన సంబంధేన నగ్నానాం తరుశూలారోహనం' అను పేరున నున్న అరువది మూడవ లీలకు అనువాదముగా నున్నది.

(2) మూలమున ఈ లీల 232 శ్లో.లలో నుండగా చొక్కనాథ చరిత్రమున నిది 172 ద్విపదలలో ననువదించియున్నది.

(3) ఈ లీలయందలి కథాప్రారంభమున కులబంధన మంత్రి, పాండ్యరాణి వనితేశ్వరి జ్ఞాన సంబంధుని వద్దకు బోయి జైనుల ద్రుంచి శైవమును వృద్ధిపఱుపవలసినదని ప్రార్థించిన వృత్తాంతము మూలమున పది శ్లోకములలో నున్నది[6] చొక్కనాథ చరిత్రమున ఈ వృత్తాంతము ఆరు ద్విపదలలో సంక్షిప్తముగా నున్నది[7].

---

1, 2. హాలాస్యమాహాత్మ్యము. పుట 260.

3. చొక్కనాథ చరిత్ర. పుట 324.

4. చొక్కనాథ చరిత్ర. పుట 325, 326లు.

5. హాలాస్యమాహాత్మ్యము. పుట 260.

6. హాలాస్యమాహాత్మ్యము. పుట 264. శ్లో. 2-11 వరకు.

7. చొక్కనాథ చరిత్ర. పుట 329, 330లు.

(4) జైనుల నిర్జించి శైవ సమయమును రక్షింపవలసినదని తనను ప్రార్థింప వచ్చిన వారి ప్రార్థన నాలకించి జ్ఞానసంబంధుడు ఈ కార్యమునకు శివుననుజ్ఞ వడయవలెనని చెప్పి ఆ రాత్రి గడపి తెల్లవారి నిద్రమేల్కొని, కాలకృత్యాదులను దీర్చికొని, సంధ్యాది నిత్య కర్మలను నిర్వర్తించి, సుందరేశ్వరాలయమునకు వెడలి జైనుల సమయించుటకు నాకానతీయవలసినదని శివుని ప్రార్థించిన వృత్తాంతము మూలమున పంద్రెండు శ్లో.లలో నున్నది[1]. చొక్కనాథ చరిత్రమున దీనిని పది ద్విపదలలో ననువదించినాడు[2]. ఇందు రాత్రి గడపుట, తెల్లవారి నిత్య కార్యక్రమాదులను నిర్వర్తించుట, ఇత్యాది విషయములు తొలగించినాడు.

(5) జ్ఞాన సంబంధుని ప్రార్థన నాలకించి పరమశివుడు అశరీరవాణియై యాతడు కోరిన పనికి అనుమతించుట మూలమున మూడు శ్లోకములలో నున్నది[3] చొక్కనాథ చరిత్రమున దీనిని "అనఘాత్మయది యట్లయౌగాక యనుచు నశరీరభావుడై యానతిచ్చినను" అని ఒకే ఒక ద్విపదలో కవి అనువదించినాడు.[4]

(6) మూలమున పరమేశ్వరాజ్ఞను వినిన జ్ఞానసంబంధుడు 'పునశ్చవాణీసాసమ్యక్ సువ్యక్తం శృణ్వతామిహ' యని వేడుకొనగా సుందరేశ్వరుడు అతనిని జైనుల నిర్జించుటెట్లో వివరముగా మరొకసారి ఆనతిచ్చెను. ఇందు ఈ లీలలో జరుగబోవు కథ సంక్షిప్తముగా నాలుగైదు శ్లోకములలో నున్నది[5]. తిరువేంగళ కవి దీనిననువదించలేదు.

(7) మూలమున పంద్రెండు శ్లోకములలో కుబ్జపాండ్యుని భార్య, మంత్రి జ్ఞానసంబంధుడు జైనుల జయించు వృత్తాంతమును అశరీరవాణి ద్వారా విని, సుందరేశ్వరునకు మాటి మాటికి ప్రణమిల్లుచు, ఆ విషయమునే మరి మరి దలచుకొనుచు తమ నివాసములకు జేరిరని మరియు జైనము ప్రబలిన నాటి నుండి రాజ్యమునకు గలిగిన నష్టమును దలచుకొనుచు అట్టి జైనమింక నశింపబోవుచున్నదని నిశ్చయించుకొనుటయు నిందు గలవు[6]. చొక్కనాథ చరిత్రమున తిరువేంగళ కవి ఈ వృత్తాంతమును కూడా అనువదించలేదు.

(8) హాలాస్య మాహాత్మ్యమున 43వ శ్లోకము నుండి 78వ శ్లో. వరకు అనగా 35 శ్లో.లలో నున్న వృత్తాంతమును [7] తిరువేంగళకవి తన చొక్కనాథ చరిత్రమున అనువదించక వదలినాడు. ఈ శ్లోకములలో కుబ్జపాండ్యుని జ్వరోపశమన సందర్భమున జ్ఞాన సంబంధునిచే తమకు జరిగిన అవమానమును తలచుకొని జైనులు విచారించుట,

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 264, 265లు. శ్లో. 12-25 వరకు.
2. చొక్కనాథ చరిత్ర. పుట 330.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 265. శ్లో. 23-25 వరకు.
4. చొక్కనాథ చరిత్ర. పుట 330.
5. హాలాస్యమాహాత్మ్యము. పుట 265. శ్లో. 26-30 వరకు.
6. హాలాస్యమాహాత్మ్యము. పుట 265, 266లు. శ్లో. 30-42 వరకు.
7. హాలాస్యమాహాత్మ్యము. పుటలు 266, 267.

మరల ఎట్లైనను జ్ఞానసంబంధుని జయించవలెనని నిశ్చయించుకొని గృహము వెడలుట, వారి భార్యలు వారి కడ్డుపడి 'మీరు జ్ఞాన సంబంధునిచే ఓడిపోయి శూలారోహణము గావింపబడినట్లు' కలవచ్చినదని తెలుపుట, పత్నుల మాటను కాదని బయలుదేరి మధురాపురికి వచ్చుచుండగా వారికి దుశ్శకునములుగాన వచ్చుట, వారి శిష్యప్రశిష్యులు దుశ్శకునములు దోచుచున్నవి గాన మధురకు బోవలదని ప్రార్థించుట, వారి యభిప్రాయమును తిరస్కరించి జైనులు మధురను జేరుట, ఆ సమయమున వారికి వామభుజములు, కన్నులు నదరుట, ఇత్యాది వర్ణనలు గలవు. తిరువేంగళ కవి వీనినన్నింటిని కావ్యరస పోషణమునకు, ఇతివృత్త సంవిధానమునకు అటంకములుగా నున్నవని వదలినట్లు తోచుచున్నది.

(9) జైనులు మధురకు వచ్చిన తదుపరి 'నిశ్చిత్య కార్యకర్తవ్యం పూర్వం ప్రాపుశ్చ భూపతిం' అని మూలముననున్న 79 వ శ్లోక పూర్వార్ధ భాగమును[1] తిరువేంగళకవి చొక్కనాథ చరిత్రమున 'జైనులెన్మిదివేళ జనములావేళ, నరవినాభూపాలు సముఖమ్మునకును, నురవడి నేతెంచి" యని అనువదించి[2] ఆ తరువాత ఉత్తరార్ధ శ్లోకభాగమున 'బాలేన జ్ఞానవృద్ధేన వివాదం కర్తుమాగతా' యని మూలమున నుండగా[3] తెనుగున జైనుల కన్నముందే వారిని జయించవలెనని జ్ఞానసంబంధుడు చొక్కనాథాలయము నుండి వెలువడి పాండ్యరాజు వద్దకు వచ్చి తన సంకల్పమును రాజుకు వివరించి అతని అనుమతి వడసి యటనున్నాడని ఆ సమయమున 'ఉరవడి నేతెంచి యొనరనందున్న సుజ్ఞాన సంబంధుజూచియందఱును' వాగ్వాదమునకు దిగిరని[4] మార్చినాడు.

(10) తిరువేంగళ కవి మూలమున పాండ్యరాజు జైనులకు గావించిన స్వాగత సత్కారాదులు చొక్కనాథ చరిత్రమున తొలగించినాడు.

(11) జైనులు పాండ్యరాజు సముఖమున జ్ఞానసంబంధునితో మీ మంత్ర మహిమ మా మంత్ర మహిమ తాళపత్రముల లిఖించి అగ్నిలో వేసిన ఎవరి పత్రము కాలకుండ నుండునో వారే గొప్పవారని పంతము బూని ఇరుపక్షముల వారును వారి వారి పత్రములను అగ్నిలో వేయగా, జ్ఞానసంబంధుని పత్రము కాలకుండుటయు, జైనుల పత్రము కాలిపోవుటయు మూలమున ఇరువది రెండు శ్లోకములలో వివరముగా నున్నది[5].

చొక్కనాథ చరిత్రమున నిది పదునైదు ద్విపదలలో సంక్షిప్తముగా నున్నది[6].

(12) తమ పత్రములు కాలిపోయిన అనంతరము జైనులు, జ్ఞానసంబంధునితో మీ పత్రము కాలకుండ నుండుటకు అగ్ని స్తంభన కారణము, అంతేగాని మీ మంత్ర

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 267.
2. చొక్కనాథ చరిత్ర. పుట 331.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 267.
4. చొక్కనాథ చరిత్ర. పుట 331.
5. హాలాస్యమాహాత్మ్యము. పుట 268, 269లు. శ్లో. 86-107 వరకు.
6. చొక్కనాథ చరిత్రము. పుట 331, 332లు.

మహిమకాదని వాదించి మరల మనమన పత్రములను వేగావతి నదిలో వేసినచో ఎవరి పత్రము ఎదురీది చనునో వారు గెల్చినవారని, ఎవరి పత్రము ఈదలేక కొట్టుకొని పోవునో వారు ఓడిన వారని, ఓడినవారు గెలిచిన వారికి దాసులై యుండవలెనని పందెమొడ్డిరి. అప్పుడు జ్ఞానసంబంధుడు వారితో 'మాకు దాసులతో పని లేదు. శివాజ్ఞచే మీరు ఒడుదురు. మిమ్ము శూలములనెక్కింతు'నని యనెను. ఈ సందర్భమున మూలమునకు తెలుగునకు ఒక చిన్న మార్పు గలదు. చొక్కనాథ చరిత్రమున 'మిమ్ము కొఱ్ఱులెక్కింతును. తలకొక కొఱ్ఱు చొప్పున మీరు ఎనమిది వేలమంది ఎనమిది వేల కొఱ్ఱులు చేబూని రండని యనినట్లు కల్పనగలదు. ఇది మూలమున లేదు. ఆ తరువాత జ్ఞానసంబంధుడిట్లనుచున్న సమయములోనే కోట చరుడను మంత్రి (మూలమున మంత్రి పేరు లేదు) ఎనమిది వేల కొఱ్ఱుల దెప్పించి సిద్ధముగా నుంచెను[1].

(13) ఈ సందర్భమున హాలాస్య మాహాత్మ్యమున జ్ఞానపూర్ణుడు వారియందు కృపాలుడై వేదధర్మమును వారికి బోధించెను[2].

చొక్కనాథ చరిత్రమున నున్న ఈ బోధ మూలమునకు భిన్నము.[3]

(14) జ్ఞానపూర్ణుడు వేదమార్గమును బోధించగా జైనులాగ్రహించి వాదులేటికి పదపద మనమంత్ర మహిమల నిరూపించుకొందము. అనుచు వైఘానదీ తీరమునకు జేరి జైనులు వారి వారి మంత్ర పత్రములు నది మధ్యమున వైవగా, జ్ఞానసంబంధుడు తన పత్రమును శివుని స్మరించుకొనుచు వైఘలో వదలెను. జైనుల మంత్రములు నీటమునిగి క్రిందకు కొట్టుకొనిపోగా, జ్ఞానసంబంధుని మంత్రపత్రము నీటిపై దేలుచు పైకి బోయినది. ఇట ఈవింతను జనులాశ్చర్యమున జూచుచుండ జైనులు పారిపోవ ప్రయత్నించిరని రాజభటులు వారినడ్డగించిరని మూలమున నున్నది.[4] తెనుగున నిది లేదు.

(15) జ్ఞానసంబంధుడు అట్లు పారిపోవుచున్న జైనులను దయదలచి భస్మధారులు కండని తెలుపు సందర్భమున చొక్కనాథ చరిత్రమున మూలమున లేని రుద్రాక్ష మహత్త్వమును తిరువేంగళ కవి విపులముగా రచించినాడు. మూలమున భస్మప్రభావము కొంత వ్రాసియున్నది. కాని రుద్రాక్ష మహత్త్వము ప్రత్యేకముగా వర్ణింపబడలేదు.

తిరువేంగళ కవి ఈ కావ్యమున జ్ఞానసంబంధునిచే అయిదు ద్విపదలలో చెప్పించిన రుద్రాక్ష మహత్త్వముతో తృప్తిచెందక మునులు రుద్రాక్ష ప్రభావమును దెలుపవలసినదని అగస్త్యుని ప్రార్థించగా అతడు ఇట్లు చెప్పెనని రుద్రాక్ష విభవమును ముప్పది ద్విపదలలో రచించినాడు[5]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 332, 333లు.
2. హాలాస్యమాహాత్మ్యము. పుటలు 269, 270లు. శ్లో. 119-126వరకు.
3. చొక్కనాథ చరిత్రము. పుట 333.
4. హాలాస్యమాహాత్మ్యము. పుట 271. శ్లో. 144.
5. చొక్కనాథ చరిత్రము. పుటలు 335, 336, 337.

(16) ఏటికెదురీది పోయిన జ్ఞానసంబంధుని పత్రమేమైనదో చూడవలెనని కుబ్జపాండ్యాదులు నది వెంబడినేపోగా అర్ధయోజన మాత్ర దూరమున నీటిపై దేలుచున్న యా పత్రమును గ్రహించి పరమశివుడు వృద్ధ బ్రాహ్మణ రూపమున నుండెను. అపుడాతని చేతిలోనున్న ఆ పత్రికను గాంచి రాజాదులు జ్ఞాన సంబంధుని మహత్త్వమును గొనియాడుటయు బౌద్ధులు కొందఱు శైవమతమును స్వీకరించుటయు, కొందఱు కొఱ్ఱులబడి చచ్చుటయు, ఇత్యాది విషయములు మూలమున విపులముగా నున్నవి[1]. వీనిని చొక్కనాధ చరిత్రమున తిరువేంగళ కవి సంక్షిప్తముగా ననువదించినాడు[2].

మొత్తముపై ఈ లీల మూలమునకు సంక్షిప్తానుసరణము.

## నవమాశ్వాసము – అఱువది రెండవ లీల

ఈ లీల మూలమున లేదు. కవి కల్పితము కావచ్చును.

## నవమాశ్వాసము – అఱువది మూడవ లీల

ఈ లీల మూలమున లేదు. కవి కల్పితము కావచ్చును.

## నవమా శ్వాసము – అఱువది నాలుగవ లీల

(1) హాలాస్యమాహాత్మ్యమునందలి డెబ్బదియవ అధ్యాయమున నున్న 'శంభుకూపశమీ వృక్షానయనం' అను అఱువది నాలుగవ లీల చొక్కనాధ చరిత్రమున నవమా శ్వాసమున అఱువది నాలుగవ లీలగా ననువదితము.

(2) మూలమున ఈ లీల 130 శ్లోకములలో నున్నది. తెనుగున అశ్వాసాంత ద్విపదలతో గూడికొని 290 ద్విపదలు గలవు. ఇందు ఈ లీలలోని కధకు సంబంధించిన శ్లోకములు 177 మాత్రమే.

(3) మూలమున చోళదేశపు వైశ్యునితో (మామపాత్ర) కధ ప్రారంభమైనది. తెనుగున పాండ్యదేశపు వైశ్యునితో (అల్లుని పాత్ర) కధ మొదలైనది. ఈ మార్పు వలన కధా ప్రణాళికలో మూలముతో తెనుగునకు కొంత భేదమేర్పడినది.

(4) చొక్కనాధ చరిత్రమున తిరువేంగళకవి 'యౌవన ప్రాప్తయైన వైశ్యపుత్రి శరీర సౌందర్య వర్ణన' 15 చరణములలో గావించినాడు[3] ఈ వర్ణన మూలమున లేదు. ఇందు 'లబ్ధవాన్ కన్యకా మేకాం కాంత్యానాగాంగనామివ[4]' అని మాత్రమే కలదు.

(5) చోళదేశపు వైశ్యుడు మధురాపురి నున్న తన మేనల్లునకు తన కుమార్తె నీయదలచి యున్నంతలో అతనికి అకాల మరణము ప్రాప్తించగా అతని భార్య అగ్నికి ఆహుతియై గతించినది. అనంతరము అతని బంధువులు ఆ వైశ్యుని మేనల్లునకు ఈ

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 272-275. శ్లో. 165-232 వరకు.
2. చొక్కనాధ చరిత్ర. పుటలు 337-339 వరకు.
3. చొక్కనాధ చరిత్ర. పుట 348, 349లు
4. హాలాస్యమాహాత్మ్యము. పుట 279 శ్లో 6

వర్తమానమును పత్రిక వ్రాసి పంపించిరని మూలమున నున్నది[1] చొక్కనాథ చరిత్రమున చోళదేశపు వైశ్యుడు బ్రతికి యుండగనే ఎవ్వరడిగినను తన కూతురినీయక తన మేనల్లునకే పెండ్లి చేయదలచి అతనిని తోడ్కొని రమ్మని ఒక 'పెద్ద' నంపెనని అతడు వచ్చునంతలో అత్తమామలు జ్వరపీడనమున స్వర్గస్థులైరని కవి మార్చి వ్రాసినాడు[2].

(6) చోళదేశపు వైశ్యుని మరణానంతరము అతని ధనమును కన్యను అతని బంధువులు మేనల్లున కొప్పగించిన విషయము మూలమునను తెనుగునను ఒకే రీతిగా నున్నది.

(7) వైశ్య వరుడు బంధువులచే ననుజ్ఞాతుడై ఆ కన్యను దోడ్కొని మధురాపురికి వచ్చుచు మార్గ మధ్యమున తిరుపెరుంబను నూరి (మూలమున సీసపురి) దేవరను దర్శించుకొని, ఆ రాత్రి ఆ దేవాలయ మంటపమున నిద్రించుచుండగా, నతడు పాము కాటుచే మరణించిన వృత్తాంతము నందు మూలమున నున్న వివిధ దేవతా పూజనము, భోజనాదికములు ముగించుకొనుట[3] ఇత్యాది విషయములను కవి చొక్కనాథ చరిత్రమున తొలగించినాడు.

(8) హాలాస్య మాహాత్మ్యమున వైశ్యకన్య తన బావ పాముకాటుచే మరణించగా తాను తలబాదుకొనుచు రోదించుచుండ దైవికముగా నటకు వచ్చిన జ్ఞాన సంబంధుడు ఆ రోదనమును విని శిష్యుని పంపించి విషయమును దెలిసికొని మేన విభూతి బూసి తన మంత్ర శక్తిచే ఆ వైశ్య వరుని బ్రతికించెనని యున్నది[4]. చొక్కనాథ చరిత్రమున తిరువేంగళ కవి మూలమును కొంత మార్చి వ్రాసినాడు. వైశ్యకన్య అట్లు ఏడ్చుచుండగా జాంగలికులు వచ్చి మంత్రౌషధ క్రియల మాన్ప యత్నింప వారి ప్రయత్నము ఫలించక పోవుటచే ఆమె పరమేశ్వరు సన్నిధికి బోయి తల్లిదండ్రిలేని నాకు బావను గూడ దూరము చేతువాయని, నాకు మాంగళ్య భిక్ష నొసగుమని, లేకున్న, నీముందే అగ్నిని వ్రేల్చుకొని యందుబడి మరణింతునని మొరబెట్టుకొనగా ఆ స్వామి కరుణించి, జ్ఞానసంబంధుని రప్పించి, వైశ్యవరుని బ్రతికించి వీరికి వివాహము గావించి పంపుమని యాజ్ఞాపించెను. అంత అతడు తన దివ్యదృష్టిని ఆ వైశ్య వరుని కళేబరముపై ప్రసరింపజేయగనే అతడు చయ్యనలేచెను[5]. చొక్కనాథ చరిత్రమునందలి ఈ మార్పు మూలముకన్న ఔచితీమంతముగ నున్నది. మరియు ఇందలి ఈ సన్నివేశము మూలముకన్న నెక్కుడు కరుణ రస సమంచితముగా నున్నది.

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 275. శ్లో. 11
2. చొక్కనాథ చరిత్ర. పుట 349.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 276. శ్లో. 29-33.
4. హాలాస్యమాహాత్మ్యము. పుట 276, 277. శ్లో. 35-50 వరకు.
5. చొక్కనాథ చరిత్ర. పుటలు 350, 351.

(9) వివాహానంతరము వైశ్య దంపతులు మధురానగరమునకు బోయి వేడ్కనుండగా

"అప్పుడా యింతితానాత్మేశుమీదఁ

దప్పక యత్యంత తాత్పర్యమెసగ

ఘనమైన పతిభక్తి గలిగి వర్తించె" నని తెలిపి చొక్కనాధ చరిత్రమున తిరువేంగళ కవి మూలమున లేని పతివ్రతాచార ధర్మములను 'అనఘాత్ములార! సంయములార మీకు' కరతలామలకమ్ముగా వినిపింతు' నని 22 ద్విపదలలో అగస్త్యునిచే వినిపించెను.[1] ఇవి వైశ్య వనిత శంభు కూపశమీవృక్షములను సాక్షులుగా రప్పించునంతటి పతివ్రత యని తెలుపుటకు అవసరమని భావించి వీనిని శ్రీనాధుని మీది గౌరవముచే నాతని కాశీఖండము నుండి గ్రహించి వ్రాసినాడు. ఈ విషయమును పూర్వకవ్యను సరణములు అనుశీర్షిక క్రింద వివరింతును.

(10) మధురాపుర వైశ్యుని మొదటి భార్య క్రొత్తగా వచ్చిన రెండవ భార్య నోర్వక నా భర్త నిన్ను పెండ్లాడినాడా, నీవు కూడి వచ్చిన దానవని నిందించి, నిన్ను నా భర్త వివాహ మాడినచో సాక్షులను రప్పించుమని నిలదీసినది. అప్పుడాతని రెండవ భార్య మిక్కిలి దుఃఖించి చొక్కనాధుని జేరి ఆనాటి సాక్షులను రప్పించి నా పరువుగాపాడుమని ప్రార్థించగా, ఆర్త రక్షణ పరాయణుడైన సుందరేశ్వరుడు తిరుపెరుంబాపురి (సీసపురి) నుండి సాక్షులైన శమీవృక్షమును, కూపమును రప్పించి తాను వినువీధి ప్రత్యక్షమై వైశ్యుడీమెను వివాహమాడిన మాట సత్యమేనని ఆ వృత్తాంతమంతయు వివరించెను. మీనాక్షీ దేవియు ఆమె పాతివ్రత్యమును బొగడెను. చొక్కనాధ చరిత్రము నందలి ఈ వృత్తాంతమంతయు మూలానుసరణమేయయినను మూలముకన్న ఇందు రమణీయముగా కన్నులకు గట్టినట్లు చిత్రింపబడినది.

ఈ విధముగా చొక్కనాధ చరిత్రము నందలి ఈ లీల మూలమునకు యదాతధానువాదము కాక యదేచ్ఛానువాదమై యొప్పుచున్నది.

హాలాస్యమాహాత్మ్యమున చతుష్షష్టి లీలానుకధనం అను డెబ్బదియొకటవ అధ్యాయమున అగస్త్యుడు ఆనందకాననమున వశిష్ఠాది మహామునులకు సుందరేశ్వరుని అరువది నాలుగు లీలలను వినిపించిన అనంతరము ఆ మునులు హాలాస్య క్షేత్రమును దర్శింప సమకట్టి కుంభ సంభవునునుజ్ఞ వడయుట, విమానాధి రూఢులై మధురను జేరి హేమ పద్మాకరమున తీర్థమాడి మీనాక్షీ సుందరేశ్వరులను దర్శించుకొనుట, పూజించి నతించి నుతించి ఆ దేవుని ప్రత్యక్షీకరించుకొని దీవనలు వడయుట, వినాయకునకు, కుమారస్వామికి మ్రొక్కి దివ్య విమానమును తిలకించి మరల ఆనందకాననము జేరుట అగస్త్యుని అనుజ్ఞ వడసి తమ తమ నెలవులకు బోవుట, మరియు వశిష్ఠాది ఎనమిది వేల మహర్షులు ఎనమిది వేల శివలింగములను ప్రతిష్ఠించుకొని పూజించుకొనిన

---

1 చొక్కనాధ చరిత్ర పుటలు 353, 354

వృత్తాంతమంతయు వర్ణింపబడినది. అగస్త్య మహామునిచే హాలాస్యేశ్వరుని భజించిన వారికి ఫలశ్రుతి చెప్పబడినది. మరియు గ్రంథపూజ గ్రంథపఠనము వలన కలుగు ఫలము కూడా తెలుపబడినది.

చొక్కనాధ చరిత్ర కావ్యాంతమున తిరువేంగళ కవి చొక్కనాధునకు బ్రహ్మేంద్రాది దేవతలు మధురాపురిని పాలింపుమని పట్టము గట్టిన వృత్తాంతము, చొక్కనాధునిచే రక్షింపబడు భక్తుల పేర్లు మరియు ఫలశృతి వ్రాసినాడు. అనంతరము కృతి పతికి కావ్యసమర్పణాది ద్విపదలు వ్రాయుటతో కావ్యము సమాప్తమైనది.

హాలాస్య మాహాత్మ్య పురాణాంతము చొక్కనాధ చరిత్ర కావ్యాంతము పురాణ కావ్య సంప్రదాయముల ననుసరించి వేనికవే స్వతంత్రముగా వ్రాయబడినవి. వీటి మధ్యసామ్యము లేదు. ఫలశృతి చెప్పుటలో కూడా ఈ గ్రంధములు వేటికవే స్వతంత్రములు.

చొక్కనాధ చరిత్రమునందలి 64 లీలలను దేనికదే సూక్ష్మముగా పరిశీలించిన మీదట తిరువేంగళ కవి అనువాద విధానమును ఈ క్రింది విధముగా నిర్ణయింపవచ్చును. ఈ కవి మూలములోని కొన్ని లీలలయందలి ఇతివృత్తమును యదాతథముగను, కొన్నిటిలోని కథను నామమాత్రముగను అనుసరించి అనువదించినాడు. కొన్నిటి ఇతివృత్తమును మార్చి, కొన్నిటిని పెంచి, కొన్నిటిని కుదించి, కొన్ని లీలలలో అనౌచిత్యములని తోచిన విషయములను పరిహరించి, ఔచితీ వంతములైన వానిననుసరించి, ఆయా లీలల యందలి ఆయువు పట్టులు చెడకుండా అనువదించినాడు. ఒక్కమాటలో చెప్పవలెనన్న తిరువేంగళ కవి మూలమును చదివి, ఆకళింపు జేసికొని, మరల మనసుకు దెచ్చుకొని అవసరమని తోచినపుడు మాత్రమే మూలమును చూచుచు స్వతంత్రముగా ఈ కావ్యమును రచించినాడు. కావుననే ఈ కవి కావ్యాంతమున 'నా నేర్పు విధమున నాదు జిహ్వకును బూనిన మార్గమ్ము బొసగ జెప్పితిని' అని వ్రాసికొనినాడు.

# పంచమాధ్యాయము - కావ్య శిల్పము

**ఇతివృత్తము**

అలంకారికులు కావ్య శరీర మితివృత్తమని, దాని సౌందర్యహేతువు రసమని, దాని కాలంబనములు పాత్రములని నిర్దేశించినారు. కావున కావ్యమునందు ఇతివృత్తము (కథ), పాత్రములు (నాయికా నాయకులు ఇత్యాదులు), రసము ప్రధానాంగములు, కాగా అలంకారములు, వర్ణనలు ఇత్యాదులు రసానంద పోషకములు గాననివి ఉపాంగములు.

కావ్యము వస్తువును బట్టి ప్రఖ్యాతము, ఉత్పాద్యము, మిశ్రము. అని మూడు విధములు. ప్రఖ్యాత మన పురాణప్రసిద్ధము. రామాయణాదులు; ఉత్పాద్యమన కేవల కవి కల్పితములు- కళాపూర్ణోదయాదులు; మిశ్రమన కొంత ప్రఖ్యాత వస్తువును కొంత ఉత్పాద్య వస్తువును మిళితమైనది. కీర సందేశము;[1]

సంస్కృతమున గల హాలాస్య మాహాత్మ్యపురాణమునకు చొక్కనాథ చరిత్రము అనువాద గ్రంథము గావున ఇందలి ఇతివృత్తము ప్రఖ్యాతము. ఈ కథ హాలాస్యక్షేత్రమునకు సంబంధించినదగుటచే దీనిని క్షేత్ర మాహాత్మ్య కావ్యముగా పేర్కొనవచ్చును. హాలాస్యక్షేత్రమున వెలసిన దైవము చొక్కనాథుడు. ఈయన నెఱపిన అఱువది నాలుగులీలలే ఇందలి ప్రధాన ఇతివృత్తము.

అఱువది నాలుగు లీలలలోను అఱువది నాలుగు కథలున్నవి గాన స్థూల దృష్టికి ఇందు వస్త్వైక్యము లేదనుటకు వీలున్నది. కాని సూక్ష్మ దృష్టితో చూచిన ఈ లీలలన్నియు చొక్కనాథుడు నెఱపినవే. గావునను, ప్రతిలీలలోను ఆ దేవుని మహత్త్వమే గోచరించుచున్నది గావునను, లీలలన్నిటను భక్తుల ఎడ చొక్కనాథుడు చూపిన అవ్యాజానురాగము, వారికై ఆయన పడినపాట్లు వర్ణితములు గావునను, కథలు వేరైనను వానిలో నున్న సూత్రము మాత్రము భిన్నత్వములో ఏకత్వము వలె ఒకటే 'భక్త సంరక్షణ' గనుక ఇందు వస్త్వైక్యము కొఱవడలేదని భావించవచ్చును.

చొక్కనాథ చరిత్రము తొమ్మిది ఆశ్వాసముల కావ్యము[2]. ఇందు తిరువేంగళకవి చొక్కనాయకుని అఱువది నాలుగు లీలలను వర్ణించినాడు. ప్రథమాశ్వాసమున రెండు, ద్వితీయాశ్వాసమున ఆఱు, తృతీయాశ్వాసమున ఎనిమిది, చతుర్థాశ్వాసమున ఎనిమిది,

---

1. కావ్యాలంకార సంగ్రహము. పుట 242
2. 'శ్రీచొకటనాథ చరిత్రమందును నిది నవమాశ్వాసమయ్యె' -చొక్కనాథ చరిత్ర.పుట 365

పంచమాశ్వాసమున ఎనిమిది, షష్ఠాశ్వాసమున ఏడు, సప్తమాశ్వాసమున తొమ్మిది[1], అష్టమాశ్వాసమున ఎనిమిది, నవమాశ్వాసమున ఎనిమిది లీలలు గలవు.

"ఈయఱువది నాల్గు నేణాంకధరుని
పాయనిలీలలై భాసితంబుగను
దిరముగాఁ కృతయుగ త్రేతాయుగములఁ
గరమొప్పద్వాపరకలియుగమ్ములను
నొక్కొక్క యుగమున నెగి పదియాఱు
లెక్క నఱువది నాల్గు లీలలైనట్టి[2]" యని తిరువేంగళకవి విభజించినను

కావ్యమున నిట్టి సూచనలు రెండు మాత్రమే కన్పించుచున్నవి. ఒకటి; పదునాఱవలీలలో 'ప్రళయమై బ్రహ్మ కల్పమ్మునఁ బూర్వ కలియుగాంతమున' ననుటచే కృతయుగము ప్రారంభమైనట్లు ఊహింపవచ్చును[3]. రెండు; నలువది యెనిమిదవ లీలలో 'తొల్లి బ్రహ్మ కల్పాంతరమున, 'జరాచరప్రతతుల తోడ

మధురయొక్కటి దక్క మఱిపట్టణములు
నధిక దేశమ్ములు నంబుధుల్ చేత
లయమాయె[4]" – నని యుండుటచే ఒక యుగము ముగిసి మరొక

యుగము ప్రారంభమైనట్లు భావించవచ్చును. పదునాఱవ లీలకు ముందొక యుగముగా తలచినచో మొత్తము నాల్గు యుగములకు నాలుగు పదునాఱుల చొప్పున అరువది నాలుగు లీలల లెక్క సరిపోవును.

చొక్కనాథ చరిత్రము నందలి లీలలను ఈ క్రింది విధములుగా విభజించవచ్చును. 1. బ్రాహ్మణులను బ్రోచినవి. 2. క్షత్రియులను రక్షించినవి. 3. వైశ్యులను గాపాడినవి. 4. శూద్రులను గాచినవి. వరుసగా 22, 24,25,30,51వ లీలలు బ్రాహ్మణభక్తులను బ్రోచినవి, 4,5 మలయకేతన పాండ్యుని, 6,8,9,10,11 తటాతకను, 12,13,14,15 ఉగ్రుని, 17,23,24 దేవపాండ్యుని, 27,28 యుక్త పాండ్యుని, 30 వలీల పాండ్యరాజును (పేరు లేదు) 33వ లీల కాడ్వెట్టి యను చోళవిభుని, 34వ లీలపాండ్యరాజును, 49వ లీల అనంతగుణపాండ్యుని, 60వ లీల కుబ్జపాండ్యుని, రక్షించినవి. ఈ లీలలలోని భక్తులందఱు రాజవంశజులే.62,64 లీలలు వైశ్యులను గాపాడినవి.44,45 లీలలు శూద్రులను గాచినవి. ప్రభువు తోపాటు ప్రజలను కూడా రక్షించిన లీలలు 27,28,36, 39, 48 లు.

---

1. ముద్రిత గ్రంథమున నలువది యవ లీలతో సప్తమాశ్వాసము ప్రారంభముకాగా D1053 తాళపత్రప్రతిలో 41వ లీలతో మొదలైనది.
2. చొక్కనాథ చరిత్ర. పుట 16.
3. చొక్కనాథ చరిత్ర. పుట 101.
4. చొక్కనాథ చరిత్ర. పుట 251.

ఇంతే కాక ఇందు వర్ణమును గుర్తించుటకు వీలులేని భక్తులన్ను రక్షించిన లీలలను పురుషులను, స్త్రీలను రక్షించిన లీలలుగా పేర్కొనవచ్చును. పురుషులను రక్షించిన లీలలలో 29వ లీల సేనాధిపతిని, 40,41, 42వ లీలలు బాణభద్రుడను పాఠకుని, 50,51,52,53,54వ లీలలు నత్కీరాది కవులను, 55వ లీల అడుక్కాండడను కవిని, 56,57,58,59వ లీలలు తిరువాదయూరుని, 60,61వ లీలలు జ్ఞాన సంబంధుని, 63వ లీల కార్యారి, నార్యారులను కవులను అనుగ్రహించినవి. ఇఁక స్త్రీలను రక్షించిన లీలలలో 26వ లీల ఒక శూద్రవనితను, 35వ లీల చొన్నాయియను వారకాంతను, 38వ లీల వైశ్యస్త్రీని, 43వ లీల బాణభద్రుని భార్యను, 64వ లీల వైశ్యవధువును సంరక్షించినది.

ఇవి కాక చొక్కనాథ చరిత్రమున గల 7,16 లీలలు మునులను, 31వ లీల ముని స్త్రీలను, 18,21 వలీలలు ప్రత్యేకముగా ప్రజలను రక్షించినవి.

కేవలము మానవులనే గాక దేవతలను, జంతువులను, పక్షులను పరిరక్షించిన లీలలు కూడా ఇందున్నవి. 1వ లీల ఇంద్రుని, 32వ లీల షణ్మాతృకలను, 44వ లీల అంగయకణ్ణెమ్మ, నంది కేశ్వరులను, 54వ లీల కుమారస్వామిని కరుణించినవి. 2వ లీల ఐరావతమును, 3వ లీల హరిణడింభకములను కాపాడినవి. 46వ లీల భరద్వాజపక్షిని, 47వ లీల బకమును సంరక్షించినవి.

ఇది కేవలము స్థూల విభజన మాత్రమే. ఒక లీలలో ఒకరినే గాని మరొకరిని రక్షింపలేదా అను ప్రశ్నకు 'లేదు' అని సమాధానమిచ్చుటకు వీలు లేదు. ఉదా.కు 13,14,15 లీలలు ఉగ్రపాండ్యునితోపాటు ప్రజలను కూడా రక్షించినవి కావున భగవంతుడైన చొక్కనాథునకు భక్తుని యొక్క భక్తి యే ప్రధానముగాని అతని జాతి, వర్ణ, ప్రాంత ఇత్యాది విభేదములు కావు. అందుకే చొక్కనాథ చరిత్రమునందలి ప్రతి లీలలోను సుందరేశ్వరునకు జీవుల ఎడగల అవ్యాజానురాగము, భక్తులకు సుందరేశ్వరుని పై గల అచంచల భక్తి విశ్వాసములే కన్పించుచున్నవి.

పైన చూపిన లీలలలో కొన్నిట అవాంతర కథలు గూడా కలవు. అవి 51వ లీలలో 'ధర్మి' యను బ్రాహ్మణ బ్రహ్మచారికథ, 58వ లీలలో నక్కలు గుఱ్ఱములైన కథ, 59వ లీలలో పిట్టవ్వ కథ, 60వ లీలలో జ్ఞాన సంబంధుని జన్మ వృత్తాంత కథ.

## కథాకథన శిల్పము

చొక్కనాథ చరిత్రము నందలి కథలన్నియు ప్రసన్నముగా నున్నవి. క్లిష్టత ఎచ్చటను లేదు. ఒకటి, రెండు కథలను జూచిన ఈ కవి కథాకథన శిల్పమును మనము గ్రహించవచ్చును.

### 1. ఐరావత శాపవిమోచనము;

ఈకథ రెండవ లీలలో నున్నది. ఐరావత శాపవిమోచన మనగానే ఐరావతమునకు గల శాపమేమి? శపించినదెవరు? శాపకారణమేమి? శాపవిమోచనమెట్లు జరిగినది. అను

ప్రశ్నలుద్భవించుచున్నవి. కవి వీనికి సమాధానములనెట్లు చెప్పినాడో చూచిన అతని కథాకథన దక్షత స్ఫుటమగును.

ఐరావతమునకు గల శాపము అడవి ఏనుగువై సంచరింపుమని. అట్లు శపించిన వాడు దుర్వాసుడు. దానికి కారణము దుర్వాసుడు ఇంద్రున కిచ్చిన శివార్పిత పుష్పదామమును త్రొక్కిపాడుచేయుట. ఇక్కడనున్నది ఈ కథలో గల అయువుపట్టు. దుర్వాసుడు పూలదండనిచ్చినది ఇంద్రునకు గదా! మఱి ఐరావతమెట్లు పాడు చేసినది? అనగా దుర్వాసుని నుండి గ్రహించిన దండను ఇంద్రుడు ఐరావతము కుంభస్థలముపై వేయుటవలన ఇంద్రుడు తన కుంభస్థలముపై వేసిన దండను ఐరావతము ఏల త్రొక్కిపాడు చేయవలె? అనగా ఇంద్రుడు దండ వేసినంతనే ఒక తుమ్మెద దానిలో నున్న అధిక సౌరభ్యమానుటకై వచ్చి రొద చేసినది.

"తానందు కోర్వక తనమదంబునను
తన విధి ప్రేరేపఁ దన దుష్కృతమున
దన మస్తకంబునఁ దగిలున్నయట్టి
యాదండ నల్దిక్కులందున విసరి
పాదంబులను మెట్టి పారంగవైచె." [1]

పై పంక్తులలో కవి ఐరావతము తన తలపై నున్న దండను కేవలమదముతో గాక, తుమ్మెద రొదను ఓర్చుకొనలేక, విధి ప్రేరేపించ, తన దుష్కృతము వలన ఆ దండను నాల్గు దిక్కులకు బాఱవైచి కాళ్లతో త్రొక్కి పాడుచేసినది. దుర్వాసుడిది చూచినాడు. శివ ప్రసాదము నట్లు పాడు చేయుట సహింపనివాడై క్రోధముతో మొదట ఇంద్రుని తరువాత ఐరావతమును శపించినాడు. ఇక్కడనున్నది చమత్కారము. ఐరావతము పాడుచేయగాఁ జూచి దానిని మాత్రమే శపించక దుర్వాసుడు ఇంద్రునేల శపించవలె? అదియుగాక ముందే ఎందుకు శపించవలెనన్నచో తాను దండ ఇచ్చినది ఇంద్రునకు. కావున ఇంద్రుని ముందు శపించి అనంతరము ఐరావతమును శపించినాడు.

ఇంద్రునకు పాండ్యరాజు చేతి చక్రముచే తల వ్రక్కలగునని, ఐరావతమునకు అడవి ఏనుగువై సంచరింపుమని శాపములు. అట్లు శపించుటలో ఔచిత్యమేమి? అనినచో ఇంద్రుడు శివ ప్రసాదమును తన శిరమున దాల్చక ఐరావతము శిరమున నుంచుటయే. ఐరావతమునడవి ఏనుగువై సంచరింపుమనుటలో దాని మదమునే ప్రత్యక్షముగా అతడు చూచినాడు గనుక.

ఇక ఇప్పుడు మనము చూడవలసినది శాపవిమోచనములు. ఇంద్రునకు లీలాంతరమున ఉగ్రుని యంశమున ఉద్భవించిన ఉగ్రపాండ్యుని చక్రానిచే అతని మస్తకభేదనముగాక శిరమునసున్న కిరీట భేదనము.[2] దీనికి కారణము. దుర్వాసుని

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 31.
2. చొక్కనాథ చరిత్ర. పదునాలుగవలీల. పుటలు 86-93 వరకు.

యనుగ్రహము. ఐరావతము అడవి ఏనుగై సంచరించునపుడు కదంబాటవిలో తిరుగాడుచు 'పొత్తామర'ను సరసిలో తీర్థమాడి చొక్కనాథుని దర్శించినంతనే ఆ దేవుడు కరుణించి దానిని తన అష్ట వారణములలో నొక దానినిగజేసికొనుట. దీనికి కూడా దుర్వాసుని శాపానుగ్రహమే కారణము.

ఇట్లు తిరువేంగళకవి కథలో ఉత్కంఠను పోషించుటకు ముడులను వేయుచు వాటిని విప్పుచు అత్యంత సమర్థముగా కథను నిర్వహించినాడు.

## 2. వృత్రారి మౌళి భేదనము

వృత్రారి మౌళి భేదనము అనగా ఇంద్రుని కిరీటమును పగులగొట్టుట. ఇంద్రుని కిరీటమును ఎవరు పగులగొట్టిరి? ఎందుకు పగుల గొట్టిరి? దేనితో గొట్టిరి? తలకు హానిలేకుండ కిరీటము మాత్రమే ఏల పగిలినది? అను ప్రశ్నములు దీని యందు పుట్టుచున్నవి.

ఇంద్రుని కిరీటమును భేదించినది ఉగ్రపాండ్యుడు. దేవతలకు రాజు, వజ్రాయుధపాణి యగు ఇంద్రుని మౌళిని భేదించుటకు ఉగ్రపాండ్యుడెట్లు సమర్థుడు? ఉగ్రుని అనగా శివుని యంశమున జన్మించిన వాడు గాన సమర్థుడు. అతడు ఇంద్రుని కిరీటమును భేదించుటకు గల కారణమేమి? 'ఉగ్రపాండ్యుడు పుష్కలావర్తకాది మేఘములను బంధించినాడు గావున ఇంద్రుడు ఉగ్రునితో తలపడినాడు. ఉగ్రుడు మేఘములను బంధించుటకు కారణము ఇంద్రుడు పాండ్యరాజ్యముపై వర్షము గురిపించకపోవుట' ఈ విధముగా ఇరువురిలో ద్వేషము పెరిగి యుద్ధమునకు దారి తీసినది.

ఉగ్రుడు ఇంద్రుని కిరీటమును భేదించునపుడాతడు వజ్రాయుధమును ప్రయోగింపలేదా? ప్రయోగించినాడు కాని ఫలితము లేదు. ప్రయోగించిన చక్రాయుధము ఇంద్రుని కిరీటమును భేదించినది. కిరీటమునే ఏల భేదింపవలె? శిరమునేల భేదింపలేదు. ఐరావతశాప విమోచనమను కథలో దెలిపినట్లు దుర్వాసుని శాపాను గ్రహము వలన.

వృత్రారిమౌళిని భేదించుటకు సమర్థమైన చక్రాయుధమును ఉగ్రుడెచ్చట సంపాదించినాడు. తన తండ్రియైన సుందర పాండ్యుడొసగినాడు. సుందరపాండ్యుడు చొక్కనాథుని యవతారము. ఆయన త్రికాలవేది గావున రాబోవు విపత్తును మొదటనే గుర్తించి తన కుమారుడైన ఉగ్రపాండ్యుని పట్టాభిషేక సమయమున ఉగ్రునకు చక్రము, శక్తి, చండాయుధము లనుమూడు ఆయుధముల నిచ్చుచు, కొన్నాళ్లకు ఇంద్రుడు నీపై దండెత్తి వచ్చినప్పుడు చక్రాయుధమున్ను[2], సప్తసముద్రములుప్పొంగి వచ్చి మధురను ముంచివైచినపుడు శక్త్యాయుధమున్ను[3], కరవు కాలమున కనకరాసులదెచ్చుటకై మేరువును

---

1. చొక్కనాథ చరిత్ర. పంద్రెండవలీల. పుటలు 78-83.
2. చొక్కనాథ చరిత్ర. పదునాలుగవ లీల. పుటలు 86-93.
3. చొక్కనాథ చరిత్ర. పదుమూడవ లీల. పుటలు 83-86

గొట్టుటకు చండాయుధమున్ను ప్రయోగించుమని ఇచ్చినాడు. అది పరమేశ్వరాజ్ఞ. ఉగ్రుడు తన తండ్రియానతిని నెరవేర్చినాడు. ఇది వృత్రారిమౌళి భేదనములోని రహస్యము.

ఈ విధముగా తిరువేంగళకవి చొక్కనాథ చరిత్రములోని కథలన్నిటిని ప్రసన్నముగా దక్షతతో నడిపించినాడు.

## పాత్రములు

కావ్యమునందు మఱియొక ప్రధానాంగము పాత్రములు. వీనిలో కథానాయకుడు ముఖ్యుడు. కావున కావ్యమున నాయకుని పాత్రను రెండవ ప్రధానాంశముగా చెప్పవచ్చును. నాయకుని సుగుణములను బట్టియే కావ్యమునకు దానిని రచించిన కవికి కీర్తి కలుగునని రామరాజభూషణుడు ఈ క్రింది పద్యమున చెప్పియున్నాడు.

కం. బంధుర తర ప్రబంధుల
బంధము లకనంత కీర్తి భాగ్య ప్రదధౌ
రంధర్య గ్రంధిలము వ
సుంధర ననవద్యరమణ సుగుణస్తవముల్[2] - మఱియు

సీ. రామాయణాదిక గ్రంధములనవద్య
నేతృ వర్ణనల వన్నియకు నెక్కె
వైశేషికాది నానా శాస్త్రములు శివ
ప్రతిపాదనమున సన్ను తివహించె
సంధ్యాది మంత్రముల్ శశ్వదీశ్వర నామ
జపసాధనత ననశ్వరములయ్యెఁ
బలుకులొండింటికిఁ బ్రామిన్కులును బర
బ్రహ్మ గోచరములై ప్రణుతిగాంచె

తే. ననినఁ గావ్యం బమేయ నాయక వికస్వ
రస్వరూప నిరూపణభ్రాజియగుట
వేఱ వివరింపనేల? బంగారమునకుఁ
జటుల సౌరభ్యలహరి యబ్బుటయ కాదె.[3]

అని కావ్యమున నాయకుని ప్రాముఖ్యము నుగ్గడించినాడు.

చొక్కనాథ చరిత్రమునకు నాయకుడు పరమేశ్వరుడయిన చొక్కనాథుడు నాయిక జగన్మాతయైన అంగయకణ్ణమ్మ. చొక్కనాథ చరిత్రము నందలి యఱువది నాల్గులీలలు

1. చొక్కనాథ చరిత్ర. పదునైదవ లీల. పుటలు 93-101
2, 3. కావ్యాలంకార సంగ్రహము. అవతారిక. పద్యములు 23, 24

చొక్కనాథుడు నెఱపినవే గావున ఇందలి ప్రతిలీలలోని కథ యందును నాయకుడు చొక్కనాయకుడే. కొన్ని లీలలలో ఆరంభమునుండి అంతము వరకు కథను నడిపించుటకు ఆలంబనమైన పాత్రలు దేవతలు, మానవులు, పశుపక్ష్యాదులు కూడ కలవు. కాని వాని యందును చొక్కనాథుని యనుగ్రహమే ప్రాధాన్యము వహించినది గావున, ఈ కావ్యమున ప్రధాన కథానాయకుడు చొక్కనాథుడు. కథానాయకి ఆయన భార్యయగు అంగయకణ్ణెమ్మ. ఉప కథానాయకులుగా దేవతలను, మానవులను, పశుపక్ష్యాదులను పేర్కొనవచ్చును. ఉదాహరణకు ఇంద్రుడు, మలయధ్వజుడు, ఉగ్రుడు, దేవపాండ్యుడు, యుక్తపాండ్యుడు, కాద్వెట్టియను చోళరాజు, బాణభద్రుడు, నక్కీరుడు, అడుక్కాండడు, మాణిక్యవాచకుడు, జ్ఞాన సంబంధుడు, మూర్తి సెట్టి, ఐరావతము, భరద్వాజము, బకము మొదలైనవి. ఆయా లీలలలో చొక్కనాథుడు రక్షించినది వీరినే గావున ఆద్యంతము కథనాశ్రయించియున్న పాత్రలు ఇవే. కొన్ని లీలలలోని కథలలో నాయకులుగాక నాయికలే ప్రాధాన్యము వహించియున్నారు. వీరిలో చొన్నాయి యను వారవనిత, బాణభద్రుని భార్య, బ్రాహ్మణి, వైశ్య వనిత మొదలైన వారు. చొక్కనాథుని కృపాకటాక్షము దేవ, మానవ, పశు పక్ష్యాదులపై ప్రసరించినది కావున నివి కూడా పాత్రలుగా నుండుటకు వీలు కలిగినది.

ఇవికాక చొక్కనాథుడు భక్త సంరక్షణార్థమై స్వయముగా ధరించిన పాత్రలు కొన్ని కలవు. అవి; విలుకాడు, ఆచార్యుడు, రత్నాలసెట్టి, సిద్ధుడు, రాహుత్తుడు, గాజులసెట్టి, చలివేంద్ర జంగము, జంగముడు, కట్టెలమ్ముకొనువాడు, పండితుడు, వలవాడు, వరాహము, కవి, కూలికాడు, పసుల కాపరి. అంగయకణ్ణెమ్మ తటాతకగాను, దాశవాని కూతురుగను రూపుదాల్చినది.

## పాత్ర చిత్రణము

**చొక్కనాథుడు;** కథానాయకుడైన చొక్కనాథుడు భూతదయా పరతంత్రుడు[1]. భక్త సంరక్షణపారీణుడు జాతిభేదములేక సద్భక్తులకును ద్రాతైన మోక్షప్రదాత[2]. పిపీలికాది బ్రహ్మపర్యంతము సకల జీవుల యందు సడలక యుండువాడు.[3] బ్రహ్మను మశకముగాను మశకమును బ్రహ్మగాను జేయగల్గు సమర్థుడు.[4]

**అంగయ కణ్ణెమ్మ;** త్రైలోక్య రక్షిణి, త్రైలోక్య మాత, త్రైలోక్య పావని, త్రైలోక వంద్య, మూర్తి త్రయాకార, మూర్తి త్రయాంబ, మూర్తి త్రయత్రాణ, మూర్త్యాత్మకార్[5]. జగతి సృష్టి స్థితి సంహార కర్త్ర[6] పరమేశ్వరాజ్ఞానువర్తిని. భూత దయాపరతంత్ర.

---

1 చొక్కనాథ చరిత్ర. మూడవ లీల. పుటలు 35, 36
2. చొక్కనాథ చరిత్ర ముప్పది యొకటవ లీల. పుట 159.
3. చొక్కనాథ చరిత్ర. 45వ లీల. పుట 241.
4. చొక్కనాథ చరిత్ర 45వ లీల. పుట 242.
5 చొక్కనాథ చరిత్ర 4వ లీల పుటలు 43, 44
6 చొక్కనాథ చరిత్ర. 44వ లీల పుట 230

ఇక తక్కిన పాత్రలు చొక్కనాయకుని తమ సర్వస్వముగా నమ్ముకున్నవారు. ఆ దేవునియందు అచంచలమైన భక్తి విశ్వాసములు గలవారు. శివపూజా తత్పరులు. శివధ్యాన నిరతులు. శివసాయుజ్య, సాలోక్యములను బొందినవారు.

చొక్కనాథుడు స్వయముగ ధరించిన పాత్రలన్నియును సహజముగాను, స్వభావ సిద్ధముగను, ఉండి కనులకు కట్టినట్లుగా చిత్రీకరించబడియున్నవి. తిరువేంగళకవి పాత్రచిత్రణా నైపుణ్యము నరయుటకు ఒక్క గాజుల సెట్టి పాత్రయే చాలును. చొక్కనాథ చరిత్రము నందలి పంచమాశ్వములోని ముప్పది యొకటవ లీలలో ఈ పాత్ర ఇట్లు చిత్రీకరించి యున్నది.

" చొక్కనాయకుడు గాజుల సెట్టి యగుచుఁ
జక్కఁగా ముతుక వేషము తోడఁ జల్లి
పట్టు సూత్రపు త్రాళ్ల పైఁడుంగరములు
బెట్టు బసవనిఁ జేసి పెట్టిన ముద్ర
పట్టు వస్త్రము గూర్చి బాగుగా బిగియఁ
గట్టిన దేవుండు కంఠాన నమర
నొసలను విభూతి నునుపుగాఁ దీర్చి
యొసపరిపెండికట్లొరపు గా బెట్టి
సన్నపు రుద్రాక్ష సరములు వైచి
వన్నె మీఱగను దేవతి కట్టు గట్టి
పైమించు గజము పప్పళి పచ్చడంబు
వామాంగమున వల్లె వాటుగావైచి
నెఱి మించు తలపాగ నేర్పుగాఁజుట్టి
కరమొప్ప వ్రేళ్ల నుంగరములు వెట్టి
బుజముపై గాజుల పొది చాలఁ బెట్టి
భుజగేంద్ర భూషుండు పుర వీధులందు
గాజులు బొద్దులు కమ్మ దుద్దులును
గాజులు గొనరారో! గాజులో యనుచు
పచ్చలు బూదెలు వచ్చరఁటాకు
పచ్చలు పొన్నాకు పచ్చ గాజులును
నీలాలు మఱి తట్టు నీలాలు రంగు
నీలాలు పచ్చల నిగ్గు గాజులును
ఆవపూవన్నె రాజావర్తనములు
గోవాళ సరములు గొమ్మనంబులును
పువ్వగ గాజులు పొన్న పూచింత

పువ్వులు సంపంగిపూ చామపువ్వు
పొగడ గాజులు జెట్టి పోతు వన్నియలు
చిగురాకు తేనెలు జీనిగాజులును
గలవు మాకడ ననేకములైన వగలు
వలసిన వారికి వలసిన వన్నె
గాజులు దొడిగెదఁ గన్నె ప్రాయంపు
రాజీవ నయనలు రారో! యటంచు
మాధుర్యపుర రాజమార్గముఁ బట్టి
వీధి వీధులసెట్టి వేడ్కతో దిరుగు.[1]

**రసము :**

కావ్యమునందలి మూడవ ప్రధానాంగము రసము. దీనిని మొట్టమొదట ప్రతిపాదించిన ఆలంకారికుడు భరతుడు. ఈయన తన నాట్య శాస్త్రమున 'ఇతివృత్తంతు నాట్యస్య శరీరం పరికీర్తితమ్" అని చెప్పి "నహి రసాదృతే కశ్చి దప్యర్థః ప్రవర్తతే" (రస హీనమై ఏ యర్థమును ప్రవర్తింపదు) అని రసము యొక్క ప్రాధాన్యమును తెలిపియున్నాడు.

భరతుని తరువాత ఈ రస సిద్ధాంతమును పునరుద్ధరించిన వాడు ధ్వన్యాలోక కర్తయగు ఆనందవర్ధనుడు. ధ్వన్యాలోకమునకు లోచనమును వ్రాయుచు అభినవ గుప్తుడు 'రసమే కావ్యమున కాత్మ ఇతరము కాదు' అని తెలిపియున్నాడు. " రసేనైవ సర్వం జీవతి కావ్యమ్ నహి రస శూన్యం కించిదస్తి, రస ఏవ వస్తుతః ఆత్మా, వస్త్వలంకారధ్వనీతు సర్వథా రసం ప్రతి పర్యవస్యేతే" రసము చేతనే కావ్యము సర్వము జీవించును, రసశూన్యమగు కావ్యముండదు, నిజమునకు రసమే కావ్యమున కాత్మ, వస్త్వలంకార ధ్వనులు సర్వథా రస పర్యవసాయులే అగునని ఈతడు రస ప్రాధాన్యమునుగ్గడించి యున్నాడు[2].

"విభావానుభావవ్యభిచారి సంయోగా ద్రసనిష్పత్తిః" అనగా విభావములయు, అనుభావములయు, వ్యభిచారి భావములయు సంయోగమున రసము నిష్పన్నమగునని భరతుడు తన నాట్య శాస్త్రమున సూత్రీకరించగా "విభావైరనుభావైశ్చ సాత్త్వికైర్వ్యభిచారిభిః ఆ నీయమానస్వాదుత్వం స్థాయీభావోరసః స్మృతః" అని దశరూపక కారుడు వివరించి చెప్పినాడు. అనగా విభావముల చేతను, అనుభావములచేతను, సాత్త్వికభావములచేతను, వ్యభిచారి భావములచేతను స్వాదువుగా చేయబడిన స్థాయి భావమే రసమనబడును[3].

రసములెన్నియను విషయమున ఆలంకారికులలో ఏకాభిప్రాయము లేదు. భరతుడు నాట్య శాస్త్రమున ఎనమిది రసములను వాని స్థాయి భావములను ఇట్లు నిరూపించెను.

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 161, 162 లు.
2. సాహిత్య దర్పనము. పుట. 76
3. సాహిత్య దర్పనము, పుట. 118

" శృంగార హాస్య కరుణ రౌద్ర వీర భయానకాః
భీభత్సాద్భుత సంజ్ఞౌచేత్యష్టౌ నాట్యే రసాః స్మృతాః
రతిర్హా సశ్చ శోకశ్చ క్రోధోత్సాహౌ భయంతథా
జుగుప్సా విస్మయశ్చేతి స్థాయీ భావాః ప్రకీర్తితాః (నాట్య శాస్త్రము)

(శృంగార, హాస్య, కరుణ, రౌద్ర, వీర, భయానక, భీభత్స, అద్భుత, అను ఎనిమిది రసములను వరుసగా రతి, హాసము, శోకము, క్రోధము, ఉత్సాహము, భయము, జుగుప్స, విస్మయము అను నెనిమిది స్థాయి భావములు)[1]. ఇందు శాంతరసము పేర్కొనబడలేదు. శాంత రసమును నిర్ధారించినవాడు ఉద్భటుడు. ఇతడు శమమును శాంత రసమునకు స్థాయి భావముగా పేర్కొనినాడు.

'శృంగార హాస్య కరుణ రౌద్ర వీర భయానకాః
భీభత్సాద్భుత శాంతాశ్చ నవ నాట్యే రసాః స్మృతాః
రతిర్హా సశ్చ శోకశ్చ క్రోధోత్సాహౌ భయం తథా
జగుప్సా విస్మయ శమాః స్థాయి భావాః ప్రకీర్తితాః [2]

పై తొమ్మిది రసములే కాక వత్సలరసము, ప్రేయోరసము, భక్తి రసములు కూడా కలవు. ఇందు భక్తిని రసము కాదు భావమను వారు కూడా కలరు. కాని సాహిత్యకారులలో ఉజ్జ్వల నీలమణి కర్త యగు రూపగోస్వామి, భక్తి రసాయన గ్రంథ కర్తయగు మధుసూదన సరస్వతి భక్తిని రసముగా చెప్పియున్నారు. భగవద్రతియే భక్తి రసమునకు స్థాయి భావమని మధుసూదన సరస్వతి తెలిపినారు.

చొక్కనాథ చరిత్రము స్థూలదృష్టికి భక్తి కావ్యముగా కనిపించినను ఈ కావ్యము చొక్కనాథ శివుని యొక్క లీలలను వర్ణించినది గావునను, ఇందలి ప్రతి లీల పాఠకునకు ఆశ్చర్యము గొలుపుచున్నది గావునను, ఈ కావ్యము అద్భుత రస ప్రధాన కావ్యమని చెప్పవచ్చును.

చొక్కనాథ చరిత్రమున అగస్త్యుడు వామ దేవాది మహర్షులకు చొక్కనాథుని యొక్క అఱువది నాల్గు లీలలను సంక్షిప్తముగా తెలియ పఱచి మరల నొక్కొక్క లీలను విశదముగా చెప్పబోవు సందర్భమున తిరువేంగళ కవి రచించిన

" ఆ కుంభ సంభవుఁ డా మహాఋషులఁ
జే కొని వేర్వేఱ శ్రీ చొక్కనాథు
చరితంబు మిగుల నాశ్చర్యంబుగాగ
విరచింపఁ దొడఁ గెను వేడ్కలింపెసగ[3]" అను పంక్తులలో ఈ కావ్యమును ఆశ్చర్యము స్థాయి భావముగా గల అద్భుత రస ప్రధానముగా రచింపబోవుచున్నానని చెప్పికొని నాడు.

---

1. కావ్యాలంకార సంగ్రహము. పుట 291.
2. కావ్యాలంకార సంగ్రహము. పుట 292.
3. చొక్కనాథ చరిత్ర. పుట 17.

కావ్యాంతమున అగస్త్యుని వలన అఱువది నాలుగు లీలలను వినిన ఋషులు
"........................................
మునినాథ! మీ వల్ల ముక్తుల మైతి
మని సంభ్రమమ్ముతో నానందమంది
తనువుల బులకాంకి తంబులు వొడమ
హర్షా శ్రుపూరమ్ముల క్షియుగ్మముల
వర్ష ధారల మాడ్కి వడి మించి దొరగ
గద్గద కంఠులై కఱకంఠునభవు'
సద్గుణ చిత్తాంబుజాత షట్పదుని
నాత్మనిల్పుచుఁ దన్మయావస్థులగుచు
నాత్మానురక్తులైఁ యా మహాదేవు
చరితమ్మునకు మహాశ్చర్యమ్మునంది [1]" అను పంక్తులలో ఆశ్చర్యానుభూతిని పొందినారని తెలిపినాడు. విస్మయము అద్భుతమునకు స్థాయి భావము కావున ఈ కావ్యము అద్భుత రసప్రధానమైనది.

అయితే ఈ కావ్యమునందలి అఱువది నాలుగు లీలలన్నిటిలోను అద్భుత రసమొక్కటే లేదు. తక్కిన రసములు కూడనున్నవి. కొన్ని లీలలు కేవల అద్భుత రసాత్మకములు కాగా మఱికొన్నిటిలో ప్రధాన రసమైన అద్భుతమునకు తోడుగా వీరము,శృంగారము, కరుణము, శాంతము, భక్తి రసములను కూడా తిరువేంగళకవి చక్కగా పోషించినాడు. కాబట్టి ఈ కావ్యమున అద్భుతము అంగిరసము కాగా తక్కిన రసములలో నేదో యొకటో రెండో అంగరసములుగా నున్నవి.

## అద్భుత రసము

ఈ రసమును స్థాపించిన వాడు నారాయణుడు. ఇతడు సాహిత్య దర్పణకర్తయగు విశ్వనాథునికి పూర్వుడు అతని సిద్ధాంతమిది;

"సత్త్వగుణాధిక్యము వలన మనకు బాహ్య ప్రపంచమును మఱపించునొక యానందము కలుగును. అది బ్రహ్మానంద సదృశము. దీనికి లోకోత్తర చమత్కారమే ప్రాణము. చమత్కారమనగా మనస్సు విస్తరించుటయే. మనో విస్తారమనగా విస్మయమేకదా! కావున విస్మయమెల్ల రసములకును మూల కారణము. కాబట్టి యద్భుత రసముననే మిగిలిన రసములన్నియును నిమిడియున్నవి"[2].

అద్భుత రసమునకు స్థాయి భావము విస్మయము. గంధర్వుడు దైవతము వర్ణము పసుపు. లోకాతీతమగు వస్తువు అలంబనము గుణముల మహత్త్వము ఉద్దీపనము, స్తంభము, రోమాంచము, గద్గద స్వరము, సంభ్రమము, నేత్ర వికాసము

1. చొక్కనాథ చరిత్ర పుటలు 363, 364.
2 కావ్యాలంకార సంగ్రహము పుట. 311, 312లు

మున్నగునవి అనుభావములు. వితర్కము, ఆవేగము, సంభ్రాంతి, హర్షము మొదలగునవి వ్యభిచారులు[1].

భరతుడు శృంగారము, రౌద్రము, వీరము, భీభత్సము అను నాలుగు రసములనే ప్రధాన రసములుగా పేర్కొని శృంగారము నుండి హాస్యము, రౌద్రము నుండి కరుణము, వీరము నుండి అద్భుతము, భీభత్సము నుండి భయానకము జనించునని చెప్పినాడు.

"తేషాముత్పత్తి హేతవశ్చత్వారోరసాః తద్యథా శృంగారో, రౌద్రో, వీరో, భీభత్స ఇతి, అత్ర - శృంగారాద్ధి భవేద్ధాస్యో రౌద్రాచ్చకరుణో రసః వీరాచ్చై వాద్భుతోత్పత్తి ర్బీభత్సాచ్చ భయానకః"

మరియు శృంగారానుకృతియే హాస్యము, రౌద్ర కర్మము నుండియే కరుణము జనించును. వీర రసము యొక్క కర్మమే అద్భుతమన బడును. భీభత్స దర్శనమెందుకలదో అందే భయానకము అని కూడా తెలిపియున్నాడు.

" శృంగారానుకృతిర్యస్తు సహాస్యస్తు ప్రకీర్తితః
రౌద్ర స్యైవచ యత్కర్మ సజ్ఞేయః కరుణో రసః
వీర స్యాపిచ యత్కర్మ సోఽద్భుతః పరికీర్తితః
భీభత్స దర్శనం యత్ర జ్ఞేయః సతు భయానకః"[2] (నాట్య, శా, 6 అధ్యా)

"వీరస్యైవచయత్కర్మ సోద్భుతః పరికీర్తితః" అను భరతుని వాక్యానుసారము వీర, అద్భుతములు రెండును అవినాభావ సంబంధముతో నుండునని తెలియుచున్నది.

"అద్భుతము శృంగార, వీరములతో సంకరముగానే యుండును. శృంగార, వీర, శాంత నాయకులు స్వార్థమును త్యజించి ధర్మ తత్పరత్వమున వర్తించు చోట్ల నద్భుత రసము కనబడుచునే యుండును."[3] కావున అద్భుత రసమునకు తోడుగా శృంగారము వీరము ఇత్యాది రసములుండునని విశదమగుచున్నది.

## రస పోషణము

చొక్కనాథ చరిత్రము నందలి 5, 7, 8, 9, 10, 12, 17, 19, 20, 29, 30, 32, 40, 41, 48, 50, 57, 58, 63, - ఈపందొమ్మిది లీలలు అద్భుత రసాత్మకములు. అద్భుతము వీర రసముతో కలిసియున్న లీలలు 1, 4, 6, 13, 14, 15, 18, 21, 27, 28, 34, 36, 49, 60, 61, 62 - అను ఈపదునారు శృంగారము అంగరసముగా నున్న లీలలు 11,31,35 - మూడు.

శృంగార వీర రసములే కాక కరుణము, రౌద్రము, శాంతము, భక్తి రసములు అంగరసములుగా కొన్ని లీలలు గలవు.

---

1. సాహిత్య దర్పనము. పుట. 245
2. సాహిత్య దర్పనము. పుట 301.
3. కావ్యాలంకార సంగ్రహము. పుట 318.

2వ లీలలో అద్భుతమునకంగములుగా కరుణ, రౌద్రములు కలవు. 44వ లీలలో శృంగారము, రౌద్రము, వీరము - అను మూడు అంగరసములుగానున్నవి.

కరుణము అంగరసముగాగలలీలలు; 3, 22,24, 25, 38, 45, 46,53, 54, 59, - పది యున్నవి.

16వ లీలలో శాంతము అంగరసము. భక్తి అంగరసముగా గల లీలలు; 23, 33, 54, - మూడు. 26, 51, 52 అను మూడు లీలలలో వీరము మరియు కరుణము అంగరసములుగానున్నవి.

37, 43, 47, 55, 64, - ఈ ఐదు లీలలలో భక్తి కరుణములు అంగరసములు. 39, 42 - ఈ రెండు లీలలు భక్తి, వీరములు అంగరసములుగా గల లీలలు.

## అద్భుతరస పోషణము

అద్భుతమునకు స్థాయి భావము విస్మయము. విస్మయమనగా "అపూర్వవస్తు దర్శనాచ్చిత్త విస్తారో విస్మయోమతః" అని ప్రతాపరుద్రీయము[1] విస్మయనగా అపూర్వములగు వస్తువుల దర్శనమువలన గలుగు చిత్త విస్తారము. రసగంగాధరమున "అలౌకిక వస్తు దర్శనాది జన్మా ఆశ్చర్యాఖ్యోవిస్మయః[2]" అలౌకికమగు వస్తువులను జూచుటవలనబుట్టిన ఆశ్చర్యమను చిత్తవృత్తి విశేషము విస్మయము. అని చెప్పబడినది.

చొక్కనాథ చరిత్రము నందలి ఇరువది రెండవలీలలో తన భక్తురాలైన విప్రవనిత భక్తిని పరీక్షింపదలచి చొక్కనాథుడు వృద్ధ, యౌవన, బాల్యవేషములతో నలరించి వృషభవాహనుడై ప్రత్యక్షమైన చోద్యమును తిరువేంగళకవి అద్భుత రసాత్మకముగా ఇట్లు వర్ణించినాడు.

"ఆ చంద్రముఖి భక్తి యరయంగవలసి
శ్రీ చొక్కనాథుండు శివభక్తు (డగుచు
భూతియు రుద్రాక్షములు ధరియించి
యాతత వృద్ధ బ్రాహ్మణరూపమునను
నాయింటి ముష్టి తానడిగిన యబల
మాయత్త సర్వసంపద లింటిలోనఁ
బెట్టి తలుపులు మూసి బీగముద్రలును
బెట్టి పోయెను ముష్టిపెట్టరాదనిన
నా వృద్ధుడిట్లనె నతివ యాతలుపు
నావాకిలటనీవు నంటినఁదెఱచు
వెసపాయసమునట్లు వేడివంటకము

1. కావ్యాలంకార సంగ్రహము పుట 327 నుండి ఉద్ధరింపబడినది.
2 కావ్యాలంకార సంగ్రహము పుట 328 నుండి ఉద్ధరింపబడినది.

పెసరుపప్పును నెయ్యిపెట్టు మాకనిన
నాశోభనాంగిచయ్యనముట్టినంత
మూసిన తలుపు గొబ్బున జారఁదెఱచె
నలివేణి వెరగంది యాయింటిలోన
వలయు పదార్థముల్ పదిగొంచువచ్చె
మున్నున్నయట్లనె ముద్రికల్ చెదక
పన్నుగా వాకిళ్లు పదిలమైయుండె.
నంత నాయింతి యత్యాశ్చర్యమంది
సంతోషమును బొంది చయ్యననపుడు
దండిగా నాల్గు విధంబులు మెఱయ
వండుచుండెడువేళ వామాక్షికెదుర
ముదుకడైయున్న యా ముగ్ధేందు ధరుఁడు
పదియును నాఱేండ్ల ప్రాయమై నిలిచె
నంత నాయౌవన ప్రాయ విప్రకుని
సంతోషమున జూచు సమయమ్ము నందు
మగఁడును నత్తయు మామ వచ్చినను
మగువ నివ్వెరగంది మ్రాన్పడియుండె
నా వేళ యౌవన ప్రాయము విడిచి
కావుకావు మటంచుఁగడువేగచిన్న
బాలుఁడై నేలపైఁబడుచు నవ్వుచును
గాలివ్రేలటనోట గఱచుచునున్నఁ
జూచి యాయత్త నిష్ఠూరమ్ముతోడ
నీ చిన్న శిశువు నిందేటికివచ్చె
నని కోడలిని చెక్కిలడిచిపోఁ ద్రోసి
కినిసియర్భకుని వాకిట నెత్తివైచె
నప్పుడు ప్రత్యక్షమై నిల్చె శివుడు.[1]

## వీరరసపోషణము :

వీరమునకు స్థాయిభావము ఉత్సాహము. ఉత్సాహమనగా 'లోకోత్తర కార్యముల సాధింపజేయు గట్టి ప్రయత్నము. లోకోత్తర కార్యములన నిట దానధర్మదయాయుద్ధాదులు.[2] ఇందు నాయకుడు ఉత్తముడు. మహేంద్రుడు దేవత. బంగారు వర్ణము. ప్రతి నాయకుడు ఆలంబన విభావము. వానియుత్కర్ష ఉద్దీపన విభావము. చాతుర్యము,

---

1. చొక్కనాథ చరిత్ర. పుటలు 125, 126.
2. కావ్యాలంకార సంగ్రహము పుట 324.

అమంత్రణము (మిత్రాదులతో ఆలోచించుట) స్థైర్యము, ప్రసాదము (అలజడి చెందకుండుట) మున్నగునవి అనుభావములు. క్రోధము, అభిమానము, హాసము, మొదలగునవి వ్యభిచారులు (ధృతిమతి గర్వస్మృతి తర్కరోమాంచాదులు సంచారులని సాహిత్యదర్పణము). ఈ వీరమున రౌద్రస్థాయియగు క్రోధమును, హాస్యరసస్థాయియగు హాసమును సంచారి భావములగును.[1]

చొక్కనాథ చరిత్రమున ముప్పది తొమ్మిదవలీలలో పాండ్య, చోళ రాజులకు జరిగిన యుద్ధమును వీర రసాత్మకముగా తిరువేంగళ కవి వర్ణించినాడు. ఆ వర్ణనమిది;

"......................ఆ పాండ్యవిభుడు
సమరసన్నద్ధుడై సంభ్రమంబునను
నమిత బలారూఢుడైయెదుర్కొనియె
నుగ్రుడై యపుడవార్యోదగ్రుడగుచు
నుగ్రాక్షుభక్తుఁ డత్యుగ్రాహవమునఁ
జేర్కొనె నాచోడపృథివీశ్వరుండు
మార్కొనెఁదానును మఱిపాండ్యుతోడ
నచటను మూఁ కలుననువుగాఁ జేర్చి
ప్రచురమ్ముగానేర్చి పటుశక్తినేయ
నిందందు బాణమ్ము లెదురెదురేగు
చందాన నాటించు సంధానవరులు
నాటోపమెసగంగనవలీలఁబొడిచి
పోటుగంటులదూరిపోవు బంటులును
రౌతు వల్లమ్ముగుఱ్ఱమ్మును నొక్క
పై తెగఁగడు వ్రేసి యార్చురాహుతులు
నంకించిగజముల నంటించి మెడలఁ
గొంకులు దగిలించుకొనుమావటీలు
రథములు గదిసి సారథుల దున్మాడి
రథముల కుఱికెడు రథిక సంఘములు
నైపోరు ఘోరమై యా యిరువాగు
నేపారఁ జూపఱ కెక్కుడైసాగె
నంత నాపాండీడు నాచొక్కనాథు
నెంతయు మదినిల్పి యేపుదీపింప
యార్చియాచోడని యవలీల గెల్చి
కూర్చునాతని సైన్య కోటి మాయించి

1. సాహిత్య దర్పనము. పుట 234, 235లు.

రాజింప రాక్షసవ్రాతమ్ములకును
శోణిత మాంసముల్ చొక్కింపజేసి
జయలక్ష్మి చేకొని సంతోషమెసగ్న[1]"

ముప్పది యాఱవలీలలో పాండ్యచోళరాజుల మధ్య జరిగిన యుద్ధమున తనభక్తుడైన పాండ్యరాజుకు సహాయముగ చొక్కనాథుడు విలుకాడైవచ్చి చోళ రాజుతో యుద్ధము జరిపి అతనిని సేనలతో గూడ యగడ్తలో ముంచిన ఘట్టమున తిరువేంగళకవి వీర అద్భుత రసములను మేళవించి ఈ క్రింది విధముగా వర్ణించినాడు. చోళపాండ్య సేనలు ద్వంద్వ యుద్ధము సేయు చోట........

"వ్రాలెను బంధురధ్వజ ఖండ సమితి
కూలె రాహుతులతో ఘోటకమ్ములును
రాలెను భటరాజిరాజమస్తకము
లోలిగా వ్రయ్యలై యురుమౌక్తికములు
తూలెను భటుల సందేహముల్ గాలు
కాలును బెణచుక కాలుని పురికి
సోలె రాజశ్రేణి సొరిది భూతముల
జాలంబులాడె మాంసమ్ములు మెసఁగి
యీరీతి ధీరత్వమేపుదీపింపఁ
బోరుచునాచోడ భూ మీశుసేన
యాహవమ్మునవేడె" - అంత ఆ చోళ రాజు సాహసముతో సన్నద్ధుడగుచు, నా బిరుదెవ్వరెఱుగరా? యనుచు తన యశ్వమును పాండ్యసేనలపైకి లంఘింపజేసెను. అప్పుడు పాండ్యరాజు చొక్కనాథుని ఆత్మలో సంస్తుతించగా చొక్కనాథుడు రాహుత్తుడై వచ్చి చోళరాజుతో తలపడుచు.

వేగురు రాహుత్తవితతినెక్కడను
వేగంబగెలుతు నా వెలయు నీ బిరుదు.
పేర్కొని నీ వంటి బిరుదు రాహుతుల
మార్కొని వేవురమఱిగెల్చు బిరుదు
నాకును గలది దేనను జూడుమనుచు
భీకరాకృతితోడఁబేర్చియా రౌతు
నాటోపమెసగగా నద్భుతంబుగను
గాటమై తగ నిరాఘాటమ్ము గాఁగ
మ్రోలనున్నట్టి యామూకల గొట్టి
చాలంగఁబైగిట్టి సమయంగఁ గొట్టి

1. చొక్కనాథ చరిత్ర. పుట 197, 198లు.

మేటియై చోడని మీద నాహయము
దాఁటించి వేలాయుధమ్ము చేపట్టి
వ్రేసిన నాశక్తి వేగమై తాఁకి
రాశిగా రక్తపూరమ్ములుగాఱె
గాఱినవెఱగంది గాయమ్ముచెంది
మీఱికోపాగ్నిచే మృడునకిట్లనియెఁ
బోరిలో నెదురంగ బోలరునన్ను
శూరు లెంద్దైనను శూరత్వమునను
నీరీతిననుఁ జూడుయెందుబోయెదవు
చేరి గుజ్జము నిన్ను జేర్చి గుదియంగఁ
బట్టుగాఁబట్టి యిప్పట్టుననాదు
పట్టుకు గొంపోదు పటురయమ్మునను
ననుచును చోడండునతిభీకరోగ్ర
మున వాజియున్న తంబుగఁజేర్చియెక్కి
ధేయని సాహ సోద్రేకమ్ము తోడఁ
గాయజాంతకు మీఁదఁగదలించియెక్కె
నెక్కిన నా స్వామి యెదురంగలేక
పక్కునఁగడు వీఁగి పాఱినయట్లు
హాలాస్యోప్లరము చాయకు వాజినెక్కి
యాలమ్ములో బాసియట వేగఁబోయె
బోయిననాచోళ భూపాలు డంత *
హాయని పెడబొబ్బలార్పులు సెలఁగ
నదెపాఱె పాండీడు నదెపాఱెపట్టు
డదెపాఱె నంచును నతి తీవ్రముగను
దనమంది గుజ్జముల్ దానునుగదలి
వెనుకొని దగ్గఱి వెస నేగునంత
తగమించి పశ్చిమ ద్వారంబునందు
నగడిత్త దాటించి యరిగె నా స్వామి
కూడఁ జోడడు తన గుజ్జమ్ము వేగ
నాడ నేదాటింతు ననుచుజంకించి
కడపంగలేక నగడిత నెన్నడుమఁ
బడియందు నడఁగె నా ప్రజతోడఁ గూడ

---

* ఈ చరణము డి1051 కాగితపు ప్రతిలోనిది. ముద్రితమున లేదు.

నంతనదృశ్యమ్మునయ్యె నాదేవు
డెంతయుఁదన గుడి కెలమి నచ్చేసె."[1]

## శృంగార రస పోషణము:

శృంగార మునకు రతి స్థాయిభావము. సంభోగవిషయకమగు నిచ్ఛావిశేషమే రతి అనియు, యువతీయువకుల యన్యోన్య విషయకమగు నిచ్ఛయే రతి అనియును రతి లక్షణము కానబడుచున్నది. కాని రసగంగాధరకారుడు "తత్రస్త్రీ పుంసయోరన్యోన్యాలంబనః ప్రేమాఖ్యశ్చిత్త వృత్తి విశేషోరతిః స్థాయిభావః "(స్త్రీ పురుషుల యొక్క యన్యోన్యాలంబనముగల ప్రేమయను చిత్తవృత్తి విశేషమైన రతి స్థాయి భావము) అని వచించెను. ఇట 'సంభోగేచ్ఛ' యనక ప్రేమ రూపమగు చిత్తవృత్తి విశేషమే రతియని నిర్వచింపబడినది.[2] ఇది శ్యామవర్ణము. దీనిదైవతము విష్ణువు.[3]

ముప్పది యొకటవ లీలలో చొక్కనాథుడు దారుకావనము నందలి ముని పత్నుల పాతివ్రత్యమును పరీక్షించుటకై సమ్మోహనాకార రూపముతో జంగమ వేషమున వచ్చి

"భిక్షయటంచును ప్రేమతో లోక
రక్షణుండటను సంభ్రమలీలనడిగె
భిక్షాంప్రదత్తమేపీన చక్రాంగ
వక్షోజయుగళ యౌవనలార! భిక్ష
దారుకావనవాసతాపసోల్లాస
తారుణ్య విభవసుందరులార! భిక్ష
..............................
..............................
యని యివ్విధంబున నా జంగమయ్య
ముని పల్లెలో భిక్షమును కొని వేఁడ
నప్పుడు ముని పత్నులతిసంభ్రమమున
గొప్పులు వీడంగఁ గుచము లల్లాడ
భిక్షమ్ము వెసఁదెచ్చి పెట్టవచ్చినను
గక్షయుగ్మము జూడఁ గప్పెర చెయ్యి
పాడవెత్తి భిక్షమప్పుడు పెట్టు వేళఁ
గరమూల రుచులు శృంగారహస్తములు
కళకంఠుఁడటఁ జూచి కడకంట నగిన
నతని సౌందర్యమొయ్యారమ్ముఁ జూచి

1. చొక్కనాథ చరిత్ర. పుటలు 185, 186, 187.
2. కావ్యాలంకార సంగ్రహము. పుట 320.
3. సాహిత్య దర్పణము. పుట 228.

మతి విభ్రమించి యేమఱియున్నవారు
భిక్షమ్ము దెచ్చియుఁ బెట్టంగ మఱచి
యక్షీణ మోహితలై యున్నవారు
మఱికొందరతిపలమ్మాయల తపసి
మరుల చూపుల మేను మఱచిన వారు
పయ్యెద జాఱిన భ్రమసిపాలిండ్లు
ముయ్యగాలేక మోములు జూచువారు
పెట్టియు మఱచియుఁ బెట్టలేదనుచుఁ
జట్టువమ్ములను భిక్షముదెచ్చువారు
నైరి యా ముని పత్నులందరు నపుడు
నీ రీతి మునుకొని యిందు శేఖరుడు
వాడల వాడల వరుసతోడుతను
వేఁడుకతో భిక్షవేఁడి యాసతుల
మదిలోననెంతయు మరులు పుట్టించి
మదనారి యచటను మాయమైచనియె
నంత నా ముని పత్నులందఱువిరహ
సంతాపములఁ జిక్కి జాడలు దక్కి
మతి విచారమునించి మానముల్డించి
పతుల సేవలు మాని భ్రమములు బూని
కరములు డస్సియాకరములు గ్రుస్సి
కరముల గాజు లొక్కట నూడిపడియె [1]"

ఈ విధముగా వారు సర్వేశుమీద మోహమున జిక్కి యుండుటఁ జూచి వారి భర్తలు వారిని శపింప మధురలో వైశ్యులిండ్ల జన్మించిరి. అపుడు చొక్కనాథుడు గాజులసెట్టియై వచ్చి వీధివీధిని దిరుగుచు గాజులమ్ముచుండగా–

"అప్పుడు వైశ్య కన్యాంగనామణులు
నొప్పుల కుప్పలు నుడు రాజముఖులు
తలవాకిటికిని నందఱువేగవచ్చి
కల కంఠకోమల కంఠస్వనములఁ
గావరంబెసఁగనో గాజుల సెట్టి
రావేయటంచును రమణతోఁబిలిచి
గాజులెన్నేసి? రూకకుఁ జెప్పు మంచి
గాజులు దొడుగు నీ కలలెక్కలిత్తు

1. చొక్కనాథ చరిత్ర. పుటలు 159, 160.

మనినను నాసెట్టి యపుడు నొయ్యార
మునను గంబళివైచి బుజమునఁబొదియుఁ
గంబళిపైఁ బెట్టి కరముల భూష
ణంబులన్నియు నూడ్చి నవ్యమోహినుల
చేనెటికలు దీసి చేతులు పిసికి
యైన గాజులు జేర్చి యటజోడు గూర్చి
పడుచులకెల్లను భావముల్ కలఁగఁ
దొడిగెను వారి చేతులు నొక్కినొక్కి
యప్పుడా బాలలొయ్యారంబుతోడ
నప్పురాంతకునకు నాశపుట్టింప
కక్షయుగ్మంబుల కాంతులు బెరసి
వక్షోజముల మీద వయ్యాళిఁగదల
నిటల భాగమ్మున నెరసి తూలాడఁ
గుటిల కుంతలములు గోళ్లదువ్వుచును
ముదిరిన కట్టాణిముత్యాల సరులు
కొదమ గుబ్బలను పైకొని వ్రేలుచుండ
మొలక చన్నుల మీద మోహనరుచులు
జిలుఁగు పయ్యెదలోనఁ జిక్కక వెడల
మాటల తేటలు మరులు చూపులును
ఓటి గాజులు వెట్టి యోసెట్టియనుచు
మంచి గాజులు గావు మఱివేరెతొడుగు
మంచు సెట్టితో మేల మాడెదు వారు
ముది సెట్టి యీ గాజు ముంజెయ్యిదాటు
వదులు నీ గాజులు వద్దనువారు
తట్టు నీలములొక్కతరముగానేరి
మట్టుచూచుచు దొడుగు మాయనువారు
గోవాళములు మాకు గుత్తముల్ గావు
ఆవపూవగ యేరుమని యెడువారు
చిగురాకు కెంపులు చే బిగువనుచు
పగులఁగొట్టెదని పైబడ వేయువారు
పగిలిన గాజులపైఁ డీయిచ్చెదము
జగడమేలని సరసములాడువారు
నేఁడు చేతను లేదు నీ గాజులకును
బైఁడి రేపిచ్చెద పదమను వారు

నోసెట్టిమా యింట నొకపూటనైన
భోసేసి నేడుండి పొమ్మనువారు
నీచేత గాజులు నెక్కుడో యనుచుఁ
జూచి కొమ్మని చేయిఁజూపెడివారు
వెలయెల్ల నిస్తిదీవెన గాజుమాకుఁ
గలదు పెట్టుమటంచు, కైపెట్టువారు
చొక్కనాయకుడు గాజులసెట్టియైన
మ్రొక్కుగా జిడక పోమోయనువారు
నతని మాయల జిక్కి యాయింతులెల్ల
ధృతితోడ బోలేక తిరిగి తిరిగియు
గాజుల నిడుమంచు కాంక్షలు ప్పొంగ
నేజతోబోలేక యున్న యత్తఱిని

ఆ యూరి వైశ్యులు మాయగాజులసెట్టి యెపడో వచ్చినాడని యాతని వివరములడుగగాఁ

...................... నాపేరు
చొక్కసెట్టని చెప్పుచును వారుజూడ
నక్కజమ్ముగమాయమయ్యె నావేళ
నంతనాబాలల హరుడుఁ జేపట్టి
నంత సద్యోగర్భమైనను.........."[1] అని తిరువేంగళకవి శృంగారాద్భుత రసములను మేళవించి రమణీయముగా రచించినాడు.

**వర్ణనలు :**

"కవిర్మనీషీ పరిభూః స్వయంభూః" అని కవిశబ్దము పరమాత్మ పరముగా ఈశావాస్యోపనిషత్తునందు కనిపించుచున్నది.

కవి=సర్వజ్ఞః, మనీషీ= సర్వేషాం జీవానాం మనోవృత్తీనాం వేత్తా,

పరిభూః=యోదుష్టాన్‌పాపినః, పరిభవతి తిరస్కరోతిసః,

స్వయంభూః = అనాదిస్వరూపోయస్య సంయోగేనోత్పత్తిర్ వియోగేన వినాశోమాతాపితరౌ గర్భవాసోజన్మవృద్ధిక్షయౌచన విద్యంతే- అని ఈ వాక్యమునకర్థము[2]. దీనినిబట్టి సర్వజ్ఞుడు, జీవుల మనోవృత్తులనెఱుగువాడు, దుష్టులను పరిభవించువాడు, అనాది స్వరూపుడు, సంయోగవియోగాదులచే నేర్పడి నశించనివాడు, మాతాపితరులు, గర్భవాసము, జన్మవృద్ధి క్షయములు లేనివాడైన పరమేశ్వరుని పరముగా వాడబడినట్టి 'కవి' శబ్దము క్రమముగా పరమాత్మ సాక్షాత్కారమును బొందిన 'ఋషి' పరముగా వ్యవహారమునకు వచ్చినది. సాక్షాద్ద్రష్టలైన వైదిక ఋషులు కవులు. వారి కావ్యము లుపనిషత్తులు. ఆద్యులగు వైదిక

1 చొక్కనాథ చరిత్ర. పుటలు 162, 163, 164.

2. ఈశావాస్యోపనిషత్తు 8వ మంత్రము. వ్యాఖ్యాత : శ్రీ దయానంద సరస్వతిగారు.

కవులు లౌకికులగు వాల్మీకి వ్యాసాదులు ఋషులగుటచేత, వారు దివ్యదృష్టితో లోకరహస్యమెఱిగినవారగుటచేత, వారి కావ్యములు లోకోత్తరవర్ణనాత్మకము లగుటచేత, 'నానృషిఃకురుతే కావ్యం' 'కవయఃక్రాంతదర్శినః' అను లోకోక్తులు కలిగినవి.

కాని కేవలము ఋషి కావ్యమును రచింప జాలడని హేమ చంద్రుడు భట్టతౌతుని ఈ క్రింది శ్లోకములను సంగ్రహించి చెప్పెను.

"నానృషిః కవిరిత్యుక్త మృషిశ్చ కిల దర్శనాత్
విచిత్ర భావ ధర్మాంశ తత్త్వ ప్రఖ్యాచ దర్శనం
సతత్త్వ దర్శనాదేవ శాస్త్రేషు పఠితః కవిః
దర్శనాద్వర్ణనాచ్చాథరూఢాలో కే కవిశ్రుతిః
తథాహి దర్శనే స్వచ్ఛే నిత్యేప్యాదికవేర్మునేః
నోదితా కవితాలోకే యావజ్జాతాన వర్ణనా"

ఋషిగాని వాడు కవి కాడని చెప్పుదురు. ఋషి యనగా ద్రష్ట. దర్శనమన విచిత్రమైన వస్తువుల యొక్క ధర్మాంశముల తత్త్వమునెఱుంగుట. అట్టి తత్త్వ దర్శనము కలిగిన వానినే శాస్త్రములు కవియని పేర్కొనుచున్నవి. కాన లోకమున దర్శనము వర్ణనములను నీ రెంటి వలనను కవియని ప్రసిద్ధి వహించును.[1]

ఈ యభిప్రాయమునే భామహుండిట్లు తెలిపెను.

"ప్రజ్ఞానవనవోన్మేష శాలినీ ప్రతిభామతా
తదనుప్రాణ నాజ్జీవేద్వర్ణనా నిపుణఃకవిః"

నవనవోన్మేష శాలినియగు ప్రజ్ఞ ప్రతిభ యనఁబడును. దాని కాశ్రితుడై వర్ణనము సేయువాడు కవి.

ఆనందవర్ధనుడు కవిని గూర్చి

"అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతిః
యథాస్మైరోచతే విశ్వం తథేదం పరివర్తతే
శృంగారీ చేత్కవిః కావ్యేజాతం రసమయంజగత్
సఏవ వీతరాగశ్చేత్ నీరసం జాత మేవతత్
భావాన చేత నానపి చేతన వచ్ఛే తనాన్యచేతనవత్
వ్యవహార యతి యథేష్టం సుకవిః కావ్యే స్వతంత్రతయా"

అపారమైన కావ్య ప్రపంచమునకు కవియే బ్రహ్మ. అనగా సృష్టి కర్త. అతడు తన యిచ్ఛానుసారముగా లోకమును మార్చును. అతడు శృంగారియగుచో లోకమును శృంగారమయ మొనర్చును. అతడు విరాగియగుచో నీరసముగావించును. అచేతన వస్తువులను చేతన వస్తువులుగా చేతన వస్తువుల నచేతన వస్తువులుగా స్వతంత్రతతో వ్యవహరించును. అని తెలిపెను.[2]

---

1. కావ్యాలంకార సంగ్రహము. పుట 89.
2. కావ్యాలంకార సంగ్రహము. పుట 90, 91లు.

భామహానంద వర్ధనుల యుక్తులకేకవాక్యతను గల్పించినచో "ప్రతిభావంతుడైనకవి కావ్య ప్రపంచమును సృజించు బ్రహ్మ" యని తేలును. ప్రతిభావంతుడే కదా లోకమును రసమయముగా గాని నీరసముగా గాని చేయగల దిట్ట. కావుననే "కావ్యంతు జాతుజాయేత కస్య చిత్ప్రతిభావతః" అనువాచో యుక్తియు నేర్పడినది. కావున కవియన క్రాంతదర్శియై ప్రతిభావంతుడై వర్ణనా నిపుణుడగువాడు.

"కవనీయం కావ్యం" (వర్ణింపదగినది కావ్యము) అని లోచన కారుడు. "కవయతీతికవిః తస్యకర్మకావ్యం" (వర్ణించువాడుకవి అతని కర్మ కావ్యము) అని విద్యాధరుడు." కౌతిశబ్దాయతే విమృశతి రసభావాన్ ఇతి కవిః తస్యకర్మకావ్యం" (రసభావములను విమర్శించువాడు కవి వాని కర్మ కావ్యము) అని భట్ట గోపాలుడు. "లోకోత్తర వర్ణనానిపుణుడగు కవి యొక్క కర్మ కావ్యము) అని మమ్మటుడు. కవికి వర్ణనానైపుణ్యముండవలెనని యుగ్గడించినారు.[1]

మహాకావ్యమునందు అష్టాదశ వర్ణనలుండవలయునని అలంకారికుల మతము.[2] దండి కావ్యాదర్శమున-

"నగరార్ణవశైలర్తు చన్ద్రార్కోదయ వర్ణనైః
ఉద్యాన సలిల క్రీడా మధుపానరతోత్సవైః
విప్రలమ్భైర్వివాహైశ్చ కుమారోదయవర్ణనైః
మన్త్రద్యూత ప్రయాణాజినాయకాభ్యుదయై రపి"[3]

నగరములు, సముద్రము, పర్వతములు, ఋతువులు, చంద్రోదయ సూర్యోదయ వర్ణనములు, ఉద్యాన క్రీడలు, జలక్రీడలు, మధుపానము, సురతోత్సవము, విప్రలంభ, వివాహ, పుత్రోదయ వర్ణనములు, మంత్రము, ద్యూతము, ప్రయాణము, యుద్ధము, నాయకాభ్యుదయము వంటి వర్ణనలుండవలెనని తెలిపినాడు.

అష్టాదశ వర్ణనలు తప్పనిసరిగా యుండవలయునను నియమము మాత్రము కవులు పాటింపలేదు. ఒకటి రెండు తక్కువగానో ఎక్కువగానో తమ కావ్యములందు వర్ణించియున్నారు.

వర్ణనలు కథా సన్నివేషమునకు పాత్ర పోషణమునకు ఉత్కర్షనాపాదించునట్లుండ వలయునే గాని కవి తన ప్రతిభా పాండిత్యములను ప్రదర్శించుటకై వర్ణనా లౌల్యమునకు లోనయి ఏదో ఒక సందర్భమును గల్పించుకొని వర్ణించి కథను కుంటుపఱచి పాత్రౌచిత్యమును భంగపఱచి పఠితలకు విసుగు జనించునట్లు రచింపరాదు.

చొక్కనాథ చరిత్రమున తిరువేంగళకవి సంయమనమును పాటించి కథాగతికి ఆటంకము కలుగనీయక, ఔచిత్యము చెడనీయక రసభంగము జరుగనీయక ఈ కావ్యమున కుపాంగములైన ఈ క్రింది వర్ణనలను గావించినాడు.

1. కావ్యాలంకార సంగ్రహము. పుట 90, 91లు.
2. ప్రతాపరుద్రీయము, కావ్యప్రకరణము. శ్లో. 69-71 వరకు.
3. కావ్యాదర్శః ప్రథమ పరిచ్ఛేదః, శ్లో. 16-17 లు.

1. వారణాసి పురవర్ణన, 2. మధురాపుర వర్ణన, 3. వన వర్ణన, 4. వేట వర్ణన, 5. జంతువులు జాతివైరము దక్కి మెలగిన వర్ణన, 6. సంధ్యాకాల, సూర్యాస్తమయ, చంద్రోదయ సూర్యోదయ వర్ణనలు 7. కన్యాసౌందర్యవర్ణన, 8. విరహవర్ణన, 9. వివాహ వర్ణన, 10. పుత్రోదయ, పుత్రికోదయ వర్ణనలు 11. వృద్ధా ప్యవర్ణన 12. వేగావతినది వర్ణన 13. మహాంభోరాశి వర్ణ. 14. వర్ష వర్ణన 15. అవగ్రహవర్ణన 16. కొలను వర్ణన 17. వటవృక్ష వర్ణన, 18. యుద్ధ వర్ణన, 19. విభూతి మహత్త్వ వర్ణన, 20. రుద్రాక్షమహత్త్వ వర్ణన – ఇత్యాదులు.

## వారణాసి పురవర్ణన

చొక్కనాథ చరిత్రము నందలి ప్రథమాశ్వాసములోని కథాను క్రమణికలో పచ్చకప్పురపు తిరువేంగళకవి వారణాసి పురమును వర్ణించినాడు. హాలాస్య మాహాత్మ్యము నందీ వర్ణన ప్రథమోధ్యాయమున కథా ప్రారంభమున నున్నది.[1] మూలమున పదునైదు శ్లోకములలో నున్న కాశికాపుర వర్ణన తెనుగున పదునైదు చరణములలో గావించుట ఈ కవి అనువాద చాతురికి నిదర్శనము. చొక్కనాథ చరిత్రమునందలి వారణాసి పురవర్ణన హాలాస్యమాహాత్మ్య మందలి కాశీనగర వర్ణనకు భిన్నముగా నున్నది. మూలమున కేవలము నగరము నందలి ప్రాకారములు, భవనములు, మంటపములు – ఇత్యాది భౌతిక ద్రవ్య వర్ణనకే అధిక ప్రాముఖ్యమిచ్చి కాశికామహత్త్వమునకు అల్ప ప్రాధాన్యమీయబడినది. చొక్కనాథ చరిత్రమున నట్లు గాదు. ఇందలి వర్ణన మీ క్రింది విధముగా నాలంకారికముగా నున్నది.

"పొలుపైన వేడ్కతోఁబుణ్యైకరాశి
నలి కర్మపిశితము నమలు రాకాశి
భక్తౌఘు సహవాసి భాగ్యాంబురాశి
ముక్తి మంటపవాసి మోహనోల్లాసి
మణికర్ణికోద్భాసి మహిత ప్రకాశి
ఫణికుండలా వాసి పరమ సంకాశి
కలుష సంహారాసి కైవల్యరాశి
ఫలిత పంచక్రోశి భర్గవిలాసి
యభవ రూపాధ్యాసి యర్కప్రకాశి
యభిమత ఫలరాశి హంస నివాసి
యలగంగతో రాసి హరుకృపఁజేసి
విలసిత గుణరాశి వేద సద్భాసి
కామంబుకెడబాసి కరుణకుడాసి

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 1, 2 లు. శ్లో. 1–15 వరకు.

కామితార్థవిలాసి గల పంచక్రోశి
యన్నపూర్ణాభాసి యగు వారణాసి.[1]

**మధురాపుర వర్ణన :**

చొక్కనాథ చరిత్రమునందలి ప్రథమాశ్వాసములోని కథానుక్రమణికలో మధురాపుర వర్ణన కలదు. ఈ వర్ణన మూలమున లేదు. అందు హాలాస్యక్షేత్ర తీర్థ మాహాత్మ్యములు ద్వితీయాధ్యాయమున వర్ణింపబడియున్నవి. తిరువేంగళకవి మధురాపురమును

"సార్థమై యేఁబది యాఱుదేశములఁ
బ్రార్థింపఁగల్గిన పాండ్యరాజ్యమున" - అని మొదలిడి
వానవాదులు శేష వాణులు మునులు
వ్యాసాదులకు నశక్యంబు వర్ణింప
నదిలోక విఖ్యాత మది తీర్థరాజ
మదివేద ఫలసారమది పుణ్యసార
ముదిముక్తి సాధనం బది సిద్ధ సేవ్య
మది పాప సంహార మది శంభునిలయ
మాశ్రిత ఘన దరిద్రాద్రి సద్భిదుర
మాశ్రిత మధురంబు నమ్మహామధుర" - అని వర్ణించినాడు.[2]

మఱియు ప్రథమాశ్వాసములోని మొదటిలీలలో ఇంద్రునిచే ననుజ్ఞాతుడై విశ్వకర్మ నిర్మించిన మధురాపుర, చొక్కనాథాలయమంటప, గోపుర, ప్రాకార, విమానాదుల వర్ణనమును తిరువేంగళకవి విపులముగా చేసినాడు.

"ఆ విశ్వకర్మతో నమరవల్లభుడు
భావింపమున్నొక్క పట్టణంబిచట
లాలితవైభవా లంకారములను
గైలాస తుల్యమై గలుగంగ బోలు
నైనను నీ విప్పుడతి రమ్యముగను
నీ నేర్పుమెఱయంగ నిర్మింపవలయు"[3] నని యాజ్ఞాపించగా ఆ విశ్వకర్మకైలాసమును, వైకుంఠమును, అమరేంద్రు పురమును,అలకా నగరమును మించునట్లు పురమును గల్పించెనని మూడు పుటలలో రమ్యముగా వర్ణించినాడు.[4] మూలమునందీ వర్ణన.

"అథ దేవేంద్ర వచనాద్విశ్వ కర్మాచతత్క్షణే ॥49॥
ప్రాకారాణాంపంచకంచ మంటపాని బహూనిచ

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 6.
2. చొక్కనాథ చరిత్ర. పుటలు 11, 12
3. చొక్కనాథ చరిత్ర. పుట 24.
4. చొక్కనాథ చరిత్ర. పుటలు 25, 26, 27.

గోపురాణిచ సర్వాణి దేవ్యాః ప్రాసాదముత్తమమ్ ॥50॥
ఆలయం పరివారాణాం వివిధాః ప్రతిమా అపి
సోపాన పఙ్క్తిం తీర్థస్యనిర్మమే తపసోబలాత్ ॥51॥
అని మూడు శ్లోకములలో మాత్రమే కలదు.[1]

## వన వర్ణన

చొక్కనాథ చరిత్రమున తిరువేంగళకవి మొదటి లీలలో ఇంద్రుని వేట సన్నాహమును గూర్చి వర్ణించు సందర్భమున వనవర్ణన గావించినాడు. ఆ వర్ణనమిది;

"ఆకాశమంటి యాశాంతరంబులన
నేక శాఖలఁ బర్వి నిఖిల కాంతార
సంఘంబుమించి యసంఖ్యాతవృక్ష
సంఘలతా గుల్మ సంఘముల్ గల్గి
కొలకులందును వాపి కూపంబులందు
స్థలదుర్గవనదుర్గ జలదుర్గములను
బొలుపొంద గిరి దుర్గములు పిక్కటిల్లి
...............................
పెనగొని యండజ పిండజంబులను
మునుకొని స్వేదజ బుద్బుదంబులను
మృగ పక్షి జంతు సమేతంబుగాగ
నగణిత సంకులంబై యొప్పుమీఱి
కడమ వనంబుల గలుగు నేమిటను
గడమలేకెప్పుడు కాంతారభూమి"[2]

ఈ 'వనవర్ణన' మూలమునలేదు.

## వట వృక్ష వర్ణన :

చొక్కనాథ చరిత్రము నందు పంచమాశ్వాసములోని ముప్పది రెండవలీలలో తిరువేంగళకవి మఱ్ఱిమ్రాను నిట్లు వర్ణించినాడు.

"...............................
ఆ పాండ్య రాజ్యమ్ము నందు నామఱ్ఱి
దారుణ భూత భేతాళ డాకినులు
ఘోరమై తన యందు ఘూర్ణిల్లు దాని

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 31.
2. చొక్కనాథ చరిత్ర. పుటలు 18, 19.

భల్లూక మార్జాలపన్నగపక్షు
లెల్లనావాసమై యెసఁగిన దానిఁ
జక్కనై శాఖోపశాఖల నష్ట
దిక్కులు నొరయంగ ధృతిమించుదాని
నత్యున్నతమ్ముగా నాకాశమంటి
నిత్య నిత్యమువచ్చి నిర్జరాంగనలు
వెలయంగ యోజన విస్తారమైన
దళముల శయనింపఁ దనరిన దాని
నూడల నహికన్యలుయ్యాలలూగి
యాడంగఁ బాతాళ మంటిన దాని
వడిమించి యున్న యావట మటు జేరి."[1]

పై వర్ణన మూలమునకు విస్తృతరూపము. అందు ముప్పది తొమ్మిదవ అధ్యాయమున "మహాన్ వటోస్తి తత్రాద్యశ్శాఖాభిః క్రాంతయోజనః । దివ్యశక్త్యభిసంయుక్తోమేఘ మార్గ నిరోధకః।। విశాలదళ సంపూర్ణః ప్రరోహానేక సంయుతః". అని యున్నది.[2]

## వేట వర్ణన

చొక్కనాథ చరిత్రము నందలి మొదటిలీలలో ఇంద్రుడు పాండ్యదేశము నందలి కాంతార భూములకు వేటకు వెడలిన సందర్భమున అతని వేట సన్నాహమును "అనుపమ ఘనమృగవ్యసనుడై యపుడు" అని ప్రారంభించి "అందమై వేట సన్నాహంబు గాగ" అను చరణము వరకు వర్ణించినాడు. "కలిగి కొందఱు వేట కాంద్రతి వేడ్క" అను చరణము నుండి మొదలిడి "వేట చాలించి యా విబుధేంద్రుడనియె" అను చరణము వరకు వేటను వర్ణించినాడు.[3]

హాలాస్యమాహాత్మ్యము నందు దేవేంద్రానుగ్రహమను పంచమోధ్యాయమున దేవేంద్రుని వేట సన్నాహము, వేట వర్ణన మూడు శ్లోకములలో నున్నది.[4] చొక్కనాథ చరిత్రము నందలి వేట వర్ణన మూలమునకు భిన్నముగా నుండుటయేకాక దేశీయతా ముద్రను పొందియున్నది.

## జంతువులు జాతి వైరము దక్కిమెలగిన వర్ణన :

చొక్కనాథ చరిత్రమునందు ద్వితీయాశ్వాసమున నాలుగవలీలలో జంతువులు జాతివైరము మాని మెలగినవని కవి ఈ క్రింది విధముగా వర్ణించినాడు.

---

1 చొక్కనాథ చరిత్ర. పుట 168.
2 హాలాస్యమాహాత్మ్యము. పుట 155, శ్లో. 27 మరియు 28వ శ్లోకపాదం.
3. చొక్కనాథ చరిత్ర. పుటలు 19, 20.
4. హాలాస్యమాహాత్మ్యము. పుట 28, 29లు.

"దండిగా సింహపోతములను జేరి
తొండమ్ము ముక్కున దువ్వ నేనుగులు
నఖముల నెత్తి యేణమ్ముల ముద్దు
ముఖములాఘ్రూనించుపుండరీకములు
పాలుపైన యలమేక పోతులఁజూచి
చెలగి మిత్రత్వమ్ము సేయు తోడేళ్లు
శాఖలఛాయల సంచరింపుచును
నాఖులతోనాడు నడవిపిల్లులును
గొనకొని తగ కొండ గొటియలవేడ్కఁ
గనిమేలమాడు శాఖామృగమ్ములునుఁ
గడునెండబడకుండ గడఁగి ముంగులకు
పడగలు గొడుగుగాఁ బట్టు సర్పములు"[1]

మూలమున సప్తమోధ్యాయమున "పక్షిణశ్చమృగాద్యాశ్చ స్వవాసం సహసాయయుః" అను నొక్క వాక్యము కలదు.[2] తిరువేంగళ కవి దీనిని పెంచి పై విధముగా రమణీయముగ వర్ణించినాడు.

## సంధ్యాకాల, సూర్యాస్తమయ, చంద్రోదయవర్ణనలు

హాలాస్యమాహాత్మ్యమున సప్తమాధ్యాయములో పదునాఱవ శ్లోక ప్రారంభముననున్న 'సంజాతే చాంధకారేతు'[3] అను వాక్యమును ఆధారముగాగొని తిరువేంగళ కవి చొక్కనాథ చరిత్రమున నాలుగవలీలలో సంధ్యాకాల, సూర్యాస్తమయ, చంద్రోదయ వర్ణనలను వరుసగా గావించినాడు. ఆవర్ణనమిది;

**సంధ్యాకాల వర్ణన;**

"తప్తారకూటమై తరుణాతపంబు
దీప్తమై దివసమ్ము ధృతిఁ బల్కఁ బాఱె
నట సూర్యపటపుటం బంబరమ్మునను
ఘటితమై మేల్కట్లు గట్టిన యట్లు
నొప్పుగా రక్తవర్ణోద్గమగుచుఁ
గప్పె సంధ్యారాగ కములు నత్తఱిని"[4]

**సూర్యాస్తమయవర్ణన;**

"చక్రానఁ జక్ర పుష్కరిణిఁగావించి
చక్రియుద్ధత తపశ్చరణం బొనర్ప

1. చొక్కనాథ చరిత్ర. పుట. 36, 37 లు.
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 38, 15వ శ్లోకపాదం.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 38.
4. చొక్కనాథ చరిత్ర. పుట 37.

నాలోనఁ బ్రత్యక్షమై వచ్చి చూచి
కాలకంఠుడు శిరః కంపమ్ము సేయ
జపమునఁ గీలూడి జాఱినయట్టి
నవరత్న కర్ణకుండలములో యనఁగ
నరవిందములు బ్రుక్క నసురులింపెక్క
నరుణాంశుఁడల పశ్చిమాంబుధిఁ(వాలె",[1]

**చంద్రోదయవర్ణన;**

"మృగపక్షి జంతు సమూహమ్ము లెల్లఁ
దగమించు నాశ్రమ స్థలములఁ జేరె
నంధకదైత్యగర్వాంధ విధ్వంసి
కంధరచ్ఛాయ సంకలితాంధకార
పటలమ్ము బ్రహ్మాండ భాండమ్ముఁ జేరెఁ
దటుకున నక్షత్ర తతులెల్లఁ బ్రబలెఁ
బ్రాచి దిగ్భామిని పాటించి నీడ
చూచు దర్పణమన శోభితంబగుచుఁ
దమ్ములు నొవ్వ నుత్పలములు నవ్వఁ
గ్రమ్ముకోనటఁ జకోరమ్ములు క్రొవ్వ
జారచోరులు వెర్వసస్యముల్ పర్వ
ఘోరాంధపటలి యొక్కుమ్మడి లివ్వ
వేలుపులకు బువ్వ వెన్నెలకువ్వ
బాలచంద్రుడు పూర్వశైలమ్మునెక్కె
మెలగెడు విటజనమృగములఁ బట్ట
వలరాజువైచిన వలయో యనంగఁ
బిండిజల్లిన యట్లు పేర్చి యెల్లెడల
నిండు వెన్నెల భూమి నిండంగఁబర్వె",[2]

చొక్కనాథ చరిత్రమునందలి తృతీయాశ్వాసములోని పదునైదవ లీలలోఉగ్రుడు మేరువును సమీపించిన సందర్భమున సూర్యాస్తమయమై, చంద్రోదయమైన వర్ణన కలదు. ఈ వర్ణన మూలమున లేదు. తిరువేంగళ కవి "అప్పుడా సూర్యుండు నస్తాద్రికేగ" అని ప్రారంభించి "నిండి నల్దిశలు వెన్నెలలు శోభిల్లె" అను చరణము వరకు ఏడు ద్విపదలలో వర్ణించినాడు.[3] ఇవియే కాక ఈ కావ్యము నందు అటనట సందర్భానుసారముగా పూర్వాస్తమయ, చంద్రోదయ, ఇత్యాది వర్ణనలు కనిపించుచున్నవి.

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 37.
2. చొక్కనాథ చరిత్ర. పుట 37, 38లు
3. చొక్కనాథ చరిత్ర. పుట 98.

**సూర్యోదయవర్ణన :**

హాలాస్యమాహాత్మ్యము నందలి సప్తమోధ్యాయమున ముప్పది యొకటవ శ్లోక ప్రారంభమున గల "తతః ప్రభాతే విమలే"[1] అను పదములను తిరువేంగళకవి పదునేడు ద్విపదలలో ఈ క్రింది విధముగా వర్ణించినాడు.

"పొడిచె వేగురుచుక్క పురుహూతు దిశను
నుడురాజునట పశ్చిమోదధికేఁగె
కొక్కొరోకో యని కుక్కుటమ్ములును
వెక్కసమ్ముగ మ్రోసె వినువీధినంత
తెలతెల వారెనల్ దిశలు దీపించెఁ
.................................
గమలముల్ వికసించెఁ గాంతి శోభిల్ల
కమలారి సంపూర్ణ కళలొత్తిగిల్లె
నుగ్రాంధ తతివీడె నోషధుల్ వాడె
నగ్ర జన్ములు వేడ్క నర్ఘ్యమ్ములొసఁగ
రవి కాంత శిలలంత రాఁజుచునుండ
దివిజేంద్రు మేడపై దీపించునట్టి
పదియాఱువన్నెయౌ బంగారు తోడఁ
గుదురైన మాణిక్య కుంభమోయనఁగ
ముక్కంటి వలచూపు ముగురైన రూపు
జక్కవలకు విందు జారుల కుందు
కలువల పగవాడు గ్రహముల ఱేఁడు
నలరి భానుడు నుదయాచలంబెక్కె"[2]

ద్వితీయాశ్వాసమున నాలుగవ లీలలో నున్న పై వర్ణనయే గాక తృతీయాశ్వాసములోని పదునైదవలీల యందు ఉగ్రుడు మేరువును భేదించి సువర్ణమును గొని మధురకేతించిన సందర్భమున "పొడిచెవేగురుచుక్క పురుహూతుదిశను" అని ప్రారంభించి 'అత్తఱి సూర్యోదయంబై చెలంగె''నని అయిదు ద్విపదలలో వర్ణించినాడు[3]. ఈ వర్ణన మూలమున లేదు.

**కన్యాసౌందర్యవర్ణన :**

చొక్కనాథ చరిత్రమునందలి నవమాశ్వాసములోని అఱువది నాలుగవలీలలో తిరువేంగళకవి కన్యాసౌందర్యమునిట్లు వర్ణించినాడు. ఈ వర్ణన మూలమున లేదు.

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 39.
2. చొక్కనాథ చరిత్ర. పుట 39.
3 చొక్కనాథ చరిత్ర పుట 100 :

“ ఆకన్నె యౌవన ప్రాప్తయైనంత౯
జేకొని యాబాల శృంగారమెన్న
నాకురులానెఱు లా గొప్పకొప్పు
నాకన్నులా చన్నులా యారు తీరు
నామోము నాగోము నాదంత పంక్తి
నాముక్కు నా చెక్కులా చక్కదనము
నాబాహు లామోహనాధ రోష్ఠమ్ము
నా బాగు లాలాగు లా కౌను మేను
లా చేతు లా రీతు లాకాళ్లువ్రేళ్లు
లా చూపు లారూపు లాచంకపొంక
మాతొడ లానడ లామెడ కడుపు
నా తేట లామాట లాసొంపు పెంపు
నాశోభ యానాభి యాతిన్నదనము
లా శీల మాగుణ మాయౌవనంబు
మరునకునైనను మరులు పుట్టించు”[1].

## వివాహవర్ణన

పచ్చకప్పురపు తిరువేంగళకవి చొక్కనాథ చరిత్రమునందలి ద్వితీయాశ్వాసములోని అఱువదిలలో తటాతక కళ్యాణమును పురమును శృంగారించుట నుండి మొదలుకొని పరిమళ, శోభన, భోజనాది ద్రవ్యములను సమకూర్చుట, భూపతులకు అహ్వానములంపుట, విడుదు లేర్పాటు చేయుట. పెండ్లికూతురు నలంకరించుట, శివుని పెండ్లి కొడుకును జేయుట, కంకణములు బాసికములు ధరింపజేయుట, పెండ్లికుమారునెదుర్కొనితోడి తెచ్చుట. సేసలు జల్లుట ఉత్తరఫల్గుణీ నక్షత్ర శుభముహూర్తమున శివుడు తటాతక వేద శాస్త్రోక్తరీతినిపాణి గ్రహణము గావించునంతవరకు దేశీ పద్ధతిని రమణీయముగా వర్ణించినాడు.[2] హాలాస్యమాహాత్మ్యమున తటాతక కళ్యాణము తొమ్మిదవ అధ్యాయమున అరువది శ్లోకములలో వర్ణింపబడియున్నది.[3] చొక్కనాథ చరిత్రము నందలి వర్ణన మూలమునకు యదాతథాను వాదముకాదు.

వివాహ వర్ణన చొక్కనాథ చరిత్రమున తృతీయాశ్వాసమున పంద్రెండవలిలలో కూడా నున్నది. ఇందు తిరువేంగళకవిఉగ్రపాండ్యుని వివాహమును శుభలేఖలంపుటతో ప్రారంభించి నగరు శృంగారించుట, మంగళ స్నానములాచరింపజేసి పెండ్లికుమార్తె నలంకరించుట, ఉగ్రుని పెండ్లికుమారుని జేయుట, బాసికములు ధరింపజేయుట,

---

1. చొక్కనాథ చరిత్ర. పుటలు 348, 349.
2. చొక్కనాథ చరిత్ర. పుటలు 58-62 వరకు.
3. హాలాస్యమాహాత్మ్యము. పుటలు 50-52 వరకు. శ్లో. 58-117 వరకు.

మంగళ సూత్రధారణ వరకు వర్ణించినాడు.[1] ఈ వర్ణన మూలమున పదునాఱవ అధ్యాయమున ఏబది యాఱు శ్లోకములలోనున్నది.[2] కాని చొక్కనాథ చరిత్రమునందలి ఉగ్రుని వివాహవర్ణన మూలానుసరణము కాదు. దేశీరీతిలో స్వతంత్రముగా కవి రచించినాడు.

## విరహవర్ణన

చొక్కనాథ చరిత్రమున సప్తమాశ్వాసములోని నలువది నాలుగవలీలలో తిరువేంగళకవి చొక్కనాథుని విరహమును ఈ క్రింది విధముగా వర్ణించినాడు. ఈ వర్ణన మూలమునలేదు.

"అప్పుడా మధురేశుడాదేవిఁ బాసి
కప్పుయ్యె మోహాధికమ్ముచేమేను
తెలతెలఁవాఱె కుత్తిక వెచ్చపుట్టె
తలయేఱు పుట్టెను దాపమ్ముమెదమె
జడగట్టెనెఱులును సగమాయెనొడలు
నడర నెమ్ములు తోలునయ్యెదేహమ్ము
నీరీతితోడ నెంతేనియువగల
మారసంహారుడా మారుని బారి"[3] బడలేక యున్నాడు.

## గర్భిణి స్త్రీ వర్ణన మరియు పుత్రికోదయవర్ణన

చొక్కనాథ చరిత్రమునందలి ద్వితీయాశ్వాసములోని ఐదవ లీలలో మలయధ్వజుని భార్య గర్భవతియైన సందర్భమున తిరువేంగళకవి యామె గర్భచిహ్నాలను

"మఱియంతటను నెలమసలె నాసతికి
నరుదుగా కోరికలగ్గలంబయ్యె" -నను ద్విపదతో నారంభించి
"అంసోత్తరీయమ్మునంతంతసడలె
హంసయానకునడలల సతగాంచె" - నను ద్విపదవరకు వర్ణించి
"ఉవిద యీరీతి గర్భోక్తచిహ్నములు
నవరింప నవమాస సాన్నిధ్యమైన
నాఁడు రూపమున లీలామోదమునను
మూఁడు చన్నుల జగన్మోహిని గాంచె" నని తటాతక జననమును వర్ణించినాడు[4]

ఈ వర్ణన మూలమున లేదు.

## గర్భిణి స్త్రీ వర్ణన మరియు పుత్రోదయ వర్ణన

తృతీయా శ్వాసములోని పదునెకండవ లీలలో తటాతక గర్భవతియైన విధమును తిరువేంగళకవి ఇట్లు వర్ణించినాడు. ఇది మూలమునలేదు. అందు తటాతక గర్భము

---

1. చొక్కనాథ చరిత్ర. పుటలు 78-82 వరకు.
2. హాలాస్యమాహాత్మ్యము. పుటలు 73-75 వరకు. శ్లో. 2-57 వరకు..
3. చొక్కనాథ చరిత్ర. పుట 233.
4. చొక్కనాథ చరిత్ర. పుటలు 47, 48.

ధరించినదని పదునైదవ అధ్యాయమున రెండవ శ్లోకమున నున్నది.[1] చొక్కనాథ చరిత్రము నందలి వర్ణనమిది.

"పతికిని సంతోషభావంబుఁగలుగ
నతివేడ్క గర్భచిహ్నాలు దోచెనపుడు
తమ్మిమొగ్గలఁ దుమ్మెదలు వ్రాలినట్లు
కొమ్మకుచముల ముక్కులు నల్లనయ్యెఁ
దన వంశమెల్ల వర్ధన మొందు కరణి
వనితకు మధ్యమ్ము వర్ధిల్లఁదొడఁగె
భవునంశమగుట నాభవుమెడకప్పు
నవకమై గంభీరనాభిక వెడలి
యమున నాఁగాళిమ నందెనో యనఁగఁ
గమలాక్షి నూఁగారు కార్కొనఁదొఁడగెఁ
తన కుమారుని కీర్తి ధరనిట్లు పర్వు
ననునట్లు వెల్ల నాయెను నింతిమోము.
భూమెల్ల నేలు నీ పుత్రుడన్ మాడ్కి
భామకు మృత్తికపైఁగోర్కు లెసఁగె
నడపు జాడ్యంబాయె నళినలోచనకుఁ
గుడు పులు దఱిగెఁగోర్కులు ఘనమాయె".[2] నని వర్ణించి వెంటనే

ఉగ్రపాండ్యుని జననము నిట్లు వర్ణించినాడు.

"తళుకొత్తువేడ్క సౌందర్యనాయకుడు
జలజనేత్రకును బుంసవన సీమంత
కర్మాను కృత్యముల్ గావించి మించి
కూర్మి పుత్రుఁడు గల్గఁ గోరుచునుండెఁ
దలప ముమ్మోల తటాతక పుణ్యసతికి
నెలలు తొమ్మిదియును నిండిన పిదప
నుత్తమాంగమ్మున నెక జడతోడఁ
జిత్తజాకృతిఁబోలు చెలువంబుదాల్చి
వెలయంగ శుభలగ్న వేళలయందుఁ
గులదీపకుండైన కొడుకుద్భవించె"[3]

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 70.
2. చొక్కనాథ చరిత్ర. పుట 74.
3. చొక్కనాథ చరిత్ర. పుట 74.

## వృద్ధాప్యవర్ణన

చొక్కనాథ చరిత్రమునందలి ద్వితీయాశ్వాసములోని ఐదవ లీలలో మలయధ్వజుడు తన కుమార్తెయగు తటాతకకు రాజ్య పట్టాభిషేక మొనరించు సందర్భమున తనకు వృద్ధాప్యము సమీపించినదని అమాత్యవరులతో దెలుపును. మలయధ్వజుని వాక్యమును కవి ఇట్లు వర్ణించినాడు.

"వయసు ప్రాయమువోయె వార్ధకమాయెఁ
బ్రియభోజనముసేయఁ బ్రీతి లేదాయె
దృష్టిముష్టులు దరిగె దేహమ్ముసడలె
నష్టభోగములపై నాసలు నుడిగెఁ
దలవణఁకఁగఁజొచ్చె దంతముల్ వదలె
పలుమాటలకుఁ జెవుడ్పడెవినరాదు."[1]

మూలమునందీవర్ణన లేదు. అందు మలయధ్వజపాండ్యుడు

"నిజాంతకాలేపుత్రీ మమాత్యసహితో విధినాభ్యషిచ్య" అని మాత్రమే కలదు.[2]

## వైఖానదివర్ణన

తిరువేంగళకవి చొక్కనాథ చరిత్రమున ఎనిమిదవలీలలో వైఖానదిని శృంగారలక్ష్మిగను, ముక్తి నిశ్రేణిగను వర్ణించినాడు. ఆ వర్ణనమిది:

"వేగావతీ నామ విఖ్యాతిమించి
బాగొప్ప వైఖనాఁబరగె నచ్చటను
నందు రక్తాబ్జంబులందుల తూండ్లు
నందుసైకతములు నందు శైవాల
మందు జక్కవలును నందుల బిసము
లందుల వెలిదమ్ములందు బేడిసలు
నందుల జలవేణులందు బిందువులు
నందుల జలస్రోత లందుల సుళ్లు
నందుల పుష్పమ్ము లలరు పుప్పొళ్లు
నందంద నందును నందమ్ము గాఁగ
వరుసపాదమ్ములు పడినూరువులును
నఱుదైన జఘనమ్ము నాఱును గుచము
లాబాహువుల్ ముఖమా నేత్రములును
నాబాగులగు వేణులామౌక్తి కములు

1. చొక్కనాథ చరిత్ర. పుట 49.
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 47, 117 వ శ్లోకపాదము.

నానూపురంబుల యందు నాదములు
నానాభి గాంభీర్యమాచిత్ర వస్త్ర
మనువందఁదనయందు నఁటఁగలవెల్లఁ
దన యొప్పిదమునకు దానకంబగుచు
లాలిత శృంగార లక్ష్మియై యొప్పెఁ
గూలంకషానూన ఘుమఘుమ ధ్వనులు
కూర్మంబు నొరసి దిక్కులఁ జెప్పవెలసి
నిర్మలోన్నత ముక్తి నిశ్రేణియగుచు." అని వర్ణించి దాని మహాత్త్వమును-
"నిత్యాశ్రితులకిచ్చు నెమ్మితో నెపుడు
నత్యంత పుణ్యౌఘ యమరు నావైఖ
యందుఁ గృతస్నానులైన వారలకుఁ
జెందవు దురితముల్ చేరు పుణ్యములు
నాయేటిదరినున్న యా భూమి జనులు
నే యాపదలు లేక యెసగి యే ప్రొద్దు
ధనధాన్యముల చేత ధర్మంబు చేత
ఘననీతి వర్తన గలిగి యుండుదురు
నా పుణ్యనది మహిమాతిశయంబు
లాపరమేష్ఠికి నలవియెపొగడ"[1] - అని వర్ణించినాడు.

మూలమున ఈ వైఖానది వర్ణనలేదు. అందు 'అన్నగర్తాపగా నయనం అను పన్రెండవ అధ్యాయమున 26వ శ్లోకము నుండి 49వ శ్లోకము వరకు గంగానది వర్ణన కలదు.[2] తిరువేంగళకవి గంగానదికి మారుగా వైఖానదిని వర్ణించినాడు.

## మహాంభోరాశి వర్ణన

చొక్కనాథ చరిత్రములోని తృతీయాశ్వాసమున గల పదుమూఁడవ లీలలో అబ్దులు ప్పొంగి వచ్చిన సందర్భమున తిరువేంగళకవి మహాంభోరాశి వర్ణన గావించినాడు. మూలమునందీ వర్ణన రెండున్నర శ్లోకములలో ఈ క్రింది విధముగనున్నది.

"అంభస్సంఘట్టనేద్భూత తూర్యధ్వని సమాకులం।
దుష్ట సత్త్వానేక భట పరిపూరిత పార్శ్వకం ॥40॥
"జల ప్రవాహసంఘట్టం శంఖ ఘోష సమాయుతం
శ్రేణీకృతోర్మి సంఘాత పురశ్చరవిజృంభితమ్ ॥41॥
"స్వరాజ్యగ్రహణోద్యుక్త పరసైన్యమివాగతం
....................................[3] ॥42॥

1. చొక్కనాథ చరిత్ర. పుట 68, 69లు.
2. హాలాస్యమాహాత్మ్యము. పుటలు 62, 63.
3. హాలాస్యమాహాత్మ్యము. సముద్రతాడనమను పదునేడవ అధ్యాయము. పుట 78.

చొక్కనాథ చరిత్రమునందలి వర్ణనమిట్లున్నది.

"...................................

ఘనతరోత్తుంగ నక్ర క్రూర మత్స్య
కుండలి ఘన శంఖ కూర్మకర్కటక
మండూకముల చేత మహిమించుదాని
నీఁటియంగనలును నీటి గుఱ్ఱములు
నీఁటి మానవులచే నెగడెడుదాని
వరమణి హరినీల వజ్ర ప్రవాళ
మరకత వైడూర్య మాణిక్యపుష్య
రక్త గో మేధిక రాజిత రాగ
మౌక్తికములచేత మలసిన దాని
ఘనతరార్భటులను ఘన తరంగముల
వినువీధికెగయంగ వెసఁబర్వు దాని
వదలక ఘుమఘుమ ధ్వనుల నుప్పొంగి
పది దిక్కులను నిండి పఱతెంచు దాని
కడలేని ధర్మార్థకామ మోక్షంబు
లడరి పుణ్యక్షేత్ర మది చొఱరాక
మితిలేని కోపాగ్ని మేకొన్నయట్టి
గతిబడబాగ్నిలోఁ గరఁగిన దాని"[1].

## కొలను వర్ణన

హాలాస్యమాహాత్మ్యమునందలి ఏబది నాలుగవ అధ్యాయమున ఆరవ శ్లోకమున నున్న "తత్రాస్థిపావనం తీర్థం"[2] అను వాక్యమును ఆధారముగా గొని తిరువేంగళకవి చొక్కనాథ చరిత్రమున సప్తమాశ్వాసములోని నలువది యేడవ లీలలో "మూలములోని పావన తీర్థమను మాటతో తృప్తి చెందక' పదుమూడు ద్విపదలలో రమ్యముగా నొక కొలనునే ఇచట గల్పించి మాలోపమాలంకారమున రమణీయముగా వర్ణించినాడు. ఈ వర్ణనమును

'ఘనమైన యొకమహా కమలాకరమ్ము' అను చరణముతో ప్రారంభించి
'చెన్నొంద నా సరసీరుహాకరము' అనుచరణముతో ముగించినాడు.[3]
తిరువేంగళ కవి శైలి నుదహరించుపట్టున దీని నుట్టంకింతును.

1. చొక్కనాథ చరిత్ర. పుట 84, 85లు.
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 191.
3. చొక్కనాథ చరిత్ర. పుట 247, 248లు.

## వర్షవర్ణన

చొక్కనాథ చరిత్రమునందలి తృతీయాశ్వాసములోని పదునాలుగవలీలలో పచ్చకప్పురపు తిరువేంగళకవి 'వర్షము' నిట్లు వర్ణించినాడు. ఇది మూలమునలేదు.

"....................................

ప్రాచీన పతి యాజ్ఞ ప్రబలి మేఘములు
క్షామకాలమ్మను శత్రువు మీద
నా మని దండెత్తు నవసరమ్మునను
జయభేరి మ్రోయించు చందమ్ము గాఁగ
రయమున మంద్ర గర్జనముల నడరె
బలిమైన చతురంగ బలముల మాడ్కి
బలువన్నె మేఘముల్ ప్రబలెనల్ దెసల
దారుణ కరవాల ధారలో యనగ
కాఱు మెఱుంగు లొక్కట పిక్కటిల్లె
వరుణుండు పట్టిన వడి కార్ముకంబు
సరవినిఁదగ నింద్ర చాపమ్ము దోఁచె
మునుకొని చాపవిముక్తంబులైన
ఘనతర సిత సాయకంబులో యనఁగ
మొనసి శంపాజాలములు గాగ బట్టి
గొనకొని వర్షించె కుంభ వర్షములు
సాంద్రమై రక్తమాంసంబుల రీతి
యింద్ర గోపంబులు నిలనిండఁబర్వె
క్షామంబు బోఁదోలె సంతోషముగను
నామని యుప్పొంగి హర్షించినట్లు
నదులు తటాకముల్ నవసరోవరము
లుదక పూరమ్ములై యొప్పెనల్లడల"[1].

## అనావృష్టి వర్ణన

హాలాస్యమాహాత్మ్యమునందు ఏబది నాలుగవ అధ్యాయమున

"అనావృష్ట్యాకదా చిత్సత్తటాకో నిర్జలో భవత్

శరారిః పరిఖిన్నస్సన్ భ్రామాహారకాంక్షయా"[2] అను శ్లోకమున నున్న 'అనావృష్టి' యను మాట నూతగా గొని చొక్కనాథ చరిత్రమున సప్తమాశ్వాసములోని నలువది యేడవ

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 88, 89లు.
2. హాలాస్య మాహాత్మ్యము. పుట 190. శ్లో. 4

లీలలో తిరువేంగళకవి పదుమూడు ద్విపదలలో అలంకారికముగా ఈ క్రింది విధముగా వర్ణించినాడు.

"........................................

ఆరాజ్యమంత యవగ్రహంబెసఁగి
వానలు లేక తీవ్రాకారమగుచు
భానుకర ప్రభా పటలమ్ము మెఱసి
యేదిక్కుఁ జూచిన నెండలనెండి
మేదినిఁ గలదెల్ల మృగపక్షి జంతు
సంతతి మృగతృష్ణ సంతాప మంది
కాంతార వితతి శుష్కమ్ములై మఱియు
భూచరులంబరమ్మును గోరుచుండ
ఖేచరులాధాత్రికిని బోదమనగ
భూచరాధిపులు ద్యోభూమిమేలనఁగ
నీ చందమున ధాత్రి యెల్ల పేటిల్ల
నీరు నీరినిఁ గోర నిబిడ మారుతము
మారుతమ్మును గోర మఱితరుప్రజము
తరువుల నీడ లెంతయు వేడ్కఁగోర
ధర నిట్లు బర్వె నాతపమహాఋతువు
గుంట కాలువలెల్ల కూపముల్ చెఱువు
లంట పట్టెను సైకతావాల మగుచుఁ
గాఁగెఁగుళీరముల్ గరఁగెఁ గర్కటము
వేఁగె కచ్ఛపములు వెచ్చెమచ్చెములు
తూలెను మకరముల్ దునిసె సర్పములు
సొలెను మృగపంక్తి సొరిగెఁ బక్షులును
స్రుక్కిరి యమరులు సురిగిరి ప్రజలు
చిక్కె భూతగణమ్ము చిల్లె శైలములు
కాకయ్యెవనములు గమల నంయములు
నింకె వారిధులుడుకెత్తె నంబరము
ప్రయ్యలయ్యె ధరిత్రి ప్రస్సెనాకసము",[1]

## యుద్ధవర్ణన

చొక్కనాథ చరిత్రము నందు ఎడనెడ పాండ్య చోళరాజుల మధ్య జరిగిన యుద్ధములు వర్ణింపబడినవి. 21వ లీలలో దేవ పాండ్యునకు చోళరాజుతో, 29వ లీలలో

1. చొక్కనాథ చరిత్ర. పుటలు 246, 247.

పాండ్య రాజుకు చేది రాజుతో, 33వ లీలలో పాండ్యరాజుకు కాడ్వెట్టియను చోళరాజుతో, 34వ 36వ లీలలలో పాండ్యచోళ రాజులకు, 49వ లీలలో అనంత గుణ పాండ్యునకు చోళరాజుతో జరిగిన యుద్ధములు వర్ణితములు. ఇవికాక మొదటి లీలలో ఇంద్రునకు వృత్రాసురునకు యుద్ధము సంక్షిప్తముగాను, ఆఱవలీలలో తటాతకక్షైత్రయాత్రకై వెడలి శివునితో జేసిన యుద్ధమును శృంగారాత్మకముగను, పదునాలుగవలీలలో ఉగ్రపాండ్యుడు ఇంద్రునితో చేసిన యుద్ధమును వీరోచితముగను, తిరువేంగళకవి వర్ణించినాడు.

చొక్కనాథ చరిత్రమున తృతీయాశ్వాసములోని పదునాలుగవ లీలలో ఉగ్ర పాండ్యునకు ఇంద్రునకు జరిగిన యుద్ధమును తిరువేంగళకవి ఈ క్రింది విధముగా వర్ణించినాడు.

......... యింద్రుడత్యంత రోష
మున యుద్ధసంరంభమునకు నేతెంచె
నతడును సన్నద్ధుడై యుగ్రమునను
జతురంగ బలముల సంఖ్యతోనిలిచి
పడమటఁ దూర్పునఁ బ్రాపించినట్టి
జడధులు దలపడు చందమ్ము దోఁప
బలభేది సేనలు పాండ్య సేనలును
దలకొని ద్వంద్వ యుద్ధము సేయుచుండ
నాదేవ మానవులాహవ గరిమ
యాదేవ రాక్షసులందు లేదయ్యె
నప్పుడు దేవేంద్రుఁడతి రౌద్ర మెసఁగఁ
*తప్పక నాపాండ్య ధరణీశు జూచిఁ
గ్రూరాస్త్రములనేయఁ గుపితుడైయతఁడు
దారుణాస్త్రమ్ములఁదను వెల్లనించె
నాగ్నేయ బాణమ్ము హరిహయుడేయ
ప్రజ్ఞతో వారుణాస్త్రమ్మున ద్రుంచె
నురగాస్త్ర మాజిష్ణుడుగ్రుడైయేయ
గరుడాస్త్రమున నది ఖండించివైచె
నెన్ని బాణమ్ముల నింద్రుఁడేసినను
నన్ని బాణమ్ముల నవియెల్లనణఁచె
నసియెత్తినను నతడసియెత్తిదునిమె
ముసలమ్మునెత్తిన ముసలానఁ దునిమె
దనర ఛత్రీశాయుధంబు లేసినను

* ఈ చరణము ముద్రిత గ్రంథమున లేదు. ఇది డి1051 కాగితపు ప్రతిలోనిది.

మనుజేంద్రుడవి యొల్ల మగ్నంబు సేసె
నంతవజ్రాయుధం బతి శక్తి బూన
పంతమ్ముతోనది బయలుగాఁ జేసి
యాచొక్కనాథుని నాత్మలో నిల్పి
భూచరులెల్ల నద్భుతమంది చూడ
శక్రుపై నత్యంత సాహసమ్మునను
జక్రాయుధము పాండ్యజనపతివైచె
నది శైలమగలించు నశని చందమునఁ
ద్రిదశనాయకుని యూర్జిత శౌర్యముడుగ
హాటకరత్న దీపాకీర్ణ మౌళి
కోటీరమగల నుగ్గులగాగఁ గూల్చె"[1]

మూలమునందీ యుద్ధవర్ణన పండ్రెండు శ్లోకములలో నున్నది.[2] హాలాస్య మాహాత్మ్యము నందు వృత్రారిమౌళి భేదనమను పదునెనిమిదవ అధ్యాయమున వర్ణింపబడిన దానికి చొక్కనాథ చరిత్రమున నున్న యుద్ధ వర్ణనకు ప్రధానముగా ఒక భేదము గన్పించుచున్నది. మూలమున ఇంద్రోగ్రుల మధ్య జరిగినది ద్వంద్వయుద్ధము. చొక్కనాథ చరిత్రలో ద్వంద్వ యుద్ధమే కాక ఇరుసేనల మధ్య యుద్ధము జరిగినదని తిరువేంగళకవి వ్రాసినాడు.

హాలాస్యమాహాత్మ్యమునందు నలువది యొకటవ అధ్యాయమున పాండ్య, చోళ సైన్యములకు జరిగిన యుద్ధమును

"అన్యోన్య మభవద్యుద్ధం సేనయోరుభయోరపి।
శస్త్రాస్త్ర పాతనం ఘోరమతి నృత్య కబంధకమ్[3]॥ అని ఒకే ఒక శ్లోకమున వ్రాసియుండగా చొక్కనాథ చరిత్రమున షష్ఠాశ్వాసమున ముప్పది నాలుగవలీలలో తిరువేంగళకవి ఇరువది ద్విపదలలో విపులముగా, రమణీయముగా వర్ణించినాడు. ఇందలి పదునొకండు ద్విపదలలో యుద్ధరంగము అంబోధిచందమున నున్నదని ఆలంకారికముగా వర్ణించినాడు. ఈ వర్ణన కవి వర్ణనావైశారద్యమునకు చక్కని నిదర్శనము. ఆ వర్ణనమిది.

"...........................రణము
సలుపంగ నాయిరు సైన్యంబులందు
నరయఁగ ద్విరదము లరదముల్ గాఁగ
నరదముల్ గజములై యవనిపైఁద్రెళ్లఁ

1. చొక్కనాథ చరిత్ర. పుట 90, 91లు.
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 81, 82లు. శ్లో. 50-62 వరకు.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 159. శ్లో. 26.

పరవీరభటులు నశ్వములైరి మఱియు
పరగనశ్వములు గాల్బలములై యొప్పె
నవని వ్రాలిన కరులచముల్గాఁగ
నవచామరములు ఫేనంబులు గాఁగ
ఘనతురగములు నక్రమ్ములు గాఁగ
ధనువులాశీవిష తండముల్ గాఁగఁ
బడగలు జలగణ పంక్తులు గాఁగ
పడిశిరోజములు శైవాలముల్గాఁగ
రథ చక్రములు కూర్మరాజులు గాఁగ
రథములు యాన పాత్రమ్ములుగాఁగ
తేలెడు పక్కెరల్ తెఱలునుగాఁగఁ
గాలాటి? శంఖ కర్కటములు గాఁగ
సకలాయుధములు మత్స్యంబులుగాఁగ
బ్రకటిత కోపాగ్ని బడబాగ్నిగాఁగఁ
దూకొని నాదముల్ తుములమ్ముగాఁగ
జేకొన్న జయలక్ష్మి శ్రీ లక్ష్మి గాఁగ
ముక్తాత పత్రమంబుజములు గాఁగ
రక్తపూరమ్ము నీరంబులు గాఁగ
నంభోధి చందమై యద్భుతంబెసఁగ
జృంభిత హృదయులై చెలరేగి సలుపు" [1]

## తీర్థయాత్రా వర్ణనలు

(i) తిరువేంగళ కవిచొక్కనాధ చరిత్రములోని ఆఱవ లీలలో తటాతక గావించిన తీర్థయాత్రను మూడు పుటలలో విపులముగా వర్ణించినాడు. [2]

(ii) ఉగ్రపాండ్యుడు జైత్రయాత్ర గావించి మరలివచ్చుచు వివిధములైన పుణ్య క్షేత్రములను తీర్థములను దర్శించుకొనిన వర్ణన పదునైదవ లీలలో గావించినాడు. [3] ఇందు రామేశ్వర క్షేత్ర ప్రసక్తి ప్రముఖమైనది.

(iii) ముప్పది తొమ్మిదవ లీలలో వరగుణ పాండ్యుని తిరువెడమరుదూరు యాత్రను వర్ణించినాడు [4]

---

1. చొక్కనాధ చరిత్ర. పుటలు 177, 178.
2. చొక్కనాధ చరిత్ర. పుటలు 55, 56, 57.
3. చొక్కనాధ చరిత్ర. పుటలు 95-97.
4. చొక్కనాధ చరిత్ర. పుటలు 197-200.

చొక్కనాథ చరిత్రము శైవ కావ్యము గావున ఇందు విభూతి మహత్త్వ, రుద్రాక్ష మహత్త్వాది వర్ణనలు గలవు. గ్రంథ విస్తరణ భీతిచే వీనినిట వ్రాయుట లేదు. నవమాశ్వాసములోని ఇఱువదియవ లీలలో విభూతి మహత్త్వ వర్ణన[1]. ఇఱువది యొకటవ లీలలో రుద్రాక్ష మహత్త్వ వర్ణనలున్నవి.[2]

అలంకారికులు చెప్పిన అష్టాదశ వర్ణనలకు ఒదగని అనేక వర్ణనలు చొక్కనాథ చరిత్రమునందున్నవి. ఇవి కవి భావనా పటిమకు నిదర్శనములుగా నున్నవి. వానిలో కొన్నింటిని గూర్చి ఇట వ్రాయుదును.

## నవరత్నాదుల వర్ణన

చొక్కనాథ చరిత్రమునందు పదునేడవ లీలలో తిరువేంగళ కవి మూలము ననుసరించుచు సంక్షిప్తముగా వలుని వృత్తాంతము, నవరత్నాదుల వర్ణనము ముప్పది యైదు ద్విపదలలో గావించినాడు[3]. ఈ వర్ణన హాలాస్యమాహాత్మ్యమునందు నవరత్న విక్రయమను ఇరువది మూడవ అధ్యాయమున ఒక వంద అరువది నాలుగు శ్లోకములలో విపులముగా నున్నది[4].

## సిద్ధ వేష వర్ణన

చొక్కనాథ చరిత్రము నందలి చతుర్థాశ్వాసములోని పందొమ్మిదవ లీలలో తిరువేంగళ కవి చొక్కనాథుని సిద్ధ వేషమును "కుఱుచకెంజడలును గుచ్చిలికంథ' అను చరణముతో ప్రారంభించి 'రసికుడై ధరియించి రాజమార్గమున అను చరణము వరకు 5 ద్విపదలలో వర్ణించినాడు[5]. హాలాస్య మాహాత్మ్యమునందలి సిద్ధ చరిత్రమను ఇఱువది యాఱవ అధ్యాయమునందు హాలాస్యనాథుని సిద్ధ వేష వర్ణనము 5 శ్లోకములలో నున్నది[6]. తెనుగునందలి వర్ణన మూలానుసరణముగా కాక స్వతంత్రముగా నున్నది.

## చొక్కనాథుని సమ్మోహనాకార వేష వర్ణన

చొక్కనాథ చరిత్రమునందలి పంచమాశ్వాసములోని ముప్పది యొకటవ లీలలో చొక్కనాథుడు దారుకావనము నందలి మునిపత్నులు తమంతటి పతివ్రతలు లేరని యహంకరించగా వారి పతివ్రతాచారములు సూతమని సమ్మోహనాకార వేషమును ధరించి వచ్చెను. హాలాస్య మాహాత్మ్యము నందు అట్లు వచ్చిన సుందరేశ్వరుని సౌందర్యమును వలయ విక్రయమను ముప్పది యెనిమిదవ అధ్యాయమున "సుందరేశస్య సౌందర్యం మనోజ్ఞాతి మనోహరం[7]' అని యుండగా తిరువేంగళ కవి తన భావనాశక్తిచే

1. చొక్కనాథ చరిత్ర. పుటలు 325, 326.
2. చొక్కనాథ చరిత్ర. పుటలు 335, 336, 337.
3. చొక్కనాథ చరిత్ర. పుటలు 108-110 వరకు.
4. హాలాస్యమాహాత్మ్యము. పుటలు 102 నుండి 109 వరకు. శ్లో. 22-185 వరకు.
5. చొక్కనాథ చరిత్ర. పుట 116.
6. హాలాస్యమాహాత్మ్యము. పుట 117. శ్లో. 6-10 వరకు.
7. హాలాస్యమాహాత్మ్యము. పుట 152. మూడవ శ్లోకపాదం.

చొక్కనాథుని రూపమును "చిగురు కెంజడలును జిలుగు చందురుడు' అను చరణముతో మొదలిడి 'కలిగి సమ్మోహనాకార వేషమున' అను చరణము వరకు ఆరు ద్విపదలలో వర్ణించినాడు[1].

## గాజులసెట్టి వేష వర్ణన

శాపవశమున వైశ్యుల యింఢ్ల బుట్టిన దారుకా వన స్త్రీల విమోచనమునకై సుందరేశ్వరుడు వైశ్య వేషము ధరించి వచ్చిన వర్ణనము హాలాస్య మాహాత్మ్యమున వలయ విక్రయమను ముప్పది యెనిమిదవ అధ్యాయమున అయిదు శ్లోకములలో వర్ణించియున్నది[2]. చొక్కనాథ చరిత్రమున పంచమాశ్వాసములోని ముప్పది యొకటవ లీలలో చొక్కనాథుని గాజులసెట్టి వేషమును తిరువేంగళ కవి 'చొక్కనాయకుడు గాజుల సెట్టియగుచు' అను చరణముతో ప్రారంభించి 'బుజముపై గాజుల పొది చాలబెట్టి' అను చరణము వరకు పదునైదు చరణములలో స్వతంత్రముగా వర్ణించినాడు[3].

వైశ్య వేషధారియైన సుందరేశ్వరుడు వైశ్యవీధి కేతెంచిన సందర్భమునందు మూలమున 'వైశ్య వీథ్యామటన్ ప్రాహ వైశ్య వేషధరోహరః[4]' అని మాత్రమే యుండగా చొక్కనాథ చరిత్రమున తిరువేంగళ కవి

'గాజులు బొద్దులు కమ్మదుద్దులును
గాజులు గొనరారొ గాజులో యనుచు' అను ద్విపదతో నారంభించి
'మాధుర్యపుర రాజ మార్గమ్ము బట్టి
వీధి వీధుల సెట్టి వేడ్కతో దిరుగు' అను ద్విపదవరకు తొమ్మిది ద్విపదలలో మూలమును పెంచి వర్ణించినాడు[5]. ఈ వర్ణన కవి భావకతకు లోకజ్ఞతకు నిదర్శనముగా నున్నది.

## కిరాత వేష వర్ణన

హాలాస్య మాహాత్మ్యమునందు నలువది మూడవ అధ్యాయమున సుందరేశ్వరుని కిరాత వేష వర్ణన మూడు శ్లోకములలో నున్నది[6]. దీనిని తిరువేంగళ కవి చొక్కనాథ చరిత్రము నందలి షష్ఠాశ్వాసము లోని ముప్పది యాఱవ లీలలో 'బోయకాడై తల బొమిడిక వెట్టి' యను చరణము నుండి 'యొలిమై చెవి సంకులొనరంగ బెట్టి' యను చరణము వరకు ఐదు పాదములలో అంత్యానుప్రాసముతో అలంకారికముగా, స్వతంత్రముగా రచించినాడు[7].

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 158.
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 152, 153లు. శ్లో. 18-22 వరకు.
3. చొక్కనాథ చరిత్ర. పుట 161.
4. హాలాస్యమాహాత్మ్యము. 153 శ్లో. 22లో
5. చొక్కనాథ చరిత్ర. పుటలు 162, 163.
6. హాలాస్యమాహాత్మ్యము. పుట 164. శ్లో. 33-35 వరకు.
7. చొక్కనాథ చరిత్ర. పుట 186.

## జైనులంపిన మాయ గోవు వర్ణన

ఈ వర్ణన హాలాస్య మాహాత్మ్యమున ముప్పది యైదవ అధ్యాయమున నాలుగు శ్లోకములలో నున్నది[1]. ఇదియే చొక్కనాథ చరిత్రమున పంచమాశ్వాసములోని ఇరువది యెనిమిదవ లీలలో ఆరు ద్విపదలలో నున్నది[2].

## నందీశ్వరుని వర్ణన

జైనులంపిన మాయ గోవును వారించి రమ్మని సుందరేశ్వరుడంపిన నందీశ్వరుని వర్ణన మూలమున మూడు చరణములలో నీక్రింది విధముగా నున్నది[3].

"ఔన్నత్యాదతిధావళ్యా త్కైలాసగిరి సన్నిభః ॥ 22 ॥

అత్యద్భుతాతి సౌందర్యం వేషం ధృత్వాక్షణేనతు ।

లిఖన్నక్షత్రపదవీం కామార్త ఇవ గర్జయన్ ॥ 23॥

చొక్కనాథ చరిత్రమున పంచమాశ్వాసమున ఇరువది యెనిమిదవ లీలలో చొక్కనాథుడంపిన నందికేశుని వర్ణన 'తనరబ్రహ్మాండ గాత్రంబుతో నపుడు' అని ప్రారంభించి 'జైనులంపిన యభిచారహోమమ్ము ధేనువు ముందర ధృతివచ్చి నిలచె" అని తొమ్మిది ద్విపదలలో ముగించినాడు[4]. మూలమున అభిచారహోమమును అధికముగా, నందీశ్వరుని వర్ణనను అల్పముగా వర్ణించి యుండగా తెనుగున మాయగోవు నల్పముగా వర్ణించి నందీశ్వరు నధికముగా వర్ణించుట విశేషము.

## వల వర్ణన

చొక్కనాథ చరిత్రము నందలి సప్తమాశ్వాసములోని నలువది నాలుగవ లీలలో దాశవాడై వచ్చిన చొక్కనాయకుని వల వర్ణన కవి భావకతకు నిదర్శనము. మూలమున 'స్వకీయాంవాగురాంచాపి గృహీత్వాస్కంధ దేశతః[5]' అని మాత్రమే యుండగా తెనుగున చొక్కనాయకుడు

'అతడట్లకాకని యతి సంభ్రమమున
చతురత నొకవల సంధించెనంత
మునుకొని భవబంధములు, ముళ్ళు వేసి
మొనసి యాశాపాశములు త్రాళ్లు జేసి
మాయాంధకారమ్ము మఱి వల గాగ
మాయావి తానునై మధురేశ్వరుండు
వలబుజమ్మున వెట్టి........ అని వర్ణించినాడు[6].

---

1. హాలాస్యమాహాత్మ్యము. పుట 143. శ్లో. 9-12 వరకు.
2. చొక్కనాథ చరిత్ర. పుట 148.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 144.
4. చొక్కనాథ చరిత్ర. పుటలు 148, 149.
5. హాలాస్యమాహాత్మ్యము. పుట 222, 42వ శ్లోకపాదం.
6. చొక్కనాథ చరిత్ర. పుట 234.

## అలంకారములు

'అలం' అను శబ్దమునకు 'కృ' ధాతువు చేరగా అలంకారమను పదమేర్పడుచున్నది. 'కావ్యమునిది యలంకరించున్న'[1] అని కాని 'కావ్యము దీనిచే అలంకరింప బడున్న'[2] అని కాని అలంకార శబ్దమునకు వ్యుత్పత్తి. అలంకారమనగా భూషణమని యర్ధము. మానవ శరీరమునకు వస్త్రాభరణాదులలంకారములైనట్లు కావ్య శరీరమునకు ఉపమాద్యలంకారములు అలంకారములుగా నున్నవి. అలంకారములను ప్రయత్న పూర్వకముగనే ఉపయోగింప వలసిన యవసరము లేదు. భావోద్వేగమున కవికి అప్రయత్నముగనే అలంకార యుక్తమైన భాష వెలువడును. నిరలంకార రచన యుండనే యుండదు. పనిగట్టుకొని ఎవరైన అట్లు వ్రాసిన అది దిగంబర శరీర దర్శనము వలె అసహ్యముతో కనులు మూయించునే గాని పరవశత్వమున గాదు. మఱియు నీ అలంకారములు సహజసిద్ధమై రసానంద జనకమునకు పబలకముగా నుండవలయునే గాని తెచ్చిపెట్టుకొనిన ఎరువు సొమ్ముల వలె ఎబ్బెట్టుగా నుండి కావ్యానందమునకు ఆటంకము కల్గించునట్లుండ రాదని ఆలంకారికుల మతము. సహృదయ హృదయ రంజనమే అలంకారముల పరమ ప్రయోజనము.

కావ్య శరీరము శబ్దార్ధములు గావున అలంకారములును శబ్దార్ధాలంకారములని రెండు విధములు. అనుప్రాసాదులు శబ్దాలంకారములు. ఉపమాదులర్ధాలంకారములు.

తిరువేంగళ కవి చొక్కనాథ చరిత్రమును తన కావ్యకన్యకను ఏఏ అలంకారములతో భూషించినాడో పరిశీలింతము.

శబ్దాలంకారములలో ఈ కవి వృత్త్యనుప్రాస, ఛేకానుప్రాస, లాటానుప్రాస, అంత్యానుప్రాస, యమక, ముక్తపద గ్రస్థములను, పోషించినాడు. అర్ధాలంకారములలో ఉపమ, ఉత్ప్రేక్ష, స్వభావోక్తి, అతిశయోక్తి, క్రమాలంకారములను పోషించినాడు. అర్ధాలంకారముల కన్న శబ్దాలంకారములే అధికముగా కన్పించు చున్నవి.

## శబ్దాలంకారములు - వృత్త్యనుప్రాసములు

1. ప్రథమాశ్వాసము కథానుక్రమణికలో 'శివ శివ విశ్వేశ! శ్రీ గిరిజేశ' అను చరణము నుండి 'శివ శివ గణనాథ శ్రీవిశ్వనాథ' అను చరణము వరకు వరుసగా పదునాల్గు చరణములలో 'శివ' యను రెండక్షరములు పలుమార్లు ఆవృత్తి యైనవి.

2. ప్రథమాశ్వాసము మొదటి లీలలో 'జయ జయ మహదేవ జయ మహాదేవ' అను చరణము నుండి మదలుకొని 'జయ జయ' పరమేశ సకల ప్రకాశ అను చరణము వరకు పండెండ్రు చరణములలో 'జయ' యను రెండక్షరములు పలుమార్లు ఆవృత్తియైనవి.

---

1. 'అలంకరోతీత్యలంకారః'
2. 'అలంక్రియతే అనేనేత్యలంకారః'
1. చొక్కనాథ చరిత్ర. పుట 6, 7 లు.
2. చొక్కనాథ చరిత్ర. పుట 22.

3. తృతీయాశ్వాసము పండెండ్రవ లీలలో
"పుష్ప కంబెక్కి యా పుష్పాస్త్రులీల
పుష్ప గంధులు వేడ్క పుష్పముల్ చల్ల"

4. చతుర్థాశ్వాసములోని పందొమ్మిదవ లీలలో 'విరూపాక్ష నాథుడో' అను శబ్దము నుండి సౌందర్యనాథుడో అను శబ్దము వరకు ఆరు చరణములలో 'నాథుడో' యను శబ్దము పలుమార్లు ఆవృత్తి యైనది.

5. చతుర్థాశ్వాసములోని ఇరువది నాలుగవ లీలలో
'గోత్రబాణాసన! గోత్రారివంద్య!' అను చరణము నుండి
'గోత్రేశనామ! సత్కుల గోత్రరహిత' అను చరణము వరకు
నాల్గు చరణములలో గోత్ర శబ్దము, 'గోవహ్ని నిర్దగ్ధ కుసుమ శరాంగ' అను చరణము నుండి 'గోచరోన్నత మూర్తి గోధర స్ఫూర్తి' అను చరణము వరకు నాలుగు చరణములలో 'గో' శబ్దము పలుమార్లు ఆవృత్తియైనది.

6. పంచమాశ్వాసము ఇరువది యైదవ లీలలో
'అభయమో సర్వేశ! యభయమో వరద!' అను చరణము నుండి
'అభయమో పళియంజ! హాలాస్య నిలయ' అను చరణము వరకు
ఆరు పాదములలో 'అభయమో' అను పదము పలుమార్లు అవృత్తియైనది.

7. సప్తమాశ్వాసము నలువది రెండవ లీలలో
'కమలానుజోత్తంస! కమలోదరాప్త' అను పాదము నుండి
'కమలాస్యదేహ! షట్కమలాది గేహ' అను చరణము వరకు
ఆరు పాదములలో 'కమల' యను శబ్దము పలుమార్లు వచ్చినది.

8. సప్తమాశ్వాసము నలువది నాలుగవ లీలలో
'ఈ సుందరాకార నీ శోభనాంగి' అను చరణము నుండి
ఈ చకోరాక్షిని ఈ చంద్రముఖిని' అను చరణము వరకు
ఆరు పాదములలో 'ఈ' యను నక్షరము పునరావృతమైనది.

9. సప్తమాశ్వాసము నలువది యేడవ లీలలో
"లోక పాలక వంద్య! లోకత్రయాత్మ

---

3. చొక్కనాథ చరిత్ర. పుట 81.
4. చొక్కనాథ చరిత్ర. పుట 116.
5. చొక్కనాథ చరిత్ర. పుట 133.
6. చొక్కనాథ చరిత్ర. పుట 139.
7. చొక్కనాథ చరిత్ర. పుట 220.
8. చొక్కనాథ చరిత్ర. పుట 233.
9. చొక్కనాథ చరిత్ర. పుట 250.

లోక త్రయాధార! లోకోపకార
లోక నాయక! పద్మలోచనార్చితుడ"

10. అష్టమాశ్వాసము నలువది తొమ్మిదవ లీలలో
'హరి యజార్చిత పాద! హరి నాగ వరద!
హరి వైరి వైరి వాహన సన్నుతాఢ్య
హరి దశ్వధరనాంక! యమిత ధరాంక!
హరిణశాబక హస్త! హరిచర్మ వసన!

11. అష్టమాశ్వాసము ఏబది యాఱవ లీలలో
'శరణు శరణ్య! యోశరణార్థిరక్ష!' అను పాదము నుండి
'శరణు నాస్వామి నా శరణులో గొమ్ము' అను పాదము వరకు
ఎనిమిది చరణములలో 'శరణ'ను పదము పలుమార్లావృత్తి యైనది.

12. నవమాశ్వాసము ఏబది ఏడవ లీలలో
'సప్త వారాసుల సప్త శైలముల
సప్తాశ్వరథ సక్త సప్తాశ్వములను'

13. అదేలీలలో "సామగానప్రియ! సామజ వరద!
సామజ రక్షణార్చిత పాదపీఠ
సామజముఖ జనక సామజ శిక్ష
సామవేదస్తుత్య స్వామి సర్వేశ"

14. నవమాశ్వాసము ఏబది తొమ్మిదవ లీలలో
"సర్వలోకారాధ్య! సర్వ జీవాత్మ!
సర్వ దేవశరణ్య! సర్వేశయీశ!

15. నవమాశ్వాసము అరువది మూడవ లీలలో
"ధరరధారూఢ భూధర పరిష్కార
ధర ధరాస్త్రాకృత ధరసుతాత్మేశ!
ధర చాపధర! జలంధర దైత్యహరణ!
ధర కూట నగర కంధర జజాచార?"

---

10. చొక్కనాథ చరిత్ర. పుట 256.
11. చొక్కనాథ చరిత్ర. పుట 282.
12. చొక్కనాథ చరిత్ర. పుట 298.
13. చొక్కనాథ చరిత్ర. పుట 299.
14. చొక్కనాథ చరిత్ర. పుట 314.
15. చొక్కనాథ చరిత్ర. పుట 347.

16. నవమాశ్వాసము ఆఱువది నాలుగవ లీలలో
"ఓ సోమసౌందర్య! ఓ కృపాధుర్య' అను చరణము నుండి
ఓ కాల సంహార! ఓ కృపాకార! అను చరణము వరకు
'ఓ' అను నక్షరము పలుమార్లు వచ్చినది.

17. నవమాశ్వాసము అరువది నాలుగవ లీలలో
'నాపాలి దైవంబ! నా పాలి వేల్ప!
నాపాలి సర్వేశ! నాపాలి వరద!"

18. నవమాశ్వాసము అరువది నాలుగవ లీలలో
"ఈవైశ్య సతికిని నీ కళావతికి
నీ వారిజాక్షికి నీ గుణవతికి
నీ ముగ్ధకీసాధ్వి కీ సతీమణికి
నీ మందగమనకు నీ పతివ్రతకు"

**ఛేకానుప్రాసములు**

1. అష్టమాశ్వాసమున నలువది తొమ్మిదవ లీలలో
"హరి వైరి వైరి వాహన సన్నుతాఢ్య"

2. అష్టమాశ్వాసము ఏబది యాఱవ లీలలో
"శివ శివ! యో సదాశివ! శివాత్మేశ
శివయోగి హృత్పద్మ చిరతర సద్మ"

3. అష్టమాశ్వాసము ఏబది యాఱవ లీలలో
"హర హర నరహరి హరి గర్వహరణ"
హరిణాంక హరిదశ్వ యనల త్రినేత్ర

**లాటానుప్రాసము**

1. 'తూలెను భటుల సందేహముల్ గాలు
కాలును బెనచుక కాలుని పురికి" ఇందు 'కాలుకాలు' అని శబ్దముల పౌనరుక్త్యమున్నను తాత్పర్య భేదమున్నది గాన ఇది లాటానుప్రాసము. ఇది షష్ఠాశ్వాసములోని ముప్పది యాఱవ లీలలో నున్నది.

---

16. చొక్కనాథ చరిత్ర. పుట 355.
17. చొక్కనాథ చరిత్ర. పుట 355.
18. చొక్కనాథ చరిత్ర. పుట 357.
1. చొక్కనాథ చరిత్ర. పుట 256.
2. చొక్కనాథ చరిత్ర. పుట 288.
3. చొక్కనాథ చరిత్ర. పుట 288.
1 చొక్కనాథ చరిత్ర. పుట 185.

**యమకాలంకారములు**

1. 'హాస్యమ్ము జేసిన యంత మాత్రమున
హాస్యమై పోయె.మా యాహవంబెల్ల" - ద్వితీయాశ్వాసము ఆరవ లీల.
2. తృతీయాశ్వాసము పండెండ్రవ లీలలో
'వనధులన్నియు మీరి వచ్చిన యంత
ఘనశక్తి వలన నా ఘనశక్తి విడుము.
3. తృతీయాశ్వాసము పదుమూడవ లీలలో
"వేలాయుధము నూఱు వేలాయుధముల"
4. షష్ఠాశ్వాసము ముప్పది యాఱవ లీల
"పట్టు గాబట్టి యిప్పట్టున నాదు
పట్టుకు గొంపోదు పటురయమ్మునను"
5. సప్తమాశ్వాసము నలువది మూడవ లీలలో
'భూనాథ ఈసాధ్వి పొలుపొంద జేసె
గానమిందును సరిగానమియ్యెడను
గాన మిక్కిలి మంచి గానల లోన
గాన మీమెకు సాటిగా నెన్నరాదు.
6. సప్తమాశ్వాసము నలువది మూడవ లీలలో
"పతిభక్తి సౌందర్య పతిభక్తి గలిగి'
7. సప్తమాశ్వాసములోని నలువది నాలుగవ లీలలో
'వలబుజమ్మున వెట్టి వలముల పట్టి
వలన నా వలరాజు వల`జిక్కినట్లు
వల వారితోడ నేవలన నామీను
వలనుగా నున్నది! వల జెప్పుడనిన'
8. సప్తమాశ్వాసములోని నలువది నాలుగవ లీలలో
"గోరాజ గమనుడా గోరాజు నెక్కి'

---

1.' చొక్కనాథ చరిత్ర. పుట 53.
2. చొక్కనాథ చరిత్ర. పుట 78.
3. చొక్కనాథ చరిత్ర. పుట 85.
4. చొక్కనాథ చరిత్ర. పుట 187.
5. చొక్కనాథ చరిత్ర. పుట 228.
6. చొక్కనాథ చరిత్ర. పుట 229.
7. చొక్కనాథ చరిత్ర. పుట 234.
8. చొక్కనాథ చరిత్ర. పుట 237.

9. సప్తమాశ్వాసము నలువది యెనిమిదవ లీల
"ఎల్ల జూపుము దీనికెల్లను నీవె
నల్లలితోజ్జ్వల సౌందర్యనాథ"

10. సప్తమాశ్వాసము నలువది యెనిమిదవ లీల
"ఎల్ల జీవుల కెల్ల నెల్లయై లోక
మెల్లయు నేలుదు రెల్లరు బొగడ"

## ముక్తపదగ్రస్థములు

1. పంచమాశ్వాసములోని ఇరువది యాఱవ లీలలో
'అయ్యెడ నా సిద్ధుఁడతని యింటికిని
జయ్యనఁబోయి యా సాధ్వి చేఁబట్టి
పట్టిన నదియోరి పాపాత్మ! తల్లి
బట్టంగ నీకును పాడియే యనుచు"

2. పంచమాశ్వాసములోని ఇరువది యేడవ లీలలో
"........................................
తెగనిండ గొని యేసె ధీరత్వమదర
నేసిన శరముబిలేశయ కంత
దేశంబు తఱుగ కదియును నేతేర
నేతేర మఱియు ననేక బాణములు".

3. షష్ఠాశ్వాసములోని ముప్పది నాల్గవ లీలలో
"ధృతిలేక నా కుమార్తెనుఁబెండ్లి చేసె
చేసిన నా పాండ్య శేఖరాత్మజుడు"

4. షష్ఠాశ్వాసము - ముప్పది యాఱవ లీలలో
"రాశిగా రక్తపూరమ్ములు గాఱె
గాఱిన వెఱగంది గాయమ్ము జెంది'

5. షష్ఠాశ్వాసము - ముప్పది యాఱవ లీలలో
"కాయజాంతకు మీదఁ గదలించి యెక్కె
నెక్కిన నాస్వామి నెదురంగలేక"

---

9. చొక్కనాధ చరిత్ర. పుట 252.
10. చొక్కనాధ చరిత్ర. పుట 254.
1. చొక్కనాధ చరిత్ర పుట 141.
2. చొక్కనాధ చరిత్ర. పుట 145.
3. చొక్కనాధ చరిత్ర. పుట 175.
4. చొక్కనాధ చరిత్ర. పుట 186.
5. చొక్కనాధ చరిత్ర. పుట 187.

6. సప్తమాశ్వాసములోని నలువది నాలుగవ లీలలో
"................నాగ్రహమున వైచె
వైచిన నాదంత వక్త్రునిఁ జూచి
7. అదే లీలలో
"పుస్తకమ్మును దీసి పోఁబార వైచె
వైచినఁ గనుగొని వడిఁగోపమెసగ"
8. అష్టమాశ్వాసములోని ఏబదియవ లీలలో
"వరద మునిస్తోత్ర వర్ణితనామ!
వరనేత్ర జనిత పావక దగ్ధకామ!
కామ మోహాది వర్గచ్ఛేది నామ!
నామ రూపక కపట నాటక ధార!
ధారాధరాభ కంధర! దయాసార!
సారంగధర వరసారంగ హస్త!
హస్తిచర్మోజ్జ్వల యమిత ప్రశస్త
శస్త ప్రజోత్తుంగ! సత్కృపాపాంగ"
9. అష్టమాశ్వాసములోని ఏబది యైదవ లీలలో
"తారచించినయట్టి తగు గావ్యమెల్ల
జేరి యాభూపాలు చెంతను జదివెఁ
జదివినదెల్ల నశ్లాఘ్యమ్ము జేసి
పదపడి యాతనిఁ బాటింప కనిపె
ననిపిన నతడు లజ్జాయత్తుడగుచు"
10. నవమాశ్వాసములోని ఏబది తొమ్మిదవ లీలలో
"అంబ కిరీటాంచితార్ధేందు బింబ
బింబ ఫలాధర బింబ మదంబ?
నంబిక జగదంబ నాంబికే యాంబ
నంబ రాంబర మంగళాంగితాలంబ"

---

6. చొక్కనాథ చరిత్ర పుట 231.
7. చొక్కనాథ చరిత్ర. పుట 231.
8. చొక్కనాథ చరిత్ర. పుట 262.
9. చొక్కనాథ చరిత్ర. పుట 276.
10. చొక్కనాథ చరిత్ర. పుట 316.

## అంత్యానుప్రాసాలంకారములు

1. ద్వితీయాశ్వాసములోని నాలుగవ లీలలో
"తమ్ములు నొవ్వ నుత్పలములు నవ్వ" అను చరణము నుండి
"వేలుపులకు బువ్వ వెన్నెలకువ్వ" అను చరణము వరకు "వ్వ" అంత్యానుప్రాసముగా నున్నది.

2. అదే లీలలో
"బాణకావ్యత్రాణ! పరమకళ్యాణ!
బాణారిబాణ! సద్భక్తధురీణ!
సురగిరి ద్రోణ! యోసుజన ప్రవీణ
త్వరిత భక్తత్రాణ! పాణిత శైణ"

3. ద్వితీయాశ్వాసములోని నాలుగవ లీలలో
'పురహర్త హరిభర్త భువనైక కర్త'

4. అదే లీలలో
'సురతార్తి హర కీర్తి శోభిత స్ఫూర్తి'

5. తృతీయాశ్వాసములోని పదుమూడవ లీలలో
'కైలాస గిరినాథ గంగాధినాథ' అను చరణము నుండి
'శివలోక పురనాథ శ్రీ చొక్కనాథ' అను చరణము వరకు నాల్గు ద్విపదలలో "థ" అంత్యానుప్రాసము.

6. తృతీయాశ్వాసములోని పదునాఱవ లీలలో
'శూలాది హస్తాయ శుభ్ర వర్ణాయ' అను చరణము నుండి
కామభస్మాంగాయ గంగాధరాయ" అను చరణము వరకు పదునేడు చరణములలో "య" అంత్యానుప్రాసము.

7. పంచమాశ్వాసములోని ఇరువది ఏడవ లీలలో
'గిరిజేశ! యఘనాశ! కీర్తి ప్రకాశ!
పరమేశ! భవనాశ! భర్గ! సురేశ"

---

1. చొక్కనాథ చరిత్ర పుట 37, 38లు
2. చొక్కనాథ చరిత్ర. పుట 38.
3. చొక్కనాథ చరిత్ర. పుట 38.
4. చొక్కనాథ చరిత్ర. పుట 38.
5. చొక్కనాథ చరిత్ర. పుటలు 85, 86.
6. చొక్కనాథ చరిత్ర. పుటలు 102, 103.
7. చొక్కనాథ చరిత్ర. పుట 146.

8. షష్ఠాశ్వాసము. ముప్పది నాలుగవ లీలలో
"అంచితోమాసంగ! యతనుభస్మాంగ" అను చరణము నుండి
"శివ శివ ధవలాంగ! శ్రీ చొక్కలింగ" అను చరణము వరకు అయిదు ద్విపదలలో "ంగ" అంత్యానుప్రాసము.

9. షష్ఠాశ్వాసములోని ముప్పది యాఱవ లీలలో
"ఘోర పాతకదూర! కుండలిహార!
హారహీరాకార! హరిణాంకధార"

10. అష్టమాశ్వాసము ఏబది యైదవ లీలలో
"జలధర శశిధర సజ్జటాధార! అను చరణము నుండి
స్నిగ్ధ వర్ణస్ఫార నిర్మలాకార' అను చరణము వరకు ఏడు పాదములలో "ర" అంత్యానుప్రాసము.

11. అష్టమాశ్వాసములోని ఏబది యాఱవ లీలలో
"ఆలోక రక్షణకై యొక గ్రుక్క" అను చరణము నుండి
'భావించి కృపదక్క పశియంజి చొక్క" అను చరణము వరకు ఐదు ద్విపదలలో "క్క" అంత్యానుప్రాసము.

12. నవమాశ్వాసములోని ఏబది తొమ్మిదవ లీలలో
"శివ శివ త్రైయక్ష! జితపురాధ్యక్ష! అను చరణము నుండి
"అఖిలాగమోద్రక్ష? యంబికాధ్యక్ష!" అను చరణము వరకు ఐదు ద్విపదలలో 'క్ష' అంత్యానుప్రాసము.

13. నవమాశ్వాసము ఏబది తొమ్మిదవ లీలలో
'ఆ నీల కంధరాయ నమశ్శివాయ' అను చరణము నుండి
'ఆది పరాపరాయ నమశ్శివాయ' అను చరణము వరకు ఐదు ద్విపదలలో 'నమశ్శివాయ' అంత్యానుప్రాసము.

14. నవమాశ్వాసములోని ఏబది తొమ్మిదవ లీలలో
"ఫలితముక్తి తరంగ పాపవిభంగ" అను చరణము నుండి
"అంగభాగమ్మున నా సర్వమంగ" అను చరణము వరకు తొమ్మిది చరణములు 'ంగ' ప్రాస అంత్యమున నున్నవి.

---

8. చొక్కనాథ చరిత్ర. పుట 179.
9. చొక్కనాథ చరిత్ర. పుట 184.
10. చొక్కనాథ చరిత్ర. పుట 276.
11. చొక్కనాథ చరిత్ర. పుట 288.
12. చొక్కనాథ చరిత్ర. పుట 314.
13. చొక్కనాథ చరిత్ర. పుట 316.
14. చొక్కనాథ చరిత్ర. పుట 315.

15. నవమాశ్వాసములోని అరువదియవ లీలలో

'అంభోజ గర్భార్చి తాంఘ్రి సరోజ!

శాంభవీరమణ విశ్వంభర పాహి' అను ద్విపద నుండి

'కామిత భక్త శంకర దేవ పాహి

సోమ సౌందర్య సంస్తుత నామపాహి' అను ద్విపద వరకు పది ద్విపదలు 'పాహి' యను పదమంతమందు గలిగి యున్నవి.

16. నవమాశ్వాసములోని అరువది యొకటవ లీలలో

"శివకథాలాపముల్ చెవియొగ్గివినక

భవబంధ కర్మముల్ వాయునా! చెపుడ" అను ద్విపద నుండి

"మదనాంతకుని మీద మనసెల్ల నిడక

సదమలానందమ్ము చవియున్నె చెపుడ" అను ద్విపద వరకు ఎనమిది ద్విపదలు 'చెపుడ' యను పదాంతమై యున్నవి.

17. నవమాశ్వాసములోని అరువది నాలుగవ లీలలో

'చండాంశునేత్రాయ సర్వశర్వాయ' అను చరణము నుండి

'లీలావిలాసాయ లేఖస్తుతాయ' అను చరణము వరకు తొమ్మిది చరణములు' 'య' అంత్యాను ప్రాసముగా గలవి.

పై పరిశీలనను బట్టి తిరువేంగళకవి వృత్త్యనుప్రాసమును, అంత్యానుప్రాసము నధికముగను, లాటానుప్రాసమును తక్కువగను ప్రయోగించినాడని చెప్పవచ్చును.

## అర్థాలంకారములు – ఉపమాలంకారములు

1. ద్వితీయాశ్వాసమున నాలుగవ లీలలో సంధ్యా కాలమును వర్ణించుచు.

"అట సూర్యపటపుటంబంబరమ్మునను

ఘటితమై మేల్కట్లు గట్టినయట్లు

నొప్పుగా రక్త వర్ణోదగ్రమగుచుఁ

గప్పె సంధ్యారాగ కములు సత్తఱిని"

2. తృతీయాశ్వాసములోని పదునొకండవ లీలలో తటాతక గర్భ చిహ్నాల వర్ణించు సందర్భమున

'తమ్మి మొగ్గలఁదుమ్మెదలు వ్రాలినట్లు

కొమ్మ కుచముల ముక్కులు నల్లనయ్యె"

---

15. చొక్కనాథ చరిత్ర. పుట 321.

16. చొక్కనాథ చరిత్ర: పుట 333.

17. చొక్కనాథ చరిత్ర. పుటలు 357, 358.

1. చొక్కనాథ చరిత్ర. పుట 37.

2. చొక్కనాథ చరిత్ర. పుట 74.

3. అదే సందర్భమున
"తనవంశమెల్ల వర్ధన మొందు కరణి
వనితకు మధ్యమ్ము వర్ధిల్లదొడగె"

4. ఆ సందర్భముననే
"భూమెల్ల నేలు నీ పుత్రుడన్ మాడ్కి
భామకు మృత్తికపైఁ గోర్కులెసగె"

5. తృతీయాశ్వాసములోని పదునాలుగవ లీలలో వర్షమును వర్ణించుచు
"క్షామ కాలమ్మున శత్రువు మీద
నామని దండెత్తు నవసరమ్మునను
జయభేరి మ్రోయించు చందమ్ముగాగ
రయమున మంద్ర గర్జనముల నడరె"

6. అదే వర్ష వర్ణనలో
"బలిమైన చతురంగ బలముల మాడ్కి
బలువన్నె మేఘముల్ ప్రబలెనల్ దిసల"

7. అదే వర్ణనలో
"వరుణుండు పట్టిన వడి కార్ముకంబు
సరవిని దగ నింద్రచాపంబు దోచె"

8. తృతీయాశ్వాసము - పదునాలుగవ లీల వర్షవర్షనలో
"సాంద్రమై రక్త మాంసంబుల రీతి
యింద్ర గోపంబులు నిలనిండ బర్వె

9. అదే వర్ణనలో
"ఆమని యుప్పొంగ హర్షించినట్లు
నదులు తటాకముల్ నవ సరోవరము
లుదక పూరమ్ములై యొప్పెనల్లడల"

10. తృతీయాశ్వాసములోని పదునాలుగవ లీలలో ఇంద్రోగ్రుల యుద్ధ సందర్భమున
"శక్రుపై నత్యంత సాహసమ్మునను
జక్రాయుధము పాండ్య జన పతివైచె

---

3. చొక్కనాథ చరిత్ర. పుట 74.
4. చొక్కనాథ చరిత్ర. పుట 74.
5. చొక్కనాథ చరిత్ర. పుట 88.
6. చొక్కనాథ చరిత్ర. పుట 88.
7. చొక్కనాథ చరిత్ర. పుట 88.
8. చొక్కనాథ చరిత్ర. పుట 89.
9. చొక్కనాథ చరిత్ర. పుట 89.
10. చొక్కనాథ చరిత్ర. పుట 91.

నది శైల మగలించు నశని చందమున
త్రిదశ నాయకుని యూర్జిత శౌర్యముడుగ
హాటక రత్నదీపాకీర్ణమౌళి
కోటీర మగల నుగ్గులు గాఁగ గూల్చె."

11 తృతీయాశ్వాసము పదునైదవ లీలలో చంద్రోదయమును వర్ణించుచు
"పాండ్య భూపతి కీర్తి ప్రబలినయట్లు
నిండి నల్దిశలు వెన్నెలలు శోభిల్లె"

12 తృతీయాశ్వాసములోని పదునైదవ లీలలో సూర్యోదయ వర్ణన సందర్భమున
"నక్షత్ర కుముదముల్ నఖముల జిదుమ
నాక్షణమ్మునఁ బ్రాచి హస్త పల్లవము
నెత్తినమాడ్కి సొంపెసగ గభస్తు
లత్తఱి సూర్యోదయంబై చెలంగె".

13 షష్ఠాశ్వాసములోని ముప్పది నాలుగవ లీలలో పాండ్య చోళ సైన్యములకు జరిగిన యుద్ధ సందర్భమున
"ఇరుసేనలంతంత నెదిరించి రంత
శరధియు శరధియు సంధించినట్లు
గగనమ్ము గగనమ్ము గదిసినయట్లు"

14 సప్తమాశ్వాసములోని నలువది రెండవ లీలలో బాణభద్రుని భక్తిని పరీక్షింప దలచి చొక్కనాధుడు వర్షమును గురిపించిన సమయమున :
"కాలకూటములీల, కాటుక కొండ
పోలిక, భల్లూక పుంజమ్ము మాడ్కి
ధారుణి గగన మంతయు నేకమగుచు
ఘోరాంధకార మొక్కుమ్మడిఁ బ్రబలి"

15 నవమాశ్వాసములోని అఱువది యొకటవ లీలలో రుద్రాక్షమహత్త్వమును వర్ణించిన సందర్భమున:
"పురుషుండు రుద్రాక్షములె ధరించినను
ధరణిఁ బాతకము లాతనిఁ జెంద వెఱచు
గరిమఁ జీకటి సూర్యు గదియ దన్నట్లు
గరుడుని గదియ నాగము లోడినట్లు"

---

11. చొక్కనాధ చరిత్ర. పుట 98
12. చొక్కనాధ చరిత్ర. పుట 100.
13. చొక్కనాధ చరిత్ర. పుట 177.
14. చొక్కనాధ చరిత్ర. పుట 218.
15 చొక్కనాధ చరిత్ర. పుట 336.

16. అఱువది నాలుగవ లీల - నవమాశ్వాసములో వైశ్య వనిత తన భర్తను బ్రతికించుమని చొక్కనాధుని ప్రార్థించిన సమయమున :

'రతితోడఁ బతిభిక్ష రతిదేవి వేడ
నతనుని బ్రతికించి యనిపిన యట్లు
శతరూప పురుష భిక్షము బెట్టుమనిన
బ్రతికించి దక్షునిఁ బాలించినట్లు
పరమేశ! యీ సెట్టి బ్రతికించి నాకు
పురుష భిక్షము వెట్టి ప్రోవక యున్న"

17. చొక్కనాధ చరిత్రమునందు సప్తమాశ్వాసములోని నలువది యేడవ లీలలో కొలనును వర్ణించుచు తిరువేంగళ కవి

"ఘనమైన యొక మహా కమలాకరమ్ము
పురణించు వైకుంఠ పురమునుఁ బోలె" అను పాదముల నుండి
"మునుకొని బహుశిలీ ముఖములు గలిగి
కడునుత్తమాశ్వ లక్షణముల బోలె" అను చరణముల వరకు మాలోపమాలంకారమును పోషించినాడు.

## ఉత్ప్రేక్షాలంకారములు

1. ప్రథమాశ్వాసములోని మొదటి లీలలో ఇంద్రుడు విశ్వకర్మచే పురమును నిర్మింప జేసిన సందర్భమున :

"తమమదంబులు బృంహితమ్ము వర్జించి
గములుగా నాశరత్కాల భయమున
నీలమేఘములిందు నిగిడెనో యనగ
జాలెడు మత్తేభ సంఘముల్ గలిగి"

2. ద్వితీయాశ్వాసములోని నాలుగవ లీలలో తిరువేంగళ కవి సూర్యాస్తమయమును వర్ణించుచు :

"చక్రాన చక్ర పుష్కరిణి గావించి
చక్రి యుద్ధతతపశ్చరణం బొనర్ప
నాలోనఁబ్రత్యక్షమై వచ్చి చూచి
కాలకంఠుడు శిరః కంపమ్ము సేయ
జవమునఁగీలూడి జాఱిన యట్టి

---

16. చొక్కనాధ చరిత్ర. పుట 351.
17. చొక్కనాధ చరిత్ర. పుట 247, 248లు.
1. చొక్కనాధ చరిత్ర. పుట 27.
2. చొక్కనాధ చరిత్ర. పుట 37.

నవరత్న కర్ణ కుండలములో యనగ
నరవిందములు క్రుక్క నసురులింపెక్క
నరుణాంశుడల పశ్చిమాంబుధి వ్రాలె"

3. ద్వితీయాశ్వాసములోని నాలుగవ లీలలో గల చంద్రోదయ వర్ణనలో
"ప్రాచిదిగ్భామిని పాటించి నీడ
చూచు దర్పణమన శోభితంబగుచు
..........................................
..........................................
వేలుపులకు బువ్వ వెన్నెల కువ్వ
బాల చంద్రుడు పూర్వశైలమ్మునెక్కె"

4. ద్వితీయాశ్వాసములోని నాలుగవ లీలలో సూర్యోదయమును వర్ణించునప్పుడు :
"దివిజేంద్రు మేడపై దీపించునట్టి
పదియాఱు వన్నెయౌ బంగారు తోడఁ
గుదురైన మాణిక్య కుంభమోయనగ
..........................................
..........................................
కలువల పగవాడు గ్రహముల ఱేడు
నలరి భానుడు నుదయాచలం బెక్కె".

5. తృతీయాశ్వాసములోని పదునొకండవ లీలలో తటాతక గర్భ చిహ్నములను వర్ణించిన సందర్భమున :
"భవునంశమగుట నాభవు మెదకప్పు
నవకమై గంభీర నాభిక వెదలి
యమున నాఁగాళిమ నందెనే యనగ
గమలాక్షి నూఁగారు కార్కొనఁదొడఁగె"

6. అదే సందర్భమున
"తన కుమారుని కీర్తి ధరనిట్లు పర్వు
ననునట్లు వెల్ల నాయెను నింతి మోము"

---

3. చొక్కనాథ చరిత్ర. పుటలు 37, 38.
4. చొక్కనాథ చరిత్ర పుట 39.
5. చొక్కనాథ చరిత్ర. పుట 74.
6. చొక్కనాథ చరిత్ర. పుట 74.

7. తృతీయాశ్వాసములోని పదునాలుగవ లీలలో వర్ష వర్ణనమున :
"దారుణ కరవాల ధారలో యనఁగ
కాఱు మెఱుంగు లొక్కట పిక్కటిల్లె."

8. అదే వర్ణనమున
"మునుకొని చాప విముక్తంబులైన
ఘనతర సిత సాయకంబులో యనగ
మొనసి శంపాజాలములు గాఁగబట్టి
గొనకొని వర్షించె కుంభ వర్షములు"

9. తృతీయాశ్వాసములోని పదునైదవ లీలలో చంద్రోదయ వర్ణనమున :
"ఆ పూర్వదిగ్భామ యళిక భాగమున
దీపించుఁగర్పూర తిలకమో యనఁగ
బదియాఱు కళలతో భాసురంబుగను
మొదలి దిక్కునను సోముడుఁదేజరిల్లె"

10. సప్తమాశ్వాసములోని నలువది రెండవ లీలలో బాణుని భక్తిని పరీక్షింప నెంచి చొక్కనాథుడు వర్షము గురియించిన సందర్భమున :
"............... నాకాశమ్ము విఱిగి
పడియెనో యనఁజాలు ప్రళయ మారుతము
వడగండ్ల వానయు వచ్చె ............."

ఉపమ, ఉత్ప్రేక్షలు రెండు గలిసియున్న ద్విపదలు గూడా కొన్ని యిందు కన్పించు చున్నవి.

1. ద్వితీయాశ్వాసములోని నాలుగవ లీలలో
"మెలగెడు విటజన మృగములఁబట్ట
వలరాజు వైచిన వలయోయనంగఁ
బిండిజల్లిన యట్లు పేర్చి యెల్లెడల
నిండు వెన్నెల భూమి నిండంగ బర్వె"

2. ద్వితీయాశ్వాసములోని ఆఱవ లీలలో తటాతక కళ్యాణ సమయమున
"తఱచగు నురుకుచద్వయమున నడుము
విఱుగునో యని కట్టు వేసినయట్లు

---

7. చొక్కనాథ చరిత్ర. పుట 88.
8. చొక్కనాథ చరిత్ర. పుట 88
9. చొక్కనాథ చరిత్ర. పుట 98.
10. చొక్కనాథ చరిత్ర. పుట 219.
1. చొక్కనాథ చరిత్ర. పుట 38.
2. చొక్కనాథ చరిత్ర. పుట 60.

నవరత్న కింకిణీ నవమౌక్తికములు
తవనిల్లు పసిడీ యొడ్డాణమ్ము నిడిరి"

3. పంచమాశ్వాసములోని ఇఱువది తొమ్మిదవ లీలలో సుందర సామంతుడను తన భక్తుని రక్షించుటకై చొక్కనాథుడు రాహుత్తుడై వచ్చి పౌజు జూపిన సందర్భమున:

"ఎల్లరు గొలువంగ నేతెంచు పౌజు
తెల్లనప్పుడు మహోద్రేకమ్ము గాఁగ
నేలయీనిన యట్లు నీరధులెల్ల
చాల ఘోషము తోడ సాగెనే యనగ"

## స్వభావోక్త్యలంకారములు

1. చొక్కనాథ చరిత్రములోని పంచమాశ్వాసమున, ముప్పది యొకటవ లీలలో చొక్కనాథుడు గాజులసెట్టియై వైశ్య వీధి కేతెంచిన సందర్భమున :

"............ ఓ గాజుల సెట్టి
రావేయటంచును రమణతో బిలిచి
గాజులెన్నేని, రూకకుఁజెప్పు మంచి
గాజులు దొడుగు నీకలలెక్కలిత్తు
మనినను నా సెట్టి యపుడు నెయ్యార
మునను గంబళి వైచి బుజమునఁబొదియుఁ
గంబళి పై బెట్టి కరముల భూష
ణంబులన్నియు నూడ్చి నవ్య మోహినుల
చేనెటికలు దీసి చేతులు పిసికి
యైన గాజులు జేర్చియట జోడు గూర్చి
పడుచుల కెల్లను భావముల్ కలఁగఁ
దొడిగెను వారి చేతులు నొక్కి నొక్కి"

2. షష్ఠాశ్వాసములోని ముప్పది మూడవ లీలలో కాడ్వెట్టియను చోళరాజుకు చొక్కనాథుడు దర్శనమిచ్చు సందర్భమున :

"భానుడస్త్రాది జూపట్టిన దిశల
పూని సంధ్యారాగ పుంజమ్ము లెసఁగె
నుడుపంక్తులెల్ల నత్యున్నతమ్ముగను
బొడిచె నాకాశ సంపూర్ణమ్ము గాను
బంధురధ్వాంతమ్ము ప్రబలె నంతటను".

---

3. చొక్కనాథ చరిత్ర. పుట 152.

1 చొక్కనాథ చరిత్ర. పుట 162.

2. చొక్కనాథ చరిత్ర. పుట 173.

3. సప్తమాశ్వాసములోని నలువది యేడవ లీలలో నున్న అనావృష్టి వర్ణనలో
"ధరనిట్లు బర్వె నా తప మహాబుతువు
గుంట కాలువ లెల్ల కూపముల్ చెఱువు
లంట పట్టెను సైకతావాలమగుఁచు
గాఁగెఁ గుళీరముల్ గరఁగె గర్కటము
వేఁగె కచ్ఛపములు వెచ్చె మచ్చెములు
తూలెను మకరముల్ దునిసె సర్పములు
సోలెను మృగపంక్తి సొరిగెఁ బక్షులును
స్రుక్కిరి యమరులు సురిగిరి ప్రజలు
చిక్కె భూతగణమ్ము చిట్లె శైలములు
కాఁకయ్యె వనములు గమల సంయములు
నింకె వారిధులుడు కెత్తె నంబరము
వ్రయ్యలయ్యె ధరిత్రి వ్రస్సెనాకసము"

## అతిశయోక్త్యలంకారములు

1. షష్ఠాశ్వాసములోని ముప్పది మూడవ లీలలో వైఖానదిని వర్ణించు పట్టున:
"................ నావైఖ ప్రవాహ
మచ్చోటనద్దమై యద్భుతంబెసగ
కూలంబులను మించి ఘూర్ణిత ధ్వనుల
లాలిత ఫేన జాలమ్ముల నెఱసి
కడునున్నతమ్ముగా గగనమ్ము నొరయ
నెడలేని యూర్ముల య్యెడముక్తి సతికిఁ
బరగంగ సోపానపంక్తులుగాగ
మఱిసుళ్లచేతఁ గూర్మముగాన రాఁగఁ
దుంపిళ్లు గుఱియుచుఁ దొడరి సౌందర్య
సంపున జనలోక పావనంబైన
యా పుణ్యనది పాఱు................

2. సప్తమాశ్వాసములోని నలువది యేడవలీలలో అవగ్రహవర్ణనలో
"భూచరులంబరంబును గోరుచుండ
ఖేచరులాధాత్రికిని బోదమనగ
భూచరాధిపులు ద్యోభూమిమేలనగ

---

3. చొక్కనాథ చరిత్ర. పుట 247.
1. చొక్కనాథ చరిత్ర. పుట 171.
2. చొక్కనాథ చరిత్ర. పుట 247.

నీ చందమున ధాత్రి యెల్ల పేటిల్ల
నీరు నీరిని గోర నిబిడ మారుతము
మారుతమ్మును గోర మహితరువ్రజము
తరువుల నీడ లెంతయు వేడ్కఁ గోర
ధర నిట్లు బర్వెనాతప మహాఋతువు.

**క్రమాలంకారములు**

1. తృతీయాశ్వాసములోని పదునొకండవ లీలలో
"వరుస బ్రహ్మ క్షత వైశ్య శూద్రులకు
ధర శర్మవర్మ గుప్తలు దాసులనెడి"-

2. ద్వితీయాశ్వాసములోని ఏడవలీలలో తటాతక కళ్యాణమున కేతెంచిన ఆహూతు లెక్కడి వారక్కడికి వెడలిపోయినారని చెప్పెడి సందర్భమున
"హరిని విరించిని నమరవల్లభుని
సురముని ప్రతతులు శోభిల్లునట్లు
మణిమయ భూషణాంబరము లిప్పించి
కణఁకతో వారలఁ గరుణించి పంపె
ననిపిన వారలు నతి భక్తితోడ
ననుపమాండజవాహనారూఢులగుచు
వైకుంఠమునకేఁగె వైకుంఠ విభుఁడు
లోకేశుఁడా సత్యలోకమ్ము కరిగె
నాగాజ మహిష సన్మత్స్య సద్ధరిణ
వేగాశ్వ వృషవాహ విధృతులై వేడ్క
నమరావతికి నేగె నమర వల్లభుడు
నమర నర్చిష్మతికరిగెఁ బావకుఁడు
నంతకుఁడేఁగె సంయమి పురమ్మునకు
నంత నైరుతియుఁ బుణ్యవతికి నరిగె
నాయంబుపతియేగె నమలావతికిని
వాయువుచనె గంధవతి పురమ్మునకు
నా శంభు సఖుఁడు దానలకకుఁ గదలె
నీ శానుఁ డరిగె నాయీశానపురికి
హర్షమ్ముతోడ సంయమి ముఖ్యులెల్ల
నరిగిరి తమతమ యాశ్రమంబులకు

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 77,78
2. చొక్కనాథ చరిత్ర. పుట 65.

**ఉత్ప్రేక్షాలంకారము**

11. తృతీయాశ్వాసములోని పదునాలుగవలీలలో ఇంద్రోగ్రుల యుద్ధ సందర్భమున:

"పడమటఁ దూర్పునఁ బ్రాపించినట్టి
జడధులు దలపడు చందమ్ము దోఁప
బలభేది సేనలు పాండ్యసేనలును
దల కొని ద్వంద్వ యుద్ధము సేయుచుండ.

పై పరిశీలనానంతరము తిరువేంగళకవి అర్థాలంకారములలో ఉపమ, ఉత్ప్రేక్షలనే ఎక్కువగా తన కావ్యమున నుపయోగించినాడని తక్కిన అలంకారములనత్యల్పముగా నుపయోగించినాడని చెప్పవచ్చును. చొక్కనాథ చరిత్రమునందు అర్థాలంకారములకన్న శబ్దాలంకారములనే అధికముగా వాడినట్లు నిర్ణయింపవచ్చును.

## చొక్కనాథ చరిత్రము – శైలి

వాఙ్మయము ప్రధానముగా మూడు శాఖలకు చెందియుండును. ఆ మూడిటిలో మొదటిది అఖ్యానము. (Narrative) రెండవది నాటకము (Dramatic) మూడవది వర్ణనము. (Description) కథన రూపమున చెప్పబడిన కావ్యములన్నియు అఖ్యానములు. వాటి సరణి అఖ్యానశైలి. సంవాద రూపమున చెప్పబడిన కావ్యములన్నియు నాటకములు. వాటి సరణి నాటకీయశైలి, కథనమునకు గాని సంవాదమునకు గాని ఆధారమైన ఇతివృత్తమేదియు లేకుండ కేవలము ఒక మనోభావము యొక్క గాని ఒక రమణీయ పదార్థము యొక్కగాని ప్రపంచనము కల రచనలు వర్ణనలు. అట్టి వర్ణనలలో ఇతివృత్తము పెంచి రచించిన కావ్యముల సరణి వర్ణనాత్మకశైలి.[1]

ఈమూడును ఒండొంటికి సంబంధములేని ప్రత్యేక లోకములు కావు. అఖ్యానములలో సంవాదములు గాని వర్ణనలుగాని యుండవని అనుకొనరాదు. అట్లు నాటకీయశైలి గల కావ్యమున అఖ్యాన శైలి యుండదనియు తలపరాదు. ఏ కావ్యమున ఏ సరణి ఎక్కువగా భాసిల్లునో ఆ ప్రాధాన్యమును బట్టి ఆ శైలిని స్థూలముగా నిర్ధారణ చేయుటయే గాని కేవలము ఆ గుణము ఒక్కటే కలదని అభిప్రాయము కాదు.[2]

చొక్కనాథ చరిత్రమునందలి శైలి ప్రధానముగా అఖ్యానశైలి. ఇందలి కొన్ని లీలలో ప్రత్యేకముగా అఖ్యాన శైలి, కొన్నిటిలో వర్ణనాత్మకశైలి, మఱికొన్నిటిలో ఈ రెండు, వీటితోపాటు, సంవాదశైలి కూడా కొన్ని లీలలలో కన్పించుచున్నది.

ఈ కావ్యము నందలి 2, 3, 5, 7, 8, 9, 10, 16, 18 నుండి 30 వరకు, 31 నుండి 33 వరకు, 35 నుండి 39 వరకు, 41, 43 నుండి 46 వరకు, 48 నుండి

---

11. చొక్కనాథ చరిత్ర. పుట 90.
1. ఆంధ్ర సాహిత్య చరిత్ర. పుట 54.
2. ఆంధ్ర సాహిత్య చరిత్ర. పుట 54.

55 వరకు, 62 నుండి 64 వరకు గల లీలలు ఆఖ్యానశైలికి, 1, 4, 6, 11 నుండి 15 వరకు, 17 వలీల వర్ణనాత్మకశైలికి చెందియున్నవి. 34, 40, 47, 56 నుండి 61 వరకు గల లీలలలో ఆఖ్యానముతో పాటు వర్ణనలు ఉన్నవి. 31, 52 ఇత్యాది లీలలలో సంవాదశైలి కూడా కలదు.

స్థూలముగా తిరువేంగళకవి శైలిని తెలుపుటకు ఈ క్రింది పంక్తుల నుదహరించుచున్నాను.

సప్తమాశ్వాసములోని నలువది యేడవలీలలో కొలనును వర్ణించుచు-

"ఘనమైన యొక మహాకమలాకరమ్ము
పురణించు వైకుంఠ పురమునుబోలె
నరుదైన వేడ్క శ్రీహరి యుక్తమగుచుఁ
గమల నాభుని దివ్య కరములఁబోలెఁ
గమనీయ శంఖ చక్ర స్థిత మగుచు
సన్నుత విహగేంద్ర చరితమ్ము వోలె
పన్నగ గజ కచ్ఛపమ్ములు గలిగి
వినుతింప దేవేంద్రు వీడును బోలె
యనిమిషాహార విహారమ్ము గలిగి
ప్రకటిత నక్షత్ర పథమును బోలె
మకర కర్కట మీన మండలి గలిగి
యనుపమరాజ చిహ్నమ్ముల వోలె
ఘనతర పుండరీకమ్ములు గలిగి
యమృతాబ్ధిమథన విహారమ్మువోలె
రమణీయ సుమనోను రాగమ్ము[1] గలిగి.
దారుణమ్మైన కాంతారమ్ము వోలె
సారంగ పటల సంచారమ్ము గలిగి
యరుదైన శైల గహ్వరముల వోలెఁ
దిరముగాఁ గేసరోద్దీర్ణమ్ము గలిగి
మహనీయ పుణ్యాశ్రమంబును వోలె
నహరహమ్మును నేటి హంసలు గలిగి
కలిత భూపాంగనా కరముల వోలెఁ
బొలుపొందఁ గంకణ స్ఫురణమ్ము గలిగి
జననుతమ్మగు దివ్యశరధియుఁబోలె

1. పాఠాంతరం. సుమనసరాగమ్ము.

మునుకొని బహుశిలీ ముఖములు గలిగి
* { కడునుత్తమాశ్వ లక్షణములఁ బోలె
పడిమించు ఘన తరావర్తముల్ గలిగి }
చెన్నొందు నా సరసీరుహాకరము."[1].

## పూర్వకవ్యనుకరణము

కావ్య ప్రకాశ కర్తయగు మమ్మటుడు ఈ క్రింది శ్లోకమున;

శక్తి ర్నిపుణతా లోక శాస్త్ర కావ్యాద్యవేక్షణాత్।
కావ్యజ్ఞ శిక్షయాభ్యాస ఇతిహేతుస్త దుద్భవే"॥.

శక్తి; లోక శాస్త్ర కావ్యాద్యవేక్షణము వలన గలిగిన నైపుణ్యము; కావ్యజ్ఞులైన పెద్దల శిక్షను బొంది తదనుకూలముగా నభ్యాసమొనర్చుట[2] అను మూడును గలిసి కావ్యహేతువులగునని చెప్పియున్నాడు. ఈ శక్తినే అభినవగుప్తుడు 'ప్రజ్ఞ' యని పేర్కొనగ[3] భామహుడు ఈ ప్రజ్ఞయే 'ప్రతిభ' యని వ్యవహరించినాడు[4]. కావున నీ ప్రతిభ కావ్యహేతువులలో మొదటిది; దీని తరువాతిది నిపుణత. అనగా 'వ్యుత్పత్తి' లేక 'పాండిత్యము' ఇది లోక, శాస్త్ర, కావ్యాద్యవేక్షణము వలన గలుగునది. అనగా లోకమును, శాస్త్రములను, కావ్యాదులను పరిశీలించుట వలన కలుగు పాండిత్యము. మూడవది అభ్యాసము. కావ్యజ్ఞులైనవారి శిక్షణను పొంది స్వయముగా అభ్యసించుట. కవికి ఈ మూడును అత్యావశ్యకములైన కవితాసామగ్రులు.

సాధారణముగా ఒకానొక కాలములో జీవించిన ఒక కవి తనకు పూర్వులైన వారి కావ్యములను పరిశీలించి పాండిత్యమును సంపాదించుకొని కావ్యరచన కుపక్రమించును గాన తానభిమానించు కవి యొక్కయో లేదా కవుల యొక్కయో కావ్యములను అనుకరించుట జరుగును. ఇది తప్పని సరిగా జరుగవలెనను నియమము మాత్రము లేదు. కాని ఒక్కొక్కప్పుడు రచనలలో కొన్ని పోలికలగపడవచ్చును. పోలికలున్న మాత్రమున గ్రంథ చౌర్య మాపాదింపరాదు. ఏలన ప్రతిభావంతుల బుద్ధులు ఒకదానితో నొకటి పోలును. ఇది నైజము. ఈ పోలికలు మూడు విధములు.

1. ప్రతిబింబాకార సంవాదము. అనగా బింబమును వలె ప్రతిబింబమును సిద్ధము చేయుట[5]

---

* ఈ గుర్తుగల ద్విపద ముద్రిత గ్రంథమున లేదు. డి 1053 తాళపత్ర ప్రతిలోనిది.

1. చొక్కనాథ చరిత్ర. పుటలు 247, 248.
2. కావ్యాలంకార సంగ్రహము. పుట 119.
3. 'ప్రజ్ఞా, అపూర్వవస్తు నిర్మాణక్షమా'
4. 'ప్రజ్ఞా, నవనవోన్మేషశాలినీ ప్రతిభామతా'
5. కావ్యాలంకార సంగ్రహము. పుట 123.

2. ఆలేఖ్యా కార సంవాదము. అనగా ఒక చిత్తరువును వలె వేరొక చిత్తరువు పోలియున్న విధమున నితరుల కావ్య వస్తువును బోలియుండుట.[1]

3. దేహాంతర తుల్య సంవాదము. అనగా దేహాంతరమును దేహాంతరము పోలియున్న విధమున భావమునందుగాని, ప్రకరణము నందుగాని, విషయమునందుగాని పోలిక కనబడినను స్వాతంత్ర్యమును గోల్పోక సహజ సుందరమగు జీవముతో నాస్వాద్యమానమైయున్న కావ్య వస్తువు. దీని కాత్మయు, శరీరమును వేరుగా గలవు. మొదటిది వర్జనీయము. రెండవది మధ్యమము. మూడవది ఉపాదేయము[2].

తిరువేంగళకవి 'పూర్వకవ్యనుకరణము 'నాల్గు విధములుగా నగుపించుచున్నది. 1. శబ్దానుకరణము. 2. భావానుకరణము. 3. శైల్యనుకరణము. 4. రచనాశిల్పానుకరణము. ఈ కవి తనకు పూర్వులైన పాల్కురికి సోమన, శ్రీనాథాదికవులను అనుకరించినట్లు ఈ క్రింది ఆధారముల వలనఁ దెలియుచున్నది.

(1) చొక్కనాథ చరిత్రమున నవమాశ్వాసాంతమున (కావ్యాంతము) గల ఈ క్రింది ద్విపదలు బసవపురాణము నందలి ప్రథమాశ్వాసములోని ద్విపదలను బోలియున్నవి.

"చొక్కనాథా యన్న శుభములు సెందు
చొక్కనాథా యన్న క్షుద్రమ్ములుడుగు*
చొక్కనాథాయన్న సురుగు దోషములు
చొక్కనాథా యన్న సులభమ్ము ముక్తి
చొక్కనాథాయన్న సుగుణమ్ము గలుగు
చొక్కనాథాయన్న జూచు దారాద్రి
చొక్కనాథా యన్న శూరత్వమెసఁగు
చొక్కనాథా యన్న సురనాథుపదవి
వెయ్యేల శ్రీ చొక్క విభుడన్నజాలు
బాయు బ్రహ్మాత్యాది పాపమ్ములెల్ల[3]"
బసవ పురాణమందలి పంక్తులు.
బసవని శరణన్నఁ బాపక్షయంబు
బసవని శరణన్నఁ బరమ పావనము
బసవని శరణన్నఁ బ్రత్యక్ష సుఖము
బసవని శరణన్న భవరోగహరము
బసవని శరణన్న భక్తి సేకూరు

---

1. కావ్యాలంకార సంగ్రహము. పుట 123.
2 కావ్యాలంకార సంగ్రహము. పుట 124.
* ఈ గుర్తుగల ద్విపద డి 1051 కాగితపు ప్రతిలో క్రిందుమీదున్నవి.
3 చొక్కనాథ చరిత్ర పుట 363.

బసవని శరణన్న బంధముల్వాయు
బసవని శరణన్న భాగ్యముల్వొందు
బసవని శరణన్నఁ బరఁగు శీలంబు
బసవని శరణన్నఁ బాయు నాపదలు
బసవని శరణన్నఁ బ్రబలు సంపదలు
బసవని శరణన్న నసలారుఁ గీర్తి
బసవని శరణన్న ఫలియించు కోర్కి
బసవని శరణన్న నెసగు వాక్సిద్ధి
బసవని శరణన్న భ్రాజిల్లు బుద్ధి.
వేయేల తగ "బసవా' యనఁబరఁగు
నీ యక్షరత్రయంబిటులొక్కమాటు
చదువునెవ్వండేని ముదముతో నతని
వదనంబు శివునకుఁ గుదురు దాననగఁ
బాయక బసవనిఁ బ్రస్తుతించినను
బాయుట సోద్యమే భవ బంధనముల్1

బసవ పురాణము నందలి పై పంక్తులు కావ్య రచన కుపక్రమించుచు వ్రాసినవి గాన ఎసగు వాక్సిద్ధి, భ్రాజిల్లు బుద్ధి ఇత్యాది పదములందున్నవి. చొక్కనాథ చరిత్రము నందలి పంక్తులు కావ్యాంతమున వ్రాయబడినవి గాన వీనికి బదులుగా బ్రహ్మాత్యాది పాపములు బాయునని యున్నవి.

చొక్కనాథ చరిత్రము నందలి ద్విపదలలోని ఎత్తుగడ "చొక్కనాథాయన్న" యనునది బసవపురాణములోని "బసవని శరణన్న' అను ఎత్తుగడను బోలియున్నది.

చొక్కనాథ చరిత్రలోని ద్విపదల ముగింపులో 'వేయేల శ్రీ చొక్కవిభుడన్న జాలు' నను చరణము బసవపురాణములోని 'వేయేల తగ బసవాయనబరగు", అను పాదమును బోలియున్నది.

బసవపురాణ రచనకు పూనుకొనుచు పాల్కురికి సోమన బసవని పై భక్త్యావేశమున వరుసగా పదునాల్గు చరణములు 'బసవని శరణన్న' అను ఎత్తుగడతో రచించగా, తిరువేంగళకవి కావ్యరచన నుపశమించుచు 'చొక్కనాథాయన్న' అను ఎత్తుగడతో ఎనమిది ద్విపదలు వ్రాసినాడు. పైనుదహరించిన చొక్కనాథ చరిత్రము నందలి ద్విపదల రచనాశైలి బసవపురాణమునందలి ద్విపదల రచనా శైలి ననుకరించియున్నవి.

(ii) చొక్కనాథ చరిత్ర కావ్యాంతమున తిరువేంగళకవి 'హాలాస్యనాథుడు రక్షించు భక్తుల పేర్లను ఇరువది యొక్క ద్విపదలలో రచించినాడు2. ఇది బసవ పురాణమున

1. బసవ పురాణము. పుటలు 9, 10. ద్విపదలు 190-209 వరకు.
2. చొక్కనాథ చరిత్ర. పుటలు 361, 362.

సప్తమాశ్వాసము 'కళ్యాణ పురమునగల భక్తులు ' అను శీర్షిక క్రింది పేర్లపట్టికవలె నున్నది.[1] బసవపురాణమందలి భక్తుల పేర్లు కొన్ని చొక్కనాథ చరిత్రము నందు పేర్కొనబడివి. దీనిని శబ్దానుకరణముగానో భావానుకరణముగానో చెప్పుటకు వీలులేదు. కాని రచనా శిల్పానుకరణము క్రింద పేర్కొనవచ్చును.

(III) చొక్కనాథ చరిత్రమునందలి నవమాశ్వాసములోని అరువది యవ, అరువది యొకటవ లీలలలో నున్న జ్ఞాన సంబంధుని కథ బసవపురాణమున కూడా నున్నది. అందు షష్ఠాశ్వాసమున పిళ్లనైనారు కథ అను పేరున గలదు. ఈ క్రింది అంశములలో జ్ఞాన సంబంధుని కథ పిళ్లనైనారు కథ ననుసరించి యున్నది.

(1) కుబ్జపాండ్యుని భార్యపేరు 'వనితేశ్వరి' యని హాలాస్యమాహాత్మ్యమున నుండగా చొక్కనాథ చరిత్రమున తిరువేంగళ కవి ఈమెను 'మంగయకర్త' అని బసవపురాణముననుసరించి పేర్కొన్నాడు. బసవపురాణము ''మంగయక్కరసి' అని యున్నది.[2] దీనిని శబ్దానుకరణముగ చెప్పవచ్చును.

(2) జ్ఞాన సంబంధుడు పసిబాలుడుగా నున్నప్పుడు పార్వతీదేవి స్తన్య మిచ్చిన వృత్తాంతము పిళ్లనైనారు కథలోనిట్లున్నది.

''మఱియు శ్రీకాళి నా మహినొప్పు పురిని
నెఱి శివ బ్రాహ్మణునికి నుదయించె
నలరికుమారుని యంశంబునందు
నలు వొప్పగాఁ బిళ్ల నయనారనంగ
జనకుడర్కట బెట్టి కొని యొకనాడు
చని సరోవర తీరమున బాలు నునిచి
తానఘమర్షణ స్నానంబు చేయ
గానభోవీధిని గౌరియుఁ శివుఁడు
మానిత దివ్య విమాన నిరూఢ
యానులై చనిచనిఁ యల్లబాలుండు
మనకుమారుని యట్ల' యనుచు నగ్గిరజ
కనుఁగవఁ జూచుడుఁ జనుఁ గవ సేఁప
నవనీతలంబున కరుదెంచి బాలుఁ
గవుగిటజేర్చి కూకఁటి పుడుకుచును.
దేవి దాశాంభవ దీక్షితుఁజేసి
భావించి శివభక్తిపరుని గావించి
కడుపారఁ జనుఁ బాలు గుడిపి పసిండి

1. బసవపురాణము, పుటలు 536, 537, 538.

2. బసవ పురాణము. పుట 414.

కుడుకతో వెండియుఁగొన్ని సేనిచ్చి
గౌరి దానీశ్వరుకడ కేగె నంత"[1]

ఈ వృత్తాంతమును తిరువేంగళకవి తన చొక్కనాథ చరిత్రమున నిట్లు వ్రాసినాడు.

"మునులార! యాచోళ భూమిలోపలను
ననుపమంబైన శియ్యాలూరి యందు
నుండును నొక బ్రాహ్మణోత్తముండతఁడు
కౌండిన్య గోత్రుండు ఘనశైవవరుఁడు
నాతని గర్భమ్మునందున మిగుల
ఖ్యాతిగాఁ బ్రమధనాయకుఁడాది కార
ణంబుగా జనియించి నడచి యాడుచును
నంబ వెంటను నేటికరుగుచో నచట
యశరీరియై వచ్చియా జగదంబ
శిశువును గాంచి యంచితమైన తనదు
పసిఁడి కుండల బోలు పాలిండ్ల పాలు
పసిదీఱద్రావించి భక్తివిచ్చేసె"[2]

జ్ఞాన సంబంధుడు బాలుడుగా నున్నప్పుడు పార్వతీదేవి స్తన్యమిచ్చెనని మాత్రమే హాలాస్యమాహాత్మ్యముననున్నది గాని ఏ సందర్భమున నిచ్చినదో అందులేదు. తిరువేంగళకవి బసవ పురాణమునందలి పై ద్విపదలను జదివి కొంత మార్చి చొక్కనాథ చరిత్రమున రచించినట్లుఁ దెలియు చున్నది. ఇది భావానుకరణమునకు తార్కాణము.

(IV) చొక్కనాథ చరిత్రమందలి తొమ్మిదవ యాశ్వాసములోని అరువది నాలుగవ లీల యందు అగస్త్యుడు మునులకు చెప్పిన పతివ్రతాచార ధర్మములు శ్రీనాధుని కాశీఖండమందలి ద్వితీయాశ్వాసమున బృహస్పతి కార్యార్థియై వచ్చినప్పుడు అగస్త్యుని భార్యయైన లోపాముద్ర కుపదేశించిన పతివ్రతాచార-ధర్మములను బోలియున్నవి.

(1) "మఱి భర్త తన్ను రమ్మన వేగ వచ్చి
గరిమజెప్పిన యూడిగము సేయవలయు
నాత్మేశుడానతియక యేమియైన
నాత్మబంధువులకు నీయఁగ రాదుసతికి
జీవితేశ్వరుడు డించిన యోగిరమ్ము
కేవలంబది యారగింపగ వలయు
మగఁడారగించిన మఱిభుజియింపఁ
దగు నిద్రవోకుండఁ దగదునునిద్ర

1. బసవ పురాణము. పుటలు 409, 410
2. చొక్కనాథ చరిత్ర. పుట 319.

తటుకున నాథు నిద్రయులేపరాదు
నట యనుష్ఠాన సంధ్యావేళ గాని
యెడగల్గ నొంటిమై నేగంగ రాదు
కడపపై మఱిత్రాయి గద్దపై సన్ని
కంటిపై గూర్చుండగారాదు నెపుడు
నంటు గట్టక నీళ్ల నాడంగరాదు."[1]

చొక్కనాథ చరిత్రములోని పై ద్విపదలు కాశీ ఖండములోని ఈ క్రింది సీసపద్యము ననుకరించి వ్రాసియున్నవి.

సీ. "పతిబిల్వబంచిన పనియేమి యనివచ్చి
చెప్పిన యుడిగంబు సేయవలయు
భర్తయానతిలేక ప్రకృతి బంధునకైన
నే పదార్థంబును నీగి వెట్ట
జీవితేశ్వరుడు డించిన యోగిరంబును
గుత్ససేయక భుక్తి గొనగఁ దగవు.
సుఖసుప్తుడగు నిజేశునిఁ బ్రబోధమొనర్ప
గాదనుష్ఠాన భంగముల దప్ప
తే॥గీ॥ నొంటి నెచ్చోటి కరుగుట యుక్తిగాదు
తడుపు గట్టక నీరాడఁ దగవు గాదు
కడప మీదను మఱి సన్నెకంటి మీదఁ
జక్కి మీదను గూర్చుండ జాదగాదు.[2]

శ్రీనాథుని పై సీసపద్యమందలి సీసభాగమునకు మొదటి అయిదు ద్విపదలు, గీత భాగమునకు చివరి రెండు ద్విపదలు అనుకరణములు.

(2) "పసుపుఁగుంకుమయుఁ గూర్పాసమ్ముకబరి
కుసుమంబు చెవుల యాకులు కాళికయును
ధరమంగళాలంకృతంబులు దినము
ధరియింపనెప్పుడు 'ధవుఁడు వరిల్లు".[3] అను నీ రెండు ద్విపదలు కాశీఖండములోని ఈ క్రింది పద్యమునకు అనుకరణములు.

మ. "పసపుం గుంకుమ కజ్జలంబు నును గూర్పాసంబు తాంబూలముం
గుసుమంబుల్ కబరీ భరంబు చెవి యాకుల్ మంగళాలంకృతుల్

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 353.
2. కాశీఖండము, ద్వితీయాశ్వాసము 75వ పద్యము.
3. చొక్కనాథ చరిత్ర. పుట 353.

ఏసువెక్కింతయు లేక తాల్పవలయున్ వీనిన్ సదాకాలమున్
ససిదక్కంగఁ బ్రియుండు వర్ధిలుటకై నాళీకపత్రాక్షికిన్.[1]

తిరువేంగళ కవి పై పద్యములోని మొదటి రెండు పాదములు మొదటి ద్విపదగాను, తర్వాతి రెండు చరణములు రెండవ ద్విపదగాను వ్రాసినాడు.

(3) "విధవతోఁ దక్కిన వేశ్యతోడుతను
సధిక సురాపాని వ్యభిచారి తోడ
మడి వాలుదానితో మగనితోఁ బోరు
చేడెతోఁ బరిచర్య సేయంగ రాదు"[2]

పై ద్విపదలు ఈ క్రింది శ్రీనాథుని పద్యములోని మూడు పాదములకు అనుకరణములు.

తే॥ గీ॥ రజకి తోడ సుదక్యతో శ్రమణతోడ
విధవతో నాథుతో రాయు వెలదితోడఁ
జెడిపెతోడఁ జోరాములు సేయవలదు.
ప్రాణ సంకటములనుఁ బుణ్యాంగనలకు[3].

(4) "దూరమ్ము చన్న నాథుని కెదురెదురు
గోరుచు నుండంగఁ గొన్నాళ్లకెదురు
వచ్చిన భర్తకు వడి పాదయుగళ
మచ్చుగా గడిగి యాహారమ్ము వెట్టి
యుల్లమ్ము రంజిల్ల నొగివిడెమిచ్చి
చల్లగా మృదువైన శయ్యాతలమ్ము
నత్తతి యూరుల నందందయొత్తి
చిత్తమ్ము రంజిల్ల జేయంగ వలయు"[4]

పై తిరువేంగళ కవి ద్విపదలు ఈ క్రింది శ్రీనాథుని పద్యమునకు అనుసరణములు-

ఉ. "దూరమువేయి యొండబడి దూపిలి వచ్చిన ప్రాణనాథునిన్
ద్వారకవాట దేహళుల దాకనెదుర్కొని తీర్థమార్చి యా
హారము వెట్టి వీడ్యము సమర్పణజేసి విహారశయ్యపై
నూరువులొత్తి చిత్తమున కుబ్బొనరించుట ధర్మమింతికిన్.[5]

(5) "ఈ గుణమ్ములు గల యిల్లాలిఁ జూచి
బాగైన ఘన పుణ్యభామిని యండ్రు

---

1. కాశీఖండము, ద్వితీయాశ్వాసము. 73వ పద్యము.
2. చొక్కనాథ చరిత్ర. పుట 353.
3. కాశీఖండము. ద్వితీయాశ్వాసము. 74వ పద్యము.
4. చొక్కనాథ చరిత్ర పుటలు 353, 354.
5. కాశీఖండము. ద్వితీయాశ్వాసము 81వ పద్యము

వేయేల నిట్టి సాధ్విని నెవ్వఁ డేని
పాయని వేడ్క నపాంగమ్ము నందుఁ
బలుమారు నాత్మలోపలఁ దప్పఁ జూచు
నల ద్రోహియైన దురాత్ముని కెపుడు
బడబానలము కంటె పావకు కంటె
సతత పతివ్రతాచార ప్రభావ
మతి తీవ్రమై తాఁకు నాసాధ్వి చూపు
పాలిండ్లపై నున్న పయ్యెదమీఁద
గాలిపాఱగ నేడు కడు జేతులెత్తు
నని పతివ్రత లక్షణముల్కు................ '

పై తిరువేంగళకవి ద్విపదలు ఈ క్రింది శ్రీనాధకవి పద్యములకు అనుకరణములుగా నున్నవి. ఆ పద్యములివి:

తే॥గీ॥ 'పెక్కు మాటల నిటు జాలి పెట్టనేల
సాధ్వి గర్హింప నొకడెట్టు చాలగలడు?
గంధ వాహంబు వెఱచు నక్కలువకంటి
పసపు పయ్యెద పాలిండ్లఁ బాయఁదట్ట''

తే॥ గీ॥ ఔర! శిఖికంటె జము కంటె నర్కుకంటెఁ
బిడుగు కంటెను దీవ్రమై బిఱుసు చూపు
నాత్మఁ దప్పగఁ దలచు దురాత్మకులకు
నహహా! పతిదేవత పతి వ్రతాతి శయము.[2]

తిరువేంగళకవి శ్రీనాధుని పద్యములలోని భావమును కొన్ని ఎడల ననుకరించినాడు. మరికొన్ని ఎడల శబ్దములను ఉన్నవి ఉన్నట్లు గా గ్రహించినాడు. దీనికి కారణము శ్రీనాధునిపై నీకవికి గల గౌరవము.

## తిరువేంగళకవి బహుముఖప్రజ్ఞ

పచ్చకప్పురపు తిరువేంగళరాజు కేవలము కావ్య పరిజ్ఞానము మాత్రమే యున్న కవి గాదు. ఈతడు చొక్కనాథ చరిత్రమునందు ఆయా సందర్భములలో వర్ణించిన స్వప్న, సాముద్రిక, సంగీత, యోగాది విషయములను బట్టి ఈ కవికి కేవల వ్యాకరణ చందోలంకారాది శాస్త్ర పరిజ్ఞానమే కాక స్వప్న శాస్త్ర, సాముద్రిక శాస్త్ర, సంగీత శాస్త్ర, యోగ శాస్త్రాది విజ్ఞానము కూడా యున్నట్లు తెలియుచున్నది. ఇది ఈయనకు గల బహుముఖ ప్రజ్ఞకు నిదర్శనము.

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 354.
1. కాశీఖండము. ద్వితీయాశ్వాసము. 88, 89వ పద్యములు.

## స్వప్నశాస్త్ర ప్రజ్ఞ

చొక్కనాథ చరిత్రమునందలి ద్వితీయాశ్వాసములోని నాలుగవ లీలలో మలయకేతన పాండ్యుని స్వప్న ఫలమును స్వప్నాగమశ్రేష్ఠులిట్లు వక్కానించిరని తిరువేంగళకవి స్వప్న శాస్త్ర విషయముల నిట్లు వ్రాసినాడు.

"కల యేర్పఱింతుము కడువృశ్చికములు
జలగలుంగఱచుట జయము లేదంద్రు
కప్పముట్టినఁ బాము గఱచిన నతడు
నష్ట పుత్రత్వము నభివృద్ధి గాంచుఁ
దలపేను దినుట మధ్యము దధిక్షీర
ములు ఘృతంబును రక్తములు ద్రావుటయును
గండలు దినుట తక్కక ప్రేవులెల్ల
నుండ లైపడ నివి యొగి మంచి దంద్రు
రుధిరంబు జలములు రూపించి కన్న
నధికమాయుష్యమ్ము నటమంటఁగన్న
గలిమి చేకూరును గలలందు మఱియుఁ
దెలుపులన్నియు మేలు దెలియంగనినుక
వెలిమిడి యెముకలు వెసనుప్పు ప్రత్తి
తలపంగ నివియెల్లఁ దక్కఁ దక్కినవి
మఱి గార్దభము మోటు మానెను బోతు
పఱువడితో నట్టెపట్టి యెక్కుటయుఁ
దిలలు నన్నము పిండితిన్నఁగీఁడొదవు
గలను నూనెయుఁద్రావఁ గడు రోగియగును
మదకరియును నీల మణి సంఘ మృగము
మదమును నుదక కుంభములు గోపురము
దైవ మంబుదములు ధరణియు యమున
కావలి నలుపెల్ల నట యొప్పదంద్రు
ఖరములు శాఖామృగంబులు ధూమ్ర
మొరయ భూత ప్రేతములు పిశాచములు
వాయస ఫేరవ శ్వాన గృధ్రములఁ
దాయెక్కఁగనుటయుఁ దనదు స్వప్నముల
నలర నాయూప దండారోహణంబు
లలముండనములు తైలాభ్యంజనములు
వెరసి యివ్విధమున విను విచారింప

మరణ సూచకములు మహిపాల మఱియుఁ
బొలుపొంద మొదటి జామునఁ గన్నకలల
ఫలమొకయేటి లోపలఁ గానబడును
రెండవ జాములారెన్నెలల ఫలించు
నిండ మూడవ జాము నెరిగన్న కలలు
మూణ్ణెల్ల ఫలియించు మొదలి వేకువను
బూనిన కలలెల్లఁ బొరి పదినాళ్ల
కచ్చట ఫలియించు ననువందమఱియుఁ
బచ్చని వృక్షమ్ముఁ బసవరాయనిని
ఘన తరాశ్వమ్ముల గజములమేడ
నెనయంగఁ గలలోన నెక్కినయట్టి
మనుజోత్తముఁడు సౌఖ్య మహిమల చేత
ఘనమహీ రాజ్యమ్ముఁ కడువేడ్కనేలు".[1]

ఈ వర్ణన మూలమునలేదు. అందు "రాజాప్రభాతే మంత్రిభ్య స్వప్నవృత్తాంతమ బ్రవీత్" "41" శృత్వాతేవిస్మితాస్సర్వే ప్రత్యూచుః పృధివీపతిం యధాభాషిత మీశేన కర్తవ్యం చ త్వయాతథా "42" ఏవముక్తేష్వమాత్యేషు"[2] అని మాత్రమే యున్నది. చొక్కనాధ చరిత్రమునందలి పై స్వప్న శాస్త్రవిషయములు కవికి గల స్వప్న శాస్త్ర విజ్ఞతకుఁ దార్కాణము.

## సాముద్రిక శాస్త్ర విజ్ఞానము

చొక్కనాధ చరిత్రము నందలి తృతీయాశ్వాసములోని పదునొకండవలీలలో తటాతకకు ఉగ్రుని యంశమున నుదయించిన కుమారుని సాముద్రిక లక్షణములను తిరువేంగళకవి సాముద్రిక శాస్త్రజ్ఞులచే నిట్లు చెప్పించినాడు.

"వెసనూట యెనిమిది వ్రేళ్ల సూత్రమునఁ
గొసరక నిలువెల్లఁ గొలిచి చూచినను
నెన్నంగ నొక్కవ్రేలెక్కుడున్నతడు
పన్నుగా సామ్రాజ్యపట్టంబు నేలు
ముక్కుఁ గన్నులు బుజంబులు జానుహనువు
లొక్కంట దీర్ఘమై యుండంగ వలయు
గళమును జంఘాయుగంబు మేఢ్రంబు
లలవడ హ్రస్వంబులై యుండవలయు.

---

1. చొక్కనాధ చరిత్ర. పుటలు 41, 42.
2. హాలాస్యమాహాత్మ్యము. పుట 39.

నధ రోష్ఠ జిహ్వాలు హస్త మంఘ్రులును
నధిక నఖములఁగెంపైన ధన్యుండు
మొగముఁగటి స్కంధములును గరోరు
యుగముఁ గుక్షియు ఫాలమున్నతి మేలు
నెడపక భ్రూమధ్యమెవరికైనఁ
గడు ప్రదక్షిణరేఖ గలిగిననతడు
చేకొని చతురబ్ధి సీమలు జేర
నేకాత పత్రమై యేలంగఁగలఁడు
పదములు మృదువయ్యుఁ బాణిద్వయమ్ము
నది కఠినమ్మును నైయుండలెస్స
కటియు నిటలము వక్షస్స్థలమక్షు
లట విస్తృతములైన నధికు డౌనతడు
గడు నాయు రవసాన కాలమ్ము దెలియఁ
దొడరి చెప్పెద మది తోయమ్ముగాఁగఁ
వలనొప్ప నెడమ పార్శ్వము నాసికమున
నిలువక యుచ్ఛ్వాస నిశ్వాసములును
నడచుచు నాదక్షిణపు దిక్కు గాలి
నడువకయున్న నానరుడు మూఁడేండ్ల
కాయుష్యమెడలును నదిగాకరెంట
వాయువు సరియొక్క వాసరంబెడల
నెరవుగా ముప్పది నెలలలో వాఁడు
మరణమ్ము నొందును మను జాధినాధ!
ప్రాణానిలమ్ములు పాయకెప్పనికి
ఘ్రాణరంధ్రములఁబాఱక నోరవెడలు
నా కర్మిమూన్నాళ్ల యమపురికరుగు
నాకసమ్మున మఱియదరుపాటునను
గాంచన కృష్ణ పింగళ వర్ణ రూప
మంచితమ్ముగ నెవ్వఁడఁట గాంచె నేనిఁ
దడయక వత్సరద్వయములో వాడు
పడిపోవుఁ గాలుని పట్టణమ్మునకు
తొండ యూ సరవిల్లి తొడరి పాదముల
నుండి యా తొడదాఁక నొగిఁబ్రాకెనేని
జలకమ్ములాడగా జలమించుకేని

నిలువక దేహమందెక్కనే నియును
దక్షిణంబటుజూడఁ దలలేక మొండె
మేర్పడ గాన్పించు నెవ్వరికేని
వారెల్ల నార్నెల్ల వైవస్వతాఖ్యుఁ
జేరుదురందంద సిద్ధించు నిదియుఁ
బరగనిందొక్కటి ప్రాపించు వార
లరుగంగ వలెఁ దీర్ఘయాత్రసేవింప
ననిలక్షణమ్ములు నటఁగొన్నిచెప్పి"[1]

హాలాస్యమాహాత్మ్యమునందు ఉగ్రజననమను పదునైదవ అధ్యాయమున ఎనమిది శ్లోకములలోనున్న[2] సాముద్రిక లక్షణములతో చొక్కనాథ చరిత్రమునందలి సాముద్రిక లక్షణములను పోల్చి చూడగా నివి వేనికవే స్వతంత్రములుగా కన్పించుచున్నవి. కావున చొక్కనాథ చరిత్ర యందలి సాముద్రిక లక్షణ రచన తిరువేంగళకవి సాముద్రిక శాస్త్ర పరిజ్ఞానమునకు నిదర్శనము.

## సంగీత శాస్త్ర పరిజ్ఞానము

హాలాస్యమాహాత్మ్యమునందు నలువది యేడవ అధ్యాయమున పాండ్యరాజు ఆస్థాన గాయకుడైన బాణభద్రుని ప్రతిష్ఠ నిలుపుటకు సుందరేశ్వరుడు కాష్ఠ భారవిక్రేత వేషమున నేతెంచి చోళదేశపు గాయకుని ఎడిది ముందు కట్టెల మోపును దించి తన గాన విద్యను ప్రదర్శించిన సందర్భమున "సార్ధం రాగ విశేషైశ్చనారదాత్తుంబురోరపి. అతిరమ్యమనౌపమ్యం రాగం గాంధారికం జగౌ"[3] అని యుండగా, చొక్కనాథ చరిత్రమున సప్తమాశ్వాసములోని నలువదియవలీలలో తిరువేంగళకవి పదునెనిమిది ద్విపదలలో ఈ క్రింది విధముగా మనోహరముగా వర్ణించినాడు. ఇది ఆయన సంగీత పరిజ్ఞానమునకు నిదర్శనము.

'శ్రీరాగ రాగమంజరియు నాటయును
భైరవి భూపాల బంగాళ మాళ
వియును వసంతంబు వెలయంగనెనిమి
దియు మగరాగముల్ దీనికి సతులు
మలహారి దేశాక్షి మంచి కాంబోది
లలిత వరాళి నీలాంబరి తోడి
కన్నడ గౌళయుఁ గైశిక లెలమి

---

1. చొక్కనాథ చరిత్ర. పుటలు 75, 76, 77.
2. హాలాస్యమాహాత్మ్యము. పుటలు 72, 73. శ్లో. 42 నుండి 49 వరకు.
3. హాలాస్యమాహాత్మ్యము. పుట 175. శ్లో. 20.

ధన్యాసి దేవగాంధారి సౌరాష్ట్ర
పారి గుండ క్రియ భల్లాతకియును
సారంగ నాటదేశాళహారియును
రామక్రియయు మేఘరంజికురంజి
సామంతయు ముఖారి శంకరాభరణ
ములు నిరువది నాల్గు ముదిత రాగములు
నల రంగఁ బురుషుల నతివలనెఱిఁగి
పరగ మిత్రముల ముప్పది రెంటిఁ దెలిసి
పురుష స్త్రీ రాగముల్ పొందుగాఁ గూర్చి
ధరమంద్ర మధ్యమ తారకంబులును
సరి శుద్ధ సాళవ సంకీర్ణములును
కంఠగద్గద నాసికాకా? స్వరములు
కుంఠితమ్ముగఁ జేసి కోమలనాభి
గంభీర సుస్వర కంఠ శారీర
జృంభిత హృదయుఁడై జీవ నిర్జీవ
లయ కంపితోజ్జ్వలాలంకారములను
క్రియ గూడి హంస కోకిల వృకక్రౌంచ
వనమయూర యజావి వర్గమ్ములలఘు
త నిషాదఋషభ గాంధార షడ్జములు
మధ్యధైవత పంచమ స్వరంబులను
మధ్యరాత్రము నందు మధురేశ్వరుండు
గీత ప్రబంధ జక్కి పదచిందు
రీతిగా సరళిఁ బూరితముగాఁబాడె
మఱియు నక్రుతమచుంబన మపూర్వమ్ము
నరయ నసాధ్యమాద్యంత మాశ్చర్య
కరము గాంధర్వ రాగము సరాగమున
భరితమై తారక బ్రహ్మమ్ముమెట్టి
భూచర ఖచరులద్భుతమంది వినగ
శ్రీ చొక్కనాథుడంచిత లీలఁబాడె"[1]

పై ద్విపదలలో ఎనిమిది మగరాగములు, ఇరువది నాలుగు ముదిత రాగములు, మంద్ర, మధ్యమ, తార స్థాయులు, స్వరములు, అలంకారములు, గీత ప్రబంధ పద చిందులను దేశి ప్రక్రియలు తెలుపబడినవి.

---

1. చొక్కనాథ చరిత్ర. పుటలు 208, 209, 210.

## యోగ శాస్త్ర జ్ఞానము

చొక్కనాథ చరిత్రము నందలి అష్టమాశ్వాసములోని ఏబది యాఱవలీల యందు జ్ఞాన సంబంధుడు తిరుపెరుంబూరను నూరఁ బ్రవేశింప నాతనికి సుజ్ఞానము వొడమి యొకచోటఁ గూర్చుండి యోగమునభ్యసించెనని తెలుపు సందర్భమున తిరువేంగళకవి యాతని యోగాభ్యాసము నీ క్రింది విధముగా వర్ణించినాడు.

"తెలియ నాధార స్వాధిష్ఠానములను .
నలమణి పూరకంబాయనాహతము
కడు విశుద్ధమునను కమలముల్ గలుగ
నడర షడ్వర్ణ లింగాధికులైన
కరి వక్త్రకమలజ కమల పత్రాక్షు
లరయఁ బినాకియు నా సదాశివుఁడు
పర శివుండును బరబ్రహ్మంబులైన
మఱిదైవతంబుల మదిలోన నిలిపి
వర్ణబీజమ్ముల వర్ణాక్షరముల
వర్ణింప నాల్గును వడి నాఱుఁ బదియుఁ
బన్నెండు పదియాఱు భావింప రెండు
నున్న వేయింటిని నొనర నర్చించి
వర్ణింపనా ద్విషడ్వర్ణ లింగముల
నిర్ణయింపుచుఁ దన్ను నిజముగా నెఱఁగి
యల మీదట మనోలయ స్థానమందు
వెలయనప్పరమాత్మ వెదకుచునుండె[1]

జ్ఞాన సమ్మంధుడట్లు మనోలయ స్థానమున పరమాత్ముని వెదకుచున్న సమయమున చొక్కనాథుడు గురురూపమై వచ్చేసి యాతనికి శివయోగము నిట్లు బోధించెను.

"శివుడప్పుడా తనిఁ జేరరమ్మనుచుఁ
బ్రవిమల సద్గురు భావమ్ము గాఁగ
వరుసఁ జక్షు స్పర్శ వాచక శిక్ష
లరుదుగా నియమించి యందందమఱియు
లోల కామక్రోధ లోభ మోహములు
చాలంగ మదము మాత్సర్యమ్ములాఱు
నాయెడఁ ద్రోచి పృథ్వ్యప్పులు నగ్ని

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 282, 283లు.

వాయువాకాశమ్ము వడినందుగల్గు
పసనైన యట్టి శబ్ద స్పర్శ రూప
రస గంధములు పచ్చి కసవు గావించి
యమరఁ ద్వగక్షి శ్రోత్రము జిహ్వానాసి
కమునునేనింటి సంగతులూడ్చి మఱియు
పరగంగ వాక్పాణి పాద పాయువులు
నరయ నాగుహ్యగతాగమంబరసి
పూని ప్రాణాపానములు సమానంబు
దాన వ్యానాదిక స్థలములందరయ
వెలయ నిట్లగు పంచవింశతి తత్త్వ
ములయందు నధిక సద్బోధ గావించి
నిరవుగాఁ దగ యమ నియమాసనంబు
లరయఁ బ్రాణాయామ మరయిక మఱియు
నమరఁ బ్రత్యాహార ధ్యాన ధారణ స
మాధిక యోగమ్ములైన యష్టాంగ
మాదికముగ మించ నాత్మలోఁ దెలిసి
గమకమ్మై నా భి దగ్గర నున్న పాము
కరమొప్ప బోధించి కమలమ్ములాఱు
విరచితంబైయున్న విధములు దెలిసి
వెరసి డెబ్బది రెండు వేల నాళములు
నరయనా వేళల నదిమి పట్టుచును
బలిమిమై నడుకొన్న పశ్చిమ నాడి
పొరిది మెల్లనె గాలి జొనుపంగఁ జేసి
యరసి యాసోమార్కులను గూర్చి పట్టి
వరసుధారసవార్ధి వాలలాడుచును
గఱకంఠుఁ గాంచి యక్కడ దృష్టి నిలిపి
యానిరంజను తోడనాత్మను గూర్చి
తాను నేనను వార్త తలపున లేక
యున్న పుణ్యుడు శివ యోగియౌగాక"[1]

1. చొక్కనాథ చరిత్ర. పుటలు 283, 284, 285.

హాలాస్యమాహాత్మ్యమున, అఱువది నాలుగవ అధ్యాయమున సుందరేశ్వరుడు జ్ఞాన సంబంధున కొసగిన యుపదేశము రెండు శ్లోకములలో సంక్షిప్తముగా నున్నది.[2] ఆ శ్లోకము లివి:

శ్లో. సూక్ష్మంపంచాక్షరం స్థూలం తస్మై చోపది దేశసః।
సుజ్ఞానం సుకవిత్వంచ హృదివాచి ప్రవర్తతే॥ 59.

శ్లో. సంసారవాసనానష్ట తస్యవాత పురేశితుః।
అధ్యాపితాన్ మహేశేన వేదానుచ్చరతాస్వరైః ॥ 60

పై శ్లోకములను జదివిన, చొక్కనాథ చరిత్రమున విపులముగా రచింపబడిన శివయోగ విషయము మూలమునకు భిన్నమని, స్వతంత్రమని స్పష్టముగాఁ దెలియుచున్నది. కావున నిది తిరువేంగళ కవికి గల యోగ శాస్త్ర జ్ఞానమునకు నిదర్శనమని చెప్పవచ్చును.

2. హాలాస్యమాహాత్మ్యము. పుట 226.

# షష్ఠాధ్యాయము - లాక్షణికత

తిరువేంగళకవి చొక్కనాథ చరిత్రమునందలి యవతారికలో తన లాక్షణీతను దూర్చి ఇట్లు చెప్పికొనినాడు.

'బుధులు సర్వజ్ఞులు భూమి పాలకులు
నధిక సత్కావ్యులు నర్థితోఁ బొగడఁ
బదసంధులర్థముల్ ప్రాసంబు యతులు
పదిలమై లక్షణ ప్రామాణ్యముగను
గల్పాంతర స్థాయిగా మించి వెలయఁ
గల్పింతు[1]'

పై ప్రతినను కవి నూటికి నూరుపాళ్లు నిలుపుకొనలేక పోయినను నిలుపుకొనుటకు ప్రయత్నించినాడని యీతని కావ్యమునందలి భాషా ప్రయోగములను ఛందః ప్రయోగములను జూచిన మీదట తెల్ల మగుచున్నది. అసలు ఏ కవియైనను లక్షణ గ్రంథములను చెంతనుంచుకొని నేను లక్షణబద్ధముగా వ్రాయుచున్నానా లేదా యని వ్రాయడు. వ్రాసిన గ్రంథములకే లక్షణములు తయారగును. అనగా ప్రయోగమే ముందు. లక్షణమే తరువాత అట్లని ఈ కవి లక్షణ పరిజ్ఞానము లేకయే రచించినాడని కాదు. ఏ కవియైనను సాధారణముగా తనకాలము నాటికి ప్రచారము పొందిన ప్రఖ్యాత లాక్షణిక గ్రంథములను జూచియే యుండును. అందువలన తిరువేంగళకవికి చొక్కనాథ చరిత్ర రచనా కాలము నాటికి గల లక్షణ గ్రంథములు పరిచితమై యుండును. ఈ కావ్యము పదునాఱవ శతాబ్ది పూర్వార్థమున ప్రభవించినది గావున అప్పటికి బహుళప్రచారము నొందిన కొన్ని లక్షణ గ్రంథముల నిట క్రోడీకరించుట అసంగతము కాదనుకొందును.

**చొక్కనాథ చరిత్ర రచనాకాలము నాటికి గల లక్షణ గ్రంథములు కొన్ని**

1. ఆంధ్ర శబ్ద చింతామణి; క్రీ.శ.1022-63
2. భీమన ఛందము; క్రీ.శ. 1080-1150
3. అథర్వణ వ్యాకరణము; క్రీ.శ. 1200
4. అథర్వణ ఛందము;
5. ఆంధ్ర భాషా భూషణము; క్రీ.శ.1250
6. కావ్యాలంకారచూడామణి; 1402 -07 మధ్యకాలరచన

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 5.

7. ఛందోదర్పణము; 15వ శతాబ్ది పూర్వార్థము
8. కవిచింతామణి; 1480 - 1520,[1]

పైన పేర్కొనబడిపన లక్షణ గ్రంథముల నన్నింటినే లేక వానిలో కొన్నింటినో తిరువేంగళకవిఁ జదివియే యుండును. లక్షణ పరిజ్ఞానములేనివాడు లక్షణ బద్ధముగ వ్రాయుట అసంభవము. అయితే పైవానిలోవేనిని జదివినాడో చెప్పజాలము. మీదుమిక్కిలి పై గ్రంథములు ఆంధ్ర భాషకు లక్షణమును జెప్పఁ బూనుకొనినవే గాని సమగ్రములనుటకు వీలులేదు కదా! లక్షణ గ్రంథములనే కాక ఈ కవి తనకు ముందున్న కవుల యొక్క కావ్యములను జదివి అందలి ప్రయోగములను గ్రహించియుండవచ్చును. వ్యాకరణములు ఛందో గ్రంథములు అంతగా ప్రచారములేని కాలమున పూర్వ కవుల కావ్యములే ప్రమాణములుగా నుండుననుటలో విప్రతిపత్తి యుండబోదు. కావున చొక్కనాథ చరిత్ర కర్తయగు తిరువేంగళ కవి తనకు పూర్వులైన కవుల కావ్యములను మరియు లక్షణ గ్రంథములను జదివి కావ్యరచన కుపక్రమించినాడని చెప్పవచ్చును.

## భాషాప్రయోగములు

**వర్ణోచ్చారణ విశేషములు:** అచ్చులలో (1) అ,ఆ,లకు ఎ,ఏలకు నడిమి ఉచ్చారణము కలిగిన అ, ఆలు ఈ కావ్యమున కన్పించుచున్నవి. కాని వీనికి ప్రత్యేక వర్ణసంజ్ఞలు లేవు. ఇకారమునకు హ్రస్వ అకారముతో సంధి చేసినపుడు హ్రస్వ అ కారము దీర్ఘ అకారముతో సంధిచేసినపుడు దీర్ఘ అకారము (ఆ) కనుపించుచున్నవి. ఉదా. కు వెఱచిన వానట్లు వెసలేచినిలచి'[2] వాని + అట్లు = వానట్లు

'ఈలాగు తేజీల నెక్కాడు వారి'[3] ఎక్కి + అడు = ఎక్కాడు

(2) అ, ఆలకు ఎ, ఏ లకు నడిమి ఉచ్చారణకు వలెనే హ్రస్వ 'ఇ' కారమునకు 'ఉ' కారముతో సంధిచేసినపుడు ఈ రెండు వర్ణముల నడిమి ఉచ్చారణ గల మరొక వర్ణోచ్చారణ కనుపించుచున్నది.

ఉదా; '..............................చొక్క

నాయక స్వామున్న నగరికేతెంచి[4] స్వామి + ఉన్న = స్వామున్న

చేరి + ఉండి = చేరుండి "సెట్టికిమామయై చేరుండి సభను'[5]

(3) చొక్కనాథ చరిత్రమున ఋకారమునకు 'రి' తోను 'రు' తోను యతి గూర్చబడిన ప్రయోగములు కనువించుచున్నవి గావున ఈ కాలమున ఋ కారమును రు కారముగాను రి కారముగాను ఉచ్చరించినట్లు ఊహింపవచ్చును.

---

1. పైన పేర్కొన్న లక్షణ గ్రంథములు '**లక్షణ** శిరోమణి' (పొత్తపి వెంకట రమణ కవి ప్రణీతము) రావూరి దొరసామి శర్మగారి పీఠిక నుండి ఉద్ధరింపబడినవి.
2. చొక్కనాథ చరిత్ర. పుట 210.
3. చొక్కనాథ చరిత్ర. పుట 154.
4. చొక్కనాథ చరిత్ర. పుట 252.
5. చొక్కనాథ చరిత్ర. పుట 14.

హల్లులలో;(1) చొక్కనాథ చరిత్రమునందు జ్ఞకారమునకు చఛజఝ లతోను, శ,ష,స లతోనే గాక, క,ఖ,గ,ఘ లతోను కూడా యతి గూర్చబడినదిగాన ఈ కాలమున జ్ఞ కారోచ్చారణలో మార్పుకలిగియుండవచ్చును. జ్ఞ కారమునకు గ్నకారముతో ప్రాసము కూడా ఈ కవి వాడినాడు కావున జ్ఞకారమును గ్న కారముగా ఉచ్చరించియుందురని అనుకొనవచ్చును. జ్ఞకారమునకు క్షకారముతో యతి ఈ కాలమున క్షకారోచ్చారణలో మార్పు సూచకము కావచ్చును.

(2) అట్లే న, లలకు వ-పలకు ప్రాసములు గూర్చబడినవి కాన ఈ కాలమున ఈ వర్ణముల ఉచ్చారణలో మార్పు వచ్చి యుండవచ్చును.

(3) మఱియు ర,ఱ ప్రాసములు కూడా విరివిగా నిందు కనిపించుచున్నవి. గావున ఆ కాలమున ఉచ్చారణలో వీటిమధ్య అంతరము తొలగిపోయి యుండును.

(4) చొక్కనాథ చరిత్రమున ఫౌజు అను ఉర్దూ పదమును'ఫౌజు' అని వ్రాసినా ఈ కాలమున ఫారసీ, అరబీ భాషల ప్రభావమువలన తెలుగులో ప్రవేశించిన అన్యదేశీయ పదములలో (f) వర్ణమునకు సామ్యము కలిగిన వర్ణమునకు పఫలకు నడిమి ఉచ్చారణమున్నట్లు ఊహింపవచ్చును. ఫౌజు (ఏకవచనం) ఫౌజులు (బహువచనం) అను రెండు ప్రయోగములు ఇందుగలవు.

ఫౌజు :- భయమేల జనుమెల్లి ఫౌజుఁ జూపెదను[1]

ఫౌజులు; 'ఎల్లరు గొలువంగ నేతెంచు ఫౌజు
తెల్లనప్పుడు మహో ద్రేకమ్ముగాగ'[2]

(5) Z వర్ణోచ్చారణతో సామ్యంకలిగిన (j) వర్ణమును జకారముగా ఇందు వ్రాసినా జజలకు నడిమి ఉచ్చారణమున్నట్లూహింపవచ్చును. భూపతి హజారమునకేతెంచ్చి[3] అని ప్రయోగము.

**నామ ప్రత్యయములు :-** (1) (i) మహద్బహువచన ప్రత్యయమగు 'లు' కారము ద్విరుక్త 'ళు' కారముగా ఈ కావ్యమున కనుపించుచున్నది.

ఉదా:-'కుమాళ్లు' - 'పురికేగిరంతనప్పుడు నాకుమాళ్లు'[4] అని ప్రయోగము. ఈ శబ్దమే "కొమాళ్లు" అని కూడ నాటి వ్యావహారిక బలమువలన ప్రయోగించబడినది. 'చొక్కవిభుని కొమాళ్ల భావమున'[5] అని ప్రయోగము.

(ii) అమహద్బహువచన ప్రత్యయము 'లు' కూడ 'ళ్లు' గా ఇందు ప్రయోగించియున్నది. 'యామాళ్ల ముదుప్పు'[6] అని. మాడలు అనుటకుబదులు మాళ్లు అని నాటి వ్యవహార

1. చొక్కనాథ చరిత్ర. పుట 151.
2. చొక్కనాథ చరిత్ర. పుట 152.
3 చొక్కనాథ చరిత్ర. పుట 296.
4. చొక్కనాథ చరిత్ర. పుట 238.
5. చొక్కనాథ చరిత్ర. పుట 242.
6. చొక్కనాథ చరిత్ర. పుట 264.

బలము వలన తిరువేంగళకవి ప్రయోగించి యుండును.

(2) 'తోడ' అను తృతీయావిభక్తి ప్రత్యయమునకు 'తోటి' అను ఔప విభక్తిక రూపమును ఈ కవి ప్రయోగించినాడు.

ఉదా: 'నీతోట్నీ' 'తోడి' అను రూపము కూడా ఈ కావ్యముననున్నది. 'నీమీదఁ దప్పేమి నీతోడిదేమి'[2] - అని ప్రయోగము.

(3) పంచమీ విభక్తి ప్రత్యయము 'వలన' కు వ్యావహారిక రూపాంతరమైన 'వల్ల' ఈ కావ్యములోనున్నది. ఉదాహరణకు 'నావల్లఁ దప్పేమి నాకానతిమ్మ'[3]

## సంధులు

### అచ్సంధులు:

1. అ + అ = అ ; వారాంగన + అయి + ఉండియు = వారాంగనయ్యుండియు.[4]
2. అ + అ = అ; పేద + అపె = పేదాప్పె[5]
3. అ + ఆ = అ; ఆడ + ఆమె = అడ్డామ్మె[6]. ఇందు హ్రస్వ అకారమునకు దీర్ఘ ఆకారముతో సంధి గూర్చినపుడు అ,ఆలకు నడిమి ఉచ్చారణ గల 'అ' అను మరొక వర్ణము కనుపించుచున్నది.
4. ఇ + అ = అ; విరించి + అస్థిమాల = విరించాస్థిమాల
   'హరి విరించాస్థి మాలాంకమ్ముతోడ'[7] అని ప్రయోగము.
5. ఇ + అ = అ; వెఱచినవాని + అట్లు = వెఱచిన వానట్లు[8]
6. ఇ + ఆ = ఆ; ఎక్కి + ఆడు = ఎక్కాడు
   'ఈ లాగు తేజీల నెక్కాడు వారు'[9] అని ప్రయోగము
   'ఉత్తమాశ్వమెక్కాడుచు'[10] ఎక్కి + ఆడుచు = ఎక్కాడుచు

పై ఉదాహరణలలో హ్రస్వ ఇకారమునకు హ్రస్వ అకారముతో సంధి జరిగినపుడు ఈ రెండు వర్ణముల నడిమి ఉచ్చారణముగల హ్రస్వ అ కారము అట్లే హ్రస్వ ఇకారమునకు దీర్ఘ అకారముతో సంధి చేసినపుడు ఈ రెంటి నడిమి ఉచ్చారణ గల దీర్ఘ ఆ, కారము

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 271.
2. చొక్కనాథ చరిత్ర. పుట 278.
3. చొక్కనాథ చరిత్ర. పుట 278.
4. చొక్కనాథ చరిత్ర. పుట 183.
5. చొక్కనాథ చరిత్ర. పుట 310.
6. చొక్కనాథ చరిత్ర. పుట 195.
7. చొక్కనాథ చరిత్ర. పుట 125.
8. చొక్కనాథ చరిత్ర. పుట 210.
9. చొక్కనాథ చరిత్ర. పుట 154.
10. చొక్కనాథ చరిత్ర. పుట 295.

ఆదేశముగా వచ్చినది. దీర్ఘ అ, కారము వచ్చినదానికి మరొక ఉదాహరణ. పెండ్లి + ఆడి = పెండ్లాడి [1]

7. యడాగమసంధి: ఇత్తునకు దీర్ఘ అకారముతో సంధి గూర్చినపుడు యడాగమమును విధించిన రూపము కూడా ఇందుకనుపించుచున్నది

'తన మనమున్నట్లు తగనెక్కియాడు [2]' అని ప్రయోగము

ఎక్కి + య్ + ఆడు = ఎక్కియాడు

8. ఇ + ఇ = ఇ; వ్రాసి + ఇచ్చెద = వ్రాసిచ్చెద. 'చీటి వ్రాసిచ్చెద' [3]

9. ఇ + ఈ = ఈ; పట్టి + ఈడ్చికొని = పట్టీడ్చికొని [4]

10. ఇ + ఉ = ఉ; చేరి + ఉండి = చేరుండి [5] ఇందు ఇత్తునకు హ్రస్వ ఉకారముతో సంధి చేసినపుడు ఈ రెండు వర్ణముల నడిమి ఉచ్చారణ గల మరియొక వర్ణము 'ఉ' వినిపించుచున్నది.

11. ఇ + ఏ = ఏ; పట్టి + ఏడ్చి = పట్టేడ్చి 'అతనిఁబట్టేడ్చి' [6]

12. ఉ + అ = అ; సేయుచు + అట్లుండిరి = సేయుచట్లుండిరి [7]

## తత్సమ పదముల మధ్య తెలుగు సంధి

చొక్కనాథ చరిత్రము నందు తిరువేంగళకవి సంస్కృత సంధులు జరుగవలసిన చోటులలో తెలుగు సంధిని విధించినాడు. ఈ క్రింది ప్రయోగములు దీనికాధారములు.

1. ఋషి + ఆశ్రమము = ఋషి యాశ్రమము [8]. ఇందు యణాదేశ మునకు బదులు యడాగమమును విధించినాడు.

2. 'అబాణ భద్రాంగన ధిక తానముల' [9] అను చరణమున

అంగన + అధిక = అంగనధిక ఇట సవర్ణ దీర్ఘ సంధి జరుగవలసి యుండగా అకార సంధి జరిగినది.

3. విరించి + అస్థిమాల = విరించాస్థిమాల [10]

4. విరించి + ఆది = విరించాది [11]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 352.
2. చొక్కనాథ చరిత్ర. పుట 154.
3. చొక్కనాథ చరిత్ర. పుట 213.
4. చొక్కనాథ చరిత్ర. పుట 292.
5. చొక్కనాథ చరిత్ర. పుట 14.
6. చొక్కనాథ చరిత్ర. పుట 194.
7. చొక్కనాథ చరిత్ర. పుట 358.
8. చొక్కనాథ చరిత్ర. పుట 247.
9. చొక్కనాథ చరిత్ర. పుట 227.
10. చొక్కనాథ చరిత్ర. పుట 125.
11. చొక్కనాథ చరిత్ర. పుట 359.

5. తింత్రిణి + అమ్లాతక = తింత్రిణామ్లా తక[1]

పై వానిలో యణాదేశమునకు బదులు అకార ఇకార సంధులు విధించబడినవి.

## సంస్కృతపదమునకు తెలుగు పదమునకు మధ్య తెలుగు సంధి

ఉదా: 'చొక్కనాయక స్వామున్న'[2] అను పదములో స్వామి + ఉన్న = స్వామున్న. ఇకారమునకు ఉకారము పరమై ఉత్వసంధి జరిగినది. ఇందు సంస్కృత పదమునకు తెలుగు పదమునకు సంధి చేసినపుడు తెలుగుసంధి జరుగగా కొన్నిచోట్ల సంస్కృతసంధి కూడా జరిగినట్లు ఉదాహరణలు లభించుచున్నవి. వీనిని క్రింది శీర్షికలో నుదహరింతును.

## తెలుగు పదమునకు సంస్కృతపదమునకు సంధి

1. నీకు + అమంత్రముల్ = నీకమంత్రముల్[3] ఇట అకారసంధి
2. పిన్నపెద్ద + ఆది = పిన్నపెద్దాది[4] = ఇట సవర్ణదీర్ఘ సంధి
3. మూర్తి + అన = మూర్తన[5] = ఇ + అ = <u>అ;</u>
4. ఆది + ఐనవాడు = ఆద్యైన వాడు[6] = ఇ+ఐ =<u>ఐ.</u>
5. మధ్యము + అవు = మధ్యమావు[7]
6. అగ్రహించి + అపుడు = అగ్రహించపుడు.[8] (ఇ + అ = <u>అ</u>)
7. తక్కిన + ఆభరణముల్ = తక్కినాభరణముల్[9]
8. అయ్యల + అంఘ్రులను = అయ్యలంఘ్రులను[10]
9. ఆది + ఐన = ఆద్యైన 'ఎల్లదేవతలకాదికినాదియై యాద్యైనవాడు.[11]

## సంధి దోషములు

1. ఆపద + ఉద్ధారుడు = ఆపదుద్ధారుడు[12]

   దీనిలో గుణమునకు బదులు ఉకార సంధి జరిగినది.

2. అప్సర + అంగనల = అప్సరోంగనల[13]

   ఇందు సవర్ణదీర్ఘ సంధికి మారుగ గుణ సంధి జరిగినది.

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 26.
2. చొక్కనాథ చరిత్ర. పుట 252.
3. చొక్కనాథ చరిత్ర. పుట 303.
4. చొక్కనాథ చరిత్ర. పుట 306.
5. చొక్కనాథ చరిత్ర. పుగట 340.

6, 11. చొక్కనాథ చరిత్ర. పుట 329.

7. చొక్కనాథ చరిత్ర. పుట 72.
8. చొక్కనాథ చరిత్ర. పుట 132.
9. చొక్కనాథ చరిత్ర. పుట 60.

10 చొక్కనాథ చరిత్ర. పుట 5 అవతారికలో.

12. చొక్కనాథ చరిత్ర పుట 186.

13 చొక్కనాథ చరిత్ర. పుట 267.

## సమాసములు

**తత్సమ సమాసములు :** రెండు తత్సమ పదముల మధ్య జరిగినవి.

ఉదా: 1. వళ చక్రమ్ము[1] 2. కశాఘాతమ్ము[2] మొదలగునవి

### తత్సమ పదము నకు దేశిపదముతో సమాసము

1. అక్షయజోలె - 'ఘనముగానీకు నక్షయజోలె యొకట్టి[3]
2. సుజ్ఞానపలక - 'చదరమైనట్టి సుజ్ఞానపలకిచ్చె[4]
3. సంఘుపలక - 'భ్రయమకనాసంఘుపలకఁ గూర్చున్న[5]
4. సంఘువలకమంటపమ్ము[6]
5. సంఘుపల్కను - సంఘు పల్కను నిడికొనిరి![7]
6. కరసాన - 'కరసాన నపుడు భీకరముగాఁ బట్టి'[8]
7. జలస్రోత - 'అందుల జలస్రోతలందుల సుళ్లు'[9]

### దేశిపదమునకు తత్సమ పదముతో సమాసము

1. చక్కనయనము - 'చక్కనయనముఁ బూన్చ చక్రినిమెచ్చి'[10]
2. బీగ ముద్రలు - 'తలుపులు మూసి బీగముద్రలును బెట్టిపోయెను[11]
3. ఊరూపులు- 'చేరి ఊరూపులై చెందుదచ్చటను'[12]
4. గారాబుపుత్రుడు - 'గారాబుపుత్రునిఁ గడఁక దేర్కొనుచు[13]'

### వైకృతపదముతో తత్సమ పదమునకు సమాసము

1. రాహుత్త వితతులు[14]
2. వేగురు రాహుత్త వితతి[15]

---

1. చొక్కనాధ చరిత్ర. పుట 78.
2. చొక్కనాధ చరిత్ర. పుట 296.
3. చొక్కనాధ చరిత్ర. పుట 157.
4. చొక్కనాధ చరిత్ర. పుట 260.
5. చొక్కనాధ చరిత్ర. పుట 265.
6. చొక్కనాధ చరిత్ర. పుట 260.
7. చొక్కనాధ చరిత్ర. పుట 261.
8. చొక్కనాథ చరిత్ర. పుట 342.
9. చొక్కనాధ చరిత్ర. పుట 68.
10. చొక్కనాధ చరిత్ర. పుట 91.
11. చొక్కనాధ చరిత్ర. పుట 124.
12. చొక్కనాధ చరిత్ర. పుట 167.
13. చొక్కనాధ చరిత్ర. పుట 132.
14. చొక్కనాధ చరిత్ర. పుట 152.
15. చొక్కనాధ చరిత్ర. పుట 186.

3. కఱకంఠుడు 'కరుణించి వారి కా కఱకంఠుడపుడు'[1]
4. మొకముప్రక్షాళించి[2]

### తమిళ పదమునకు వైకృత పదముతో సమాసము

1. చొక్కరాహుత్తుడు[3]
2. తిరుబాస - 'తిరముగానాకిది తిరుబాసయనుచు'[4]

గ్రంధనామమునగల 'చొక్కనాథ శబ్దము తమిళ పదమునకు సంస్కృతపదముతో జరిపిన సమాసము. ఇట్టివి ఈ గ్రంధమున నింకను లభించుచున్నవి.

### తమిళ పదమునకు సంస్కృతసమ (తత్సమ) పదముతో సమాసము

1. తిరుమేను - 'తిరుమేను సేయింతు దేవునికనుచు'[5]
2. తిరుచొక్కపతి - 'తిరుచొక్కపతి సన్నిధికి వచ్చి నిల్చి'[6]
   'తిరుచొక్కపతి వంటి దేవుండు లేడు'[7]
3. తిరువాచకము -
4. తిరుమంత్రము - 'తిరువాచకంబను తిరుమంత్రమెలమి'[8]

### సుదీర్ఘ సమాసములు

ద్విపదలో సుదీర్ఘ సమాసములుండుట కవకాశము తక్కువయే యైనను చొక్కనాథ చరిత్రమునందు ఈ క్రింది ద్విపదలు సుదీర్ఘ సమాస ఘటితములై యున్నవి.

**(i) తెలుగు సమాసము**

"కలిమి లేఁ దేఁటి రెక్కలకప్పుగప్పు

గళమునఁబూనె ముక్తాహార వితతి'[9] ఇందు కలిమి లేఁదేఁటి రెక్కల కప్పుగప్పు గళము' అనునది సమాస పదము.

**(ii) సంస్కృతసమాసములు**

1. 'భర్మావనీధరోత్పాటనో దగ్ర
   ధర్మహస్త ప్రశస్తంబైనఘనుడు'[10]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 65.
2. చొక్కనాథ చరిత్ర. పుట 141.
3. చొక్కనాథ చరిత్ర. పుట 153.
4. చొక్కనాథ చరిత్ర. పుట 342.
5. చొక్కనాథ చరిత్ర. పుట 181.
6. చొక్కనాథ చరిత్ర. పుట 193.
7. చొక్కనాథ చరిత్ర. పుట 244.
8. చొక్కనాథ చరిత్ర. పుట 315.
9. చొక్కనాథ చరిత్ర. పుట 61.
10. చొక్కనాథ చరిత్ర. పుట 53.

2. 'ఆశాదివర్గేంద్రియానూన కలుష నాశము పాపవినాశిని',[1]
3. 'భానుకర ప్రభా భాసురంబైన
మానిత మాణిక్యమకుటమ్ము దాల్చి'[2]
4. 'వర్ణిత ధళధళోజ్జ్వల వజ్రఖచిత
కర్ణ కుండలములు గరమొప్పదాల్చి [3]
5. "నాగాజ మహిష సన్మత్స్య సద్ధరిణ
వేగాశ్వవృష వాహ విధృతులై [4]
6. 'హాటకరత్న దీపా కీర్ణమౌళి
కోటీరమగల నుగ్గులు గాఁగఁ గూల్చె'[5]
7. 'ధారుణీధరకులోద్దామప్రశస్త
మేరు శైల ప్రాంత మేదినియందు![6]
8. 'బాహు బలాధిక ప్రాభవేదగ్ర
సాహ సంబెసఁగ నచ్చట దండు విడిసె',[7]
9. 'కాలానలాభీల గర్వితోదగ్ర కీలాలములను',[8]
10. 'గజ వ్యాఘ్రులంధక కమలాక్షదక్షు
లజ మయ త్రిపురదైత్యారులనంగ'[9]
11. 'గజ జలంధర యంధక వ్యాఘ్ర మదన
అజశిరః పురదైత్య హరునను భిక్ష'[10]
12. 'దివి భువి కీలాల తేజ? స్సమీర
రవి చంద్ర 'యాజి విగ్రహునకు భిక్ష[11]
13. 'సన కసనంద నాద్య నిమిషలోక
మునిగణవందిత మూర్తి త్రయాత్మ'[12]
14. 'మఖ గజ వ్యాఘ్రు? అంధకదైత్య సంహరణ గీత ప్రబంధముల్ వాడుచు'[13]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 56.
2, 3. చొక్కనాథ చరిత్ర. పుట 61.
4. చొక్కనాథ చరిత్ర. పుట 65.
5. చొక్కనాథ చరిత్ర. పుట 91.
6, 7. చొక్కనాథ చరిత్ర. పుట 98.
8. చొక్కనాథ చరిత్ర. పుట 114.
9. చొక్కనాథ చరిత్ర. పుట 143.
10, 11. చొక్కనాథ చరిత్ర. పుట 159.
12. చొక్కనాథ చరిత్ర. పుట 166.
13. చొక్కనాథ చరిత్ర. పుట 219.

15. 'పరితాప సంజ్వరోపద్రవం'[1]
16. 'తాపజ్వరానలాభీలము'[2]
17. 'సవ్యాపసవ్య భాగ జ్వరోష్ణ తాపము'[3]

చొక్కనాథ చరిత్రమునందు కేవల సుదీర్ఘ తెలుగు సమాసములు సుదీర్ఘ సంస్కృత సమాసములే కాక అచ్చ తెనుగు ద్విపదలు, తత్సమ ద్విపదలు మఱియు తెనుగును సంస్కృతమును సమముగా నడచిన పాదములు కనిపించుచున్నవి. మచ్చుకు కొన్ని చూపుదును.

**అచ్చతెనుగు ద్విపదలు:** షష్ఠాశ్వాసములోని ముప్పది ఏడవలీలలో

1. 'వన్నెగా కమ్మని వాసన గల్గు
సన్న బియ్యమ్ముగాసడియించికడిగి'[4]
2. 'ఒక రాయి అప్పయు నొక నూక మెరిక
యొక వడ్ల గింజ లేకుండగాఁజేసి'[5]

**తత్సమద్విపదలు;**

1. ద్వితీయాశ్వాసములోని ఆఱవలీలలో గంగానదిని వర్ణించుచు.
.............దుష్కృత భంగ శీకరోత్తుంగ
రాజితాంబు తురంగ రంగ త్తరంగ
రాజి మౌళి కిరీట రమ్యానుషంగ
పరమ కృపాపాంగ భవభయభంగ
హరదేహజనితాంగ నాకాశగంగ[6]'
2. షష్ఠాశ్వాసములోని ముప్పది తొమ్మిదవలీలలో
'మధ్యార్జునేశాది మధ్యాంతరహిత
యధ్యాత్మ యోగ సమభ్యాసగమ్య'[7]
3. అందే.
' తారాధిపోత్తంస! తారకధ్వంస
తారక బ్రహ్మేశ తారాద్రి వాస
నగజేశ నగచాప నగధర వంద్య
సగుణ సదాచార శర్వమహేశ'[8]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 323.
2. చొక్కనాథ చరిత్ర. పుట 327.
3. చొక్కనాథ చరిత్ర. పుట 328.
4, 5. చొక్కనాథ చరిత్ర. పుట 191.
6. చొక్కనాథ చరిత్ర. పుట 55.
7. చొక్కనాథ చరిత్ర. పుట 199.
8. చొక్కనాథ చరిత్ర. పుట 203.

4. సప్తమాశ్వాములోని నలువది నాలుగవలీలలో అంగయకణ్ణెమ్మ సౌందర్యమును వర్ణించుచు.

'హరి నీల రత్న మధ్యాలకాచార
సరస రాజీవ కేసర నేత్ర గంధి
మద కరికుంభ గమనకుచయుగళ
విదిత రాకాచంద్ర బింబాధరోష్ఠ
సలలిత యరుణాబ్జ సత్పాద గంధి
కలిత విద్రుమ లతాకాంతి తన్వంగి
నంగయకణ్ణెమ్మ ననుదిన సర్వ
మంగళాలంకార మహనీయ దివ్య
రత్న పరిష్కార రాజిత దేహ
నూత్న సౌందర్య..............'[1]

**సంస్కృతమును, తెనుగును సమముగా నడిపిన పాదములు;** మచ్చుకు ఒకటి.

1. మృదుల రాజాన్నముల్ మేలోగిరములు'[2]

## క్రియాపదములు - వాని ప్రయోగములు

1. త్రెంపుక - 'పలుపు త్రెంపుక'[3] అని ప్రయోగము
2. త్రెంచుక - తలుగు ద్రెంచుక
3. తఱుముక - 'తలుగు ద్రెంచుక యావు తఱుముకవచ్చి'[4]
4. తిరుసుక - 'తిరిపి ప్రాతలు గట్టి తిరుసుకఁదినగ[5]
5. పుచ్చుక - 'సొమ్ములన్నియును బుచ్చుక'[6]
6. వహించుక - 'ఏ లీలనైన వహించుక నన్ను
   మేలనిపింపవే మిహిరాబ్జనేత్ర!'[7]
7. సేవఁజేసుక - ' శ్రీచొక్కనాధునాశ్రిత లోకనాధు
   సేవఁజేసుక సుఖ స్థితి నుండుమనుచు'[8]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 236.
2. చొక్కనాథ చరిత్ర. పుట 59.
3 చొక్కనాథ చరిత్ర. పుట 134.
4. చొక్కనాథ చరిత్ర. పుట 134.
5 చొక్కనాథ చరిత్ర పుట 138.
6. చొక్కనాథ చరిత్ర. పుట 194.
7. చొక్కనాథ చరిత్ర. పుట 208.
8. చొక్కనాథ చరిత్ర. పుట 211.

8. వెచ్చమ్ముఁజేసుక - 'ఇచ్చ వచ్చినయట్టు లెల్ల కాలమ్ము
వెచ్చమ్ముఁ జేసుక వేడ్కతో నుండు'[1]

9. ఒరసుక - 'పట్టణమ్మొరసుక పారె'[2]

10. చదువుక - 'అలేఖ జదువుక'[3]

11. కట్టుక - 'పట్టముగట్టు కారాజ్యమెల్ల'[4]

తిరువేంగళకవి పైన జూపిన క్రియా పదములలో ఆత్మనే పదార్థమున 'కొను' అనుధాతువు క్రియ కనుప్రయుక్తము కావలసి యుండగా 'క' ప్రత్యయమును విధించినాడు. 'కొను' ధాతువను ప్రయుక్తమైన ప్రయోగములు చొక్కనాథ చరిత్రమునందున్నవి. ఉదాకు. నవమాశ్వాసములోని అఱువదినాలుగవలీలలో 'గుండ్లతో తలగొట్టుకొని చచ్చుదాన'[5] అను చరణమున 'కొట్టుకొని' అని ప్రయోగించినాడు. 'క' ప్రత్యయము గాని 'కొను' ధాతువు గాని రాని రూపములు కూడా క్రియాఫలముకర్తృగామియైనపుడు కనిపించు చున్నవి. ఉదాకు. 'తెరువునఁబండి నిద్రింప'[6] ఇందు 'పండి' అను క్రియకు అర్థము 'పండుకొని' - అనియే.

వేంచేసె, విచ్చేసె అను క్రియాపదములు పోయెను, వచ్చెను అను నర్థములలో నుపయుక్తములైనవి.

1. వేంచేసె - 'కాయమ్ముతోడ శంకరలోకమునకు
నాయెడ జొన్నానయాళు వేంచేసె'[7] - ఇందు

వేంచేసె అను క్రియ వెడలెను లేక పోయెను అను భూతకాలిక క్రియగా ప్రయుక్తమైనది.

2. వేంచేసె - నీ భాగ్యమునగాదె నీ పాట వినగ
నీ శుండు వేంచేసె నీపాల కలిగి'[8] అను

చరణములలో 'వేంచేసె' అను క్రియ వచ్చెను అను భూతకాలిక క్రియగా ప్రయోగింపబడినది.

3. 'వేవేగ మధురకు వేంచేసె'[9] - ఇందుకూడా వచ్చెను అను నర్థములోనే ప్రయోగించినాడు.

4. 'విచ్చేసె' - వచ్చెను అను భూతకాలికార్థములో 'విచ్చేసె' అని కూడా తిరువేంగళకవి ప్రయోగించినాడు.

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 213.
2. చొక్కనాథ చరిత్ర. పుట 306.
3. చొక్కనాథ చరిత్ర. పుట 320.
4. చొక్కనాథ చరిత్ర. పుట 340.
5. చొక్కనాథ చరిత్ర. పుట 355.
6. చొక్కనాథ చరిత్ర. పుట 196.
7. చొక్కనాథ చరిత్ర. పుట 183.
8. చొక్కనాథ చరిత్ర. పుట 229.
9. చొక్కనాథ చరిత్ర. పుట 242.

ఉదా : శ్రీ చొక్కపతియె విచ్చేసె[1]

5. వచ్చి అను భూతకాలిక క్రియను విచ్చేసి అని ప్రయోగించినాడు. ఉదా :

'కరుణించి యంగయకణ్ణమ్మ మీర

లిరువురు విచ్చేసి యిటుదరినుండి'[2]

పై ప్రయోగములన్నియును చొక్కనాథుని పరముగా గౌరవార్థంలో ప్రయోగించబడుట విశేషము. ఇది నాటి వ్యావహారిక భాషా సరళికి నిదర్శనము.

6. వచ్చితిని అను భూతకాలిక క్రియను వస్తిని అని ప్రయోగించినాడు. 'ఆతురమ్మున వస్తినభవ'[3]

7. చేయును అను భవిష్యత్కాల క్రియను చేసును అని ప్రయోగించినాడు. ఇది ప్రాసస్థానమున నుండుట విశేషము.

'...................... తనకు

దాసుండుగా జేసి తగనశ్వములకు

జేసునింకొక వగ సిద్ధమ్ముగాగ'[4]

8. కొనుచు, వినుచు వంటి క్రియలు కొంచు, వించులుగా ప్రయోగింప బడినవి. 'గుఱ్ఱాల గొంచు'[5], చోడండువించు[6]

ఇవికాక చొక్కనాథ చరిత్రమునందు తిరువేంగళ కవి నాటి వ్యవహారములోనున్న అనేక క్రియాపదముల నిందు ప్రయోగించినాడు.

## ధ్వనుల మార్పులు

**I లోపదీర్ఘత :** లోపదీర్ఘత అనగా ఉచ్చారణమున నొక యక్షరము లోపించి యట్లు లోపించుట వలన గలిగిన హ్రస్వత పోవునట్లు ప్రక్క యచ్చు దీర్ఘమగుట[7]. చొక్కనాథ చరిత్రము నందలి ఈ క్రింది శబ్దములు లోపదీర్ఘత కుదాహరణములు.

| | | | |
|---|---|---|---|
| 1. | ముత్యముల | అనుటకు బదులు ముత్యాల[8] | అని ప్రయోగించినాడు. |
| 2. | కంఠమున | " కంఠాన[9] | " |

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 261.
2. చొక్కనాథ చరిత్ర. పుట 267.
3. చొక్కనాథ చరిత్ర. పుట 355.
4. చొక్కనాథ చరిత్ర. పుట 289.
5. చొక్కనాథ చరిత్ర. పుట 188.
6. చొక్కనాథ చరిత్ర. పుట 197.
7. ఆంధ్రభాషా వికాసము. పుట 298.
8. చొక్కనాథ చరిత్ర. పుట 80
9. చొక్కనాథ చరిత్ర. పుట 161.

3. మైనమున ” మైనాన[1] అని ప్రయోగించినాడు.
4. గుఱ్ఱముల గొనుచు ” గుఱ్ఱాల గొంచు[2] ”
5. మొగసాల ” మోసాల[3] ”
6. చందమున ” చందాన[4] ”
7. నీసముఖమున ” నీ సముఖాన[5] ”
8. స్వప్నమున ” స్వప్నాన[5] ”
9. పొదియ మహాముల ” పొదియమామల[7] ”
10. చిత్తమున ” చిత్తాన[8] ”

**II. స్వరభక్తి :** సంయుక్తాక్షరము నడుమ నొక యచ్చు చేరి యుచ్చారణమును సులభ పఱచుటయే స్వరభక్తి లక్షణమ్ము[9]. చొక్కనాథ చరిత్రము నుండి దీని కుదాహరణలు.

1. ఆర్షంబైన అనుటకు బదులు అరుషంబైన[10] అని ప్రయోగం
2. జామాతృ ” జామాతురు[11] ”
3. హర్షము ” హరుషమ్ము[12] ”
4. సెట్టియిండ్లను ” సెట్టియిండులను[13] ”

పై వానిలో ఒకటవ, మూడవ పదములు ప్రాసస్థానమున ప్రయోగించి యున్నవి.

**III. వర్ణనాశము :** రెండు హల్లుల నడుమ నున్న యచ్చు ఉచ్చారణ త్వరలో నశించి యా రెండు హల్లులను గలసి మఱికొంత కాలమునకు సమీకరణము గలుగుచుండును. ఈ వర్ణనాశము స్వరభక్తికి విపరీతమయినది[14].

1. వేడుక అనుటకు వేడ్క[15] యని,

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 181.
2. చొక్కనాథ చరిత్ర. పుట 188.
3. చొక్కనాథ చరిత్ర. పుట 190.
4. చొక్కనాథ చరిత్ర. పుట 198.
5. చొక్కనాథ చరిత్ర. పుట 223
6. చొక్కనాథ చరిత్ర. పుట 242.
7. చొక్కనాథ చరిత్ర. పుట 270.
8. చొక్కనాథ చరిత్ర. పుట 343, 346.
9. ఆంధ్రభాషా వికాసము. పుట 300.
10. చొక్కనాథ చరిత్ర. పుట 64.
11. చొక్కనాథ చరిత్ర. పుట 292.
12. చొక్కనాథ చరిత్ర. పుట 342.
13. చొక్కనాథ చరిత్ర. పుట 352.
14. ఆంధ్రభాషా వికాసము. పుట 300.
15. చొక్కనాథ చరిత్ర. పుట 19.

2. పిలిచి " పిల్చి[1] యని
3. కలిమి " కల్మి[2] యని తిరువేంగళ కవి ప్రయోగించినాడు.

**IV. వర్ణసమీకరణము:** వర్ణసమీకరణమనగా రెండు భిన్న వర్ణముల యొక్క కూడిక ఏకవర్ణముగా మారుట[3]. దీని కుదాహరణములు

1. ఒరులజొచ్చి అనుటకు బదులు ఒర్లజొచ్చి[4]
2. గుడిలోన " గుళ్లోన[5]
3. కుమారులు " కుమాళ్లు[6]
4. వేయిమూడలు " వేమాళ్లు[7]
5. ఆమాడలు " అమాళ్లు[8]

'కనక మంటపమున వేమాళ్లు గంటు గట్టించె' 'అమాళ్ల ముడుపు' అని వీటికి ప్రయోగములు.

**V. వర్ణాగమము :** సామ్యము వలన తప్పుగా క్రొత్త యక్షరములు జేరుట వర్ణాగమము[9] ఉదా.కు చొక్కనాథ చరిత్రమున నాలుగవ లీలలో తిరువేంగళ కవి వేగుచుక్క అను పదమును వేగురుచుక్క, 'పొడిచె వేగురు జుక్క పురుహూతు దిశను'[10] అను చరణమున ప్రయోగించినాడు.

## ధ్వన్యనుకరణ శబ్దములు

చొక్కనాథ చరిత్రమునందు ఇట్టి శబ్దముల ప్రయోగములకు ఈ క్రిందివి ఉదాహరణలు

1. 'గజ్జునిత్రేప'[11]
2. గడగడవణకుచు[12]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 48.
2 చొక్కనాథ చరిత్ర. పుట 54.
3. ఆంధ్రభాషా వికాసము. పుట 296.
4. చొక్కనాథ చరిత్ర. పుట 193.
5. చొక్కనాథ చరిత్ర. పుట 201.
6. చొక్కనాథ చరిత్ర. పుట 238.
7. చొక్కనాథ చరిత్ర. పుట 263.
8. చొక్కనాథ చరిత్ర. పుట 264.
9. ఆంధ్రభాషా వికాసము. పుట 300.
10. చొక్కనాథ చరిత్ర పుట 39.
11. చొక్కనాథ చరిత్ర. పుట 145.
12. చొక్కనాథ చరిత్ర. పుట 148.

3. పడవడ దేహంబు వణకంగజొచ్చె.[1]
4. పడిపడి చారుల బంపి[2] - ఇందు 'పడిపడి' శబ్దము త్వరితార్థమున నుపయుక్తమైనది.
5. సురసుర స్రుక్కి[3]
6. 'దురదుర తురగ మందిరమున కరిగి'[4] - ఇందు 'దురదుర' శబ్దము గమ్యార్థమునకనుకరణము.
7. 'టాటోటన్ని'[5] ఇది నేటి 'అటహాట్' అను ధ్వన్యనుకరణ శబ్దమునకు సమానార్థకము. తూలనాడినప్పుడు ప్రయోగించునది.

'........టాటోటని నేడు నాసవతి
..............................
నన్నుబోనాడె' నని ప్రయోగము.

## జంటపదములు

| | | | |
|---|---|---|---|
| 1. | అప్పు సప్పులు | - | 'పురములో నప్పుసప్పులు నిచ్చుచుండు'[6]<br>'అప్పుసప్పుల వారి'[7] |
| 2. | కాసువీసము | - | ' నాకాసువీసమంతటికిని వానినే కర్తజేసి'[8] |
| 3. | నడిమధ్యమున | - | 'మునుకొని నడిమధ్యమున వైచిరి'[9] |
| 4. | బేరసారములు | - | 'బేరసారములాడి'[10] |

పై జంట పదములను పరిశీలించినపుడు ఇవి రెండు రకములుగా కనుపించుచున్నవి. మొదటి పదము అర్థవంతమై, రెండవ పదము అర్థములేక యున్నవి. ఒకరకము. రెండవతెగకు చెందిన జంటపదములలోమొదటి పదమునకున్న అర్థమేరెండవపదమునకు గలవి. మొదటి రకమునకు 1, 4 ఉదాహరణలు కాగా రెండవ మూడవ ఉదాహరణలు రెండవదానికి చెందినవి.

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 219.
2 చొక్కనాథ చరిత్ర. పుట 226.
3. చొక్కనాథ చరిత్ర. పుట 249.
4. చొక్కనాథ చరిత్ర పుట 302.
5. చొక్కనాథ చరిత్ర. పుట 355.
6. చొక్కనాథ చరిత్ర. పుట 193.
7. చొక్కనాథ చరిత్ర. పుట 195.
8. చొక్కనాథ చరిత్ర. పుట 195.
9. చొక్కనాథ చరిత్ర. పుట 334.
10. చొక్కనాథ చరిత్ర. పుట 358.

## నామ పదములు – వాని యౌచిత్యము

1. 'చొక్కనాథుడు'
'అనఘాత్ముఁడా యింద్రుఁడా దేవునపుడు
తనదు సహస్రనేత్రములను జూడ
కోటి సూర్య ప్రభా కోటుల తోడ
వాటమై రూపలావణ్యమ్ములందుఁ
జూచినఁ జక్కనై శోభిల్లుటకును
శ్రీ చొక్కనాథుడై శ్రీ కరంబయ్యె'[1]

2. 'పొత్తామర'
'చాల సౌవర్ణ పుష్పములుద్భవింపఁ
బోలంగ నాకొలన్ బొత్తామరయ్యె'[2]

3. వైఖానది
'వేగవతీనామ విఖ్యాతిమించి
బాగొప్పవైఖ నాబరగె నచ్చటను'[3]

4. ఉగ్రపాండ్యుడు
(i) 'ఉగ్రునంశంబుననుదయించుకతన
నుగ్రపాండియ నామమొనరించిరపుడు'[4]
(ii) 'ఉగ్రునంశంబున నుదయించుకతన
నుగ్రపాండీశత యొనరెడు నిపుడు'[5]

5. శివలోకము; అభిషేక చొక్కనాయకుడు
'సౌందర్యపతి దేవ సంవత్సరములు
నందమ్ముగాఁ బదియాఱువేలవని
మధురాపురమ్ము సమ్మతినేలు కతన
నధికమై శివలోక మయ్యెనప్పురము
నాయెడ నా స్వామి యభిషేక చొక్క
నాయకుండనియెడి నామంబు దాల్చె'[6]

---

1. చొక్కనాథ చరిత్ర. పుటలు 27, 28.
2. చొక్కనాథ చరిత్ర. పుట 28.
3. చొక్కనాథ చరిత్ర. పుట 68
4. చొక్కనాథ చరిత్ర. పుట 75.
5. చొక్కనాథ చరిత్ర. పుట 88.
6. చొక్కనాథ చరిత్ర. పుట 82

6. నలుదమల్ కూటము

'సమముగా నామేఘ సంఘముల్ నాల్గు
కొమరొప్పఁ గూటమ్ముఁ గూడిన కతన
నలు దమల్ కూటమై నల్దిక్కులందు
పలుమఱు సెప్పంగఁ బరగె నామధుర'[1]

7. ఆ నెమవెలందిమలలు

'అగజంబవని పైనవలీల నపుడు
వేగంబఁ బడనేసె విశ్వేశ్వరుండు
పరగంగ నాకళేబరముఁ 'యాలంది'
మఱి 'యానెమవెలంది' మలలన బఱగె'[2] ఆ గజమనగా జైనులంపిన గజము.

8. అట్టాల చొక్కడు.

'చెలగి యాతని భక్తి చేకొని యొక్క
విలు కాడు గానందు విచ్చేసి స్వామి
సొంపొందనట్టాల చొక్కడై పేరు
పెంపొందనెపుడును పేర్కొననుండె'[3] ఆతడనగా పాండ్యరాజు.

9. హాలాస్యపురము

'వెలయుంగ నప్పుడు విషమంటు కతన
పొలుపొంద హాలాస్యపురమనఁబరగె'[4]

పై ద్విపదలోని 'అప్పుడు' అనగా జైనులంపిన విష సర్పము విషము గ్రక్కినప్పుడని యర్థము.

10. మధురాపురము. చొక్కనాథుడు జైనులంపిన విష సర్పము గ్రక్కిన విషమును తనతలపై నున్న చంద్రునందలి యమృతమును దీసిచల్లుటవలన మధురాపురమని పేరు కలిగినది.

'విధు సుధా ధారల వీధులఁజల్లి
మధురాపురంబన మహి సొంపు మిగుల'[5]

11. నాగాద్రి

' ఆ విషంబణచి యాయహి కళేబరము
నావంక నాగాద్రియను పేరుఁ జేసి'[6]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 114.
2. చొక్కనాథ చరిత్ర. పుట 121.
3. చొక్కనాథ చరిత్ర. పుట 122.
4. చొక్కనాథ చరిత్ర. పుట 146.
5. చొక్కనాథ చరిత్ర. పుట 146.
6. చొక్కనాథ చరిత్ర. పుట 146.

12. వృషభాద్రి - తల యేఱు

' ఆయావు బడినట్టి యా స్థలమ్మునను
నాయెడ వృష భాద్రి యశగ్రరైయొప్పెఁ
గలయ నాధేనువు కన్నీరునందుఁ
దల యేఱు ననుపేర ధరమించి వెలసె'[1] ఆయావు అనగా జైనులంపిన మాయ గోవు. ఇందు చచ్చిపడినది గోవుకాగా వృషభాద్రియని పేరు వచ్చుట చిత్రముగా నున్నది.

13. సౌందర్యనాయకుడు

'తనర నాస్వామి సౌందర్యమై యుండి
నను, పేర సౌందర్య నాయకుండయ్యె'[2]
సౌందర్యమై యుండినను అనగా సుందరమై యుండుటవలన.

14. 'కొందాళి'

'అందు ముంచుటఁ జేసి యా యగడ్తకును
కొందాళి యను పేరు కొమ రొప్పబఱగె'[3]- అందు ముంచుటఁ జేసి యనగా ఆశ్విక యోధుడై వచ్చిన చొక్కనాథుడు చోళ సైన్యములను ఆయగడ్త లో ముంచుట వలన అని అర్ధము.

15. 'పందిమల'

'పందులుండుటఁ జేసి పరగ నాకొండ
పంది మలయనంగ బరగె నెల్లెడల'[4]

16. నడువూరు

'ఇరవుగా నాయూరి కేయు పద్రవము
లరయంగ లేనట్టి యా నిమిత్తమున
గడగి యా మధుర విఖ్యాతి గానంత
నడువూరు ననియెడి నామమ్ముగాంచె'[5]

17. 'వాల వాయి'

(i) 'హాలాస్య పురమున కానిమిత్తమున
వాల వాయను పేరు వార్తకునెక్కె'[6] - ఆ నిమిత్తముననగా భుజగేంద్రుడు తన వాలముతో జుట్టి మధురకు ఎల్ల జూపుట వలన.

(ii) వలనొప్పఁ దిరువాల వాయైన మధుర'[7]

---

1. చొక్కనాధ చరిత్ర. పుటలు 149, 150
2. చొక్కనాధ చరిత్ర. పుట 182.
3. చొక్కనాధ చరిత్ర. పుట 187.
4. చొక్కనాధ చరిత్ర. పుట 243.
5. చొక్కనాధ చరిత్ర. పుట 252.
6, 7. చొక్కనాధ చరిత్ర. పుట 253.

18. 'తిరువాల వాయుడు - చొక్కనాథుని నామాంతరము
'తిరువాల వాయుండైన వామదేవునిని'[1]

19. ఉత్తర హాలాస్యము
'అప్పుడా సౌందర్యుడా వైఖ దరిని
నొప్పుగా విచ్చేసి యున్న యా స్థలము
నరయంగ నుత్తర హాలాస్యమనగ
వెలసెను నచ్చోట వినుతింపనంత'[2]

20. మాణిక్య వాచకుడు .
'వలను మీ ఱఁగఁ దిరువాదయూరికిని
దెలియంగ జ్ఞానోపదేశమ్ముఁ జేసి
జగతి మాణిక్య వాచకుఁడను నామ
మగణితమ్ముగ బెట్టి యతని మన్నించి'[3]

ఇందు తిరువాద యూరునికి మాణిక్య వాచకుడని పేరిడిన వాడు చొక్కనాథుడు ఇతనికి తెన్నవ బ్రహ్మయని కూడా మరొక పేరున్నది. పాండ్యరాజు మంత్రి పదవిని చ్చి పెట్టిన పేరిది.

21. 'తిరువడగం'
'ఇరవుగా నా పత్రికిచ్చిన స్థలము
కరమొప్పుఁ దిరువడగంబనఁ బరగె'[4]

22. 'కొఱ్ఱుబడవీడు'
' ఆశూలములఁ గూలినట్టి యా స్థలము
భాసురమ్ముగఁ గొఱ్ఱు బడవీడు నయ్యె.[5]

పై విధముగా తిరువేంగళకవి చొక్కనాథ చరిత్రమందు పేర్కొనిన స్థల, దుర్గ, వన, క్షేత్రాది వివిధ నామములకు వాని సార్థక్యమును గూర్చి వివరించినాడు - పైన చూపిన వానిలో అభిషేక చొక్కనాయకుడు, అట్టాల చొక్కడు, సౌందర్యనాయకుడు, తిరువాల వాయుడు, అనునవి చొక్కనాథుని నామములు. శివలోకము, నలుడమల్ కూటము, హాలాస్యపురము, నడుపూరు, వాలవాయి, అనునవి మధురకు పేర్లు.

## లోకోక్తులు

చొక ... థ చరిత్రము నందు తిరువేంగళ కవి కథలలో ఆయా సందర్భములందు చక్కని లోకోక్తులను ప్రయోగించినాడు. వానినిట వ్రాయుదును.

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 253.
2. చొక్కనాథ చరిత్ర. పుట 279.
3. చొక్కనాథ చరిత్ర. పుట 285.
4. చొక్కనాథ చరిత్ర. పుట 334.
5. చొక్కనాథ చరిత్ర. పుట 339.

1. ప్రథమాశ్వాసములోని మొదటి లీలలో

'గాజు పూసకు వెదుకగా దివ్యరత్న
రాజ మచ్చట గాంచి రంజిల్లినట్లు'[1]

ఇంద్రుడు మృగయా వినోదమునకై కదంబారణ్యమునకు రాగా నచ్చట వేటవలన కలుగు సంతోషము కంటె మించిన యానందమును ఆదిదేవుని దర్శించి పొందిన సందర్భమున తిరువేంగళకవి పై లోకోక్తిని ప్రయోగించినాడు.

2. అదే లీలలో ఇంద్రుడు వృత్రహత్యాదోషమును బాపుమని చొక్కనాథుని ప్రార్థించిన సందర్భమున తిరువేంగళకవి

"ఎఱుగక చేసినదేమైనగాని
యెఱిగి చేసినఁ బాయదేమియున్నైన'[2] - అను లోకోక్తిని ప్రయోగించినాడు.

3. తృతీయాశ్వాసములోని పదునాలుగవలీలలో

'వలనుగా ధనము లవారితంబుగను
గలిగినవారికిఁ గరు వేమి సేయు'[3]

సౌందర్యపతి తన కుమారుడైన ఉగ్రునకు పట్టాభిషేక సమయమున నిచ్చిన చండాయుధము చే మేరువును గొట్టి ధనమును దెచ్చి పాండ్యరాజ్యమునకు వాటిల్లిన ఈతి బాధను బాపుమని చెప్పిన సందర్భమున పై లోకోక్తి యున్నది.

4. షష్ఠాశ్వాసములోని ముప్పది యేడవలీలలో చొక్కనాథుడు అంగయకణ్ణెమ్మతో నొకనాడు తన భక్తుడైన హలదేవుని నిత్యాన్నదాన వ్రత ప్రశంసజేయగా నామె 'కలిగిన వాడు గాన జేయుచున్నాడు లేని నాడట్లు చేయునా'? యని ప్రశ్నించగా శివుడా దేవికి సమాధానమిచ్చుచు-

'పెట్టెడివారలు పేదలైనాను
పెట్టుదు రెంతయుఁ బ్రియముతో నెపుడు.
ధరలోభి వానికి ధనము గలిగినను
మరణ మొందును గాని మఱి కాసునిడదు'[4] అని అనినాడు.

తిరువేంగళకవి చొక్కనాథునిచే పలికించిన ఈ వాక్కులు చక్కని లోకోక్తులు-

5. అదే లీలలో - హల దేవుడు చొక్కనాథుడొసగిన ధాన్యపుముడిని గ్రహించి యాదేవుని స్తుతించుచు పలికిన

'తలచిన వారికిఁ దంగేటి జున్ను
కలదన్న వారి కక్కఱ తీర్చు దేవ!

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 21.
2. చొక్కనాథ చరిత్ర. పుట 28.
3. చొక్కనాథ చరిత్ర. పుట 94.
4. చొక్కనాథ చరిత్ర. పుట 189.

పేదల పాలిటి పెన్నిధానంబ!

సాధుల పాలిటి సంతాన తరువ![1] - అను వాక్యములు

తిరువేంగళకవి యాతని నోట అనిపించిన లోకోక్తులు.

6. సప్తమాశ్వాసములోని నలువది మూఁడవ లీలలో చొక్కనాథుడు తన భక్తురాలైన బాణు వనిత పాతివ్రత్యమును గాపాడుటకై సంగీత విద్వాంసుని రూపమున రాగా -

'అరయ దైవ సహాయులైన వారలకు

మఱి యనే కాపదల్ మగ్నమై పోవు[2]' నని సభికులు కొని యాడిన వాక్యము కవి ప్రయోగించిన లోకోక్తి.

## జాతీయములు

చొక్కనాథ చరిత్రమునందు తిరువేంగళ కవి కథలలో అయా సందర్భములలో లోకోక్తులనే కాక జాతీయములను కూడా ప్రయోగించినాడు.

1. ప్రథమాశ్వాసములోని రెండవలీలలో దుర్వాసుడు ఇంద్రుని 'పాండ్య భూపరు చక్రాసిచే నీ మస్తకము వేయి ప్రక్కలగునని శపించి అనంతరము మస్తకమునకు గాక మకుటమునకు హాని కలుగునని అనుగ్రహించి వెడలి పోగా ఇంద్రుడు ఊరటచెందు సమయమున తిరువేంగళకవి 'వెనుకొని పులి నాకి విడిచెనేయనుచు[3]' అనుచరణమున 'పులి నాకివిడుచుట' అను జాతీయమును ప్రయోగించినాడు. దీని యర్థము గొప్ప యాపద తప్పుట[4].

2. ద్వితీయాశ్వాసములోని ఆఱవలీలలో తటాతక క్షేత్ర యాత్రా విశేషములను తన తల్లి కెఱిగించు సందర్భమున 'పూస గ్రుచ్చిన యట్లు పేర్కొని విన్నవింప[5]' అను చరణమున కవి 'పూస గ్రుచ్చిన యట్లు' అను జాతీయమును ప్రయోగించినాడు. దీనికి వరుసగా, సక్రమముగా నని యర్థములున్నవి.[6]

3. తృతీయాశ్వాసములోని పదునాలుగవలీలలో ఉగ్రపాండ్యుడు చెఱబట్టిన మేఘములను విడువుమని ఇంద్రుడు మాతలిచే వర్తమానమంపగా ఉగ్రుడు 'వర్షించునట్లు పూటవెట్టక' మేఘములను విడువననియెను. ఈ సందర్భమున తిరువేంగళకవి 'వెసపూట వెట్టక విడువనేనని[7]' అను పాదమున 'పూట వెట్టు' అను జాతీయమును ప్రయోగించినాడు. దీని యర్థము పూచి వహింపఁ జేయు.[8]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 192.
2. చొక్కనాథ చరిత్ర. పుట 228.
3. చొక్కనాథ చరిత్ర. పుట 33.
4. సూర్యరాయాంధ్ర నిఘంటువు. ఐదవ సంపుటము. పుట 468.
5. చొక్కనాథ చరిత్ర. పుట 58.
6. సూర్యరాయాంధ్ర నిఘంటువు. ఐదవ సంపుటము. పుట 517.
7. చొక్కనాథ చరిత్ర. పుట 92.
8. సూర్యరాయాంధ్ర నిఘంటువు. ఐదవ సంపుటము. పుట 492.

ఇట్టివే మరికొన్ని జాతీయములు చొక్కనాథ చరిత్రమున నున్నవి.

1. 'నేల యీనినయట్లు'[1]- పంచమాశ్వాసము, ఇరువది తొమ్మిదవలీల
2. 'కొంగున ముడి వేసుకొని'[2] - షష్ఠాశ్వాసము, ముప్పది యాఱవలీల
3. 'సూదులుఁ జొన్పుచొప్పాయె'[3] - సప్తమాశ్వాసము, నలువది మూడవలీల.
4. 'తుమ్మిన వానికిఁ దోడఁ బంచాక్ష
   రమ్మహా దివ్య మంత్రముఁదోచినట్లు'[4]- అష్టమాశ్వాసము నలువది తొమ్మిదవలీల
5. 'నేరు గల్గిన వాని కూరోర్వదు'[5] - నవమాశ్వాసము, ఏబది తొమ్మిదవలీల

## సంస్కృత సూక్తులు

చొక్కనాథ చరిత్రమున తిరువేంగళకవి తెలుగులోకోక్తులనే కాక సంస్కృత సూక్తులను కూడ ప్రయోగించినాడు. అవి యివి;

1. 'అపుత్రస్యగతిర్నాస్తి'[6]
2. 'రాజమతోధర్మ'[7]
3. యధారాజా తథా ప్రజ'[8]
4. 'రాజారాష్ట్రకృతము పాపమ్ము'[9]

## అన్యదేశ్యములు

చొక్కనాథ చరిత్రమునందలి ఇతివృత్తము తమిళ దేశమునకు చెందినది గావున ఇందు తమిళ భాషాపదములు విరివిగాను, మరియు నీ కావ్యము పదునాఱవ శతాబ్దమున ప్రభవించినది గావున నాడు మనదేశమును పరిపాలించు మహమ్మదీయుల భాషయగు ఉర్దూపదములు ఉపయుక్తములైనవి. వానిలో కొన్నిటినీ క్రింద వ్రాయుదును.

## తమిళపదములు

1. 'పొదియ మహామల'[10] ఇది వింధ్యాద్రికి పేరు. ఈ పదములోని 'మహా' యను శబ్దము సంస్కృతపదము. మలై యను తమిళ శబ్దమునకు వికృతి 'మల' యనునది.

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 152.
2. చొక్కనాథ చరిత్ర. పుట 185.
3. చొక్కనాథ చరిత్ర. పుట 221.
4. చొక్కనాథ చరిత్ర. పుట 257.
5. చొక్కనాథ చరిత్ర. పుట 310.
6. చొక్కనాథ చరిత్ర. పుట 45.
7. చొక్కనాథ చరిత్ర. పుట 224.
8. చొక్కనాథ చరిత్ర. పుట 303.
9. చొక్కనాథ చరిత్ర. పుట 323.
10. చొక్కనాథ చరిత్ర. పుటలు 9,10.

ఈ రెంటి సమాసపదము 'పొదియ మహామల' దీనిని 'పొదియ మామల'[1] అని కూడా తిరువేంగళ కవి ప్రయోగించినాడు.

2. 'ముమ్మొలత్తాయి'[2] అనగా మూడు చన్నులు గలదని యర్థము
   ఇది తటాతకకు మరొకపేరు.
3. "పలివెళి కాదలాంబ"[3] - ఇది పార్వతీ దేవి నామాంతరము.
4. (i) అంగయకణ్ణమ్మ[4]
   (ii) అంగయర్ కణ్ణియమ్మ[5] - ఈ రెండు పదములు మీనాక్షిపేర్లు.
5. (i) 'చొన్నాయి'[6]
   (ii) చొన్నానయాళు[7] - ఇవి వారవనిత పేర్లు
6. ఈ పవళ్లాళు[8] - సంగీత విద్వాంసురాలిపేరు.
7. 'మంగయకర్ష'[9] మంగయాకర్షయమ్మ,[10] మంగయక్కర్షయమ్మ,[11] మంగయక్కర్షి[12], అనునవి కుబ్జ పాండ్యుని భార్యకు గల పేర్లు.
8. ఫలియంజి చొక్కనాయకుడు లేదా ఫలియంజి సౌందర్యుడు[13] ఇవి సుందరేశ్వరుని పేర్లు.
9. అట్టాలనాథ,[14] ఫలియంజినాథ[15] ఇవి కూడా ఆ దేవుని పేర్లే.
10. అళగయపెరుమాళ్లు [16]- విష్ణుమూర్తి నామము.
11. 'కాద్వెట్టి'[17] కాంతార విచ్ఛేదకుని పేరు.
12. పల్లాణుడు, ఈపవళ్లాలుడు[18] -గాయకుని పేర్లు.

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 270.
2. చొక్కనాథ చరిత్ర. పుట 48.
3. చొక్కనాథ చరిత్ర. పుట 95.
4. చొక్కనాథ చరిత్ర. పుట 237.
5. చొక్కనాథ చరిత్ర. పుటలు 238, 241, 242.
6. చొక్కనాథ చరిత్ర. పుటలు 180, 181, 182.
7. చొక్కనాథ చరిత్ర. పుట 183.
8. చొక్కనాథ చరిత్ర. పుట 222.
9, 10. చొక్కనాథ చరిత్ర. పుట 318.
11. చొక్కనాథ చరిత్ర. పుట 320.
12. చొక్కనాథ చరిత్ర. పుట 322.
13. చొక్కనాథ చరిత్ర. పుట 135.
14, 15. చొక్కనాథ చరిత్ర. పుట 321.
16. చొక్కనాథ చరిత్ర. పుట 44.
17. చొక్కనాథ చరిత్ర. పుట 171.
18. చొక్కనాథ చరిత్ర. పుట 205.

13. నక్కీరదేవుడు, నత్కీరదేవుడు[1], నత్కీరుడు[2], నక్కీరుడు[3] అనునవి నలువదెనమండ్రు ద్రావిడ కవులలో నొకని పేరు. లేదా ద్రావిడ కవిత్రయములో నొకని పేరు.
14. ఎడక్కోడడు,[4] అడుక్కాండడు,[5] అనునవి మధ్యకాంతారుని పేర్లు
15. తెన్నవ బ్రహ్మ,[6] తెన్నవ బ్రహ్మరాయండు[7] - తిరువాదయూరుని పేర్లు.
16. తిరునావుకరశరు,[8] తిరునావు కర్శరు,[9] - ఒక తమిళ శివభక్తునిపేర్లు.
17. అళగరిపురి [10], అళగరి,[11] - వైష్ణవ పుణ్యక్షేత్రము.
18. 'తిరువెడమరుదూరు'[12] - దీనికి మధ్యార్జునమని మరియొక పేరు.
19. తిరుపెరుందూరు,[13]
20. తిరువాయూరు,[14] తిరుపందదూరు.[15]
21. తిరువంబలము[16] - ఇది కూడా ఒక పుణ్య క్షేత్రముపేరు.
22. శియ్యాలూరు[17] - గ్రామనామము.
23. తిరుపెరుంబనునూరు[18] తిరుపెరుంబీశు,[19] తిరు పెరేశ్వరు[20] తిరుపెరుంబాపురి[21] అను ప్రయోగములలోని ఊరిపేరు తిరుపెరుంబ్ - అనునది.
24. మణులూరు[22] - గ్రామ నామము.

---

1. చొక్కనాథ చరిత్ర. పుటలు 266, 268, 269
2. చొక్కనాథ చరిత్ర. పుటలు 267, 268.
3. చొక్కనాథ చరిత్ర. పుట 267.
4 చొక్కనాథ చరిత్ర. పుట 15.
5. చొక్కనాథ చరిత్ర. 277.
6. చొక్కనాథ చరిత్ర. పుట 280.
7, 13. చొక్కనాథ చరిత్ర. పుట 282.
8. చొక్కనాథ చరిత్ర. పుట 319.
9. చొక్కనాథ చరిత్ర. పుట 320.
10. చొక్కనాథ చరిత్ర. పుట 57.
11. చొక్కనాథ చరిత్ర. పుట 253.
12. చొక్కనాథ చరిత్ర. పుట 197.
14. చొక్కనాథ చరిత్ర. పుటలు 283, 284.
15. చొక్కనాథ చరిత్ర. పుట 291.
16. చొక్కనాథ చరిత్ర. పుట 317.
17. చొక్కనాథ చరిత్ర. పుట 319.
18. చొక్కనాథ చరిత్ర. పుట 350.
19. చొక్కనాథ చరిత్ర. పుట 351.
20. చొక్కనాథ చరిత్ర. పుట 352.
21. చొక్కనాథ చరిత్ర. పుట 356.
22. చొక్కనాథ చరిత్ర. పుట 36.

25. పట్టమంగళమ్ము[1] - ఇదికూడ గ్రామమే.
26. పొన్నాంబలమ్ము[2] - హేమాబ్జసరసి
27. 'తిరువడగం'[3] - స్థల నామము
28. పలియడు[4] - భరద్వాజపక్షి.
29. 'నీవెదా మాపాలి నిజమైన వేల్పు'[5]
30. 'నిలువెళ్ళ మికిఁ గళ్ల మిళ్లెయన్ వార్త'[6]
పైన చూపిన వానిలో స్థలనామములు, గ్రామ నామములు, స్త్రీల పేర్లు. పురుషుల పేర్లు, పక్షిపేరు. కొండ పేరు, కొలనిపేరు ఇత్యాదులు గలవు.

**ఉర్దూపదములు**

1. 'ఛప్పన్న దేశ రాజన్యులు[7]' ఛప్పన్న భూపాలకుల్కు[8]' - వీనిలోని 'ఛప్పన్' అనునది సంఖ్యా వాచకశబ్దము. ఛప్పన్ అనగా ఏబది యాఱు.
2. 'బత్తీసాయుధముల్కు[9]' 'దనర బత్తీసాయుధమ్ముల తోడ' అని ప్రయోగము - బత్తీస్. అనగా ముప్పది రెండని యర్థము.
3. 'ఛత్రీశాయుధం బులు'[10] - ఇందు ఛత్రీన్ అనగా 'ఛత్తీన్' - ముప్పది యాఱని యర్థము. ఇవి కూడ సంఖ్యావాచకములే.
4. ఫౌజు[11] - ఏకవచనం. ఫౌజుల్కు[12] - బహువచనం. సైన్యములని వీని యర్థములు. ''భయమేల జనుమెల్లి ఫౌజుఁ జూపెదను'' 'ఏతెంచు ఫౌజులెల్ల' 'ఫౌజులేర్పఱచుక,' 'చూచుటమేలు ఫౌజుల దేవమీరు' - అనునవి ప్రయోగములు.
5. హజారమ్ము[13] అనగా సభ.

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 167.
2. చొక్కనాథ చరిత్ర. పుట 64.
3. చొక్కనాథ చరిత్ర. పుట 334.
4. చొక్కనాథ చరిత్ర. పుట 245.
5. చొక్కనాథ చరిత్ర. పుట 117.
6. చొక్కనాథ చరిత్ర. పుట 202.
7. చొక్కనాథ చరిత్ర. పుట 51.
8. చొక్కనాథ చరిత్ర. పుట 63.
9. చొక్కనాథ చరిత్ర. పుట 152.
10. చొక్కనాథ చరిత్ర. పుట 90.
11. చొక్కనాథ చరిత్ర. పుట 151.
12. చొక్కనాథ చరిత్ర పుట 152.
13. చొక్కనాథ చరిత్ర. పుట 296.

## ఛందః ప్రయోగము

చొక్కనాథ చరిత్రము ద్విపద కావ్యము గావున నిందు ఛందో వైవిధ్యముండుటకు వీలులేదు. అయినను దీనియందు అనగా ముద్రిత గ్రంథము నందు కొన్ని ఏకపదలు మరికొన్ని ద్విపదలక్షణముగల మూడు పాదములు మరియు నైదు పాదములు కన్పించుచున్నవి. ఇవి యన్నియు కవికృతములేయనుటకు వీలులేదు. కొన్ని లుప్తములై యుండవచ్చును. కొన్ని ప్రక్షిప్తములై యుండవచ్చును. కొన్ని కవి బుద్ధి పూర్వకముగా ప్రయోగించి యుండవచ్చును. వానినన్నింటి నిట క్రోడీకరించుచున్నాను.

## ముద్రిత గ్రంథమునందలి ఏకపదలు మొదలైనవి

**ఏకపదలు:** ఈ గ్రంథము నందు మొత్తము అరువదిమూడు ఏకపదలు లభించినవి.

**ప్రథమాశ్వాసమునుండి**

| | | | | |
|---|---|---|---|---|
| 1. | ‘శ్రీకరం బైనట్టి చెయ్యేటి దరిని’ | - | పుట | 3 |
| 2. | ‘పొగడొందు సుచితజ్ఞ భోజుడనంగ’ | - | ” | 4 |
| 3. | ‘జమదగ్ని దుర్వాస జహ్ను జాబాలి’ | - | ” | 6 |
| 4. | ‘దేవవాహిని యందు దేవ సన్నిధిని’ | - | ” | 6 |
| 5. | ‘అందమై వేట సన్నాహంబుగాగ’ | - | ” | 19 |
| 6. | ‘కడు వేడ్క చమరీ మృగంబులనెల్ల’ | - | ” | 20 |
| 7. | ‘ఆపుణ్యభూమి కొయ్యనఁ జేరవచ్చి’ | - | ” | 20 |
| 8. | ‘కడు విస్మయంబంది కడు సంతసిల్లి’ | - | ” | 23 |
| 9. | ‘విను దివి జాధీశ విన్నవించెదను’ | - | ” | 24 |
| 10. | ‘కర్పూర కదళికా క్రముక పున్నాగ’ | - | ” | 26 |
| | **ద్వితీయాశ్వాసమునుండి** | | | |
| 11. | ‘తోరమైనట్టి శార్దూలమ్ము గాంచి’ | - | ” | 25 |
| 12. | తెలతెల వారె నల్ దిశలు దీపించె | - | ” | 39 |
| 13. | ‘[1]తివిరి నేనాడని తీర్థముల్ | - | ” | 40 |
| 14. | ‘కాంతారమంతయు ఖండించి వైచి’ | - | ” | 44 |
| 15. | ‘ముదము తోడుత నాగమోకమ్మునరసి’ | - | ” | 55 |
| 16. | ‘చేరిదుష్కృత భంగ శీకరోత్తుంగ’ | - | ” | 55 |
| 17. | ‘గిరి యెక్కి చక్కజాగిలి మ్రొక్కి మఱియు’ | - | ” | 55 |
| 18. | ‘తిరువేంకటాద్రీశు దేవదే వేశు’ | - | ” | 56 |
| 19. | ‘చూడ నొప్పుగ జేసి సురుచిర లీల’ | - | ” | 59 |
| 20. | ‘భక్త సంరక్షణ పారీణుడతని’ | - | ” | 64 |

1. ‘తిరిగి’ పాఠాంతరం – ‘ర’ ప్రాసతోనైనచో మూడు పాదములుండును

**తృతీయాశ్వాసము నుండి**

21. 'ఎలనిల్లు ఘనపుణ్య విమల సారమ్ము' - పుట 95
22. 'వైదేహియును దానువనముల కరిగి' - " 96
23. '.......................నుండ
వలెనంచు చెండి చేవడిమల్లగొట్టి' - " 99
24. 'పురదైత్య హరణాయ భూతేశ్వరాయ' - " 103

**చతుర్థాశ్వాసము నుండి**

25. 'బలుడనుద్దైత్యుని బఱువుగా జేసి' - " 108
26. 'ముందరి కేతెంచి మోడ్పు గేలమర' - " 113
27. 'తలచిన యప్పుడు దగనిటురమ్ము' - " 115
28. 'పని బూనివారలు పట్టంగ బోవ' - " 117

**పంచమాశ్వాసము నుండి**

29. 'ఆ విప్రతనయుండు నధిక సౌందర్య' - పుట 137
30. 'పొద వెత్తి భిక్షమప్పుడు బెట్టు వేళ' - 159
31. 'పెరుగుచు నుండిరి పెక్కువల్ గలిగి' - 161
32. 'లీలమైనపుడు ఫలీమంటపమున' - " 166

**షష్ఠాశ్వాసము నుండి**

33. 'స్థావర జంగము సంహార హృదయ' - పుట 173
34. 'గానైక లోల, శ్రీకరుణాలవాల' - " 176
35. 'మడిసెనయ్యుద్ధాన మడియుట కాక' - " 178
36. '..................సంబంధ
ములతోడగల రథంబులు గల్గ నాకు - " 184
37. 'సర్వలోకాధార ! శాంభవీరమణ' - " 197
38. 'అని యానతిచ్చిన నా పాండ్యవిభుడు - " 197

**సప్తమాశ్వాసము నుండి**

39. 'చననేమి! వానికిఁ జనుట యదేమి' - పుట 211
40. 'ఈ కంబుకంఠిని నీతలోదరిని' - " 233
41. 'వలగొని యా లీల వర్తించునెపుడు' - " 238
42. 'తల వంచి సాష్టాంగ దండమ్ము వెట్టి' - " 250
43. 'రయముతో గృహములు రమ్యమ్ముగాఁగ' - " 252
44. 'నరవాహన ప్రియ! నాగాసురారి' - " 252
45. 'వలనొప్పఁ దిరువాలవాయైన మధుర' - " 253

**అష్టమాశ్వాసము నుండి**

46. 'ఆశ్రిత వత్సలుఁ డా మహాదేవు' - పుట 255
47. 'అనుచునత్యుగ్రుడై యాటోపమెసగ' - " 257
48. 'కృపతోడ నన్ను రక్షించిన వేల్పు' - " 269
49. 'పన్నగా భరణ సద్భక్తమానసుడు - " 273
50. '................ లేపనము
లను దివ్యభూషణాలంకారములను' - " 274
51. '.................. ప్ర
వీణుడై సౌందర్య విభవ సంపదల' - " 280
52. 'తన నామమతని కీఁదనర గావించి' - పుట 280
53. 'దీర్ఘ నిద్రల బాఱి తెగనున్న వింక' - " 281
54. 'దొరకొన్న భవబంధ దురితముల్ ద్రుంచి' - " 283
55. 'కఱకంఠు గాంచి యక్కడ దృష్టి నిలిపి' - " 284
56. 'నీ మనోజయముగానెమ్మి గుఱ్ఱముల' - 287

**నవమాశ్వాసము నుండి**

57 'సారంగుఁ డళగడు జన్నడు గరుడ' - పుట 293
58 'వినుత కాహళములు విను వీధి మ్రోయ' - " 295
59 'ఓం నమశ్శంకర ! యోనమోభీమ' - " 305
60. '..................శశాంకార్ధ
జూట సన్నిధికి నేడ్చుచుఁ బోయి మ్రొక్కి - " 351
61. 'బడ బానలము కంటె పావకు కంటె' - " 354
62. 'అనాతి లజ్జాన తాస్యయై యేను' - " 354
63. '..................సాటియైన
దైవంబు లేదని తగుభక్తి తోడ' - " 360

**మూడు పాదములు గలవి:** ద్విపదలక్షణము గల మూడు పాదములు ఇందు ఇరువది యొక్కటి యున్నవి. **ప్రథమాశ్వాసము నుండి**

1. 'అందుండు శ్రీమన్మహాదేవ దేవుఁ
డిందు జూటుఁడు సోముఁడీశ్వరేశ్వరుడు
సౌందర్య నాథుండు సర్వేశ్వరుండు' - పుట 12
2. 'కొలకులందును వాపి కూపంబులందు
స్థల దుర్గ వనదుర్గ జలదుర్గములను
బొలు పొంద గిరిదుర్గములు పిక్కటిల్లి' - " 19

3. 'చెక్కి చెండాడి విచ్ఛేదంబు జేసి
తక్కిన జంతువుల్ దగ జంపి చంపి
వెక్కసంబుగ మించి వేడ్కలు నించి' - " 20

4. 'చారుచామీకర చామరంబులును'
భూరి రత్నాంచిత భూషణమ్ములును
పరగ సాంబ్రాణి ధూపముల వాసనలు' - పుట 25

5. 'ముని నాథునకు నంత మోడ్చు, గేలమర
న నిమిషాధీశుఁ డీట్లని విన్నవించె
ముని నాథ నాతప్పు మొగిగాచితేని' - " 32

**ద్వితీయాశ్వాసము నుండి**

6. 'అరుదుగా నట వినో దార్థమ్ముగాగ'
గరమొప్ప నంగయ కణ్ణెమ్మదాను
సురవైభవమ్ముల సొంపుతో నుండ' - పుట 35

7. 'వెడలి వచ్చుచుఁ బురవీధులంగళ్లు -
గుడి గోపురమ్ములు కోటలు మేడ
లడర నల్దిక్కుల నమ్మహామధుర' - " 38

8. 'అట్టి యాశ్రమమును నట్టి పట్టణము
నట్టి దేశమ్మును నట్టి దైవంబు
గట్టిగా నెచ్చోటగని విని యెఱుఁగ' - " 40

9. 'పుత్రులు లేకున్నఁ బుణ్యమ్ము లేదు
పుత్రులు లేనింట భుజియింప రాదు
పుత్రులు లేనింటఁ బొందదు లక్ష్మి' - " 45

10. 'సరవితో హిమవంత శైలమ్ము నొరసి
పరగ సాలగ్రామ పర్వతం బరసి
తిరమైన కేదార తీర్థమ్ము గ్రోలి' - " 55

**తృతీయాశ్వాసము నుండి**

11. 'పనసలష్టకములు పన్నముల్ జటలు
మునుకొని షట్సూత్రములును పర్ణములు
ఘనశాఖ లారణ్య కారకమ్ములును' - పుట 103

**చతుర్థాశ్వాసము నుండి**

12. 'హలధర! హరిణాంక! యఖిల! నిశ్శంక!
ప్రళయ కాలములేక ప్రళయ కాలమ్ము
గలిగి యీ వార్ధులు గదలిటువచ్చు' - పుట 113

13. 'ఖ్యాతిగా నాదేవుడట్ల కావించె
నా తాండవంబాడి నట్టి మంటపము
భూతలాధీశుడప్పుడు నొప్పిదముగ' - " 129

**పంచమ, షష్ఠాశ్వాసములలోనివి మృగ్యము**

**సప్తమాశ్వాసము నుండి**

14. 'హరినేత్ర పూజిత హరిహయమధ్య
హరి వైరి భూషిత! హరిణాంక హస్త!
హరిణాక్షి వామాంక! హారిత హరిణ' - " 207

15. 'అంబరకేశ! దిగంబర యీశ!
యంబర మణి సహస్రాంశు ప్రకాశ
శంబరారి ధ్వంస! శశికళోత్తంస!' - " 230

16. 'నీవు పుణ్యుండవు నీవు మాన్యుడవు
నీవంటి సుజ్ఞాని నీవంటి వంశ
పావన చరితుండు పరికింపఁ గలడె' - " 251

**అష్టమాశ్వాసము నుండి**

17. "వినువీధిఁ బలికె నా విశ్వేశుఁడపుడు
జననాథ నీకును సంతాపమేల
ననయమ్ము మేము నీ యాత్మనుండగను" - " 257

18. 'మఱి యానతిచ్చిన మధురేశుఁజూచి
కరమొప్పనంగయ కణ్ణమ్మ తనదు
కరయుగమ్ములు మోడ్చి కఱకంఠ! యభవ' - " 269

**నవమాశ్వాసము నుండి**

19. 'పాటించి యిటుగాన పాండ్యభూపాల
మాటలేటికి వాగె మార్చి యేమొసగు
ఘోటకంబులను గైకొంటివి నీవు' - " 314

20. 'కరమర్థి మునుల కగస్త్యుడిట్లనియె
సరవితోడుత జ్ఞానసమ్మంధుఁడపుడు
కరుణించి యా బౌద్ధ గణముల కనియె' - " 335

21. '....................... సాలోక్య
సామీప్య సారూప్య సాయుజ్య పదవు
లా మహాదేవుండు నటవారికిచ్చె
నేమని వర్ణింతు నీశ్వరేశ్వరుని' - " 363

**అయిదుపాదములు గలవి** ఇవి ఇందు మూడు లభించినవి. ప్రథమ ద్వితీయాశ్వాసముల లోనివి మృగ్యము.

**తృతీయాశ్వాసము నుండి**

1. 'కొంతకాలమ్మిట్లు కొనసాగుచుండు
చింతింప వలవదు శ్రీ చొక్కనాథుఁ
డంతటికిని దక్షుఁడై విచారించు
స్వాంతంబునందునసంతాపముడిగి
శాంతుండవగుచువిశ్రాంతితోనుండు' - పుటలు93,94

**చతుర్థాశ్వాసమునుండి**

2. 'సరగఁగౌగిటఁజేర్చి సంతోషమెసగఁ
బరదేశమరిగియాబాల పెండ్లాడి
యరుగుదెంచెను పుత్రుడనిసంతసిల్లి
వారుదెచ్చినయట్టి వర భూషణములు
కూరిమిదగఁబుచ్చికొనియుండిరంత' - పుట 124

**పంచమ, షష్ఠ, సప్తమ, అష్టమాశ్వాసములలోనివి మృగ్యము.**

**నవమాశ్వాసమునుండి**

3. 'ఎన్నాళ్లు కైలాసమెన్నాళ్లు గిరులు
నెన్నాళ్లు నాకసంబెన్నాళ్లు భూమి
యెన్నాళ్లు నక్షత్రమిలలోన నుండు
నన్నాళ్లు మధురలోనఖిలలోకేశ!
పన్నగభూషణ! పళియంజినాథ! - పుట 360

ఇవికాక చొక్కనాథ చరిత్రమునందు ద్విపదతో ద్విపదను గలిపిన పాదములుకూడా కన్పించుచున్నవి. వానినిట జూపుచున్నాను.

**ద్విపదతో ద్విపదను గలిపిన పాదములు ప్రథమాశ్వాసముననివి లేవు.**

**ద్వితీయాశ్వాసము నుండి**

1. 'గరిమతోదక్షిణ కైలాస శిఖరి
తిరుకాళహస్తి కేతెంచి సౌవర్ణ
ముఖి తీర్థమాడి ప్రమోదమ్ముతోడ
నఖిల దైవత కులాధ్యక్షు ఫాలాక్షు' - పుట 56

2. 'వచ్చినవారిని వరుస వేర్వేఱ
నచ్చుగాఁ బిలిచిన నా పతంజలి మ
హాఋషి యనునతడతి భక్తితోడ
నారుషంబైన పొన్నాంబలంబునకు' - " 64

3. 'అంతనా హరియు బ్రహ్మాదులు మునులు
నెంతయుసురలుసురేంద్రుడు ప్రమద
గణములు కిన్నర గంధర్వ యక్ష
ఫణిసిద్ధ సాధ్యులు భరితంబుగాఁగ' - " 66

**తృతీయాశ్వాసము నుండి**

4 బిరుదునందును వ్రాయఁబేర్కొని యపుడు
[1]*నరయంగ నాబిరుదవ్వల నుండ
వలెనంచు చెండి చేపడి మల్లగొట్టి
..................................*[2] - " 99

**చతుర్థాశ్వాసమునలేవు. పంచమాశ్వాసము నుండి**

'దినముఁ బొత్తామర తీర్థమ్ములాడి
మనుజులు మిగులబ్రహ్మత్యాది పాత
కము లెల్లఁబోనాడికైలాస పదవిఁ
బ్రమథులతోఁ గూడి బ్రతుకు చుండెదరు'. - " 139

**షష్ఠాశ్వాసమునుండి**

6 'నూఱేనుఁగులు పదినూఱుతేజీలు
నూఱు నూర్లగుజనుల్ నూత్న సంబంధ
ములతోడగల రథంబులు గల్గ నాకు
............. ....................'[3] - " 184

7 చంద్రావతంసుని సౌందర్య నాధు
నింద్రాది దేవ మునీంద్రాది వంది
త శ్రీపదాం భోజు ధవళ వర్ణాంగు
నా శ్రి తామర భూజు నాచొక్కనాధు' - " 202

**సప్తమాశ్వాసమునుండి**

'శ్రీరాగ రాగమంజరియునాటయును
భైరవి భూపాల బంగాళ మాళ
వియునువసంతంబువెలయంగ నెనిమి
దియుమగరాగముల్దీనికి సతులు" - " 209

**అష్టమాశ్వాసమునుండి**

9. 'సంతోషమునుబొందిసన్నుతుల్ సేయ
నంతనా నక్కీరుఁడా య్యెదులక్ష
ణము లర్థ సంఘట్టనైయుండదనినఁ
గ్రమమెఱుంగడుగదా కపటమానసుడు' - " 261

---

1 'నలరంగ' అని పాఠాంతరము డి1051 కాగితపు ప్రతిలో
2 'ల' ప్రాసతో మరియొక చరణము లేదు.
3 'ల' ప్రాసతో మరియొక చరణము లేదు.

10. 'ఇదియు ద్రావిడ దేశ మీదేశ భాష
యది నాకు దెలియదునా కావ్య లక్ష
ణములు పదేశమ్ము నాకునునిప్పు
డమరంగనానతిమ్మనివిన్నవింప ' - " 270

11. 'శాంభవీనందన! స్కంధ! సేనాని
శంభుసత్పుత్ర! తారకహార బాహు
లేయ క్రౌంచారి వల్లినాథ! కార్తి
కేయమహాసేన కేకిసనాథ!" - " 274

12. 'మధ్యగోత్రమ్మున మహినెన్నఁ బుట్టి
యధ్యయనాది విద్యాకళా ప్ర
వీణుఁడై సౌందర్య విభవ సంపదలఁ
బ్రతిలేక యుండు నా పాండ్య భూవిభుడు' - " 280

**నవమాశ్వాసము నుండి**

13. 'సారంగుఁడళగఁడు జన్నఁడు గరుడ
నీలుండు గురువింజ నీలుండుకెంచ?
నీలుండు మొదలైన నిఖిల వర్ణముల' - " 293

14. 'వెలయఁగా వాకిట విచ్చేసి పెద్ద
కొలువు చావిడిలోనఁ గూర్చుండి ఘోట
కముల నెక్కుడుఁ జూచి గైకొనుండనిన
రమణ భూపతిహజారమునకేతెంచి' - " 296

15. 'అవసుధేశునినటఁగాంచి మ్రొక్కి
దేవ యీ క్రొత్తగాఁ దెచ్చి యావాద
యూరుండు మనకును నొప్పించి నట్టి
వారువమ్ములు ఘేరవమ్ములైసగము'. - " 302

16. 'శైవమ్ము మదికి నసహ్యమై పాండ్య
భూవరుండేరంతప్రొద్దు 'నమోరు
హాంతార' యనుచునునాత్మదలంచుఁ
గొంతకాలంబిట్లు కొనసాగుచుండు' - " 318

17. 'ఆతని గర్భమ్మునందున మిగుల
ఖ్యాతిగాఁ బ్రమధ నాయకుఁడాది కార
ణంబుగా జనియించి నడచి యాడుచును
నంబవెంటనునేటి కరుగుచోనచట' - " 319

18. 'కడగి యామంగయక్కర్తిసౌందర్యు
గుడికినేతెంచు లాగునవచ్చి జ్ఞాన
సమ్మంధుఁ బొడగని సర్వమ్ముఁదెలిపి
క్రమ్మరఁదన గృహాంగణమున కరిగె'' - " 322

19. 'అప్పుడావహ్నితీవ్రాకారమగుచు
నప్పాండ్యపతి దేహమాపాదమస్త
కంబును బెన్నిదాఘు జ్వరంబతి కృ
శంబుగాఁ బీడించె సైరణ లేక' - " 323

20. 'అప్పుడు వైశ్య కన్యామణి యచట
నప్పర మేశ్వరు నాశశాంకార్ధ
జూట సన్నిధికి నేడ్చుచు బోయిమ్రొక్కి' - " 351

.....................................

21. 'ఎడగల్లనెంటిమై నేగంగరాదు
కడపపైమణి ప్రాయిగడ్డపై సన్ని
కంటిపై గూర్చుండగారాదు నెపుడు
నంటు గట్టక నీళ్ళ నాడంగరాదు' - " 353

### ద్విపద లక్షణము

ఏక పదాదుల పరిశీలనానంతరము మనముఁజూడవలసినది యిందలి ద్విపదలు లక్షణ బద్ధముగ నున్నవా? లేవా? యనునది. ఈ విషయమునుగూర్చి తెలుపుటకు ముందు ద్విపద లక్షణమును లక్షణ గ్రంథము లెట్లు చెప్పినవో చూతము. చొక్కనాథ చరిత్రకావ్య రచనా కాలమునాటికిగల లక్షణ గ్రంథములలో నొకటైనభీమనఛందము ద్విపద లక్షణమునిట్లునుడివినది.

ద్విపద; 'ఇంద్రగణములుమూఁడిన గణంబొకటి
చంద్రాస్య, ద్విపదకుఁ జనుఁ జెప్పరేచ్న[1]'

అనంతామాత్యుని ఛందోదర్పణము 'ద్విపద' లక్షణమునిట్లుచెప్పినది.

ద్విపద; 'ఇంద్రులుముప్వురు నినుఁ డొక్కరుండు
సాంద్రమైయొక్కొక్కచరణంబుఁ గొలువ
నలరుఁ బద్మోదరుఁడంచు ధీరోత్త
ములు విస్తరింతురు ముదముతో ద్విపద[2]''

పైలక్షణములను బట్టి ద్విపదరెండు పాదములు గల పద్యమని,ప్రతి పాదమునందు వరుసగా మూడింద్ర గణములుండి తదుపరి నొక సూర్యగణముండునని తెలియుచున్నది.

---

1. కవిజనాశ్రయము. జాత్యధికారము. పద్యం నెం. 30. పుట 74.
2. ఛందోదర్పణము. తృతీయాశ్వాసము. పద్యం 48. పుట 228.

ప్రత్యేకముగా నందు చెప్పబడకపోయినను ద్విపదలో ప్రతి పాదమునందును మూడవగణము యొక్క మొదటి యక్షరముయతి స్థానమని, ప్రాస నియమముండునని విదిత మగుచున్నది. ద్విపద జాతి పద్యము[1] గావున నిందు ప్రాసయతి యుండదని పై అనంతుని పద్యమువలన స్పష్టమగుచున్నది. మఱియు సంధిగతాక్షరములతోరెండు ద్విపదలను కలుపవచ్చును గాని ఒకేపదముతో రెండుద్విపదలను కలుపగూడదని, ద్విపద యందలి రెండుపాదములనువిక పదముతోఁ గలుపవచ్చుననికూడా తెలియ వచ్చుచున్నది.

లాక్షణికు లంగీకరించక పోయినను పాల్కురికి సోమనాధుడు తన పండితారాధ్య చరిత్రలో 'యతిర్వా' 'ప్రాసోవా' యని పేర్కొనిన నాటి నుండి యతికి బదులు ప్రాసయతిని గూర్చుకొని జాతిపద్యమైన ద్విపద ఉపజాతి లక్షణమును గూడా సంక్రమింప జేసికొని విలక్షణముగాసాగుచున్నది. ద్విపదలో ప్రాసయతిని గూర్పదగు ననెడి యభిప్రాయము ప్రాచీన కవుల కుండి యుండును. వచ్చకప్పురపు తిరువేంగళ కవి చొక్కనాథ చరిత్రము నందు ప్రాసయతిని ప్రయోగించిన చరణములటనట కన్పించుచున్నవి. వీనిని యతిప్రాసల పరిశీలనమున చూపుదును.

ప్రకృతము చొక్కనాథ చరిత్రమునందలి ద్విపదలన్నియు గణబద్ధములుగా నున్నవా? లేవా? చూతము. ఈ కావ్యము నందలి ద్విపదలన్నియు గణబద్ధములుగనే రచింపబడినప్పటికి కొన్ని గణబద్ధములు కానివి గూడ కలవు. ముందుగా వానినిటఁజూపి యతి ప్రాసల పరిశీలనకు గడంగుదును.

## గణబద్ధములు కాని ద్విపదలు

1. చొక్కనాథ చరిత్రము నందలి అవతారికలో
   "వెనొరవె పొంద వారి యందోరు గంటమ్మ[2]" - పుట 3
2. ప్రథమాశ్వాసములోని మొదటి లీలలో
   'బలుమృగం |బులు చెదర| పక్షులు|బెదర' - " 19

ఇందు రెండవ గణముననొక లఘువు అదనముగా నున్నది.

3. తృతీయాశ్వాసములోని పదునాలుగవ లీలలో
   'చక్కన |యనము బూన్పఁ| జక్రిని| మెచ్చి' - " 91

ఈ చరణములో రెండవ గణమున ఒక లఘువు అదనముగా నున్నది.

4. తృతీయాశ్వాసములోని పదునైదవ లీలలో
   'వేమారు| శ్రీహరిని| వేడ్కఁ ప్రార్థింప' - " 6

దీనిలోకూడా రెండవ గణమున ఒక లఘువు అదనము.

1 కం. వెలయంగ దెనుగు బాసకు దలమయ్యెడు సీసములును దర్వోజలు గీతులు నక్కరలును ద్విపదలు పొలుపొందగరేచ డిష్టమున నొనరించున్. కవిజనాశ్రయము జాత్యధికారము పద్యం. 10 పుట 63.

2. దీనిని గూర్చి సాధుపాఠము నిర్ణయములు చూడనగును.

5. పంచమాశ్వాసములోని ఇరువది యారవ లీలలో

'కానెగ |ట్టుక పలక| కత్తియు| గొరడు' - " 142

ఇందు రెండవ గణమున నొక లఘువు అదనముగానున్నది.

6. అదే లీలలో

'ఈ యెన| మంద్రగర్వ| మేపుతో| బాపి' - " 143

దీనిలో కూడా రెండవ గణమున ఒక లఘువు అదనముగా నున్నది.

7. సప్తమాశ్వాసములోని నలువదియవ లీలలో

'వరచామ| రఛత్ర| వైభవ| మ్ములును' - " 205

ఇందలి రెండవ గణము జగణము. ఇది ఇంద్ర గణము కాదు. కావున దోషము.

8. అష్టమాశ్వాసములోని ఏబదియవ లీలలో

'నామరూ |పక కపట | నాటక | ధార' - " 262

ఈ చరణమున రెండవగణములో ఒక లఘువు అదనము.

9. నవమాశ్వాసములోని ఏబదియేడవ లీలలో

'సామజ | ముఖ జనక | సామజ | శిక్ష' - " 299

దీనిలో కూడా రెండవ గణమున ఒకలఘువు అదనముగా నున్నది.

పైన చూపిన వానిలో ఒక్క ఆరవ చరణమునఁ దప్ప తక్కిన పాదములలో నన్నింటను రెండవ గణమున ఒకలఘువు అదనముగాపడినదేకాని నడక చెడలేదు. ఇవి గణఛందమునకు సరిపోక పోయినను మాత్రా ఛందమునకు సరిగా సరిపోవుచున్నవి. ఆరవ చరణములో కూడా రెండవ గణమున ఒక లఘువు అదనముగా నున్నది. కాని దీని నడక చెడినది. గణ దోషమున్న ఏడవ చరణములో కూడా గతిమారలేదు. ఇక యతి ప్రాసలను పరిశీలింతము.

## యతి - ప్రాస

### నిర్వచనములు :

'వళిరాద్యమనన్తరాక్షరంప్రాసః[1]' అని ఆంధ్ర శబ్ద చింతామణి యతి ప్రాసలను నిర్వచించినది. దీని యర్థము మొదటి యక్షరము వళి దాని తరువాతి యక్షరము అనగారెండవ అక్షరము ప్రాసము.

దీనినే కవిజనాశ్రయకర్త

"చరణా ద్యక్షరమేవడి

చరణంబు ద్వితీయవర్ణ సమితియెప్రాసం[2]"- అనినాడు.

1. ఆంధ్రశబ్ద చింతామణి. సంజ్ఞాపరిచ్ఛేదము. సూ. 41. పుట 31.
2. కవిజనాశ్రయము సంజ్ఞాధికారము. పద్యం 61. పుట 18.

విన్నకోటపెద్దనతన కావ్యాలంకార చూడామణియందు

'పాదప్రథమాక్షరము
త్వాదితమగువళి యనంగఁ బ్రాసంబనగాఁ
బాద ద్వితీయ వర్ణము[1]"అని చెప్పియున్నాడు.

లాక్షణికులందరును మొదటి వర్ణము 'వళి' యని రెండవ వర్ణము ప్రాసమని తెలిపి యున్నారు. యతియనుపదము 'వళి'కినామాంతరమని ఈ క్రింది కవిజనాశ్రయ, కావాల్యంకార చూడామణి పద్యముల వలన దెలియుచున్నవి.

కం. విశ్రాంతి, విరతి, విశ్రమ,
విశ్రామ, విరామ, విరమ, విరమణ, లనఁగా
విశ్రుతమగు యతి కృతి కధి
కశ్రావ్యంబై బెడంగుగా నిడవలయున్[2].

తే. విరతి, విశ్రామ, విశ్రాంతి, విరమ, విరమ
ణాభిధాన విరామములనెడి పేళ్లు
యతికిఁ బర్యాయ పదములైయమరు కృతిని;
యుక్తిపదములఁ గృతి యందునునుపవలయు.[3]

## చొక్కనాథ చరిత్రము నందుపయుక్తమైన యతులు

చొక్కనాథ చరిత్రమునందుపయుక్తమైన యతులను పరిశీలించుటకుముందు ఆకావ్య రచనా కాలము నాటికి గల లక్షణ గ్రంథములలో చెప్పబడిన యతి భేదములను గూర్చి తెలిసి కొనుట యుక్తము.

వేములవాడ భీమన విరచితమగు కవి జనాశ్రయము;

కం. స్వర వర్గాఖండ ప్రా
ద్యురుబిందు ప్లుతములున్ బ్రయుక్తాక్షరముల్
పరగఁగ నెక్కటి పోలిక
సరసలునాఁబది విధములఁ జనువళ్లుమహిన్.[4]

స్వరయతి, వర్గయతి, అఖండయతి, ప్రాదియతి, బిందుయతి, ప్లుతయతి, ప్రయుక్తాక్షరయతి, ఎక్కటియతి, పోలికయతి, సరసయతి, యను పది విధములైన యతి భేదములనుపేర్కొనినది.

ఛందోదర్పణము నందనంతామాత్యుడు తాను చెప్పబోవు యతులను నైదు వర్గములుగా నీ క్రింది పద్యమున విభజించి యనంతరము ఇరువది నాలుగు యతి భేదములను పేర్కొనినాడు.

---

1. కావ్యాలంకార చూడామణి. సప్తమోల్లాసము. పద్యం 29. పుట 98.
2. కవిజనాశ్రయము. సంజ్ఞాధికారము. పద్యం 60. పుట 18.
3. కావ్యాలంకార చూడామణి సప్తమోల్లాసము. పద్యం 27. పుట 98.
4. కవిజనాశ్రయము. సంజ్ఞాధికారము. పద్యం 62. పుట 19.

క. స్వరయతులు, వర్గయతులును
సరసయతుల్ ప్రకటమైన సంయుక్తయతుల్
పొరిఁ బ్రత్యేక యతులుననఁ
బరగును యతి పంచకంబు పంకజనాభా![1]

స్వరయతులు, వర్గ యతులు, సరస యతులు, సంయుక్తయతులు, ప్రత్యేక యతులు ననునవి ఆ యైదు యతి వర్గములు.

1. స్వరయతులు : అచ్చులకు సంబంధించిన యతులు. 1. స్వరయతులు 2. గూఢ స్వరయతి 3. ఋకార స్వరూపయతి 4. ఱీవిరమము 5. ఇుకార విరతి. 6. ప్రాదియతి. 7. కాకుస్వర యతి. 8. నిత్య సమాస యతి (అఖండయతి) 9. నిత్యయతి.

2. వర్గ యతులు : కకారాదిమకారాంత వర్గాక్షరములకు సంబంధించిన యతులు. 1. వర్గయతి 2. పోలిక వడి.

3. సరస యతులు : ఒక వర్గమునకు చెందక మిశ్రముగా మైత్రి గల యతులు. అ, య, హలు - న, ణ లు మున్నగునవి. 1. సరసయతి.

4. సంయుక్త యతులు : ఒక యక్షరము కాక సంయుక్తములయిన వర్ణముల యతులు. 1. సంయుక్త యతి. 2. తద్భవవ్యాజయతి. 3. రేఫయుత యతి. 4. అనుస్వారయతి.

5. ప్రత్యేక యతులు : పై నాల్గు విధములలోచేరకప్రత్యేక లక్షణముగల యతులు. 1. మకార యతి. 2. ఎక్కటి యతి 3. ప్రభునామాంత యతి. 4. విభాగయతి 5. భిన్నయతి 6. వికల్ప యతి 7. యుక్త వికల్పయతి. 8. అభేదవిరతి.

పై విధముగా ఇరువది నాలుగు యతి భేదములు చెప్పి 'ఇందు పూర్వ ప్రయోగంబు లెఱిఁగి యెవ్వి బహుళమైతోఁచెనవి యొనర్పంగ వలయు నవ్య కావ్య ప్రయోక్తల' నని సూచించినాడు.

పైనఁ జూపిన యతి భేదములలోనుండి తిరువేంగళ కవి చొక్కనాధ చరిత్రమునందు ఉపయోగించిన యతులను కొన్నింటినిట జూపుదును.

| | | |
|---|---|---|
| 1. స్వరయతులు | - గూఢ స్వరయతి; | 'ద్యుమణీందు వైశ్వాన రోజ్జ్వల నేత్ర'[2] |
| " | - ఱీవిరమము ; | 'ప్రియభక్తి నతనికి మృగ ధూర్తకులన్ము'[3] |
| " | " | 'శ్రీ చొక్కనాథునికృపను పాలించె'[4] |

1. ఛందోదర్పణము ప్రథమాశ్వాసము, పద్యం 79, పుట 71.
2. చొక్కనాధ చరిత్ర. చతుర్థాశ్వాసము. పుట 128.
3. చొక్కనాధ చరిత్ర. ప్రథమాశ్వాసము. పుట 15
4. చొక్కనాధ చరిత్ర. తృతీయాశ్వాసము. పుట 93.

| | |
|---|---|
| 2. వర్గయతులు - పోలికవడి; | 'మూఁడుమూర్తుల చేతఁ బూజగొన్నట్టి [1]' |
| " " | 'పొలుపొంద గిరి దుర్గములు పిక్కటిల్లి [2]' |
| " " | 'పొసగంగ నభిషేకములుభక్తిఁ జేసి [3]' |
| " " | 'ముఖములాఘ్రాణించు పుండరీకములు [4]' |
| " " | 'భూమీశ్వరుని స్వప్నముననువిచ్చేసి [5]' |
| 3. సరసయతులు - సరసయతి; | 'వ్యాసువాల్మీకి మహాకావ్యుఁ గాళి [6]' |
| " " | 'హైమవతీతంత్రి ణామ్నాతకాది [7]' |
| " " | 'చాల సౌవర్ణ పుష్పములుద్భవింప [8]' |
| " " | 'జ్ఞాన సంబంధుడుత్సాహియై యున్న [9]' |
| " " | 'జ్ఞాన సంబంధుడా సౌందర్య నాథు [10]' |
| " " | 'సత్యంబె యన్న సుజ్ఞాన సంబంధు [11]' |
| " " | 'జ్ఞాన సంబంధు నాక్షణ మెరావించి [12]' |
| 4. సంయుక్తయతులు- సంయుక్తయతి; | 'జయముగాఁ దనదు నాజ్ఞాశక్తివలన [13]' |
| " " | 'చదరమైనట్టి సుజ్ఞాన ఫలకిచ్చె [14]' |
| " " | 'జ్ఞాన సంబంధుతోఁ జాల నిట్లనిరి [15]' |
| " " | 'జ్ఞాన సంబంధుడాజైనుల కనియె [16]' |
| " " | 'జ్ఞాన సంబంధుడచ్చటికేగు వేళ [17]' |

---

1. చొక్కనాథ చరిత్ర. ప్రథమాశ్వాసము. పుట 1.
2. చొక్కనాథ చరిత్ర. ప్రథమాశ్వాసము. పుట 19.
3. చొక్కనాథ చరిత్ర. ప్రథమాశ్వాసము. పుట 23.
4. చొక్కనాథ చరిత్ర. ద్వితీయాశ్వాసము. పుట 36.
5. చొక్కనాథ చరిత్ర. ద్వితీయాశ్వాసము. పుట 40.
6. చొక్కనాథ చరిత్ర. ప్రథమాశ్వాసము. పుట 3.
7. చొక్కనాథ చరిత్ర. ప్రథమాశ్వాసము. పుట 26.
8. చొక్కనాథ చరిత్ర. ప్రథమాశ్వాసము. పుట 28.
9. చొక్కనాథ చరిత్ర. నవమాశ్వాసము. పుట 331.
10. చొక్కనాథ చరిత్ర. నవమాశ్వాసము. పుట 332.
11. చొక్కనాథ చరిత్ర. నవమాశ్వాసము. పుట 332.
12. చొక్కనాథ చరిత్ర. నవమాశ్వాసము. పుట 351.
13. చొక్కనాథ చరిత్ర. సప్తమాశ్వాసము. పుట 251.
14. చొక్కనాథ చరిత్ర. అష్టమాశ్వాసము. పుట 260.
15. చొక్కనాథ చరిత్ర. నవమాశ్వాసము. పుట 329.
16. చొక్కనాథ చరిత్ర. నవమాశ్వాసము. పుట 333.
17. చొక్కనాథ చరిత్ర. నవమాశ్వాసము. పుట 334.

" - రేఫయుత యతి; 'ఋతు కాలములఁ బ్రవర్తించుటగాక [1]'

" " 'ఋషులుల్లసిల్లఁ బౌరుషము శోభిల్ల [2]'

" - అనుస్వారయతి; 'జ్ఞానులుమెచ్చ సంఘట్టనగాఁగ [3]'

తిరువేంగళ కవి సంయుక్త యతియందు 'జ్ఞ' కారమునకు చ, ఛ, జ, ఝ, ల తో యతిగూర్చినాడు. ఇది లాక్షణిక సమ్మతమే. కాని లాక్షణికులంగీకరించక పోయినను 'జ్ఞ' కారమునకు బిందుపూర్వక 'ఘ' కారముతో పైనచూపిన విధముగా యతిగూర్చినాడు. లాక్షణికులుక, ఖ, గ, ఘలు బిందుపూర్వకములైనపుడు 'ఙ' కారమునకు యతినంగీకరించిరి గాని 'జ్ఞ' కారమునకు గాదు. అంతేకాక బిందు పూర్వకము కాని 'క' వర్గాక్షరములకుగూడా 'జ్ఞ' కారముతో స్వతంత్రించి యతి చెప్పినాడు. అవి యివి.

1. 'జ్ఞాన సంబంధునిక్కడకు రావించి [4]'
2. 'జ్ఞానసంబంధునిఁగనుగొని యపుడు [5]'
3. 'ఖలుడైన నాదునజ్ఞానమ్ము కతన [6]'
4. 'గంటుగట్టించె బ్రజ్ఞావంతుడగుచు [7]'
5. 'జ్ఞానోపదేశంబు గావించు లీల [8]'
6. 'జ్ఞాన సంబంధుండు ఘనత నిట్లనియె [9]'

ట, ఠ, డ, ఢ లు బిందుపూర్వకములైనపుడు "ణ" కారముతో యతి మైత్రిని అనుస్వారయతిగా లాక్షణికులంగీకరించిరి. కాని "న" కారముతోకాదు. ణ, న-లు సరస యతిలోమిత్రాక్షరములు గావున తిరువేంగళ కవి బిందుపూర్వక ట ఠ డ ఢ లకు 'ణ' తోనేగాక "న" కారముతో గూడాయతిని కూర్చినాడు. ఉదాహరణకు

1. నిండి బోధింపు చుండిరి జైన మతము [10]
2. నిఖిలమ్ము జూడ పొండీడునుఁ జూడ [11]

1. చొక్కనాథ చరిత్ర. ప్రథమాశ్వాసము. పుట 18.
2. చొక్కనాథ చరిత్ర. ప్రథమాశ్వాసము. పుట 19.
3. చొక్కనాథ చరిత్ర. ప్రథమాశ్వాసము. పుట 15.
4. చొక్కనాథ చరిత్ర. నవమాశ్వాసము. పుట 320.
5. చొక్కనాథ చరిత్ర. నవమాశ్వాసము. పుట 325.
6. చొక్కనాథ చరిత్ర. అష్టమాశ్వాసము. పుట 268.
7. చొక్కనాథ చరిత్ర. అష్టమాశ్వాసము. పుట 263.
8. చొక్కనాథ చరిత్ర. ప్రథమాశ్వాసము. పుట 15.
9. చొక్కనాథ చరిత్ర. నవమాశ్వాసము. పుట 327.
10. చొక్కనాథ చరిత్ర. నవమాశ్వాసము. పుట 329.
11. చొక్కనాథ చరిత్ర. నవమాశ్వాసము. పుట 334.

**5. ప్రత్యేకయతులు- అభేదయతి :** 'రలయోర భేదః' అను సూత్రము ప్రకారము తిరు వేంగళ కవి ర -ల లకుఅభేదయతిని ప్రయోగించినాడు[1]. ఉదా : ప్రాకటమ్మగ సకలార్థ సంపదలు .

**ప్రాస యతులు**

1. 'చౌషష్టి లీలావిలాసంబు లాంధ్ర [2]'
2. 'జలజాక్షులనురజస్సులుగను వృక్ష[3]'
3. 'బాలచంద్రుడు పూర్వ శైలమ్మునెక్కె [4]'
4. 'చండాయుధమ్మున చెండాడుమనుచు [5]'
5. 'గుడి జొఱఁబఱచి యొక్కడు భీతితోడ [6]'
6. 'ప్రీతితోనిట్లనె భూతేశు మహిమ [7]'
7. జనపతి కాతనిసేనల కెల్ల [8]'

   న-న లకేకాక న-ణ లకు కూడా ప్రాసయతిని గూర్చిన ఉదాహరణ.

8. స్నానముల్గుడిప్రదక్షిణములు చేసె [9]'

**యతి దోషములు**

1. చేరి పొందీనిచేఁ చండాయుధమున
2. కీర్తి గల్గంగ నేలించిన లీల.
3. హర్షించునీ లీలలనుగొంతతడవు.
4. ఒగి స్వామ్యమాత్య సుహృత్కోశ రాష్ట్ర
5. క్షితిమించువలె వెళల్ చండాయుధములు

---

1. చొక్కనాథ చరిత్ర. ప్రథమాశ్వాసము. పుట 5.
2. చొక్కనాథ చరిత్ర. ప్రథమాశ్వాసము. పుట 4.
3. చొక్కనాథ చరిత్ర. ప్రథమాశ్వాసము. పుట 17.
4. చొక్కనాథ చరిత్ర. ద్వితీయాశ్వాసము. పుట 38.
5. చొక్కనాథ చరిత్ర. తృతీయాశ్వాసము. పుట 78.
6. చొక్కనాథ చరిత్ర. పంచమాశ్వాసము. పుట 149.
7. చొక్కనాథ చరిత్ర. నవమాశ్వాసము. పుట 300.
8. చొక్కనాథ చరిత్ర. నవమాశ్వాసము. 313.
9. చొక్కనాథ చరిత్ర. సప్తమాశ్వాసము. పుట 245.

1. చొక్కనాథ చరిత్ర. ప్రథమాశ్వాసము. పుట 13.
2. చొక్కనాథ చరిత్ర ప్రథమాశ్వాసము. పుట 16.
3. చొక్కనాథ చరిత్ర. ప్రథమాశ్వాసము. పుట 29.
4. చొక్కనాథ చరిత్ర ద్వితీయాశ్వాసము. పుట 50.
5. చొక్కనాథ చరిత్ర. తృతీయాశ్వాసము. పుట 78.

6. శివుడిచ్చినట్టియా చండాయుధమున
7. చౌలఁగా మాక్షులు చేత శూలమ్ము.
8. నా యొడయలు తృప్తితో నారగించి
9. శరణమ్ము వేద సంవేద్య మూర్తికిని.
10. వేళలెఱింగి యాస్వరములేర్పఱచి.
11. ఇల్లునెందునులేని యట్టు లాయీప
12. అజశిరశ్ఛేదుఁ డదృశ్యుడై చనియె
13. యాయింతిఁ జూచి యియ్యెడనుండగాను.
14. యంగయకణ్ణిమియ్యెడనుండగాను–ఇందు'ఎడ' అను శబ్దము 'యడ' అని ప్రయోగించినాడు.
15. ఆ చొక్కనాథుడాశ్రిత రక్షకుండు.
16. శంభు సత్పుత్ర తారకహార బాహు
17. అదయుడై నన్నుదా సీనము జేసి
18. యా తిరువాద యూరుండు నత్యంత.
19. సామజ రక్షణార్పిత పాదపీఠ.
20. పూని మాధనము నిక్కడ బెట్టుమనిన
21. గ్రుడ్లు వెల్కుఱుకంగఁ బెద్దిన యట్టి
22. అరసిరప్పించి యాయెడఁ దానునతడు.

---

6. చొక్కనాథ చరిత్ర. తృతీయాశ్వాసము. పుట 98.
7. చొక్కనాథ చరిత్ర. పంచమాశ్వాసము. పుట 158.
8. చొక్కనాథ చరిత్ర. షష్ఠాశ్వాసము. పుట 189.
9. చొక్కనాథ చరిత్ర. షష్ఠాశ్వాసము. పుట 193.
10. చొక్కనాథ చరిత్ర. సప్తమాశ్వాసము పుట 206.
11. చొక్కనాథ చరిత్ర. సప్తమాశ్వాసము. పుట 208.
12. చొక్కనాథ చరిత్ర. సప్తమాశ్వాసము. పుట 219.
13. చొక్కనాథ చరిత్ర. సప్తమాశ్వాసము. పుట 223.
14. చొక్కనాథ చరిత్ర. సప్తమాశ్వాసము. పుట 237.
15. చొక్కనాథ చరిత్ర. అష్టమాశ్వాసము. పుట 258.
16. చొక్కనాథ చరిత్ర. అష్టమాశ్వాసము. పుట 274.
17. చొక్కనాథ చరిత్ర. అష్టమాశ్వాసము. పుట 277.
18. చొక్కనాథ చరిత్ర. నవమాశ్వాసము. పుట 294.
19. చొక్కనాథ చరిత్ర. నవమాశ్వాసము. పుట 299.
20. చొక్కనాథ చరిత్ర. నవమాశ్వాసము. పుట 303.
21. చొక్కనాథ చరిత్ర. నవమాశ్వాసము. పుట 304.
22. చొక్కనాథ చరిత్ర. నవమాశ్వాసము. పుట 329.

## చొక్కనాథ చరిత్రమునందుపయుక్తమైన ప్రాసములు

యతుల పరిశీలనా నంతరము మనముఁజూడవలసినది ప్రాసములను. కవి జనాశ్రయమున ఆరు విధములైనప్రాస భేదములు చెప్పబడినవి. 1. సుకర ప్రాసము 2. అనుప్రాసము 3. దుష్కర ప్రాసము 4. అంత్య ప్రాసము 5. ద్విప్రాసము 6. త్రిప్రాసములని ఈ క్రింది పద్యమున గలవు.

కం. భాసురములగుచు సుకర
ప్రాసానుప్రాస దుష్కర ప్రాసాంత్య
ప్రాస ద్విప్రాస త్రి
ప్రాసములన షడ్విధములఁబరగును గృతులన్ [1].

ఛందోదర్పణమున అనంతామాత్యుడు పండ్రెండుప్రాస భేదములనుపేర్కొని యనంతరముశబ్దాలంకార విశేషములయిన ఆరు ప్రాసములను పేర్కొనినాడు. అనంతుడు చెప్పిన పండ్రెండు ప్రాసములు ఇవి.

1. సమప్రాసము 2. ప్రాసమైత్రి ప్రాసము 3. ఋప్రాసము 4. త్రిప్రాసము 5. ప్రాదిప్రాసము 6. సమ లఘు ప్రాసము 7. వికల్ప ప్రాసము 8. బిందు ప్రాసము 9. అర్ధబిందు ప్రాసము 10. ఉభయ ప్రాసము. 11. సంయుక్త ప్రాసము 12. సంధిగత ప్రాసము.

వీనిని ఈక్రిందిపద్యమున చెప్పియున్నాడు.

క. సమనామప్రాసము, ప్రా
సమైత్రి, ఋ, త్రి, మఱిప్రాది, సమలఘువు విక
ల్పము, బిందు, వర్ధ బింద్వా
ఖ్య, ముభయ, సంయుక్త, సంధిగత, నంజ్ఞకముల్ [2]

శబ్దాలంకారవిశేషములయిన ప్రాసములు 1. దుష్కర ప్రాసము 2. ద్వంద్వ ప్రాసము 3. త్రిప్రాసము 4. చతుష్ప్రాసము 5. అంత్యప్రాసము 6. అనుప్రాసము అని ఈక్రింది పద్యమున చెప్పినాడు.

క. అమరఁగ దుష్కరమునుద్వం
ద్వము త్రి చతుష్ప్రాసములును దగ నంత్యప్రా
సమును నను ప్రాసముననఁ
గ్రమమునషడ్విధములయ్యెఁ గంస విదారీ! [3]

పైన చూపిన ప్రాస భేదములలో తిరు వేంగళ కవి చొక్కనాథ చరిత్రమునందు దాదాపుఅన్నింటిని ప్రయోగించినాడు. మఱియు భీమన, అనంతాదులు చెప్పని కొన్ని

1. కవిజనాశ్రయము, సంజ్ఞాధికారము. పద్యం 76. పుట 24.
2. ఛందోదర్పణము, ప్రథమాశ్వాసము. పద్యం 35. పుట 32.
3. ఛందోదర్పణము, ప్రథమాశ్వాసము. పద్యం 70. పుట 64.

ప్రాసములను కూడా ఈ కవిప్రయోగించినాడు. తరువాతి లాక్షణికులంగీకరించినవికూడా యిందు గలవు. వాని నన్నింటి నిట చూపుచున్నాను.

**ప్రాసమైత్రిప్రాసము :** ఒక్క ప్రథమాశ్వాసమున దప్ప తక్కిన యాశ్వాసములన్నింటను ఇవి లభించినవి.

**ల – ళ:** లకారమునకు ళ కారముతో ప్రాస మైత్రిగలవిమొత్తముపదునాలుగున్నవి.

1. ద్వితీయాశ్వాసములోని నాలుగవ లీలలో
" ఆలోనికటఁబోపునప్పుడు పరుస
వేళల కేతెంచు విద్యలవారు [1]

2. ద్వితీయాశ్వాసములోని ఆరవ లీలలో
" కలిమి లేదేఁటి రెక్కలకప్పుగప్పు
గళమునఁ బూనె ముక్తాహార వితతి [2].

3. తృతీయాశ్వాసములోని తొమ్మిదవ లీలలో
'చాలంగ నీకును సంతోషమైన
వేళల వదనంబు వికసించు గాన్[3]'

4. తృతీయాశ్వాసములోని పండెండ్రవ లీలలో
'బల భేదియచటికి, బ్రబలి వచ్చినను
వళ చక్రమతనిపై పడిఁ బ్రయోగింపు [4]'

5. చతుర్థాశ్వాసము లోని పదునెనిమిదవ లీలలో
'కలవారికినినే యుగాంతమ్ములందుఁ
బ్రళయ కాలములే యుపద్రవంబులున్ను[5]'

6. పంచమాశ్వాసములోని ముప్పదిరెండవ లీలలో
'వెలయంగయోజన విస్తారమైన
దళముల శయనింపఁ దనరిన దాన్[6]'

7. షష్ఠాశ్వాసములోని ముప్పది నాలుగవ లీలలో
'తెలివంద నుత్తర దేశాధిపతుల
దళ తంత్రములతోడ ధరగ్రక్కటిలగ [7]'

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 38.
2. చొక్కనాథ చరిత్ర. పుట 61.
3. చొక్కనాథ చరిత్ర. పుట 70.
4. చొక్కనాథ చరిత్ర. పుట 78.
5. చొక్కనాథ చరిత్ర. పుట 114.
6. చొక్కనాథ చరిత్ర. పుట 168.
7. చొక్కనాథ చరిత్ర. పుటలు 175, 176.

8. సప్తమాశ్వాసములోని నలువదియవ లీలలో
'ఇల్లునెందునులేనియట్లులాయాప
వళ్లాని విడిదింటి వాకిట పంచ

9. సప్తమాశ్వాసములోని నలువది నాలుగవ లీలలో
'హాలాస్య పురమున కరిగి సంతోష
కేళి నుండిరియంత ఖేచరులెసగి [2]'

10 సప్తమాశ్వాసములోని నలువది యైదవ లీలలో
'బలియులై పాండ్య భూపాలుని యొద్ద
దళవాయి పట్టాన దవిలి యుండుదురు [3]'

11 అష్టమాశ్వాసములోని ఏబది యొకటవ లీలలో
'అలవడ నాకవితార్ధ మెట్లన్న
నళులార! సకలమ్ము లైన పుష్పముల [4]'

12. నవమాశ్వాసములోని యరువదియవ లీలలో
'కలవాడొకండు నిక్కడవచ్చినాడు.
నళగయ చొక్కనాయక భక్తిపరుఁడు [5]'

13 నవమాశ్వాసములోని అఱువది నాలుగవ లీలలో
'తలపులేటికి నింకఁ దప్ప నీ మాట
పళియంజినాథ! నీ పాదమ్ములాన [6]'

14 నవమాశ్వాసములోని అఱువది నాలుగవ లీలలో
'వలె గాన మేముదేవరకునీ వేళ
పళియంజిపతికిని పట్టమ్ము గట్టి [7]'

**ళ - ల :** ళ కారముతో లకారమునకు ప్రాస గూర్చినవి పదునేడున్నవి.

తృతీయాశ్వాసములోని పదునొకండవలీలలో

1. 'తళుకొత్తు వేడ్క సౌందర్య నాయకుడు
జలజనేత్రకును బుంసవన సీమంత'

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 208.
2. చొక్కనాథ చరిత్ర. పుట 238.
3. చొక్కనాథ చరిత్ర. పుట 241.
4. చొక్కనాథ చరిత్ర. పుట 264.
5. చొక్కనాథ చరిత్ర. పుట 324.
6. చొక్కనాథ చరిత్ర. పుట 355.
7. చొక్కనాథ చరిత్ర. పుట 359.

1. చొక్కనాథ చరిత్ర. పుట 74.

2. తృతీయాశ్వాసములోని పదునొకండవ లీలలో
'గళమును జంఘాయుగంబు మేఢ్రంబు
లలవడ హ్రస్వంబులై యుండవలయు'
3. అదే యాశ్వాసములోని అదే లీలలో
'తాళాల చెమట చిత్తడి మేననింకఁ
గాలు సేతులుడంగ కలు సాల దిరుగఁ'
4. తృతీయాశ్వాసములోని పదునాఱవలీలలో
'ప్రళయమైబ్రహ్మ కల్పమ్మునఁ బూర్వ
కలియుగాంతమ్మునఁ గల విప్రవరులు'
5. చతుర్థాశ్వాసములోని పదునేడవ లీలలో
'గళమును గరిదంత ఘనవరాహములు
చెలఁగు మామిడి పండు చెఱకును వెదురు'
6. చతుర్థాశ్వాసములోని పదునెనిమిదవ లీలలో
'ప్రళయ కాలము లేక ప్రళయ కాలమ్ము
గలిగి యీ వార్ధులు గదలిటువచ్చు'
7. చతుర్థాశ్వాసములోని ఇరువది మూడవ లీలలో
'తళుకొత్త నృత్త విద్యయు లోనుగాను
వెలయంగ చౌష ష్టి విద్యలు గాక'
8. సప్తమాశ్వాసములోని నలువదియవ లీలలో
'వేళలెఱుంగియాస్వరము లేర్పఱిచి
లాలితంబైన యాలాపమ్ముఁ జేసి'
9. సప్తమాశ్వాసములోని నలువది రెండవ లీలలో
'యేళాను జంత్రమ్ములెసఁగ వాయించి
యాలాపములు గొన్ని యర్థితోఁ గూడి'

---

2 చొక్కనాథ చరిత్ర పుట 75.
3. చొక్కనాథ చరిత్ర. పుట 77.
4. చొక్కనాథ చరిత్ర. పుట 101.
5. చొక్కనాథ చరిత్ర. పుట 109.
6. చొక్కనాథ చరిత్ర. పుట 113.
7. చొక్కనాథ చరిత్ర. పుట 127.
8. చొక్కనాథ చరిత్ర. పుట 206.
9. చొక్కనాథ చరిత్ర. పుట 218.

10. అదే ఆశ్వాసములోని అదే లీలలో
'యేళ వాయింపుచు నెప్పటికంటె
యాలాపములు చేసి యా స్వామిఁబాడి'

11. సప్తమాశ్వాసములోని నలువది మూడవ లీలలో
'తళు కొత్తనచటఁబెద్దలలోనమించి
వెలయంగ నచ్చోట విచ్చేసి యుండె'

12. సప్తమాశ్వాసములోని నలువది నాలుగవ లీలలో
'వేళఁబరాకైన వివరించి చెప్పఁ
జాలుట గాక యా జాలికునందు'

13. అష్టమాశ్వాసములోని ఏబదిరెండవ లీలలో
'అళిక నేత్రముఁ జూప హరుభక్తివలన
గలఁగక తలచుట్టు కన్నులైనాను'

14. అష్టమాశ్వాసములోని ఏబది నాలుగవ లీలలో
'పళని పర్వతనాథ! భాసుర స్వామి
మలవాస సైకతామల వాస శక్తి'

15. నవమాశ్వాసములోని ఏబదితొమ్మిదవ లీలలో
'కాళిభవాని దాక్షాయణి గిరిజ
మాలి ని మాతంగి మాయా స్వరూప'

16. నవమాశ్వాసములోని అఱువది రెండవ లీలలో
'పళియంజి నాథుడాపత్సహాయుండు
నలరంగఁ బ్రత్యక్షమై యానతిచ్చె'

17. నవమాశ్వాసములోని అఱువది నాలుగవ లీలలో
'వైళంబ యిచట వివాహమై మీరు
హాలాస్య పురమున కరుగుడీ! యనిన'

---

10. చొక్కనాథ చరిత్ర. పుట 218.
11. చొక్కనాథ చరిత్ర. పుట 227.
12. చొక్కనాథ చరిత్ర. పుట 231.
13. చొక్కనాథ చరిత్ర. పుట 267.
14. చొక్కనాథ చరిత్ర. పుట 274.
15. చొక్కనాథ చరిత్ర. పుట 317.
16. చొక్కనాథ చరిత్ర. పుట 342.
17. చొక్కనాథ చరిత్ర. పుట 352.

**ఋప్రాసము :**

**ఋ – ర :** 'ఋ' కారమునకు 'ర' కారముతో ప్రాసగూర్చినవి. ఇవి పంచమాశ్వాసమున మాత్రమే కనుపించినవి. తక్కిన వాటిలోనివి మృగ్యము.

1. ముప్పది యొకటవ లీలలో
'ఆ ఋషులెల్లను నతివలఁ జూచి
మీరలా సర్వేశు మీది మోహమున [1]''

2. అదే లీలలో
'ఆ ఋషులిట్లని రాసెట్టులకును
మీరలా పురిని జన్మించి యుండినను [2]''

3. అందే
"ఆ ఋషులకుఁబత్నులై తొంటియట్ల
దారుకావనమునఁ దగ నుండిరంత [3]'

**ర – ఋ :** 'ర' కారమునకు 'ఋ' కారముతోప్రాస గూర్చినవి.

1. పంచమాశ్వాసములోని ఇరువది యైదవ లీలలో
'పాత్రుడై యౌవన ప్రాప్తిఁ జెన్నొంది
మాతృ సంగముఁ జేసె మదినిల్వలేక [4]'

2. నవమాశ్వాసములోనిఏబది యేడవ లీలలో
'వజ్రాంగి జోళ్ళునువడిరాగ వళ్ల
విజృంభణమ్ముగా వేడ్క నాహయము [5]'

**ప్రాదిప్రాసము**

**ణ – న :** 'ణ' కారమునకు 'న' కారముతో ప్రాసము గూర్చినది.

1. ద్వితీయాశ్వాసములోని నాలుగవ లీలలో
'మూణ్ణెల్ల ఫలియించు మొదటి వేకువను
బూనిన కలలెల్లఁ బొరి పదినాళ్ళ [6]''

**న – ణ :** 'న' కారమునకు 'ణ' కారముతో ప్రాసము గూర్చినది.

1. ప్రథమాశ్వాసములోని చతుష్షష్టి లీలలలో
'జ్ఞానులు మెచ్చ సంఘట్టన గాఁగ
బాణుని గెలిపించి పాడిన లీల [7]'

---

1, 2. చొక్కనాథ చరిత్ర. పుట 160.
3 చొక్కనాథ చరిత్ర. పుట 166.
4 చొక్కనాథ చరిత్ర పుట 137.
5. చొక్కనాథ చరిత్ర. పుట 293.
6. చొక్కనాథ చరిత్ర. పుట 42.
7 చొక్కనాథ చరిత్ర. పుట 15.

## వికల్ప ప్రాసము

**గ్న – జ్ఞ:** 'గ్న' కారమునకు 'జ్ఞ' కారముతో ప్రాసగూర్చినవి.

1. ప్రథమాశ్వాసములోని రెండవ లీలలో

   'అగ్నియమాసురాంబ్వనిల యక్షేశు
   లాజ్ఞకులోనుగానందఱు గొల్వ,'[1]

2. తృతీయాశ్వాసములోనిపదునాలుగవ లీలలో

   'ఆగ్నేయ బాణమ్ము హరిహయుఁడేయ
   ప్రజ్ఞతో వారుణాస్త్రమ్మున ద్రుంచె,'[2]

3. తృతీయాశ్వాసములోని పదునాఱవ లీలలలో

   'అగ్నిహోత్రమ్ములా హాలాస్యకృపను
   ప్రజ్ఞతో ధాత్రిని ప్రబలి వర్ధిల్లె,'[3]

4. పంచమాశ్వాసములోనిముప్పదియవ లీలలో

   'అగ్నిహోత్రములు వేదాగమప్రోక్త
   విజ్ఞాన యోగహవిర్భాగములును,'[4]

5. పంచమాశ్వాసములోని ముప్పది యొకటవ లీలలో

   'అగ్ని ప్రవేశమయ్యదఁజేతుమనుచు
   ప్రజ్ఞ వాటించిరి భ్రమసియాసెట్లు,'[5]

## ఉభయ ప్రాసము

**ర – ల :** 'ర' కారమునకు 'ల' కారముతో ప్రాస కూర్చినవి.

1. ప్రథమాశ్వాసములోని చతుష్షష్టి లీలలలో

   'అరయ బాణునకుఁ దానర్థమిమ్మనుచు
   నెలమి నిరూపంబులిచ్చిన లీల,'[6]

2. సప్తమాశ్వాసములోనినలువది యైదవ లీలలో

   'అరయ నా దేశమ్ము నందొక్కవెలమ
   కులపతి యందును కోర్కెలింపెసగ,'[7]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 30.
2. చొక్కనాథ చరిత్ర. పుట 90.
3. చొక్కనాథ చరిత్ర. పుట 104.
4. చొక్కనాథ చరిత్ర. పుట 155.
5. చొక్కనాథ చరిత్ర. పుట 164.
6. చొక్కనాథ చరిత్ర. పుట 15.
7. చొక్కనాథ చరిత్ర. పుట 238.

3. అష్టమాశ్వాసములోని ఏబది యైదవ లీలలో
'అరయంగ నుత్తర హాలాస్యమనగ
వెలసెనునచ్చోట వినుతింపనంత'[1]

**ల ర :** 'ల' కారమునకు 'ర' కారముతో ప్రాస గూర్చినవి.

1. ప్రథమాశ్వాసములోని అవతారికలో
'చెలగుచు నుపనూరి సింహంబు పేరఁ
బురుషోత్తమధ్యాన పూర్ణాత్ముపేర'[2]
2. ప్రథమాశ్వాసములోని చతుష్షష్టిలీలలలో
'అలరంగఁ జొన్నాయియను వార సతికి
నిర్వైన రసవాద మిచ్చినలీల'[3]
3. ప్రథమాశ్వాసములోని మొదటి లీలలో
'వెలయు నీ ఫల పుష్ప బృందముల్ మించి
కార్కొని ఘోరాంధకారంబుగాఁ గ'[4]
4. తృతీయాశ్వాసములోనిపదునాలుగవ లీలలో
'బలభేదియప్పుడా పార్థివేంద్రునకు,
బరగ నీవిటనుగ్ర పాండీంద్రుడనగ'[5]
5. అష్టమాశ్వాసములోని ఏబది యాఱవ లీలలో
'బలిమిమై నడుకొన్న పశ్చిమ నాడి
సొరిది మెల్లనె గాలి జొనుపంగఁ జేసి'[6]

**సంయుక్తప్రాసము :** చొక్కనాథచరిత్రమునందు తిరువేంగళ కవి మొత్తముఏబది నాలుగు సంయుక్తాక్షరములను ప్రాసస్థానమున నుపయోగించినాడు. అవి; క్త, క్ర, గ్ధ, గ్ర, ఘ్ర, ట్య, డ్ల, ణ్య, త్న, త్ప, త్మ, త్య, త్ర, ద్గ, ద్భ, ద్మ, ద్య, ద్ర, ద్వ, ధ్య, న్మ, న్య, ప్త, ప్ర, ప్స, భ్ర, ర్క, ర్గ, ర్చ, ర్ణ,ర్త, ర్థ, ర్ధ, ర్ప, ర్బ, ర్భ, ర్మ, ర్వ, ర్శ, ర్ష,ల్ప, ల్య, ల్వ, వ్య, శ్చ, శ్య, శ్ర, శ్వ, ష్ప, స్త, స్య, స్వ, హ్మ, హ్లో.గ్రంథ విస్తర భీతిచే వీటన్నిటికుదాహరణముల నొసగుట లేదు.

చొక్కనాథ చరిత్రము నందునాటి లాక్షణికులు చెప్పక పోయినను తరువాతి కాలపు లాక్షణికులంగీకరించిన కొన్ని ప్రాసములను తిరువేంగళ కవి ప్రయోగించినాడు. వానినిట చూపుచున్నాను.

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 279
2. చొక్కనాథ చరిత్ర పుట 5
3. చొక్కనాథ చరిత్ర. పుట 14.
4. చొక్కనాథ చరిత్ర. పుట 26.
5. చొక్కనాథ చరిత్ర పుట 92.
6. చొక్కనాథ చరిత్ర. పుట 284.

**I. శ – స ప్రాసము** [1] **:** చొక్కనాథ చరిత్రము నందు 'శ' కారమునకు 'స'కారముతో ప్రాసమునుగూర్చినవి పది, 'స' కారమునకు 'శ' కారముతో ప్రాస గూర్చినవిపదమూడుఉన్నవి. అవి యివి :

**శ – స :** 1. ద్వితీయాశ్వాసములోని ఆఱవలీలలో
"ఈశమీరానతి యిచ్చిన మేము
లాసి యుద్ధము సేయ లలన యంతటను [2]"

2. చతుర్థాశ్వాసములోని పందొమ్మిదవ లీలలో
'ఆ శివాలయమున కరుగుచో నపుడు
నాసిద్ధ ముఖ్యుని నటఁగాంచి పలికె [3].

3. అదే యాశ్వాసములోని ఇరువది రెండవ లీలలో
'ఆశోభ నాంగి చయ్యన ముట్టినంత
మూసిన తలుపు గొబ్బున బారదెఱచె [4]'

4. పంచమాశ్వాసములోని ముప్పది యొకటవ లీలలో
'ఈశుడంటెను నింతి నింక నొక్కతెను
నా సెట్టి యింఢ్ల బెండ్లాడుచునపుడు [5]'

5. షష్ఠాశ్వాసములోని ముప్పది యెనిమిదవ లీలలో
'ఈ శిశువును నన్ను నింటను బెట్టి
యాసెట్టి చనియెఁ బుణ్య స్థానములకు [6]'

6. సప్తమాశ్వాసములోని నలువది నాలుగవ లీలలో
'దాశేశ్వరుడును సదాశివుకపుడు
డాసి యెంతేనియు దండముల్ వెట్టి [7]'

7. అష్టమాశ్వాసములోని ఏబది యైదవ లీలలో
'ఆశాధినాయకులాది సన్మునులు
నా సంఘమంటపమ్మందున్న కవులు [8]'

---

1. సుకవి మనోరంజనము దీనిని ఉభయప్రాసముగా పేర్కొన్నది. పుట 48. ప్రథమాశ్వాసము.
2. చొక్కనాథ చరిత్ర. పుట 53.
3. చొక్కనాథ చరిత్ర. పుట 117.
4. చొక్కనాథ చరిత్ర. పుట 124.
5. చొక్కనాథ చరిత్ర. పుట 166.
6. చొక్కనాథ చరిత్ర. పుట 194.
7. చొక్కనాథ చరిత్ర. పుట 236.
8. చొక్కనాథ చరిత్ర. పుట 277.

8. నవమాశ్వాసములోని ఏబది యేడవ లీలలో
'రాశి మాయది యశ్వరత్నముల్ మీవి
యీా సభ వారెల్ల నెఱుగఁ జెప్పితిమి[1]'

9. నవమాశ్వాసములోని అఱువది యొకటవ లీలలో
'ఆ శైవ పత్రిక యావహ్ని యందు
భాసిలుఁ దొల్లిటి భావమ్ము కంట[2]'

10. నవమాశ్వాసములోని అఱువది యొకటవ లీలలో
'ఆ శూలములఁ గూలినట్టి యా స్థలము
భాసురమ్ముగఁ గొఱ్ఱు బడవీడు నయ్యె[3]'

స - శ : 1. తృతీయాశ్వాసములోని తొమ్మిదవ లీలలో
"ఆ సప్త జలనిధులా కొలనిలోన
రాశిగా వారాసులై యుండెనంత[4]'

2. చతుర్థాశ్వాసములోని ఇరువది రెండవ లీలలో
'పసిదిండి వన్నె దుప్పటి చేలతోడ
కశ (?) వాల శూల ఖడ్గమ్ముల తోడ[5]'

3. పంచమాశ్వాసములోని ఇరువది యేడవ లీలలో
'ఏసిన శరము బిలేశయ కంఠ
దేశంబు తఱుగ కదియును నే తేర[6]'

4. షష్ఠాశ్వాసములోని ముప్పది నాలుగవ లీలలో
"చేసిన నా పాండ్య శేఖరాత్మజుఁడు
రాశికెక్కిన చోళ రాజును గూడి[7]'

5. షష్ఠాశ్వాసములోని ముప్పది యాఱవ లీలలో
వ్రేసిన నా శక్తి వేగమై తాఁకి
రాశిగా రక్త పూరమ్ములు గాఱె[8]'

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 298.
2. చొక్కనాథ చరిత్ర. పుట 332.
3. చొక్కనాథ చరిత్ర. పుట 339.
4. చొక్కనాథ చరిత్ర. పుట 71.
5. చొక్కనాథ చరిత్ర. పుట 125.
6. చొక్కనాథ చరిత్ర. పుట 145.
7. చొక్కనాథ చరిత్ర. పుట 175.
8. చొక్కనాథ చరిత్ర. పుట 186.1

6. అష్టమాశ్వాసములోని ఏబది రెండవ లీలలో
'ఆ సంఘమంట పాభ్యంతరముననుu
నే శంకయును లేక యేను గూర్చున్న[1]'
7. అష్టమాశ్వాసములోని ఏబది మూడవ లీలలో
'ఆ సంఘమంట పాభ్యంతరముననుu
నేశంక లేకుండె నీశ్వరు కృపన్ను[2]'
8. అష్టమాశ్వాసములోని ఏబది నాలుగవ లీలలో
'ఆ సంఘ మంటపాభ్యంతరమ్మునను
నీశు సత్కృప చేత నిందఱు మెచ్చ[3]'
9. అందే
'ఆ సంఘమంట పాభ్యంతరమ్మునను
నాశైశవాకారు నా సుకుమారు[4]'
10. నవమాశ్వాసములోని ఏబది యేడవ లీలలో
'చేసితే సర్వేశ! శివలోక వాస!
యాశాంబరోల్లాస ! యధిక ప్రకాశ![5]'
11. నవమాశ్వాసములోని అఱువది యవ లీలలో
'పాసియుండుట వారు ప్రబలమ్మై యుంట
నా శైవ సమయంబులట్లుండుటయున్న[6]'
12. నవమాశ్వాసములోని యరువది నాలుగవ లీలలో
'ఆ సెట్టి పరిణయంబాడనుదీచ్య
దేశమ్మునకును నెంతే వేడ్కతోడ[7]'
13. అందే
'ఆ సెట్టి యా శివాలయ మంటపమున
నాశీ విపాదష్టుడయ్యె నయ్యెడన్న[8]'

II. చొక్కనాథ చరిత్రము నందు అల్పప్రాణాక్షరములకు మహాప్రాణాక్షరములకు ప్రాసమును గూర్చిన ద్విపదలు కనుపించు చున్నవి. వానినిట చూపుచున్నాను.

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 269.
2, 3. చొక్కనాథ చరిత్ర. పుట 272.
4. చొక్కనాథ చరిత్ర. పుట 274.
5. చొక్కనాథ చరిత్ర. పుట 294.
6. చొక్కనాథ చరిత్ర. పుట 320.
7. చొక్కనాథ చరిత్ర. పుట 349.
8. చొక్కనాథ చరిత్ర. పుట 350.

(1) ఠ - ట ప్రాసము[1]: సప్తమాశ్వాసములోని నలువది మూడవ లీలలో
'పాఠక కులములో పాటించి నన్ను
మేటిగావించితే, మీనధ్వజార్చి[2]'

(2) (i) 'ద - ధ' ప్రాసము[3]: షష్ఠాశ్వాసములోని ముప్పది యేడవ లీలలో
'పేదల పాలిటి పెన్నిధానంబ
సాధుల పాలిటి సంతాన తరువ[4]'

(ii) నవమాశ్వాసములోని ఏబది యెనిమిదవ లీలలో
'ఆ దేశమునగల నక్కల నెల్ల
సాధులఁజేసి యశ్వములంచు దెచ్చి[5]'

(iii) ధ - ద ప్రాసము. నవమాశ్వాసములోని యఱువది రెండవ లీలలో
'గంధమ్ము దీసిన కరములుండగను
నెందుకు వెదుకంగ నేల నీ క్షణమ్ము[6]'

III ఢ - ధ ప్రాసము[7]: ఇందు ఒకే వర్గములోని రెండు మహాప్రాణాక్షరములకు ప్రాస గూర్చినాడు. అష్టమాశ్వాసములోని ఏబదియవ లీలలో
'వర్ధమానార్ధమ వ్యక్తమ్ముగాను
సార్ఢమ్ముగాఁ జెప్పె సభికులౌననఁగ[8]'

IV ట - డ ప్రాసము[9]: (i) అష్టమాశ్వాసములోని ఏబదియవ లీలలో
'అట గొంతకాలమ్ము కాకవీశ్వరులు
చిడిముడి పడి తాము చెప్పిన కవిత[10]'

(ii) నవమాశ్వాసములోని యఱువది నాలుగవ లీలలో
'అట గొంతకాలమ్ముకతనగ్ర భార్య
చిడిముడి పడి యుదాసీనమ్ము లాడి[11]'

---

1. సుకవి మనోరంజనము ట-ఠ ప్రాసమును స్వవర్గజ ప్రాసముగా పేర్కొన్నది. ప్రథమాశ్వాసము. పుట 64
2. చొక్కనాథ చరిత్ర. పుట 229.
3. 'ద-ధ' ప్రాసమును సుకవి మనోరంజనము స్వవర్గజ ప్రాసముగా పేర్కొన్నది. మరియు అప్పకవి కూడా దీనిని స్వవర్గజప్రాసముగానే పేర్కొన్నాడు.
4. చొక్కనాథ చరిత్ర. పుట 192.
5. చొక్కనాథ చరిత్ర. పుట 303.
6. చొక్కనాథ చరిత్ర. పుట 341.
7, 9. 'ధ-ఢ', 'ట-డ', 'ప-బ' ప్రాసములను సుకవి మనోరంజనము స్వవర్గజ ప్రాసభేదముగా నంగీకరించినది. ప్రథమాశ్వాసము. పుట 64.
8. చొక్కనాథ చరిత్ర. పుట 261.
10. చొక్కనాథ చరిత్ర. పుట 260.
11. చొక్కనాథ చరిత్ర. పుట 354.

V. 'ప - బ' ప్రాసము[1] : సప్తమాశ్వాసములోని నలువది రెండవ లీలలో

'ఆ పీఠమునను బద్మాసనుండగుచు
నా బాణభద్రుండు నతి వేడ్క, బాడె [2]'

'బ - ప' - సప్తమాశ్వాసములోని నలువది మూడవ లీలలో

'ఆ బాణభద్రుని యతివయంతటను
దాపమనస్కయై తలవంచియున్న [3]'

VI అభేదయతి వలెనే వ, ప లకు 'వపయోరభేదః' అను సూత్రము ననుసరించి తిరువేంగళ కవి ప్రాసమును కూడా కూర్చినాడు. ఆ ద్విపదలివి.

1. 'వ - ప' - పంచమాశ్వాసములోని ముప్పది యొకటవ లీలలో

'ఆ వైశ్యులెల్లరు నత్యంత మడలి
బాపురే! యపకీర్తి వాటిల్లెనిపుడు[4]'

2. సప్తమాశ్వాసములోని నలువదియవ లీలలో

'నావల్ల పల్లాణుడను నొక్క జాణ
నా పాండ్యపతివద్ద కతి వేడ్కననిపె[5]'

3. అష్టమాశ్వాసములోని ఏబది యైదవ లీలలో

'నావల్ల దప్పేమి నాకాన తిమ్ము
ఈపట్ల మీరేగు నీ విధంబెల్ల[6]'

VII. న-ల ప్రాసము : భాషా శాస్త్రమున న, ల లకు వర్ణ వినిమయము వ్యవహారమున నున్నది. ఉదాహరణకు మునగ/ములగ/తెనుగు/తెలుగు వలె నాటి వ్యవహారమున నున్న న-ల ల వర్ణ వినిమయ ఆధారముగా తిరువేంగళ కవి న-ల. లకు ప్రాసమును విధించియుండవచ్చును. కేవల న-ల. లకే కాక ణ-ల లకు కూడా ఈకవి ప్రాసమును విధించినాడు. సరసయతిలో 'న-ణ'లు మిత్రములు. కావున న-ల ప్రాసముతోపాటు ణ-ల ప్రాసమును కూడా ఉపయోగించినాడని ఊహింపవచ్చును. ఇందు న-ల ప్రాసమున కొక యుదాహరణ, ణ-ల ప్రాసమునకొక యుదాహరణ లభించినవి.

న-ల; నవమాశ్వాసములోని యఱువది నాలుగవ లీలలో

'గా ననేకమ్ముల కాలకంధరుడు
వలనుగా రక్షించు వారెవ్వరనిన'[7]

---

1. 'ధ-థ', 'ట-డ', 'ప-బ' ప్రాసములను సుకవి మనోరంజనము స్వవర్గజ ప్రాసభేదముగా నంగీకరించినది. ప్రథమాశ్వాసము. పుట 64.
2. చొక్కనాథ చరిత్ర. పుట 219.
3. చొక్కనాథ చరిత్ర. పుట 225.
4. చొక్కనాథ చరిత్ర. పుట 164.
5. చొక్కనాథ చరిత్ర. పుట 205.
6. చొక్కనాథ చరిత్ర. పుట 278.
7. చొక్కనాథ చరిత్ర. పుట 361.

ల-ణ ప్రాసము; ద్వితీయాశ్వాసములోని అణివలీలలో

'ఏలు గుణధ్వని చేసి పేర్కొన్న ప్రమథ
గణములనెల్ల మార్గణములముంచి'[1]

**దుష్కర ప్రాసము:** చొక్కనాథ చరిత్రమునందు తిరువేంగళకవి 'ఫ; ంఖ్య, ష్ణ, జ్ఞ, , ష్ఠ, క్ష వంటి దుర్లభమైన అక్షరములను ప్రాస స్థానమున నుపయోగించినాడు. సంయుక్త యతులలో కూడా కొన్ని దుష్కర ప్రాసములున్నవి. ఇచట కొన్ని మాత్రముదహరింతును.

1.'ఫ' - తృతీయాశ్వాసమునుండి

'విఫలమైనట్టి యా వేదముల్ నాల్గు
సఫలమ్ముగా జేసి సద్ధర్మనియతి'[2]

2. 'ంఖ్య' - నవమాశ్వాసమునుండి

' సాంఖ్యాది యోగ వాసనలచే నతఁడ
సంఖ్య శిష్యులు గొల్వ జయమున నుండె'[3]

3. 'ష్ణ' - చతుర్థాశ్వాసము నుండి

'ఉష్ణాంశుదీధితి కోర్వంగ లేక
తృష్ణము బహుళమై దేహమ్ముబడలి'[4].

4. 'జ్ఞ' ప్రాసములు మొత్తము పదునొకండు గలవు. అందు ముఖ్యమైన వాటినిట వ్రాయుచున్నాను.

(i) ప్రథమాశ్వాసమునుండి

'సుజ్ఞాను లాంగిరసుండు శౌనకుడు
యాజ్ఞ వల్క్య మరీచులాది సన్మునులు'[5]

(ii) తృతీయాశ్వాసమునుండి

'యజ్ఞ హెూమ జపాదులాగమోక్తిగను
ప్రాజ్ఞులైనట్టి యాబ్రాహ్మలచేత'[6]

(iii) చతుర్థాశ్వాసము నుండి

'అజ్ఞాన కృతము నాయందు సిద్ధించె
ప్రజ్ఞా విహీనత పరికించితేను'[7]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 52.
2. చొక్కనాథ చరిత్ర. పుట 102.
3. చొక్కనాథ చరిత్ర. పుట 329.
4. చొక్కనాథ చరిత్ర. పుట 130.
5. చొక్కనాథ చరిత్ర. పుట 6.
6. చొక్కనాథ చరిత్ర. పుట 94.
7. చొక్కనాథ చరిత్ర. పుట 118.

(iv) షష్ఠాశ్వాసమునుండి
'అజ్ఞాన కృతమున నైనది గాన
ప్రజ్ఞతో జేసిన పనిగాదునిదియు'[1]

(v) అష్టమాశ్వాసమునుండి
'సుజ్ఞాన ఫలకను శుభలీల నున్న
ప్రజ్ఞా విశేషులు పండితోత్తములు'[2]

(vi) నవమాశ్వాసమునుండి
'సుజ్ఞాన సంబంధుఁ జూపు మంచపుడ
భిజ్ఞులతోఁ గూడఁ బేర్కొనియతఁడు'[3]

5. 'ష్ట' ప్రాసములు కూడా మొత్తము పదునొకండు గలవు. అందు ముఖ్యమైన వానినిట చూపుచున్నాను.

1. ప్రథమాశ్వాసము నుండి
'అష్ట మహాసిద్ధులామాతృకలకు
నిష్టమై యుపదేశమిచ్చిన లీల'[4]

2. ద్వితీయాశ్వాసము నుండి
'సృష్టింప మనుప శిక్షింపగవలసి
స్రష్టయు హరియును శంకరుండనగ'[5]

3. తృతీయాశ్వాసము నుండి
'అష్ట దిక్కుల నున్నయవని పాలకులు
సాష్టాంగములు సేయ సౌందర్య పాండ్య'[6]

4. పంచమాశ్వాసము నుండి
'అష్టమహాసిద్ధులనువంద మాకు
నిష్టమై యుపదేశ మిచ్చి రక్షింపు'[7]

5. అష్టమాశ్వాసము నుండి
'దృష్టులైనట్టి తత్సేవార్థులకును
నిష్టార్థములు వేడ్కనిచ్చుచునుండె'[8]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 196.
2. చొక్కనాథ చరిత్ర. పుట 272.
3. చొక్కనాథ చరిత్ర. పుట 334.
4. చొక్కనాథ చరిత్ర. పుట 14.
5. చొక్కనాథ చరిత్ర. పుట 43.
6. చొక్కనాథ చరిత్ర. పుట 79.
7. చొక్కనాథ చరిత్ర. పుట 167.
8 చొక్కనాథ చరిత్ర. పుట 275.

6. నవమాశ్వాసము నుండి
'అష్టావధానమ్ము నంది యెక్కాడె
స్రష్టయు హరియు నాశ్చర్యమ్ము నంద'[1]

(6) చొక్కనాథ చరిత్రము నందు 'క్ష' ప్రాసస్థానమున గల ద్విపదలు ఇరువది నాలుగు లభించినవి. వానిలో ఆశ్వాసమునకొకటి చొప్పున నిచ్చట వ్రాయుచున్నాను.

1. కథాను క్రమణికలో
'దక్షిణమ్మున మహాస్థలముగావించి
యాక్షితి రక్షించె నిన సన్నిభుండు'[2]

2. చతుష్షష్టి లీలలలో
'భక్షింపఁ బాషాణ భద్రేభమునకు
నిక్షు దండము చేతికిచ్చిన లీల'[3]

3. ప్రథమాశ్వాసమునుండి
'వృక్షలతాగుల్మ వితతుల తోడ
నక్షయమ్ముగ దట్టమై యొప్పుగాను'[4]

4. ద్వితీయాశ్వాసము నుండి
'దక్షుని తల ద్రుంచి దైవత కోట్ల
శిక్షించి శరణన్నఁ జేకొని కాచి'[5]

5. తృతీయాశ్వాసము నుండి
'దక్షిణ పశ్చిమోత్తర రాజవరుల
నక్షీణ గతి గెల్చియధిక కప్పములు'[6]

6. చతుర్థాశ్వాసము నుండి
'రక్షింపుమని యపారంబైన ధనము
లక్షలాభరణాంబ రాదులర్పించి'[7]

7. పంచమాశ్వాసము నుండి
'కక్షయుగ్మమ్ముల కాంతులు బెరసి
వక్షోజముల మీఁద వయ్యాళిఁ గదల'[8]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 296.
2. చొక్కనాథ చరిత్ర. పుట 9.
3. చొక్కనాథ చరిత్ర. పుట 13
4. చొక్కనాథ చరిత్ర. పుట 26.
5. చొక్కనాథ చరిత్ర. పుట 55.
6. చొక్కనాథ చరిత్ర. పుట 95.
7. చొక్కనాథ చరిత్ర. పుటలు 118, 119
8. చొక్కనాథ చరిత్ర. పుట 162.

8. షష్ఠాశ్వాసము నుండి
'రక్షింపు నాస్వామి రక్షింపు దేవ!
దక్షాధ్వర ధ్వంస! దండితత్రిపుర![1]

9. సప్తమాశ్వాసము నుండి
'వృక్ష మ్ము క్రింద నా వృషభ వాహనుని'
ప్రత్యక్షు సర్వేశ్వరునధ్యాత్మమైన'[2]

10. అష్టమాశ్వాసము నుండి
'రక్షించి యతని కాద్రావిడ కావ్య
లక్షణమ్ములు గొన్ని లాలించి యాన'[3]

11. నవమాశ్వాసము నుండి
'వృక్షమ్ము కూపమ్ము వేగనిచ్చుటికి
సాక్షి రప్పించి యీ జగమెల్ల నెఱుగ'[4]

## ద్విప్రాసము

తిరువేంగళ కవి చొక్కనాథ చరిత్రము నందు మొత్తము ఒక వంద తొమ్మిది ద్విప్రాసములనుపయోగించినాడు. ఇవి ఇందలి ప్రతి యాశ్వాసములోను కనుపించుచున్నవి, కాని 9,10,13,23,25,26,27 31,35,54వ లీలలలో ఇవి మృగ్యము. ఉదా;కు కొన్ని ద్విప్రాసములు:

1. ప్రథమాశ్వాసము నుండి
'దర్శించునుతియించుఁ దన్ను దామఱచు
హర్షించు నీ లీలలను గొంత తడవు'[5]

2. ద్వితీయాశ్వాసము నుండి
'అంజలి పుటముల ననువొప్పఁ జేర్చి
మంజుల వాక్య సంభ్రమముల్లసిల్ల'[6]

3. తృతీయాశ్వాసము నుండి
'అంగమ్ము లాఱును నవగతమ్ముగను
సాంగమ్ముగా జెప్పి సాధనమ్ముగను'[7]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 185.
2. చొక్కనాథ చరిత్ర. పుట 249.
3. చొక్కనాథ చరిత్ర. పుట 270.
4. చొక్కనాథ చరిత్ర. పుట 355.
5. చొక్కనాథ చరిత్ర. పుట 29.
6. చొక్కనాథ చరిత్ర. పుట 64.
7. చొక్కనాథ చరిత్ర. పుట 103.

4. చతుర్థాశ్వాసము నుండి
'సొంపొంద నట్టాల చొక్కడై పేరు
పెంపొంద నెపుడును పేర్కొన నుండె'[1]

5. పంచమాశ్వాసము నుండి
'భండారమందున్న బహు ధనంబెల్ల
నిండారగా నిచ్చి నెమ్మిఁ బొమ్మనిన'[2]

6. షష్ఠాశ్వాసము నుండి
'పేర్కొని నీవంటి బిరుదురాహుతుల
మార్కొని వేపుర మఱిగెల్చు బిరుదు'[3]

7. సప్తమా శ్వాసము నుండి
'తుండమ్మునను బట్టి తోయధి మధ్య
కాండమ్ములోన నాగ్రహమున వైచె'[4]

8. అష్టమాశ్వాసము నుండి
'గోత్రమ్ము నామము కులము శీలమ్ము
పాత్రమ్ము నెయ్యది! భావింపనాకు'[5]

9. నవమాశ్వాసము నుండి
'అఱ్ఱుల జేర్చుక హరహరా యనుచుఁ
గొఱ్ఱుల దప్పించు కొని పాఱువారు'[6]

**త్రిప్రాసము:** చొక్కనా థ చరిత్రము నందు ఇవి మొత్తము ఇరువది మూడులభించినవి. వానిలో కొన్నిటినిట చూపుదును. త్రిప్రాసములు ప్రథమ, చతుర్థ, అష్టమాశ్వాసములలో మృగ్యము.

1. ద్వితీయాశ్వాసము నుండి
'నఖములనెత్తి యేణమ్ముల ముద్దు
ముఖములాఘ్రా ణించు పుండరీకములు'[7]

2. తృతీయాశ్వాసము నుండి
'వలసిన ధనమెల్ల వరుసతో దెచ్చి
బలసిన రాజ్యమ్ము ప్రజల పాలింపు'[8]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 122.
2. చొక్కనాథ చరిత్ర. పుట 150.
3 చొక్కనాథ చరిత్ర. పుట 186.
4. చొక్కనాథ చరిత్ర. పుట 231.
5. చొక్కనాథ చరిత్ర. పుట 266.
6. చొక్కనాథ చరిత్ర. పుట 338.
7. చొక్కనాథ చరిత్ర. పుట 36.
8. చొక్కనాథ చరిత్ర. పుట 94.

3. పంచమాశ్వాసము నుండి

'కుతలమ్ముఁ గొమ్ములఁ గోరాడినంత
నతలమ్ము నెల్ల వ్రయ్యలుగాఁగ నడచు'[1]

4. షష్ఠాశ్వాసము నుండి

'రథములు గదిసి సారథుల దున్మాడి
రథముల కుఱికెడు రథిక సంఘములు'[2]

5. సప్తమాశ్వాసము నుండి

'పాద నేర్చిన వారి పాటకు దిద్దు
పాడనేరని వారిఁ బరగ నీరీతి'[3]

6. నవమాశ్వాసము నుండి

'పరలోక మోక్ష సంప్రాప్తి విభూతి
నరలోక వైభవోన్నతము విభూతి'[4]

## చతుష్ప్రాసము

చొక్కనాథ చరిత్రమున ఎనమిది చతుష్ప్రాసములు లభించినవి. వానిలో కొన్నిటి నీ క్రింద నుదాహరింతును. ఇవి ప్రథమ, తృతీయ, చతుర్థ, పంచమ, షష్ఠాశ్వాసములలో మృగ్యము.

1. ద్వితీయాశ్వాసమున

'మూఁడు మూర్తులు నీవె మూలమ్మునీవె
మూఁడు మూర్తుల కాది మూర్తివి నీవె'[5]

2. సప్తమాశ్వాసము నుండి

'ఓ పక్షి కులనాథ యోపక్షి వర్య
యీ పక్షి కుల మందు నీవొక్కరుడవు'[6]

3. అష్టమాశ్వాసము నుండి

'హాదేవ! దేవవేశ్యాభుజంగాంక
యోదేవ దేవ మృత్యుంజయ! యేను'[7]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 147.
2. చొక్కనాథ చరిత్ర. పుట 198.
3. చొక్కనాథ చరిత్ర. పుట 210.
4. చొక్కనాథ చరిత్ర. పుట 326.
5. చొక్కనాథ చరిత్ర. పుట 47.
6. చొక్కనాథ చరిత్ర. పుట 251.
7. చొక్కనాథ చరిత్ర. పుట 279.

4. నవమాశ్వాసము నుండి

'మంత్రమ్ములకు మాఱు మలయుచునుండు
యంత్రమ్ములకుఁ జాల నగ్గలమ్మగుచు'[1]

**పంచప్రాసము:** చొక్కనాధ చరిత్రము నందు అలంకారికులు చెప్పిన ద్వి, త్రి, చతుఃప్రాసములు కాక పంచప్రాసములు కూడా ఇందున్నవి. ఇవి ఇందు ఏడు లభించినవి. తృతీయాశ్వాసమున రెండు, పంచమాశ్వాసమున రెండు, షష్ఠ, సప్తమ, అష్టమాశ్వాసములలో ఒక్కొక్కటి చొప్పున నున్నవి. మిగిలిన ప్రథమ, ద్వితీయ, చతుర్థ నవమాశ్వాసములలో నివి మృగ్యము.

ఉదా; 1. తృతీయాశ్వాసము నుండి

'ఎన్ని బాణమ్ముల నింద్రుదేసినను
నన్ని బాణమ్ముల నవి యెల్లనణచె'[2]

2. పంచమాశ్వాసము నుండి

'నీరూపుఁ బొడఁగాన నేరరు సురలు
నీ రూపుఁ బొడఁ గాన నేరరు మునులు'[3]

3. షష్ఠాశ్వాసము నుండి

'ఏపదార్థము లెవ్వరేమియు గోర
నాపదార్థము లెల్లనపుడు గావించి'[4]

4. సప్తమాశ్వాసము నుండి

'నీ కోల రూపమ్ము నిట్లేటి కంటి
నీ కోల రూపమ్ము నెల్ల ప్రాణులకు'[5]

5. అష్టమాశ్వాసము నుండి

'కురుల వాసనగాని కొమరొప్ప ముడుచు
విరుల వాసన గాదు వెలదికి నంటి'[6]

అను ప్రాసాదులను శబ్దాలంకార విశేషముల యిన ప్రాసములను అలంకారములను శీర్షికలో శబ్దాలంకారముల క్రింద నుదాహరించితిగాన వానినిట తిరిగి చూపుటలేదు.

---

1. చొక్కనాధ చరిత్ర. పుట 323.
2. చొక్కనాధ చరిత్ర. పుట 90.
3. చొక్కనాధ చరిత్ర. పుట 165.
4. చొక్కనాధ చరిత్ర. పుటలు 188, 189.
5. చొక్కనాధ చరిత్ర. పుట 241.
6. చొక్కనాధ చరిత్ర. పుట 266.

**ప్రాస దోషములు:**

చొక్కనాథ చరిత్రమున తిరువేంగళకవి లాక్షణిక విరుద్ధములైన కొన్ని ప్రాసములను వాడినాడు. వానిలో అసంయుక్తాక్షరములు సంయుక్తాక్షరములతో, అర్ధబిందువు పూర్ణ బిందువుతో ప్రాసమును గూర్చిన ద్విపదలు కనుపించుచున్నవి. లాక్షణికులలో నభిప్రాయభేదమునకు గుఱియైన ర-ఱ ప్రాసమును ఈ కవి విరివిగానుపయోగించినాడు. సబిందు నిర్బిందు ప్రాసములు, ద్విత్వాద్విత్వ ప్రాసములు, బిందు పూర్వకాక్షరమునకు సంయుక్తాక్షరముతో ప్రాసములు కూడా ఇందుకనుపించుచున్నవి. వానినిట నుదాహరింతును.

**I. సబిందు నిర్బిందు ప్రాసము**

1. ప్రథమాశ్వాసములో మొదటిలీలలో
   'పరమ పుణ్యాంగనల్ పరికింప మఱియు
   నందమై కైలాస మందు రాదెంచ'[1]
2. తృతీయాశ్వాసములోని పదునాలుగవలీలలో
   'మఱియు నాపాండ్య భూమండలేశ్వరుడు
   సంతోష చిత్తుడై జగతిఁ బాలింప'[2]
3. సప్తమాశ్వాసములోని నలువది రెండవలీలలో
   'అనుచుఁ గుంభోద్భవుఁడాము నీంద్రులకు
   సంతోషచిత్తుడై సరవినిట్లనియె'[3]

**II సంయుక్తాక్షరమునకు బిందు పూర్వకాక్షరముతో ప్రాసము**

1. ప్రథమాశ్వాసములోని మొదటిలీలలో
   'గహ్వరంబులుచొచ్చి ఘన సింహములను
   సంహరింపుచు సాహసంబునఁ బేర్చి'[4]
2. ప్రథమాశ్వాసములోని అవతారికలో
   'కౌస్తుభాంచిత వక్షు కరుణాకటాక్షు
   సంస్తుత మునిలోలు సత్యసంశీలు'[5]
3. పంచమాశ్వాసములోని ఇరువది యేడవలీలలో
   'జిహ్వాగ్రమున నగ్ని శిఖలు పర్వఁగను
   సంహారకారియై సంభ్రమంబునను'[6]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 27.
2. చొక్కనాథ చరిత్ర. పుట 92.
3. చొక్కనాథ చరిత్ర. పుట 220.
4. చొక్కనాథ చరిత్ర. పుట 20.
5. చొక్కనాథ చరిత్ర. పుట 1.
6. చొక్కనాథ చరిత్ర. పుట 145.

4. అష్టమాశ్వాసములోని ఏబది రెండవ లీలలో
'సాంఖ్య తొండని రాల జడికిని నేర్చి
సౌఖ్యాబ్ధిఁ దేల్చిన సత్పుణ్య చరిత'[1]

5. నవమాశ్వాసములోని అఱువదియవ లీలలో
'అంహో విభేదనాహ్వా న్రేగ సప్త
జిహ్వా జిహ్వాగ్ర విచ్ఛేదన! పాహి!'[2]

III. **ద్విత్వాక్షరమునకు బిందు పూర్వకాక్షరముతో ప్రాసము**

1. సప్తమాశ్వాసములోని నలువదియేడవలీలలో
'చయ్యన నచట నాశ్రమవాసులైన
సంయమి ముఖ్యులా జలజాకరమున'[3]

IV. **ద్విత్వాక్షరమునకు అద్విత్వాక్షరముతో ప్రాసము**

1. ద్వితీయాశ్వాసములోని ఆఱవలీలలో
'కనుగొని తన మంత్రి గణములకనియె
వచ్చినయారాజ వరులనెల్లరిని'[4]

2. సప్తమాశ్వాసములోని నలువది నాలుగవలీలలో
'వైచిన నాదంతవక్త్రునిఁ జూచి
నవ్వుచు నుండెను నాచొక్కవిభుడు'[5]

V. **అర్ధబిందువునకు పూర్ణ బిందువుతో ప్రాసము**

1. సప్తమాశ్వాసములోని నలువది యేడవలీలలో
'కాఁకయ్యె వనములుఁ గమల సంయములు
నింకెవారిధులుడుకెత్తె నంబరము'[6]

VI. **సంయుక్తాక్షరమునకు అసంయుక్తాక్షరముతో ప్రాసము**

1. ద్వితీయాశ్వాసములోని ఆఱవలీలలో
'కర్పూర తాంబూల గంధాక్షతలను
బనిచిన నాభూమి పతులెల్లనపుడు'[7]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 268.
2. చొక్కనాథ చరిత్ర. పుట 321.
3. చొక్కనాథ చరిత్ర. పుట 248.
4. చొక్కనాథ చరిత్ర. పుట 59.
5. చొక్కనాథ చరిత్ర. పుట 231.
6. చొక్కనాథ చరిత్ర. పుట 247.
7. చొక్కనాథ చరిత్ర. పుట 59.

2. అదే ఆశ్వాసములోని ఏడవలీలలో
'హర్షమ్ముతోడ సంయమిముఖ్యులెల్ల
నరిగిరి తమతమ యాశ్రమంబులకు'[1]

3. తృతీయాశ్వాసములోని పదునైదవ లీలలో
'గ్రహశాంతిఁజేసినఁ గాల ధర్మమున
వర్షించు గాకనివారితంబుగను'[2]

4. పంచమాశ్వాసములోని ఇరువది యారవలీలలో
' ఈ ప్రసంగము విని యెల్ల వారలును
నా పురి ప్రజలును నాపాండ్య విభుఁడు'[3]

5. అదే ఆశ్వాసములోని ఇరువది ఎనిమిదవలీలలో
'మఱియును నారాజు మధురాపురమున
సర్వజనమ్ములు సంతుష్టి నుండ'[4]

6. అందే ముప్పది యవలీలలో
'వర్షముల్ గలుగు నీ వసుధ యంతటికి
నరనాథపాడి పంటలు చాలఁ గలవు'[5]

7. అదే పంచమాశ్వాసములోని ముప్పది యొకటవ లీలలో
'ఏకళంకము లేదు నీ బాలలందు
నీ క్రూర వధ మీకు నేల పాటింప'[6]

8 సప్తమాశ్వాసములోని నలువది యొకటవలీలలో
'యా ద్రవ్యమంతయు నాచొక్కనాథు
పాదాల సన్నిధిఁ బఱపించి మ్రొక్కి'[7]

ఇవి కాక ప్రాసదోషములుగల ద్విపదలు మఱికొన్ని ఇందు లభించుచున్నవి. వాని నిట క్రోడీకరించుచున్నాను.

**ప్రథమాశ్వాసము నుండి**

1. అదిగాక దక్షిణమాద్యంతమెల్ల
విశదంబుగా మీరు వేడ్కఁ జూచితిరి'[8]

1. చొక్కనాథ చరిత్ర. పుట 65.
2. చొక్కనాథ చరిత్ర. పుట 93.
3. చొక్కనాథ చరిత్ర. పుట 143.
4. చొక్కనాథ చరిత్ర. పుట 147.
5. చొక్కనాథ చరిత్ర. పుట 157.
6. చొక్కనాథ చరిత్ర. పుట 165.
7. చొక్కనాథ చరిత్ర. పుట 216.
8. చొక్కనాథ చరిత్ర. పుట 10.

**ద్వితీయాశ్వాసము నుండి**

1. కప్పుముట్టినఁ బాము గఱచిన నతఁడు
నష్ట పుత్రత్వము నభివృద్ధి గాంచు'[1]

2 శ్రీ మహాదేవుండు శిష్టరక్షకుఁడు
నాతటాతక శౌర్యమాత్మ భావించి'[2]

3. తిరమైన కేదార తీర్థమ్ముఁగ్రోలి
ముదముతోడుత నాగ మోక్షమ్ము నరసి'[3]

4. 'శ్రీ విశ్వనాథుని సేవసేవించి
పురుషోత్తముని జగత్పూజ్యునర్చించి'[4]

5. 'తగు వేడ్కనిమ్మెయిఁ దరుపారులింగ
మునుదేవ పూజగాఁ బూజించునపుడు'[5]

**తృతీయాశ్వాసము నుండి**

1. దక్షిణంబటుఁజూడఁ దలలేక మొండె
మేర్పడఁ గాన్పించు నెవ్వరికేని'[6]

2. మాయా మృగంబైన మారీచుఁ ద్రుంచి
చయ్యననాపర్ణ శాలకు వచ్చి'[7]

3. కొమరొప్పఁ గన్యకా కొమరి వీక్షించి
కరమొప్పఁ ద్రోవ గోకర్ణమ్ము సూచి'[8]

4. వాచామ గోచర వర్ణ రూపాయ
కామ భస్మాంగాయ గంగాధరాయ'[9]

**చతుర్థాశ్వాసము నుండి**

1. మకుట భూషణములు మహిత వస్తువులు
దటుకునఁగానకఁ దగనగరెల్ల'[10]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 41.
2. చొక్కనాథ చరిత్ర. పుట 52.
3, 4. చొక్కనాథ చరిత్ర. పుట 55.
5. చొక్కనాథ చరిత్ర. పుట 63.
6 చొక్కనాథ చరిత్ర. పుట 76.
7. చొక్కనాథ చరిత్ర. పుట 96.
8. చొక్కనాథ చరిత్ర. పుట 97.
9. చొక్కనాథ చరిత్ర. పుట 103.
10 చొక్కనాథ చరిత్ర. పుట 108

2. నాకుమారుండును నాచొక్కనాథుఁ
గోరి సర్వేశ్వరు గుడికేగుదెంచి'[1]
3. వివరించెదను నీదు వెలదికి వేగఁ
గ్రమమొప్పనగ్ని సంస్కారమ్ము సేయు'[2]
4. 'రాకుండ నచ్చోటి కంతకు దూత
లారేయిఁదమ మాట లాడంగఁ జూచి'[3]

**పంచమాశ్వాసము నుండి**

1. 'ఆవార్త విని రాజునద్భుతంబంది
శ్రీ చొక్కనాథుడాశ్రిత కల్పతరువు'[4]
2. 'తగ వేదములకును తల్లి గాయత్రి
మనుజేంద్ర! యిటు మహా మహిమలు చెలఁగు'[5]

**షష్ఠాశ్వాసము నుండి**

1. అది యెల్ల ముద్దగా నపుడు సేయించి
యౌషధం బొక్కటి నందు పైఁ బూసి'[6]
2. మఱి మించినట్టి యా మధ్యార్జునమున
వసియించె కొన్నాల్లు వరగుణ పాండ్య'[7]

**సప్తమాశ్వాసము నుండి**

1. ఎసగి సంగీత సాహిత్య సంపదల
మనుచుందు రెప్పుడు మధురేశు కృపను'[8]
2. నీ పవళ్లాళుతో నీడుగా మించి
నీ శక్తిఁబాడంగ నేర్తువేయనిన'[9]
3. పరిపూరితానంద బాష్ప పూరములు
దొడ రంగ నతివేడ్కతో నాత్మ నలరి.'[10]

---

1. చొక్కనాధ చరిత్ర. పుట 111.
2. చొక్కనాధ చరిత్ర. పుట 132.
3. చొక్కనాధ చరిత్ర. పుట 133.
4. చొక్కనాధ చరిత్ర. పుట 154.
5. చొక్కనాధ చరిత్ర. పుట 156.
6. చొక్కనాధ చరిత్ర. పుట 181.
7. చొక్కనాధ చరిత్ర. పుట 200.
8. చొక్కనాధ చరిత్ర. పుట 212.
9. చొక్కనాధ చరిత్ర. పుట 222.
10. చొక్కనాధ చరిత్ర. పుట 228.

4. తానానతిచ్చునాధ్యాత్మ మంతయును
బాయక తెలిసెనే పరికింత మనుచు'[1]

5. 'తత్క్షణమ్మున వేగ దయగల్గి మఱియు
రక్షించు సౌందర్య రాజశేఖరుడు'[2]

**అష్టమాశ్వాసము నుండి**

1. నయమొప్ప శ్రీ చొక్కనాథ సద్భక్తు
లైసేవ లొప్పఁగఁ బ్రణమిల్లి యెపుడు'[3]

2. 'తమతమ కావ్యసత్త్వమ్ములు దెలిసి
వివరింపఁగా పుర విజయుండు దక్క'[4]

3. ' అయూర నాగుడి నాపాండ్యమునను
నా మహాదేవుని నరసి సన్నుతులు'[5]

**నవమాశ్వాసమునుండి**

1. 'అలించి యధిక దయాళుఁ డైయపుడు
లక్షోపలక్షలై లక్షణాశ్వములు'[6]

2. 'మొనసి యా సానుల ముక్కులుఁ జెవులు
గొఱిశలు మొదలంటఁ గొఱికిపై కుఱికె'[7]

3. 'ఆరాత్రి వేఁగంగ నామఱునాఁడు
భీతులై డాఁగి తప్పించుకున్నట్టి'[8]

4. 'అనిన నా ముద్దియనట్లననేల
నీకును మనసు రా నెంతయుఁ బిట్టు'[9]

5. 'నీవెవ్వఁడిట! మఱి నీకుఁ బేరేమి'
యేయూరనుందువు నెవ్వరివాఁడ'[10]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 230.
2. చొక్కనాథ చరిత్ర. పుట 244.
3. చొక్కనాథ చరిత్ర. పుట 259.
4. చొక్కనాథ చరిత్ర. పుట 272.
5. చొక్కనాథ చరిత్ర. పుట 285.
6. చొక్కనాథ చరిత్ర. పుట 294.
7. చొక్కనాథ చరిత్ర. పుట 301.
8. చొక్కనాథ చరిత్ర. పుట 301.
9. చొక్కనాథ చరిత్ర. పుట 307.
10. చొక్కనాథ చరిత్ర. పుట 309

6. పొమ్మని పనిచినఁబొరి పొరి వచ్చి
పట్టుక రమ్మనెఁ బాండీడు నిన్ను'[1]

7. 'కడు విస్మయంబంది కడకతోనిదియు
వరచొక్కనాథుని వాక్యమ్ములనుచు'[2]

8. దక్షిణ పార్శ్వమ్ముతాప జ్వరమ్ము
తత్క్షణమ్మున మాన్పెదము మేము ననిన'[3]

9. 'ఆయూరి సర్వేశు నంబికాధీశు
సేవించి యచట పసించి రార్రాత్రి'[4]

10. 'అ వేళ బ్రహ్మాదులందఱు గూడి
యోదేవ! దేవేశ! యోచొక్కనాథ'[5]

చొక్కనాథ చరిత్రమున తిరువేంగళకవి ర-ఱ ప్రాసవములను విరివిగా నుపయోగించినాడు. ఇవి ప్రతి యాశ్వాసము నందును గలవు. 'ర' కారమునకు ఱ కారముతో ప్రాస గూర్చిన ద్విపదలు నలువది తొమ్మిది, 'ఱ' కారమునకు 'ర' కారముతో ప్రాస గూర్చిన ద్విపదలు ఒక పంద మూడు మొత్తము నూటా ఏబది రెండు లభించినవి. వీనినన్నింటి నిట క్రోడీకరించుట యనవసరము. మచ్చుకు రెండుదాహరింతును.

ర-ఱ ప్రాసము; 1. పంచమాశ్వాసములోని ముప్పది యొకటవ లీలలో

'కరమూల రుచులు శృంగార హస్తములు
కఱకంఠుఁడటఁ జూచి కడ కంటనగిన'[6]

ఱ - ర ప్రాసము; తృతీయాశ్వాసములోని పదునైదవ లీలలో

'కఱకంఠు తలపువ్వు కలువల నవ్వు
విరహుల తలవెచ్చ విటులుండురచ్చ'[7]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 311
2. చొక్కనాథ చరిత్ర. పుట 315
3. చొక్కనాథ చరిత్ర. పుట 325
4. చొక్కనాథ చరిత్ర. పుట 350
5. చొక్కనాథ చరిత్ర. పుట 360
6. చొక్కనాథ చరిత్ర. పుట 159
7. చొక్కనాథ చరిత్ర. పుట 98

# సప్తమాధ్యాయము - శైవ సంప్రదాయము

చొక్కనాథ చరిత్ర సుందరేశ్వరుని అరువది నాలుగు లీలలను వర్ణించినది గావున ఇది శైవ మత సంబంధ ద్విపద కావ్యమని చెప్పవచ్చును. ఇందు ప్రతిపాదింపబడినది శైవ మతమని తెలుపుటకు ముందు మత మననేమిటో నిర్వచించి, మానవునకు మతముతో గల ప్రమేయమును చర్చించి, వివిధ శైవ సంప్రదాయములనుగూర్చి వివరింతును.

## మతమనగానేమి?

మతము అను పదమునకు సూర్యరాయాంధ్ర నిఘంటువు విశ్వసింపబడినది, అభిప్రేతము, అకూతము, ఆశయము, ఇచ్ఛ, జ్ఞానము, అను నర్థముల నొసగినది.[1] విజ్ఞాన సర్వస్వమున మత సంప్రదాయములను గూర్చి వివరించుచు మల్లంపల్లి సోమశేఖర శర్మగారు 'ఇప్పుడు మనము మతము అని వ్యవహరించు దానిని పూర్వులు ధర్మమని, సమయమని వ్యవహరించి యుండిరి[2]' అని వ్రాసినారు.

ధర్మము అను పదమునకు లోకమును ధరించునది, లోకమును మంచి స్థితి యందు నిలబెట్టునది యని యర్థముల నొసంగుచు సూర్య రాయాంధ్ర నిఘంటువు శృతి స్మృత్యాదులందు విహితమగు కృత్యమే ధర్మమని, ఇది పది విధములని 'ధృతిః క్షమాదమోऽస్తేయంశౌచ మింద్రియ నిగ్రహః ధీర్విద్యా సత్యమక్రోధో దశకం ధర్మలక్షణం' అని మనుస్మృతి (6-92) లోని శ్లోకమునుట్టంకించినది. మరియు సుకర్మములు చేయుటచే కలుగు అదృష్టము, పుణ్యము, న్యాయము, ఆచారము, స్వభావము, గుణము, అహింస యజ్ఞము, ఉపనిషత్తు వేదాంతము, దానాదులని వివిధార్థముల నొసగినది.[3]

మతమనగానేమి? యని చర్చించుచు డా॥ కొత్త సచ్చిదానంద మూర్తి గారు మత సమీక్షయను వ్యాసమున 'మతము అను పదమునకు సమ్మతమైనది అని, అనగా ఇచ్ఛ, బుద్ధి (జ్ఞానము) అని అర్థములు కలవు. కాబట్టి మతమనగా ఇష్టమైనదని తెలిసికోబడినది, అభిప్రాయము అని చెప్పవచ్చును. అతీంద్రియ విషయములను గూర్చినట్టియు, మనుష్యుల శ్రేయస్సు, కర్తవ్యములను గూర్చి నట్టియు ప్రతీతిని, శ్రద్ధ (విశ్వాసము) ను మతము అనుట తెలుగులో రూఢి అయినది. కొన్ని భారతీయ భాషలలో దీనినే 'సంప్రదాయ' మందురు. పరంపరచే ప్రాప్తమగు విద్యాస్థానము, శ్రద్ధయు సంప్రదాయము

---

1. సూర్యరాయాంధ్ర నిఘంటువు, ఆరవ సంపుటము. పుట 76
2. విజ్ఞాన సర్వస్వము. మూడవ సంపుటము. పుట 534
3. సూర్యరాయాంధ్ర నిఘంటువు, నాలుగవ సంపుటము. పుట 401

అగును. లోకమును సంఘవ్యవస్థ నుధరించునట్టిది. న్యాయము, పుణ్యకర్మ, శిష్టాచారము. ఇవి ధర్మమున కర్థములు. మనుష్యులను కట్టడిలో నుంచునది, ప్రాణులను పరస్పరము సంబద్ధము చేయునది, మనుష్యులను దేవ పితృకార్యపరులనగా చేయునది ధర్మము. న్యాయము తోడను, ఇతర జీవులతోడను, దేవతాపితరులతోడను, మానవునికి ఉచిత సంబంధముల నేర్పరచునది ధర్మము. దీనికిని అతీంద్రియ జ్ఞాన శ్రద్ధలు ఆధారములు. చాల భారతీయ భాషలలో 'ధర్మము' అతీంద్రియ విషయములను గూర్చిన సిద్ధాంతములను, తదనుగుణ ఆచారమును సూచించును. ఇట్లు మూడు పదముల వాడుక 'రెలిజియన్' అను పదముతో సమానార్థకముగ నున్నది. పైన ధర్మమునకున్నవని చెప్పబడిన అర్థములే రెలిజియన్ కును గలవు'[1] అని వ్రాసినారు.

## మతము ధర్మము సమానార్థకములా?

పై నిర్వచనములు( జదివిన మీదట మతమునకు, ధర్మమునకు ఉన్న యర్థములను పోల్చిచూడగా - ఒక్క జ్ఞానము అను పదము( దప్ప - ధర్మమునకున్న విశాలార్థము మతమునకు లేదని ద్యోతకమగుచున్నది. శృతిస్మృత్యాదులందు విహితమైనది, లోకమును మంచి స్థితియందు నిలబెట్టునది ధర్మము కాగా కేవలము ఒకనిచేతనో కొందఱిచేతనో విశ్వసింపబడినది మతమని తెలియుచున్నది. విశ్వశ్రేయస్సును కాంక్షించు ధర్మము సర్వులకు ఆచరణీయమైనచో [illegible]శ్రేయస్సును కోరెడి మతము కొందఱికిని మాత్రమే మొదట ఆచరణీయమై తదు[illegible] మతమే గొప్పది దీనినే ఎల్లరును అనుసరింపవలెనను హఠము ప్రబలముగా కన్ని[illegible]ది. 'మతము నందు స్వీయ ఆధార, అభ్యుపగమములను పరీక్షించు య[illegible]మత సహనము, ఉదారత చాలవరకు తక్కువ. సంపూర్ణ సత్యము హస్తగత[illegible]సడిగాన ఇక అందరును దానిని అవశ్యమంగీకరింపవలెనను హఠము అందువుండున.[illegible]ని ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తిగారు దర్శన సమీక్షలో దర్శన స్వరూప స్వభా[illegible]లను గూర్చి వ్రాయుచు పై యభిప్రాయమును సమర్థించి యున్నారు. కావున [illegible]మును ధర్మమును సమానార్థకములుగా వాడుట సరికాదని నా అభిప్రాయము.

మతమున: ధర్మమునకు పర్యాయపదముగా వాడుటకు గల కారణము 'రిలీజియన్' అను ఆంగ్లపదము. ఆంగ్ల భాషావేత్తలెవరో మొదట దీనిని ధర్మము అను పదమునకు సమానార్థకముగా వాడియు:దురు. బ్రౌణ్య ఇంగ్లీషు తెలుగు నిఘంటువు ఈ రెలిజియన్ అను పదమున కిచ్చిన అర్థములు జూచిన నా యూహసరియని యనిపించును. ఈ నిఘంటువు ఈ పదమునకు మతము, ధర్మము, పరమార్థసాధనము, ఉపాసనాకాండ, ఈశ్వరారాధనాదిసేవ, సమయము, మార్గము, వైదికము, ఇత్యాదులు - అని యర్థముల

---

1. విజ్ఞాన సర్వస్వము. ఏడవ సంపుటము. పుట 206
2. విజ్ఞాన సర్వస్వము. ఏడవ సంపుటము. పుట 30

నిచ్చినది.[1] సాధారణముగా నిఘంటువులు లోకమున రూఢియైన యర్థములనే పదముల కిచ్చుచుండును గావున ఆంగ్లభాషాభిజ్ఞులు మొదట ధర్మమునకు Religion అను పదమును వాడి యుందురని ఊహించితిని. ధర్మమునకు కొన్ని గ్రంథములలో 'Dharma' అని వాడుట కూడ ఎల్లరెరిగినదే!

ఇఁక సమయమను పదమునకు ఆచారము, సిద్ధాంతము, బుద్ధి, నియమములని, సంప్రదాయమను పదమునకు ఆచారము, పరంపరాగత జ్ఞానము, ప్రత్యేక మత బోధన విధానము, గురు పారంపర్యము లని అర్థములు గలవు.[2] ఈ యర్థములను Religion అను పదమునకు గల అర్థములతో పోల్చి చూచిన సమయము, సంప్రదాయము అను పదములను రిలీజియన్ అను పదమునకు పర్యాయ పదములుగ వాడవచ్చును అని తెల్లమగును. మతము అను పదమున కొసంగబడిన జ్ఞానము అనునర్థము, పరంపరాగత జ్ఞానముగా మనము గుర్తించవచ్చును. కావున మతము, సమయము, సంప్రదాయము అను పదములు సమానార్థకములు కాని ధర్మము మతమునకు పర్యాయపదము గాదని నా యభిమతము.

## మతనిర్వచనములు

పై యర్థములను మనమున నిడుకొని మతమును నిర్వచింపబూనుకొనినచో ఈ క్రింది విధములుగా నిర్వచనములుండుటకు వీలు కలదు.

1. మానవులకు భగవంతుని ఎడగల విశ్వాసము మరియు ఉపాసనాకాండ లేదా ఆరాధనావిధానము మతమని చెప్పవచ్చును. ఇది ప్రధానముగా మతావలంబులకు వర్తించునది.

2. పరమార్థసాధనకై భగవంతునాశ్రయించుట, గురుపరంపరాగతమైన జ్ఞానమును శిష్యులకు బోధించుట - మతమని చెప్పవచ్చును. ఇది ప్రధానముగ మత గురువులకు వర్తించునది.

## మానవునకు మతముతో గల ప్రమేయము

లోకమున ప్రతి మానవుడు విశ్వాసముపైనను, ఆశతోడను జీవించును. నమ్మకము వమ్ము అయినప్పుడు ఆశ నిరాశయైనపుడు తన జీవితము తనకు దుర్భరముగాఁదోచును. కావున ప్రతి మనిషి తన మనుగడ సుఖముగా, ఆనందముగా, ఒడిదొడికులు లేకుండ, సాగవలెననియే కోరుకొనును. తన జీవనమునకు, ప్రయత్నమునకు ఆటంకము కలిగించు ఎట్టి శక్తినైనను తాను తృప్తిపఱుచఁ జూచును. ఇట్టి సందర్భముననే మానవుడు మతము నాశ్రయించును.

---

1. బ్రౌణ్య ఇంగ్లీషు - తెలుగు నిఘంటువు. పుట 943
2. సూర్యరాయాంధ్ర నిఘంటువు

శ్రీకృష్ణ భగవానుడు గీతలో

"చతుర్విధాభజంతేమాం జనాస్సుకృతినోర్జున!
ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీచ భరతర్షభ"[1]

అను శ్లోకమున ఆర్తులు, జిజ్ఞాసులు, అర్థార్థులు, జ్ఞానులు (మోక్షార్థులు) అని తన నాశ్రయించిన భక్తులను నాలుగు విధములుగా విభజించి చెప్పినాడు. దీనిని బట్టి లోకమున భగవంతునాశ్రయించని మనుజుడు ఉండడు అని తెలియుచున్నది.

'నవనాగరకులగు ఏ కొలది మందికో మతముపై విశ్వాసము సడలినదిగాని అధిక సంఖ్యాకులకు మతమే కనువెలుగు. జనసామాన్యమున జీవితమునందు మతమునకున్న ప్రాధాన్యము మరొక దానికి లేదు. రాజకీయ, సాంఘిక, ఆర్థిక, నైతిక సమస్యలన్నియును మన దేశమున మతమునకు లోబడి తదనుగుణముగ రూపుదిద్దుకొనుచు వచ్చినవి'[2] మతము ఇంతటి ప్రాముఖ్యమును సంతరించుకొనుటకు గల కారణము 'మనస్తత్వ శాస్త్ర రీత్యా పరిశీలించినచో మానవునకు చిన్నతనము నుండియు దైవభక్తి యేర్పడుట కనుకూలమగు వాతావరణము సంఘములో నుండును. బిడ్డ బుద్ధి తెలిసిన నాటినుండియు తండ్రికి భయపడుట, అతని యాజ్ఞకు లొంగుట, మనమెఱిగిన విషయమే. తాను స్వతంత్రించి చేయుటకు వెనుకాడుట, ప్రతి చిన్నపనికిని తండ్రి వద్దనుండియో దగ్గరి వారైన పెద్దల నుండియో సహాయసందేశములకై యెదురుచూచుట ఆ బిడ్డకు విడరాని విధముగా నలవడును. పెరిగి పెద్దవాడైనను రక్తము నందు జీర్ణమైన యా లక్షణము వానిని తండ్రికి బదులుగా దైవమునకు విధేయునిగాఁ జేయును. దైవ భక్తికట్లు మానవునిలో స్థానము కల్పించుచున్నది.[3]

అంతేకాక దైవమును మానవుడాశ్రయించుటలో మఱియొక బృహత్ప్రయోజనము కన్పించుచున్నది. జీవితమున తనకు లభ్యముకాని యంశమేదేని యున్నచో దానిని కేవలము తన యసమర్థత వలననే తాను పొందలేకపోయితినను జ్ఞానము మానవుని యహంకారమునకు (Ego) పెద్ద దెబ్బ. అట్టి సమయములందు అపజయమునకు కారణము తానుగాక యితరుడని నమ్ముట వానికి శాంతినిచ్చును. దైవకృతము కావుననే యొక కార్యము సానుకూలపడలేదనియు నట్లు జరుగకుండనడ్డుట తన శక్తిని మించిన దనియు సమాధానము చెప్పుకొనుట వలన వాని యహంకారము పరిరక్షింపబడి మనశ్శాంతి కలుగుచున్నది. జీవిత మహా సమరమున నడుగడుగున నెదురుదెబ్బలు తినెడి మానవుని నిస్పృహనుండి, నైరాశ్యము నుండి రక్షించి, శాంతి కల్పించి, యాశను పూరించి, వాని దృష్టిని భవిష్యత్తు వైపునకు త్రిప్పునది దైవ భావనయే కావున అతర్కితలును, విపాదకరములును చంచలములును హటాత్సంభవములునగు పెక్కు

---

1. భగవద్గీత. విజ్ఞాన యోగము. శ్లో 16
2. తెలుగు జానపదగేయ సాహిత్యము. పుట 301
3. తెలుగు జానపద గేయ గాథలు. పుట 13

సంఘటనలు నిరంతరము వాటిల్లు నీ ప్రపంచమున మనుష్యునకు నిర్భయత్వమును క్షేమ భావమును కలిగించుచు పెద్ద బాధ్యతను నిర్వహించు శక్తిగలది మతమొక్కటియే యని నిర్ధారింపబడినది.[1]

మతము మానవుని యొక్క నైతిక స్థాయిని పెంచునది గను వాని ప్రవర్తనను సరిదిద్ది సంఘమున నెక కట్టుబాటును వికాసమును కలిగించునదిగనున్నది. సాంఘికములగు ననేకములగు నాచారములు నమ్మకములు క్షతిలేని స్థితిని పొంది వెలుగుటకు మతము కారణమగుచున్నది.[2] దీనికిట్లు ఒక జాతి యొక్క సంస్కృతి తోడను, సాంఘిక వ్యవస్థ తోడను సంబంధమున్నట్లే ఆ జాతికి సంబంధించిన రసదాయకములగు కళల తోడను అవినాభావ సంబంధము గలదు. సంగీతము, నృత్యము, చిత్రలేఖనము, సాహిత్యము మున్నగు లలిత కళల యందు మత ప్రధానములైన యంశముల యునికి ప్రాక్చారిత్రక యుగము నుండియే కన్పించుచున్నది.[3]

పైన వివరించినట్లుగ మత నిర్వచనములను, ప్రమేయమును దృష్టియందుంచుకొని చొక్కనాథ చరిత్రమునందలి మతాంశమును పరిశీలించినచో ఈ కావ్యమున వర్ణింపబడిన యఱువదినాల్గులీలలలో మానవులు, పశుపక్ష్యాదులు చొక్కనాథ శివుని నమ్మి, తమకు గల్గిన యాపదల బాఱినుండి తమ్ము రక్షింపుమని యాదేవుని ప్రార్థించి యభీష్ట సిద్ధిని బొందుట గలదు. మఱియు జ్ఞాన సంబంధుడను శైవ సమయాచార్యుడు శైవ మత ప్రాధాన్యమును గూర్చి జైనులకు బోధించుటయు, శివమతము నంగీకరించని బౌద్ధులను ఓడించి శూలముల నెక్కించుటయు (61 వలీల). శైవమత మాహాత్మ్యమును జూపుటయు ఇందుకలదు. కావున చొక్కనాథ చరిత్రమున ప్రతిపాదింపబడినది శివమతమని సిద్ధాంతము.

ఇఁక యిప్పుడు విచారింపవలసినది చొక్కనాథ చరిత్రమున ప్రతిపాదింపబడిన శైవము ఏ శైవ శాఖా సంప్రదాయమునకు చెందిన దను విషయము. దీనిని గూర్చి విచారించుటకు ముందు వివిధ శైవ సంప్రదాయములను గూర్చి తెలియవలె.

## శైవ సంప్రదాయములు

**శైవము;** శైవ సంప్రదాయమున ఆరాధ్యదైవము శివుడు పరమేశ్వరునకు గల నామములలో 'శివుడు' కూడ యొకటని మహర్షి దయానంద సరస్వతి గారు సత్యార్థ

---

1 తెలుగు జానపద గేయగాథలు. పుట 14 డా॥ నాయని కృష్ణకుమారి గారు ఈ విషయమును Kluchon - Myths and Rituals - A general theory - Harward theological Review— నుండి అనువదించినట్లు అధోజ్ఞాపిక (Foot Note) లో వ్రాసియున్నారు.

2. తెలుగు జానపద గేయగాథలు పుట 15 'ఇది Felix M. Keesing — Cultural Anthropology — The Science of custom. P.328' నుండి ఉట్టంకించినట్లు అధోజ్ఞాపికలో తెలిపియున్నారు.

3 తెలుగు జానపద గేయగాథలు పుట 15

ప్రకాశమున కైవల్యోపనిషత్తు నుండి ఈ క్రింది మంత్రము నుట్టంకించి దాని యర్థము నిట్లు చెప్పియున్నారు.[1]

మం. సబ్రహ్మా సవిష్ణుః సరుద్రస్సశివస్సోక్షరస్స పరమః స్వరాట్।
స ఇంద్రస్స కాలాగ్నిస్స చంద్రమాః ॥ కైవల్య ఉపనిషత్ 1-8.

**అర్థము:** జగత్తు నంతటిని సృష్టించుటచే 'బ్రహ్మ', సర్వత్ర వ్యాపకుడగుటచే 'విష్ణువు', దుష్టులను దండించి యేడ్పించుటచే 'రుద్రుడు', మంగల మయుడును అందఱకును కళ్యాణకర్తయునగుటచే 'శివుడు', (యః సర్వమశ్నుతే నక్షరతి సవినశ్యతి తదక్షరమ్) సర్వత్ర వ్యాపించి యవినాశి యగుటచే 'నక్షరుఁడు', (యః స్వయం రాజతే సస్వరాట్) స్వయం ప్రకాశకుఁడగుటచే 'స్వరాట్టు' (యోఽగ్నిరివకాలః కలయితా ప్రళయకర్తా సకాలాగ్నిరీశ్వరః) ప్రల్యయమందెల్లరకును కాలుఁడయి కాలమునకు కాలుఁ దగుటచే 'కాలాగ్ని' యని పరమేశ్వరునకు నామములు.

కైవల్యోపనిషత్ మంత్రమును బట్టి శివుడు, రుద్రుడు పరమేశ్వరనామములని తెలియుచున్నది.

ఋగ్వేదీయ దేవతలలో రుద్రుఁడు మహా మహిమాన్వితుడుగా లయకారుడుగా కనిపించుచున్నాడు. ఋగ్వేదములో ప్రథమ మండలమున నలువది మూడవ సూక్తమున ఐదు ఋక్కులలో, మరియు నూట పదునాలుగవ సూక్తమున పదునొకండు ఋక్కులలో, ద్వితీయ మండలమున ముప్పది నాలుగవ సూక్తమున పదునైదు ఋక్కులలో, షష్ఠ మండలమున డెబ్బది నాలుగవ సూక్తమున నాలుగు ఋక్కులలో, సప్తమ మండలమున నలువది యాఱవ సూక్తమున నాలుగా ఋక్కులలో మొత్తము ముప్పది తొమ్మిది ఋక్కులలో వరుసగా ఘోరపుత్రుడగు కణ్వునిచే, అంగిరసపుత్రుడగు కుత్సునిచే, గృత్సమదునిచే, బృహస్పతి పుత్రుడగు భరద్వాజునిచే, మైత్రావరుణియగు వశిష్ఠునిచే రుద్రుడు స్తుతింపబడినాడు.[2] ఇదియే రుద్ర సూక్తమను పేర వ్యవహరింపబడుచున్నది.

ఋగ్వేదములో రుద్రుడు నిగ్రహానుగ్రహ సామర్థ్య సమేతుడు, సకలైశ్వర్య సంపన్నుడు, మహావీరుడు, మహాబలశాలి, మహాకోపభయంకరుడు, ధనుర్బాణపాణి, మరుద్దేవతాజనకుడు, దివ్యతేజో విరాజమానుడు, ధవళాంగుడు, జటా జూట ధారి, రోగ శాంతి ప్రదుడు, లోకరక్షకుడు, భక్త ప్రియుడుగా కనిపించుచున్నాడు.[3]. ఈ ఋగ్వేదీయ రుద్రుడే తరువాత బయలుదేఱిన శైవమతమున కాధారభూతుడైన శివుడని చెప్పుటకు దగినట్లుగా నిందు వర్ణింపబడిన రుద్ర లక్షణములన్నియుఁ దరువాతి గ్రంథములలోని శివునికి సంక్రమించినవని చెప్పవచ్చును.[4] మఱియు శ్రీ మల్లాది సూర్య నారాయణ

---

1. సత్యార్థ ప్రకాశము. ప్రథమోల్లాసము. మంత్రము పుట 11. అర్థము పుట 12, 13 లు.
2. సమూల శ్రీమదాంధ్ర ఋగ్వేద సంహిత. ప్రథమ, ద్వితీయ, తృతీయ సంపుటములు.
3. సంస్కృత వాఙ్మయ చరిత్ర. వైదిక వాఙ్మయము. ప్రథమ సంపుటము. పుట 135
4. సంస్కృత వాఙ్మయ చరిత్ర, ప్రథమ సంపుటము. పుట 134

శాస్త్రిగారు 'నిరుక్త కారులును భాష్యకారులును రుద్ర శబ్దమునకు బహు విధములైన వ్యుత్పత్తులు వ్రాసియున్నారని తెల్పుచు'నందు కొన్నిటిని పేర్కొనినారు.

'ఉఱుము కలిగించువాడు, మేఘోదరస్థుడై ధ్వని చేయుచు ద్రవించువాడు, శత్రువులను దుఃఖింపజేయువాడు, అంతకాలమందందఱి నేడ్పించువాడు, సంసార దుఃఖమును నశింపజేయువాడు, శబ్దరూపోపనిషత్తుల వలన దెలియబడువాడు, ఉపాసకుల కుపనిషద్విద్య నిచ్చువాడు, అంధకారమును జీల్చువాడు ఇత్యాదికములు. ఇందలి కొన్ని యర్థములిటీవలి వారు కల్పించినవైనను మొత్తము మీద ఋగ్వేదరుద్రుడు కొందఱు తలచినట్లు కేవలము ప్రాకృత దేవతగా భావింపబడినవాడు' గాడనియు అతడే ఋగ్వేదమందలి విశేషణములను బట్టి తరువాత శైవమతమున కాలంబనమైనవాడుగా గనవచ్చుచుండెననియు విశ్వసింపవచ్చును అని వ్రాసినారు[1]

యజుర్వేదము నందు వివిధ ఋషులచే కీర్తింపబడిన రుద్ర దేవతాపరమైన మంత్రములు కలవు. ఇందు మూడవ అధ్యాయమున ఏడు మంత్రములు (57-63), పదునొకండవ అధ్యాయమున రెండు మంత్రములు (54,55), పదునైదవ అధ్యాయము నందు ఒక మంత్రము (11) పదునాఱవ అధ్యాయమున నున్న మొత్తము అరువది యారు మంత్రములు, ఇరువది యెనిమిదవ అధ్యాయమునందు ఒక మంత్రము (4) మొత్తము డెబ్బది ఏడు మంత్రములు ప్రత్యేకముగ రుద్రుని స్తుతించినవి. ఇవిగాక ఇంద్రాది యితర దేవతలతో గలిపి కీర్తించినవి కూడా యజుర్వేదమున కనిపించుచున్నవి[2].

యజుర్వేదము నందలి తైత్తిరీయ సంహితలోని చతుర్థకాండమునగల పంచమ ప్రపాఠకము రుద్రాధ్యాయము లేదా రుద్ర ప్రశ్నమని పిలువబడుచున్నది. ఇందు పదునొకండనువాకములు కలవు. ఇందు వర్ణింపబడిన రుద్రుని ఘోర రూప శరీరము, శివరూపశరీరము, శరీరావయవములు ధనుశ్శరాది సాధనములు దుష్ట శిక్షణము, శిష్ట రక్షణము మొదలైనవి సగుణోపాసకులగు శైవుల యభీష్ట సిద్ధికాలవాలమై యుండెను. ఇందలి శివరూప వర్ణనములే తరువాత పురాణములలోని శివకథలుగాను శైవ పురాణములుగాను వెలసినవనుట సత్యము. మఱియు నిందు వర్ణింపబడిన శివుని విశ్వరూపత్వము విశ్వ వ్యాపకత్వము విశ్వ కారణత్వము మొదలయినవి యేకేశ్వరత్వ విజ్ఞానమును గ్రమముగా జీవేశ్వరైక్య జ్ఞానమును గలిగించునవియై యద్వైత భావమున కాలవాలమగుచున్నవి[3].

## శైవము వైదికము

శైవమత పరిణామము, వైదిక మత పరిణామమునకు బ్రత్యక్ష ప్రమాణముగ నున్నది. వైదిక మంత్రోపస్థితుడైన రుద్రుడు వేదాంతమునందు శివరూప పరిణామమును

---

1. సంస్కృత వాఙ్మయ చరిత్ర. వైదిక వాఙ్మయము. ప్రథమ సంపుటము. పుట 136
2. యజుర్వేదము. దయానంద సరస్వతి కృతభాష్యము. తెనుగుసేత : అన్నే కేశవార్య శాస్త్రి.
3. సంస్కృత వాఙ్మయ చరిత్ర. ప్రథమ సంపుటము. పుట 228

బొందుచు శివోఽహం అను తత్త్వమును సువ్యక్తము చేయుచున్నాడు[1]. అను వాక్యము, వివేక చింతామణి కర్తయగు పరమానంద తీర్థ ద్వితీయ ఖండమును ప్రారంభించుచు 'ఇట్లఖిల వేదాది శాస్త్రార్థంబు ప్రథమ ఖండంబున నుపన్యసించి ద్వితీయఖండంబున తదనుకూలంబగు శైవసిద్ధాంతంబు వివరించెద[2]'నను నిత్యాది వాక్యములు శైవము వైదికమని తెలుపుచున్నవి.

## శైవభేదములు :

శ్రీ వీరశైవ సిద్ధాంత శిరోమణి వీరాగమము నుండి

'వామాః పాశుపతాశ్చైవ కాలాముఖ మహావ్రతాః

కాపాలా భైరవా శాక్తాస్స్వకాయోగధారణాః' అను శ్లోకమునుట్టంకించి సామాన్యముగ శైవులనబడు వారిలో కొన్ని భేదములు గలవు. ఆ భేదములు పాశుపతము, కాలాముఖము, కాపాలికము మొదలగు పేర్లు గలవి యని పేర్కొన్నది.[3]

శైవము వామ, దక్షిణ, మిశ్ర, సిద్ధాంతంబులనుచు నాలుగు విధంబులై యుండును. అందు శక్తిపరంబైనది వామంబనంబడు. భైరవ పరంబైనది దక్షిణంబనంబడు. సప్తమాతృపరంబైనది మిశ్రమనంబడు. పరశివపరంబైనది సిద్ధాంతమనంబడును. అని వివరించి మఱియు నా శైవంబులందు ముఖ్యంబులగు మాన్యశైవ, మిశ్రశైవ, శుద్ధశైవ, వీరశైవంబులనుచు చతుర్విధంబులని పరమానంద తీర్థ శైవమును నాల్గు శాఖలుగా విభజించినాడు[4].

వాతూలాగమమునందు ఆచార భేదము వలన శైవము నాలుగు విధములుగ విభజింపబడినదని శ్రీ వీరశైవ సిద్ధాంత శిరోమణి పేర్కొన్నది.

'శైవంచతుర్విధం జ్ఞేయం సమాసాచ్ఛృణు షణ్ముఖ

సామాన్యంమిశ్రకంచైవ శుద్ధం వీరం యథాక్రమమ్'

సామాన్య, మిశ్ర, శుద్ధ, వీర యని శైవము నాలుగు విధములు.[5]

## సామాన్య శైవము

తత్రాదౌసంప్రవక్ష్యామి శైవసామాన్యలక్షణం

శివలింగంయదా పశ్యేత్తదాకుర్యాత్సమర్చనం ॥

ప్రదక్షిణంవా ప్రణతిం దర్శనం వాత్రకారయేత్

భస్మధారణమాత్రేణ శుద్ధో భవతి సర్వదా

---

1. బసవ పురాణము. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారి ప్రస్తావన. పుట. 2
2. వివేక చింతామణి. గద్యకావ్యము. ద్వితీయ ఖండము. పుట 54
3. శ్రీ వీరశైవ సిద్ధాంత శిరోమణి. పుట. 40
4. వివేక చింతామణి. ద్వితీయ ఖండము. పుట 60
5. శ్రీ వీరశైవ సిద్ధాంత శిరోమణి. పుట 41

శివతీర్థే తదాలాపే ప్రీతిమాంచ్చివ భక్తకె
ఏతేషాం నియతిర్నాస్తి యధాలబ్ధం సమాచరేత్॥

అను లక్షణమును వాతూలాగమము నుండి యొసగి దాని యర్థము నిట్లు వివరించినది.

సామాన్య శైవుడు లింగమునెప్పుడు దర్శించునో అప్పుడే పూజించును. అనగా లింగము లభించునప్పుడే ప్రదక్షిణము, నమస్కారము, దర్శనము గావించును. నియమము ప్రకారము పూజించుట, లింగమును ధరించుట అతనినేమముగాదని తెలియవలయును. భస్మధారణ మాతనికి ప్రాముఖ్యము. ఎల్లప్పుడు భస్మము ధరియించి తత్ప్రభావముననే శుద్ధుడగును. అనగా ఇతడు శివకీర్తన శివవచన భక్తులయందు ప్రీతిగలవాడైయున్నను శివార్చన యందు మాత్రము నియమము లేని వాడని అర్థము[1]. శ్రీ పరమానంద తీర్థ సామాన్య శైవ లక్షణమునిట్లు చెప్పియున్నాడు. 'శ్రీ విభూతిధారణ మంత్రంబు వలన శుద్ధాత్ముండై స్వయంభులింగంబునైనను దేవదానవ ఋషిమానవాది ప్రతిష్ఠితంబును నైనను గని నమస్కార ప్రదక్షిణ పూజాదికంబులను యధాశక్తి సేయుచును, శివభక్తజన వాత్సల్యంబును, శివపూజారతియును, శివార్చనంబును, శివార్థంబగు వ్యాపారంబును, శివకధా శ్రవణంబును, శివధ్యానంబును, శివానుకూలతయు పరమ సాత్వికంబులని యెడు అష్ట విధ భక్తియుక్తుండై యుండునతండు సామాన్య శైవుండనంబడు[2].

## మిశ్ర శైవము

శ్రీ వీరశైవ సిద్ధాంత శిరోమణి వాతూలాగమము నుండి మిశ్ర శైవలక్షణము నిట్లుట్టంకించి వివరించినది.

"సామాన్యం లక్షణంప్రోక్తం వక్ష్యేమిశ్రస్యలక్షణం
శైవంచ వైష్ణవం శాక్తం కౌమారం గణపత్యకం ॥
సౌరంచాఖిల దైవత్యం పూజనంచ సమాచరేత్
ఏతేషూక్తేషు సర్వేశు తన్మంత్రేషు మిశ్రణాత్ ॥
సమభక్తింసమాయుజ్య సర్వాన్‌లింగేషు భావయేత్
మిశ్రశైవ మితిప్రోక్తం శుద్ధశైవ మధశృణు"[3] ॥

శివ విష్ణు శక్తి కుమార గణపతి సూర్య ఇత్యాద్యఖిల దేవతల పూజించువాడే మిశ్రశైవుడు. ఇట్టి మిశ్రశైవుడు శివుడు సర్వోత్తముడని తెలిసియుండి శివధర్మములను అన్యధర్మములను సహా ఆచరించును. సమస్త దేవతలందును సమభక్తి గలిగిన వాడైనందున సమస్త దేవతలు శివలింగమునందు గలరని భావించి లింగమును పూజించు చుండును. కనుక అతడు మిశ్రశైవుడనబడును[4]. మిశ్రశైవమును శ్రీ పరమానందతీర్థ

1, 3. శ్రీ వీరశైవ సిద్ధాంత శిరోమణి. పుట. 41
2. వివేక చింతామణి. ద్వితీయ ఖండము. పుట 60
4. శ్రీ వీరశైవ సిద్ధాంత శిరోమణి. పుట. 42

ఇట్లు నిర్వచించినాడు. 'పీఠస్థ శివలింగ పూజతోగూడ విష్ణు, అంబిక, షణ్ముఖ, విఘ్నేశ్వర, సూర్యులనియెడి నీ పంచపూజల వలనను తక్కిన బ్రహ్మేంద్రాది దేవతారాధనలను నాయా మంత్రంబులచే జేయుచును, శివుండు సర్వాత్మకుండనియెడి బుద్ధి వలనను, విష్ణ్వాది దేవతలెల్లను శివభక్తులనియెడి భావన వలనను, సమాన భక్తియుక్తుండగు నతండు మిశ్రశైవుండనంబడు[1].'

## శుద్ధ శైవము

శ్రీ వీరశైవ సిద్ధాంత శిరోమణి వాతూలాగమము నుండి ఈ క్రింది శ్లోకము నుట్టంకించి శుద్ధ శైవ లక్షణమునిట్లు నుడివినది.

"శుద్ధత్వం శివముద్దిష్టాచ్ఛివ జాతాత్తు శైవకం
శుద్ధశైవ సమాయోగాచ్ఛుద్ధ శైవమితిస్మృతం॥

శివుని ఒక్కనినే దేవుడుగా భావించి మిగిలిన దేవతలను అతని భక్తులు, అతనితో జన్మించిన వారలని తెలిసి శివునినే పూజింతురు గనుక శుద్ధ శైవులనబడుదురు. వారి మతమే శుద్ధశైవ మనబడును. ఇక వీరాగమమందు

"మంత్రయంత్ర క్రియాముద్రాన్యాసావాహనకాదిభిః
ఉపచారైర్బహువిధైర్లింగం సింహాసనేయజేత్"

మంత్ర యంత్ర క్రియలు జేయుట, ముద్రలున్యాసములు జేయుట, అవాహనము జేయుట, బహువిధోపచారములతో శివలింగమును సింహాసనమునందు పూజించుట, ఇట్టి యాచారములు గలవాడు శుద్ధ శైవుడు. ఇతడు లింగమును కరస్థలమునందు పూజించడు. ఇదియేగాక శుద్ధ శైవుడైన శివద్విజుడు స్వార్థము కొరకు సాలగ్రామ లింగమును పూజించును. పరార్థము కొరకు గ్రామ్య లింగముల పూజించును.

"శివావరణ దేవాంశ్చ సర్వాన్సంపూజయేద్గుహ
పృథక్స్థాన స్థితాన్సర్వాన్నాఽర్చయే దన్యదేవతాః"

ఓ షణ్ముఖా! ఈ శుద్ధశైవుడయిన శివద్విజుడు శివసంబంధమైన దేవతలను అనగా దుర్గ, పార్వతి, గణపతి, కుమార, వీరభద్ర ఇత్యాదులను పూజించును. కాని అన్యస్థానములందు వేరుగాగల శివేతర దేవతలను పూజించడు. అనగ శివ, శివ దారాపుత్రాదులను విడచి ఇతర దేవతలను పూజించని వాడే శుద్ధ శైవుడని యర్థము.

"మంత్రలింగ శ్శరీరం స్యాత్స ఏవపరమశ్శివః
శుద్ధశైవ మిదంప్రోక్తం వీరశైవమథశృణు"

గురుదత్త లింగమును బాహ్యపీఠమునందుగాని కరపీఠము నందుగాని పూజించుచు, గురూపదిష్ట వ్రతముల నాచరించుచు, లింగ లోపమునందు ప్రాయశ్చిత్తముల పొంది మరియొక లింగమును పొందుచు, వ్రతాదులు లోపములైన మూలపంచాక్షర జపము చేత

---

1. వివేక చింతామణి. ద్వితీయ ఖండము. పుట 60

ప్రాయశ్చిత్తమును పొంది శుద్ధుడగును. కనుక అతడు మంత్రలింగ శరీరుడనబడును. అతడు సాక్షాత్తు పరమ శివునకు సమానుడనవచ్చును[1]

పరమానంద తీర్థగారు శుద్ధశైవుని లక్షణము నిట్లు వివరించినారు. శుద్ధశైవుండు, వేదాగమ, పురాణేతిహాస, సూత్రభాష్యాది సకల శాస్త్ర సంపన్నుండై స్థూల సూక్ష్మ కారణంబులనియెడు శివ లక్షణంబులను, శుద్ధ మిశ్ర సంకీర్ణంబులనియెడు శివస్వరూపంబులును, శివాకర్షణాది సకల దేవతా కర్షణంబులును, లింగ ప్రతిష్ఠ మొదలగు సమస్త దేవతా ప్రతిష్ఠలును, లింగస్థాపనాది సర్వదేవతా స్థాపనంబులును, నిత్యోత్సవ, మాసోత్సవ, రథోత్సవాది క్రియలును, పుష్ప, గంధ, మధు, ఇక్షు, నారికేళ, క్షీర, రజనీచూర్ణ, సర్పి, తైల, జల, పనంబులనియెడు శివుని యేకాదశ విధోత్పాదనంబున లెస్సై విచారంబు సేయుచు, మఱియు సూర్యుని వలన ఆరోగ్యాదులును ఇంద్రుని వలన సౌభాగ్యాదులును, వాయివు వలన బలాదులును, దుర్గ వలన విజయాదులును, అగ్ని వలన నైశ్వర్యాదులును, యముని వలన పితృయాగాదులును, సరస్వతి వలన వాక్సిద్ధ్యాదులును, లక్ష్మి వలన సంపదాదులును, షణ్ముఖుని వలన నిష్ట సిద్ధ్యాదులును, చంద్రుని వలన కీర్తి చిత్త శుద్ధ్యాదులును, బ్రహ్మ వలన బ్రాహ్మణ్య శాంత్యాది సద్గుణంబులును, విష్ణువు వలన దేవయాన ముముక్షుత్వాదులును, విఘ్నేశ్వరుని వలన కార్యసిద్ధి గురుభక్త్యాదులును, గురువు వలన శ్రవణాది జ్ఞాన సాధనంబులును, పార్వతి వలన సంపదయు, శివుని వలన భోగజ్ఞాన మోక్షాదులెల్ల సకామ నిష్కామ క్రియా భేదంబుల వలన సిద్ధింపు చుండునని పరామర్శసేయుచు నుండును[2].

## వీరశైవము :

**వీరశైవ నిర్వచనము :** శ్రీ వీరశైవ సిద్ధాంత శిరోమణి సిద్ధాంత శిఖామణి నుండి ఈ క్రింది నిర్వచనములిచ్చి వివరించినది.

'విశబ్దేనోచ్యతే విద్యా శివజీవైక్య బోధికా
తస్యాంరమంతే యేశైవా వీరశైవాస్తుతేమతాః' ॥
శివజీవైక్యమును బోధించునంతటి విద్యయందు రమించునంతటి వారలే వీరశైవులు.

2. "వేదాంత జన్యం యద్జ్ఞానం విద్యేతి పరికీర్తితా
విద్యాయాం రమతేయః సవీర ఇత్యభిధీయతే "

వేదాంత జన్యమైనట్టి ఏ విద్యగలదో అట్టి విద్యయందు ఆనందమును పొందువారే వీరశైవులు.

3. 'విద్యాయాం శివరూపాయాం రమంతే యే విశేషతః
తస్మాదేతే మహాభాగా వీరశైవా ఇతిస్మృతాః' ॥
శివస్వరూపమైన ఏ జ్ఞానము కలదో అట్టి జ్ఞానసంపన్నులే వీరశైవులు.

---

1. శ్రీ వీరశైవ సిద్ధాంత శిరోమణి. పుటలు. 42, 43
2. వివేక చింతామణి. ద్వితీయ ఖండము. పుట 61

మఱియు వీరాగమమందు

'విశబ్దోవా వికల్పార్థో రశబ్దో రహితార్థకః

వికల్పరహితం శైవం వీరశైవం ప్రచక్షతే' ॥

సంకల్ప వికల్పములు లేని శైవమే వీరశైవమనబడును1.

**వీరశైవ లక్షణము :** శ్రీ వీరశైవ సిద్ధాంత శిరోమణి వాతూలాగమము నుండి వీరశైవ లక్షణమును ఈ క్రింది విధముగా వివరించినది.

'ఏక ఏవాఽయమస్మిన్ హిసర్వేఽస్మిన్ జగతీతలే

విశేష ఈ రతే యస్మాద్వీర ఇత్యభిధీయతే ॥

శివేన సహసంబంధం శైవమిత్యుదితంబుధైః

ఉభయోస్సంపుటీ భావాద్వీరశైవ మితిస్మృతమ్ ॥

శివార్థార్పిత జీవత్వాద్వీర తంత్రసముద్భవాత్

వీరశైవ సమాయోగాద్వీరశైవ ఇతిస్మృతమ్' ॥

భూతలమునందంతటను శివుడొక్కడే యను వీరవ్రతము గలిగినందునను, శివునితో ఆత్మకు నికటసంబంధము గలిగించుకొని నందునను. జీవత్వమును శివునకర్పించి శివజీవైక్య యుక్తుడయినందునను, వీరతంత్రముల ననుసరించిన ఆచారము గలిగినందునను ఈ మతము వీరశైవమనబడినది. ఇదియే శైవమతములందు ఉత్కృష్టమైనది. ఎవడు శివదీక్షాపూర్వకమైన గురుదత్త లింగమును తల, మెడ, రెట్ట, పొట్ట, ఎద, చెయ్యి వీటియందు ఏదో యొక స్థానమునందు ధరించి, త్రికాలముల యందు హస్త పీఠమునందు పూజించుచు' శివపాదోదక శివప్రసాదములను సేవించుచు, లింగలోప, వ్రతలోపములందు ప్రాణత్యాగమె ప్రాయశ్చిత్తముగానెంచి, శివైక్యుడగువాడె వీరశైవుడనబడును. అందువలననే ఈతని వ్రతము వీరవ్రతమనబడును.

"ప్రాణలింగ వ్రతేలుప్తే ప్రాయశ్చిత్తంనవిద్యతే

ప్రాణత్యాగాత్పరం తస్మాత్సావధానేన ధారయేత్ ॥

ప్రాణలింగేచ విచ్ఛిన్నే లింగేప్రాణాన్ పరిత్యజేత్

ప్రతిదీక్షాం ప్రాప్యతిష్ఠే ద్రౌరవం నరకంవ్రజేత్ ॥

వీరశైవులు "శివలింగం కరాద్యంగే వీరశైవస్తుధారయేత్" అను విధి చొప్పున లింగధారణము చేసికొందురు. వారు ధరించిన ఆ లింగమునకు ప్రాణలింగమనియు, ఇష్టలింగమనియు పేరు. అది లోపించెనేని ప్రాణత్యాగము జేతురు.

"ఇష్టలింగమిదం స్థూలం యద్బాహ్యేధార్యతే సదా

ప్రాణలింగంతు తత్సూక్ష్మం యదంతర్భావనామయమ్

బాహ్యాపీఠార్చనాదేతత్కర పీఠార్చనం పరమ్"

---

1. శ్రీ వీరశైవ సిద్ధాంత శిరోమణి. పుట. 45

సిద్ధాంత శిఖామణి యందు ప్రాణలింగమనగా నంతర్లింగమనియు, కరపీఠార్చనము ఉత్తమమనియు గలదు. కనుక లింగార్చకులందరు వీరశైవులుగారు. కరపీఠమందు ఇష్టలింగము నర్చించి తన శరీరముపై యెల్లప్పుడు ధరించుకొను లింగధారులే వీరశైవులని అవగతమగుచున్నది.

'యో హస్తపీఠే నిజలింగ మిష్టం విన్యస్యతల్లీన మనః ప్రచారః
బాహ్యక్రియా సఙ్కుల నిస్పృహాత్మా సమ్పూజయత్యఙ్గ సవీరశైవః"

ఎవడు తన వామ హస్తమునందు ఇష్టలింగమును ధరించి, తల్లింగమునందే తన మనస్సులయము జేసి, మరియు తత్పూజా కాలమున బాహ్యక్రియాదులందు మనః పరివర్తనములేక ఏకాగ్రచిత్తుడయి లింగ పూజ చేయుచున్నాడో అతడే వీరశైవుడని పీఠాగమము చెప్పుచున్నది. కనుక కరపీఠమునందు లింగమును పూజించువారే వీరశైవులని సిద్ధాంతమగుచున్నది.[1]

వివేక చింతామణి వీరశైవ లక్షణము నిట్లుగ్గడించినది. "పరమేశ్వర నిర్మింతంబగు జగత్తందు చరమశరీరి యనంబడి సమస్త శైవులలోపల విశిష్టుండై యితర శైవులయట్ల క్రియా బహుళంబుచే నల్ప ఫలంబులంబడయక, అల్పక్రియచే ననంత ఫలంబులంబొందు నతండగుచు స్నానభోజన నిద్రా జాగరణ మలమూత్ర విసర్జన కాలంబుల యందశుచి భావంబునం బొరయక, సదాలింగాంగ సంబంధియై లింగభోగోపభోగియై తన యిష్టలింగంబు నందు ఆవాహన విసర్జన క్రియలంజేయని యతండును, త్రికాల లింగార్చనా సక్తుండును, లింగ లోప వ్రతలోపంబులయందు ప్రాణత్యాగ పర్యంతంబేకాక వేరొక్క ప్రాయశ్చిత్తంబులేని యతండును, గురునింద, శివనింద, జంగమనింద, ప్రసాద పాదోదక భస్మధారణ నింద, శివాగమ, శివక్షేత్ర, శివాచార నిందల సైరింపని యతండును, విష్ణ్వాది దేవతల గణింపని యతండును, బాహ్యంబునందు శివలింగ లాంఛనంబులేని భవులగూడి ఏకాసన శయన యాన సంపర్కసహ భోజనాదులు లేని యతండును, అనృత, అస్థిర వాక్య, వంచన, పంక్తిభేద, ఉదాసీన, నిర్దయలనియెడు నారంతరంగంబులు గల యవసంస్కారంబులు లేని యతండును, శివమాహేశ్వరులగనునప్పుడే లేచి యెదుర చనుటయు వారలంగూడి తిరుగుటయు, వారి యెడల ప్రియవచనంబులు బల్కుటయు గద్దియవెట్టి అన్నపానాదులు సమర్పించుటయు నివి మొదలగు ముక్తి సోపాన సప్తక క్రమయుక్తుండునునై; జాతసూతక, జనసూతక, ప్రేతసూతక, ఉచ్ఛిష్టసూతక, రజస్సూతకంబులనియెడు పంచ సూతకంబులు లేని యతండునునై, లింగాచార, సదాచార, భృత్యాచార, శివాచార గణాచారంబులనియెడు పంచాచార నిష్ఠుండై; దాసత్వ, వీరదాసత్వ, భృత్యత్వ, వీరభృత్యత్వ, సమయాచారత్వ సకలావస్థత్వంబులనియెడు సజ్జనషడ్విధ సజ్జనత్వయుక్తుండై దేశకాల కల్పిత లౌకికాచారంబుల మీరి, స్వతంత్ర శీలుండై, శివాత్ములకు భేద భ్రాంతిలేని యతండును

1. శ్రీ వీరశైవ సిద్ధాంత శిరోమణి. పుట. 43, 44లు

నగుచు, నుపనిషద్వాక్య జనిత విద్యయందు రమించెడు శైవులంగూడి తత్సంజ్ఞగల యతండునునై జగత్పూజ్యుండగునతండు వీరశైవుండు"[1]

## వీరశైవ భేదములు

వీరశైవ సిద్ధాంత శిరోమణి వాతులాగమమునుండి ఈ క్రింది శ్లోకమునుట్టంకించి వీరశైవమును త్రివిధములుగా విభజించి, వానిని గూర్చి వివరించినది.

'వీరమాహేశ్వరం తంత్రం జ్ఞాతవ్యం త్రివిధం స్మృతం
సామాన్యంచ విశేషంచ నిరాభారం క్రమాద్భవేత్॥'

సామాన్యము, విశేషము, నిరాభారమునని వీరశైవము మూడు విధములు.

## సామాన్య వీరశైవ లక్షణము

'తత్రాదౌచ ప్రవక్ష్యామి వీరసామాన్య లక్షణం
హస్తమస్తక సంయోగా ద్భూతి పట్టస్య ధారణాత్ ॥
శివదేహీతి విజ్ఞేయస్సర్వపాపైః ప్రముచ్యతే
గురుణాదత్తలింగంతు సావధానేన ధారయేత్ ॥
మూర్ధ్నికంఠే భుజేహస్తే హృత్థ్సలే నాభిమండలే
ఏతేషా మేకదేశేతు ధారయేచ్ఛివలింగకం ॥
ఏకకాలం ద్వికాలం రాత్రికాలం వాసమర్చయేత్
గురౌలింగే సదాభక్తిం కుర్యాత్తద్భసితవ్రతీ ॥'

గురువు యొక్క హస్తమస్తక సంయోగమ్మైనందు వలన అనగా దీక్షా పూర్వక లింగాంగ సామరస్య జ్ఞానోపదేశుడైనందున విభూతి ధరించినందున, శివదేహియగును. సర్వపాపముల నుండి ముక్తుడగును. ఇట్టివాడు గురుదత్త లింగమును ఎల్లప్పుడు తలపైనను, కంఠమునందైనను, భుజహస్తములందైనను, వక్ష స్థలమునందైనను, ధరించుకొనును. ఒకసారియైనను, రెండుసారులైనను లేక మూడుసారులైనను లింగార్చనము జేయుచు గురు లింగజంగమాదుల యందు భక్తియుంచువాడే సామాన్య వీరశైవుడనబడును. అనగా సామాన్య వీరశైవునకు భస్మలింగధారణాదులు ముఖ్యధర్మములు[2]

## విశేష వీరశైవ లక్షణము

"శేషాణి సర్వకర్మాణి దీక్షావిద్యుక్తమాచరేత్
దేహే ప్రాణంసమాయోజ్య ప్రాణంలింగేప్రకల్పయేత్ ॥

గురువు విధియుక్తముగా దీక్షగావించి మలత్రయములు నశించుటకు దేహత్రయములందు లింగత్రయ ధారణము చేయును. శిష్యుడు అట్టి ప్రాణలింగమును తన ప్రాణముతో సమానము జూచుకొనును. శుద్ధ ద్రవ్యములచే లింగ పూజ సలుపును. ఇతడే విశేష వీరశైవుడని వాతులాగమమందు చెప్పబడినది[3].

---

1 వివేక చింతామణి. ద్వితీయ ఖండము. పుటలు 89, 90
2. శ్రీ వీరశైవ సిద్ధాంత శిరోమణి. పుట. 46
3 శ్రీ వీరశైవ సిద్ధాంత శిరోమణి. పుటలు 47, 48

'శుద్ధద్రవ్యం సమాదాయ లింగానాంచ సమర్పణం
విశేష వీరశైవ విశిష్యతే॥'

ఈ విశేష వీరశైవులు దీక్షా సంపన్నులై [illegible] శివజీవైక్య బోధయే షట్ స్థల శాస్త్రము కనుక వీరికి జ్ఞాన సంపాదనము మరియు లింగార్చక కర్మ యనునవి రెండును ప్రాముఖ్య ధర్మములు[1]

**నిరాబార వీరశైవ లక్షణము :**

"విశేష వీరమాఖ్యాతం నిరాబారం తతశ్శృణు ।
సర్వసంసార సౌఖ్యాని త్యక్త్వాచిత్తం శివాలయేత్ ॥
దండకౌపీన కాషాయ జటావల్కల ధారకః
ముండీవా శివచిహ్నాని ధారయేదజినాదికం ॥
భిక్షాశీ నియతాహార స్సుఖసంసార వర్జితః
నిరాబారీతి విజ్ఞేయస్స ఏవపరమశ్శివః ॥

సకల సంసార సౌఖ్యముల విడచి, తన చిత్తమును శివుని యందు లయింపజేయువాడు, దండ, కౌపీన, కాషాయ, జటా, వల్కల, అజినాదుల ధరించినవాడు, భిక్షావృత్తిచే జీవించువాడు, మితాహారము గలవాడు, అకస్మాత్ లింగ లోపము గలిగిన ప్రాణమును విడుచువాడు, ఇట్టి గుణములు గలవాడే నిరాబార వీరశైవుడని తెలియబడును. అతడే సాక్షాత్ పరమేశ్వరుడు. అనగా సంసారమును లెక్కింపక శివునియందు లయించినవాడే నిరాబారుడని అవగతమగుచున్నది. ఇదియే వీరశైవునికి అంత్యసోపానము[2]

వివిధ శైవ సంప్రదాయములను గూర్చి తెలిసికొనిన తదుపరి మనము పరిశీలించవలసినది చొక్కనాథ చరిత్రమునందు ప్రతిపాదింపబడిన శైవ సంప్రదాయమేది? యనునది. దీనికి ముందు ఈ కావ్యమునందలి శైవ సంప్రదాయమును గూర్చి కొందఱు పరిశోధకులు వెలువరించిన యభిప్రాయముల నిట నుట్టంకింతును.

(1) చొక్కనాథ చరిత్ర పీఠికాకారుడు "కృతిపతులు మాధ్వమతానుయాయులైనను, గవి నిటలాక్షపద భక్తినియతిబెంపొందు భటవంశజుడగుటయు, నితి వృత్త రమ్యతయు దీనిని వస్తువుగగైకొనుటకు హేతువులని తోచుచున్నది. ద్విపదయు శైవ గంధము గలది. కాని బసవ పురాణ కథల యందలి వీరవ్రతముగాని, ఊష్మలత గాని యిందలి కథలలో గానరాదు. భక్తజనముల ముంగిటి వేల్పు గిడ్డియగు శ్రీ సుందరేశ్వరుని నిర్వ్యాజ కృపాపరతంత్ర భావమే యిందలి ప్రతి కథయందును వెల్లి విరియుచున్నది[3]" అని వ్రాసినారు.

---

1. శ్రీ వీరశైవ సిద్ధాంత శిరోమణి. పుటలు 47, 48
2. శ్రీ వీరశైవ సిద్ధాంత శిరోమణి. పుట. 48, 49లు
3. చొక్కనాథ చరిత్ర, పీఠిక పుట 5

(2) "పరమశివుడు మీనాక్షీ దేవిని వరించి పాండ్యరాజు మలయ ధ్వజునకు ఇల్లటపుటల్లుడై మధురా ప్రజలను పునీతులను జేసిన పుణ్యకధనం ఇందు వర్ణింపబడి వుంది. శైవ సంప్రదాయము దృష్ట్యా దీని ప్రాశస్త్యం మాట అలా వుంచి కావ్యంగా ప్రసాదగుణ మహితమైన రసవాహిని[1]" సరిగా ఇదే అభిప్రాయమును డా॥ టి. సుశీలగారు వెలిబుచ్చినారు[2]. భారతి పత్రికలో కర్తపేరు లేకపోవుట గమనార్హము.

(3) ఇది శైవకావ్యమే యైనను వీరశైవ కవులకు సామాన్యమగు ఆవేశము ఇందు గన్పట్టదు" అని రత్నాకరం శంకర నారాయణ రాజుగారు అభిప్రాయపడినారు[3]

పై యభిప్రాయములను గమనించినచో చొక్కనాధ చరిత్రము శైవకావ్యమే యైనను వీరశైవ కావ్యము మాత్రము గాదని స్పష్టమగుచున్నది. కాని ఇది ఏ శైవ శాఖా సంప్రదాయమునకు చెందినదో తెలియుట లేదు. ఇందలి అఱువది రెండవ లీలలో మూర్తిసెట్టిని పరమ శివుడాతని వీరవ్రతమునకు మెచ్చి వీరశైవ! అని సంబోధించినట్లున్నది[4]. కాని ఈ లీల చొక్కనాధ చరిత్రమునకు మూలమైన హాలాస్య మాహాత్మ్యమున లేకపోవుట గమనించదగినది. కావున చొక్కనాధ చరిత్రమునందలి శైవమత సిద్ధాంతము నరయవలెనన్న తెలుగు దేశము నందు విస్తరిల్లిన శైవ సంప్రదాయములను కూడ పరిశీలింపవలసి యున్నది.

## తెలుగుదేశమునందు విస్తరిల్లిన శైవ సంప్రదాయములు

**పాశుపతము :** శైవ సంప్రదాయములన్నిటిలోను పాశుపత శైవ సంప్రదాయము చాల ప్రాచీనమైనది. కలియుగములో పాశుపత శైవమును వ్యాపింప జేసినవాడు లకులీశ శివాచార్యుడు. ఇతడు చారిత్రక పురుషుడనియు క్రీ.శ. మొదటి శతాబ్దిలో నుండెనని చరిత్రకారులందురు. ఒకవేళ ఇతడు దీని వ్యాప్తికి కారణభూతుడయిన కావచ్చునేమో కాని ఇతనికి పూర్వము నుండి పాశుపత శైవ సంప్రదాయముండినట్లు ఆధారములు కలవు[5]. లకులీశ శివాచార్యులు లాటదేశములో నర్మదానదీ తీరమున నున్న కారోహణమను గ్రామములో జన్మించెనని చెప్పుదురు. కారోహణమున కిప్పుడు కార్వారు అని పేరు. ఇది లకులీశ పాశుపత శైవులకు ప్రధాన పీఠము. లకులీశ శివాచార్యునికి కుశిక, గార్గ్య, కారుష, మైత్రేయులని నల్గురు శిష్యులుండిరి. వీరు నలుగురు నాల్గు శైవ మఠములను స్థాపించి నాల్గు శైవ శాఖలకు (సంప్రదాయములకు) కర్తలైరి. కారోహణము, అమర్దకము, తెరంబి, కదంబగుహ అనునవి పాశుపత శైవుల ఆదిమ పీఠములు, మఠములు వింధ్యకు దక్షిణమున నున్న హిందూ దేశమునకు పాశుపత శైవమును వ్యాపింపజేసిన వారు ఈ

---

1. భారతి. మార్చి 1955. గ్రంధ విమర్శనములో -
2. ఆంధ్ర ద్విపద సాహిత్య చరిత్ర. పుట 150
3. విజ్ఞాన సర్వస్వము. రెండవ సంపుటము. పుట 269
4. చొక్కనాధ చరిత్ర. పుట 342
5. విజ్ఞాన సర్వస్వము. సంపుటము 3. పుట 553

నాలుగు పీఠములకు మఠములకు చెందిన వారే అని చెప్పుటకు ఆధారములున్నవి. పాశుపత శైవ సంప్రదాయమును అవలంబించిన వారికి మాహేశ్వరులని పేర్లు[1]

తెలుగు దేశములో పాశుపత శైవ సంప్రదాయము ఎప్పటి నుండి వ్యాప్తిలోనికి వచ్చినదో సరిగా చారిత్రకముగా నిర్ణయించి చెప్పుట కష్టము. ఇందుకు తగిన ఆధారములు లేవు. క్రీ.శ. ఏడవ శతాబ్దము నాటికి పాశుపత, కాలముఖ, కాపాలిక, శైవ సంప్రదాయములు తెలుగు దేశములో వ్యాపించెననుటకు ఆధారములు గలవు. కాకతీయుల కాలమున నీ పాశుపత శైవము ప్రబలముగా నున్నది[2]

పాశుపత శివాచార్యులు గుంటూరు జిల్లా మందడము, కర్నూలు జిల్లా త్రిపురాంతకము, కడప జిల్లా పుష్పగిరి మొదలైన చోట్ల మఠములు స్థాపించిరి. వీరి మఠములకు గోళకీ మఠములని, వాటి యధిపతులకు గోళకీమఠ శివాచార్యులని పేరు. పాశుపత శివాచార్యుల పేరులు శివ, పండిత, ముని పదములతో అంతమగును[3].

**పాశుపత శైవ లక్షణము :** సమస్త జీవరాశులు పశువులు, సంసారము బంధము, ఈశ్వరుడు పశుపతి, వర్ణ వ్యవస్థ అంగీకార్యమే. కాని బసవని భక్తి మార్గమును స్వీకార్యమే. దీనిని శక్తి విశిష్టాద్వైతమని కూడా అందురు. శ్రీపతి పండితుడు తన శ్రీకర భాష్యములో 'తాంత్రిక శూలడమరుక శంఖ చక్రాంక నిషేధ పూర్వక భస్మరుద్రాక్ష ధారణ పూర్వక నిగమాగమోభయ వేదాంత ప్రాతిపదిత భక్తి క్రియాజ్ఞాన కాండ త్రయ విహిత స్థూల సూక్ష్మ చిదచిత్ప్ర పంచ ప్రకాశ షట్స్థల పరశివ సాక్షాత్కార కారణ శరీరత్రయ గీత మలధ్వంసక కారుణ్య కల్యాణ కైవల్య విభూతిత్రయ ప్రదాయక అష్టావరణ పంచాచార సద్గురు కరుణా కటాక్ష లబ్ధశక్తి పాతాద్యవచ్ఛిన్న పరశివేష్ట లింగధారణాత్మక పాశుపతి దీక్షా'' అని ఈ శాఖను నిర్వచించాడు[4].

**కాపాలికులు :** ఒక్క పాశుపతమే కాక శైవములో కాలముఖ, కాపాలిక, తాంత్రికాది సంప్రదాయములును ఉన్నవి. ఇవి కూడా చాళుక్యుల కాలములో తెలుగు దేశములో వ్యాపించెను. క్రీ.శ. ఏడవ శతాబ్దములో నుండిన పల్లవ రాజు మహేంద్ర వర్మ తన మత్త విలాస ప్రహసనములో కాపాలిక, కాలముఖ, పాశుపతులను పేర్కొన్నాడు. చీనా బౌద్ధ యాత్రికుడు యువాన్ చువాంగ్ తలచుట్టును మెడలోను ఎముకల దండలను ధరించి బిలములలోను శైల వివరములలోను సమాధులలోను నిత్య నివాసము చేయు యక్షుల వంటి వారిని వర్ణించి చెప్పిన వారు కాపాలిక శైవులనుటలో సందియము లేదు. నెల్లూరు జిల్లా భైరవ కోనలోని ఆలయములు దుర్గా భైరవులవి. భైరవుని ఆలయము వల్లనే ఈ కొండ కోనకు భైరవుని కోన అను పేరు వచ్చినట్లున్నది. కాపాలికులు భైరవ పూజా

---

1. విజ్ఞాన సర్వస్వము. మూడవ సంపుటము. పుట 554
2, 3. విజ్ఞాన సర్వస్వము. మూడవ సంపుటము. పుట 555
4. కళ్యాణ విజయము. పుట 98

పరాయణులగుట చేత ఈ భైరవుని కోన పురా తన కాలములో కాపాలిక స్థానముగా నుండియుండవచ్చును[1].

**కాలముఖులు :** కాలముఖ సంప్రదాయపు శివాచార్యులకు మహావ్రతులని పేరు. వీరు శంఖధ్వని విరాజితులు. వీరు కూడా పాశుపతుల వలెనే చాలా పూర్వము నుండి యున్నప్పటికి చాళుక్య శాసనములలో ఈ సంప్రదాయముకు చెందిన శివాచార్యుల ప్రస్తావము రెండవ అమ్మరాజు విజయాదిత్యుని నాటి నుండి (క్రీ.శ. 945 నుండి క్రీ.శ. 970) కనబడుచున్నది[2].

కాలముఖ శివాచార్యుల పేర్లు ముని, రాశి, పండిత పదములతో అంతమగును. తెలుగు దేశమున కాలముఖ శివాచార్యుల సంఖ్య తక్కువ. వారి పీఠములు కూడా తక్కువే.[3]

కాలముఖ శైవ సంప్రదాయము తెలుగు దేశములో కంటె కుంతల దేశములో ఎక్కువగా వ్యాపించినది. దీనిని పూర్వ చాళుక్యుల కంటె ఎక్కువగా ఆదరించిన వారు కుంతలేశ్వరులైన పశ్చిమ చాళుక్యులు[4]

**కాలముఖ లక్షణము :** శివుడు పరమ దైవము. వర్ణ వ్యవస్థ అంగీకార్యమే. సర్వదైవములు శివాంగ సంభవులు. శక్త్యారాధన కూడా వుంది. ఈ శాక్తేయము అహింసాత్మకము. జ్ఞానము దీనికి ప్రధానము[5]

**రసశైవము :** వీరికే రసేశ్వరులని వ్యవహారము. నవనాథ సిద్ధోపజ్ఞమైన రసశైవము కూడ తెలుగు దేశములో వ్యాపించెననుటకు ఆధారములు కలవు. ఈ శైవ సంప్రదాయము తెలుగు దేశమందలి ఆయుర్వేద వైద్యమునకు ప్రోత్సాహమిచ్చినది.[6]

ఇవికాక తెలుగు దేశమునందు వ్యాపించిన శైవ సంప్రదాయములు మరి రెండు కలవు. అందు ఒకటి ద్రావిడ శైవము. రెండవది ఆరాధ్య శైవము. వీనిని గూర్చి ముందు వ్రాసి అనంతరము బసవని వీరశైవమును గూర్చి వ్రాయుదును.

**ద్రావిడ శైవము :** తెలుగు దేశములో కాలముఖ, పాశుపత శైవ సంప్రదాయములు వ్యాపించిన కాలములో ద్రవిడ దేశములో శివభక్తులనేకులుదయించి భక్తి ప్రధానమైన శైవమతమును వ్యాపింప జేసిరి. వీరికి తమిళ భాషలో నయనారులని పేరు. తెలుగులో వీరికి నాయనారులని నైనారులని వ్యవహారము. వీరిలో తిరుజ్ఞాన సంబంధర్, అప్పర్ స్వామిగళ్, సుందర మూర్తి నయనారు, మాణిక్కవాశగర్ అనువారు ముఖ్యులు. వీరికి శైవ సమయాచార్యులని పేరు. వీరిలో మొదటి ముగ్గురును చేసిన శివస్తవ సంచయమునకు తేవార మని పేరు. తిరుజ్ఞాన సంబంధర్, అప్పర్ స్వామిగళ్, తిరుత్తొండర్, (చిరుతొండడు)

---

1. విజ్ఞాన సర్వస్వము. మూడవ సంపుటము. పుట 556
2, 3, 4. విజ్ఞాన సర్వస్వము. మూడవ సంపుటము. పుట 556
5. కళ్యాణ విజయము పుట 98
6. విజ్ఞాన సర్వస్వము. మూడవ సంపుటము. పుట 559

ఈ ముప్వురును సమకాలికులు. సుందర మూర్తి నాయనారుకు నంబినాయనారని, ఒడయ నంబియని, అప్పరుకు తిరునావుకరశు అని నామాంతరములు. ఈ శైవ సమయాచార్యులు ద్రవిడ దేశములో అవైదికములయిన బౌద్ధ, జైన, ధర్మములను నిరసించి శైవ మత సిద్ధాంతమును వ్యాపింపజేసిరి. ఈ శైవ సమయాచార్యుల ప్రచారమువల్లను, ఇతర శైవ భక్తుల బోధల వల్లను ద్రవిడ దేశములో బౌద్ధ జైన మతములు జనాదరణమును గోల్పోయి క్రమముగా క్షీణించినవి. శివభక్తులు అసంఖ్యాకులైరి. మహిమలు చూపిన శివ భక్తుల కథలు ఎన్నో వాడుకలోనికి వచ్చినవి. క్రీస్తు శకము పదునొకండవ, పండ్రెండవ శతాబ్దుల నాటికి అపూర్వ మహత్తును చూపిన ద్రావిడ దేశీయ మహా శివభక్తులు అరువది ముగ్గురకు సంబంధించిన కథలు ఎక్కువగా ప్రచారములో నికి వచ్చినవి. తమిళ భాషలో ఈ శివ భక్తులు అరువది ముగ్గురకు అరుపత్తు మూవరని, నాయనారులని పేరు. వీరికి సంబంధించిన కథలన్నిటిని శేక్కిలారను తమిళకవి పెరియ పురాణమను గ్రంథమున పొందుపఱచెను. ఈ యరువత్తు మూవురు శివభక్తుల చరిత్రములు ఆంధ్ర దేశమును పరిపాలించిన పూర్వ చాళుక్యులును ద్రవిడ దేశమునేలిన చోళరాజులును ఒకరితో ఒకరు వివాహ సంబంధములు కలుపుకొన్ననాటి నుండి ఆంధ్ర,ద్రావిడ దేశములకు రాకపోకలెక్కువయ్యె బాగుగా ఆంధ్ర దేశములో తెలియ వచ్చినవి. రాజ రాజ నరేంద్రుని తండ్రియైన విమలాదిత్యుని నాటి (క్రీ.శ. 1011-1018) నుండి ద్రవిడ శివభక్తుల కథలు తెలుగు దేశములో వ్యాపించి జన సామాన్యములో శివభక్తినుద్దీపింపజేసి భక్తి ప్రధానమైన శైవము తెలుగు దేశములో ఎక్కువగా వ్యాపించుటకు తోడ్పడినవి మరియు ప్రజాహృదయమున అపూర్వోత్సాహమును రేకెత్తించి భక్తిప్రధానమైన శైవము మీద జన సామాన్యమునకు గాఢ విశ్వాసమును అభిమానమును కలిగించి భక్తి ఉద్యమమునకు గట్టి పునాదులు వేసినవి. సగుణోపాసనము హెచ్చినది. శివారాధనము ప్రబలినది. శైవము భక్తి సంప్రదాయముగ వ్యాపించుటతో శివలీలలు పాడుట, అభినయించుట, శివకథలు ఆడుట వాడుకలోనికి వచ్చి నాట్య సంగీత కళలు వృద్ధి చెందినవి.[1]

**ఆరాధ్య శైవము :** శైవము భక్తి ప్రధానమైన సంప్రదాయమైనప్పటి నుండి దేశములో ఎంతో గొప్పమార్పు వచ్చినది. అగ్రవర్ణులైన బ్రాహ్మణులకు యజ్ఞయాగాదుల వలెనే మిగిలిన వర్ణముల వారికి భక్తి మార్గము దొరకి ఆధ్యాత్మికముగా పురోగమించుటకు వారికి అవకాశము కలిగినది. క్రీస్తు శకము పదవ శతాబ్దము నుండి పదునాలుగవ శతాబ్దము వరకు భక్తి ప్రధానమైన శైవ సంప్రదాయము ఉచ్చదశలో నుండెను. ఈకాలములోనే బ్రాహ్మణులలో శ్రీపతి పండిత మల్లిఖార్జున పండిత, మంచన పండితులను ముప్వురు శివాచార్యులుదయించి బ్రాహ్మణేతరోపజ్ఞమైన ద్రావిడాగమ శైవభక్తి సంప్రదాయమును వేద విహితమైన ఆగమ సంప్రదాయముగ మార్చి శివుడే పరమ దైవమని శైవులు

---

1. విజ్ఞాన సర్వస్వము. మూడవ సంపుటము. పుటలు 556, 557

కానివారు భవులని వాదించి శివపారమ్యమును బోధించి శివధర్మమును ప్రచారముకావించిరి. వారి బోధలకు చూపిన మహిమలకు ఫలితముగా బ్రాహ్మణులు కొందరు శివార్చనా నిరతులైరి. వారికే ఇపుడు ఆరాధ్యులనిపేరు. వీరు క్రతు కర్మల కధిక ప్రాధాన్య మీయకున్నను వైదికాచారనిరతులు. యజ్ఞోపవీతమును పరిత్యజింపరు. కాళహస్తి అనాటి ప్రసిద్ధ శైవ స్థలము [1].

**బసవన వీర శైవము :** పండ్రెండవ శతాబ్దము ఉత్తరార్ధమున కన్నడ దేశములో కళచురిబిజ్జలుని ప్రధాని బసవన వ్యాపింప జేసిన వీరశైవ సంప్రదాయము తెలుగు దేశపు పడమటి, నైర్రుతి, దక్షిణదిశలలో కొంతమేర కర్ణాటాంధ్ర సీమావధుల వ్యాపించినప్పటికిని దేశము నడిబొడ్డులో మాత్రమిది అసంఖ్యాకాంధ్ర జన ధర్మము కాలేదు. [2]

బసవడు వీర శైవమతోద్ధారకుడే కాని వీరశైవ మత సంస్థాపకుడు కాడు గావునను, వీరశైవ సంప్రదాయమును గూర్చి, వాని భేదములను గూర్చి ముందే వివరించియుంటిని గానను, బసవ పురాణ పీఠికలలోను, ప్రత్యేకముగను పలువురు పండితులు బసవనచే వ్యాప్తి గావించబడిన వీరశైవమును గూర్చి విపులముగా వ్రాసి యుండిరి గనుకను, అన్నిటికి మించి చొక్కనాథ చరిత్రమున ప్రతిపాదింపబడిన శైవము వీరశైవము కాదని పండితులు, విమర్శకులు అందరును ముక్త కంఠముతో అంగీకరించుట చేతను దీనిని గూర్చి (దడవుట లేదు.

ఇంతవరకు వివరించిన వివిధ శైవ సంప్రదాయములను వాని లక్షణములను ఒకవైపు చొక్కనాథ చరిత్రము నందలి యఱువది నాలుగు లీలలలో గల శివభక్తి తత్పరతను మరొకవైపు దృష్టి యందుంచుకొని వానిననుసంధించి చూడగా ఈ కావ్యమునందలి లీలలన్నియును ఒకే ఒక భక్తి సిద్ధాంతమునకు కట్టుబడియున్నవని చెప్పుటకు వీలు లేదు. అట్లని ఒక్కొక్క లీలలో ఒక్కొక్క భక్తి సిద్ధాంతమున్నదని కూడ అర్థముకాదు. అసలీకావ్యమున భక్తి సిద్ధాంతమున కన్న భక్తి తత్పరతకే ప్రాధాన్యమధికము. అయినను ఇందు శైవభక్తి సంప్రదాయములు లేకపోలేదు.

సప్తమాశ్వాసము వరకు గల లీలలలో కేవల శివభక్తి తత్పరతయే కలదు. ఈ లీలలలో పేర్కొనబడిన శివభక్తులు శివలింగమును ధరించుట, అర్చించుట మొదలుగా గల మతాచారములు విధిగా పాటించిన వారు కారు. తమకు ఆపదవచ్చినప్పుడు చొక్కనాథుని దర్శించుట, పూజించుట, ప్రార్థించుట. ఇత్యాది కృత్యములు నెఱపుట వలన సామాన్యశైవము గలదని చెప్పుటకు వీలు కలదు. మొదటి లీలలో ఇంద్రుడు కదంబకాంతారమున శివలింగమును గాంచినంతనే పూజాదికములను నిర్వర్తించినాడు. ఇది సామాన్య శైవలక్షణము. చతుర్థాశ్వాసములోని ఇరువది రెండవ లీలలో వైష్ణవులింటి కోడలిగా వచ్చిన శివబ్రాహ్మణి విభూతి ధరించుట సామాన్య శైవులు విభూతి ధారణకు ప్రాముఖ్యమిత్తురను సామాన్య శైవ లక్షణమునకు తార్కాణము.

---

1, 2. విజ్ఞాన సర్వస్వము. మూడవ సంపుటము. పుట 558

చొక్కనాథ చరిత్రమునందు కేవల శివార్చనమే కాక జంగమార్చన లేదా మాహేశ్వరార్చనలు కూడ కలవు. షష్ఠాశ్వాసములోని ముప్పదియేడవ లీలలో హలదేవుడను భక్తుడు ఒడయలకు ప్రతినిత్యము అన్నదానము చేయువాడని వర్ణించుటను బట్టి ఇందు మాహేశ్వరార్చనకలదని తెలియుచున్నది. పాశుపతశైవ గురువులకు మాహేశ్వరులని పేరు. కావున ఈ లీలలో పాశుపతశైవ ఛాయలున్నవేమోనని యనిపించును. కాని కేవల మాహేశ్వరార్చన తప్ప పాశుపతశివతత్త్వమేమియును ఇందు లేదు. మాహేశ్వరులను పదము మహేశ్వర భక్తులను నర్థమున నుపయుక్తమైనదే గాని పాశుపత మత గురువులను నర్థమున కాదు. కావున ఈ లీల పాశుపతశైవ సంప్రదాయమునకు చెందినది కాదు. సప్తమాశ్వాసము వరకు గల లీలలలో నెచ్చటను గురువులు, దీక్షలు, బోధలు ఇత్యాది తతంగములేవియును లేవు. చొక్కనాథ చరిత్రమందలి అష్టమాశ్వాసములోని ఏబదియారవ లీలలో తిరువాదయూరునకు చొక్కనాథుడు గురురూపమున వచ్చి శివయోగమును బోధించి, దీక్ష యొసగి, మాణిక్య వాచకుడని నామకరణ మొనర్చుట కలదు. ఈ మాణిక్య వాచకుడు తమిళ దేశమునందు భక్తిప్రధానమైన శైవ సంప్రదాయమును ప్రచారము గావించిన "మాణిక్క వాశగర్" అను ద్రావిడ శైవ సమయాచార్యుడు. కావున ఈ లీలను ద్రావిడ శైవ సంప్రదాయమునకు చెందినదానిగా పేర్కొనవచ్చును.

చొక్కనాథ చరిత్రమునందలి నవమాశ్వాసములోని అరువది యవలీలలో పేర్కొనబడిన జ్ఞాన సంబంధుడు తమిళ దేశములో భక్తి ప్రధానమైన శైవ సంప్రదాయమును విస్తరింపజేసిన తిరుజ్ఞాన సంబంధర్ అనునాయనారు. ఇతడే అరువది యొక్కటవ లీలలో శైవ మత మహాత్మ్యమును జూపి జైనులను, బౌద్ధను ఓడించి శైవమును స్వీకరించని వారిని కొఱ్ఱులెక్కించిన శైవ సమయాచార్యుడు. ఇతని సహచరుడు తిరునావుకరశరను పేరుగల మరొక ద్రావిడ శైవ సమయాచార్యుడు. వీరు అవైదికములయిన బౌద్ధ జైన ధర్మములను నిరసించి శైవమును వ్యాపింప జేసిన వృత్తాంతము, నెఱపిన మాహాత్మ్యములు చొక్కనాథ చరిత్రమున వర్ణితములు గాన ఈ లీలలలో ద్రావిడ శైవము కలదని చెప్పవచ్చును.

నవమాశ్వాసములోని అఱువది రెండవ లీలలో [1] మూర్తి సెట్టి యను శివభక్తుడు కరసానతో శివార్చనకు గంధము దీసిన వీరవ్రతమును, అఱువదినాలుగవ లీలలో వైశ్య వనిత తన భర్తను బ్రతికించక పోయినచో గుండ్లతో తలఁగొట్టుకొని చచ్చుదానని నిర్ణయించుకొనిన సందర్భమునను, వీరశైవ ఛాయలు గోచరించుచున్నవి. మఱియు గ్రంథాంతమున బసవపురాణములో పేర్కొనబడిన వీరమాహేశ్వరులను దలచుట, చొక్కనాథ చరిత్రముపై పాల్కురికి వీరశైవ ప్రభావమును స్ఫురింపజేయును. ఇవి తప్ప మొత్తముపై ఈ కావ్యమంతయు శివభక్తి ప్రధానముగా గల శైవ కావ్యమే కాని ఏదో ఒక శైవ సంప్రదాయమునకు చెందిన కావ్యముగాదని చెప్పుట సత్యదూరము కాదు.

---

1. అఱువది రెండవ లీల మూలమున లేకపోవుట గమనింపదగిన విషయము.

# అష్టమాధ్యాయము – సమకాలీన సాంఘిక పరిస్థితులు

సాహిత్యము సమాజమునకు ప్రతిబింబము. కవి సంఘజీవి. కావున ఏ కవియైనను తాను జీవించిన కాలమున నుండిన సామాజిక పరిస్థితుల ప్రభావమునకు లోబడి యుండును. అనగా సమాజము యొక్క ప్రభావము అతనిపై నుండునని యర్థము. కొన్ని సార్లు ఉండకపోవచ్చును. సమాజ ప్రభావమునకు లోబడకుండా సమాజమునే శాసించి తమవైపు నడిపింపగల సమర్థులైన కవులును ఉండవచ్చును. కాని ఇట్టివారు అరుదుగా నుందురు. సాధారణముగా సంఘ ప్రభావమునకు లోబడినవారే ఎక్కువగా నుందురు. పచ్చ కప్పురపు తిరువేంగళకవి ఈ కోవకు చెందినవాడు. వాల్మీకి వ్యాసాదుల వలె లోకమును ప్రభావితము చేయగలుగు నంతటి స్రష్టకాడు. కావున ఆనాటి సమజమున గల రకరకములైన స్థితిగతులు ఈయన రచన యగు చొక్కనాథ చరిత్రలో చోటు చేసికొనినవి.

సాధారణముగా సమకాలీన సాంఘిక పరిస్థితులు ఒక స్వతంత్ర కావ్యమున ప్రతిబింబించి నంతగా అనువాద కావ్యమున ప్రతిబింబించవు. అట్లని పూర్తిగా ఆనాటి స్థితిగతులందుండవనియు కాదు. మూలము ననువదించుచునే కవి కొంత స్వతంత్రత వహించి ఆయా సందర్భములందు తాను జీవించిన కాలమునాటి, ప్రత్యక్షముగనో, పరోక్షముగనో తన అనుభవమునకు వచ్చినట్టి, సాంఘిక పరిస్థితులను తన కావ్యమున ప్రతిఫలింపఁజేయును. తిరువేంగళకవి తాను జీవించిన పదునాఱవ శతాబ్దినాటి సామాజిక స్థితి గతులనెంతవరకు తన కావ్యమున రూపొందించినాడో ఈ అధ్యాయములో నిరూపించుటకు ప్రయత్నింతును.

పదునారవ శతాబ్దమున మనదేశములో రాచరిక వ్యవస్థ నెలకొనియుండుట వలనను తాను రాజాశ్రితుడైనందునను చొక్కనాథ చరిత్రలో తిరువేంగళ కవి రాజులు – వారి వివాహసంరంభములు, సంస్కారములు, విద్యలు, పట్టాభిషేకములు, దిగ్విజయ యాత్రలు, తీర్థయాత్రలు, కొలువుకూటములు, వేటలు, నగరములు, అరణ్యములు, దుర్గములు, ఆరామములు, ఇత్యాదులను గూర్చి వర్ణించి యున్నాడు. ఇవి కాక బ్రాహ్మణుల అధ్యయనాధ్యాపన పద్ధతి, గాజుల సెట్టి, సిద్ధుల వేషములను కూడ ఈ కవి వర్ణించినాడు. ఆనాటి వ్యవస్థలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణముల వారే కాక ఇతర వృత్తుల వారును కూడ కలరు. కవులు, గాయకులు, కట్టెలమ్ముకొనువారు, పిట్టమ్ముకొని జీవించువారు, సానులు, సాదనయగార్లు (సాము, గరిడీలు నేర్పువారు) సాముద్రిక శాస్త్ర వేత్తలు, శైవ, వైష్ణవ, జైన, బౌద్ధ మతావలంబులు – వారి మధ్య సంఘర్షణలు – ఇందు

చిత్రింపబడినవి. పాండ్య, చోళ రాజుల మధ్య వియ్యములు - కయ్యములు, కఱువు కాటకములు ఇత్యాదులిందు వర్ణింపబడినవి. కావున అనువాద కావ్యమే యైనను చొక్కనాథ చరిత్ర సమకాలీన సమాజమును ప్రతిబింబించిన కావ్యమని చెప్పుటలో సందియము లేదు. ముందుగా ఆనాటి రాజుల వివాహ సంరంభములెట్లుండెడివో చూతము.

## వివాహ సంరంభములు:-

తటాతక తన పెండ్లి సందర్భమున పురము శృంగారింపుమని మంత్రుల నాజ్ఞాపించగా వారు బంగారు టరటి కంబములు, మకర తోరణములు, పీతాంబరధ్వజములు, కనక మంటపములు కనకవేదికలు, కనక కుట్టిమములు, కనక ద్వారములు, కనక మంచకములు, నమర్చి పురమును శృంగారించిరి. కస్తూరి, కర్పూరము, కాశ్మీరగంధము, మొదలైన పరిమళ ద్రవ్యములు, చిత్ర భూషణములు, శోభన ద్రవ్యములు సమకూర్చిరి. మృదుల రాజాన్నములు, మేలోగిరములు, సద్యోఘృతములు, పాయ సాపూపసూపములు, భక్ష్య భోజ్యాహారములు సిద్ధముగా నుంచిరి. అనంతరము తటాతక రాజ సంఘములకు కర్పూర, తాంబూల, గంధాక్షతలను పంపించి వివాహమున కాహ్వానించెను. ఆరాజులు దివ్య వస్త్రములు, భూషణములు, వస్తువులను కానుకలుగా గొనివచ్చిరి. అట్లు వచ్చిన వారందరికి విడుదుల నేర్పాటు చేసిరి. పురోహితులు పుణ్యాహకర్మముల దీర్చిరి. సైరంధ్రులు తటాతకను పెండ్లికూతురుగా నలంకరించిరి. పాదములకు పసిడి నూపురము లిడిరి. వెలిపట్టు చీర గట్టిరి. నవరత్న కింకిణీ నవమూర్తికములు రవణిల్లు పసిడి యొడ్డాణము నిడిరి. జిలుగు పయ్యెదనమర్చిరి. చేతులకు మాణిక్య కంకణముల బెట్టిరి. కంఠమున హారముల నమర్చిరి. నాసాగ్రమున నవ మౌక్తికమును; కర్ణముల తాటంకములను, నుదుట తిలకమును, ముత్యాల పాపటను ధరింపజేసిరి. కొప్పున పూలను ముడిచిరి. పంచమహావాద్యములు మ్రోయుచుండ మంగళాక్షతలు, గంధమాల్యములు, విడెములు, అంగనా మణులకు నిప్పించి కళ్యాణవేదిపై బంగారు పీఠమున గూర్చుండజేయగా బ్రాహ్మణోత్తము లామెచేతికి కంకణమును గట్టిరి.[1]

వివాహ సందర్భములందు నగరు శృంగారించుట, పరిమళశోభనాది వలసిన వస్తువులను సమకూర్చుట, ఆహ్వానములంపుట, కానుకలు దెచ్చుట, విడుదులేర్పాటు చేయుట, పెండ్లికుమార్తె నలంకరించుట, మంగళ వాద్యముల మధ్య పురోహితులు వధువుకు కళ్యాణకంకణమును గట్టుట - ఇవి యన్నియు నానాటి వివాహ సంరంభములు - ఆనాడే కాదు నేడు కూడ ఇవి ఆచారములే.

చొక్కనాథుడు శిరమున మాణిక్యమకుటమును, ఫాలమున విరిబాసికమును, గళమున ముక్తాహారములను, కర్ణముల వజ్రఖచిత కుండలములను ధరించి చిలుకల పైడాలు, చిలుక పచ్చలను, పొలుపుమించిన బాహుపురులను కీలించి, దివ్య గంధములు

1. చొక్కనాథ చరిత్ర. పుటలు 59, 60, 61

మేనబూసికొని, దివ్యమాల్యములు ముడిచికొని, తన పరివారము కైవారములు సేయ, భృంగి నృత్యము సలుప, మహావృషభధ్వజ ఘటిత రథమెక్కి, అచ్చరలు వింజామరములు వీవ, పటహ, భేరీ, శంఖ ధ్వనులు బ్రహ్మాండము నిండ, కరదీపికా కోట్లు వెలుగ, పుణ్యాంగనలు సేసలు చల్ల, యక్ష సారంగలోచనలు మంగళ గీతములు పాడుచుండ రాజమార్గమున నేగుదెంచెను.

అట్లు వచ్చుచున్న పెండ్లికొడుకును ఆడపెండ్లివారు ఘనముగా నెదుర్కొని తోడితేఱ నేతెంచి, రథమునొయ్యన దిగి, ఇంద్రుని కైదండ పట్టుకొని అల్లనల్లనలోని కేగుచుండగా సేసలు చల్లిరి, చిఱునవ్వులు చిందించుచు చొక్కనాథుడు కళ్యాణవేదిపై నింపొందు బంగారు పీఠమున గూర్చుండి సతులు శోభనములు పాడ, మునులు వేద మంత్రములు చదువ, నొక శుభముహూర్తమున తటాతక పాణిగ్రహణము గావించెను.[1] అనంతరము తటాతక పెండ్లికి వచ్చిన చుట్టములకు విందు వెట్టించి, కర్పూర వీడ్యము లిచ్చి, సువర్ణ వస్త్రభూషణములిచ్చి వీడ్కోల్పినది.

ఇందు వర్ణించినట్లు పెండ్లికుమారుడు తరలివచ్చుట, ఎదురుకోలు, సేసలు చల్లుట, శోభనములు పాడుట - ఇవి యన్నియును ఆనాటి వివాహ సంరంభములే. ఈనాటికిని ఇవి నిలిచియున్నవి.

ఉగ్రపాండ్యుని వివాహ సంరంభమును వర్ణించుచు తిరువేంగళకవి మంగళ సూత్ర ధారణమును కూడ తెలిపియున్నాడు.[2] ఈ ఆచారము నేడు కూడా కలదు.

## సంస్కారములు:-

వివాహితులైన తటాతక సుందరేశ్వరులు సుఖముగా నుండ కొంతకాలమునకు తటాతక గర్భము ధరించినది. సుందరేశ్వరుడామెకు పుంసవన సీమంతములు జరిపించినాడు. నవమాసములు నిండిన పిదప తటాతకకు ఒక కుమారుడు ఉద్భవించినాడు. దాదులీ వార్తను సుందరేశ్వరునకు చెప్పిరి. ఆనందముతో అతడు వారి కాభరణాంబరాదు లిప్పించి, భూసురుల రప్పించి, షోడశమహాదానములు చేసినాడు. పదాఱు రోజులు గడచిన పిదప జాతసూతకములు దీర్చి, బంధువులను, పురోహితులను, మంత్రులను పిలిపించి గంధాక్షతవీడ్యము లిచ్చి ఉగ్రుడని నామకరణమొనర్పజేసినాడు. తదుపరి కొన్నాళ్లకు చౌలోపనయనములు దీర్చి, అక్షరాభ్యాసముచేయించి, విద్యావంతుడై, యుక్తవయస్కుడైన తన కుమారునకు పట్టాభిషేక మొనర్చినాడు.[3]

ఇందలి పుంసవన సీమంతములు జరుపుట, జాతసూతకములు దీర్చుట, నామకరణమొనర్చుట, చౌలోపనయనమొనర్చుట, అక్షరాభ్యాసముచేయించుట - అనునవి

---

1. చొక్కనాథ చరిత్ర. పుటలు 61, 62, 63
2. చొక్కనాథ చరిత్ర. పుట 82
3. చొక్కనాథ చరిత్ర. పదునొకండవ లీల. పుటలు 74, 75

షోడశ సంస్కారములలోని కొన్ని సంస్కారములు. ఈ ఆచారములు తిరువేంగళకవి కాలమున ఆచరణలో నున్నట్లు తెలియుచున్నది.

## విద్యావిధానము:–

చొక్కనాథ చరిత్రమునందలి ద్వితీయాశ్వాసములోని ఐదవ లీలలో మలయకేతన పాండ్యుడు తన కుమార్తెయగుతటాతకకు.........

'అప్పుడు వేడ్కతో నక్షరాభ్యాస
మొప్పుగా జేయింప, నొజ్జల యొద్ద
ప్రణవ పంచాక్షరీపఠనంబు నేర్చి
ప్రణుతింప వేదముల్ బాగొప్పఁ జదివి
భాట్యమీమాంసా ప్రభావమ్ములెఱిగి
నాట్య శాస్త్రములెల్లనయమొప్పఁ జూచి
గణిత జ్యోతి శ్శాస్త్ర కావ్యముల్ గణచి
కణగి పౌరాణిక గ్రంధముల్ దెలిసి
శేష భాష్యమ్మును చెవికింపుజేసి

చౌషష్టి విద్యల జాడ లెఱింగి'[1] నదని వర్ణించియుండుటను బట్టి ఆ కాలమున గురువులు బాలబాలికలకు అక్షరాభ్యాసమొనర్చునపుడు 'ప్రణవపంచాక్షరి' యనగా 'ఓం నమశ్శివాయ' తో ప్రారంభించెడివారని, వేదములు, భాట్యమీమాంస, నాట్య శాస్త్రములు, గణిత జ్యోతిశ్శాస్త్ర కావ్యములు, పురాణములు, శేష భాష్యము, చౌషష్టి విద్యలు నేర్పెడి వారని విశదమగుచున్నది. మఱియు నానాడు మానసిక వికాసమును కలిగించు విద్యలే కాక శారీరకముగా దృఢత్వమును కలిగించు గజ, రధ, అశ్వారూఢ విద్యలను, కార్ముక విద్యను కూడ నేర్పెడి వారని తెలియుచున్నది.[2]

తృతీయాశ్వాసములోని పదునొకండవ లీలలో ఉగ్రుడు గురువుల వద్ద నాల్గువేదములు, వేదాంగములాఱు, అఱు శాస్త్రములు, భరత మృదంగాది విద్యలు, కావ్య నాటకాలంకారములు, ఆగమ శాస్త్రము లంద సంఖ్యాది యోగవాదముల సంయోగములు, సంగీత సాహిత్య విద్యలు నేర్చెనని, మరియు శారీరక విద్యలు వానితోపాటు భాషలు – లిపులు కూడ బాగుగా నెఱిగి, చౌషష్టి విద్యలయందు చతురుడై వెలసెనని వర్ణించియుండుటను బట్టి తిరువేంగళకవి కాలము నాటి రాజుల విద్యా విధానమెట్లుండెడిదో మన మూహించుటకు వీలగుచున్నది.[3]

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 49
2. చొక్కనాథ చరిత్ర. పుట 49
3. చొక్కనాథ చరిత్ర. పుట 77

**పట్టాభిషేకములు:-**

గురువుల యొద్ద విద్యాభ్యాసమును ముగించుకొని తిరిగి వచ్చిన యుక్తవయస్కులైన రాజకుమారులకు గాని, కుమారులు లేకపోయినచో యవతులైన రాజకుమార్తెలకు గాని పట్టాభిషేకములు జరిపించెడివారు. సుందరపాండ్యుడు తన కుమారుడైన ఉగ్రునకు (11వలీల), మలయధ్వజ పాండ్యుడు తన కుమార్తె యైన తటాతకకు పట్టాభిషేకమొనర్చుట పై విషయమును ధృవపఱచుచున్నది. ఐదవ లీలలో మలయధ్వజుడు తనకు వార్ధక్యము సమీపించగనే తన కూతురైన తటాతకకు పట్ట ముగట్ట నుద్యుక్తుడై మంత్రులతో గూడి, రత్నములు పొదుగబడిన కిరీటము నామె శిరమున నుంచి, తగు మంత్రులను, తగువారిని జూపి, నీతులన్నియు గఱపి, స్వామి, అమాత్య, సుహృత్, కోశ, రాష్ట్ర, దుర్గ, బలములనెడి సప్తాంగము లలవడజేసి, బాహ్యాంతరియోగముల గొల్పబంచి వనములకేగెనని[1] వ్రాసియుండుట వలన నాటి రాజ్య పట్టాభిషేకముల గూర్చి తెలియుటయే గాక ఆనాడు ఆశ్రమ వ్యవస్థ కూడ పాటించి యున్నారని అవగతమగుచున్నది.

మఱియు నానాడు రాజులకు పట్టమహిషియే కాక ఇచ్ఛా వతులు కూడా ఉండెడివారని, వారికొడుకులు పట్టమహిషి కుమారునకు పట్టముగట్టుట గిట్టక కిరీటములను దొంగిలించెడివారని పదునేడవలీలలో వర్ణింపబడిన దేవ పాండ్యుని పట్టాభిషేక వృత్తాంతమ్ము[2] వలన తెలియవచ్చుచున్నది.

**దిగ్విజయ యాత్రలు:-**

ఆఱవలీలలో పట్టాభిషిక్తురాలైన తటాతక దిగ్విజయ యాత్రకై బయలు దేరుచు మంత్రులతోను చతురంగ బలములతోను గూడికొని ధ్వజాయత్తమైన నవరత్న కాంతుల కనక రథమెక్కి జయభేరి వేయించి, శంఖ మొత్తించి పయనమై వెడలెనని తిరువేంగళకవి వర్ణించినాడు.[3] ఇది ఆ కాలపు రాజుల దిగ్విజయయాత్రా సన్నాహము కావచ్చును.

దిగ్విజయ యాత్రకు వెడలిన తటాతక పూర్వ, పశ్చిమ, దక్షిణముల నున్న శత్రురాజులను సంహరించి

'అంగ వంగ కళింగ యవన సౌరాష్ట్ర
బంగాళ మళయాళ పాంచాల చోళ
కాళింగ నేపాళ కర్ణాట గౌళ
మాళవ మగదాంధ్ర మరహాట లాట
గాంధార కాంభోజ కాశ్మీర కుకురు
సింధు కుంతల శూర సేనాదులైన

1. చొక్కనాధ చరిత్ర. పుట 49
2. చొక్కనాధ చరిత్ర. పుటలు 107, 108
3. చొక్కనాధ చరిత్ర. పుట 51

ఛప్పన్న దేశ రాజన్యులచేత
కప్పముల్ దెప్పించి గర్వించినట్టి

శత్రుల మర్దించి శరణార్థినృపులు' తనను గొల్చి రాగా కైలాస గిరి చెంత (ఉత్తరదిశ) కరిగినది.[1]

ఇందు పేర్కొనబడిన దేశములు.ఇంచుక మార్పుతో ఈనాడును కలవు. అయితే ఇందు ఛప్పన్న అనగా ఏబదియారు దేశముల రాజన్యులను జయించినదని కవి వర్ణంచినాడు కాని ఏబదియారు దేశముల నిందు పేర్కొనలేదు. ఇరువది యైదింటిని పేర్కొనినాడు. దేశముల పేర్లెట్లున్నను ఆనాటి రాజులు దిగ్విజయయాత్ర చేయుచు పూర్వ, పశ్చిమ, ఉత్తర, దక్షిణ దిక్కులనున్న రాజులతో యుద్ధములు చేసెడివారని లొంగని వారిని సంహరించి, లొంగిన వారిచే కప్పములు గొని మరలి వచ్చెడి వారని విదితమగుచున్నది.

**తీర్థయాత్రలు:-**

దిగ్విజయ యాత్రముగించుకొని మరలివచ్చుచు తటాతక హిమవంత శైలమ్ము నొరసి, సాలగ్రామ పర్వతంబరసి, కేదార తీర్థము గ్రోలి, అగమోక్తము నరసి, కాశిని జూచి, జాహ్నవి నోలలాడి, అష్ట విఘ్నేశులను పూజించి, అష్టభైరవుల నర్చించి, విశ్వనాధుని సేవించి, పురుషోత్తముని పూజించి, రజతాద్రి నెక్కి, ఈశునకు మ్రొక్కి, వీరభద్రునకు నమస్కరించి, అమరేశ్వర స్వామినర్చించి, శ్రీగిరి యెక్కి, మల్లికార్జును గొలిచి, స్వామి మలనున్న గుహుని పూజించి, పెన్నానదిలో తీర్థమాడి, జ్యోతి సిద్ధేశు సంస్తుతించి, శ్రీ వేంకటేశు నిలయమైన శేషాద్రి యెక్కి, పాపవినాశినిదోగి, యాళ్వారి మునిగి, గోవింద రాజులసేవించి, దక్షిణ కైలాస శిఖరి తిరుకాళహస్తికే తెంచి, సొవర్ణముఖి తీర్థమాడి, శ్రీ కాళహస్తీశు గొలిచి, కాంచీపురవాసుని గాంచి దండమువెట్టి, కామాక్షిని భక్తితో పూజించి, అణ్ణామలేశుని, శోణాద్రివాసుని, ఉణ్ణామలేశుని, వృద్ధ గిరివాసుని అర్చించి, పుణ్ణాంబలాధ్యక్షు గొల్చి, వేదపురీశ్వరునకు మ్రొక్కి, త్యాగప్పనాత్మభావించి, మధ్యార్జునుని దర్శించి, కుంభకోణముకేగి కుంభేశ్వరాది శంభు లింగములను సేవించి, కరియ మల్లేశ్వరు గొల్చి, శ్రీ రంగనాధుని సేవించి, చిరుతు నాపల్లీశుడైన చెవ్వంది నాధుని దర్శించి, అళగరి పురికేగి హరిని పూజించి, తన నగరమైన మధురాపురికి వచ్చినది.[2]

తృతీయాశ్వాసములోని పదునైదవ లీలలో ఉగ్రపాండ్యుడు దిగ్విజయ యాత్ర ముగించుకొనిన యనంతరము తీర్థ యాత్ర సలుపుచు రామేశ్వరమును దర్శించినాడని వర్ణించినాడు.[3]

---

1. చొక్కనాధ చరిత్ర. పుట 51
2. చొక్కనాధ చరిత్ర. పుటలు 55, 56, 57
3. చొక్కనాధ చరిత్ర. పుట 95

తిరువేంగళ కవి పైని పేర్కొనిన పుణ్యక్షేత్రములన్నింటిని దర్శించక పోయినను కొన్నియైనను జూచి యుండును. కొన్నిటిని గూర్చి వినియుండును. ఏది ఎట్లున్నను ఈ వర్ణనల ద్వారా దిగ్విజయ యాత్ర గావించిన ఆనాటి రాజులు తాము చేసిన యుద్ధముల వలన జరిగిన జననాశము వలని పాపము బోగొట్టుకొనుటకో, లేక భగవదనుగ్రహము పొందవలయుననియో ఈ తీర్థ యాత్రలను చేసెడివారని ఊహింపవచ్చును.

**కొలువు కూటములు:—**

చొక్కనాథ చరిత్రమందలి అవతారికలో తిరువేంగళకవి - అమర భామల సాటి వచ్చు రమణులు కొందరు వింజామరములు వీచుచుండ, మరికొందరు కాంచనోజ్జ్వల కుంచ కాళంజులిడగా, భరతాది గీత ప్రబంధములు చెలగగా, వేత్ర హస్తులు సందడింప, కవి భట పాఠక గాయకులాది గాగల చౌషష్టి విద్యల వారు గొలుచుచుండగా చినరామ పార్థివుడు భూలోక దేవేంద్రుడనునట్లుగా కొలువు దీరియున్నాడని వర్ణించుట వలన నాటి రాజులు ఎంతటి వైభవోపేతముగా కొలువు దీరియుండెడివారో విశదమగుచున్నది.[1]

**వేటలు:—**

తిరువేంగళకవి చొక్కనాథ చరిత్ర లోని మొదటి లీలలో ఇంద్రుడు చతురంగ బలములతో గూడికొని పటహ, నిస్సాణ, సురదుందుభి, మృదంగ వాద్యములు మ్రోగుచుండగా వేటకు వెడలినాడని వర్ణించినాడు. ఇందు వేటకు వెడలినది ఇంద్రుడని పేర్కొన్నను ఇది ఆనాటి రాజుల వేట సన్నాహమునకు తార్కాణమని చెప్పవచ్చును.

ఆనాటి రాజులు వేటకు వెడలునపుడు,

'కోర మీసములు జేగురు బొట్లు మేను
చారలు నెఱ్ఱని చాయ చూపులును
కావి కోకలు నీలి కాసెలు వలలు

చేవ విండ్లును తుప్పు చెడని యంబులును'[2] గలిగిన కొందరు వేటకాండ్రు వారింట వనములకేతెంచెడివారని కూడ తిరువేంగళకవి వర్ణించినాడు.

**నగరములు — ఆరామములు:—**

మొదటి లీలలో ఇంద్రుడు కదంబ కాంతారమున విశ్వ కర్మచే నిర్మింపజేసిన మధురాపురమును వర్ణించుచు తిరువేంగళకవి ఆ పురములో బంగారు గోపురములు, ప్రాకారములు, మాణిక్య కంభములు, పగడపు కంభముల పద్మరాగములు, పచ్చల గవాక్షులు, మరకతోజ్జ్వల రత్న మంటపములు, హరి నీల కుట్టిమములు, వజ్ర సోపాన పంక్తులు, స్ఫటిక గేహములు, చతుర్గోపుర ద్వారములు, హేమ కవాటములు, వృషభకేతనములు, ముక్తాత పత్రములు, చారు చామీకరచామరములు, రత్నాంచిత

1. చొక్కనాథ చరిత్ర. అవతారిక. పుటలు 3, 4
2. చొక్కనాథ చరిత్ర. పుట 19

భూషణములు, స్త్రామాణి ధూపముల వాసనలు, కాంతా సహస్రసమర్పించు నిర్మల ఘన సార నీరాజనములు, అప్సరసల వంటి నాట్య కత్తెల నాట్యములు, భేరి, ఘంటిక, శంఖ కాహళ, దుందుభి, తూర్య, మృదంగ, పటహ, నిస్సాణ, వీణాది వాద్యముల రవములు కలవని వర్ణించినాడు.[1] ఇందు కొంత అతిశయోక్తి యున్నను ఆనాడు గల వస్తువులు, వాద్యములు కూడ ఇందుండి యుండును. చొక్కనాథుని నగరు కాక అంగయ కణ్ణమ్మకు ప్రత్యేకముగా గుడి, గోపురములు, ప్రాకారములు, మంటపములు, మణిమయ సౌధములు, ఉన్నత ధ్వజములు, నిర్మింపజేసినాడు. అందు వాపి, కూప, తటాక, వన సమూహములు, అగడిత, కోట విశ్వకర్మ నిర్మించినాడు.[2] విశ్వకర్మచే నిర్మింపచేసిన పై నగర వర్ణనలో తిరువేంగళకవి ఆనాటి కోటలను, అగడ్తలను, రాచనగరులను మనః ఫలకమున నిడుకొనియే వర్ణించి యుండును.

**ఆరామములు:-**

విశ్వకర్మచే నిర్మితమైన మధురాపురమునగల ఆరామములో

'కర్పూర కదళికా క్రముక పున్నాగ

మందార పనస నింబక చంపకౌఘ

చందన ఖర్జూర సాల రసాల

శింశుపామలక కౌశిక మాతులుంగ

కింశుక గుడపుష్ప కేతకాశోక

వానంతి దంతధావన తిలక నాగ

కేసర న్యగ్రోధ గిరి కర్ణ భద్ర

ధారుణి యజ్ఞాంక దాడిమ పిప్ప

లార కదంబ రుద్రాక్ష హింతాల

భల్లాత కేతకీ పాటలీ బిల్వ

మల్లికా రిష్ట మన్మధ జాతి నిచుల

శామంతి శాల్మలీ జంబు శంబీర

హైమావతీ తింత్రిణా మ్లాతకాది'[3] వృక్షలతాగుల్మ వితతతులు కలవని వర్ణించినాడు. మఱియు-

'కోక శారిక శుక కోకిల క్రౌంచ

కాక ఘూక చకోర కలరవ కేకి

కారండ మధుకర గంభీర కలక

లారావములు' కూడ వర్ణించినాడు[4] కాన తిరువేంగళకవి ఆనాటి రాచనగరులలో వీనిలో నన్నింటిని కాకపోయినను కొన్నింటినైనను ఆయన తిలకించియే యుండును

1. చొక్కనాథ చరిత్ర పుట 25
2, 3, 4. చొక్కనాథ చరిత్ర. పుట 26

ఇంకను ఆనాటి నగరములలో గజములు, అశ్వములు, ఉండెడివని, చతుర్వేద పారగులైన బ్రాహ్మణులు, శరణార్థి రక్షణ పారీణులైన క్ష్మాతలాధిపులు, కోటికి పడగెత్తికొను కోమట్లు, రణములో వెన్నీని భటులు, రాహుత్తులు, ధనవంతులైన దొరలు, బృహస్పతితో సరితూగు బుద్ధిమంతులైన మంత్రులు, సామంతులు, మహాకార్య దురంధరులు, పరమ పుణ్యాంగనలు, నిర్మాణ చతురులైన విశ్వకర్మలు మొదలగు వారుండెడి వారని, తిరువేంగళ కవిచే వర్ణితమైన విశ్వకర్మ నిర్మిత మధురాపుర వర్ణన వలన తెలియవచ్చుచున్నది.

## అరణ్యములు – దుర్గములు :–

తిరువేంగళకవి చొక్కనాథ చరిత్రతోని మొదటిలీలలో ఇంద్రుని వేట సందర్భమున గావించిన వన వర్ణన వలన ఆకాలమున పాండ్య దేశము నందు ఆకాశమంటి, దిక్కుల నావరించి, అనేక శాఖలతో నొప్పెడు అసంఖ్యాత వృక్ష లతా గుల్మములతో గూడి, కొలకులతోను, వాపికూపములతోను, స్థలదుర్గ, వనదుర్గ, జలదుర్గ, గిరిదుర్గములు గలిగి, మృగ పక్షి జంతు సమూహములతో నున్న వనములుండెడివని తెలియుచున్నది.[2]

ఇంత వరకు చొక్కనాథ చరిత్రలో ప్రతిబింబించబడిన రాజుల జీవితమును గూర్చి కొంత తెలిపితిని. దీనిని బట్టి తిరువేంగళకవికి రాజులతో సన్నిహిత సంబంధముండెడిదని ఊహింపవచ్చును. ఇక ఇతర విషయములను కొన్నిటి నిట వ్రాయుదును.

## బ్రాహ్మణులు – అధ్యయనాధ్యాపనములు:–

ఆనాటి బ్రాహ్మణులలో వేదములను పఠించువారు కొందరు, పఠించినను అర్థము తెలియని వారు కొందరు, అసలే పఠించనివారు కొందరు, అసూయ మతిని విప్రులకు పదేశించని వారు మఱికొందరునై యుండెడివారట[3] తృతీయాశ్వాసములోని పదునాఱవ లీలలో చొక్కనాథుడు ఆచార్య రూపమై వచ్చి బ్రాహ్మణులకు వేదార్థో పదేశము గావించిన వృత్తాంతమును తిరువేంగళకవి ఈ క్రింది విధముగా వర్ణించినాడు.

'శ్రీ చొక్కనాథు డంచిత కృపవారి
కాచార్య రూపమై యాశ్చర్యమెసఁగఁ
దలప ఋగ్యాజుసాథర్వణ వేద
ములు మూటికిని గ్రమంబులు నేర్పఱిచి
వరుస శిక్షా కల్ప వ్యాకరణమ్ము
లురు నిరుక్త ఛంద మొగి జ్యోతిషమ్ము
నంగమ్ము లాఱును నవగతమ్ముగను
సాంగమ్ముగాఁ జెప్పి సాధనమ్ముగను
పనసలష్టకములు పన్నముల్ జటలు

1. చొక్కనాథ చరిత్ర. పుట 27
2. చొక్కనాథ చరిత్ర. పుటలు 18, 19
3. చొక్కనాథ చరిత్ర. పుట 101

మునుకొని షట్సూత్రములును వర్ణములు
ఘన శాఖ లారణ్య కారకమ్ములును.
మఱియును నమక చమకములు రుములు
పరగఁ బురుష సూక్త పవమాన ములును
దయను దాత్తానుదాత్త స్వరిత ప్ర
చయములు నాల్గును స్వరముల యందు
విరచించి తగ సామ వేదమ్ము నకును
నరుదుగా మంద్ర మధ్యమ తారకముల
సామగానమ్ముల సప్త స్వరముల
నా మహాపురుషుల కర్థ యుక్తముగ
నొన రంగ నుపదేశ మొసగ వారెల్ల
దనుఁ జూడఁ జూడ నంతర్ధానమయ్యె[1] ఇది ఆనాటి వేదాధ్యయనాధ్యాపన పద్ధతి కావచ్చును.

## వివాహ సంబంధములు:—

బ్రాహ్మణులలో అనాడు శైవ వైష్ణవ భేదములుండెడివి. శివ బ్రాహ్మణులు వైష్ణవ బ్రాహ్మణులు పరస్పరము వివాహ సంబంధములు పాటించెడి వారు కారు.[2] పాటించినను అట్టి కుటుంబములలో ఆచార భేదమ్ముల వలన కలహములు జరుగుచుండెడివి.

## ఆదరానాదరములు:—

అకాలమున బ్రాహ్మణుల నాదరించి వారికి షోడశ మహాదానముల నొసగిన రాజుల్ను[3] అట్లే బ్రాహ్మణ దూషకులైన రాజుల్లు ఉండెడివారు. రాజులు తమను గౌరవించనిచో బ్రాహ్మణులారాజ్యమును విడచి పరదేశమునకు పోయెడివారు. ముప్పదియవ లీలలోని ఈ క్రింది పంక్తులు ఈ విషయమును ధృవపఱచుచున్నవి.

'అనృపాలకుడు బ్రాహ్మణ దూషియగుచు
దానమ్ము లీయకెంతయు నిందసేయ
నావిప్రులెల్ల సంధ్యలు జపహోమ
దేవతార్చాపితృదేవ తర్పణలు
నగ్ని హోత్రములు వేదా గమప్రోక్త
విజ్ఞాన యోగ హవిర్భాగములును
సర విని యజనాది షట్కర్మములును
వరుసలు దప్పి తద్వ్రతములు మాని

1. చొక్కనాథ చరిత్ర. పుటలు 103, 104
2. చొక్కనాథ చరిత్ర. 22వ లీల పుట 123
3. చొక్కనాథ చరిత్ర. 11వ లీల పుట 75

బ్రాహ్మణాచార సంపదలెల్ల విడిచి
బ్రాహ్మణుల రిగిరి పర భూములకును[1].

**ప్రాయశ్చిత్తములు:—**

పంచమాశ్వాసములోని ఇరువది యైదవ లీలలో మాతృద్రోహి, పితృహంత యైన ఒక విప్రుడు తన శరణు వేడగా చొక్కనాథుడు అతనికి ' కపిలధేనువులకు కసవులు దెచ్చిమేపుము, ప్రతి దినము మున్నూరు దేవాలయములకు అంగ ప్రదక్షిణలు వేయుము, భక్తితో వేయి నెనిమిది మార్లు గాయత్రి ని పఠింపుము, శ్రీ రుద్ర మెప్పుడు శుచి నిష్ఠతోడ జపింపుము, ఆపాద మస్తకము భస్మమునలదుకొనుము, మాహేశ్వరుల పాద తీర్థమును సేవింపుము. నిజము చెల్లింపుము. ప్రతి వాసరము హేమ పద్మాకరమున మిక్కిలి భక్తితో త్రి సంధ్యల తీర్థమాడి భిక్షాటనము వలన ఒకమారు గడుపుము. ప్రతిదినము నిట్లు గడిపినచో నీ పాపము వాయును' అని ప్రాయశ్చిత్తమును తెలిపెను.[2] తిరువేంగళకవి ఇట్టి ప్రాయశ్చిత్తములను చూచినాడో లేదో కాని చొక్కనాథ చరిత్రమునకు మూలమైన హాలాస్య మాహాత్మ్యమున కిది భిన్నము గావున ఇట్టి ప్రాయశ్చిత్తములు ఈ కవి జీవించిన కాలమున నుండి యుండవచ్చునని తలంతును.

**సిద్ధులు:—**

చొక్కనాథ చరిత్రమున పం దొమ్మిదవ లీలలో చొక్కనాథుడు సిద్ధరూపమును ధరించెనని వ్రాయుచు తిరువేంగళకవి సిద్ధుని వేషము నీ క్రింది విధముగ వర్ణించినాడు.

'కుఱుచ కెంజడలును గుచ్చిలి కంధ
మరు భూతియును రుండ మాలికల్ చెవులఁ
బసిఁడి కామాక్షులు బసిఁడి పాత్రలును
బసిఁడి గోణమ్మును బాద నూపురము
మసి బొట్టు బెత్తాము మఱి కక్షపాల
పసిఁడి యొడ్డాణమ్ము పైని సరిపెణలు
నాగ హస్తము సింగినాదమ్ము యోగ
వాగాలు ఘన రుద్ర బంధమ్ము వెలయ
రసవాద ఘుటికలు రసికౌషధములు
రసికుడై ధరియించి'[3] – ఇట్టి వేషముతో రాజ వీధులందుఁ దిరుగాడు సిద్ధులను ఈ కవి జూచి యుండవచ్చును.

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 155
2. చొక్కనాథ చరిత్ర. పుట 140
3. చొక్కనాథ చరిత్ర. పుటలు 115, 116

**గాజుల సెట్టి:**

పంచమాశ్వాసములోని ముప్పది యొకటవ లీలలో తిరువేంగళకవి-

'చొక్కనాయకుడు గాజులసెట్టి యగుచుఁ
జక్కగా ముతుకవేషముతోడఁ జల్లి
పట్టు సూత్రపుఁ ద్రాళ్ళ పైడుంగరములుఁ
బెట్టు బసవనిఁ జేసి పెట్టిన ముద్ర
పట్టు వస్త్రము గూర్చి బాగుగా బిగియఁ
గట్టిన దేవుండు కంఠాన నమర
నొసలను వీభూతి నునుపుగాఁదీర్చి
యొసపరి పెండి కట్లొరపుగాఁబెట్టి
సన్నఁపు రుద్రాక్ష సరములు వైచి
వన్నె మీఱఁగను దోవతి కట్టుఁగట్టి
పై మించు గజము పప్పుళి పచ్చడంబు
వామాంగమున వల్లె వాటుగా వైచి
నెఱిమించు తలపాగ నేర్పుగా ఁ జుట్టి
కరమొప్ప వ్రేళ్ల నుంగరములు వెట్టి
బుజముపై గాజల పొదిచాలఁ బెట్టి'[1] - యని గాజుల సెట్టి వేషమును కన్నులకు గట్టినట్లు రమణీయముగా వర్ణించినాడు. నిస్సందేహముగా తిరువేంగళకవి చూచిన నాటి గాజుల సెట్టినే ఇందు వర్ణించి యుండును.

**గాజుల రకములు:-**

అదే లీలలో తిరువేంగళకవి

'పచ్చలు బూదెలు పచ్చరఁటాకు
పచ్చలు పొన్నాకు పచ్చగాజులును
నీలాలు మఱి తట్టు నీలాలు రంగు
నీలాలు పచ్చల నిగ్గు గాజులును
అవ పూవన్నె రాజావర్తనములు
గోవాళ సరములు గొమ్మనంబులును
పువ్వగ గాజులు పొన్నపూ చింత
పువ్వులు సంపంగి పూ చామపువ్వు
పొగడ గాజులు జెజ్జిపోతువన్నియలు
చిగురాకు తేనెలుఁ జీని గాజులును'[2] - అని గాజుల రకములను పేర్కొనినాడు. ఇవి ఆకాలపు స్త్రీలు ధరించిన గాజులై యుండును.

1. చొక్కనాథ చరిత్ర. పుట 161 2. చొక్కనాథ చరిత్ర. పుటలు 161, 162

**సంగీత వాద్యములు:—**

సప్తమాశ్వాసములోని నలువదియవ లీలలో చోళ దేశపు మేళము వారు

'దండెయు పొఁగ జంత్రము మందె మేళ
కిన్నెర స్వరకట్ల కిన్నెర బోయ
కిన్నెర యొకతంతుకిన్నెర రుద్ర
వీణె నారాయణ వీణ గాంధర్వ
వీణయుఁ దగమించు వెలయంగ మఱియు
స్వరమండలమ్ముఁ రావణ హస్తములును
నెఱపుగా శృతులొక్క యొరిమగాగూర్చి'[1]

పాడుచు నుండిరని తిరువేంగళ కవి వర్ణించినాడు. ఇందు పేర్కొనిన వాద్యముల నీ కవి జూచి యుండును. ఆనాటి మేళము వారు ఇట్టి వాద్యములను ప్రయోయించెడి వారేమో!.

సమాజము విరాట్స్వరూపము. సాహిత్యము దాని ప్రతి రూపము, ఆ ప్రతి రూప రేఖా మాత్ర ప్రదర్శనమే ఈ వ్యాసము.

---

1. చొక్కనాథ చరిత్ర. పుట 207

## అనుబంధము I మొదటి శాసనము

**Annual Report on South Indian Epigraphy for the year 1935—36 (Page No. 26)**
**B-List of Stone Inscriptions copied during the year 1935—36.**

| No. | Place of Inscription | Dynasty | King | Date | Language and alphabet | Remarks |
|---|---|---|---|---|---|---|
| 179 | Ramnad District<br>Tirupattur Taluk<br>Tirupattur<br>West wall of the Nataraja Shrine in the same (First) Prakara.<br>Tirittalisvara Temple | Vijayanagara | Achyuta Deva Maharaja | Saka 1460[1]<br>Vilambi<br>Dakshinayana,<br>ba. 12 | Tamil | Built in at the end. Registers gift of the Village Santamangalam in Sola Pandya - Valanadu as devadana to the temple of Tiruttaliyanda - Nayanar by Periya Ramappa - Nayaka, Son of Golla Basa(va)yya - Nayaka, for the Merit of the King, fixing the rates of taxes to be paid, by the tenants on the Several kinds of produce. A portion of the gift was endowed to (god) Tyagapperumal - Nayanar. |

1. శక సంవత్సరమునకు 78 సం.లు కలిపిన క్రీస్తు శక సం.రము వచ్చును.

## రెండవ శాసనము అ. ఆ – లు

## C-Stone Inscriptions copied in 1924

| No. | Place of Inscription | Dynasty | King | Date | Language and alphabet | Remarks |
|---|---|---|---|---|---|---|
| 217 | Ramnad Dist. Tirupputur Taluk Mangainathe svara temple at Piranmalai. On the North side of the steps known as Padine-ttampadi in the same temple. | Vijayanagara | Veerapratapa Achyuta Deva Maharaya Dharmaraya | Saka 14 (61) Vikari Dakshinayana Grishmari tu Karkataka ba. eka dasi Friday Rohini. | Tamil | Seriously damaged. Seems to record a gift to the temple by Ramappa Nayakkar Ayyan. Son of BasuvanaNa(ya)kkar, for the merit f the king. |
| 222 | On the South side of the same steps in the same place. | Vijayanagara | Achyutaraya Maharaya "who was pleased to take I I am, Tembulai (?) Iradayarnayan Pattanam and all other countries. | Saka (146(1) Vilambi Purattadi(1)2 | Tamil | Records the gift of the village Aruviyur alias Kulasekara Pattanam in Kerala Singa Velanadu, excluding other previous grants init, to the temple of Nallamangaipagar for the merit of the king by his agent Ramappa - Nayakkar. |

## మూడవ శాసనము

### Tirupathi Devasthanam Inscriptions Vol IV
### List of Donars and their Periods.

| No. | Class | Sl.No. Inscriptions | Donors Name | Date |
|---|---|---|---|---|
| 6 | Generals | 152 | Periya Timmappa and Chinna Ramappa | 31-12-1540 A.D. |

### Summery of Inscriptions

| Page No. | Serial and proper No.s of Inscriptions | Saka era and English date | Donars name and Historical reference. | Gift donations etc. |
|---|---|---|---|---|
| 277 | No. 152 (No. 562 — T.T.) | 1462 శక. సం. రము 31-12-1540 A.D. | Periya Timmappan and Chinna Ramappan, the sons of Basava Nayakkar who was the son of Koluva Tippu Nayakkar of Vaimaligotra. | 15,000 nar-panam were paid by these two brothers jointly for the sake of 300 appa-padi offerings to Sri Malai Kuniyaninra - Perumal and other deities on the prescribe days while seated in the mantapam constructed by them in the Naras-anayakkar Street at Tirumalai as their Ubhaiyam. |

## నాలుగవ శాసనము

### B-Stone Inscriptions copied in 1916

| No. | Place of Inscription | Dynasty | King | Date | Language and alphabet | Remarks |
|---|---|---|---|---|---|---|
| 373 | Tinnevelly Dist. Amba Samudram Tq. On the east wall of the mandapa in front of the centrel shrine in the Kailasanatha temple at Brahma desham. | Vijayanagara | Vira Pratapa Sada siva deva Maharaya. | Saka 1472 Sadharana, Kanni, 6tedi, ba. di, Navami, Friday., Punarta (i.e., Punarpusa) Variyana-Yoga, Gaja karna. | Tamil | Gift of a Village with all its income to the temple of Kaila sa Mudaiya-Nayinar in Rajaraja Chaturvedi Mangalam a brahmadeya in Mulli-nadu, by Ramappa Nayaka for the merit of Maha manda le swara Vittha lesvara - Maharaja in the Same manner as it had been granted in Kollam 723 Avani, 13,tedi by Siraivay Mutta- Tiruvadi. |

# అనుబంధము రెండు లీలల పటిక

| చొక్కనాథ చరిత్ర లోని లీలల సంఖ్య | హాలాస్య మాహాత్మ్యము సందలి లీలల సంఖ్య | హాలాస్య మాహాత్మ్యము లోని అధ్యాయ సంఖ్య | వివరములు |
|---|---|---|---|
| 1 | 1 | 1,2,3,4,5 | ఇందు 1,2,3 అధ్యాయవములలో 'అవతారిక' 4,5 అధ్యాయములలో 'లీల' వర్ణింపబడినది. |
| 2 | 2 | 6 | |
| 3 | - | - | చొక్కనాధ చరిత్రములోని మూడవ లీల మూలములో లేదు |
| 4 | 3 | 7 | |
| 5 | 4 | 8 | |
| 6 | 5 | 9 | |
| 7 | 6 | 10 | |
| 8 | 7 | 11 | హా.మా. సందలి 7 8 లీలలు (వరుసగా) 11,12, అధ్యాయములు) చొక్కనాధ చరిత్రలో 8వ లీలగా ననువదించి యున్నది. |
| | 8 | 12 | |
| 9 | 9 | 13 | |
| 10 | 10 | 14 | |
| 11 | 11 | 15 | |
| 12 | 12 | 16 | |
| 13 | 13 | 17 | |
| 14 | 14 | 18 | |
| - | - | 19 | 'సోమవారవ్రత విధి' యను నీ 19వ అధ్యాయము హా మా న లీలగా గుర్తింపబడలేదు. చొక్కనాధ చరిత్రలో అనువదింపబడలేదు |
| | - | 20 | 'సోమవార వ్రతోద్యాపనం' అను నీ 20వ అధ్యాయము హా.మా.న లీలగా గుర్తింపబడలేదు చొక్కనాధ చరిత్రలో అనువదింపబడలేదు. |
| 15 | 15 | 21 | |
| 16 | 16 | 22 | |
| 17 | 17 | 23 | |
| 18 | 18 | 24 | హా.మా.సందలి 18,19 లీలలు (వరుసగా 24,25 అధ్యాయములు) చొక్కనాధ చరిత్రలో 18వ లీలగా ననువదితము |
| | 19 | 25 | |
| 19 | 20 | 26 | |
| 20 | 21 | 27 | |
| 21 | 22 | 28 | |
| 22 | 23 | 29 | |
| 23 | 24 | 30 | |
| 24 | 25 | 31 | |
| 25 | 26 | 32 | |
| 26 | 27 | 33 | |
| 27 | 28 | 34 | |

| చొక్కనాథ చరిత్ర లోని లీలల సంఖ్య | హాలాస్య మాహాత్మ్యము నందలి లీలల సంఖ్య | హాలాస్య మాహాత్మ్యము లోని అధ్యాయ సంఖ్య | వివరములు |
|---|---|---|---|
| 28 | 29 | 35 | |
| 29 | 30 | 36 | |
| 30 | 31 | 37 | |
| 31 | 32 | 38 | |
| 32 | 33 | 39 | |
| 33 | 34 | 40 | |
| 34 | 35 | 41 | |
| 35 | 36 | 42 | |
| 36 | 37 | 43 | |
| 37 | 38 | 44 | |
| 38 | 39 | 45 | |
| 39 | 40 | 46 | |
| 40 | 41 | 47 | |
| 41 | 42 | 48 | |
| 42 | 43 | 49 | |
| 43 | 44 | 50 | |
| 44 | 57 | 63 | హాలాస్య మాహాత్మ్యము నందలి 57 వ లీల (63 వ అధ్యాయము) చొక్కనాథ చరిత్రమున 44వ లీలగా ననువదితము |
| 45 | 45 | 51 | హాలాస్య మాహాత్మ్యమునందలి45,46 లీలలు వరుసగా 51,52 అధ్యాయములు) చొక్కనాథ చరిత్రమున 45 వ లీలగా ననువదితము |
| | 46 | 52 | |
| 46 | 47 | 53 | |
| 47 | 48 | 54 | |
| 48 | 49 | 55 | |
| 49 | 50 | 56 | |
| 50 | 51 | 57 | |
| 51 | 52 | 58 | |
| 52 | 53 | 59 | |
| 53 | 54 | 60 | |
| 54 | 55 | 61 | |
| 55 | 56 | 62 | |
| 56 | 58 | 64 | |
| 57 | 59 | 65 | |
| 58 | 60 | 66 | |
| 59 | 61 | 67 | |
| 60 | 62 | 68 | |
| 61 | 63 | 69 | |
| 62 | - | - | చొక్కనాథ చరిత్రలోని 62,63 వ |
| 63 | - | - | లీలలు హాలాస్య మహత్మ్యమున లేవు |
| 64 | 64 | 70 | |

## అనుబంధము. మూడు.

హాలాస్యమాహాత్మ్యము నందలి శ్లోకముల పట్టిక.

| అధ్యాయ సంఖ్య | శ్లోక సంఖ్య | అధ్యాయ సంఖ్య | శ్లోక సంఖ్య | అధ్యాయ సంఖ్య | శ్లోక సంఖ్య |
|---|---|---|---|---|---|
| 1 | 179 | 31 | 91 | 61 | 31 |
| 2 | 145 | 32 | 33 | 62 | 109 |
| 3 | 121 | 33 | 47 | 63 | 61 |
| 4 | 106 | 34 | 42 | 64 | 126 |
| 5 | 121 | 35 | 58 | 65 | 174 |
| 6 | 77 | 36 | 88 | 66 | 71 |
| 7 | 83 | 37 | 42 | 67 | 257 |
| 8 | 121 | 38 | 47 | 68 | 199 |
| 9 | 125 | 39 | 38 | 69 | 232 |
| 10 | 101 | 40 | 42 | 70 | 130 |
| 11 | 60 | 41 | 48 | 71 | 156 |
| 12 | 77 | 42 | 50 | ప్రార్థనా | |
| 13 | 58 | 43 | 55 | శ్లోకములు | 009 |
| 14 | 51 | 44 | 43 | మంగళ | |
| 15 | 55 | 45 | 55 | శ్లోకములు | 008 |
| 16 | 79 | 46 | 87 | మొత్తం | |
| 17 | 54 | 47 | 38 | శ్లోకములు | 6,025 |
| 18 | 77 | 48 | 46 | | |
| 19 | 105 | 49 | 39 | | |
| 20 | 114 | 50 | 59 | | |
| 21 | 66 | 51 | 85 | | |
| 22 | 95 | 52 | 40 | | |
| 23 | 202 | 53 | 41 | | |
| 24 | 56 | 54 | 53 | | |
| 25 | 70 | 55 | 65 | | |
| 26 | 56 | 56 | 51 | | |
| 27 | 76 | 57 | 122 | | |
| 28 | 82 | 58 | 77 | | |
| 29 | 79 | 59 | 46 | | |
| 30 | 64 | 60 | 79 | | |

## చొక్కనాథ చరిత్రము నందలి ద్విపదల పట్టిక

| ఆశ్వాసము | లీల సంఖ్య | చరణ సంఖ్య | ద్విపద సంఖ్య | అదనపు చరణముల సంఖ్య |
|---|---|---|---|---|
| ప్రథమ | అవతారిక | 148 | 74 | - |
| ,, | కథానుక్రమణిక | 231 | 115 | 1 |
| ,, | చతుష్షష్టిలీలలు | 148 | 74 | - |
| ,, | 1 | 418 | 209 | - |
| ,, | 2 | 165 | 82 | 1 |
| ద్వితీయ | 3 | 42 | 21 | - |
| ,, | 4 | 288 | 144 | - |
| ,, | 5 | 199 | 99 | 1 |
| ,, | 6 | 412 | 206 | - |
| ,, | 7 | 81 | 40 | 1 |
| ,, | 8 | 126 | 63 | - |
| తృతీయ | 9 | 60 | 30 | - |
| ,, | 10 | 65 | 32 | 1 |
| ,, | 11 | 146 | 73 | - |
| ,, | 12 | 160 | 80 | - |
| ,, | 13 | 98 | 49 | - |
| ,, | 14 | 233 | 116 | 1 |
| ,, | 15 | 265 | 132 | 1 |
| ,, | 16 | 126 | 63 | - |
| చతుర్థ | 17 | 186 | 93 | - |
| ,, | 18 | 129 | 64 | 1 |
| ,, | 19 | 65 | 32 | 1 |
| ,, | 20 | 52 | 26 | - |

| ఆశ్వాసము | లీల సంఖ్య | చరణ సంఖ్య | ద్విపద సంఖ్య | అదనపు చరణముల సంఖ్య |
|---|---|---|---|---|
| ,, | 21 | 113 | 56 | 1 |
| ,, | 22 | 144 | 72 | - |
| ,, | 23 | 114 | 57 | - |
| ,, | 24 | 190 | 95 | - |
| పంచమ | 25 | 130 | 65 | - |
| ,, | 26 | 98 | 49 | - |
| ,, | 27 | 98 | 49 | - |
| ,, | 28 | 105 | 52 | 1 |
| ,, | 29 | 161 | 80 | 1 |
| ,, | 30 | 110 | 55 | - |
| ,, | 31 | 262 | 131 | - |
| ,, | 32 | 135 | 67 | 1 |
| షష్ఠ | 33 | 133 | 66 | 1 |
| ,, | 34 | 184 | 92 | - |
| ,, | 35 | 92 | 46 | - |
| ,, | 36 | 171 | 85 | 1 |
| ,, | 37 | 138 | 69 | - |
| ,, | 38 | 100 | 50 | - |
| ,, | 39 | 312 | 156 | - |
| సప్తమ | 40 | 236 | 118 | - |
| ,, | 41 | 158 | 79 | - |
| ,, | 42 | 108 | 54 | - |
| ,, | 43 | 308 | 154 | - |
| ,, | 44 | 283 | 141 | 1 |
| ,, | 45 | 174 | 87 | - |

| ఆశ్వాసము | లీల సంఖ్య | చరణ సంఖ్య | ద్విపద సంఖ్య | అదనపు చరణముల సంఖ్య |
|---|---|---|---|---|
| ,, | 46 | 85 | 42 | 1 |
| ,, | 47 | 166 | 83 | - |
| ,, | 48 | 93 | 46 | 1 |
| అష్టమ | 49 | 159 | 79 | 1 |
| ,, | 50 | 100 | 50 | - |
| ,, | 51 | 103 | 51 | 1 |
| ,, | 52 | 125 | 62 | 1 |
| ,, | 53 | 89 | 44 | 1 |
| ,, | 54 | 132 | 66 | - |
| ,, | 55 | 143 | 71 | 1 |
| ,, | 56 | 348 | 174 | - |
| నవమ | 57 | 304 | 152 | - |
| ,, | 58 | 157 | 78 | 1 |
| ,, | 59 | 432 | 216 | - |
| ,, | 59 | 432 | 216 | - |
| ,, | 60 | 380 | 190 | - |
| ,, | 61 | 344 | 172 | - |
| ,, | 62 | 146 | 73 | - |
| , | 63 | 116 | 58 | - |
| ,, | 64 | 581 | 290 | 1 |
| | | | 5939 | 25 |

# అనుబంధము నాలుగు పాండ్యరాజుల వంశావళి

హాలాస్యమాహాత్మ్యమునందు ఆయా లీలలలో పేర్కొనబడిన పాండ్య రాజులను ఈ క్రింది పట్టికలో చూపుచున్నాను.

| లీల(ల) సంఖ్య | పాండ్యరాజు(ల) పేరు(లు) |
|---|---|
| 2 | కులశేఖర పాండ్యుడు |
| 3 | మలయధ్వజ పాండ్యుడు |
| 4-12 | తటాతక భర్త సుందరపాండ్యుడు |
| 13,14,15 | ఉగ్రపాండ్యుడు |
| 16 | వీర పాండ్యుడు |
| 17,18 | దేవపాండ్యుడు |
| 19,20,21 | అభిషేక పాండ్యుడు |
| 22 | విక్రమపాండ్యుడు |
| 23,24 | రాజశేఖర పాండ్యుడు |
| 25,26 | కులోత్తుంగపాండ్యుడు |
| 27,28 | అనంతగుణపాండ్యుడు |
| 29-33 | కులభూషణుడు లేదా కులశేఖర పాండ్యుడు |
| 34,35 | రాజేంద్రపాండ్యుడు |
| 36,37,38 | సుందరేశపాదశేఖరుడు |
| 39-42 | వరగుణపాండ్యుడు |
| 43-45 | రాజరాజపాండ్యుడు |
| 46 | సుగుణపాండ్యుడు |
| 49-51 | వంశశేఖరపాండ్యుడు |
| 52-55 | చంపకపాండ్యుడు |
| 56-59 | పాండ్యకులేశుడు |
| 60-64 | కుబ్జపాండ్యుడు |

మొదటి లీలలో ఇంద్రుడు, 47,48 లీలలలో వరుసగా భరద్వాజ పక్షి, కొంగకథలున్నవి. వీనిలో పాండ్యరాజుల పేర్లు లేవు.

# ఉపయుక్త గ్రంథములు, పత్రికలు, నిఘంటువులు


1. ఆంధ్ర కవి తరంగిణి- తొమ్మిదవ సంపుటము - చాగంటి శేషయ్య, 1961
   హిందూ ధర్మ శాస్త్ర గ్రంథ నిలయము, కపిలేశ్వరపురం, తూ.గో. జిల్లా.
2. ఆంధ్ర ద్విపద సాహిత్య చరిత్ర (పదునెనిమిదవ శతాబ్ది వఱకు గల కావ్యముల సమీక్ష) - డా. టి. సుశీల
   ఢిల్లీ విశ్వవిద్యాలయము వారిచే పిహెచ్.డి. ఒసంగబడిన సిద్ధాంత వ్యాసము, ప్రథమ ముద్రణ ఆగష్టు 1979.
3. ఆంధ్ర భాషా వికాసము; ప్రొఫెసర్ గంటి జోగిసోమయాజి.
   త్రివేణి పబ్లిషర్స్, ద్వితీయ ముద్రణము 1968
4. ఆంధ్రసాహిత్య చరిత్ర- డా. పింగళి లక్ష్మీకాంతం.
5. ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి. ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం. బాలేందు శేఖరం
   ప్రకాశకులు: బాలసరస్వతి బుక్ డిపో, కర్నూలు 1965
6. ఈశావాస్యోపనిషత్తు, దయానంద సరస్వతి వ్యాఖ్యానము
   తెనుగుసేత - పండిత గోపదేవ్, ఆర్య సమాజము: కూచిపూడి వారి ప్రచురణ.
7. కవిజనాశ్రయము- వేములవాడ భీమకవి
   ఆంధ్రసాహిత్య పరిషత్ప్రకాశితము-3
   శ్రీపతి ముద్రణాలయము, కాకినాడ 1959
8. కళ్యాణ విజయం,- డా. ముదిగొండ శివప్రసాద్
   ప్రకాశకులు: హైదరాబాదు నగర వీరశైవ సమాజము
   ప్రథమ ముద్రణ 1979
9. కావ్యాదర్శః - దండి. వ్యాఖ్యాత పుల్లెల శ్రీరామచంద్రుడు
   ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ ప్రచురణ.
10. కావ్యాలంకార సంగ్రహము- రామరాజభూషణుడు.
    వివరణ కర్త: శిరోమణి సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి
11. కావ్యాలంకార చూఢామణి- విన్నకోట పెద్దన మహాకవి కృతము.
    వేదము వేంకట రాయశాస్త్రి చేత ముద్రితము (ద్వితీయ ముద్రణము)
    జ్యోతిష్మతీ ముద్రాక్షరశాల, చెన్నపురి 1909.
12. కాశీఖండము- శ్రీనాధుడు.
    వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచే ప్రకటితము.

13. చొక్కనాథ చరిత్ర- పచ్చకప్పురపు తిరువేంగళ రాజప్రణీతము
సంపాదకీయము: టి. చంద్రశేఖరన్, యమ్.ఎ.యల్.టి. క్యూరేటర్, ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయము, మదరాసు మరియు గ్రంథాలయ సిబ్బంది.
ముద్రణ: ప్రభుత్వ ముద్రాణాలయము, మదరాసు 1954.
14. ఛందోదర్పణము- అనంతామాత్యుడు.
తత్త్వదర్శినీవ్యాఖ్య: శ్రీభాష్యం వేంకట నరసింహభాష్యకారాచార్యులు.
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాదరమున ప్రకాశితము.
శ్రీపతి ప్రెస్, కాకినాడ 1968.
15. తెలుగుజానపద గేయ సాహిత్యము - డా. బి. రామరాజు
జానపద విజ్ఞాన ప్రచురణలు, హైదరాబాదు - 1978.
16. తెలుగు జానపద గేయ గాథలు- డా. నాయని కృష్ణకుమారి
17. బసవ పురాణము- పాల్కురికి సోమనాథకవి.
ప్రకాశకులు: ఆంధ్ర గ్రంథమాల 1952 (ద్వితీయ ముద్రణము)
18. బసవ పురాణము- పాల్కురికి సోమన
సంపాదకత్వము: డా. బండారుతమ్మయ్య
వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ 1952
19. భగవద్గీత
20. యజుర్వేదము- దయానంద సరస్వతి కృత భాష్యము
తెనుగుసేత- అన్నేకేశవార్య శాస్త్రి
21. లక్షణ శిరోమణి- పొత్తపి వేంకట రమణ కవి ప్రణీతము.
సంపాదకుడు: విద్వాన్, రావూరి దొరసామి శర్మ ఎం.ఏ.బి.ఓ.యల్. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ వారి ప్రచురణ.
22. విజ్ఞాన సర్వస్వము రెండవ సంపుటము: తెలుగు సంస్కృతి -2
విజ్ఞాన సర్వస్వ కేంద్రం, తెలుగు విశ్వ విద్యాలయం 1988
23. విజ్ఞాన సర్వస్వము మూడవ సంపుటము
తెలుగు సంస్కృతి - ఒకటవ భాగము
తెలుగు భాషా సమితి - హైదరాబాదు
24. విజ్ఞాన సర్వస్వము - ఏడవ సంపుటము
దర్శనములు - మతములు
సంపాదకుడు: ప్రొఫెసర్ డా. కొత్త సచ్చిదానందమూర్తి, ఆంధ్ర విశ్వకళాపరిషత్తు
తెలుగు భాషా సమితి; హైదరాబాదు 1962.

25. వివేక చింతామణి; పరమానంద తీర్థ విరచితము.
పరిష్కర్త; వితలదేవుని సుందరశర్మ
తంజావూరు సరస్వతీ మహల్ ప్రచురణము 1962
26. శ్రీనాథుడు- డా. కొర్లపాటి శ్రీరామమూర్తి
27. శ్రీ వీరశైవ సిద్ధాంత శిరోమణి- డా. కె. యమ్. రుద్రప్ప
'పంచాక్షరీ' ప్రింటింగ్ వర్క్స్, హైదరాబాదు - 1938
28. సంస్కృత వాఙ్మయ చరిత్ర:- ప్రథమ సంపుటము, వైదిక వాఙ్మయము, మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు.
ఆంధ్ర సాంస్వత పరిషత్తు, తిలక్‌రోడ్డు, హైదరాబాదు - 1982
29. సత్యార్థ ప్రకాశము- మహర్షి దయానంద సరస్వతిగారు
తెలుగు అనువాదం: అదిపూడి సోమనాథరావు మొదలైనవారు.
అర్య ప్రతినిధి సభ, అంధ్రప్రదేశ్, హైదరాబాదు -1 1981
30. సమగ్రాంధ్ర సాహిత్యం- తొమ్మిదవ సంపుటం. అరవీటి యుగం.
ఆరుద్ర యమ్. శేషాచలం అండ్ కంపెనీ
31. సమూల శ్రీమదాంధ్ర ఋగ్వేద సంహిత
ప్రథమ, ద్వితీయ, తృతీయ సంపుటములు 1981, 1982 సం.లు
ఆంధ్రానువాదకర్త: కావ్య తీర్థ శ్రీనేమాని వేంకట నరసింహశాస్త్రి
సంపాదకుడు: డా. వడ్లమూడి గోపాలకృష్ణయ్య
ప్రచురణ: తిరుమల తిరుపతి దేవస్థానములు.
32. సాహిత్య దర్శనము: ఆచార్య కాకర్ల వేంకట రామనరసింహం.
క్వాలిటీ పబ్లిషర్స్, విజయవాడ.
33. సుకవి మనోరంజనము: కూచిమంచి వేంకట రాయప్రణీతము.
పరిష్కరణ: కోవెల సంపత్కుమారాచార్య.
ప్రచురణ: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ, హైదరాబాదు -4
తొలి కూర్పు - 1976.
34. హాలాస్యమాహాత్మ్యం: తి. స్వామినాథ శాస్త్రిణా
శాస్త్ర సంజీవిన్యాఖ్యయా స్వకీయ ముద్రాక్షర శాలాయాం, ముద్రాపితం.
చెన్నపురి- 1909.


**పత్రికలు**

1. తెలుగులో పరిశోధన, రజతోత్సవ సంచిక
   అం.ప్ర. సా. అకాడెమీ, కళాభవన్, సైఫాబాదు, హైదరాబాదు -4.
   ప్రథమ ముద్రణ: ఆగష్టు 1983.
2. భారతి, జూలై 1949
3. భారతి సాహిత్య మాసపత్రిక, మార్చి 1955.
   సంపాదకుడు: శివలెంక శంభుప్రసాద్.

**నిఘంటువులు:**

1. బ్రౌణ్య ఇంగ్లీషు-తెలుగు నిఘంటువు, రెండవ ముద్రణ - 1983
   ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ వారి ప్రచురణలు
2. సూర్యరాయాంధ్ర నిఘంటువు, నాలుగవ, ఆరవ సంపుటములు
   ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ వారి ప్రచురణలు.


49630



రచయిత: డా. వడ్లూరి ఆంజనేయరాజు
(వి. ఆంజనేయులు)

జననం: 16 జూన్ 1956
కోనేరు పల్లి తా।। జి. కరీంనగర్

తల్లిదండ్రులు: సత్యలాదేవి; వేంకటరాజు

విద్యాభ్యాసం:- బొమ్మకల్లులో ప్రాథమిక విద్య; జిల్లా పరిషదున్నత పాఠశాల దురిశేడులో ఉన్నత విద్య (1972); ప్రభుత్వ జూనియర్ కళాశాల కరీంనగర్‌లో ఇంటర్మీడియట్(1974); ప్రభుత్వ యస్.ఆర్.ఆర్. డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో బి.ఎ. (1977); ఉస్మానియా విశ్వ విద్యాలయం ఆర్ట్సు కాలేజి, హైదరాబాదులో యం.ఎ. తెలుగు (1980) పిహెచ్.డి. 1989

ఉద్యోగ జీవితం: ఆర్ట్ & సైన్స్ కళాశాల సికిందరాబాదులో పార్ట్ టైం లెక్చరర్, (1980-81)

అభ్యుదయ ప్రాచ్య కళాశాల (సాయం) జియాగూడ, హైదరాబాదులో లెక్చరర్ (1981-82)

భవాన్స్ న్యూ సైన్స్ కాలేజి (సాయం) నారాయణగూడ, హైదరాబాదులో పార్ట్‌టైం లెక్చరర్ (1982-85)

సెంట్ మేరీస్ సెంటెనరీ జూనియర్ కాలేజి సికిందరాబాదులో లెక్చరర్ 1982 నుండి

రచనలు:
(1) శ్రీ ఆంజనేయశతకం, జూన్ 1990
(2) మధుమురళి, అక్టోబర్ -నవంబర్ 1990
(3) శ్రీసత్యసాయి శతకం, ఆగష్టు ,1992
(4) చొక్కనాథ చరిత్ర - సమగ్ర పరిశీలన (సిద్ధాంత గ్రంథం) 1992-93.

పత్రికా వ్యాసములు, రేడియో ప్రసంగాలు, పద్యాలు, పాటలు, ఉపన్యాసాలు మొ।।నవి.

అభిరుచి: సాహిత్యం, సంగీతం

అభిమానం: సంస్కృతి, చరిత్ర